# ఓంకార సద్బోధామృతము

## పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు



"శాంతి" పత్రిక

షష్ట్యబ్ది పూర్తి ప్రచురణ

శ్రీ శాంతి ఆశ్రమము - ది మిషన్ ఆఫ్ పీస్
శాంతి ఆశ్రమము పోస్టు
తోటపల్లి కొండలు, వయా - శంఖవరము
తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

ప్రథమ ముద్రణ :
జనవరి 1985

ద్వితీయ ముద్రణ : జనవరి 2007
ప్రతులు : 1000
మూల్యము : రూ. 70/-

ప్రచురణ :
**శ్రీ శాంతి ఆశ్రమము**
శాంతి ఆశ్రమము పోష్టు,
వయా శంఖవరము, తూర్పుగోదావరి జిల్లా, తోటపల్లి కొండలు
పిన్ కోడ్ 533 446. ఆంధ్ర ప్రదేశ్.

**ముద్రణ & డి.టి.పి. :**
ఇమేజ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, 3-5-626, వీధి నెం 8, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ -29. ఫోన్: 23223645.



పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు
(20 సం॥ వయస్సులో - తోటపల్లి కొండలు)

# మా కృతజ్ఞత

పూజ్యశ్రీ స్వామీజీ దివ్యసంకల్పముతో ప్రారంభించిన "శాంతి" మాస పత్రిక 60 సంవత్సరములు పూర్తి చేసుకొని 61వ సంవత్సరములో ప్రవేశించినది. ఈ 60 సం॥లు అవిరళముగా భక్తులకు, శాంతి ప్రియులకు, శాంతి సందేశములను అందించుచూ ఎంతోమందికి మనశ్శాంతిని కల్గించి, ఈనాడు షష్ట్యబ్ది సంచికగా వెలువడుట ఆనందము. ఈ శుభసమయములో స్వామీజీకి ప్రప్రథమముగా మా భక్తి పూర్వకమైన కృతజ్ఞతను తెలుపుకొనుచున్నాము.

ఈ శుభసమయమున జ్ఞాపకార్థముగా శ్రీస్వామీజీ స్వానుభవములతో వ్రాసిన వారి 60 సందేశములు పుస్తక రూపమున – "ఓంకార సద్బోధామృతము"ను ప్రచురించితిమి.

శ్రీ స్వామీజీ ఆశయములను, భావనలను పూర్తిగా అర్థము చేసుకొన్న ఆశ్రమ శ్రేయోభిలాషులు డా॥ కె. సచ్చిదానందమూర్తిగారు కోరిన వెంటనే వారి ఆశీస్సులతో పరిచయ వాక్యములు వ్రాసిరి. వారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అహర్నిశములు, ఆశ్రమాభివృద్ధిని కోరుచూ అన్నివిధముల తోడ్పడుచున్న ఆశ్రమ భక్తులు అభిమానులైన మా సోదరులు శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావు (రాజమండ్రి) వార్కి వ్యవధి తక్కువగా ఉన్నను కోరినంత మాత్రముననే మా కోరికను మన్నించి, ఈ 'ఓంకార సద్బోధామృతము'ను అచ్చు వేయించి సకాలములో అందించినందులకు మా ప్రేమ పూర్వకమైన కృతజ్ఞతను అర్పించుకొనుచుంటిమి.

దైవము అందరిని ఆయురారోగ్యములతో, నిత్య శాంతితో బ్రోచుగాక!

ఓం, ఓం, ఓం

మాతా జ్ఞానేశ్వరి

# లోక శాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మా లోపల ప్రత్యణువునందును ఇమిడియుండి, మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ! నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయ మూర్తీ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వమునందంతటను, అందఱును నీ దివ్య తేజస్సును గ్రహింతురుఁగాక! ఓ సచ్చిదానంద స్వరూపా! ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థమునను శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపఁజేయుము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

(ఈ ప్రార్థన సదాస్మరించుచు తరించుడు.)

# ప్రణవాంజలి

జన్మించిన ప్రతిజీవి శాంతిగా ఆనందంతో జీవనయాత్ర సాగించాలని కోరుకుంటాడు. ఈ రెండు ఎక్కడ లభిస్తాయి? మనలోనే ఉన్నాయి. పొగచేత అగ్ని – దుమ్ముచేత అద్దము ఆవరింపబడినట్లు అజ్ఞాన కారణముచే జ్ఞానము కప్పబడి, శాంతిని, ఆనందాన్ని పొందనీయక, జీవుని విచార సముద్రములో ముంచుతుంటుంది. అజ్ఞానము నశించాలి అంటే మహాత్ముల ఉపదేశాలను తు.చ. తప్పకుండా అనుసరించాలి. అజ్ఞానాన్ని నశింపజేయడమే జ్ఞానాన్ని పొందగలగడము. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార గురుదేవులు అతిబాల్యావస్థ నుండియే కఠోరమైన సాధనలు చేసి, వారు అనుభవించిన ఆధ్యాత్మిక అనుభూతులను, అనుభవాలను సర్వమానవ సౌభ్రాతృత్వభావనను సాధకులకు, ముముక్షువులకు "శ్రీ ఓంకార సద్బోధామృతం" అనే గ్రంథము ద్వారా అందించారు.

సాధకుడు తన ఆధ్యాత్మిక పురోగమనానికి, ఆధ్యాత్మిక ఉన్నత స్థితికి ప్రారంభంలో పాటించవలసిన నియమావళిని ఇందులో సూచించారు. అనేకత్వంలో ఏకత్వాన్ని – "ఈశావాశ్య మిదం సర్వం" అనే భావాన్ని శబ్దములో, నిశ్శబ్దములో, దృక్కులో, చల్లని మారుతములో, ఉచ్ఛ్వాస – నిఃశ్వాసలలో పక్షుల మధుర ధ్వనులలో, భయంకర క్రూర మృగాల ధ్వనులలో, మేఘ గర్జనలో, నక్షత్రాల తేజస్సులో, సముద్ర తరంగాల ఘోషలో, చరాచర సృష్టియంతటిలో పరమాత్మను దర్శిస్తూ – వాడే వీడు – అదియే నీవు అను "తత్త్వమసి" మహావాక్య స్థితికి ఎలా చేరాలో ప్రబోధించారు. మౌనముద్వారా అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించే మార్గాన్ని, సకలశాస్త్ర సారాంశాన్ని సాధకులకు, ముముక్షువులకు సరళమైన భాషలో "శ్రీ ఓంకార సద్బోధామృత"మను గ్రంథము ద్వారా అందించారు. "పునాదిలేకపోతే భవనము పతనమవుతుంది. అదేవిధముగా సాధనలో కొన్ని నియమములు అనుసరింపకపోతే సాధకుడు పతితుడవుతాడు" అను ఉద్దేశముతో ప్రారంభములోనే మోక్షసాధనములు అనే నిబంధనలను ఏర్పరిచారు. తీవ్రసాధకులైనవారు ఈ ఉపదేశాన్ని పూలబాటగా మలచుకొని ఆధ్యాత్మిక రాజమార్గంలో ప్రయాణించుటకు శ్రీ ఓంకార సద్బోధామృత

సారాంశాన్ని ఊతకర్రగా తీసికొని జీవిత పరమగమ్యాన్ని చేరెదరుగాక!

"శ్రీ ఓంకార సద్బోధామృతము" ద్వితీయ ముద్రణప్రతిని పరిష్కరించి అందించుటలో సహకరించిన బ్రహ్మశ్రీ జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ గారికిని, గ్రంథముద్రణలో పూర్తి సహకారమందించిన శ్రీ జె.ఎ. శాస్త్రి గారికిని, ఈ గ్రంథ ముద్రణకు సంపూర్ణ ప్రేమాభిమానాలతో ఆర్థిక సహకారమందించిన మాన్యశ్రీ ఆర్. నరసింహరాజు గారికిని, ఈ గ్రంథమును ముద్రించిన ఇమేజ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికిని శ్రీ శాంతి ఆశ్రమము పక్షాన హృదయపూర్వక ప్రణవాంజలులను సమర్పించుచున్నాము. విశ్వశాంతి స్థాపనకై పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామీజీవారు అందించిన ఈ సద్బోధామృతాన్ని జిజ్ఞాసుల హృదయాలకు అందించినవారందరిపై ఆయురారోగ్యములను, చతుర్విధ పురుషార్థాలను, శాంతి – సౌభాగ్యాలను పూజ్య గురుదేవులు వర్షించెదరుగాక! అని ప్రార్థించుచున్నాము.

సాధకులు సర్వదా ఇక్షురసమనే ఈ ఓంకార సద్బోధామృతాన్ని గ్రోలి పరమానందమనే శాంతిసాగరములో నిమగ్నులై, పరమహంసల వలె విహరింతురు గాక!

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకార గురుదేవులయొక్కయు, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారియొక్కయు కరుణావీక్షణములచే విజ్ఞానమను నౌక సాధకులకు లభించునుగాక!

సద్గురు కృపాసిద్ధి రస్తు.

శ్రీశాంత్యాశ్రమము
శ్రీశాంత్యాశ్రమము పోస్టు
తోటపల్లి కొండలు, వయా శంఖవరము,
తూర్పుగోదావరి జిల్లా, పిన్. 533 446.
ఫోను. 08868 244266.

ఇట్లు
సద్గురు సేవలో
వినమ్రానంద
7-5-2007

# పరిచయం

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు బాగా నడుస్తున్న ఆశ్రమాలన్నిటిలోకి చాలా ప్రాచీనమైంది. తూర్పు గోదావరి జిల్లాలోని తోటపల్లికొండల మధ్యనున్న శ్రీ శాంతి ఆశ్రమం. అంతర్జాతీయ కీర్తి కలిగి ఉండటంలోను, విస్తీర్ణంలోను కూడా ఇదే అన్నిటికంటే పెద్దది. దీన్ని స్థాపించిన శ్రీ స్వామీ ఓంకార్ వారు కొంతకాలం ఇంగ్లీష్ చదువు కొంచెంగా సాగించినాక, విరక్తులై పరివ్రజించి స్వయంకృషితో ఆధ్యాత్మిక పథంలో ప్రయాణంచేసి సఫలులై, మనదేశంలోను, పాశ్చాత్య దేశాలలోను విస్తారంగా పర్యటించి ఎందరికో జ్ఞానబోధ చేశారు.

వీరు ఇంగ్లీషులో తెలుగులో ఎన్నో ప్రసంగాలు చేశారు; బహు సంఖ్యాకంగా వ్యాసాలు, చిన్న చిన్న పుస్తకాలు, కొంచెం పెద్ద సైజు పుస్తకాలు వ్రాశారు. అన్నీ సరళశైలిలో, సామాన్యులకు కూడా సుబోధకంగా ఉంటాయ్; అన్నీ తాను నమ్మిన, తెలుసుకున్న, అనుభూతిలోకి తెచ్చుకున్న భావాలపై ఆధారపడినవే. వీటిలో ఏదీ పాండిత్యాన్ని ప్రదర్శించటానికో, ఒక ప్రత్యేక సంప్రదాయాన్ని ప్రచారం చేయటానికో, ఒక గురువు చెప్పించే పరిపూర్ణ సత్యం అని చాటటానికో చెప్పబడలేదు, రాయబడలేదు. అది వీటి గొప్పతనం. తెలిసీతెలియని వేదాంతమో, యోగమో, తంత్రమో, రహస్యవాదమో, పూజాదుల వర్ణనో వీటిలో ఉండవు. కొన్ని మహత్ - సత్యాలు సూటిగా మామూలు భాషలో వీటిలో చెప్పబడినయ్.

ఇంతవరకు అప్రకటితాలైన శ్రీ ఓంకార స్వాములవారి 60 వ్యాసాలను శ్రీ జ్ఞానేశ్వరీజీ ఈ పుస్తకరూపంగా సంగ్రహించారు. ఇది చాలామందికి ఉపయోగకరం. ఇందుకు శ్రీ జ్ఞానేశ్వరీజీ అభినందనీయురాలు. శ్రీస్వాములవారి ఆశయాలను, బోధలను వీరికంటే బాగా తెలిసికొన్నవారు, వారిని వీరికంటే ఎక్కువగా సేవించినవారూ లేరు.

శ్రీ రాజుగారు గొప్ప కార్యశూరులు, నిస్స్వార్థ సేవను, అచంచల దీక్షను జీర్ణం చేసుకున్నవారు.

సేవాపరాయణతలో అగ్రగామి సోదరి శ్రీ శాంతి గారు.

ముఖ్యంగా ఈ ఇద్దరి సహాయంతో, ఇంకెందరో ఆశ్రమాభిమానుల, స్వామివారి భక్తుల సహకారంతో, శ్రీ జ్ఞానేశ్వరీజీ శ్రీ శాంతి ఆశ్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వీరి కార్యకలాపంలో అంతర్భాగం శ్రీ స్వామివారి ప్రసంగాల రచనల ప్రచురణ, ప్రచారం.

ఓంకార సద్బోధామృతము అనేకుల వివేకోదయానికి ఉపకారకం అవుతుందని ఆశిస్తాను.

విశాఖపట్నం:
1-1-1985.

డాక్టరు కె. సచ్చిదానందమూర్తి

ఓం

శ్రీ ఓంకార సద్బోధామృతము

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | మా కృతజ్ఞత - మాతా జ్ఞానేశ్వరి | |
| | ప్రణవాంజలి - మాతా వినమ్రానంద సరస్వతి | |
| | పరిచయం - డా॥ కె. సచ్చిదానందమూర్తి | |
| 1. | దైనిక ప్రార్థనలు | 1 |
| 2. | మోక్ష సాధనములు | 8 |
| 3. | శాంతి ప్రార్థన మాహాత్మ్యము | 12 |
| 4. | శాంతి కాములకు ఆహ్వానము | 17 |
| 5. | భగవత్సాక్షాత్కారము - ఇప్పుడే - ఇచ్చటనే | 20 |
| 6. | ప్రేమయే దైవము (మొదటి భాగము) | 30 |
| | (రెండవ భాగము) | 38 |
| 7. | అమృత సందేశము | 48 |
| 8. | ఈ దినములలో నా ధ్యానము | 51 |
| 9. | నా పూజా మందిరము | 57 |
| 10. | దురదృష్టవంతమైన తాడిచెట్టు | 62 |
| 11. | అష్టగ్రహ కూటమి | 69 |
| 12. | సాధు పుంగవుడు | 75 |
| 13. | వైకుంఠపాళి | 79 |
| | (పరమపద సోపానపటము) | |
| 14. | నా మూడు వరములు | 87 |
| 15. | నేను మార్కండేయుడను | 92 |
| | (తొలి పలుకు) | |

| | | |
|---|---|---|
| 16. | బాహ్య చదువుల వ్యామోహము | 99 |
| 17. | కర్తవ్యము | 110 |
| 18. | అత్యంత సుఖదాయకమైన తరుణం | 115 |
| 19. | శాంతి సందేశము | 118 |
| 20. | కర్మ | 122 |
| 21. | మధురవర్తనము | 128 |
| 22. | ఇద్దరు స్నేహితులు | 130 |
| 23. | కష్ట సుఖములు | 133 |
| 24. | సంకల్పములు | 141 |
| 25. | అభ్యాసము | 146 |
| 26. | మరణానంతరము | 150 |
| 27. | రాజవిద్యా రాజగుహ్యాయోగము | 156 |
| 28. | వాడే వీడు | 160 |
| 29. | పుష్కర స్నాన ఫలితము | 167 |
| 30. | కాలమే ధనము | 177 |
| 31. | పరిమళము | 186 |
| 32. | వెలుతురు నీవే | 189 |
| 33. | ఆశ్రమ స్థాపనలు | 192 |
| 34. | తప్పులేని స్నేహితుడు | 195 |
| 35. | సామాన్య మనుజుని ప్రార్థనలు | 200 |
| 36. | నత్తగుల్ల జీవితము | 207 |
| 37. | సంపద - ఆపద | 209 |
| 38. | జయము మనదే | 213 |
| 39. | కునికిపాటు | 220 |
| 40. | నిఃస్వార్థ సేవ | 227 |

| | | |
|---|---|---|
| 41. | నిజమైన ధనవంతు డెవరు? | 233 |
| 42. | "స్విచ్చి" ని వేయుము | 240 |
| 43. | ఆశ్రమమును నీ బిడ్డవలె నేల చూచుకొనవు? | 245 |
| 44. | మృత్యువునకు స్వాగతము | 247 |
| 45. | ఇటికలు | 257 |
| 46. | నాగార్జున సాగరు కాలువలు | 264 |
| 47. | దుఃఖించవలసిన దెవరింగూర్చి? | 270 |
| 48. | డబ్బు లేకుండ ధనవంతు డగుటెట్లు? | 278 |
| 49. | భేతాళుడు | 289 |
| 50. | శాంతి కేంద్ర స్థాపన | 292 |
| 51. | అద్భుతము | 295 |
| 52. | జ్ఞానము | 298 |
| 53. | తానొకటి తలచిన దైవ మొకటి తలచును | 316 |
| 54. | విశ్వమతము | 321 |
| 55. | దైవ చట్టములు | 328 |
| 56. | శ్రీశైల యాత్ర | 334 |
| 57. | సంసార మహాసముద్రము | 344 |
| 58. | ఆత్మబోధ వాక్యములు | 347 |
| 59. | సమాధిలో పలుకబడిన ఉపదేశ వాక్యములు | 349 |
| 60. | నేను మౌనము నేల దాల్చితిని? | 373 |

# శాంతి మంత్రము

ఆకసంబున శాంతి వెలుగుగాక!

స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక!

జలమునందు శాంతి సుస్థిరంబగుగాక!

పృథ్వియందు శాంతి కీర్తింపబడునుగాక!

సకల వృక్ష లతా గుల్మములయందు
శాంతి నదము ప్రవహించుగాక!

సమస్త చరాచరములు శాంతితో నింపబడుగాక!

సర్వ గృహములలో శాంతి స్థాపన జరుగుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# ఓంకార సద్బోధామృతము

# దైనిక ప్రార్థనలు

## ప్రాతఃకాల ప్రార్థన

రాతిరిపోయె పూర్వదిశ రక్తిమ దాల్చి మదంబుగూర్చె ని
ద్రాతిశయంబు వీడుట జనాళి క్రమంబుగ మేలుకాంచె ప్రా
భాతిక గీతజాతముల బాడదొడంగె శకుంత జాతులీ
పూత ముహూర్తమందు నిను పుణ్యులె చూడగలారు సత్ప్రభూ

ఓ దేవా! అరుణోదయారంభముననే నా మనస్సును నీ పవిత్ర సాన్నిధ్యమున కాకర్షించుకొమ్ము. ఈ దినమునందలి ప్రతిక్షణమునను నేను నీతో నైక్యము పొంది గడపుటకు నిశ్చయించుకొనునటుల నాకు సహాయము చేయుము. అన్నివైపులను నిన్నే చూతుము. అన్యము మఱచి నీలోనే జీవింతునుగాక! నీలోనే చరింతునుగాక. నీలోనే పనిచేయుదునుగాక!

చింత, తొందర, మోహము, కోపము, ద్వేషము, గర్వము, అహంకారము, అజ్ఞానము, వీని నెన్నడును తలయెత్తనీయను. నే నెల్లప్పుడును అసూయను - ప్రేమతోడను, శ్రమను - శాంతముతోడను, అజ్ఞానమును - జ్ఞానముతోడను, ద్వైతమును - ఏకత్వముతోడను నెదుర్కొన గలుగుదునుగాక, ఇతరులు శపించుచోట నే నాశీర్వదించునట్లును, ఇతరులు ద్వేషించుచోట నే క్షమించునట్లును, ఇతరులు పోరాడుచోట నేను లోబడునట్లును, ఇతరులు పుచ్చుకొనుచోట నే నిచ్చునట్లును, ఇతరులు లాభము నొందుచోట నేను నష్టపడునట్లును నాకు సాయము చేయుము. పరుల శాంతియే నా శాంతిగా, పరుల ఆరోగ్యమే నా ఆరోగ్యముగా, పరుల ఆనందమే నా ఆనందముగా పరిణమించనిమ్ము. ఇపుడీ విశ్వ ప్రపంచమునందలి జనులెల్లరు సుఖముగను శాంతముగను, ఆనందముగను నుందురుగాక యని పదేపదే పలుకనిమ్ము.

నే నెచట కేగినను ప్రేమ పుష్పములను, విశ్వాస కుసుమములను

వెదజల్లుదునుగాక, విచారగ్రస్తులకు సంతోషమును, క్రుంగిపోయినవారికి ధైర్యమును, రోగులకు దుర్బలులకు బలమును, పడిపోయిన పతితులకు పైకిలేచు తెలివిని, హింసకులోనై హీనస్థితియందున్న వారికి ఉన్నత పదవి నారోహించుశక్తిని గలుగజేయ గలుగునట్లును నాకు దీవన లిచ్చి తోడ్పడుము. అన్నిటికంటె నెక్కుడుగా నా దృష్టికి గోచరించు ప్రతిముఖములోను నిన్నే దర్శించునట్లు అనుగ్రహింపుము. నీవు ప్రాణమును తేజమును, ప్రేమయునై ప్రకాశించునట్టి సర్వవ్యాపకమును సర్వాంతర్యామియు, సర్వాత్మకమునగు తత్త్వమవై యున్నావుగాన పరులకు సేవ చేయుటలో కేవలము, నీకే సేవ జేయుచున్నానను జ్ఞానమును నాకు ప్రసాదింపుము.

హే ప్రభూ! నా పనినంతను, నాయారాధనము నంతను నీకే సమర్పింపనిమ్ము. నా విధులన్నియు, నా బాధ్యత లన్నియు నీకే నివేదింపబడుగాక! నా జీవితమంతయు నీకే సమర్పణమై పవిత్రము కానిమ్ము. నా బాషణములు నిన్ను గూర్చినవే యగునుగాక! నా కార్యములు ని న్నుద్దేశించియే చేయబడునవగుగాక! నా తలంపులు నీ మీదనే నిలువబడిన వగుగాక, నా శ్వాసను నీ కొరకే ప్రచలితము గానిమ్ము. నా హృదయమును నీ కొఱకే కొట్టుకొననిమ్ము. నా యూహాశక్తిని సంపూర్తిగా నీయందే సుస్థాపితము కానిమ్ము.

నే నీదినమును వృథాగా గడపకుందునుగాక! నీ సంతానమగు మానవకోటికి సేవజేయుట ద్వారా నిన్ను సేవించి నిన్నటికంటెను నే డెక్కువ శ్రేష్ఠతరముగా కాలక్షేపముచేసి యానందింతునుగాక! ఆనాటి కానాడు నా గమ్యస్థానమును నేను సమీపించి నీలో నిమగ్నము కాగలుగువరకును నీ విధముగా జరుగనిమ్ము.

అన్నిటికంటె నధికముగా నెల్లప్పుడును నా లోపలనే యుండు నాత్మ సామ్రాజ్యమును తిన్నగా నిచటనే యిపుడే యీ క్షణమునందే నీతో నిండి

యనుభవింప గలుగునటు లాశీర్వదింపుము. నీ శోభ యొక్కయు, నీ శక్తి యొక్కయు మహత్యముచేత నేను శాశ్వత శాంతి తోడను, అనంతానందము తోడను, సుస్థిర ప్రేమతోడను నింపబడుచున్నాను. ఈ ప్రార్థనము నాలోని ధీరాత్మను కదల్చుచున్నది. నీవు సర్వత్ర ఉన్నావు. సర్వసమయములందు నున్నావు. కావున నిన్ను నే నెన్నడును నొక గృహమునకో, గుడికో, కాలమునకో, స్థలమునకో, కట్టిపెట్టక క్రియా పరంపరలతో గూడిన కర్మశీలమగు నా జీవితమునందలి యీ దినమంతయు నీ పరమ పవిత్రమైన జ్ఞప్తితోడను, ప్రాణాధారమగు దివ్యశక్తితోడను గడుపుదునుగాక!

మధుర ప్రేమాధిపా ! నా హృదయ నివాసీ ! శాంతి ప్రదాతా ! సత్యానందనిధానా ! నీ మహిమ ప్రకాశించునుగాక ! పరమున నెట్లో ఇహమునను అట్లే నీ యిచ్ఛ నెరవేరునుగాక ! మే మెల్లరమును నీ పరిశుద్ధ ప్రేమతో పరిపూర్ణుల మగుదుము గాక ! మానవకోటికంతకు శాంతి లభించుగాక.

## మధ్యాహ్న ప్రార్థన

తీక్షణ మయూఖ సంతతులు తీవ్రతదాలిచె స్వార్థమయ్యె నా
తీక్షణ కరాఖ్య సూర్యునకు తీంద్రముగానటు మండు నెండచే
తీక్షణత నొందె సర్వమును దీర్ఘ వికాసము నొందె దిక్కులీ
తీక్షణ ముహూర్తమందు నిను ధీరులు చూడగలరు సత్ప్రభూ.

ఓ ప్రభూ ! సూర్యు డేవిధముగా చీకటినెల్ల పోగొట్టి సంపూర్ణ కాంతితో ప్రకాశించుచున్నాడో, అవిధముగా నేనును ప్రతి బలహీనతను, ప్రతి యంధకారమును తరిమివేసి ఆ కాంతిలో ప్రకాశింతునుగాక ! ప్రాతఃకాల ప్రార్థనమునందు నిశ్చయించుకొనిన సంకల్పములను యథార్థముగా నాచరణలో పెట్టగలిగి సాయంతన ప్రార్థన యందు నిన్ను సమీపించునర్హత నెక్కువగా సంపాదింపజాలుదునుగాక !

దౌర్బల్యము, మాంద్యము నిద్రమత్తు, సోమరితనము వీనిని నాలో చేరనీయకుము. ఏవిధమగు ప్రతిఫలమును గోరక సంతోష పూర్వకముగా సదా నీ బిడ్డలకు సేవజేయుచు, నీ పవిత్ర పద చిహ్నములలో నడచుచు, నీ శుభేచ్ఛను నెరవేర్చ గలుగునట్లు నాకు సంపూర్ణ బలమును, చురుకుదనమును, శక్తిని ప్రసాదింపుము.

ఓ దేవా! కేవలము ప్రేమ కొరకును, సేవకొరకును మాత్రమే నీ సంతానమునకు సేవ చేయునట్లు నాకు బోధింపుము. సేవయే నా యొక్క గొప్ప విశేషాధికారమనియు, నీ యొక్క సమస్త శుభస్వరూపములలోను నిన్ను ప్రేమించి సేవించుటనునదే ఘనమైన బహుమానమనియు నేను గ్రహింప గలుగునట్లు కృప చేయుము. ప్రతిరూపములో నిన్ను ప్రేమించుచు ప్రతి వైపునను నిన్ను దర్శించుచు, నీలో నిమగ్నమై యెన్నడును పోరాటమునకు, అజ్ఞానమునకు లోనుగాకుండ నుండుట కంటె నీ నుండి కోరదగినదేమున్నది?

ప్రియమైన తండ్రీ ! గతించిన దానిని గూర్చి తలపోయుచు నా విలువైన కాలమును వ్యర్థము చేసికొనకుండునట్లు నన్ను కాపాడుము. ఎంత ప్రియమైనదైననేమి? ఎంత సంబంధము కలదైన నేమి ? గతించిన దేమో గతించినదే గదా ! మఱియు అగోచరమైనట్టి యా భవిష్యత్తును గూర్చి చింతించుచు ఆకాశ హర్మ్యముల నిర్మించటంతో ప్రత్యక్షమైయున్న వర్తమాన కాలము నుపేక్ష చేయకుండ నుండనిమ్ము ఈ నిమిషము మాత్రమే నాది కావున నిప్పుడే నీ దివ్యజ్ఞప్తి ననుభవించుచు నీతో నైక్యము పొందియుండులాగున ననుగ్రహింపుము.

నా జన్మాధికారమైనట్టి నిన్ను గూర్చిన పవిత్ర జ్ఞప్తియే నాకు కావలయును. అంతకంటె నేమియు నక్కరలేదు. నా జీవితమునందలి ప్రతి క్షణమునను నీలోనే పని చేయుచు, నీలోనే శ్వాసించుచు నుండగల్గున ట్లాశీర్వదింపుము. నా ప్రార్థనలను, నా నిశ్చయములను యధార్థముగా

నాచరణలో పెట్టి తద్వారా మానవకోటికి వర స్వరూపినై ఆదర్శప్రాయముగా వెలయుదునుగాక ?

నీ యిచ్ఛయే నెరవేరునుగాక!

## సాయంకాల ప్రార్థన

క్రమముగ నా సహస్ర కరుఃకాంతియు శాంతి వహించె పక్షీ సం
ఘములు కులాయముల్ దరియగా వెస గ్రమ్మర జొచ్చె సాంధ్యరా
గములవి గప్ప పశ్చిమ దిగంతము కుంకుమ కాంతి నొప్పె నీ
సమయమునందు నిన్ దలచు సజ్జనులే ఘనులయ్య సత్ప్రభూ !

ఓ చైతన్య స్వరూపా ! నా ప్రేమాధిపా ! వివిధములగు నా విధాయక కృత్యములను శక్తివంచన లేక నిర్వర్తించి యీ సాయం సమయమున నావినీత ప్రార్థనలను సమర్పించుటకై తిరుగ నొకమారు నిన్ను సమీపించుచున్నాను.

సూర్యుని కిరణము లేవిధముగ నీలో విలీనమగుచున్నవో ఆవిధముగా నా మనోవృత్తులును నీలో విలీనమై నేను నీ దివ్య సాక్షాత్కార సౌఖ్యానుభవముతో శాంతిని విశ్రాంతిని పొందుదునుగాక! ఈ ప్రత్యేక సమయమున సమస్త ప్రకృతియు నేదో యొకవిధముగా విశ్రాంతినే యన్వేషించుచుండును. కావున నేనును నీయందు సంపూర్ణ విశ్రాంతిని బడయుటకై అభిలషింతునుగాక!

ఓ సత్ప్రభూ ! పనిచేయునపుడుగాని, విశ్రాంతి నొందునపుడుగాని నిన్ను తప్ప అన్యమును నే గోరను బాహ్య జీవితమునందును, ఆంతర జీవితమునందును నీవు మాత్రమే నాకు కావలయును. మేల్కాంచి యున్నపుడుగాని, నిద్రించుచున్నపుడుగాని, నీవు వినా మరేదియు నా కవసరము లేదు. నీవు విశ్వేశ్వరుడవు. నీవు నీ సంతానమున కభయ స్థానమవై యున్నావు వ్యక్తమైనట్టియు, అవ్యక్తమైనట్టియు ద్వివిధ సృష్టికిని నీవు జనకుడవై యున్నావు; నీ విశ్వ ప్రేమలో నన్ను నిబద్ధుని జేయుము. అంతటిని ఆలింగనము,

చేసికొనునట్టి నీ ప్రేమవాహినీ ప్రభావములో నన్ను మునిగిపోవనిమ్ము. వర్ణింప శక్యముగాని నీ సౌందర్య లహరిలో నన్ను కరిగిపోవనిమ్ము – పూర్తిగా కలిసిపోనిమ్ము.

ఓ పరమపితా ! నీవు నా ప్రార్థనల నెల్లప్పుడును ఆలించుచున్నావని నే నెరుంగుదును. ఏమన నీ వెన్నడును నానుండి వేరుగ లేవుగదా ! సర్వ సమయములందును విభజింప వీలు లేకుండ నీవు నాతోడనున్నావు. అవినాభావమైన నీయొక్కయు నా యొక్క అభేద సంబంధమును గూర్చియు, నీ విశ్వ ప్రేమను గూర్చియు నెల్లప్పుడును త్రికరణ శుద్ధిగా జీవితమునందలి ప్రతి ముహూర్తమునందు జ్ఞప్తిలో నుంచుకుని మననము చేయుచు నుందునుగాక! ఇదియే నా ప్రార్థనము.

## రాత్రి ప్రార్థన

అకయినం జలింపదు మహావిలయ ప్రతి మానమౌచు పెం
జీకటి గప్పె జంతువులు । చేష్టలు దక్కెను నిస్తరంగ ర
త్నాకర తుల్య నిశ్చలత దాలిచి భీతిద మయ్యె చూడగా
లోకము సర్వ మప్డపుడు ! లూకము నిశ్చలతం గలంప నీ
భీకర రాత్రియందు నిను । వీరులు చూడగలారు సత్ప్రభూ.

ఓ సమస్త ప్రాణాధిపతీ ! నేటి నా తుది ప్రార్థనమును నీ పవిత్ర చరణ సన్నిధిని సమర్పించుకొను నిమిత్తము తిరుగ నొకమారు నీ చెంత చేరుచున్నాను. ఇది విశ్రాంతి సమయము. ఇపుడు సృష్టి సర్వమును నివృత్తికి నిలయమై నిద్రాభిభూతమై నిశ్చలముగనున్నది. పక్షులు తమ గూండ్లలో చేరినవి, జంతువులు తమ నివాసముల కేగినవి. శ్రాంతులైన నరులు తమ ప్రక్కలపై నొరిగినారు. ఈ తరుణమున నేను మార్పు నెరుగని విశ్రాంతి ననుభవించుటకై నీలో కలసిపోవ నెంచి నిన్ను సమీపించుచున్నాను.

ఓ ప్రియ జనకా ! ఈ దినమంతయు నీ శాంతి తోడను నీ బలము తోడను నన్ననుగ్రహించినందుకు నీకు హృదయపూర్వక వందనములు. నీలో విశ్రాంతి నొందుట యను విశేషాధికారమును పొందునవకాశమును కలుగ జేసినందులకు నేను నీ యెడల గంభీర కృతజ్ఞతను చూపుచున్నాను. జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు అవస్థలలోను నిక్కముగా నీవు నన్నెడ తెగని ప్రేమతో కాపాడుచున్నావు. ఎద్దానియందు నీవును నేనును మాత్రమే మిగిలి తక్కినదంతయు విలీనమైపోవునో ఆ తురీయావస్థ యొక్క ఛాయా సందర్శనము నిపు డపేక్షించుచున్నాను. దైవజ్ఞప్తి యనబడు నీ సమాధ్యవస్థయే జీవితముయొక్క గమ్యస్థానమై యున్నది. ఈ యుత్కృష్ట స్థితిని పొందలేక పోయినచో జీవితమే వ్యర్థమగును.

కావుననో ఆనందమయా ! నేను మఱియొకమాఱు అరుణోదయము చూడక పూర్వమే వర్ణనాతీతమగు మహిమతో గూడిన తురీయానందమును నాకు ప్రసాదింపుము. ఆయానందము నాలోపలను, వెలుపలను గూడ ప్రకాశించుచున్నది. గాన మఱొకదినము కొఱకును మఱొక రాత్రికొఱకును నెంత మాత్రము కాచుకొని యుండక ఇపుడే దాని ననుభవింపగలుగునట్లు చేయుము, నా స్వీయమైన దైవ సంబంధమైన జన్మహక్కు ననుభవించుటకై నేనిపుడు నీలో ప్రవేశించుచున్నాను.

అందరియొక్క జన్మహక్కైన ఈ విశ్వజనీన ప్రేమయను మహోన్నత పదవిలో నా సోదరీ సోదరు లెల్లరును పాల్గొన నేర్తురుగాక, మే మెల్లరము నీలోనే సర్వదా వసింపగలుగుదుముగాక.

ఓం తత్ సత్ ఓం

# మోక్ష సాధనములు

1. ఉదయం నాలుగు గంటలకు బ్రహ్మ ముహూర్తమున మేల్కొనుట అలవాటు చేసికొనుడు - ఇది సాధనకు చాల అనువైన కాలము.

2. శయ్య నుండి దైవభావనతో మేల్కొనుడు. ఓ ప్రభువా! నేను నీవాడను నేడు గూడ అందరిలో నిన్నే చూచుచు నీ సేవ జేసి తరింతును గాక ! అని ప్రార్థింపుడు.

3. బాహ్యాంతరములందు పరిశుద్ధులై కాలకృత్యములు తీర్చుకొని, హృదయము యొక్క పవిత్రతను భావించుచు, దైవ నామమును స్మరించుచు స్నానమాచరింపుడు.

4. ఉషః కాల సూర్యకిరణముల కెదురుగా ప్రతిదినమును కనీస మొక అరగంట కాలమయినను ఉండుడు. పరిశుభ్రమగు నీటిని రోజుకు ఎనిమిది గ్లాసులైనను త్రాగుడు. రాగి పాత్రలో ఉంచబడిన నీరు శ్రేష్టము. దానివలన ప్రేగులు పరిశుభ్రముగా నుండును. ఆరోగ్యమే మహా భాగ్యము. ఆధ్యాత్మిక సాధనకు ఆరోగ్యము చాల ముఖ్యము.

5. గురుభావముననో, మాతృ భావముననో, పితృ భావముననో భగవంతుని ఆస్థిత్వమును విశ్వసించి సుఖాసీనులై ప్రశాంత హృదయముతో మీ యిష్ట దైవమును ప్రార్థింపుడు.

6. శాంతి ప్రేమలతో మీ రక్తనాళములను నింపుకొనుడు. దైవనామమునుగాని, మరేమంత్రమునుగాని "ఓమ్" ను గాని తరచు జపించుట కలవాటు చేసికొనుడు.

7. సాధన, విఘ్నము లేకుండ జేయుచుండవలెను. మొదట కొన్ని నిముషములు శాంతిగా దివ్యతేజస్సు ననుభవించుచు గడుపుడు. సాధనానంతరము సత్‌గ్రంథపఠన చాల మంచిది.

8. మీరు గ్రహించినది త్వరలో ఆదరణయం దుంచుటకు సత్యధర్మ ప్రేమల ననుష్ఠింపుడు. "సత్యంవద, ధర్మంచర" (Be Good and Do Good) మరువరానిది, సదా మంచిగా నుండువారు మంచినే యెల్లప్పుడును చేయుచుండగలరు.

9. సాత్వికాహారమును భుజింపుడు, మత్తును కలుగజేయు తామసాహారమును వదలుడు. జ్ఞాన సాధనకు, మితాహార నియమ మత్యవసరము. జీవించుటకు, అత్యవసరమగు దానినే భుజించవలెను. తినుటకే జీవితము ఏర్పరచలేదు.

10. మీ ప్రియతముడైన దైవము నారాధించుటకు ఒక గదిని ప్రత్యేకముగా నుంచుకొనుడు. దానిలో మహనీయుల సుభాషితములు, వ్రాసియుంచు కొనుట మంచిది.

11. సాధనకాలమందు మీ మనస్సు నాకర్షించు అవతారమూర్తుల చిత్తరవులు. ఆగరువత్తులు మీ ప్రార్థన మందిరమునందు ఉంచుకొనుట మంచిది.

12. ధర్మము చేయుడు. అందులకై మీ రాబడిలో కొంతభాగము కనీసం 100 కి. 5 రూ॥లు అయినను ప్రత్యేకింపుడు.

13. మనస్సుచేతను, శరీరముచేతను, బ్రహ్మచర్యవ్రతులై యుండుడు. జీవితము, మతము ఒకటిగా చేయవలెను.

14. మౌనము సర్వార్థ సాధనము, అది సత్వమును సాధించును. హితముగా, మితముగా, మాట్లాడుడు. వాఙ్నియమ మత్యవసరము. అత్యవసర మైనప్పుడే, జాగ్రత్తగా మాట్లాడుట మంచిది.

15. ఇంద్రియములను స్వాధీనము చేసికొనుట మానవజన్మకు ముఖ్య కర్తవ్యము. అప్పుడప్పుడు ఉపవసింపుడు. ఆరోజున ఫలహారముచేసి, పాలు త్రాగుట మంచిది.

16. సాధ్యమైనంతవరకు క్లుప్తముగాను, నిరాడంబరముగాను జీవించుటకు ప్రయత్నించుడు. పేదలకు అన్ని విధముల ప్రేమతో తోడ్పడుట చాల ముఖ్యము.

17. ప్రేమయే దైవము గావున, సర్వజీవుల యెడల అహింస నవలంబించి, ప్రేమించవలెను. అందరిలో దైవమును చూడుడు. తలంపులు మాటలు, పనులు ప్రేమగా నుండవలెను.

18. స్వశక్తిని మరచుటే మృత్యువు. సదా స్వశక్తిపైననే ఆధారపడి జీవించుడు. తరించుటకు ప్రయత్నించుడు.

19. ఇతరుల తప్పులపై ఎన్నడును దృష్టిని బోనీయకుడు. కాని మీ తప్పులను తెలిసికొనుటకు సదా ప్రయత్నించుడు. మీ లోపములను జూపువారే మీకు నిజమైన మిత్రులు. వారికి కృతజ్ఞులై అట్టి లోపములను మీ జీవితమున జేయకుండుటకు సదా బ్రయత్నించుడు.

20. దినచర్య పుస్తక మొకదానినుంచి, మీ రొనర్చిన మంచి చెడుగులను వ్రాయుచు, మీ పురోభివృద్ధికి బ్రయత్నించుడు.

21. వృథాగా కాలయాపనము చేయకుడు, కాలము చాల విలువైనది. అది స్వర్గద్వారముజేర్చు మెట్లవరుస. క్షణములను వ్యర్థము జేయునాతడు జీవితమంతయు వ్యర్థముచేయును.

22. పరుండునపుడు మీ దిన చర్యను ఒకసారి జాగ్రత్తగ పరీక్షించి, చేసిన లోపములకు పశ్చాత్తాపం పడి, తిరిగి అట్టి లోపములు రాకుండ దైవమును హృదయపూర్వకముగా ప్రార్థించవలెను. భగవన్నామము స్మరించుచు, ఆయన తేజస్సు మీ శరీరమంతయు వ్యాపించియున్నట్లు భావింపుడు.

23. ఆత్మ విశ్వాసముతోను, అంతర్వాణి చెప్పిన చొప్పున సదానడచుకొనుడు. 'సోమరులకు తినుటకు హక్కులేదు' 'పనియే ఆరాధన' యను ముఖ్య

సూక్తులను మరువరాదు.

24. "పరోపకారార్థం ఇదం శరీరం" ఈ శరీరములు స్వార్థరహితమైన మానవ సేవచేసి తరించుటకే యివ్వబడెనుగాన మంచి పనులే తరుచు చేయుచు, యితరులకు సేవచేయుటే మన ఆనందమని మరువరాదు.

25. ఏ దైవమునకై మీరు వెదకుచున్నారో, ఆ దైవము మీకై సదా వేచి యున్నాడు. పరమాత్మ సర్వవ్యాపి ఆయన లేని తావులేదు. "ఎందెందు వెదకి చూచిన అందందే గలడు."

26. మీరు సదా దైవజ్ఞప్తితో నుండి, ఇతరులు గూడ దైవము ననుభవించుటకు సహాయపడుడు.

27. సత్య, ప్రేమ, ధర్మ స్వరూపుడగు భగవంతునియందు ఐక్యమె సదా ప్రయత్నింపుడు, అప్పుడు మీ శరీర జ్ఞప్తిని మరచెదరు. బాహ్యసుఖములు మిమ్మాకర్షించలేవు. దైవమును హృదయములో గమనించగలరు.

28. అన్నివేళలయందు మీ గమ్యస్థానమైన దైవత్వమును జ్ఞప్తికి తెచ్చుకొనుచుండుడు, అప్పుడే మీ జన్మ సార్థకమగును. దైవము కొరకే మీ జీవితమును సదా దారపోయుడు.

29. భక్తి జ్ఞాన వైరాగ్యములు ముక్తికి మార్గములు; 'సోఽహం' ధ్యానము జన్మరాహిత్యము నిచ్చును.

30. నిరంతరము శాంతి ప్రార్థనను హృదయ పూర్వకముగ భక్తితో స్మరించుచు తరించుచు మీ కుటుంబములో నున్నవారందరు ప్రతినిత్యము ప్రార్థన చేయుట ముఖ్యము.

# శాంతి ప్రార్థన మహాత్మ్యము

శాంతి ప్రార్థన అందరిని ఆకర్షించును, గట్టి హృదయము గలిగిన వారిని కూడ ఆకర్షించి, తాత్కాలికముగానైనను మెప్పును గలిగించును.

ప్రశ్న :- శాంతి ప్రార్థన ఎందుచేత అందరినీ ఆకర్షించుచున్నది ?

జవాబు :- అందరి ప్రార్థనయై యున్నది.

శాంతి ప్రార్థన అందరినీ తనయందు ఇముడ్చుకొనుచున్నది. ఎవ్వరినీ విడువదు. శాంతి అందరి జన్మహక్కే గదా !

ఈ మధ్య ఋషికొండ సాగరతీరమున వారము రోజులు, శాంతిగా శాంతి ప్రార్థనను వ్యాపింపజేయుచు భక్తులందరిచే దానిని స్మరింపజేయుచుండి చివరకు తోటపల్లి ఆశ్రమం వెళ్ళుచుంటిమి. విశాఖపట్టణములోనే నాలుగు రోడ్డులు కలియుచోట, పెట్రోలుబంకు ఉండెను. అచ్చట మన సుశీల శాంతి శకటమునకు పెట్రోలు పోయించుచుంటిమి. జనసమర్థముగా నుండుటచే అనేక కార్లు, లారీలు అన్నివైపుల నుండియు వచ్చుచు పోవుచుండుటచే అపాయములు (యాక్సిడెంట్లు) జరుగకుండ కాపాడుటకు, ఆ నాల్గురోడ్ల మధ్యను ఒక పోలీసు జవాను నిలువబడి ట్రాఫిక్‌కు సిగ్నలు ఇచ్చుచు మళ్ళించుచుండెను.

పెట్రోలు తీసుకున్న తర్వాత, మన కారు వెళ్ళవచ్చునని చేతితో సంజ్ఞ చేసెను. కాని మన కారు కదలదాయెను. దానిని త్రోయగా, త్రోయగా రోడ్డు మధ్యకి వచ్చి ఆగిపోయెను. వచ్చేపోయే రహదారీ మనుష్యులకు, తదితరమైన బండ్లు, లారీలు, కార్లకు అడ్డుగా నిలిచి యుండెను. పోలీసు జవాను, ఆయన కండ్లు ఎఱ్ఱజేయుచు, చురచురలాడుచు తొందరపెట్ట సాగెను. అంతలో శాంతి ప్రార్థన కాగిత మాతనికి పంపబడెను. దాని నతడు చదువనారంభించెను. దానిని చదువుచు రోడ్డు ప్రక్కనున్న మా సుశీల శకటమును, మరియు తాను

నిర్వహించవలసిన డ్యూటీని కూడ మైమరచి, శాంతి ప్రార్థనలో తన్మయుడై యుండుట నాకు ఆశ్చర్యము, ఆనందము కలిగెను.

అతడు శాంతి ప్రార్థనను చదువుట పూర్తియైన పిమ్మట, ఇదివరకువలె చురచురలాడుచు మా వైపు తీక్షణముగా చూచుటకు బదులు, ప్రేమతో, చూచుచు మాకు సహాయపడసాగెను.

ఈ మార్పు అంతయు, శాంతి ప్రార్థనలోనున్న మహాత్మ్యము, శక్తియే గదా కారణమని ఆనందింపసాగితిని.

మా శాంతి శకటము అటులనే ప్రయాణము చేయుచుండ, అందు మోతీ సోదరి, చి॥ జ్ఞానేశ్వరి, చి॥ శాంతి, గురుకుల బాలబాలికలతో హరేరామ మంత్రము, శ్రీరామ జయజయ రామ మంత్రము, తదితర భజనావళులు పాడుచు ప్రయాణము సాగించుచుండ ఒక్కచోట రైలు వచ్చుచున్నందున రైలు గేట్లు మూయబడి యుండెను. ప్రతీ వ్యక్తియు నా స్వంతమేయనియు, ప్రతివారును శాంతి ప్రార్థనను స్మరింపుచు దైవ సన్నిధిని అనుభవించవలెనని నేను సదా కోరుచుందును గాన అచ్చట గేటు కీపరుకు, ఒక్క శాంతి ప్రార్థన కాగితమును పంపితిని. అతడు రైలు వచ్చుచుండ బ్రేకులు వేయుచు, శాంతి ప్రార్థన కాగితము ఒక్క చేతితో పట్టుకుని, దానిని భక్తిశ్రద్ధలతో చదువుచుండ నాకెంతయో ఆనందము కలిగెను. రైలు వెళ్ళిపోయినను అతడు ఇంకను శాంతి ప్రార్థననే చదువుచుండెను. ప్రార్థన చదువుట పూర్తికాగానే, మమ్ముజూచి, గేటు తలుపులు త్వరితముగా తెరచి, మరొక్క బండి వచ్చుచున్నదిగాన మమ్ము తొందరగా వెళ్లమని ఆనందముతో హెచ్చరింపసాగెను.

ఒక్క హిందూదేశములో మాత్రమేగాక, పాశ్చాత్య దేశములు ఇంగ్లాండు, అమెరికా మొదలైన తావులలో గూడ, ఈ శాంతి ప్రార్థన "శాంతి" యనెడి పేరే. ఎన్ని మార్పులను, ఎన్ని మహత్తులను కేవలము దైవకృపచే చేయుచుండును. ఒక్కసారి, చాలకాలము క్రిందట, అమెరికాలో, న్యూయార్కు

పట్టణమున మా పీస్ కారును మరామత్తుకై ఆశ్రమ స్నేహితుడు ఒకాయన కార్ఖానాకు తీసుకు వెళ్ళి రోడ్డుమీద ఆపెను. ఒక పోలీసు ఉద్యోగి వచ్చి, అచ్చట కారు ఆపుటకు వీలు లేదనియు, అతడు ఆపినందుకు జరిమానా చెల్లించవలసియుండు ననియు చెప్పి, తన నోటు బుక్కు పైకి తీసి, కారును తీసుకువెళ్ళిన స్నేహితుని పేరు, ఎడ్రసు, చెప్పుమని కోరుచు, ఇంతలో కారుపై వ్రాయబడి యుండిన "శాంతి మిషన్" అను పేరును చదువుకొని "ఈ కారు శ్రీ ఓంకార స్వాములవారిదా?" అని ప్రశ్నించి నిశ్చేష్టుడై, పేరు నోటు చేసుకొనుటను మానివేసి యుండగా, స్వామీజీ టూరింగు కారే అని చెప్పగా విని "మీ రెంత సేపైనను, స్వామీజీ కారును, ఈ పార్కులో ఉంచుకొనవచ్చు" నని చెప్పెను. అంతట కారులోనున్న ఆశ్రమ స్నేహితుడు "మీరు శ్రీ స్వామీజీని ఎటుల ఎరుగుదురు?" అని అడుగగా, తాను శ్రీ స్వామీజీ శాంతి సందేశము వినుటకు (పీస్ మీటింగ్) కు వచ్చి యుంటిననియు, మన శాంతి ప్రార్థన కరపత్రము తనవద్దయున్నదనియు చెప్పి కరచాలము (షేక్ హేండ్) ఇచ్చి, ఆనందముతో వెళ్ళిపోయెను.

మరొక్కసారి, అమెరికాలో, ఆబర్న్ అనే పట్టణములో ఆశ్రమ భక్తుల ఆతిథ్యము నంగీకరించి, వారివద్ద గడుపుచుంటిని. అమెరికాలో అందరు స్వాములు కారు నడుపుదురు గాన నేను గూడ కారు నడుపుటకు కోరుచు మా అతిథి శ్రీ తాంసన్ గారిని, నాకు కారు నడుపుట నేర్పుమని కోరితిని. ఆయన నన్ను వూరిబైట మైదానములోనికి తీసికొనివెళ్ళి ఆయన స్వంత కారు మీదనే నాకు (డ్రైవింగ్) నేర్పుచుండెను. నేను అచ్చట ఆనందముగా, సర్కిల్సు తిరుగుటకు అచ్చట చోటు తక్కువగా నుండుటచే, చుట్టుచుట్టును త్రిప్పుచుంటిని. అంతలో ఆజానుబాహువు, దృఢకాయుడు, అయిన నా కంటె పొడవైనవాడు ఒకాయన వచ్చి, కారును ఆపుమని కోరెను. "మీకు డ్రైవింగు లైసెన్సు ఉన్నదా?" అని ప్రశ్నించెను. క్రొత్తగా కారు నడుపుట నేర్చుకొనుటకు కూడ లైసెన్సు పుచ్చుకొన్న పిమ్మటనే నేర్చుకొనవలెనట, ఏమి

చేయుటయా ! దైవమా అని తలచుచు, మీ రెవ్వరని అడిగితిని.

బేరు డ్రస్సుతో, (మామూలు దుస్తులలో) నున్నను, అతడు తన జేబులో నుండి ఒకటిక్కెట్టును పైకి తీసిచూపి, తాను ఒక పోలీసు ఉద్యోగి నని చెప్పగా నాకు, నాకు డ్రైవింగు నేర్పునాతనికి కూడ చెమటలు పట్టుచు, కొంత కంగారు కలిగెను. అంతలో నేను గూడ నా జేబు నుండి శాంతి ప్రార్థన కరపత్రము నొకదానిని, ఆ పోలీసు ఉద్యోగికి ఇచ్చితిని. దానిని ఆయన చదువుకొనుచు, పూర్తిగా చదివిన పిమ్మట, చిరునవ్వుతో, మమ్ములను వెంటనే పోలీసు స్టేషనుకు వెళ్ళి కారు నడుపుట నేర్చుకొనుటకు మొదట లైసెన్సు సర్టిఫికేట్టు తీసుకొనుమని కోరెను.

ఈ మధ్యనే ఒక ఉద్యోగి తన నౌకరుతో తగవులాడుచుండు సమయములో శాంతి ప్రార్థన కరపత్రమును ఇవ్వగా, దానిని ఆయన చదివి, తన సేవకునితో ప్రేమగా మాట్లాడసాగెను.

జునాగడ్, సౌరాష్ట్రమునుండి ఒక డాక్టరుగారు తాను వారమునకు ఒక్కరోజున మౌనములో నుండి, శాంతి ప్రార్థనను 108 సార్లు వల్లించుచుంటిననియు దానివల్ల బ్రహ్మ సాక్షాత్కారమును, ఎప్పుడో గాక, ఆనాడే, అనుభవించుచుంటిననియు నాకు వ్రాయగా నా మనస్సెంతయో ఆనందించెను.

జర్మనీ నుండి, ఒక పత్రికాధిపతి తాను దురవస్థలలో తన సంసార బాధలలో, చింతలలో శాంతి ప్రార్థన, తన జీవితములో ఒక రక్షరేకుగా పనిచేయుచు తోడ్పడుచున్నదని వ్రాయగా ఎంతయో ఆనందమాయెను.

మొన్ననే శిరిపురము నుండి ఒక భక్తుడు శాంతి ప్రార్థనను గురించి ఎంతో ఉత్సాహపూరితముగా, దాని మహిమ గురించి వ్రాసెను. ఇటులనే ఎన్నియో ఉత్తరములు శాంతి ప్రార్థన మహాత్మ్యమును గురించి ప్రాక్పశ్చిమ

దేశముల నుండి వచ్చుచుండును, కొందరు శాంతి ప్రార్థన యెటుల తోడ్పడుచున్నదీ శాంతి పాఠకుల వృద్ధిని గోరుచు వారి అనుభవములను వ్రాయుచుందురు. శాంతి ఆశ్రమములో కొన్ని పుణ్య దినములందు ఏకాహముగా జేసికొని ఆశ్రమవాసులు వృద్ధిజెందుచుందురు. ప్రియమైన శాంతి పాఠకులారా ! ఇదియంతయు దైవముయొక్క కృపయు, మీ ప్రార్థనల యొక్క ఫలితమేగదా ! మీరందరు శాంతి ప్రార్థనను నిరంతరము స్మరించుచు శాంతి ననుభవించెదరుగాక ! ఆనందముగా నుండుటకు దగ్గర మార్గము ఇతరులను ఆనందముగా జేయుటయేగాన ఈ చిన్న శాంతి ప్రార్థనను మీ బంధువులచే, మీ స్నేహితులచే మీ గృహములలో ఆబాల గోపాలము అందరిచే చివరకు మీ పనివాండ్రచే, మీ సేవకులచేగూడ పఠింపజేసి సదా స్మరించుచు మీరందరు నిత్యశాంతిని బడయుదురుగాక !

శాంతి ప్రార్థన మీ హృదయములలో శాంతిని నెలకొల్పి మీ గృహములను స్వర్గముగా జేయుచు లోకశాంతికి, మానవాభ్యుదయమునకు తోడ్పడునుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి ః శాంతి ః శాంతి ః

# శాంతి కాములకు ఆహ్వానము

ఒక వ్యక్తికి గాని, జాతికిగ్గాని ప్రత్యేకముగ చెందియుండక, ప్రాక్పశ్చిమములలోనేగాక యావత్ప్రపంచమునందుగల భగవత్సంతాన మందరికిని సమానముగ చెందున దేదయిన నుండిన నెంత యద్భుతముగ నుండును? దేదీప్యమానుడగు సూర్యు డెవరిసొత్తు? ఆయన ప్రతియొక్కరివాడు. ఆయన సాన్నిధ్యమును, తేజస్సును, చూచుటకు కన్నులును, అనుభవించుట కింద్రియములును కలయందరి సొత్తును - కాదా? నక్షత్రములెవరి సొత్తు? గాలి యెవరిది? ఆకాశ మెవరిది? అవి ప్రతి యొక్కరికిని చెంది యుండలేదా?

పైవానిలో పృథ్విని, సముద్రమును చేర్చుటకు నేను సందేహించుచున్నాను. స్వార్థపరుడగు మానవునిచే పృథ్వి, 'నాది, నీది' యని విభజింపబడినది. సముద్రము విషయములో కూడ హిందూమహా సముద్రము భారతీయులదేనని, అట్లాంటికు మహాసముద్రము అమెరికనులదేనని చెప్పువారు కలరు. మానవుడు - అజ్ఞానియగు మానవుడు - స్వత్వమునందును, ప్రాపంచిక వస్తువులయందు ప్రత్యేకమయిన హక్కునందును, ఆనందమును వెల్లడించును. ప్రపంచ మెవరిది? మానవునిదా? లేక దేవునిదా? ఈ చిక్కు ప్రశ్నలకు, తమ యున్నతమయిన మేధస్సులతో సమాధానముల నిచ్చుటకు తత్త్వ శాస్త్రజ్ఞులకు విడిచి పెట్టెదము.

ప్రియ మిత్రమా ! నీ వెవరయినను, యెచట నున్నను, ఆస్తికుడవయినను, నాస్తికుడవయినను, నమ్మకము కలవాడవైనను నమ్మకము లేనివాడవైనను, ఇదిగో శాంతి నిలయము, ఇది స్థాపకులు, సభ్యులు, కార్యకర్తలము అయిన మాలో నెవరితోనయినను సరిసమానముగ నీకును చెంది యున్నది. ఇది నీదగుటచే, నీవు వచ్చి, విశ్రాంతి తీసికొని, ప్రాపంచిక జీవితమునుండి విరమించి, కొంతకాలముగాని శాశ్వతముగగాని జీవితమును

గడపుటకు ఈ లోకమున నొక శాంతి నిలయమున్నదని నీ కానందముగ లేదా?

నీవు శాంతి కొరకు తహ తహ లాడుచుండినచో, నీ జన్మ స్వంతమైన శాంతిని ప్రతి మానవుని వారసత్వమయిన శాంతిని, బజారులో నెంత ధనమునకయినను లభించని శాంతిని, నీ విచట నుచితముగ పొందగలవు. నీకు శాంతి కావలయునా? నీ యాత్మ శాంతి కొరకు పరితపించుచున్నదా? శాంతి కొరకు నీ యాక్రోశము బలముగను గాఢముగ నున్నదా? శాంతి లేని జీవిత మేమి? మానవ లోకమునకు నా కానుక యీ శాంతి నిలయము. నీకును, సర్వ జాతి మతములకు చెందినవారికి కూడ నిచట హృదయపూర్వకమయిన స్వాగతము వేచియున్నది. మీతో సమముగ ననుభవించుట కొకటి యుండుటచే నే నానందపరవశుడగుచున్నాను. మీ యుపయోగముకొరకును, సర్వజన సామాన్య సౌభాగ్యమునకును, యీ శాంతి నిలయమును నిర్మించుటకు నన్ను సాధనముగ నుపయోగించుకొనిన సర్వశక్తి సంపన్నుడగు పరమేశ్వరునికి కృతజ్ఞుడను.

ప్రియమయిన పాఠకుడా ! ఇది నీకు నా వారసత్వము. నన్ను భౌతికముగ నీ వెరిగినను, ఎరుగకున్నను ఒకటే. మన మందర మొకే భగవంతుని సంతానమయియుండి ఒకే మూలము నుండి యుద్భవించి, ఒకే సాన్నిధ్యమున నివసించుచు, తుదకు తప్పనిసరిగనొకే సత్యము – అవిచ్ఛిన్నమగు తేజస్సులోనికి తిరిగిపోవుట, లీనమగుటయే చాలును. వ్యక్తి శాంతియే విశ్వశాంతికి దారితీయును గనుక, దయయుంచి నీ భక్తి యుతమయిన హృదయములో శాంతిని నెలకొలుపుకొని నాకు తోడ్పడుము. నీ హృదయములోని శాంతి నీ యింటిలోని వారిచే గుర్తింపబడును. నీ గృహములోని శాంతి నీ కులమునకు వ్యాపించును. నీ కులములోని శాంతి నీ జాతియందు ప్రసరించును. నీ జాతియందలి శాంతి, యావత్ప్రపంచమునకును, అన్ని జాతులకును

వ్యాపించును. శాంతికి అనేక మాటలతోగాని, అసలు మాటలతోగాని పని లేదు. ఇదిగో నీకు నా వారసత్వము. నా కానుక. ఈ శాంతి నిలయమునందిపుడే చేరి, అనంతమగు శాశ్వతమగు శాంతిలో జీవించుచు లోకమున కంతకును వరప్రసాదముగ నుండుటకు దయయుంచి యిపుడే రమ్ము. ఇది మీ సోదరుడు ఓంకారుని ప్రార్థన.

ఓం, ఓం, ఓం

# భగవత్సాక్షాత్కారము - ఇప్పుడే - ఇచ్చటనే

జీవిత గమ్యమును, ఇప్పుడే, ఇచ్చటనే పొందగల్గుటకు భగవంతుని ఆస్థిత్వమును గుర్తించు సాధనమే అత్యంత నిరాడంబరమైన, తేలికయైన, సూటియైన, సహకారకమైన, నిర్విఘ్నమైన మార్గమని ప్రాక్పశ్చిమ దేశములలోని యోగులును, జ్ఞానులును, తెలిపియున్నారు. సాధనము, సిద్ధాంతము అనునవి రెండు భిన్న వస్తువులు. అన్నివిధములైన సిద్ధాంత విషయములను ఆవలబెట్టి ఒక్క సాధన విషయమున్నే ఇట ప్రస్తావించెదము. ఏలయన, మనము తెలుసుకొన్న దానిని అభ్యసించిన మన తెలివి వృద్ధి నొందును. సిద్ధాంతము ఒక్క మణుగైనను, ఒక్క తులము అభ్యాసమునకు సరిరాదను వాక్య మెంత సత్యము; కేవల సిద్ధాంతము మనలను బహిర్ముఖులుగా నుంచును. సాధనమో అంతర్ముఖుల - గావించును. సిద్ధాంత పరిచయమున మానవుడు వ్యాకులచిత్తుఁడు, దురహంకారుడుగానే ఉండును. సాధన మాతనిని శాంతుని, నిరహంకారునిc జేయును.

ఈ దిగువఁ బేర్కొనిన సప్తవిధ సాధనములచే భగవంతుని ఉనికిని గుర్తింప బూనెదము.

1. శబ్ధమున ఈశ్వరుcడు
2. దృక్కున ఈశ్వరుcడు
3. స్పర్శయం దీశ్వరుcడు
4. చలనమునం దీశ్వరుcడు
5. సంకల్పమునం దీశ్వరుcడు
6. ఉచ్ఛ్వాస నిఃశ్వాసములం దీశ్వరుcడు
7. వాయుబంధనమునం దీశ్వరుcడు

ఈ సప్తవిధ సాధన పద్ధతిని దీసికొని అందలి ప్రతిసోపానమును గూర్చి వేర్వేరుగ జర్చించెదము.

1. శబ్దమున ఈశ్వరుడు :- ప్రపంచ మీశ్వరు నుండి పుట్టినదగుటచే నీవు వినున దంతయు ఆయన నుండి ఉద్భవించునదే. మహాసాగరము యొక్క తరంగ ఘోష కానిండు, పక్షుల మధుర స్వరము కానిండు, నీ ఆప్తుల, ప్రేమాస్పదుల, హితవచనములు కానిండు, వేయేల పైకి అతి నెమ్మదిగ, నిదానముగ "టక్కు, టిక్కు" మని వినఁబడు గడియారపు శబ్దము సైతము హృదయాంతరాళమున సమగతిని స్పందించు హృదయ తరంగపు నిగూఢ నిశ్శబ్ద ధ్వనియు, అన్ని శబ్దములును ఆయన నుండి బహిర్గతములై వచ్చునవియే.

కావున, బాహ్యాంతరముల ఆయన సర్వవ్యక్తీకరణములు, ప్రతి వాగ్వ్యాపారమున ఆయన శబ్దమును వినుట నభ్యసింపుము.

నీ ప్రియమిత్రులు, ఇంటివద్ద నీ ప్రేమాస్పదులు, నీతో మాట్లాడునప్పుడు వారి ప్రియవాక్కులతో భగవంతుడుండియున్న సత్యమును భావన చేయుట నభ్యసించుము. ఏలయన, సర్వమును భగవంతునివే. భగవంతుని ఉనికిని గుర్తించు నభ్యాసమును ముఖ్యముగ నిన్ను గూర్చి ఒకరు తప్పు దలంచి నిన్ను విమర్శించి, నిందించునపుడు గూడ సాగింతువేని నిజముగ, నీ వెదుర్కొనదగు పరీక్షను నీ వెదుర్కొనుట యగును. అప్పుడు సైతము నిన్నెదిరించువానిలో భగవంతుని ఉనికిని మాత్రమే గుర్తించుటకు గట్టిగ ప్రయత్నింపుము. శత్రు మిత్రులిద్దరియందును భగవద్వాక్యమును దక్క ఇతరమైనదానిని దేనినైనను వినకుండుట నేర్చుకొనుము. నే నీసందేశమును వ్రాయుచుండ ఒక పిల్లిపిల్ల అరచుచువచ్చి నా అరికాలిని మెత్తని బొచ్చుతో నిండిన దాని దేహముతో పాముచున్నది. పిల్లి పిల్ల యొక్క ఆ స్పర్శతో, సంతుష్టినిఁ బ్రకటించు దాని కూతలో, ఆ పరమేశ్వరుని ఉనికిని భావించి గుర్తించుటెంత ముదావహము!

అన్ని వేళలయందును, శృతమును, అశృతమునగు ఆయన ద్వివిధ కంఠ స్వరములలో ఆ యీశ్వరుని మధురాతి మధురమైన గానము యొక్కయు, సమ్మోహన శక్తి గల ఆయన శబ్దముల యొక్కయు తరంగములతో నీ

కర్ణేంద్రియములును నీ నిదానమును సమ శ్రుతియం దుండునట్లు చేయుము.

వేకువ ఝామున, పెందలకడనే ప్రారంభ మొనర్చి రాత్రి సుఖ సుషుప్తియందు నీవు మునుగు వరకు రేయింబవళ్ళు అవిరామముగ అధ్యాసమొనర్పుము. అభ్యాస మొనర్చుము.

2. దృక్కున ఈశ్వరుడు :- నీ కండ్లలో తళతళలాడు ఆ కాంతి యేమి? ఇతరుల కండ్లలో మెరయు ఆ తేజస్సేమి? చిన్న కీటకము యొక్క అతి చిన్న కండ్లలో, సుకుమారమైన పక్షి కండ్లలో, భయంకరమైన అడవి మృగపు కండ్లలో దీపించు ఆ ప్రకాశత్వమేమి? ఇదియంతయు ఆ ఏకైక సత్యము యొక్క ఆ దైవతత్త్వము యొక్క, స్వరూప దర్శనమును, ప్రత్యక్ష ప్రకటనమునుగాదా? ఒకే భగవంతుడు బాహ్యాభ్యంతరములు రెంటియందును వ్యక్తమగుచుండుటచే, ధ్యానముననేమి, స్వప్న సుషుప్త్యావస్థలయందేమి నీ వనుభూతి నొందున దంతయు భగవంతుని ప్రకటనమే నీవు కండ్లు తెరచి నీ చుట్టును పరికించి నంతనే ఆ మంచు బిందువులయందు ప్రకాశించునది, ఆ లలిత పుష్పములయందు సౌందర్యమై విలసిల్లునది, ఆ చిన్న మొక్కలలో నిత్య సంవర్ధన శోభగా రాణించునది. ఆ పక్షి కూతలలో మధుర నిస్వనంబై వినిపించునది, ఆ మృగ ఘర్జనములలో గాంభీర్యమై భయము గొల్పునది, ఆహా ! ఆ మహా సాగరమున నిత్యము ఉధృతములై ముందునకు లంఘించు తరంగములలో గమనమై వింతగొల్పునది, జంతువుల చెలగాటములలో, బిడ్డల బాల్య క్రీడలలో దీపించు ఆనందలీలయై ముదము గూర్చునది. తుదకు పెద్దల వాగ్విశేషమున వెల్లివిరియు విజ్ఞాన సంపదయై జోహారులందునది ఎయ్యది? అది ఎవ్వరి తేజోవిశేషము? ఇవియెల్ల సర్వాంతర్యామియై వెలగు ఏకక సత్యము యొక్క ప్రేమపూర్వక ప్రకటనములును, సజీవ నిదర్శనములును కావా? “ఎవ్వడు పక్షులను, మృగములను మానవులను ప్రేమించునో వా డీశ్వర ప్రార్థనా విధానమున ప్రవీణుడు”. ఇట్లు చాటు వాక్య మెంత

సత్యగర్భితము ! కావున. దృక్కునం దీశ్వరుని కనుగొను విధము నభ్యసించెదము. ఆ దృక్కు ద్వారా అందరి యందును, అంతటను నిండియున్న అతనిని మన చూపు లెటుబరగిన నటు, ఎటనిలచిసేసటు. దర్శించి సేవించెదముగాక!

3. స్పర్శయం దీశ్వరుఁడు :- చల్లని మలయమారుతము నీపై వీచునపుడు అది ప్రాణప్రదమగు ఈశ్వరుని వాయు ప్రసారము గాక వేరేమియు కారని భావింపుము. నీ దేహమును తాకుచు నీకు సుఖము నిచ్చు ఆవాయు తరంగములయందు భగవంతుని ఉనికిని గుర్తించుటను సదా అభ్యసించుము. తూర్పున చక్రవాళపు రేఖ నుండి భానుఁ డధిగమించుచుండ, ఆయన ఉష్ణకిరణములు నిన్ను ముంచెత్తి నీలో చొరఁబడుచుండ ప్రాణోత్తేజకరములగు ఆ కిరణములలోనే భగవంతుని ఉనికిని అనుభవింపదగు సుసమయమని గుర్తెరుంగుము. ఉన్నతములై రాజఠీవితో వెలయు నా మహావృక్షముల వీక్షింపుము. ఊరకవిడుచు తమదెసవచ్చు నా వాయుతరంగముల తాకుళ్ళకు వినమ్రభావమున, భక్తి పురస్సరముగ ఎట్లు తమశిరముల వంచుచున్నవో గాంచుడు. నీవు వినెడి, కనెడి స్పృశించెడి, జ్ఞానేంద్రియములచే నెరింగెడి అన్ని విషయములందును నీకు ద్యోతకమయ్యెడిది భగవసాక్షాత్కారము కాదా! అన్నివైపుల నాయనను దర్శింపుము. ప్రతి రూపముననను ఆయనను గుర్తింపుము సముద్రరూపుఁడగు ఆయన కున్ముఖుండవగుము భూరూపధారియగు ఆయన సాన్నిధ్యమును పొందుము. అగ్ని స్వరూపుడగు ఆయనవేడి ననుభవింపుము. ఆహా, అల్లదే ! ఆయనవంక తేరఁబారి చూడుము. ఆవరణ హద్దులదాటియున్న ఆకసము వంకగూడ నీ చూడ్కులనిగుడింపుము. ఆయావరణయం దాయన సాక్షాత్కరించుచున్న సత్యము నెరుంగుము.

4. చలనమునం దీశ్వరుడు :- నీవు గిరగిరఁ దిరుగ, నీలో తిరుగుచున్నట్లు దోచునది భగవంతుని దివ్యశక్తిగాక వేరేమి? నీవు షికారునకుఁ బోవునపుడు ఏది సర్వ సంచలనములకు మూలమును బలమును అగునో

అట్టి ఆయన ఉత్ప్రేరక శక్తియే నిన్ను నడిపించినది కాదు; నీలో నడచువాఁడు. నీలో పనిచేయువాఁడు నీలో ప్రతియొక్క కార్యకరణ శక్తిని బుట్టింప బీగము త్రిప్పువాడు ఆయనయే. స్నానము చేయునపుడు, భోజనము చేయునపుడు' ఆటలాడునపుడు భగవత్ప్రార్ధన మొనరించునపుడు నీ దేహము యొక్క ప్రతి సంచలనమునందును ఆ భగవంతుని ఉనికినే భావించుట నభ్యసింప దీక్షబూనుము. ఇప్పుడు కలము పట్టి నా చేతి ద్వారా వ్రాయుచున్నదేమి? నీలో, నాలో, ఇతరులందరిలో ఈ సర్వ సంచలనమునకు గారణ మా యాశ్వరుని వ్యక్తీకరణముగాక వేరేమి? నిశ్చయముగ, ఇప్పుడు నీలోని చదువుకూడ ఆయన దివ్యజ్ఞానము తప్ప వేరేమియు కాదు. ఆ తెలివియే భగవంతుని ఏకైక ప్రకటనము.

ఆయన ఉనికిని నీలోనే, నీ ఒక్కదానిలోనే భావించి, బాహ్యమునను, ఇతరులెవ్వరియందును లేనిదానిగా భావింతువేని నీవు అహంభావపూరితడవును, స్వార్ధపరుడవును అయ్యెదవు. కొన్ని సమయములలో నీలోని భగవంతుని గుర్తింప పరాకున మరచినను ఇతరులలో నాతని గుర్తించుటలో నెన్నడును పొరబడకుము. అనుక్షణమునను భగవంతుని సర్వాంతర్యామిత్వమును నీలోను, ఇతరులయందును, గుర్తించుటనే అభ్యసింపుము. చిన్న మొక్కలలో, పక్షిలో, మృగములో, లేక మానవునిలో, ఏ కొలది చలనమునైనను ఎక్కడ జూచినను సరే, వాటి యన్నిటి యందును భగవంతుని గుర్తింప పట్టుదల వహింపుము. "భగవంతుడు పాషాణమున నిద్రించును. నాచునందెదుగును, జంతువునందు జరించును, మానవుని యందు మాట్లాడును" అనుమాట లెంత సత్యములు, ఎంతభావోత్ప్రేరకములు?

5. సంకల్పమునం దీశ్వరుఁడు :- తమ చంచల మానసములను నిగ్రహింప తీవ్రముగ కష్టించువారి కెల్ల నేనిదే ఒక శుభవార్తను తెలుపుచున్నాను. అత్యంతానందమును గూర్చు ఒక సువార్త నందించుచున్నాను.

చంచలమగువారి మనంబుల నిగ్రహింప గష్టింపనక్కరలేదు. ఇటునటు పరుగిడిపోవువారి మనంబుల నరికట్ట వారికముం దేమియు గష్టింపఁబనిలేదు. సంకల్ప మీశ్వరుని బహిర్వ్యాపి కావున వారి సంకల్పములకు వారే సాక్షిభూతులై మాత్రము నిల్చి వాటిపోకడను గమనింతురుగాక. సంకల్పము వారిని ఋషికొండ తీరమువైపుకుఁ గొంపోవునేని, దాని ననుసరించి మాత్రము వారిని పోనిండు. అమెరికాదేశ వారినది గొంపోవునేని వారినట్లే దానివెంట పోనిండు. సూర్యుని దెస సంకల్పము పోవునేని వారును దాని ననుగమింతురుగాక. భూప్రళయమును గూర్చి అది పరుగిడునేని, విశ్వమెల్ల నీశ్వరునితో నిండియున్నదను సత్యము నెరింగి సంతోషముతో దాని వెన్నంటియే వారును పోదురుగాక! నీ ప్రేమాస్పదుల గూర్చి, నీ సన్నిహితులను గూర్చి తలపోయుము". నీ కతి దూరస్థులగు వారిని గూర్చి లేదా నీ ప్రేమాదరణలను దుర్వినియోగ మొనర్చిన వారి గూర్చి సైతము, నీకు ఘాతమొనర్చి, నిన్ను హింసింప జూచువారిని గూర్చి కూడా నీవు తలపోయుము. ఏకైకమూర్తియు, అవిభాగుడునగు ఆ పరమేశ్వరుని ప్రత్యక్షమూర్తితో వారి నందరిని గప్పివేయుము. ఎవ్వరియందేని ఈశ్వరేతరమును జూచుటలోను, భావించుటలోను, దుఃఖమును, కష్టానుభవమును గలవు. బాహ్యాభ్యంతరముల ఈశ్వరుని గుర్తించుటవలన నిరభ్యంతరముగ కలుగు మహోత్ఫలితములే శాంతి, సుఖములు. ఏలయన ఆయన కాని పదార్థమేమియు లేదు. సృష్టి, స్థితి, లయ, కర్తలగు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముప్వరును నీయందే గలరు. భూతకాలమున ఏవేవి నీవు సృజియించితివో, అవియెల్ల నీ సంకల్పమునుండి ఉద్భవించినవియే. వర్తమానమున నీవు సృజియించుచున్నవి భవిష్యత్తునందు నీవు సృజియింపఁబోవునవి, అన్నియు నీ సంకల్పము నుండి పొడసూపునవియే. సంకల్పముతో సృష్టి కార్యమారంభమగును. సంకల్ప ముడిగినంతనే ఆ కార్యమాగిపోవును.

6. ఉచ్ఛ్వాస నిఃశ్వాసమునం దీశ్వరుఁడు :- "మన పాద, హస్తములకంటెను, మన ఉచ్ఛ్వాస నిఃశ్వాసముల కంటెను గూడ భగవంతుడు

మనకధిక సన్నిహితుండై యున్నాడు; ఈ మాటలు ఎంత ప్రాణప్రదములు ! ఎంత ఆత్మోత్తేజ కరములు ! కావున మనము పీల్చు గాలియందే భగవంతుని గుర్తింప నభ్యసించెదముగాక ! మనము సల్పు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసము నందును ఆతనిని గుర్తింపనేర్తుముగాక !

ప్రియ మిత్రమా ! ఈ చిన్న పుస్తకమును కొంతసేపు ఆవలంబెట్టి, ఇప్పుడే కనులు మూయుము. నీలోనున్న ఊపిరిపై నీ మనస్సు నేకాగ్రమొనర్పుము. సర్వావయముల బడలికయు పోవునట్లు సంపూర్తిగా పట్టుసడలించి యుంచుము.

ఇప్పుడు ప్రతి ఉచ్ఛ్వాస నిఃశ్వాసముతోను శాంతిని లోగొనుటను, బైటకంపుటను చేయ నారంభింపుము. భగవంతుని స్వరూప దర్శనము యొక్క నీ నిరంతర స్పృహ అఖండ మెలకువ దానియందు నిలుపకుండా ఒక్క ఉచ్ఛ్వాస నిశ్వాసము కూడా వెడలిపోకుండా, జారిపోకుండా, జాగ్రత్తను వహింతువుగాక! శాంతి నీ జన్మహక్కు, నీ ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసమునందును శాంతిని గుర్తించుటయందే, దానిని నిత్య స్పృహ యందుంచుకొనుట యందే, నీ ఆనందమును, శక్తియు ప్రతిష్టములగును. ఉచ్ఛ్వాసమునందు 'నేను' అను పదమును, నిశ్వాసమునందు 'ఉన్నాను' అను పదమును ఉండియున్నవి. దానియర్థము, వ్యక్తిగతముగ, 'నేనున్నాను' అని యనుటకాదు. మహత్తరమగు విశ్వజనీనమైన 'నేనున్నాను' అను పవిత్రమగు ఉచ్ఛ్వాస నిశ్వాసమే అది. కావున 'నేనున్నాను' అను సత్యము యొక్క ఉద్ఘాటనను ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసము నందును చేయుచుండుట నభ్యసింపుము.

ఇట మహా మహిమవంతమును, శక్తివంతమునగు 'సోఽహం' అను పవిత్ర మంత్ర మిమిడి యున్నది. ఇందే 'ఓం' అను ప్రణవ మంత్రము కూడా ఇమిడి యున్నది. నీ ఉచ్ఛ్వాసములో 'సో' ధ్వనించును. నీ నిశ్వాసములో 'హం' ధ్వనించును. ఈ విశ్వమంతయు నీవు తప్ప ఇతర మేదియు లేదు.

నీవే సజీవమైన ఏకైక సత్యమవుము. ఒకే సత్యమును, ఒకే దైవత్వమును, ఒకే భగవతత్త్వమును గలదు. అదియే నీవు. 'తత్త్వమసి,' ఈ సత్యమును ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసముతో భావనచేయుము. నిశ్చయముగ, నామ రహితమైన ఆ యద్భుత సత్యము, సజీవ దైవత్వము, ఆద్యంతరహితమైన, సర్వ ప్రాణ, జ్యోతిర్ప్రేమమయమై, ఇటనే, ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసమునందే ఉపస్థితమై యున్నది. అవాఙ్మానస గోచరమై, కోటి సూర్యప్రభా భాసమానమై ఒప్పు ఆ మహోన్నత తత్త్వమును వర్ణించుటలో ఈ పరిమితమగు వాక్కుల కింతకంటె నేమి సావకాశమున్నది ?

సత్యమార్గమున ప్రయాణించు ఓ ప్రియ సహ యాత్రార్థీ ! ఈ మహోన్నత భావమును గూర్చి తలపోయునపుడు నీవు - పరిమితుఁడవగు నీవు - నీలోనున్న ఉచ్ఛ్వాస నిశ్వాసములే యనియు, నిస్తరంగ గాంభీర్యముతో వెలుగొందు ఆ అనంత సాగరమున, - వాయు సంచలనమే లేని ఆ మహా సమాధ్యవస్థలో - శాశ్వతమై, నిరవధికమైన ఆ మహదానందమునందు నీదగు ఉచ్ఛ్వాస నిశ్వాస మొక బుద్బుదప్రాయమని ఊహింపను, భావింపను ప్రయత్నింపుము. బాహ్య విషయములన్నింటిని మరచి, ఇతరమైన అన్ని సంకల్పములను విడచి, నీ ఉచ్ఛ్వాస నిశ్వాసమునే అనుసరించి ముందునకుఁ బొమ్ము నెమ్మదిగ. తొట్రుపాటు లేకుండ మౌనముగ నిర్విఘ్నముగ, నీ ఉచ్ఛ్వాస నిఃశ్వాసము - బహు సంకుచితమైన బుద్బుదము - నిర్వ్యాకులమైన సమాధ్యవస్థలో - నిస్తరంగమైన మహా సముద్రములో - లీనమగును. పరిమితమైన మనస్సు అపరిమితమైన మనస్సునందైక్యమగును. జీవాత్మ పరమాత్మతో కలియును. అవగాహన కందరాని పరమశాంతి ఇప్పుడే - ఇక్కడనే - పొందఁబడుచున్నది.

అద్భుతాన్వితమగు మహా మహిమ ! అనిర్వాచ్యమగు ఆనందము అంతర్నిహితమైన మౌనము !

7. వాయుబంధనమునందీశ్వరుడు :- ప్రేమాస్పదుఁడవగునో ప్రియపాఠకా ! నీ వింతవరకు చెప్పినది గ్రహించి, శబ్దమున, దృక్కున, స్పర్శమున, చలనమున, సంకల్పమున, ఉచ్ఛ్వాస నిఃశ్వాసమున భగవంతుని ఉనికిని అనుభూత మొనర్చుకొననభ్యసించితివేని నీ కితరమేమియు నవసరముండదు. నీకే గ్రంథపఠనమునకు అగత్యము లేదు. నీవిప్పుడు స్వయం ప్రకాశమానమైన దైవీతత్త్వములో - సర్వాంతర్వ్యాపకుడై అధిష్ఠించియున్న ఈశ్వరమూర్తియందు నిజముగా మునిఁగి, దానిచే సర్వత్రా ఆవరింపఁబడి యున్నావు. నీవు దానితోఁ పూర్తిగా నిండియున్నావు. దానిచే లెస్సగా నాన్పఁబడి దానితో సంపూర్ణముగ విలీనుఁడవై యున్నావు. నీ మనో, హృద, యాత్మల యావద్బలమును వినియోగించి, ఏ ఒక్క ఉచ్ఛ్వాస నిఃశ్వాసమును జారిపోకుండా, అట్లు జారిపోవుటచే ఆ సజీవ సాక్షాత్కారమునెడ విస్మృతియు, తూష్ణీభావమును కలుగకుండ ఏకాగ్రబుద్ధి ఉచ్ఛ్వాస నిఃశ్వాసము ననుసరించి మాత్రము పొమ్ము. నీ విప్పుడు ఈ సందేశ పఠనమునందు నిమగ్నుడవై యున్నప్పుడు సైతము ఈశ్వరుని సర్వాంతర్యామిత్వము సర్వ శక్తి మంతత్వము, సర్వజ్ఞత్వములలో మధ్యస్థుఁడవై సుస్థిరముగ గూర్చొని యున్నావు. ఈశ్వర సామ్రాజ్యము నీ లోపలను సర్వత్రా నీ వెలుపలను వ్యాపించి యున్నది. ఏ భగవంతుని దర్శనాకాంక్షతో తీవ్రాన్వేషణ మొనర్చుచు కొండలలో, గుహాలలో, దేవాలయములలో, ఘాదరీగుళ్ళలో, మునుల ఆశ్రమములలో, ఋషివాటికలలో, తిరుగుచుంటిమో గురువులను, మహాత్ములను సేవింపుచుంటిమో ఆ దివ్యుఁడు ఎట్టకేలకు మన నేత్ర ద్వయములందే మెరయుచు, మన హృదయ గోళములందే స్పందించుచు, మన ఉచ్ఛ్వాస నిఃశ్వాసమునందే ఊపిరికి ఊపిరియై ప్రసరించుచు, మనయందంతర్హితమై యున్న విస్తరంగ సమాధిస్థితియందును వెలయుచు ఉన్న సత్యము ననుభూతమొనర్చు కొనుటెంత మహదానందమో, ఎంత దృఢ నిశ్చయదాయకమో గదా! ఆహా ! ఎంత అద్భుతాన్వితము ! ఎంత అద్భుతాన్వితము !! ఎంత అద్భుతాన్వితము !!

ప్రియ మిత్రమా ! ప్రపంచముననున్న అన్ని పవిత్ర గ్రంధములను, అన్ని అమరగానములను, భగవంతుని నిరతిశయ వైభవమును, సౌందర్యమును చిత్రింపనోడును. అంతర్వ్యాప్తుడైయున్న భగవన్మూర్తి యొక్క అనుభూతినంది జాగృతియందాతని దర్శించి మౌనమున ఆనందము ననుభవించుచు, నీ మనోవాక్కాయ కర్మల ద్వారా దానిని వ్యక్తీకరించుపని నీకు స్వయముగనే సాధ్యము శాంతిరూపక బ్రహ్మరసముతో నిండిన గిన్నెను దృఢముగ గైకొని అమృతత్త్వమును ప్రసాదించు ఆ సుధను గ్రోలి నీయంత నీకును, నీ ప్రేమాస్పదులకును, ఆప్తులకును, వేయేల-సర్వ మానవులకును, వరప్రసాదుఁడవు కాగల్గు మహోతరుణము నీకిదియే.

ముగింపులో, నాతో మీరును గాఢధ్యానమునఁ జేరుఁడని కోరుచున్నాను. అందు మనము శబ్దములో, (దృక్కులో, స్పర్శలో, చలనములో, సంకల్పములో) ఉచ్ఛ్వాస నిశ్వాసములో భగవంతుని ఉనికిని గుర్తెరుంగుట నభ్యసించుచుండిన అదియే వాయుబంధనస్థితికి - నిస్తరంగ శాంతస్థితికి, సమాధ్యవస్థకు మనల సహజముగ గొంపోవునని తెలియగలదు. అమూల్యమైన మానవజన్మకదియే పరమగమ్యము. ఆ బ్రహ్మానందము మధ్య మనమెల్లప్పుడును నివసింతుముగాక! లోపలను, వెలుపలను, పైనను, క్రిందను; అన్నివైపులను, ఇప్పుడును, సర్వకాలములందును ఆ దివ్య తేజస్సున కభిముఖులమై యుందుముగాక, ఇదియే మీ నిజసోదరుడను, మీ శ్రేయోభిలాషివి అగు నేను చేయు ప్రార్థనము.

సర్వులకు శాంత్యనుభూతి కలుగుగాక !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# ప్రేమయే దైవము

(మొదటి భాగము)

ప్రేమ స్వరూపులారా ! నేడు ప్రేమయే దైవ మనెడి విషయమును గురించి ప్రసంగించుటకు అభిలాషించుచుంటిని. ఆహా ! ప్రేమ యెంత మాధుర్యమైన మాట ! ప్రేమ నెరుంగనివా రుందురా ? ప్రేమ కోరనివా రుందురా ? ప్రేమ అవసరము లేనివా రుందురా ? మనమందరము ప్రేమ నుండియే జన్మించితిమి. ప్రేమలోనే జీవించుచుంటిమి. తుదకు ప్రేమలోనే లీనమై తీరెదము. పసిపాప మొదలు ముదుసలి వరకు ప్రేమయే కావలెను. జ్ఞానికైనను, అజ్ఞానికైనను ప్రేమయే ఆధారము. మూర్ఖునికైనను, తత్త్వవేత్తకైనను ప్రేమయే ఆధారము. నిరుపేదకైనను, ధనవంతునికైనను ప్రేమయే ప్రాణము. ప్రేమలేని జీవితము వ్యర్థము. ప్రేమలేని జీవితము నిస్సారము. ప్రేమలేని జీవితము శూన్యము, రసములేని చెఱకు యెందుకైనను పనికి వచ్చునా ? అది వట్టి పిప్పియే కదా ? ప్రేమ రహితములైన జీవితములు చెఱుకు పిప్పి వంటివి. పంచదారకు తీయదనమునకును ఉప్పునకును ఉప్పదనమునకును నెట్టి అవినాభావ సంబంధమున్నదో, అటులనే జీవితమునకును ప్రేమకును అంతటి సమీప సంబంధమున్నది. అంతియే కాదు – ఐక్య సంబంధమున్నది. జీవము లేని శరీరమెట్లు మనుష్యు డనిపించుకొనదో, అటులనే ప్రేమలేని జీవిని మనిషి అని చెప్పుటకు వీలు లేదు. ప్రేమ, దివ్య ప్రేమ అందరకును అవసరమైయున్నది. అన్ని మతములవారికిని అవసరమై యున్నది. అన్ని దేశముల వారికిని అవసరమై యున్నది. మానవ కోటికంతకును అవసరమై యున్నది. ప్రతి జీవికి అవసరమై యున్నది. ప్రకృతి అంతకు అవసరమై యున్నది. చివరకు అణువునకు మరియొక అణువునకు గూడ ప్రేమయే సంయోగమునకు ఆధారము. "ప్రేమ నాకు అవసరము లేద" ని యెవ్వరు చెప్పగలరు ? "ప్రేమ లేకుండ నేను జీవించగలను" అని యెవ్వరు చెప్పగలరు

? ఎంతటి ధనమదాంధులకైనను, రాజాధిరాజులకైనను, మహాచక్రవర్తులకైనను ప్రేమయే ముఖ్యావసరము కదా? మాకు లక్షల కొలది సేవకులున్నారు, ప్రేమ అవసరము లేదని చెప్పగలరా? ప్రేమచేతనే వారి రాజ్యపాలన నిలచియున్నది. అటులనే యెంతటి గొప్ప ఉద్యోగస్థుడైనను, ధనవంతుడైనను నాకు వందలాదిగ సేవకులున్నారు, నాకు ప్రేమ అవసరములేదని విర్రవీగనవసరము లేదు. సత్యమునుండి చూచినచో వారి పనులన్నియు ప్రేమ చేతనే జయప్రదముగా జరుపబడుచున్నవని తెలియగలదు !

ఐనను ఈ ప్రేమను ప్రత్యక్షముగ అనుభవమున బోధపరచుకొన్నవారు, చాలా అరుదై యున్నారు. ఈ ప్రేమ అందరి జన్మహక్కు అయియున్నను, అందరకు ఆధారముగా నున్నను, ప్రేమ యొక్క పూర్ణస్థితిని యెరింగిన వారెచ్చటనోగాని లేరని చెప్పుటకు చాల సిగ్గగుచున్నది. ప్రేమ - ప్రేమ అని అరచుచుంటిమి గాని, నిజముగా ప్రేమ అనగా మనకేమి తెలియును ? ప్రేమను గురించి చెప్పుమని యెవ్వరైన అడిగిన సంస్కృత పండితులైనచో రెండు శ్లోకములు వేదములలో వర్ణించినవి చెప్పెదరు. భారతము, రామాయణములను జదివి యున్నచో ప్రేమను గురించి కొన్ని పద్యములను ఏకరువు పెట్టెదరు లేక ప్రేమతో నిండియున్న ప్రహ్లాదాది భక్తుల కథలను చెప్పెదరు. ఇదియేనా ప్రేమ ? నిజమైన ప్రేమలో మాట్లాడఁగలమా ? అచ్చట చెప్పుటకు హక్కుగలదా; రెండు ఉపన్యాసములు విన్నంత మాత్రముననే మనము ప్రేమను బోధ పరచుకొన్న వారమైతిమా? ఎచ్చటనైనను, ఉపదేశమైనంతనే మనకు ప్రేమ తత్త్వము లభ్యమగునా ? బాకాల వలె హెచ్చుగా చప్పుడు జేసెడి ఈ మహానుభావులెవ్వరికిని ప్రేమ తత్త్వము అనుభవము తెలియదు. నిండుకుండవలె తొణకఁకుండా, పూర్ణశాంతితో నిండి, వాక్కులకు అతీతులై వెలుంగుచున్న వారే ప్రేమస్వరూపులు. వారు ప్రేమ నెరుంగుదురని జెప్పుట గూడ తప్పే యగును ! వారే ప్రేమ స్వరూపులు. ప్రేమ యొక్క పూర్ణ మహత్త్వము అవతారపురుషులైన శ్రీకృష్ణ భగవానునికి తెలియవలెను. శ్రీరామచంద్రునికి

తెలియవలెను. లోకగురువు అనదగిన బుద్ధ భగవానునికి తెలియవలెను ! ప్రేమ స్వరూపుడైన క్రీస్తు ప్రభువునకు ప్రేమ తత్త్వము తెలిసియుండవలెను ! సర్వమత సారమును గ్రహించిన శ్రీరామకృష్ణ పరమహంస దేవునకు తెలియవలెను. అశరీరిగా జీవించిన శ్రీరామ తీర్థునికి తెలిసియుండవలెను. అంతియేగాని, ప్రేమ ప్రేమ అని పలుకుచుండు వారందరు, ప్రేమను గ్రహించిరని చెప్పుట హాస్యాస్పదము. ప్రేమ ప్రేమ అని అరచినంత మాత్రముననే ప్రేమ తెలియునా ? అన్నము అనినంత మాత్రముననే ఆకలి తీరునా ? దీపము దీపము అనినంత మాత్రమున చీకటి పోయి వెలుగు వచ్చునా ? ఆకలి తీరుటకై అన్నము తినవలెను. చీకటి పోవుటకై దీపము వెలిగించవలెను. ప్రేమను బోధపరచుకొనుటకై ప్రేమ స్వరూపముగా జీవించవలెను.

"ప్రేమ" అనెడు ఈ రెండు చిన్న అక్షరములలో నెంత మహాత్మ్య మున్నది? ఈ చిన్న మాటలో నెంత గూఢార్థమున్నది ? దీనిలో నెంత అనుభవమున్నది? ప్రేమ అనెడి ఈ రెండు పవిత్రాక్షరములు భూలోకమును, స్వర్గలోకమును ఆవరించుచున్నవి గదా ! ప్రేమ అని యుచ్చరించినంత మాత్రముననే, అణువు మొదలు బ్రహ్మాండము వరకు ప్రేమ పొర్లిపారుచున్నది గదా ! ప్రేమయే నిత్యానిత్యములను, జడాజడములను తనలో ఇముడ్చుకొనుచున్నది ! "ప్రేమ" యే జీవాత్మ పరమాత్మలకు ఐక్యసంధానము గల్గించుచున్నవి. ప్రేమయే సోఽహం మంత్రమునకు ఆధారమై యున్నది. ప్రేమయే ప్రణవమునకు గమ్యస్థానమైయున్నది. ప్రేమ అని యుచ్చరించినంత మాత్రముననే శరీర జ్ఞప్తి గలిగియున్నవాడు ఇంకను ప్రేమను తెలిసికొనలేదు. ప్రేమను స్మరించుచు, ఇంకను నామరూపములను జూచెడువాడు, ప్రేమయన్ననేమో యెరుంగడు. ప్రేమ, నిజమైన ప్రేమ మన నిత్య స్వరూపమేగదా ! ప్రేమ, శాశ్వతమైన ప్రేమ, నామరూప రహితమైనది కదా ! ప్రేమ, శాంతి నొసంగెడి ప్రేమ, అద్వితీయమైనది గదా ! ప్రేమ, ఆనందము నిచ్చెడి ప్రేమ, అఖండమైనది గదా ! పరిపూర్ణమైన ప్రేమ సర్వత్రా నిండియున్నది గదా ! శుద్ధమైన ప్రేమ,

సర్వమునకు ఆధారమైయున్నది కదా ! ఇట్టి ప్రేమను స్మరించినంత మాత్రముననే మనము ప్రేమలో లీనమౌచుంటిమి. ప్రేమయే మనమై పోవుచుంటిమి. ప్రేమ నెప్పుడు రెండుగా చేయజాలము, విభజించజాలము, చీల్చజాలము - ఖండించజాలము. అద్వితీయమై వెలుగుచున్న ప్రేమ ద్వితీయమెట్లు కాగలదు ? అఖండమై ప్రకాశించుచున్న ప్రేమ ఖండముగా నెట్లు కాగలదు ? ఆహా ఈ ప్రేమను నేత్రములు చూడజాలవు. కర్ణములు వినజాలవు. నాసికము వాసన చూడజాలదు. రసన రుచి చూడనేరదు, స్పర్శ జ్ఞానమునకది లభ్యముకాదు. పోనిండు, మనస్సైనను గ్రహించగలదా? ఎన్నటికిని గ్రహించజాలదు. అట్టి శక్తి దానికి లేదు. ఖండమైన, చంచలమైన మనస్సు అఖండమైన స్థిరమైన ప్రేమను ఎట్లు తెలిసికొనగలదు? మిణుగురు పురుగు సూర్యుని యొక్క ప్రకాశమును కనిపెట్టగలదా ? నీటిబుడగ సముద్రముయొక్క లోతు గ్రహించగలదా ? ఎన్నటికిని అటుల గ్రహించజాలదు. కాని నీటిబుడగ సముద్రములో లీనమై సముద్రమేయైనట్లు, కించిజ్ఞత్వముతో గూడియున్న మనస్సు అఖండమైన ప్రేమలో లీనమైనచో, ప్రేమాస్వరూపమై పోవును. అప్పుడు ప్రేమకును దీనికిని భిన్నత్వము లేదు. అప్పుడే ప్రేమయొక్క లోతును గ్రహించగలుగును.

ప్రేమ స్వరూపులుగా వెలుగుచున్నవారికి ధన్యవాదములు. వారి యనుచరులై నడచిన, యెట్టి అధమునకైనను మోక్షము అరచేత నున్నట్లు దొరుకును. ప్రేమస్వరూపులే ఈ మానవకోటి కంతకును ఆదర్శనీయులుగా వెలుగుచున్నారు. అట్టివారి జీవితములే యుత్తమోత్తములైనవి. వారి యొక్క శక్తిచేతనే ఈ ప్రపంచము నడుచుచున్నది. వారి మహిమచేతనే ధర్మము లోకములో వెలుగుచున్నది. వారియొక్క ప్రేమచేతనే ఈ లోకము ప్రేమాంబుధిలో నిరంతర స్నానము సాచరింప గలుగుచున్నది. జీవితములన్న, అట్టివే కదా జీవితములు ? అదృష్టమన్న అట్టివారిదే కదా ? శక్తి అన్న, అట్టి మహనీయులదే గదా ? ఆనందమన్న అట్టి మహాత్సంపన్నులదే గదా ? శాంతి

అన్న అట్టి మహాత్ములదే గదా ? ఇది అది అననేల, సర్వము అట్టి ప్రేమస్వరూపులదే ? ఇదియే ప్రేమ తత్త్వముయొక్క ఔన్నత్యము. ఇచ్చట మతములు లేవు; జాతులు లేవు; కక్షలు లేవు; పోరాటములు లేవు; విభేదములు లేవు – ఇచ్చట రాజులు లేరు; సేవకులు లేరు, ఇచ్చట పేదలు లేరు; ధనికులు లేరు. ఈ పూర్ణమైన ప్రేమ తత్త్వములో గురువులు లేరు. శిష్యులు లేరు. ఇచ్చట బోధచేయువారు లేరు. వినెడివారు లేరు. ఇచ్చట జన్మమృత్యువులు లేవు. ఇచ్చట నక్షత్రములు గాని, చంద్రుడు గాని, చివరకు సూర్యుడైనను ప్రకాశించుట లేదు. మరియెద్ది ప్రకాశించుచున్నది. ప్రేమయే పూర్ణ కళలతో ప్రకాశించుచున్నది. సూర్యునిలో చీకటి లేనట్లుగా ? ప్రేమయే అభిన్నముగా స్వప్రకాశముతో వెలుగుచున్నది. రజ్జువులో, సర్ప భ్రమ లేనట్లుగా ఇచ్చట ప్రేమయే అద్వితీయమై సర్వమునందు వ్యాపించియున్నది. సర్వత్ర నిండియున్న ప్రేమను, అనుభవించుచున్నవారు చాల అరుదుగదా? ఈ పరిపూర్ణమైన ప్రేమ స్మృతిలో జీవించెడివారు చాల తక్కువగదా? ఇట్టి పూర్ణమైన ప్రేమలో జీవించెడివారు శరీరములుండియును, అశరీరులగుచున్నారు. ప్రేమస్వరూపులైన వీరు యెన్ని కర్మలు చేయుచున్నను నిష్కాములుగనే యున్నారు. ఇట్టివారే నిష్కామకర్మలను జేయగలరు ! ఏలనన, వారు కోరుటకు తదితరమేమియు లేదు. సర్వము తామై యుండ మరేమి కోరెదరు? సత్యమైన ప్రేమ నెరుంగనివారు, నిష్కామముగా కర్మజేసిరనిన, హాస్యస్పదముగా నుండును. వారటుల నెన్నటికిని చేయజాలరు, ఏలనన అది ధర్మసూత్రమునకు విరుద్ధముగా నుండును. ఎచ్చటనైతే ఒకరిని ఒకరు చూచుచున్నారో, ఒకరిని ఒకరు తాకుచున్నారో అచ్చట అజ్ఞానమే యున్నది. అచ్చట భ్రాంతియే యున్నది ! అజ్ఞానములో నిష్కామకర్మ యెటుల సాధ్యమగును ? పూర్ణ ప్రేమలో అన్ననో, అచ్చటచూచుట కితర మేమియు లేదు. వినుటకును, తాకుటకు నితరమేమియు లేదు. కోరుటకు పొందుటకు నేమియు లేదు, వినెడిదంతయు, జూచెడిదంతయు, తాకెడి దంతయు ప్రేమయే; అంతర్యమున ప్రేమ !

బాహ్యమున ప్రేమ ! సమీపములో ప్రేమ, దూరములో ప్రేమ, దిశలలో ప్రేమ, దిగంతములలో ప్రేమ, భూతభవిష్యద్వర్తమాన కాలములలో ప్రేమ ! జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలలో ప్రేమ ! దేశకాల నిమిత్తములలో ప్రేమ ! పంచభూతములలో ప్రేమ ! ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులలో ప్రేమ ! అన్నమయ ప్రాణమయ మనోమయ ఆనందమయ విజ్ఞానమయ కోశములలో ప్రేమ ! కర్మేంద్రియములలో ప్రేమ ! జ్ఞానేంద్రియములలో ప్రేమ ! మనోబుద్ధి చిత్తాహంకారములలో ప్రేమ ! ఎందుజూచిన ఎచ్చట జూచినను ఎప్పుడు జూచినను సర్వము ప్రేమయే. అట్టి అనంతమైన ప్రేమలో, వారిని వారే జూచుచు ఆనందించుచున్నారు. వారి స్వరూపములకు వారే సేవ చేయుచు నిత్యశాంతిని గ్రోలుచున్నారు. ఈ ప్రేమమూర్తుల నెవ్వరు వర్ణించగలరు? మంచు బిందువు సూర్యుని వర్ణించగలదా ? మంచు బిందువు సూర్యరశ్మిచే ఆకర్షింపబడి అందులీనమైనట్లు, వీరి ప్రేమను పూర్ణముగా తెలిసికొనవలసియున్న మనముగూడ వీరిలో లీనము కావలెను.

ఈ యుపన్యాసము ప్రేమయే దైవమని గదా ? ప్రేమ వారిధిలోబడి,దైవమును మరచితినని, మీరు అనుకొనవలదు! ఇంతవరకు, ప్రేమయే దైవమని చెప్పుచుంటిని. ప్రేమను మీరిన దైవము వేరుగా లేదు. ప్రేమయే దైవమన్న మీలో కొందరు "మా గుళ్ళలో దైవము మాటయేమి ?" అనవచ్చును, ప్రియ సోదరులారా, మీరు చాలకాలము నుండి గుళ్ళలో దైవములను పూజించుచున్నారు. ఇంకను దైవమును ఱాతి విగ్రహములకే కట్టిపెట్టి, గుళ్ళలోనే పూజించెదరా ? సర్వాంతర్యామియైయున్న దైవమును గొల్వరా ? మరికొందరు, దైవమును మా హృదయములలో కొలుచుచుంటిమని చెప్పవచ్చును. ఇంకను మీకించన్మాత్ర హృదయాంతరాళమున ఆ సర్వాంతర్యామియైన దైవము నెంతకాలము బంధించెదరు ? మీ దైవము బైటను జూడరా ? యెప్పుడును ఓనమాలేనా ? ప్రారంభావస్థలో నేర్చుకొనిన అక్షరములనే చివరవరకును అభ్యసించెదరా ? మీ మనస్సులను

వికసింపజేయరా ? అభివృద్ధి నభిలషించరా ? ప్రేమతత్త్వమును తెలిసికొనరా? మీ గమ్యస్థానమును జేరరా ? ఇంకను దైవమును ఒక్కనామమునకు, ఒక్కరూపమునకు కట్టిపెట్టెదరా? ఇంకను దైవమును అణచిపెట్టెదరా? ప్రాణప్రియులారా ! మేల్కొనుడు ! ఇప్పుడైనను ముకుళిత నేత్రములను వికసింపజేయుడు ! మీలోపలనున్న దైవమునే బైటజూడుడు. మీ హృదయములో వెలుగుచున్న దైవమునే, బాహ్యమున గాంచుడు. మీ గుళ్ళలో పూజించుచున్న దైవమునే, మీ గృహములలో పూజించుడు. ఇంకను నిద్రపోవుట శ్రేయస్కరము కాదు. మీరు అజ్ఞానులై దైవమును బంధించ ప్రయత్నించినను, అతను ఒక్క నామరూపమునకు బంధింపబడడు. మీరు బంధించజాలరు. సర్వసాక్షి స్వరూపముగానున్న దైవమును సర్వములో జూచుటకు ఇంకను మంచిదినములు రాలేదా ! వచ్చినవి – ముమ్మాటికి వచ్చినవి ! మీ గాఢ నిద్ర నుండి యిప్పుడైనను మేల్కొని, దైవమును సర్వములోజూచి ఆనందించుడు. ఇదియే ప్రేమానందము; ఇదియే ప్రేమకు గమ్యస్థానము !

సోదరా ! దైవమును నీవు ప్రేమించుచున్న నీ సతిలో జూచెడి దినములు వచ్చినవి. సోదరీమణీ ! దైవమును నీవు ప్రేమించుచున్న నీ పతిలో దర్శించెడి దినములు వచ్చినవి. మాతృ స్వరూపమా ! దైవమును నీ చిన్న బిడ్డ యొక్క కండ్లలో జూచెడి తరుణము సమీపించినది. పసిబిడ్డా ! దైవమును నీ మాతృ స్వరూపములో దర్శించెడి సమయమే ఇది ! గురూత్తమా ! దైవమును నీ శిష్యునిలో దర్శించెడి దినములు ఇవేసుమీ ! శిష్యా ! దైవమును నీ గురువులోజూచి, పూజించెడి దినములు ఇవే సుమీ. స్నేహితుడా ! దైవమును నీ విరోధులలో జూచెడి అదృష్టదినములు వచ్చినవి. ప్రియుడా ! దైవమును నీ బంధుమిత్రులలో పూజించుము. ఓ ప్రభువా! దైవమును నీ సేవకులలో దర్శించుము. ఓ బ్రాహ్మణోత్తమా ! సర్వమయుడైన దైవమును చండాలురలో గౌరవించుము. ఓ ధనవంతుడైన లుబ్ధుడా ! దైవమును నీవు పీడించుచున్న నిరుపేదలలో పూజించుము. కొలచెదము; కొలచెదము ! సర్వస్వరూపుడైన

దైవమును అన్నివైపుల కొలిచెదము. పూజింతము; పూజింతము ప్రాణప్రియుడైన దైవమును అందరిలో పూజింతము. ధ్యానింతము; ధ్యానింతము, వివిధ రూపములుగా నున్న ఈ ప్రత్యక్ష దైవమును ఒక్కమారు ధ్యానింతము.

## ప్రార్థన

సర్వస్వరూపముగానున్న లోకప్రభో ! ధన్యవాదములు. వివిధ నామరూపములుగా వెలుంగుచున్న లోకగురూ ! నీకు మరల మరల ధన్యవాదములు. పశుపక్షి క్రిమికీటకాది రూపములుగా విలసిల్లుచున్న ఓ లోకపితా ! నీకు తిరిగి తిరిగి ధన్యవాదములు. బంధుమిత్ర రూపములుగానున్న పరమపావనా ! నీకు ధన్యవాదములు. మాతృ స్వరూపముగా, పసిబిడ్డ రూపముగా వెలుంగుచున్న ప్రత్యగాత్మా నీకు నమస్కారములు. గురుశిష్య రూపముగానున్న ఓ పరబ్రహ్మమా ! నీకు వందనములు. ప్రభూ, సేవక రూపముగా విలసిల్లుచున్న విరాట్పురుషా ! నీకు వందనములు. సర్వరూపములలో వెలుంగుచున్న పరమపావనా ! నీకు నమస్కృతులు. ధనవంతుడైన లుబ్ధుని రూపముగానున్న దైవమా నీకు వందనములు. నిరుపేదయైన బానిస రూపముగానున్న కరుణాకరా ! నీకు వందనములు. జడ అజడరూపములుగానున్న ఓ దైవమా ! నీకు వందన శతములు. చేతనాచేతన రూపములుగానున్న ఓ నిత్యస్వరూపమా ! నీకు దండ ప్రణామములు. దిక్కులు, దిగంతములు, తేజస్సు, అగ్ని, వాయువు, జలము, పృథ్వి రూపములుగా నున్న ఓ సర్వస్వరూపా ! నీకు అనంతకోటి సాష్టాంగ నమస్కృతులు. ప్రేమ స్వరూపముగా అందరి హృదయములలో వెలుంగచున్న దయామయా ! నీకు సదా వందనములు.

ఓం తత్సత్

# ప్రేమయే దైవము

(రెండవ భాగము)

ప్రియ మిత్రులారా ! ప్రపంచమంతయు మతములతో నిండి యున్నది. ఈ నాగరికత దినములలో మతములేని దిశయే కనిపించుట లేదు. ప్రతి దేశమున ఏదోయొక మతమున్నది. ప్రతి మనుజుడు ఏదోయొక మతమునకు జెందియున్నాడు. అన్నియు మతములే ! ఎచ్చట జూచినను మతములే ! ఇంకను మతములు లెక్కకు మిక్కుటముగా దిన దినము పెరిగిపోవుచున్నవి.

అన్ని మతములకును ప్రేమయే గమ్యస్థానము. ఏ మతమునకైనను ఆధారము ప్రేమ యొక్కటే ఎట్టి మతమైనను ప్రేమనే ఆదర్శముగా నుంచుకొనుచున్నది. ప్రేమలేని మతము మతమే కాజాలదు. ప్రేమలేని మతము లేనేలేదు ! అయినచో ఈ మతములన్నియు ప్రేమ మార్గముననే నడచుచున్నవా ? ఈ మత కర్తలందరను, ఈ వివిధ మతాంతరులందఱును, ప్రేమ మార్గముననే నడచుచున్నారా ? అని మనము వారిని ప్రశ్నించిన 'అవును' అనియే సమాధానమొసంగినను, మనము వారి నడతను బట్టియు ప్రస్తుత లోకస్థితిని బట్టియు నూహించవలసి యున్నది. ఒక్కొక్క మతమును అథవా, ముఖ్యమైన వానినైనను తీసికొని అవి ఆచరణయందెటులున్నవో గమనింతము. మొదట లోకమంతయు పరివ్యాప్తమైయున్న క్రిష్టియను మతమును తీసికొందము. మత స్థాపకుడైన క్రీస్తు ప్రేమ స్వరూపుడైనను ఆయన అనుచరుల ఆచరణ జూచినచో ప్రేమకును వారి ఆచరణమునకును చాల దూరమున్నట్లు కనిపించుచున్నది. పలుకునకు మాత్రము వా రెలుగెత్తి **"God is Love"** "దైవమే ప్రేమ" అని చెప్పుచుందురు. కాని ఇతర మతస్థులను నిరసన భావమున గాంచుచు తాము తప్ప ఇతరులందఱు **(Heathens)** అడవి మనుష్యులని భావింతురు. ఇతరుల దైవములను శాస్త్రములను నిందించు చుందురు. వారు చెప్పెడి మొదటి బోధ "నీ శాస్త్రములు అబద్ధములు. నీ

దైవము దొంగ, నీ తల్లిదండ్రులు మూర్ఖులు, మా మతమే మహోత్కృష్టమైనది. మా దైవమే మహానుభావుడు. అతడొక్కడే దైవము కొమారుడు. మానవ నాగరికతయే లోకమంతటికి ఆదర్శప్రాయమైనది." అని కూపస్థమండూకము వలె తమ మతమును మీరిన దెద్దియు ఈ లోకములో లేదని వాదించుచుందురు. ఇదియేనా క్రీస్తుని ప్రేమ మతము ? కాదు. ముమ్మాటికిని కాజాలదు. ఇది సైతాను మతమై యుండవలెను. ఎచ్చట భేదబుద్ధి యున్నదో, ఎందు ద్వేష భావము కలదో అచట పిశాచత్వము మాత్రమే యుండును.

ఇక మహమ్మదీయ మతము విమర్శనా దృష్టితో పరికింతము. వీరు కూడ ప్రేమను బోధించిన మహాత్ముడైన మహమ్మదుయొక్క శిష్యులై యుండియు వారి మతమే అన్ని మతములలో గొప్పదని అహంభావ ప్రేరితులై చెప్పుచుందురు. ఇంతియే కాదు. వారి మతమున చేరని వారికందరికిని నరకమే శరణ్యమని విశ్వసించెదరు. ఇంతటితో సరియా ? ఇతర మతస్థులను కాపరు లనుచు వారిని వధించిన తమకు స్వర్గము వచ్చునని నిరాధారులైన జనులను చిత్రవధ జేయుచుందురు. ఇదియేనా ప్రేమ మతము ? ప్రేమ ప్రేమ అని సమాజములో పలుకుచున్న మతము ఎన్ని ఘోరహత్యలు ఆచరణలోనికి దెచ్చుచున్నది ? ఆహా ! ప్రేమ మాట అటుండ మతము యొక్క పేరున యెన్ని హత్యలు దురంతములు పాపములు నెరపబడుచున్నవి. ఎన్ని హత్యలు, పాపములు జేయుచున్నను వీరందరును ప్రేమ మార్గమున నడచుచున్నామని విర్రవీగుట విచిత్రము ! ఇతర మతస్థులనే విమర్శించుటెందులకు ? ఇతర మతస్థుల తప్పులనే పట్టనేల ? మన మతమునే మొదట విమర్శించుకొందము. మన నేత్రములలోని దూలములను తీసుకొని తర్వాతనే ఇతరుల కన్నులలోని నలుసులను వెదుకుటకు ప్రారంభించెదము. లోక ప్రసిద్ధమైన, ప్రాచీనమైన, సనాతనమైన, హిందూ మతమునకు చెందియుండియు, ఇంకను వాడు వీడు అనెడి భేదబుద్ధి గల్గిన వాడు లోక కంటకుడు గదా! ప్రేమయే ప్రారంభముననను మధ్యను అంత్యముననను ఆదర్శముగా జేసికొని యున్న మహోన్నతమైన హిందూ

మతమున జన్మించుటయు ఇంకను భేదభావములతో నిండియుండుట, ప్రేమ కంటె భిన్నమైన వానిని గాంచుట, హిందూ మతమునకే కళంకము కదా ! ప్రేమపూరితమైన భారతమాత గర్భమున జన్మించియు ప్రేమ స్వరూపుడై సర్వస్వరూపములతో సమభావమున జీవించక అంటరాని చండాలుడా అన్నట్లు తన చుట్టును కంచెయో, గోడయో కట్టుకొని తదితరుల కంటె తాను గొప్పవాడనని తలంచుట అజ్ఞానము కాదా ? సర్వము బ్రహ్మమయమై ప్రకాశించుచుండ ఈ కక్షలేల ? ఈ పోరాటములెందుకు ? ఈ యీర్ష్యలేల? ఈ అహంభావ మెందుకు ? పరమాత్మలో, బ్రహ్మలో ఈ అంటరానితనము లేల? ఆహా ! కలి మహాత్మ్యమా అన్నట్లు చిన్నచిన్న గ్రామములలో సయితము ఒకే దైవప్రేమ గానరాకున్నది. అన్నియు పార్టీలే, అన్నియు కక్షలే. అన్నియు భేదములే, సత్యవాదులు కొందరు, అసత్యవాదులు, స్వరాజ్యవాదులు మరికొందరు. నిత్యవాదులు కొందరు, అనిత్యవాదులు కొందరు. స్వతంత్రవాదులు కొందరు – అస్వతంత్రవాదులు మరికొందరు ప్రభుపక్షము వారు కొందరు, దేశద్రోహులు మరికొందరు. ఇటులనే పరమపావనమైన హిందూ మతమంతయు ఖండఖండములుగా చీల్చబడి యుండుట చాల విచారకరమైన విషయము. అకటా ! దేశమంతయు ప్రేమస్వరూపులతో నిండియుండుటకు బదులు దేహాభిమానులతో నిండిపోయినది. వీరందరు హిందూ మతస్థులే ! అయినను వీరిలో నెవ్వరినైన "నీవు హిందువు కాదు" అన్నచో యెంతయైన ఆగ్రహము వచ్చి యెదుట వారిని నిందించెదరే కాని అట్టివారు హిందువులగుదురో కాదో వారి అంతరాత్మయే సాక్షి ! ప్రేమను తప్ప అన్యమును గాంచెడి యాతడు నిజమైన హిందువు కానేరడు. పవిత్రమైన ప్రతి హిందువు యొక్క పనులలోను, ఆలోచనలోనేగాక తుదకు రక్తనాళములలో గూడ ప్రేమయే ప్రవహించుచుండవలెను. ప్రేమైక మూర్తులై జీవితములను ప్రేమ వాహినులుగా జేసికొనిన వారే నిజమైన హిందువు లనబడుదురు.

ప్రియస్వరూపములారా ! లోకమంతయు అజ్ఞానులే అనియు,

డాంబికులే అనియు నేను చెప్పుటలేదు. అన్ని మతములలోను అన్ని దేశములలోను ప్రేమను వర్షించుచున్న మహాపురుషులు అచ్చటచ్చట నుండియే యున్నారు. కాని మొత్తము మీద ప్రస్తుత లోకస్థితిని గురించి చెప్పవలసి యున్నది. నిజస్థితిని దాచరాదు. ఎటులున్న దానిని అట్లు తెలిసికొనుట చాల ముఖ్యము. లోకమంతయు కుక్క గొడుగులవలె వివిధ మతములతో నిండిపోవుటకంటె ఒక్క ప్రేమ మతమే వ్యాపించియున్నచో ఈ ఘోర యుద్ధములు, పోరాటములు, కోట్లకొలది అమాయకులైన జనులు ప్రాణములు గోల్పోవుట, రక్తము ధారలుగా ప్రవహించుట, వేలకొలది కుటుంబీకులు నిరాధారులై పోవుట మొదలగు అవస్థలన్నియు నుండవు కదా? అన్ని మతములవారు ప్రేమ మతముననే నడచుచున్నచో నొకమతమువారు మరియొక మతమువారిని దూషించుట, అందులో వారినిందులోను, ఇందులో వారినందులోను, తమ తమ బాహ్య మతములలో కలుపుకొనెడి ప్రయత్నము లేమియు అవసరములుండవుకదా ! అన్ని మతములు ప్రేమతో నిండియుండ యేమతమైననేమి? తాను జన్మించిన మతములో పొందజాలని ప్రేమను అన్యమతములో పొందగలడా ! ఈ బాహ్య మతములే అన్ని అవస్థలకు అన్ని పోరాటములకు అన్ని అజ్ఞానములకు అన్ని పాపములకు అన్ని దురంతములకు కారణములై యున్నవి. ఇంకను మతములను బట్టుకొని యెన్నినాళ్ళు వ్రేలాడుట? మతమనెడిది ఏమతమైనను నొక దుస్తువంటిది. మతమునకు ఆధారమైన ప్రేమను మరచి ఈ వస్త్రమునే పట్టుకొని వ్రేలాడుటయా ? మనుష్యుని హత్యజేయుచుండ వస్త్ర మెందులకు? మతమనెడి మనకు దైవ మార్గమును జూపుట కొక మైలురాయి వంటిదని జెప్పవచ్చును. ప్రేమ మార్గమున నడచుటమాని మైలురాయినే పట్టుకొని మీద వేసికొని మతము పేరు మీదనే నశించెదమా? ప్రేమతో నిండియున్నప్పుడే మనలను మతము దైవముతో ఐక్యసంధాన మొనర్చుచున్నది.

ప్రేమయే దైవమైయున్న మతములో నొకరికొకరు హాని

కలుగజేసికొనజాలరు. సర్వము ప్రేమమయమేయై యున్నందున యెవ్వరికి హాని గల్గించినను ప్రేమస్వరూపమునకే, ఆ హాని కలుగుచున్నది. కాని తమకు తామే హాని కల్గించుకొనుచున్న వారగుచున్నారు. ఈ లోకములో నెంతటి అనుభవజ్ఞులైనను తమకు తామే జీవించజాలరు. తెలిసియున్నను తెలియకున్నను తమ జీవితము ఇతర జీవితము లన్నింటితోడను బంధింపబడి యున్నది. ప్రేమ, ఆ దివ్య ప్రేమ యొక్కటియే లోకమంతయు వ్యాపించుచున్నది. అజ్ఞాన జీవితమైన, ఆ అజ్ఞానమే, లోకమును ఆవరించుచున్నది. మన ఆలోచనలవల్ల ఉపకారము, అపకారము గూడ నితరులకు చేయగలము. మంచి ఆలోచనలతో నిండియున్నచో నితరులకు ఆ మంచియే చేరుచున్నది. మనము గూడ ఇంకను అభివృద్ధి దశకు వచ్చెదము, దురాలోచనల జేసిన అవియే యితరులను పాడుచేయుచున్నవి. మననుండి బయలుదేరెడి దురాలోచనలే కొన్నినాళ్ళకు వృద్ధియై తుదకు మనలనేచేరి మన జీవితములను నాశనము జేయుచున్నవి. చుట్టును కంచెవేసికొని ఎవ్వరును జీవించజాలరు. సంకల్పములకు కంచెలు, గోడలు గూడా దాటగల శక్తి యున్నది. మనస్సునకు ప్రపంచమంతను నొక నిముషములో సంచారము చేసిరాగల మహాశక్తి యున్నది. కాన ప్రేమ మతములో తానెవ్వరికిని హాని గల్గింపజాలడు. అటులనే తానెవ్వరికి ఉపకారము జేసినను ఆ ప్రేమ స్వరూపునికే చేసినట్లగును. అంతియేకాదు తనకు తానే చేసుకొనుచుండెను. ఏలయన తానే ఆ ప్రేమ స్వరూపుడు కనుక ప్రేమ తత్త్వమును గ్రహించినవారు, ప్రేమ సముద్రములో యీదులాడు చుందురు. వారికి కనిపించెడిది, వినిపించెడిది, అంతయు ప్రేమమయమే. ప్రేమ తప్ప యన్యము వారికెచ్చటను యెప్పుడును కానరాదు. నీచాతి నీచులలోను అధమాధములలోను యన్ని నామరూపములలోను వారు ప్రేమస్వరూపుడైన పరమేశ్వరునే దర్శించెదరు. వారి ప్రాణములు తీయుటకు వచ్చినవారిలో సయితము దైవమును తప్ప నన్యమును వారు చూచినచో మరణ బాధకంటె హెచ్చు బాధను పొందెదరు.

ప్రేమస్వరూపుడైన క్రీస్తు శిలువమీద నుంచబడి మేకులు దిగకొట్టబడినను ప్రేమ వాక్యములనే తన జ్ఞానమయమైన పెదవుల నుండి ప్రవహింపజేసెనుగదా ! ప్రేమావతారియైన బుద్ధ భగవానుడొక చిన్న పావురమును యజ్ఞము పేరిట బలి యిచ్చుచుండగా దానిని విడిచి పెట్టుడనియు నద్దాని ప్రాణమునకు బదులు తన ప్రాణము సయితము ఇచ్చెదననియు నుడివియుండెను గదా ! ప్రేమమయుడైన శిబి చక్రవర్తి యొక పావురమును డేగ నుండి రక్షించుటకై పావురము యెత్తు మాంసమును తన శరీరములో కోసి యిచ్చి యుండెనుగదా ! ఇటులనే మన శ్రుతి స్మృతి పురాణములు ప్రేమాధిక్యతను ఎందరో మహానుభావుల జీవితముల నుండి తెలియజేయుచున్నవి. చిన్న చిన్న జీవులను రక్షించుటకై మన ప్రాణములను, రక్త మాంసములను బుద్ధునివలె, శిబిచక్రవర్తివలె, మనము ధారపోయజాలకున్నను అందరియందును సమభావమైన మంచి జాతి మత దేశ వివక్షతలను వదలి, ప్రేమ స్వరూపుడైన ఆ సర్వాంతర్యామియైన దైవమును వివిధ నామరూపములలో మనము చూడజాలనియెడల ఈ జన్మములు నిరర్థకములే గదా !

ప్రేమ మతములో మరియొక గోప్యమైన ధర్మసూత్రము గలదు. ధర్మసూత్రమును యెదిరించి నడచెడి వారెంత బలవంతులైనను, ధనవంతులైనను, విద్యాధికులైనను సరే ప్రత్యక్ష కర్మ ననుభవించకమానరు. అది యెద్దియన ప్రేమను యందరియెడల నన్నింటిలోను సమముగా నుంచవలెను. ఇది కొందరికి కష్టముగా నుండవచ్చునుగాని ఎంత కష్టముగా నున్నను పూర్ణశాంతి కావలసినచో నద్దానిని యాచరణలో పెట్టితీరవలెను. ఆచరణయే లేనివారికి ఇది చాలా సులభముగా నున్నట్లే యుండును. గాని అనుభవమునకు వచ్చుసరికి కష్టసాధ్యముగా నుండును. రావణుని, రాముని యొకేరీతిగా ప్రేమించుట యెటులనని కొందఱు ప్రశ్నింపవచ్చును. యమధర్మరాజును, ధర్మరాజును యొకేరీతిగా ప్రేమించుట యెటులనని ప్రశ్న కలుగవచ్చును. పండితోత్తముని,

చండాలుని యొకే విధమున గౌరవించు టెటులనవచ్చును. మహోజ్ఞానిని, పరమ నీచుని యొకే రీతిగ పూజించు టెటులనని ప్రశ్నరావచ్చును. అవధూతను, త్రాగుబోతును యొకేరీతిగా ప్రేమించుటెటులనని సంశయము కలుగవచ్చును. మన శ్రేయస్సునకై యవసరమైన ప్రాణమునైనను అర్పించి పాటుబడుచున్న మన సతీమణులను లేక మన పుత్రులను మనవలన నుపకారము పొందుచు అపకారమే కలిగించుచున్న మన శత్రువులను సమముగా ప్రేమించుటెటులనని సందేహము జనింపవచ్చును.

ప్రాణప్రియులారా ! యెటులనిన, నేనేమని చెప్పగలను? లెండు అవతారపురుషుడైన ఆ బుద్ధుని దగ్గరకు వెళ్ళి యడుగుదము. లోకగురువైన శ్రీకృష్ణ భగవానుని ప్రశ్నించెదము. ఇంకను సత్యమునకై శరీర ప్రాణములను అర్పించిన మహోపురుషులనందరిని సమముగా ప్రేమించుటెటులనో యడిగి తెలుసుకొందము. వారు చెప్పిన మీకు తెలియగలదేమో కాని నేను చెప్పజాలను. వారు వీరు చెప్పనేల? నేను మాత్రము చెప్పనేల? మన శాస్త్రము లేమి చెప్పుచున్నవి ? మన పురాణములేమని ఘోషించుచున్నవి ? మీరు భగవద్గీత మొదలైన గ్రంథములు పారాయణ జేయునప్పుడు మీ పెదవులేమి యుచ్ఛరించుచున్నవి ? కన్నులను తెరిచిజూడుడు. హృదయములను తెరచి పరీక్షించుకొనుడు. మనస్సులను వికసింపజేసి కనుగొనుడు. ఇంక ఎన్నినాళ్ళు దారి తెన్ను లేకుండగనే నడచెదరు? రాబందులవలె శాస్త్ర వాసన యనెడి, ఆకాశమునకు యెగసి విషయ వాంఛలకై నిరీక్షించుచుందురా ? రామచిలుకలవలె పాడినదేపాట, అరచినదే అరపు అన్నట్లు నిస్సారమైన, అనుభవములో పెట్టజాలని మహావాక్యములను పఠించుచు శాస్త్రములకు గూడ కళంకము తెచ్చిపెట్టెదరా ? మీ కంఠములకు నొప్పి కల్గుటలేదా ? గౌరవించినను, పూజించినను, మరణములోనైనను బ్రతుకులో నయినను సుఖములోనయినను దుఃఖములోనయినను ఉష్ణములోనయినను, శీతలములోనయినను సమముగా నుండవలయుననియే కదా మన

శాస్త్రములన్నియు, వేమన పద్యములు మొదలు వేదముల వరకు శంఖానాదముగా జెప్పుచున్నవి. దూషించెడివారిని, భూషించెడివారిని పండితుని, పామరుని సమముగా జూడ్డుమనియేగదా మనకు మన గురువులు చెప్పుచుండిరి. ఇచ్చట శ్రీకృష్ణ భగవానులు గీతలలో నుడివియున్న వాక్యములను గూడ నొక్కతరి స్మరింతము.

శ్లో॥ విద్యా వినయసమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకేచ పణ్డితాస్సమదర్శినః ॥ (5-18)

తా॥ పండితులు విద్య, వినయముగల బ్రాహ్మణుని, గోవును, ఏనుగును, కుక్కను, చండాలుని సమానముగా జూతురు.

శ్లో॥ ఇహైవతైర్జితస్సర్గో యేషాంసామ్యే స్థితం మనః ।
నిర్దోషం సమం బ్రహ్మ తస్మాద్బ్రహ్మణి తే స్థితా ః ॥ (5-19)

తా॥ ఎవరియొక్క మనస్సు బ్రహ్మ మొదలు స్తంబపర్యంతముగాగల వస్తువులన్నియు భగవత్స్వరూపులేయను విషయమందు స్థిరముగా నిలుచునో, వారలచే నీ శరీరముండునప్పుడే జననమరణ స్వరూపమగు నీ సంసారము జయింపబడినది.

కాన యికనయినను సర్వమును దైవముగా జూచుచు, మన సమ బుద్ధిని ఆచరణలో పెట్టెదము.

ఈ దైవ చట్టమును, ఆచరణలో పెట్టజాలని యెడల మనకు, అనేకమైన యవస్థలు, చింతలు, బాధలు, కష్టములు, తప్పవు. మనకెంత ప్రియమైన వారినైనను, యెంత దగ్గరవారికైన నితరులకంటె హెచ్చుగా లేశమైన ప్రేమించితిమా దైవచట్టము మనమీద తిరుగబడును. ప్రేమ చట్టములను లేశమైన అతిక్రమించితిమా, దాని ఫలము నేడు కాకున్న రేపైనను ఫిరంగి గుండువలె వచ్చి మన హృదయమును ముక్కముక్కలుగా చీల్చివేయును.

దేవతలు, దెయ్యములు, నరులు, నారాయణులు, జ్ఞానులు, అజ్ఞానులు, మూఢులు, శాస్త్రవేత్తలు, ఈ దేశస్థులు, ఆ దేశస్థులు అనక, ఈ మతస్థులు, ఆ మతస్థులు అనక, అందరును ఈ దైవచట్టమునకు ఈ ప్రేమ నిబంధనలకు శిరస్సులను వంచవలసినదే ! ప్రేమ అద్వితీయము – రెండు కానిది. సర్వకాల సర్వావస్థలయందు నొక్కటిగా వెలుంగుచున్నది. కాన దాని నొకటిగానే మనము చూడవలెను. రెండుగా జూడరాదు. వేరుగా జూడరాదు. హెచ్చుతగ్గులుగా జూడరాదు. అందరిలో దానినే సదా చూడవలెను. మన నేత్రములకు ప్రేమ తప్ప యన్యము యెన్నడును గోచరించకూడదు. ఇదియే ప్రేమ నిలయము. ఇదియే ముక్తికి మార్గము. ఇదియే శాంతకి దగ్గిర త్రోవ. ఇదియే నిత్యానందమునకు ప్రత్యక్షమైనబాట. దీనిని వదలిన నరకబాధలు తప్పవు. దీనినుల్లంఘించిన నిత్యమరణము తప్పదు.

ప్రేమ స్వరూపులారా ! ప్రేమయే దైవమనెడి యీ యుపన్యాసము యొక్క రెండవ భాగము కూడ పూర్తిగా వచ్చుచున్నది. ప్రేమ, ప్రేమయని స్మరించుచు ప్రేమలో లీనమగుటతప్ప నే నింకేమియు మీకు జెప్పజాలను. పూర్ణ ప్రేమ, యని యొక్కసారి స్మరింతమా ? విశ్వప్రేమ, విశ్వప్రేమ యని మరియొక్కమారు మననము చేయుదమా? సర్వవ్యాపకమైన ప్రేమయని అఖండమైన ప్రేమయని, మరల మరల స్మరింతుమా ? సర్వస్వరూపములు గానున్న ప్రేమయని సర్వములకు నాధారమైన ప్రేమయని యెలుగెత్తి యనుభవపూర్వకముగా మరల మరల స్మరింతమా ? ప్రేమను వేరు జేసుకొని స్మరించవలదు. ప్రేమస్వరూపులమే మనమని స్మరింతము. ఇచ్చటనే ఒక చిన్న యంశము చెప్పవలసియున్నది. ఇది చిన్న యంశముగాదు. మహోన్నతమైన గొప్ప యంశమే. దీనిని బోధపరచుకొని అనుభవములో నాచరించిన మనము జీవన్ముక్తుల మైనట్లే. ఇక మృత జీవులుగ జీవించనవసరము లేదు. ఆ రహస్యమెద్ది? అది ప్రేమ రహస్యము. అది గోప్యముగా లేదు. తెలిసికొనినవారికి ప్రత్యక్షముగానే యున్నది. ఇంకను

తేటమాటలలో మనము ప్రేమ స్వరూపులుగానె యుండవలెను. గాని యొకదానిని ప్రేమించుట దోషము. ప్రేమించుటే తప్పు, అని నేను చెప్పెడిది మీ చెవులకు కఠోరముగా నుండవచ్చును. తొందర పడకుడు. శాంతముగా వినుడు. ఖండముగా నున్నవారు ఖండ వస్తువులనే ప్రేమించగలరు. ప్రేమ తత్త్వమును తెలియనివారే నామరూప రహితమైన నిత్య ప్రేమను మరచి, నామరూపములను ప్రేమించుదురు. మనమే ప్రేమస్వరూపమై యుండ ఇక దేనిని ప్రేమించెదము ? ప్రేమించుటకు వేరుగా నెద్దియు లేదే ! మనమే సర్వత్రా నిండియున్న ప్రేమస్వరూపులము. ప్రేమ స్వరూపము నుండి, అన్యమైనది యెప్పుడును యెచ్చటను లేదు. సర్వము ప్రేమ స్వరూపములోనే యున్నది. ఈ ప్రపంచమంతయు నీటి బుగ్గవలె మనలోనే యుద్భవించి మనలోనే యుండి మన ప్రేమలోనే చివరకు లీనమగుచున్నది. ఇట్టి యద్వితీయమైన, అఖండమైన ప్రేమ స్వరూపులమై యుండియు ఒక నామమును ఒక వస్తువును ప్రేమించుట దోషము కాదా? కాన మనము ప్రేమించవలదు. ప్రేమస్వరూపులుగానే యుందుము. ఇదంతయు ప్రేమ స్వరూపమే. మన చుట్టును ప్రేమ స్వరూపమే. మనమే సర్వమయమైయున్న ప్రేమ స్వరూపులమని యనుకున్నంతనే ఎంత బలముగాను శక్తివంతముగాను, ఆనందముగాను యుంటిమి. ఈ పూర్ణ ప్రేమను ప్రత్యక్షముగ ననుభవించుచున్నవారి మహత్త్వము నెవ్వరు కొనియాడగలరు ?

కాని మనమన్నియువస్థలలోను నిరంతర మిప్పుడప్పుడనక యెల్లప్పుడును, ఇచ్చటచ్చట యనక ప్రతి తావున అహర్నిశములు ప్రేమ స్వరూపముగానే జీవింతము, సముద్రములో లవణము లీనమయినట్లు మన జీవభ్రాంతులను, ఈ ప్రేమవాహినిలో లీనము జేయుదముగాక !

ఓం శాంతి : శ్శాంతిః శ్శాంతి : హరిః ఓం తత్సత్

# అమృత సందేశము

(మృత అమృత జీవులకు)

ఈ మధ్య నేలనో గాని, నా మనస్సు, జీవించి యున్న వారి శ్రేయస్సును, చనిపోయిన వారి శ్రేయస్సును గూడ కోరుచుండుటచే, యీ లోకములో జీవించి యున్నవారు హెచ్చుమంది గలరా. చనిపోయినవారు హెచ్చుగా ఉందురా, అనెడి సందేహము తరచు ఆంతర్యమున కలుగుచున్నది. దూరదృష్టి లేని మానవుడు బ్రతికి యున్నవారి సంఖ్యయే హెచ్చుగా ఉన్నదని జవాబు చెప్పును. ఏలన ఏవైపు జూచినను బ్రతికి యున్నవారే గాన వచ్చుచుండిరి. ప్రపంచము పుట్టినప్పటి నుండియు చనిపోవుచున్న వారి సంఖ్య లెక్కకు మీరి యుండును గదా అనిన, సమాధానముగా రోజూ పుట్టుచున్న వారి మాట యేమి యను శంక కలగవచ్చును.

ఎటులైనను నా మట్టుకు నేను దీర్ఘముగా విచారణ జేసి, జీవించి యున్నవారి సంఖ్య అతి అల్పమనియు, చనిపోయిన వారే అసంఖ్యాకులుగా ఉండిరనియు నిర్ణయమునకు వచ్చితిని. నా యీ నిర్ణయమునకు మరియొక ప్రబలమైన, యథార్థమైన అంశము నాకు తోడ్పడుచుండెను. అది యెద్ది అనగా, బ్రతికియున్న వారినందరినీ మనము వాస్తవముగా జీవించియున్నవారే నిర్ధారణ జేయుటకు వీలులేదు. ఆత్మ జ్ఞానము గలిగిన మానవుడొక్కడే విశ్వప్రేమతో నిండి జీవించుచుండెను. తక్కిన వారందరు బ్రతికియున్నను చనిపోయినవారితోనె సమము. ఇట్టివారినే జీవన్మృతులు అందురు.

కడుదుర్లభమైన మానవ జన్మను పొందియు, జ్ఞానశూన్యులై ప్రేమయనెడి వాసనయైనను లేకుండ, ఈర్ష్య, అహంకారము, దర్పము, కక్ష, క్రోధము మొదలైన అనేక దుర్గుణములతో నిండియున్న మానవులు బ్రతికి యుండియు, చనిపోయిన వారితోనే సమము గదా? ఇట్టివారందరినీ మనము చనిపోయిన వారితో లెక్కవేసిన, నిజముగ జీవించియున్న మనుజులు, చాల తక్కువగా

ఉందురని వేరుగ చెప్పనవసరము లేదు గదా !

ప్రియమైన పాఠకా ! చనిపోయిన వారియు, బ్రతికియున్న వారియు మాట అటులుంచి నీగతిని, నీ ఆంతర్య హృదయమును నీవు బాగుగ పరీక్షించుకొని, విమర్శ దృష్టితో చూచుకొనుము. నీవు శరీర జ్ఞప్తితో, బ్రతికి యుండియు చనిపోయినట్లు ఉంటివా లేక ఆత్మ జ్ఞప్తితో - విశ్వప్రేమతో నిండి ఆదర్శప్రాయమగు అమూల్యమగు మానవ జీవితము, కాలము వ్యర్థము జేయకుండ జీవించుచుంటివా ?

శ్లో॥ ఆశయా బధ్యతే లోకః కర్మణా బహు చింతయా ।
ఆయుక్షీణం న జానాతి తస్మా జ్జాగ్రత జాగ్రత ॥

తాత్పర్యము :

మలములోని పురుగువలె, బావిలోని కప్పవలె, అంధకారములో అజ్ఞానములో నిన్నగాక మొన్న వచ్చి, రేపో మాపో పోనున్న శరీరమునే శాశ్వతమని భ్రమపడి, నిత్య సుఖము నిచ్చు దానినిగా, నీ సర్వస్వముగా జేసుకొని, జీవించుచుంటివా ? నీ గాఢ నిద్ర నుండి లెమ్ము. శరీర జ్ఞప్తికి స్వస్తి చెప్పుము. నీ స్వస్వరూపమును తెలిసికొనుటకు మేల్కొనుము. అఖండకోటి దివ్య తేజ స్వరూపంబైన నీ దివ్య తేజస్సును వ్యక్తపరచుము. అప్పుడే నీవు చనిపోయిన వారికి, జీవించిన వారికి గూడ నీ ఆదర్శనీయమైన జీవితముచే తోడ్పడ గలవు. మృతాఽమృత జీవులు నీ సేవకై వేచి యుండిరి. మేల్కొని స్వార్థ త్యాగముతో సేవ జేయుట కిదియే సమయము. ఏలనన నేడే మనది, రేపు మనది కాదు గాన, నేడే, ఈ క్షణమునందే నీలో నిద్రపోవుచున్న ఆత్మశక్తిని మేల్కొల్పి నీ స్వస్వరూపానందముతో మానవ సేవను చేయుచు, లోకశాంతికి తోడ్పడెదవుగాక !

మ. నిన్నే యన్నిట నేనరుండు కనునో, నీ ప్రీతికే నిచ్చలున్
బున్నెంబే పురుషుండు సల్పెడినో, నీ మోముం గనుంగంచుఁ దాఁ
దిన్నంగా నెవఁ డాచరించునొ క్రియల్, దేవా ! యతండె భవ
త్సాన్నిధ్యంబున కర్హుఁడౌను; బరమాత్మ; భక్త చింతామణీ !

సర్వములో దైవమును గాంచెడి వారి జీవితములు ధన్యవంతములు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

# ఈ దినములలో నా ధ్యానము

సకల శాస్త్రములు, సద్గ్రంధములు మానవజన్మ లభించుట దుర్లభమనియు, కనుక అది అమూల్యమైనదనియు ఉద్ఘోషించుచున్నవి. అట్టి మానవజన్మను బడసినందులకు అయినను దైవమునకు కృతజ్ఞతాపూర్వక నమోవాకములు అర్పించుట నా కర్తవ్యమై యున్నది. ఈ లోకమున నా యునికి సమర్థించుకొనుటకు నేనొనర్చు ధ్యానకాలమున ఒక్క మానవానీక మునేగాక, యావత్పశుపక్ష్యాదులను, సకల చెట్టుచేమలను, పిపీలికాది బ్రహ్మాపర్యంతము దేనిని విడువక అన్నిటిని వాటి పురోభివృద్ధికై ప్రార్థింపుచుందును.

మానవులనేగాక, సకల పశుపక్ష్యాదులను ప్రేమించువారే నిజముగ వాటి శ్రేయస్సుకు ప్రార్థించువారు అనెడి సూక్తి ఎంత సత్యవంతమైనది ! మన హృదయాంతర వాసియగు నా ప్రభుని నామము కీర్తింపబడుగాక !

గాఢధ్యానపరుడనై యున్న సమయమున కొద్ది పవిత్ర క్షణములు నా శరీరమును, నా యునికిని మరచి, ఈ విశాల ప్రపంచమే నా నిజమైన శరీరముగను, ఇందు నివసించు యావత్ప్రజలు నా అవయవములుగను అనుభవించుచుందును. అందువలన ప్రాగ్దేశీయుని దుఃఖమైనను పశ్చిమ దేశీయుని దుఃఖమైనను అదినాదిగానే భావించి బాధచెందుచు, వారలకు గల్గు ఆనందమును నాకు గానెంచి ఆనందించుటయు జరుగుచుండును. అందరను ప్రేమించి వారి సుఖదుఃఖములలో భాగస్వాములగువారు ఎంత ధన్యులు !

నేటి దినములలో, అందరియొక్కయు, అన్నిటియొక్కయు పురోభి వృద్ధియే నా ధ్యానము, ఎవ్వరిని, చివరకు శత్రువునైనను విడువక, అందరను సమత్వముగా ప్రేమించుటయే నా నిజమైన ధ్యానముగా భావించబడుచున్నది. దైవము సర్వాంతర్యామి. దుర్జనులుగాని, సజ్జనులుగాని, సురూపులుగాని,

కురూపులుగాని, స్వమతస్తులుగాని, లేక అన్యమతస్తులు, లేక నాస్తికులు అయినను అందరు దైవముయొక్క బిడ్డలేగదా ! అందుచేత ఎవ్వరినీ విడువక, అందరను నావారిగనే భావించుచుందును. క్రూరులను, దుష్టులను, బలహీనులను మరియు అజ్ఞానులను జ్ఞానవంతులుగ నొనర్చి వారిని వెలుగుబాటను నడుపవలసి యున్నది. ఇది నిజముగ ఎంతటి కఠినతర కార్యమోగదా! అయినను విశ్వ ప్రేమకు అసాధ్యమైనదేదియును లేదు. వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మార్గముగాన మనము ప్రథమమున ఒక్కరితో ప్రారంభించి, యావత్ప్రపంచ ప్రజలకు శాంతి కల్గునట్లుగా ప్రార్థింతముగాక!

ఎప్పుడు నేను నిమీలితనేత్రుడనై ధ్యానములోనున్నను, కాలిగోరు మొదలు శిరస్సు వరకు, శరీరములోని ప్రత్యణువునందును దివ్యతేజోరూపుడైన ఆ దైవముయొక్క సన్నిధానమునే అనుభవించుచుందును. నేత్రములు తెరచిచూచినచో, నా ఎదుట ఆ ప్రకాశవంతమైన తేజోరూపమే ప్రత్యక్షమై యున్నది. ఆ తేజస్సు సర్వవ్యాపక మగుటచేత, అంతరమున బాహ్యమున పైన, క్రింద, అంతటా నిండియున్న దదియే గదా !

అంతటా, అన్నివైపుల, అందరిలోను ఆ దివ్య తేజస్సే ! ఎంత ఆనందము!

ఈ దినములో తరచు నేను నా సూక్ష్మ దేహమున మనోరూపముతో అనవసరపు హింసాకాండ జరుగుచున్న మనదేశపు సరిహద్దు ప్రాంతముల విహరించుచు, దైవతేజస్సుతో మిత్రులను, శత్రువులను కూడ నింపుటకు ప్రయత్నించుచుందును. మిత్రులతో ఇటుల పల్కుచుందును.

"ఓ మిత్రులారా ! మీకు శాంతి కల్గునుగాక ! దైవము సదా మిమ్ములనందరను కాపాడుగాక ! సకల శోధనలయందును పరీక్షలయందును ఆ ప్రభుని సన్నిహితత్వమును అనుభవింపుడు. ధైర్యసాహసములతో పోరాడు సమయములలోను, కష్టసమయములలోను, దైవము ఎడల గాఢవిశ్వాసము, భక్తి గల్గియుండుడు. అతడొక్కడే బాధ్యతవహించి, మీ యోగక్షేమములు

చూచును, మీ శాంతి సౌఖ్యములను కోరుచు సర్వదా మా ప్రార్థనలు మిమ్ము వెంబడించును."

శత్రువులనుగాంచి వారితో .

"ఏల మమ్ము బాధింతురు ? అఖండాత్మ స్వరూపుని ప్రియమైన బిడ్డల హింసించి, చంపి, దైవమును కించపరుతురు ? కత్తి పట్టువారు, దానివల్లనే మరణింతురు బాహ్యమునకు జయము గల్గినటుల కనిపించినను, ఆగ్రహపరులు, కుత్సితులు, ద్వేషాసూయులు చివరకు నరకమునకే పోవుదురు" అని వచింతురు.

అటుపిదప ప్రాగ్దేశములైన ఆసియా, మలయా, చైనా, జపాను, ఆస్ట్రేలియా ఆదిగాగల అన్నిటిని సామరస్య మొనర్చగల శాంతి ప్రేమలతో నింప యత్నించుదును. అటులనే నేను ధ్యానసమయమున ఆంతర్యమున, బాహ్యమున, ఆ దైవమును అనుభవించుచు సూక్ష్మ దేహమున విహరించుచు రష్యావైపుకు ప్రయాణించుచుందును. రష్యా సర్వాధికారితోను, వారి సహచరులతోను ముఖాముఖిగా ఇటుల ప్రాధేయపడుదును.

మారణ యంత్రములకు, శక్తివంతమైన పరిశోధనలకు మూలాధారమైన, సర్వవ్యాపకుని దయయుంచి గుర్తించుమా ! దైవమును విశ్వసించుచున్ననూ లేకున్ననూ, నాటిన విత్తనములే పంటకు వచ్చుననెడి అకుంఠిత కర్మసూత్రమైన ధర్మచట్టమునకు మాత్రము సర్వులు తమ తలలను ఒంచవలసినదేకదా !

మంచి అధికమంచికిని చేర్చు,
చెడుతనము చేర్చు అధిక చెడుకు,
స్వార్థమెప్పుడును నరకమునకు జేర్చు
స్వర్గధామ మది నిస్వార్థపరులదెగదా !

ఆముదపు విత్తనములు ఎన్నడును గోధుమ పంటను ఇవ్వజాలవు.

అటులనే ఎవరి కుత్రిమము, ద్వేషము వారినే నాశనము చేయును. అందరము శాంతి ప్రేమలతో నింపు ఆలోచనలు గలవారికి, ఆత్మశక్తి, బలము, ధైర్యము, శాంతిసౌఖ్యములు గలుగును. మీ రందరు ఉదాత్త ఆశయములుగల సహృదయులు, ప్రపంచము మీ నుండి అనేక ఘనకార్యములను ఆశించు చున్నది.

అటుల నేను ధ్యానములో యూరపు, జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లాండు దేశములను విహరించుచు దయాదాక్షిణ్యములను, మంచితనమునకు పుట్టినిల్లయిన అమెరికా దేశమునకు జేరి ప్రెసిడెంటును, వారి సహచరులను కలియుదును. అచ్చట ఆనందమయుడగు ఆ ప్రభువు వచించునటుల ఈ క్రింది వాక్యములను విందును.

"ఓ దైవ బిడ్డలారా ! తోటి మానవులయందుగల ప్రేమ కారణమున మీరు నిఃస్వార్థసేవ బాగుగ చేయుచుండిరి. మీ నిఃస్వార్థమయ జీవితములు సకల దేశములకు ఆదర్శవంతమై వెలయుగాక ! మిమ్ము సర్వులును అనుసరింతురుగాక !

"శాంతి సందేశకుల జీవితము లెంత ధన్యవంతములు"!

వ్యక్తులను, సకల సంఘములను మాత్రమేగాక, అణువు మొదలు బ్రహ్మాండము వరకు గల అన్నింటిని ఏ తేజస్సు తనలో ఇముడ్చుకొనుచున్నదో, ఆ తేజస్సుతోనే నేను పరిపూర్ణముగ నింపబడితిని. త్రికాలములయందును పూజనీయమై, సర్వవ్యాపకమై వెలుగొందు ఆ దివ్య తేజస్సే సర్వత్రా నిండియున్నది. అట్టి దివ్యమైన తేజస్వరూపము లేని క్షణము ఎప్పుడైన కలదా? ఇదివరకుగాని, ఇప్పుడుగాని, లేక ఇకముందుగాని, అట్టి తేజస్సు లేని క్షణము ఉండలేదు. ఉండదు. మరియు ఉండబోదు, సదానందము అఖండానందము! దివ్యానందము !

నాస్తికులుగాని, ఆస్తికులుగాని, లేక దైవతేజస్సును నమ్మినవారుగాని, నమ్మకము లేనివారుగాని, ఎవ్వరైననుసరే, అందరూ ఆ సర్వాంతర్యామియగు తేజోరూపముతోనే నింపబడియున్నారు గదా ! నేను ఖండములో అఖండమును అఖండములో ఖండమునుగాంచి ఆనందపరవశుడ నగుదును. అటులనే వ్యష్టిలో సమిష్టిని, సమిష్టిలో వ్యష్టినిగాంచి ఉప్పొంగిపోదును. ఈ సర్వమును ఒకే ఆత్మస్వరూపమైన, సత్యమైన పరబ్రహ్మచే నింపబడినది.

"ఈశావాస్య మిదం సర్వం"

ఏ అఖండ సచ్చిదానంద సాగరమున ఈ సర్వప్రపంచము, ఇందు నివసించు సకలచరాచరములు ఒక బుద్బుదప్రాయమున వెలసియున్నచో, అట్టి సాగరమున, నా ధ్యానకాలములో విహరించుచు ఆ దివ్యతేజోమయమగు దైవమును అనుభవించుచుండుట జరుగును. హిందువులతోను, చైనీయులతోను, రష్యనులు, అమెరికనులు ఆదిగాగల సకల ప్రాక్పశ్చిమ దేశీయులతోగూడిన ఈ ప్రపంచమను బుద్బుదమును అఖండమై, అద్వితీయమై వెలుగొందు ఆ దివ్య తేజోమయునిలో లీనముచేయుటకై ప్రయత్నించుచుందును.

ఇటుల ప్రతి దినము నా ధ్యాన సమయమున ఆ దైవముయొక్క ప్రేమపూరిత తేజోమయజీవితముతో చరాచరములు, సకలదేశీయులను పూర్ణముగ నింపి, నేనును, అమితానందముతో తృప్తితో స్పృహలోనికి వచ్చుచుందును. ఇతరుల శాంతి సౌఖ్యములకు పాటుపడుటలోనే నా శాంతి ఇమిడియున్నది గదా ! ఇతరులను ఆశీర్వదించుటలో నేనుగూడ ఆశీర్వదింప బడుచుంటినిగదా ! దైవవారసత్వము అయిన ఈ మానవ జన్మను పొందినందుకు, ఆ ప్రభుని ప్రతినిధి నగుటవల్లను, మీ శాంతి ప్రేమలను కోరుచూ, అందే నా శాంతి ప్రేమలను గాంచుదును. ఇప్పుడు మనమందరము వేదములయందు వివరింపబడిన శాంతి మంత్రములను పఠింతముగాక !

స్వర్గధామమున శాంతి వెలయుగాక !
ఆకసంబున శాంతి సుస్థిరంబగునుగాక !
జలములందున శాంతి వెలుగుగాక !
పృథ్వియందున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక !

సకల వనమూలికల యందును, వృక్షలతల యందును, చరాచరములందును, శాంతిపదము ప్రవహించుగాక ! సకల గృహములు శాంతితో నింపబడునుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతి ః

# నా పూజా మందిరము

ఈ ఉపన్యాసము "నా" తో ప్రారంభింపబడుట విచారకరము. "నా" తోనే యీ లోకమంతయు నిండియున్నది గదా ! "నా" అన్నను, అహం అన్నను, అహంకారమన్నను ఒక్కటియే "నా" ఉన్నందుననే యీ వ్యాసమిప్పుడు అర్థరాత్రిలో వ్రాయబడుచున్నది. ఎట్టివారికైనను "నా" ను పూర్తిగా వదలిపెట్టుట దుర్లభముగదా ! ఇప్పుడు "నా" ను ఒక్క మూల నుంచి పూజామందిరమును విమర్శింతము. ఈ పూజా మందిరము నాదేనా ? మీది గాదా ? నాకున్నదంతయు మీ అందరిదీ అని తరుచు జెప్పుచుందును. గాని యీ పూజా మందిరమును, నే నిప్పుడు వాడుచుంటినిగాన, నా పూజామందిరమని వ్రాయవలసి వచ్చెను.

దైవము సర్వవ్యాపి, సర్వత్రా నిండియున్నవాడుగాన యీ విశ్వమంతా పూజామందిర మనియే జెప్పవలసి యున్నది. లోకమంతయు ఎటుజూచిన, క్రిందను, మీదను, అన్నివైపులను, అంతయు పూజామందిరమే? నీలగిరిలో, కోటగిరి శాంతి కేంద్రమునందు లక్ష్మీవిహారులో పూజామందిరమున్నదని, మామూలుగా అన్ని ఆశ్రమములో, మఠములలో దైవ విగ్రహములు బొమ్మలు, ఫొటోలతో నున్న పూజా గృహమే అని పాఠకులు స్వభావికముగా తలచెదరు. గాని యీ పూజా గృహమును గురించి విన్నప్పుడు కొందరు పాఠకులకు నిరాశ, ఆశ్చర్యము, గలుగవచ్చును. గదిగుమ్మము మీద **(Puja Mandir)** పూజామందిరమనే వ్రాయబడెను. గది తెరవగనే విశ్వమత చిహ్నము గలదు. **Welcome to Meditate** అని, ఆ చిహ్నము చుట్టును పెద్ద అక్షరములతో స్వాగతము ధ్యానము జేయుటకు రండు, అని వ్రాయబడి యున్నది. అది స్నానముల గది! దానినే పూజా మందిరముగా జేసుకొని, గంటలకొలది పగలు, రాత్రి అనక, నీలగిరి చలికి గూడ లెక్కచేయక, ఆ గదిలో దైవసన్నిధిని అనుభవించుచు కూర్చొని, ధ్యానము జేసుకొను చుందును. అది స్నానముల

జేయు కాలకృత్యములు తీర్చుకొనెడి, ఏకాంతమైన పవిత్రమైన గది గూడను.

నేను కూర్చొనియుండగా **(God is in you always)** దైవము నీలో సదా యుండెను. అని పెద్ద అక్షరములలో **(Paint)** పెయింటు చేయబడి యుండెను. ఎరుపులో ఇంగ్లీషును, నీలిరంగులో తెలుగు అక్షరములు బాగుగా కనిపించుటకు వ్రాయబడెను. ఇంకను అన్నివైపులను గోడల మీద ధ్యానమునకు తోడ్పడెడి వాక్యములే వ్రాయబడి యుండెను. **(God is Here)** దైవమిచ్చటనే యుండెనని ఒక వైపున వ్రాయబడెను. **(Feel God's Presence Here)** ఇచ్చట దైవసన్నిధిని అనుభవించుము అని ఒక్కవైపు వ్రాయబడెను. **(Thou Art That)** తత్త్వమసి, అదియే నీవు అని మరొక్కవైపు వ్రాయబడెను. **(God is omnipresent)** దైవము సర్వత్రా నిండి యుండెను, అని ఎడమవైపు వ్రాయబడెను. దానిమీదుగనే **(Inhale Exhale Peace)** ఉచ్ఛ్వాస నిశ్వాసములలో శాంతిని తీయుము అని వ్రాయబడెను. **(Be Still)** నిశ్శబ్దముగా యుండుమని వ్రాయబడెను. పూజామందిరము నుండి బైటకు రాబోయెడి గుమ్మము మీద వెనుకనే **(Soham)** అదే నీవు అని చిత్రింపబడెను.

ఈ పూజా మందిరములో నుండగా :- అంతా రామమయం బీ జగమంతా రామ మయం, అని తోచుచుండును. కండ్లు మూసినప్పుడు, తెరచినప్పుడూ :-

కన్నుమూసినా కృష్ణమయం, కన్ను తెరచినా కృష్ణమయం.

అని తలవని తలంపుగా గీర్తించుచుందును, ఆశ్రమ భక్తులు, పీస్ శాంతి పాఠకుల వృద్ధిని కోరుచు నేను తరచు వ్రాయు ఇంగ్లీషు, తెలుగు వ్యాసములన్నియు, యీ పూజా మందిరములోనే, మొదట మానసికముగా వ్రాయబడుచుండును. తరువాతను ఆఫీసు గదిలో తొందరగా యంత్రములె గీయుచుందును. వాటిని చి॥ జ్ఞానేశ్వరి, చి॥ శాంతి ఓపికగా కాపీజేసి ప్రెస్సుకు-తోటపల్లి పంపుచుందురు. పూజామందిరములో నాకు తోడ్పడెడి

మహావాక్యము లన్నింటిని శ్రమ తీసుకొని గొణుగుకొనుచు రంగులలో వ్రాసిన చి॥ చంటికిగూడ కొంత సత్ఫలితము పంచిపెట్టవలసియున్నది. వీటినన్నింటిని నా భావనలను చదువుచున్న నా ప్రియమైన శాంతి పాఠకులకుగూడ కొంత పుణ్యమున్నది. పుణ్యముమాట అటుండ, శాంతి పాఠకులందరూ శాంతితో నిండి దినదినాభివృద్ధి జెందుటకే కోరుచు వ్రాయుచుందును.

ఇప్పుడు నా పూజామందిరములో విశ్వమత చిహ్నమును విమర్శింతము. ఓంకారమును జూడగనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర్లు అకార, ఉకార మకారములలో ప్రత్యక్షమయ్యేదరు. శిలువను చూడగనే క్రీస్తు ప్రభువు ప్రత్యక్షమగును. పద్మమును చూడగనే, బుద్ధభగవానుడు గానవచ్చును. క్రెసెంటును, చంద్రవంకను చూడగనే అల్లా, సాయిబాబాలు, నా ముందు నిలువబడుదురు. పార్శీల చిహ్నమైన **Fire** అగ్నిని చూడగనే జోరాష్టరు గానవచ్చును, నక్షత్రమును చూడగనే దివ్యజ్ఞానము గానవచ్చును. ఇంకను కొదువ చిన్న చిన్న చిహ్నములు సముద్రము, నదులు మత్స్యములు, ముత్యములను చూడగనే అన్నిమతములు, అన్ని శాఖలు విశ్వమత చిహ్నములో ఇమిడి యున్నట్లు భావించుచు తృప్తిని పొందుచుందును.

**Universal Symbol includes all !** విశ్వమత చిహ్నము, ఆస్తికులను, నాస్తికులను అందరినీ కలుపుచున్నది. ఒక్కరినీ మచ్చుకైనా విడువదు. **God is Love, Love is God.** దైవమే ప్రేమ – ప్రేమయే దైవము. నిన్నటి రాత్రి పూజామందిరంలో కూర్చొని ధ్యానించుచుండ.

**God is in you always**

దైవము, నీలో సదాఉండెనన్న పెద్ద అక్షరములు నాతో మాట్లాడు చున్నట్లు, నావైపు చూచుచుందును, వాటి గాంభీరమైన ఉపదేశమును వినుటకు ప్రయత్నించగా ఈ క్రింది రీతిగా, నాలోనేను, విమర్శించుకొనసాగితిని.

ప్రశ్న : దైవము నీలో యెటుల ఉండెను ?

జవాబు : పాలలో వెన్నవలె, లేక పాలలో నీళ్ళవలె నిబడీకృతమై రెండుగాక ఒక్కటిగా ఉండెను. ఇంకను దైవమునకును, మనకునుయున్న విడదీయుటకు వీలులేని అవినాభావ సంబంధమును, సులభముగా, బోధపర్చుటకు మరికొన్ని సామాన్యమైన ఉదాహరణలను తీసికొందము.

దైవము పంచదారలో తియ్యదనమువలె, ఉప్పులో ఉప్పదనమువలె అగ్నిలో ఉష్ణము-వేడివలె, మంచులో చల్లదనమువలె యుండెను. మనము దైవములో యెటులనుంటిమో గూడ విమర్శింతము. సముద్రములో కెరటమువలె - అడుగు నీటిబుడగవలె వుంటిమి. సముద్రము దైవము, కెరటము ప్రపంచము. నీటి బుడగ మానవుడు - జీవ స్వరూపము.

బుద్బుదమును, నీటిబుడగను కెరటములోను, కెరటమును - ప్రపంచమును, అఖండ సచ్చిదానంద మహాసముద్రములో ననీనము కానీయుడు!

ఈ అనుభవనీయమైన చిన్న మాటలు పత్రికలలో రోజూ చదివి, ఒకమూల పారవేయునవిగావు. వీటిని శ్రవణ, మనన నిధిధ్యాసలుజేసి, నిరంతరము ఆచరణయందు వుంచుకొని గమ్యస్థానము చేరుటకు అభ్యాసము జేయుచు, తరించవలసిన మహావాక్యములు.

జీవో దేవ స్సనాతనః !

అనాదినుండియు, జీవుడే దైవము, నరుడే నారాయణుడు, సోऽహం భావనే పూజయేత్ ! సోऽహం భావనతో విశ్వమత ప్రేమతో నిరంతరము పూజించుచు, ప్రతీ శ్వాసతో, ఆ విశ్వశక్తిని, ఆరాధించుచు తరించుడు ! ఇక వెయ్యి మాటలు వ్రాతలేల? **Thou Art That** అదియే నీవు ! నీవే అది. తత్త్వమసి అని పూజామందిరము, నాకును, మీకును అందరకును ఏకగ్రీవముగా బోధించుచున్నది. నా పూజామందిరమునకు కృతజ్ఞత.

ప్రియమైన శాంతి పాఠకులందరకూ, శ్రమతీసుకొని నా భావనలు చదువుటయేగాక, ఆచరణలో పెట్టుచు, శాంతి వ్యాప్తికి తోడ్పడుచున్నందుకు కృతజ్ఞుండను.

లోకా సమస్తా స్సుఖినో భవంతు

లోకములో, మానవకోటి అంతయు చరాచర జీవకోటి అంతయు శాంతిగా ఉండునుగాక ! నా పూజామందిరము అనెడి యీ వ్యాసమును శాంతి గీతముతో, లోకశాంతిని కోరుచు ముగించెదను.

సర్వేషాం స్వస్తిర్భవతు
సర్వేషాం శాంతిర్భవతు
సర్వేషాం పూర్ణం భవతు
సర్వేషాం మంగళం భవతు
ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతి ః

ఓం కృష్ణార్పణమస్తు !

నే నీవ్యాసము వ్రాయుచుండ - నా బల్లమీద చిత్తరువులో నిలబడి పిల్లనగ్రోవి ద్వారా ప్రణవ గానమును నాకు వినిపింపజేయుచున్న శ్రీకృష్ణ భగవానునికి ప్రేమార్పణ.

ఓం శ్రీకృష్ణ పరమాత్మనే నమః

ఓం! ఓం! ఓం!

# దురదృష్టవంతమైన తాడిచెట్టు

నిర్వాణాశ్రమములో, గోవర్ధనగిరి సామీప్యమున నిర్వాణ మందిరము గలదు. ఆ మందిరము ఎదుట నున్న విశ్వమత చిహ్నమునకు, అన్నివైపులను పుష్పములు పంక్తులు తీర్చి వేయబడినవి. అచ్చట రెండువైపుల రెండు తాటియాకుల కుటీరములు గలవు. వాటికి ముందుగా రెండు విశాలమైన సిమ్మెంటు సోఫాలు కట్టబడెను. ఆ రెండింటి నడుమ భక్తుల ప్రార్థన ధ్యానాదులకు, ఆదివారపు ప్రార్థన సమావేశములు జరుగుటకు పందిరి వేయబడెను.

మొన్నటి ఆదివారము రోజున ఆశ్రమ వాసులు, భక్తులు అందరు సమావేశమైయుండ, సంగీతోపాధ్యాయులు, గురుకుల బాలబాలికలచే, హరేరామ మంత్రమును, భజన కీర్తనలను పాడించుచుండ, నిమీలిత నేత్రుండనై వినుచుంటిని. ఆ పరమ పావనమైన పవిత్ర క్షణమున స్వర్గములో యున్నట్లై, ఆ తావు స్వర్గముగానే తోచెను.

స్వర్గమే నిజముగా యెచ్చటనో ఉన్నచో, ఇంతకంటెను అన్యముగా, వేరుగా యుండునా ? హెచ్చుగా యుండునా? అని తలంచుచుంటిని. శాంతి శ్లోకములు, భగవద్గీతా పఠనము పూర్తి అయ్యెను. పార్శీ సోదరీమణులు శ్రీ ఫిరోజా, మోతీగార్లు "ఆధ్యాత్మిక మెఱుపులు". నిశ్శబ్ద గడియలలో" అను పుస్తకముల నుండి కొన్ని అధ్యాయములు చదివి వినిపించుట పరిపాటియై యున్నది. ఆ రోజున, కుమారి జ్ఞానేశ్వరిచే అనుభవనీయమైన స్వార్థయుత కార్యములు అను వ్యాసము చదువబడెను. తదుపరి పిఠాపురం ఆయుర్వేద వైద్యులు శ్రీరామారావుగారు వ్యర్థమని యెంచిన మూడు దినములెవ్వి? అనెడి వ్యాసమును చదివితిరి.

తరువాత నేను యథారీతిగా ప్రతివారము జెప్పుచున్న బోధనలను

చెప్పుటకు కోరబడితిని, మరియొకమారు దైవము పేరున ఆదివారము, సూర్యరశ్మి రోజున, మనమందరము ఇచ్చట సమావేశమౌట అదృష్టమని జెప్పుచుండ, తలవని తలంపుగా నా దృష్టి, ఎదుటి తాటిచెట్టు వరుసలో ఆకులన్నియు మాడిపోయిన దురదృష్టమైన ఒక తాడిచెట్టుమీద పడెను. ఆ తాడికట్ట మా సమావేశ స్థలమునకు కనుచూపు మేరలో నుండెను.

అన్ని చెట్లును బాగుగా నవనవలాడుచుండ, ఆ ఒక్క చెట్టే ఎండిపోయిన ఆకులతో చనిపోయినట్లు ఉన్నదేమని ఆలోచించ నారంభించితిని. అది చనిపోవుటకు కారణము ఏ కఠిన హృదయుడో, దాని మొవ్వును కోసి యుండవలెను లేక దాని చుట్టునున్న మట్టలనైనను, లోతుగా గీసివేసి యుండవలెనని, బాధతో, కోప తాపములతో ఆలోచించుచుండ, సభలోయున్న మేనేజరు, "మీరు బొబ్బిలి వెళ్ళినప్పుడు ఆ తాడిచెట్టుమీద పిడుగుపడినందున ఆకులు కాలిపోయి చనిపోయెను". అని చెప్పగా నేను విస్మయుండనైతిని.

అప్పుడు దయాదాక్షిణ్యములు లేని మానవునిమీద వచ్చిన కోపతాపములు దైవమువైపు వెళ్ళసాగెను. ఆ తాటికట్టలో అనేకమైన చెట్లుయుండ నిర్దాక్షిణ్యమైన పిడుగు దురదృష్టమైన ఆ తాటిచెట్టుమీదనే పడనేల? దైవవిధులు, దైవచట్టములు అల్పజ్ఞులైన మానవులకు అగ్రాహ్యములు గదాయని ఆలోచించుచుండ, లోకములో మూడు రీతులైన బాధలు యుండునని శాస్త్రములు జెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చెను.

1. ఆధ్యాత్మికము
2. ఆధి దైవికము
3. ఆధి భౌతికము

అనెడు బాధలు త్రివిధములై యుండునట. మొదటిది. శరీర మానసిక సంబంధమైన బాధలు స్వయంకృతార్థము, కర్మఫలితములని చెప్పవచ్చును. రెండవరకము బాధలు, ప్రకృతి నుండి దైవికముగా ఉరుములు, మెఱుపులు,

తుఫానులతో పడెడి పిడుగులు. భూకంపములు మొదలగు బాధలు, ఇక మూడవరకము బాధలు ఆది భౌతికబాధలు, తేళ్ళు, జెర్రెలు, పాములు, ఇంకను అనేకములైన విష పురుగులు, అడవి జంతువులు మొదలగు వాటివలన కలిగెడు బాధలు.

లోకమంతయు ఏదో ఒకవిధమైన బాధామయమై యున్నది ! ఏ క్షణమునకు, ఏమి జరుగనున్నదో కించజ్ఞత్వముతో నిండియున్న మానవ మాత్రునకు తెలియదుగదా ! మేము ఆశ్రమం విడచి వెళ్ళకముందు ఆ తాడిచెట్టు పచ్చగ, ప్రాణముతో జీవించుచునే యున్నది. తిరిగి మేము వచ్చులోపల ఉరుములు, మెఱుపులతో కుంభీపాతమైన వర్షము కురియుటకు, పిడుగు ఆ తాడిచెట్టుమీద పడుట, అది వెంటనే కాలిపోవుట, యివన్నియు కనుమూసి తెరచునంతలో ఒక మెఱుపువలె వచ్చి జీవకళతో యున్న తాడిచెట్టును మృత్యువు పొట్టను పెట్టుకొనెను. అనగా చంపి వేసెను. ఇతరుల జోలికి పోవక, దానంతట అది పెరుగుచున్న ఆ తాడిచెట్టు క్రూరమైన ఆ పిడుగునకు ఏమి హాని చేసెను ? చెట్టునకైనను మానవునకైనను మృత్యువు, ఏ క్షణములో వచ్చినను రావచ్చునుగదా ! ఆ క్షణము నెవ్వరు జెప్పగలరు?

సీతారాం అనెడి ఆశ్రమము పిల్లికి శాంతారాం, ఆత్మారాం అనెడి రెండు చిన్న పిల్లి పిల్లలు గలవు. ఆ రెండు పిల్లి పిల్లలు ఆనందముతో క్రిందపడుచు, మీదపడుచు, తోకలు ఆడించుచు, చుట్టును తిరుగుచు ఆడుకొనుచుండ వాటితల్లి తృప్తిగా ఆనందముతో, మాతృ ప్రేమతో వాటిని నాకుచుండ, నేత్రములున్నవారు జూచి ఆ తల్లి ప్రేమకు ఆనందించవలసినదే కాని వర్ణింపనలవిగాదు.

మేము బొబ్బిలినుండి రాగానే శాంతారాం అనెడి చిన్న పిల్లిపిల్ల చనిపోయెనన్న విషాదవార్త విని చాల విచారమయ్యేను. దానిమీద గూడ దైవము పిడుగు వేసెనా ! లేదు ! లేదు ! అమాయకమైన పిల్లిపిల్లలు రెండును ఆడుకొనుచుండ క్రూరుడైన బాలుడొకడు ఎగతాళిగా రాయి విసరెను.

ఆ రాయి సున్నితమైన దేహమున తగులుటచేతనో, దాని రోజులు నిండుకొనుట చేతనో, గిలగిల కొట్టుకొనుచు తన తల్లిముందే చనిపోయెనని వినుటకు చాల విచారమయ్యెను. సీతారాం గూడ గిలగిల కొట్టుకొనుచు, చనిపోవుచున్న తన పిల్లను నాకుచు, ఎంతయో బాధపడినదని విని చింతించితిని. కాని చింతించి నేను చేయునది ఏమియున్నది !

స్వర్గములో చావు పుట్టుకలుండవా? చెట్లు, చేమలు జంతు జాలము లుండవా? అచ్చట పిడుగులు, హృదయములేని మానవులు క్రూరులైన బాలురు ఉండరా? అని ఆలోచించ సాగితిని !

ప్రియమైన పాఠకా! స్వర్గమునటు ఉంచి, యిప్పుడు మనము హఠాత్తుగా పిడుగుపడిన తాడిచెట్టు జీవితమునుండి, విషాదకరమైన శాంతారాం మృత్యువు నుండియు, మీరును, నేనును నేర్చుకొనవలసిన పాఠములెవ్వి ?

ఏ క్షణమునకు ఏమి జరుగునో తెలియదుగదా ! ఆ పిడుగు నిర్వాణ మందిరం మీదనే పడిన ఏ మగును? మానవుని మీద పడిన వాని గతి ఏమగును? ఏ పిడుగు, ఏ ఆపద, ఏ సమయమునకు రానున్నదో తెలియదు గదా! ప్రాణము ఎప్పుడు ఎచ్చట వదలనున్నదీ, అంతయు కర్మసూత్రములను బట్టి యుండును. దైవవిధి యనబడు ఆ నిర్ణయమును, ఆ ఆఖరు క్షణమునైనను ఎవ్వరును ఎరుంగజాలరు. నిశాసమయమున లేచి, ఈ వ్యాసమును వ్రాయుచుండ, నరసింహ శతకములో జెప్పబడిన చక్కనైన ఈ క్రింది పద్యము జ్ఞప్తికి వచ్చుచుండెను.

సీ॥ ప్రాఙ్చభౌతికము దుర్భరమైన కాయం
బిదెప్పుడో విడుచుట ఎఱుకలేదు !
శతవర్షములుదాక మితము చెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమున !
బాల్యమందో మంచి ప్రాయమందో లేక

ముదిమియందో లేక ముసలియందో !
యూరనో యడవినో యుదక మధ్యముననో
ఎప్పుడో విడుచుట యేక్షణంబో ।
మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన
దేహమున్నంతలో నిన్ను దెలియవలయు ।
భూషణ వికాస శ్రీధర్మ పురనివాస
దుష్టసంహార నరసింహ దురితదూర ॥

దైవబిడ్డయైన, దైవ చిహ్నమైన, దైవాకారమైన మానవుని మనస్సు ఎంత కోమలముగా, సున్నితముగా యున్న అంత హెచ్చుగా, చెట్టునకైనను, పిల్లిపిల్లకైనను బాధ గలిగినప్పుడు తన మనస్సు బాధపడుచు పరితపించు చుండును. దట్టమైన, జడమైన, క్రూరమైన హృదయము గల్గినవారు, ఆకలిచేగాని, రోగముచేగాని, మనిషి మల మల మాడుచు ప్రాణము వదలుచున్నను నేత్రములుండియు చూడజాలరు.

మొన్న బొబ్బిలి నుండి వచ్చునప్పుడు వాల్తేరు ఆశ్రమములో రెండు రోజులు ఆగితిమి, అచ్చట భక్తులు పాతవారు, క్రొత్తవారు తండోపతండములుగా వచ్చితిరి. అందులో ఒక భక్తుడు గుడివాడ నుండి వచ్చెనట. ఆయన చేతిలో అరటిపండ్లు వున్నవి. వాటితో తృప్తిపడక, నా దగ్గరలోయున్న చిన్న మొక్క యొక్క పువ్వులను, నిర్దాక్షిణ్యముగా కోసివేయ ప్రారంభించెను. ఆ దృశ్యమును చూడజాలక, అమాయకమైన ఆ పువ్వులను వాటి తల్లి నుండి వేరుచేసి చంపవలదని కోరితిని. పవిత్రమైన, పరమ పావనమైన ఆ పుష్పములను మలినమైన నా పాదముల మీద వేయుటకే ఆ భక్తుడు వాటిని తృంచి పాదముల మీద వేసి నమస్కరించెను.

ఇతరులకు అది సామాన్యమైన, రోజూ జరుగుచున్న సంఘటనగా తోచినను, అముఖ్యముగా తోచినను, నా కండ్లు అశ్రువులతో నిండి యుండుటఁ

చేరుమాలుతో నేత్రములను, నా పాదముల మీద వేయబడిన కోమలమైన పుష్పముల వైపు జూచుచు తుడుచుకొనుచుండుట నాకే ఆశ్చర్యమాయెను.

అర్థరహితమైన యిట్టిలాంచనలు అముఖ్యమైనవని, ఆ భక్తునితో జెప్పుచు నాకును, దైవమునకును కావలసినది, పవిత్రమైన ప్రేమ పూరితమైన హృదయమనెడి ఆంతర్య పుష్పమునే అర్పించి తరించమని చెప్పగా, ఆ భక్తుడు మొదటిలో కొంత కంగారుపడినను చివరకు ఎంతయో ఆనందించెను. ఈ సందర్భములో పుష్పవిలాపములో చిన్న పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది.

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి ?
అందమును హత్యజేసెడి హంతకుండ
మైలపడిపోయెనోయి ! నీ మనుజ జన్మ
పూజలేకున్న బాబు నీ పుణ్యమాయె
కోయబోకుము మా పేద కుత్తుకలను.

సర్వమతముల సారము ప్రేమయే దైవము అని చెప్పబడెను. ఆ ప్రేమ తన శరీరమునేగాక, తనవారినేగాక తన జాతిని, సంఘమును, దేశమునేగాక, విశ్వమంతను ఆలింగనము జేసుకొనెడి విశ్వప్రేమగా యుండవలెను. విశ్వములోనున్న మానవాళినేగాక, జంతుజాలములను, చెట్లు, చేమలను, చిన్న పుష్పములనుగూడ తన స్వంతముగా, ఒకే ఆత్మగా భావించెడి ప్రేమయే నిజమైన, అఖండమైన, స్థిరమైన, శాశ్వతమైన ప్రేమగదా ! అట్టి పరిపూర్ణమైన ప్రేమయే, చిన్న అణువు మొదలు బ్రహ్మాండము వరకు నిండియున్న ప్రేమయే మానవుని జన్మహక్కు. అదియే మన గమ్యస్థానము.

ఇట్టి పరమ పావనమైన భావనలతో ఆదివారపు ప్రార్థన ముగియచుండ, మా నిత్యానంద స్వామిజీ దురదృష్టమైన, పిడుగుపడి చనిపోయిన తాడిచెట్టును కొట్టివేయుచుండ, దానిని ఆశ్రమవాసులు, ఆశ్రమ భక్తులు, ఒక చిహ్నముగా

వుంచుకొని వృద్ధి అగుటకు జాగ్రత్తగా ఆ చెట్టును కాపాడవలెనని జెప్పసాగెను.

వెలుతురుండగా ఇల్లును సర్దుకొనెడివారు అదృష్టవంతులు. దీపముండగా మేల్కొనవలెను. దీపము ఆరిపోయిన తరువాత ఏమిచేయగలము? ఏ పిడుగు, ఎప్పుడు, ఏ రోజున ఎవరిమీదపడునో ఎవరికిని తెలియదుగదా! ఎన్ని పిడుగులు పడినను, చలింపజాలని, తాకజాలని సద్వస్తువు ఒకటి, ఆత్మ స్వరూపము మనలో నిరంతరము ప్రకాశించుచుండెను. అదియే మన జన్మహక్కు, జన్మావవిధి. పరమ పావనమైన నేటి దినము, ఆదివారము జ్ఞాపకార్థముగా, కోటి సూర్యప్రకాశ మానమైన ఆ సచ్చిదానంద స్వరూపమును నేడే మనమందరమును ఆంతర్యమున, స్థిరము జేసుకొనెదముగాక ! ఆ తాడిచెట్టు ఆత్మకు శాంతి కలుగుగాక !

సమావేశము ఆఖరున జర్మనీ సోదరుడు శ్రీ వజ్రబోధి వారి భాషలో శాంతి ప్రార్థన చేయగా, తదుపరి ఆశ్రమ భక్తుల శాంతి ప్రార్థనలతో, లోకా స్సమస్తా స్సుఖినో భవంతు! అని లోక కళ్యాణమును కోరుచు ఆనాటి సమావేశమును శాంతిగా, ప్రణవ గానముతో ముగింపబడెను.

ఓం సర్వేషాం స్వస్తి ర్భవతు
ఓం సర్వేషాం శాంతి ర్భవతు
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం సర్వేషాం మంగళం భవతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః !

# అష్టగ్రహకూటమి

కించిజ్ఞత్వముతో గూడియున్న మానవుడు ఎంత అఖండమైన చదువులు చదివిననూ, తెలివితేటలు కలిగియున్ననూ, ప్రకృతి చట్టములనుగాని, దైవ నిర్మాణమునుగాని గ్రహించజాలడు. ప్రకృతిలో సంభవించుచున్న క్రూరమైన మార్పులు ఒక్కొక్కసారి హానికరముగా కనిపించినను చిట్టచివరకు అవియే దైవముయొక్క ఆశీర్వాదములుగా మారుచుండును.

దూరముగానున్న హాంకాంగు, చైనానుండి ఆశ్రమ భక్తుడైన ఆశ్రమాభిమాని ఈ అష్టగ్రహ కూటమిని గురించి కంగారుపడుచు ఈ క్రింది విధముగా విమానము ద్వారా రిజిష్టరీ ఉత్తరము ఒకటి పంపెను.

ప్రశ్న : ప్రియమైన స్వామీజీ ! ఈ అష్టగ్రహ కూటమివల్ల రాబోయెడి ప్రపంచ విపత్తు నుండి తప్పించుటకు భారతదేశములోయున్న సాధువులు, స్వాములు, యోగులు, మహాత్ములు వీరందరూ ఏమి చేయుచున్నారో తెలియపర్చ గోరెదను.

జవాబు : ప్రియమైన సోదరా ! ఫిబ్రవరిలో రానున్న అష్టగ్రహకూటమిని గురించి వ్యక్తిగతముగా నేనేమియు తాపత్రయపడుటలేదు. నాకు ప్రతిరోజును ఒక్కటియే! గ్రహములు కలసిననూ, కలయుకున్ననూ ప్రతిరోజును దైవము స్థిరమై ఒకేరీతిగా ప్రకాశించుచుండెను. ప్రకృతి చట్టములనుబట్టి గ్రహముల కూటమిలో కొన్ని మార్పులుండిన ఉండవచ్చునుగాని యెన్ని మార్పులున్నను దైవమును అనుసరించినవారు సదా సురక్షితముగానే ఉందురు.

చేతితో బియ్యము విసిరెడి తిరగళ్ళు చైనాలో ఉన్నవా ? మీరెప్పుడైననూ దానిని జూచినారా ? హిందూదేశములో ప్రతి గృహమునందు ఒక తిరుగలి సాధారణముగా ఉండును. ఒక భక్తురాలైన సోదరి బియ్యము విసరుచు, కన్నీరు కార్చుచుండెను. ఒక సాధువు ఆమెను జూచి ఏల ఏడ్చుచుంటివని అడిగెను. దానికి ఆమె చావు, బ్రతుకు అనే రెండు రాళ్ల మధ్య నా జీవితమంతయు

బియ్యపు గింజలు పిండిగా మారినట్లు వ్యర్థమగుచున్నది. విజ్ఞుడైన ఆ సాధుపుంగవుడు పైన వున్న రాతిని ఎత్తమని కోరెను. అప్పుడాయన ఆ గురుజు చుట్టూ వున్న కొన్ని బియ్యపు గింజలను జూడమనెను. తిరగలిని ఎంతగా త్రిప్పుచున్ననూ, గురుజును అంటిపెట్టుకొని యున్న బియ్యపు గింజలను ఆ తిరుగలి రాళ్ళు తాకజాలవు. అటులనే మనము గూడ అంతర్యమున గురుజుగా ప్రకాశించుచున్న జ్యోతిని అంటిపెట్టుకొని యున్న మనలకు ఏ హానియు గలుగదు.

ప్రియమైన సోదరా ! అశాంతితో నిండియున్న ప్రవృత్తిపరులు ఈ జ్యోతిష్యములను జూచి భయపడుచుందురు. బాహ్య ప్రపంచములో స్వభావికముగా జరుగబోయెడి మార్పులను, హెచ్చుతగ్గులకు లెక్కజేయక దైవమునే ఇంకను హెచ్చుగా పట్టుకొని శాంతిగా ఉందురు. కాన మనము రోజురోజుకు ఇంకనూ మన జన్మహక్కైన అంతర్య జ్యోతినే ధ్యానించుచూ, దైవ తేజస్సులో లీనమయ్యెదముగాక ! మనము దైవమును మరచినప్పుడే భీతిని జెందవలయును. గాని బైట మార్పులకు, బాహ్యకూటములకు ఎన్నటికి జడవరాదు. లోకమంతయు శాంతితో నిండియుండుగాక !

ఓం ! ఓం ! ఓం !

శ్రీరామతీర్థులు "నీ హృదయములో సందేహము ఉంచుకొనుటకు బదులు ఒక తుపాకీ గుండును ఉంచుకొన" మని నుడివిరి. నేను గూడ మీ హృదయములో భయభ్రాంతులు ఉంచుకొనుటకు బదులు (ఆటం బాంబ్) అణ్వాస్త్రమునైనను సరే ఉంచుకొనుడని బిగ్గరగా జెప్పుచుంటిని.

భయము జబ్బును గల్గించి నిర్జీవిగాజేయుచు రక్తమును గూడ విషముగా మార్చుచున్నది. ఆలోచనలే వస్తువులుగా మారునుగాన మన యొక్క అధైర్యమైన భయముతో గూడియున్న ఆలోచనలతో ప్రపంచములో ఇదివరకే యున్న అవస్థలకు ఇంకనూ హెచ్చుగా కలపవలదు. దైవసంభూతుడైన ఓ

మానవుడా ! నీ జన్మహక్కైన అంతర్యజ్యోతి యందు నీ నమ్మకమేదీ ? ఈ జ్యోతిషములకు, తాటియాకుల చప్పుళ్ళకు భయపడి వణికిపోవలదు. నీ స్వస్వరూపమైన ఆత్మను ఈ ప్రపంచకములో యున్న మార్పులేమియు తాకజాలవు. దుర్బలత్వము అజ్ఞానముతో జేయు వెట్టి ఆలోచనలు స్వర్గమును గూడ అనవసరమైన అనుమానములు, భయములచే మానవుడు నరకముగా మార్చును. పూర్వము ఒక్కమారు ప్లేగు జాడ్యముచే వేలాదివేలు జనులు రోజూ చనిపోవుచుండిరట. పురోహితులు, భక్తులు, మృత్యుదేవతను పూజ పునస్కారములచే ప్రసన్నతగా జేసుకొని ఇకవారిని చంపవలదని ప్రార్థన జేయగా ఆ మృత్యుదేవత ఇక అయిదువేల ప్రాణముల మాత్రమునే తీసుకొని మిమ్ము విడిచిపెట్టెదనని వాగ్దానము జేసెను. మరునాడు యాభైవేల మంది చనిపోగా భయకంపితులై ఆ దేవతను నీ వాగ్ధానము తప్పి, ఇన్ని వేలమందిని ఏల నిర్ధాక్షిణ్యముగా చంపివేస్తివని అడిగిరి. యమదేవత చిరునవ్వుతో "ప్రియమైన బిడ్డలారా !" వాగ్దానము రీతిగా నేను అయిదువేలమంది ప్రాణములే తీసుకొంటిని. కొదువ నలభై ఐదువేలమందియు భయముచే చనిపోయిరి. విషతుల్యమైన ఈ భయమనే భూతమునకు దాసులైన వారి దుస్థితి ఇటులనే ఉండును. కోటిసూర్య ప్రకాశమానమైన దివ్యతేజస్సులో ఈ మేఘముల వంటి భయము ఎచ్చటనున్నది. జలగవలె మన రక్తమును పీల్చుచున్న భయమనే ఈ మహాభూతమును శాశ్వతముగా పారద్రోలుదము, అష్టగ్రహములు కలియనిండు, ప్రపంచములోని గ్రహములన్నియు కలియనిండు, చివరకు ప్రళయమైనను రానిండు మనము మాత్రము నిత్యమైన, సత్యమైన, సంపూర్ణమైన, స్థిరమైన జ్యోతి స్వరూపమునే అంటుకొనియున్న, ఈ అష్టగ్రహ కూటమిలు, తదితర మార్పులు ఏమియు మనలను తాకజాలవు. పూర్వము భక్తుడైన మార్కండేయులు శివలింగమును ఆలింగనము జేసుకొనినట్లు, మనము గూడ అంతర్య జ్యోతిని పట్టుకొని ఆ అఖండ జ్యోతిలో విలీనమయ్యెదముగాక! అప్పుడు ఏ మార్పులును, మృత్యువు గూడ మనలను తాకజాలదు.

మరియొకమారు నాకంఠమును ఎత్తి ఈ ప్రపంచములో జరిగెడి మార్పులన్నియు మనకు తెలియని ఆశీర్వాదములనియు, అంతయు మన మేలునకేయనియు, ధైర్యముతో ఎలుగెత్తిజెప్పుటకు కోరుచున్నాను. ఈ అష్టగ్రహ కూటములు వీటివల్ల జరుగబోవు ననెడి భీకరమైన జ్యోతిషములు లేవనియెడల చాలమంది మానవులు దైవము పేరు నైనను భక్తితో తలచి వుండకపోవచ్చును. ఇప్పుడు ప్రతిచోటను, పట్టణమునందేగాక పల్లెలందు గూడ పూజలు, యజ్ఞములు, భజనలు, సంతర్పణలు, దానధర్మములు ఇంకనూ అనేకమైన పుణ్యకార్యములు, లోకములోయున్న దైవములను, దేవతలను, భూత, భవిష్యత్ వర్తమాన కాలములలోయున్న మహాత్ములందరి ఆశీర్వాదములు కోరుచు అనేకమైన ప్రార్థనలు ఈ అష్టగ్రహ కూటమి నుంచి తప్పించమని భయభ్రాంతులతో అందరునూ జేయుచున్నారు. ఒకరిభయము మరియొకరికి వ్యాపించుచున్నది. ధైర్యవంతులుగూడ అధైర్యపడవలసిన రోజులు వచ్చెను. మార్పు, మృత్యువు అనెడివి ప్రాపంచకములో తప్పనివే. ప్రపంచమంతటా ఏది ఎటుల జరిగిననూ మనము మాత్రము మహోపకారియైన భయమునకు మాత్రము భయపడరాదు. మన ఆంతర్య హృదయములో నిరంతరము ప్రకాశించుచున్న జ్యోతిని ఇప్పుడే స్థిరము జేసుకొని ధైర్యముగా ఉందుముగాక!

ప్రతిముఖములో దైవమునే గాంచుదము, ప్రపంచకమంతకూ ఆధారమైన అద్వితీయమైన, అఖండ సచ్చిదానంద స్వరూపమునే ఆంతర్యమున, బాహ్యమున అందరిలో అన్నివైపులా గుర్తించుచూ నిత్యశాంతిని వ్యక్తపరచెదము గాక!

ఎన్ని గ్రహములు ఎంతగా స్వర్గములో కలసిన మనమంతా దగ్గరగా మన ఆంతర్య హృదయములో వేచియున్న జ్యోతిలో విలీనమయ్యెదము గాక! అగ్నిజ్వాలలతో ఇదివరకే మండుచున్న ఇంటిమీద మన అధైర్యమైన, అనవసరమైన భయములచే పెట్రోలు, కిరసనాయిలు పోయకుందుముగాక !

అన్నిటికంటెను జరిగిపోయిన భూతకాలమును పూడ్చివేసి అస్థిరమైన భవిష్యత్తును గురించి ఆలోచించక ఈ వర్తమాన కాలములోనే, ఈ ప్రత్యక్ష క్షణములోనే దైవమును ఇప్పుడే, ఇచ్చటనే అనుభవించుచు నిర్భయముగా తరించెదముగాక! ఈ క్షణములో నీవు దైవమును అనుభవించుచూ జీవించిన రాబోయెడి క్షణములలోగూడ దైవమునే అనుభవించగలవు? నీకున్న దానిని నీవు వాడిన ఆ తేజస్సు అన్ని గ్రహకూటములకు ప్రపంచమును మరపించును, గ్రహములు కదలవచ్చును; తిరగవచ్చును; మారవచ్చును. ఇతర గ్రహములను కలుసుకొనవచ్చును. కాని నీలో యున్న ఆత్మ మాత్రము ఎన్నడూ కదలదు, మెదలదు, మారదు. ఏలనన అది అద్వితీయమైన సర్వత్రా నిండియున్న అఖండ జ్యోతిస్వరూపము.

ఇంతకూ ఆధ్యాత్మికముగా జూచిన నిజమైన గ్రహములు నీలోనే కలవు. అవి బాహ్యమున లేవు. ఆ గ్రహములు మనలో యున్న కామ, క్రోధ, లోభ, మోహ, మదమాశ్చర్యములు, మన అహంకారములే మనకు హానికరమైన, నిజమైన గ్రహములు. ఈ గ్రహములే మానవుని అధోగతికి ఈడ్చుచు లోకములో అశాంతికి, యుద్ధములకు మృత్యువునకు మూలకారణమై యున్నవి. తన అంతర్య గుణములను జయించినవాడు బాహ్యమున ఉన్న గ్రహములను జయించును. తన్ను తాను జయించినవాడే లోకవీరుడు. అట్టి మహనీయుడే మానవకోటికి కళ్యాణముగా ఉండును.

ప్రియమైన శాంతి పాఠకులారా ! మానవకోటిని ప్రేమించెడి అభిమానులారా ! బాహ్యమున ఎన్ని మార్పులు రానున్ననూ మన అంతర్యమున మనకై వేచియున్న మన జన్మహక్కైన మార్పులకు అతీతమైన స్వప్రకాశమానమైన దివ్యజ్యోతిని మన మనస్సు అంతటితో, శక్తి అంతటితో ఈ గ్రహ కూటములను అన్నింటిని మరచి ఇప్పుడే, ఇచ్చటే స్థిరము జేయుదముగాక !

ఈ సందేశము యొక్క సారాంశము ఒక్క మాటలో ఎంత హెచ్చుగా బాహ్యా గ్రహములు, ఆకాశములో కలిసిన అంతకన్న హెచ్చుగా జీవాత్మలను, అంతర్యమున వున్న పరమాత్మలో విలీనము జేయుదు, గాంచుదు ! ఉన్నదొక్కటే అదియే మీరు, తత్త్వమసి ఆ అద్వితీయమైన అఖండ సచ్చిదానంద స్వరూపములో ఏ గ్రహములు, ఏ ప్రపంచకములు గూడలేవు.

నిశ్శబ్దముగా ఉండి, ఆ నిశ్శబ్దములో మీరే దైవతేజస్సు అని గ్రహించుదు, దైవ తేజస్సును గ్రహించిన పిమ్మట నిశ్శబ్దముగా మౌనముగా ఉండుదు. అవాంగ్మానసగోచరమైన పూర్ణశాంతి మిమ్ము నిరంతరము ఆవరించి ఉండునుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ః

ఓం శాంతి ! శ్శాంతి ! శ్శాంతి ః !

ఓం సర్వేభవంతుసుఖినః సర్వేసన్తునిరామయా ః

సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చి ద్ధుఃఖ మాప్నుయాత్ ॥

ఓం సర్వేషాం స్వస్తి ర్భవతు ॥ ఓం సర్వేషాం శాన్తి ర్భవతు ॥

ఓం సర్వేషాం పూర్ణం భవతు ॥

ఓం సర్వేషాం మంగళం భవతు ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః

# సాధుపుంగవుడు

ఎవరో యొక సాధుపుంగవుఁడు దూర ప్రదేశము నుండి యాశ్రమమునకు వచ్చెననియు నన్ను చూచుటకుఁ గోరుచుండెననియు ఆ శ్రమవాసి యొకఁడు చెప్పెను.

ఆయన నన్ని విధముల గౌరవించి మజ్జన భోజనాది సౌకర్యములు సమకూర్పుఁడనియు, విశ్రాంతిఁ దీసికొనిన పిమ్మట సాయంత్రము నేను చూచెదననియుఁ జెప్పి, నా యొద్దకుఁ దీసికొని వచ్చెడి ముందు దీనిని వారిచే వల్లింపఁజేయుఁడని శాంతి ప్రార్థన నొసంగి యాశ్రమవాసిని పంపితిని.

ఆనాటి సాయంత్రమా సాధుపుంగవునిఁ జూచితిని. ఆయన యాజానుబాహుఁడు. సుమారు ముప్పది సంవత్సరముల వయస్సుండును. కావి రంగు బట్టలు ధరించి విలువైన యంగరఖా వేసుకొనెను. చేతిలో నొక దండము కలదు.

కుశల ప్రశ్నల యనంతరము వారి రాక యాశ్రమవాసుల కానందముఁ గలిగించెననియు, వారికి సుస్వాగతమనియుఁ దెలిపితిని. పిమ్మట అందఱమును గలసి 'బ్రహ్మానంద శ్లోకమును, హరేరామ మంత్రమును' పఠించి శాంతి ప్రార్థనను జేసి ముమ్మారు ప్రణవమును స్మరించితిమి.

తరువాత నా సాధువునకు, నాకు నిట్లు ప్రసంగము జరిగినది.

నేను :- ఈ ఎండలలో ఊళ్ళవెంటఁ దిరుగుచు అమూల్యకాలమును వ్యర్థపుచ్చుటకంటె నే యాశ్రమములోనో స్థిరముగా నుండి దుర్లభమైన మానవజన్మ నెత్తినందుకుగాను, సన్యసించిన ఫలితముగాను బ్రహ్మ సాక్షాత్కారమునకు ప్రయత్నించుట మంచిదికదా !

సాధు :- మనసొక్కచోట నిలువనీయదు, హిందూదేశములోఁగల యాశ్రమములన్నియుఁజూచితిని. చాల యాశ్రమములలో నన్నుండుమని

కోరిరి. ఏ యాశ్రమములో నుండుటకును నాకు బుద్ధి పుట్టలేదు. శ్రీశాంతి ఆశ్రమమును జూడగనే యిచ్చట నుండవలెనని యిచ్ఛపొడమినది.

నేను :- ఈ యాశ్రమము మీ వంటి సాధుపుంగవులకే స్థాపింపఁ బడెను. మీరుండుట కెంతమాత్రము నభ్యంతరము లేదు. కాని ఆశ్రమములో నొక్క నిబంధన కలదు. అది 'పనిచేయని సోమరికి దినుటకు హక్కు లేదు' అనెడిది. నేను గూడ నిత్యము స్వీకరించెడి యాహారమునకుఁ దగు పనిని జేయుచుందును. అదియుఁగాక మీరు 24 గంటలును ధ్యానమునే చేయలేరు కదా! ధ్యానానంతరమేదియో సేవఁజేయుచు దినదినాభివృద్ధి నందవలెను.

సాధు :- మీరు చెప్పినది బాగుగనే యున్నది. కాని నాకేపనియుఁ జేతగాదు.

నేను :- మీరెన్నాళ్ళ నుండి సన్యసించి దేశాటనము చేయుచుండిరి?

సాధు :- నాలుగు సంవత్సరముల నుండి

నేను :- సన్యసింపక ముందు మీ కాలము నెట్లు గడపుచుండెడివారు?

సాధు :- నే నెన్నడు నే పనియుఁ జేసి యెఱుఁగను.

నేను :- ఏ పనియుఁ జేయకుండ మానవుఁడెట్లు జీవింపగలడు ? వృత్తినిఁ బట్టియైనను మీకేదో పని చేతనై యుండును. మీ వృత్తియేమిటి ?

సాధు :- "అక్షయపాత్రవృత్తి"

అక్షయపాత్ర వృత్తి అనగా నాకు తెలియక మేనేజరును అడుగగా, భిక్షాటనవృత్తియని చెప్పగా అక్షయపాత్ర అనెడిదిగూడ ఒక వృత్తి యున్నదా అని ఆశ్చర్యపడితిని.

నేను :- ఇంటింటికి వెళ్ళి భిక్ష పెట్టుఁడని యడుగునప్పుడు పాటలు కీర్తనలు పాడుచుందురుగదా ! మీకుఁ జాల పాటలు వచ్చియుండును.

దైవనామ స్మరణలో నైనఁ గొంతకాలము సద్వినియోగము చేయుదము. ఏదీ, యొక పాట పాడుఁడు.

సాధు :- నా కే పాటయు రాదు. భజనచేయుటకూడ చేతఁగాదు.

ఏ పనియుఁ జేతఁగాదన్నప్పుడే కొంత నిరాశ కలిగెను. పాటగూడ రాదన్నపుడు పూర్తిగా నిరాశ కలిగెను. వారివారి పూర్వాశ్రమ వృత్తులనుబట్టి ఆశ్రమమునకు వచ్చినవారికి నాశ్రమములో దగిన పనిఁగలిగించవలెనని తలంచుచుందును. ఏపనియైనను చేతఁగాకున్నచో వచ్చిన యతిథులనైన నాదరించి వారిచే భజనలు చేయింపఁగలరేమో యనిన, దైవగానమైనను రాదాయెను. అప్పుడు శాంతి ప్రార్థనను వల్లింపుమని కోరి ప్రార్థనను జేయించి యాశ్రమములోనికిఁ బంపితిని.

ఈ సాధువు నాశ్రమములో నుండుటకుఁ గోరుచుండెను. ఇతని కేమిపనిఁగల్పించిన బాగుండునని యాలోచించితిని. ఆ సాధువు తన వృత్తిచేతనే బీదసాదలకు సాయపడవచ్చునని స్ఫురించెను. ఆయనకు భిక్షాటనమువచ్చును గదా ! తెల్లవారుఝామున లేచి యాశ్రమములో స్నానపానాదులు ప్రార్థన, ధ్యానాదులు పూర్తిజేసికొని దగ్గరలోనున్న గ్రామములకు వెళ్ళి యొకటి రెండు గంటలు భిక్షాటన మొనర్చివచ్చి యా బియ్యముతో జావకాయించి దిక్కులేనివారికిఁ బోయవచ్చునుగదా! ఈ యాలోచనకు నాలో నేనే సంతసించితిని. వెంటనే సాధువునకు గబురంపి ఈ విషయము నెఱింగించి యీ సేవవలన దిక్కులేనివారి యాకలి దప్పికలు తీర్చి తాను తరింప వచ్చునని చెప్పదలంచితిని.

సాధుజీవి తీసికొనిరమ్మని యొక యాశ్రమవాసికిఁజెప్పఁగా నాయన చెప్పకుండనే పారిపోయెనని యాతఁడు జవాబిచ్చెను.

ప్రభుత్వమువారు జనాభా లెక్కలు వేయుచు నేబదియైదు లక్షల సాధువులే పనిపాటలు లేక కేవలము భూభారమునకే యుండిరని తెలిపిరి.

మానవుఁడు జీవిత సార్థక్యమునకుఁ బాటుపడక సోమరియై తన జీవితమును వ్యర్థపుచ్చుట విషాదకరము.

భిక్షాటనమువంటి వృత్తులు కొన్ని గలవని వినుటకు నే నాశ్చర్యపడితిని. ఆ వృత్తిలో రోజులానందముగా గడచిపోవుచుండ నా వ్యక్తి సాధువుగా మారి కావి బట్టలు ధరించుట కేమి కారణమో ?

ముష్టి యెత్తుకొనవలెనన్న నింటింటికిఁ దిరుగవలెను. కాని గుడ్డలు ధరించి దండకమండలములను చేతఁబట్టి చిన్న గడ్డము పెంచి ఏ అరుఁగు మీఁదనో ఏ చెట్టు క్రిందనో కండ్లు మూసికొని కూర్చున్నచో నయాచితముగా అమాయక భక్తజనులు సాధుపుంగవునకుఁ బాలుఁ బండ్లు ఫలహారములు సమర్పించు చుందురు గదా! నీచమైన భిక్షాటనముకంటె సాధువేషమే మంచిదని మన కుహనా సాధువు కాషాయ వస్త్రములను ధరించినట్లు తోచును.

ప్రపంచములో నెనుబది నాలుగు లక్షల జీవరాశుల జన్మలలో మానవ జన్మయే యత్యుత్తమమని పండితోత్తములు చెప్పుదురు. అట్టి పరమోత్కృష్ట జన్మఁ బడయఁగలిగినందులకు నేదో యొక జీవసేవఁ జేయలేని జీవితము కేవలము భూమికి బరువు. ఈ సోమరి జీవుల జననము తల్లుల కడుపుచేటు.

గృహస్థుగానున్నను, యోగిగానున్నను "పరోపకారార్థ మిదం శరీరం" కావున మానవ సేవలో నుపయోగపడెడి జీవితములే ధన్యవంతములు.

మానవ సేవయే దైవసేవగా భావించి స్వార్థరహిత జీవితములను గడుపుచున్న మహనీయులకు, వారు యోగులైనను గృహస్థులైనను, ధన్యవాదములు. నరునిలోనున్న నారాయణునకు నమస్కృతులు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# వైకుంఠపాళి

## పరమపదసోపానపటము

ఈ మధ్యను శ్రీ రామారావుగారు తరుచు వారిబోధలలో, భగవద్గీత సారమంతయు, వైకుంఠపాళిలో కనిపించునని చెప్పుచుండుటచే, రెండు వైకుంఠపాళి పటములు ఆంధ్ర దేశము నుండి – నీలగిరి తెప్పించడమాయెను. ఒక రాత్రి గురుకుల బాలుడు సత్యకుమారీ, ఇగీందర్, బాలకృష్ణ, ఈశ్వరి వైకుంఠపాళి ఆడుచుండిరి. వారి ఆటను జూచుచుండ, మానవ జీవితమంతయు, పుట్టినది మొదలు గిట్టెడి వరకు జరుగు కష్టసుఖములు, కలిమిలేములు ఆ వైకుంఠపాళీలో స్పష్టముగా చూపబడినట్లుండెను. సుకృతముచే మంచికర్మ చేసినందున ఒకరు నిచ్చెనల నెక్కుచు, చాల వరకు ఆనందముగా వారి ప్రయాణము సాగించుచుండిరి. మరి యొకరు చెడు కర్మ చేయుటవలన వారి ప్రయత్నములన్నియు విఫలమై, వారి పాపములకుగాను, పాముల నోళ్ళలోపడి క్రిందకు దిగుచుండిరి. ఒక్కొక్కరి ఆనందమును, విచారమును చూచుచుండ, ఆటలో పాల్గొనకుండ సాక్షి రూపముగానున్న నాకు వారి సుఖదుఃఖములు అందుటలేదుగదాయని తోచసాగెను.

సాక్షిగా నుండుటకు బదులు నేనుగూడ వారి ఆటలో పాల్గొనిన వారివలె నిచ్చెనల నెక్కినప్పుడు ఆనందించుచు, పాముల నోళ్లలో పడినపుడు దుఃఖించవలసి యుండును. గాన నిజమైన ఆనందము, శాశ్వతమైన శాంతి, సాక్షి మాత్రముగా, జీవన్ముక్తులుగా యుండెడివారిదేయై యున్నది. చెడుకర్మచే క్రిందకు నరకమునకు లాగునని యెరింగియు, ప్రత్యక్షముగా కండ్లతో జూచుచు, వైకుంఠపాళి ఆటలోగూడ, చిన్న చిన్న మోసములు, దుస్స్వభావముచే ఒక బాలుడు చేయసాగెను. దాని విధానమేమన గళ్ళు తప్పు లెక్కలు పెట్టుచు తోటి ఆటగాండ్రు కండ్లు కప్పుచు, కొన్ని నిచ్చెనలను అన్యాయముగా నెక్కుచున్నను, చివరకు తాను చేసిన దుష్కర్మచే పెద్ద పాము నోటిలోపడి,

మొదటికే తాను ఆట ప్రారంభించిన చోటునకే రావలసివచ్చెను. తాను జల్లిన చెడు విత్తనముల ఫలితము తానే అనుభవించి తీరవలెనని ప్రత్యక్షముగా జూచుచు, మరల చెడు విత్తనములనే మానవులు తెలియకయు తెలిసియు కూడ, బాహ్యముగాను, రహస్యముగాను, జల్లుచుండుట, మాయ యొక్క ప్రభావమై యున్నది. ఏ మాయలోను ఎన్నడును పడక, నిరంతరము సత్య, ధర్మ న్యాయ మార్గములనే నడచుచు, దుర్లభమైన మానవ జన్మయొక్క గమ్యస్థానమును, మరువక, అతి జాగ్రత్తగా నడుచువారి జీవితములే ధన్యవంతమైనవి. ఈ జన్మలోనే ముక్తి సంపాదించుకొనగలిగిన జీవితములు, అతి పవిత్ర జీవితములు, కాలము అమూల్యమైనదను విషయము చాల మంది మరచుచున్నారు.

ధనము పోయిన ఏమియు పోలేదు
ఆరోగ్యముపోయిన కొంత పోయెను
శీలము (ప్రవర్తన) పోయిన సర్వము పోయెను.
అమూల్యమైన కాలము పోయిన తిరిగి ఎన్నడు రాదు.

ఈ క్షణమే మనది. వచ్చెడి క్షణము మనదిగాదని ప్రతివారు సదా జ్ఞాపక ముంచుకొనవలసి యుండును. నరసింహ శతకములో ఈ దిగువ వ్రాసిన పద్యము యిచ్చట ఆశ్రమ పిల్లలు, నిత్యము పెదవులతో మాత్రము చదువుచుందురు. దానిసారము మాత్రం గ్రహింపలేకపోవుచున్నారు. వారి విలువైన కాలమును వ్యర్థమైన మాటలతోను అసత్యములతోను వ్యర్థ పుచ్చుచుండుట చూడ చింతగా నుండును.

సీ॥ సాంజ్ఞ భౌతికము దుర్భరమైన కాయం బి
దెప్పుడో విడచుట ఎరుకలేదు
శతము వత్సరముల మితము చెప్పిరి గాని
నమ్మరాదా మాట నెమ్మనమున

బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలి యందో
యూరనో యడవినో యుదక మధ్యముననో
ఎప్పుడో విడచుట యేక్షణంబో

తే॥ మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన
దేహమున్నంతలో నిన్ను దెలియ వలయు
భూషణ వికాస ! శ్రీధర్మపుర నివాస ! దష్ట
సంహార ! నరసింహ దూరిత దూర !

ప్రవృతి అంతయు మాయ యొక్క ప్రభావముతో నిండియున్నది. మిడుత, దీపము తన్ను కాల్చి వేయునని తెలియక దీపములో పడి నశించుచున్నది. మానవుడు విషయవాసనలు, ప్రవృత్తి పనులు, స్వార్థముతోగూడియున్న ఆలోచనలు, అపాయకరమైన మాటలు, స్వార్థపు పనులు, తనకు హానికరములని తెలిసియుండియు, చేసిన చెడుపనులనే, మరల, మరల చేయుచు, దుస్సాంగత్యములను విడువలేక, మంచి బోధనలను ఎన్ని విన్నను, మరచుచు, వారి కర్మ ఫలితములను అనుభవించుచున్నారు.

ఎనుబది నాలుగు లక్షల జీవరాసుల జన్మలలో మానవజన్మ ఎంత వుత్తమమైనదో తెలియజాలక, దుర్లభమైన మానవజన్మను పొందియు, అవివేకులైన మానవులు, అమూల్యమైన తమ కాలమును మానవ జీవిత పరమావధిని తెలిసికొనలేక, వారి జీవితములలో మంచి ఆశయములేమియు లేకుండ, ప్రతిరోజూ, ఏ పేకాటలోనో, జూదములోనో, త్రాగుడులోనో వ్యర్థబుచ్చుచు వీటితో తృప్తిపొందక, నివృత్తిపరులకు, దైవపనులకు పాపభీతి లేక హాని గల్గించుటలో గడిపెడి వారి జీవితములు చాల విషాదకరములు గదా! ఇట్టివారు, నూతన దుష్కర్మలను జేసుకొనుచు చివరకు మృత్యువు నోటిలో – పెద్దపాము నోటిలోపడి, అధోగతి పాలగుచుండుట చాల

విచారకరము. అంతులేని అనేక జన్మలలో పుట్టుచు, చచ్చుచు, తరించలేక బాధపడుచున్నారు.

బీదసాదలను హింసించి రెండు, మూడు నిచ్చెనలను ఎక్కగలిగితి మనిగాని, చివరకు 99 మెట్లు ఎక్కగలిగితిమనిగాని గర్వించరాదు. ఏలనన, ఎవరు జల్లిన విత్తనముల ఫలితమునువారే అనుభవించి తీరవలెను. అట్టివారికై వైకుంఠపాళిలో పెద్దపాము వేచియుండును. నూరు నోములు నోచియు ఒక్క పొరపాటు వలన తిరిగి పుట్టి జన్మ ప్రారంభింపవలసి యుండును.

ప్రియమైన సోదరీ ! సోదరులారా ! మీకు దుష్కర్మచే, పేకాట మొదలయినవి అలవాటున్నచో వాటికి బదులు వెంటనే వైకుంఠపాళిపటము నొక్కటి తెప్పించి, మీరును మీ బాలబాలికలును దానిని ఆడుచు దాని సారమును గ్రహించి దినదినాభివృద్ధి నొందుచు, తరించుటకు సదా కృషి చేయుడు. కర్మ సూత్రములను ఎవ్వరును, ఎంత ఉన్నతోద్యోగస్థులైనను, ధనవంతులైనను, బలవంతులైనను, మంచి పండితులైనను, అతిక్రమింపజాలరు. ఇంద్ర పదవి సంపాదించిన నహుషుడు తన గర్వముచేతనే పాముగ జన్మింపవలసి వచ్చెనుగదా! భక్త చింతామణిలోని ఈ దిగువ పద్యమును చదివి, దానిని వల్లించి అర్థమును సదా స్మరించి దుర్లభమైన మానవ జన్మలను సార్థకము చేసుకొనుడు.

మ॥ మనుజుండై పశువౌటకంటె పశుజన్మం బెచ్చు
నీవెట్లు దానిని బుట్టించితివట్లు జేయునది
హా నిర్భాగ్యతన్ జ్ఞానమెల్లన్ వ్యత్యస్తము చేసి
నీ విధుల నుల్లంఘించెదన్ నేను దండన కర్హుండను
బ్రోవవే నను దయన్ సద్భక్త చింతామణీ !

క్షణములను వ్యర్థ బుచ్చెడివారు జీవితమునంతయు వ్యర్థబుచ్చెదరు. గాన మీ ప్రతిక్షణము స్వార్థరహితముగా దైవసేవతో, ధర్మ జీవితములో

వినియోగించుచు, దీపము ఆరిపోకుండగనే తరించెదరుగాక! మానవసేవయే మాధవసేవ యనెడి గొప్ప సూక్తి మీరెరింగినదియే ! ప్రేమయే దైవముగాన ఎవరిని ప్రేమించినను దైవమునే ప్రేమించుచుంటిమి. ఎవరికి అపకారము, హాని కల్గించినను, దైవమునకే హాని గల్గించుచుంటిమి. ఏలనన, దైవము సర్వాంతర్యామి, సర్వవ్యాపి. రెండుగాక భిన్నముగా అన్యముగా నుండక, జ్యోతి రూపముగా మనందరి హృదయ నివాసియై మనందరిలోనే నిరంతరము ప్రకాశించుచుండెను.

ప్రియమైన పాఠకులారా ! ఒక్కసారి వైకుంఠపాళీని తెప్పించి, దానిని అతి జాగ్రత్తగా అర్థము చేసుకొని చూడుడు. అహంకారమనెడి పాము ఎంత పెద్దదిగా నున్నదో చూడుడు దాని నోటిలో పడినవారికి ఇహపరములలో శాంతిలేదు. రావణుడు, హిరణ్యకశ్యపుడు తప్పించుకొనలేకపోయిరి. నరకమే అథోగతియే ప్రాప్తించును. గాన దురాశలను వదలుటకు ప్రయత్నించుడు.

శ్లో॥ ఆశయా బద్ధ్యతే లోకే కర్మణా బహుచింతయా
ఆయుక్షీణం నజానాతి, తస్మాత్ జాగ్రత, జాగ్రత ।

ప్ర:- వైకుంఠపాళి ఆటయొక్క గొప్పతనమేమి ?

జ:- ఈ ప్రపంచములో మానవ జన్మ ఎత్తిన ప్రతివారు తరించుటకు చక్కని మార్గము, భగవద్గీత సారమును దానిని చదువలేనివారికి కూడ సులువుగ అర్థమగునట్లు తెలుపుచున్నది. ధర్మ, అర్థ, కామ, మోక్షములు మన పెద్దలు మనకు చూపిన రాచబాట.

ప్ర:- నిచ్చెనలేమి? పాములేమి? పరమపదమేమి?

జ:- మంచిచేసినవారు, దాన ధర్మంబులు చేయువారు, నిచ్చెనలెక్కి ఈ లోకములో సుఖములేకాక, స్వర్గలోకములో, పుణ్యలోకములోచేరి సుఖముల ననుభవింతురు. పాపము చేయువారు, పామునోళ్ళలో పడుచు, తిరిగి పుట్టుచు,

అనేక జన్మలెత్తుచుందురు.

ప్ర:- జన్మలెట్లు వచ్చును? అవి తప్పించుకొనుటెట్లు?

జ:- శ్లో॥ పునరపి జననం పునరపి మరణమ్
పునరపి జననే జఠరే శయనమ్
ఇహ సంసారే బహు దుస్తారే
కృపయా పారే పాహి మురారే.

మ॥ జలధి వ్రాజ దభంగభంగముల యోజం బుట్టుచుం గిట్టుచుం॥
గలకాలం బిటు గర్భవేదనలచే గ్రాగంగ నేలా సము।
జ్వల సంసార సముద్ర మీదుటకు నై సర్వాత్మకుండౌ హరిం
గొలువన్ మోక్షముగల్గు మూఢ హృదయా గోవిందు
సేవింపుమా!

ఏ కోరికలతో జీవితమంతయు గడిపి చివరకి అవి ఫలింపక చనిపోయిన యెడల ఆ కోరికలు సఫలం చేసుకొనుటకు, ఆయా జన్మలను, మనకు తెలియకుండగనే సంపాదించుకొందుము. ప్రతివారు నిచ్చెనలనే ఎక్కదలంతురు; పాములనోళ్లలో పడదలంచరు. గాని తెలిసి, తెలియకచేసిన, దుష్కార్యములు, పాముల నోళ్ళలోనే పడవేసి మనకు కావలసినన్ని జన్మల నిచ్చును. ఈ జన్మలను ఎవరును తప్పించలేరు.

ప్ర:- అది, ఎటులను?

జ:- ఒకడు తన జీవితములో రెండే కోరికలను, సదా కోరుచుండను, ఒకటి తినుటకు ఎప్పుడు కాలనియమము లేకుండ ఆహారము వుండవలయును. రెండవది స్త్రీ సంగమావకాశము నిరంతరము కావలెను.

ప్ర:- అతడు ఏ జన్మము సంపాదించెను?

జ:- కర్మఫల ప్రదాతయగు శ్రీపరమేశ్వరుడు, అతని కోరికలు నెరవేర్చుకొనుటకు, పంది జన్మను ప్రసాదించెను. అది వేళపాళలు లేకుండ ఆహారము తినుచు, నియమము లేకుండ స్త్రీ సంగమసౌఖ్యము పొందుచుండెను. తాను ఆ పంది జన్మను కోరలేదుగాని తన కోరిక లీడేర్చుకొనుటకు అదియే సరియైన జన్మగదా!

జ:- మన కోరికల పాపముల ననుసరించి, పాముల నోళ్ళలోపడి తిరిగి, తిరిగి అనేక జన్మలెత్తక తప్పదు. కుక్కలై, కోతులై, పురుగులై మన కర్మల ఫలితముగ అనేక జన్మలలో పుట్టుట తప్పదు.

ప్ర:- మన జన్మరాహిత్య మెట్లు ?

జ:- ధర్మయుతముగ జీవించుచు వైరాగ్య వివేకములను సంపాదించుకొని, అహంకారమైన పెద్దపాము నోటిలో పడకుండ తిరిగి జన్మ ఎత్తకుండగ, అతి జాగ్రత్తగా భక్తితో, అతి పవిత్రముగ జీవితములు గడుపుకొనుచు ఈశ్వరానుగ్రహము సంపాదించుకొని, పెద్దపామును సదా జ్ఞాపకముంచు కొనుచు, ఏ పాపములో పడకుండ శ్రీ పరమేశ్వరునితో ఐక్యము నొందవలెను.

ప్ర:- ఇంకను పుట్టవలెనా?

జ:- బ్రహ్మైక్యము పొందినవారు తిరిగి పుట్టనక్కరలేదు. ఆటలో ఉత్తీర్ణత చెందినవారగుదురు. తిరిగి ఆడనక్కరలేదు. పరమపదము చేరినవారు తిరిగి పుట్టనవసరము ఉండదు.

ఈ పవిత్రమైన ఆట, యీ కర్మభూమిలో పుట్టిన జీవులయొక్క ప్రపంచయాతనలు, యాత్రలు, దాన ధర్మములయొక్క ఫలితములు, మోక్షము సంపాదించుకొనుటకు మార్గములను స్పష్టముగ చూపును.

ఆశయే పుట్టుటకు ముఖ్యకారణము
పుణ్యమే స్వర్గము నిచ్చును

బ్రహ్మజ్ఞానమే జన్మరాహిత్యము చేయును.

ఆశారహితులకు బ్రహ్మజ్ఞానులకు ధన్యవాదములు

దైవము నెప్పుడోగాక, ఇప్పుడే అనుభవించుటకు తోడ్పడెడి మనలోక శాంతి ప్రార్థనను చక్కగ అర్థము చేసుకొని, దాని పవిత్ర అమోఘ సారమును గ్రహించి నిమీలిత నేత్రులమై, అతి భక్తితో స్మరించుచు, నిత్యశాంతిని, బ్రహ్మైక్యతను ఇప్పుడే, ఇచ్చటనేపొంది, జీవన్ముక్తి సుఖమును అనుభవించెదముగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతిః శాంతిః శాంతిః

# నా మూడు వరములు

ఈ వరములు నాకు జాగ్రదావస్థలో నివ్వబడెనో, స్వప్నావస్థలో నివ్వబడెనో చెప్పజాలను. నా మనస్సునకు అవి ప్రత్యక్షముగా, నా కండ్లముందు జరిగినట్లే, ఆనందముగా, నూతనశక్తితో నిండియుంటిని.

దైవము నిర్హేతుక జాయమాన కటాక్షాపరుండు, మనము కోరకుండగనే తనబిడ్డలకు ఎవరెవరికి ఏమి కావలయునో, సర్వజ్ఞుండైన ఆయనకు గ్రాహ్యమే!

నేను కోరినను కోరకున్నను నాకు అనగా, ఆశ్రమమునకు ఎప్పుడెప్పుడు ఏమికావలసిన ఆయన, వాని నొసంగుచుండును. అందుచేత నేను ఆయన గారాబు ముద్దుబిడ్డనని మురియుచుందును.

నీలగిరిలో **(Prayer Hall)** ప్రార్థనాలయము కావలయు నంటిని. చేతిలో నయాపైసా లేకున్నను నలుబదివేల రూప్యములతో దానిని పూర్తిచేసెను.

సుశీల ఆసుపత్రికి, స్త్రీల పురుషుల వార్డులు కావలయునని సంకల్పించగ వాటిని ప్రసాదించెను. ఆ వార్డులమీద, రోగులకు, డాక్టర్లకు ఆసుపత్రిలో పనిచేయువారందరి ఉపయోగార్థముగా పూజామందిరములు **(Shrine Rooms)** కావలయునని కోరగా వాటిని ఏర్పరచుచుండెను.

రామతీర్థ శాంతి కళాశాలను **( Rama Tirtha Institute of Peace)** దేశ వృద్ధి, లోకశాంతికై కావలయునని కోరగా, ప్రేమతో గొప్ప గొప్ప మేధావంతులు, అనుభవనీయులైన స్వాములు, విజ్ఞుల హృదయములలో ప్రవేశించి ఆ సంకల్పమును నెరవేర్చుచుండెను. ఒక్కొక్కసారి పసితనపు హృదయముచే లేనిపోనికోరికలు కోరుచు, దయానిధియైన, నా తండ్రికి అనవసరముగా శ్రమ కల్గించుచుంటినేమో అని తలంచుచుందును.

ప్రస్తుతము దేశమంతయు అల్లకల్లోలముగా నుండ, అనాధులు, రోగులు, బీదసాదలమీద బాంబుల వర్షము పడుచుండ, ఆసుపత్రులు,

మసీదులు, గుళ్ళు గోపురములు నిర్దాక్షిణ్యముగా మటుమాయ మగుచుండ, మనస్సు చింతతో నిండి, హృదయము బరువెక్కుచు, ఏ దిక్కును దక్షతయు లేనందున "దీనదయాళుడు, సర్వజ్ఞుండైన దైవమువైపే చూచుచు, మరి వేరే దిక్కులేదయ్యా. శరణాగతులను పడరాని అవస్థలు బాధలుపడుచున్న నీ బిడ్డలనుగావుమయ్యా!" అని కోరుచుండ ఆయన ప్రత్యక్షమై మూడు వరము లిచ్చినట్లు భావించి పరవశత్వమును పొందితిని.

**మొదటి వరము :**

ఓ దేవా! కృపామయా ! నీ బిడ్డలను, వారిని అవస్థలు బాధలలో, నీవు బ్రోవకున్న, మరెవ్వరు బ్రోచెదరు?

దేశమంతయు, లోకమంతయు, పోరాటములు, యుద్ధములు లేకుండ – శాంతిగా నుండులాగున, వ్యక్తులలో, సంఘములలో, దేశములలో క్రూరమైన కక్ష, కామ క్రోధములకు బదులు, సహనము, సామరస్యము, ప్రేమ, శాంతిని స్థిరముజేసి, లోకా స్సమస్తా స్సుఖినో భవంతు, సర్వేజనా స్సుఖినో భవంతు అనెడి శాంతి వాక్యములను స్థిరము చేయుటయే నా ముఖ్యమైన ప్రథమ వరముగా ప్రసాదింపుము.

**రెండవ వరము :**

దైవము, దేశవృద్ధి, లోకశాంతికై నేను కోరిన వరముతో ఆనందించి, మరొక్కవరము కోరుకొనుమని చెప్పగా, ఆశ్రమములోనున్న ప్రతియొక్కరు, ఆశ్రమ భక్తులైన సందర్శకులందరు నీ బిడ్డలేగాన, నీ సేవచేయుటకు వారి జీవితముల నర్పించిరి గాన, ప్రతి వ్యక్తిని బాలబాలికలను, చిన్నలను, పెద్దలను శాంతి ఆశ్రమంలో నుండుటకు అదృష్టము గల్గినవారినేగాక, వ్యయ ప్రయాసలతో, ఆశ్రమమునకు వచ్చుచున్న వారందరినీ, మా శాంతి పాఠకులను, విశ్వప్రేమతో, పూర్ణ శాంతితో, స్వార్థరహితమైన జీవితములతో నింపి,

నిరంతరము, తమ్ముమరచి, ఇతరుల సేవలోనే, లోకకళ్యాణమునకు సదా స్వార్థరహితముగా పాటుబడెదు లాగున ఆశీర్వదింపుము.

**మూడవ వరము :**

దైవము ఈ వరమునకు గూడ ఆనందించి మూడవ వరమును కోరుకొనమనగా.

తక్కువేమి మనకు రాము డొక్కడుండువరకూ–దయామయా ! నా అండగా, సర్వముగా, జీవితాధారముగా యుండ నాకింకేమి కావలయును.

ఈ నేత్రములు నిన్నే గాంచుగాక !
ఈ కర్ణములు నీ శబ్దమునే సర్వములో వినుగాక !
ఈ వాక్కు నీ గురించియే ప్రసంగించుగాక !
ఈ మనస్సు నీ గురించియే చింతించుగాక !
ఈ హృదయము నీ గురించియే స్పందించుగాక !
ఈ శ్వాస ప్రతీ శ్వాసయూ నీవైపునకే ప్రవహించుగాక !

**Inhale, Exhale, Peace thy Birthright !**

నా జన్మహక్కు అయిన శాంతినే ప్రతీ ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో పూరించుచు, విడచుచు, నీ దివ్య సన్నిధినే నిరంతరము అనుభవించు చుందును గాక!

అన్ని సంకల్పములలో, వివిధమైన ఆలోచన లన్నింటిని, జ్ఞానాగ్నిలో భస్మముచేసి, ఈ జీవితము నీటిబుడగ సముద్రములో లీనమైనట్లు – నీ అఖండ సచ్చిదానంద స్వరూపములో విలీనమగుగాక !

సహజానందము, సంకల్పరాహిత్యమైన స్థితియే మానవ జీవితమునకు అధారము గమ్యస్థానము.

కోరికలే సంసారము
కోరికలు లేకుండుటయే మోక్షము
ఆశ పిశాచము వంటిది.
ఆశారాహిత్యమే ముక్తి.

క॥ వాసనలే సంసారము । వాసన లడంగుటయే ముక్తి
వదలదటంచున్ । వాసన లణచి యథాస్థితి
గాసిల్లక యుండువాడె ఘనుడౌ ధాత్రి.

అని అష్టావక్ర మునీంద్రులు నుడువుచుండిరి. మూడు వరముల జ్ఞాపకార్థముగా శాంతి మంత్రమును గీర్తించుచు, సర్వ వ్యాపకుండును, సర్వజ్ఞుండును, సర్వశక్తుండైన, ఆ పరంధామునకు మన కృతజ్ఞతను దెల్పుదుము గాక !

శాంతి మంత్రము

ఆకసంబున శాంతి వెలుగుగాక !
సర్వధామమున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక !
జలములందున శాంతి సుస్థిరంబగుగాక !
పృథ్వియందున శాంతి కీర్తింపబడునుగాక !
సకల వృక్ష లతా గుల్మములయందు
శాంతినదము ప్రవహించునుగాక !
సమస్తచరా చరములు శాంతితో నింపబడునుగాక !
సర్వగృహములను శాంతి వ్యాపింపబడునుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !
ఓం శాంతిః శాంతిః శాంతిః

**A Tiny offering to Chy. Jnaneswari's Birthday.**

చిరంజీవి జ్ఞానేశ్వరి జన్మదినమునకు, ఆమె ఆయురారోగ్యములను నిరంతర సేవాభాగ్యమును కోరుచు, జ్యోతిస్వరూపుని ఆశీర్వాదములతో ప్రేమపూర్వకమైన అర్పణ.

# నేను మార్కండేయుడను

పూజ్య స్వామీజీవారి 'నేను మార్కండేయుడను' అను వ్యాసమునకు
పూజ్యశ్రీ రామానంద తీర్థులవారి తొలిపలుకు.

స్వామి ఓంకార్‌జీ వ్యాసమైన "నేను మార్కండేయుడను" చదివిన శ్రీవారు ఎట్టి అత్యున్నతమైన ఆధ్యాత్మికమైన ఉన్నత స్థానమునందు వారుండిరో మనకు తెలియును. ఎవరైతే నిత్యమైన, శాశ్వతమైన ఆద్యంతరహితమైన అంతర్యమందున్న ఆత్మలో విలీనమయ్యేదరో, నాశనము చేయు యమునికైనను వెఱవరు. వాస్తవముగా మృత్యువు అట్టి అజ్ఞానమును పొందిన వ్యక్తులను స్పృశింపజాలదు. స్వామీజీ వినాశనమైన మృత్యువును సవాలుతో ఎదుర్కొనగలరు.

స్వామీజీ మృత్యువును ఓడించి ఆ అనంత బ్రహ్మాండములోనికి ఎగయ గల్గుటకు ఎవరైతే దేదీప్యమానమైన తేజస్సుతో అనవరతము విలీనమయ్యేదరో, యముడు వారి నుండి ఖిన్నుడై ఆశాభంగము పొందినవాడై వెడలవలసియున్నది.

దేవుని మరచుటయే నిజమైన మృత్యువు. స్వామీజీ మనలనందరను హెచ్చరించుచున్నారు. వారు ప్రత్యక్ష క్షణమునందే దైవమునందుండుడని ఆదేశించుచున్నారు. మృత్యువును ధిక్కరించుట కదియే మార్గము. ఈ దినముగాక ఎప్పుడైనను ఈ భౌతిక శరీరము నశించుట తథ్యము - ఆత్మ సర్వవ్యాపియై యున్నది. మన యందున్న మార్కండేయుడు అవినాశనమైన వాడు. స్వామి ఓంకార్‌జీ మనలనందరను మార్కండేయులుగా కావలెనని అతిఘనమైన విధముగా బోధించుచున్నారు.

శ్రీ స్వామి ఓంకార్‌జీలో భౌతికదేహము విశ్రమించెను గాని వారియందు అంతర్యజ్యోతి దేదీప్యమానముగా ప్రకాశించుచున్నది. ఎవరైతే ఆ జ్యోతి స్వరూపమును ఆకాంక్షించుచున్నారో, వారికి శ్రీవారు ఆ తేజస్సును ప్రసరింపజేయుదురు. ఎవరైతే పరిశుద్ధ ఆత్మతో వారు వారి మాధుర్యమును

ఆధిక్యమును అందరికి పంచుకొన గోరుచున్నారో, శ్రీవారు అట్టి దివ్యపురుషుల సంఘమునకు చెందినవారు. వారే ఈ భూమికి సారమై ఆధారమై యున్నారు. అట్టివారి దివ్య జీవనమే యావత్ప్రపంచములోని మానవాళిని పునీతులను చేయుచున్నది.

శ్రీ స్వామీజీ వారియొక్క ఆకర్షణశక్తి చేతనే అనేకమంది ముముక్షువులను ఈ దేదీప్యమానముగా వెలయు తేజస్సులోనికి ఆకర్షించ గల్గిరి. వారు దైవమును మరచుటయే మృత్యువు అనిన్ని దైవ జ్ఞప్తియే ఆద్యంత రహితమైన దివ్యజీవన మనిన్ని మనకు మరల మరల నొక్కి వక్కాణించుచున్నారు.

ఒక పరిశుద్ధమైన ఆత్మసాక్షాత్కారమును పొందిన మహాత్ముని దివ్య స్పర్శచే మానవకోటి అంతయు పునీతము కాగలదు. ఎవరైతే జీవించి యుండగనే మృత్యువును జయించెదరో, అట్టి మహాత్ములు ప్రస్తుత ప్రపంచ మందుండుట మన అదృష్టము. మహాసిద్ధుడైన భక్తతుకారం నా కన్నులతో నా మృత్యువు చూచితినని నుడివి యుండిరి.

ఏ మార్కండేయుడు శ్రీ స్వామీజీలో ఉన్నాడో ఆ మార్కండేయుడు మననందరిని మేల్కొల్పుచున్నాడు. ఆ పిలుపునకు మన మందరము మేల్కొందుమా? ఎవరైతే ఈ పిలుపునకు సిద్ధముగా యుండిరో వారే మృత్యుదేవుడైన యముని ధిక్కరించి, శాశ్వతమైన దివ్యజీవనమును పొంద అర్హత కలిగియుందురు.

ఈ శాంతిదూతకు నా యొక్క వినయపూర్వక వందనములు !

ఓం తత్ సత్ !

హైదరాబాద్ శ్రీ స్వామి రామానందతీర్థ

15-7-65.

# నేను మార్కండేయుడను

(యముడు నన్ను పిలుచుచున్నాడు)

మార్కండేయుడు పూర్వకాలపు బాలయోగి, యాతడు పదునాఱు వత్సరముల లేతవయసుననే చనిపోవునని తలంపబడెను. ఈ లోకము నుండి మార్కండేయుని గొనిపోవుటకు, మరణాధిపతియగు యముడు ఆ నిర్ణీత సమయమున కేతెంచెను. కాని పాప మా మార్కండేయుడా సమయమున మహోన్నత ప్రభువగు భగవానుని పూజలో నిమగ్నుడై యుండెను. ఆతడు అంతర్జ్యోతియగు "సోఽహం" మంత్రజపమున మనోహృదయాత్మలో పూర్తిగా లీనుడై, శివలింగము నాలింగనము చేసికొనియుండెను. పాప మా అసహాయుడగు యముడేమి చేయగలడు? భక్తమార్కండేయుని మెడను చుట్టి లాగుటకు తన పాశమును పలుమారులు చాచి, ప్రయత్నించెను. కాని, పాప మా మృత్యుదేవుడు తన జీవితములో ఒకేఒక్కసారి ఇప్పుడు తన ధర్మమును నెఱవేర్చుటలో పూర్తిగా విఫలుడై నిస్పృహతో యమలోకమునకు మరలవలసిన వాడాయెను.

ఈ రోజులలో, ముఖ్యముగా నేను గుండెజబ్బుకు లోనైనప్పటి నుంచి, నేను అమృతుడగు మార్కండేయుడనని (తెలిసియు తెలియకను కూడా) స్పృహతోను, స్పృహ లేకయుకూడ మననము చేసికొనుచూ ఆనందించుచుందును, సదా యువకుడగు మార్కండేయునిగా నుండుటెంత ధన్యవంతము ! నేను పదునాఱు వత్సరముల యువకుడను మాత్రమే ! శాంతిగా కొంతకాలము గడుపనెంచి, నిర్ణీత! సుముహూర్తమున కైలాసగిరి నవరోధించుటకు, వాల్తేరాశ్రమములో నేను సన్నద్ధమగుచుండ, యముడు గుండెజబ్బు రూపమున, తన దూతను నా కొరకు కూడా పంపెను. కాని, అంతర్జ్యోతియగు "సోఽహం" మంత్రమున నేను నిమగ్నుడనై దానిని యంటిపెట్టుకొని యుంటిని. నేను "పరిచర్య గృహము" **(Nursing Home)**

నకు తరలింపబడితిని. మాత "సుపీరియర్" యొక్కయు, భక్తులగు నర్సు సోదరీలందరి యొక్కయు సహవాసములో నేను, గుండెజబ్బులో ఉండిన్నీ లో వెలుగులో నిమగ్నమై ఉన్నందున, యముడు కిటికీలలో నుంచి మాత్రమే తొంగిచూచుచుండెను.

నేను విక్టోరియా ఆసుపత్రి అధిపతి డాక్టరు రమణి యొక్క సుఖవంతమగు నివాస గృహములలో వసించియున్న సమయమున కూడా, యముడు వచ్చుచుండెను; కాని భక్తులగు సూపరింటెండెంటు, యామె పరివారము అంతా కూడా ప్రార్థన ధ్యానాది భజనల నిర్వహించుచుండుట గాంచి, లోపలకు ప్రవేశించ జాలకుండెను. ఆ తరువాత కూడ, నేను వాల్తేరాశ్రమము, కైలాసాశ్రమము మరియు తోటపల్లి మాతృ ఆశ్రమములలో నున్నపుడు, యముడు అంతర్జ్యోతియగు భగవానుని నేను మరచియున్నానో లేక 'సోऽహం' జ్యోతితో సదా ఐక్యమైయున్నానో, తరచు కనిపెట్టి చూచుచూ, నా ప్రాణము కొరకు ఇంకనూ ప్రయత్నించుచునే యుండెను. కాని పాపము యముడెప్పుడున్నూ నిస్పృహ చెందుచునే యుండెను. నేను భగవత్కృపవలన, దైవముయొక్క ప్రత్యేక ఆశీర్వాదమువలన నేనాయన యొక్క గారాబు బిడ్డనుగాన, సదా నేనే జయించుచుంటిని. సర్వజ్ఞుడగు భగవానుని యాజ్ఞ ప్రకారం, నేనొక మహత్కార్యము నిర్వహించవలసి ఉన్నది. ప్రాక్ పశ్చిమముల వివిధ మతములలోని, యాతని బిడ్డల ఉపయోగ సహాయములకు, కోటగిరి శాంతి కేంద్రములో, పుస్తక భాండాగారము మరియు అతిథి గృహములతో కూడిన ప్రార్తనా మందిరమును నేను పూర్తి చేయించవలసి ఉన్నది.

నా ప్రియులగు వైద్యుల కోరికలకు వ్యతిరేకముగా, నేను కొండ ప్రదేశములపైకి యేగుచుండునపుడు, యముడు నన్ను చూచి నవ్వుచుండును. నాయొక్క హృదయము పంపు యంత్రమువలె కొట్టుకొనుచుండ, గోతులుపడ్డ పాడు బాటలపై 'మంత్రాలయము' లోనికి నేను వెళ్ళినప్పుడు, యముడు, నా

అంతర్యమును కోరుచూ, నా యడుగుజాడ ననుసరిస్తూ నన్ను వెన్నంటి ప్రత్యక్షమై యుండెను. కాని "సోऽహం" జ్యోతియగు అంతర్మహాశివుని పట్టుకొని విడువక, యముని కూడా నగుపాలుచేసి యుంటిని. యముని మాట అటుంచి, ప్రాపంచిక జనుల సహవాసమున నేను కాలము గడుపవలసి వచ్చినప్పుడు, ముఖ్యముగా విలువగు నా కాలమును చర్చలతో వృధా చేయునపుడు, ప్రశాంతమగు "అంతరాత్మ" లో నుండి, నెమ్మదిగానిటుల నన్ను ప్రబోధించుచుండును – "ప్రియమగు మార్కండేయా, నా బిడ్డా! నీ కాలము యొక్క ప్రతిక్షణం మహా విలువైనది. ఏ క్షణంలో ఏమి జరుగునో కదా ! భయంకరుడగు యా యముని చూడుము. బలవంతులగు జనులను, మహాశక్తి సంపన్నులగు యోగులను, స్వాములను కూడా నిర్దాక్షిణ్యముగ వారి ప్రాణములను హరించి, యమపురి కంపుచున్నాడు ! ప్రియా, నీలో నున్న మార్పులేని, శాశ్వతమగు స్వయం జ్యోతిర్లింగమును పట్టుకొని విడువకుము. అమోఘమగు యమపాశము నుండి, మరియు సర్వ ప్రమాదముల నుండి నీవు ఈ విధముగా మాత్రమే రక్షణ పొందగలవు. దైవమును మఱచుటే నిజమగు మృతి. దైవజ్యోతిని మఱచియున్న అన్ని సమయములందున, యముడు మనను కనిపెట్టి చూచుచుండును. మన చుట్టును తిరుగుచు, మృత్యుదేవత మనలనంటియే యుండును. అది పైన, క్రింద, సర్వత్రా ఉండును. దేవుని నిరాకరించి, దేహము నంటి పెట్టుకొని ఉండువారిని మృత్యువు పట్టి పీడించును. స్వార్థము, మృత్యువు సన్నిహిత మిత్రులు. స్వార్థరహిత జనులందరికి మృత్యువు చేరజాలదు. సమీపించుటకు, ధైర్యము కూడా వహింపజాలదు. త్రుప్పు పట్టబడజాలని, చెదలు తినజాలని, చోరులపహరింప జాలని, ప్రభుత్వము స్వాధీనపరచు కొనజాలని, శాశ్వతమగు "దైవ" మనెడి మహాభాగ్యమును విడచి, నశించిపోవు భాగ్యమును ప్రోగుచేసి నిలవచేయుచున్న జనులను చూచి మృత్యువు నవ్వుచుండును.

ఓ మృత్యుదేవతా ! ఏది నీ గేహము ? సదా అంతర్జ్యోతియగు "సోఽహం" ను అంటిపెట్టుకొని యుండి, నేను మార్కండేయుడనై యుండగా, నీవు నన్నెటుల ముట్టగలవు ! బీదలు, మరియు రోగుల రూపములో సాక్షాత్కరించు దైవమునుకూడా నిరాకరించుచూ, "నాది" "నీది" యను తలంపులతో కేవలం తమ స్వార్థము కొఱకే జీవించుచూ, పవిత్రమగు వారి కాలమును వృధా చేయుచున్న యలసులను, స్వార్థపరులను పోయి చేరుము. విలువ కట్టబడజాలని, చిన్న, పవిత్ర క్షణముల విలువను గ్రహించని అజ్ఞానుల దరికి దయచేయుము. కాలము విలువలేనిది. ప్రతి చిన్న క్షణము జగత్తులోని సర్వభాగము కంటెను కూడ మిగుల విలువైనది. "సోఽహం" జ్యోతిని మరచి మార్కండేయుడు లక్షవ వంతు ఘడియ కూడా జీవించజాలకుండెను గనుకనే, యము డాతని తల వెంట్రుకను కూడా స్పృశింపజాలకపోవుటయే గాక యాతని దరికి కూడా చేరజాలకపోయెను.

ప్రియమైన శాంతి పాఠకులారా ! మీ జీవితములు రోగము మరియు అంధకారము యనెడు చంచల మేఘములచే యావరింపబడినను, మీరంతా సజీవ మార్కండేయులు, మృత్యురహిత మార్కండేయులు, అమృత మార్కండేయులు, అమృతత్త్వమే మీ జన్మహక్కు, దయచేసి మీరిప్పుడిక్కడనే యీ సందేశమును చదువునప్పుడే, దైవదత్తమగు యీ మీ హక్కును స్వాధీనపఱచుకొనుడు. మృత్యువనిన బయపడువారు, సుఖశాంతులకు, దీర్ఘ జీవితమునకు నిలయమగు "శాంతి కేంద్రము" నకు వచ్చి సుఖింతురుగాక ! మార్కండేయుడు మిమ్ములను పిలచుచున్నాడు. మార్కండేయు లందరకు మార్కండేయుడు హృదయపూర్వక స్వాగతము నందించుచున్నాడు. మానవుని గతికి మానవుడే అధిపతి. అతని ఉజ్జ్వల బుద్ధి బలముతో లోకమందనేక విషయములు జయించెను. బలీయులగు మహారాజులనుగాని, కోటీశ్వరులనుగాని, ప్రపంచములో మహా పలుకుబడి గల ఇతరులను గాని, ఇంచుకయు లెక్కచేసి గౌరవించకుండా, డాక్టర్లను, న్యాయవాదులను,

బలీదాయులగు రాజకీయ వేత్తలను, ప్రసిద్ధ శాస్త్రవేత్తలను, స్వాములను, యోగులను, ఋషులను, మహాత్ములను సహితం అందరిని హరించుకొనిపోయే నిర్ధయుడగు తిరుగులేని మానవ విరోధి, యముని కూడా ఇపుడు మానవుడు జయించుగాక! భేదభావ ద్వంద్వములతో కూడిన ప్రవృత్తి బాహ్య లోకములోని మిమ్ములను యముడు పిలుచుచున్నాడు. ఐక్య ప్రేమలతో కూడిన నివృత్తి అంతర్లోకములోని మిమ్ములను, లోనివాసి జ్యోతి "సోఽహం" అను శివుడు పిలుచుచున్నాడు. చీకటినో, వెలుతురునో, చావునో, జీవితమునో, మృతమునో, అమృతమునో, యమునినో, దైవమునో ఎన్నుకొని మేల్కొనవలసింది ఇపుడు మీరే, ప్రస్తుత జీవిత క్షణము మాత్రమే నీది గాన, మేల్కొనవలసిన సమయమిదే అయి వున్నది. నేడే నీదిగాని రేపు నీదిగాదు. నిజముగా యీ క్షణము మాత్రమే మనది. మార్కండేయునకు ప్రతిక్షణము లెక్కలోనిదే.

మరి ఇతరమేమి చెప్పగలను! నా చుట్టూ మార్కండేయుల, లోకమునే నేను చూతును, నా యొక్క "పీస్" "శాంతి" పాఠకులంతా సజీవ మార్కండేయులే. ఆశ్రమ సభ్యులు, కార్యకర్తలు, గురుకుల పిల్లలు, అంతా మార్కండేయులే.

ఆశ్రమంలోను, ఇండియాలోనే గాకుండా, ప్రపంచములో ప్రతిచోట కూడా మార్కండేయులే. అనంతజ్యోతి స్వరూపులు, శాశ్వత జీవులు, విశ్వప్రేమికులగు మార్కండేయులకు శుభమగుగాక !

మీరంతా మార్కండేయులు.
అందరూ మార్కండేయులు.

యముడు నన్ను స్పృశించుటకుగాని, మనదరికి వచ్చుటకుగాని, ధైర్యము వహింపజాలడు. యమునకు ప్రణామములు. మార్కండేయులకు దీర్ఘాయువు, దేవునకు ధన్యవాదములు.

# బాహ్య చదువుల వ్యామోహము

ఈ మధ్యను ఆశ్రమ భక్తులైన కొందరు తల్లిదండ్రులు, వారి బిడ్డల చదువుల గురించి, అవస్థలు పడుచు, ఇంకను పెద్ద చదువులు చదివించుటకు కోరుచు వారికి కాలేజీలలోను, యూనివర్శిటీలలోను, సీట్సు (Seats) కొరకై విశ్వప్రయత్నములు చేయుచు మమ్ములను గూడ (Seats) (వచ్చుటలో) తోడ్పడమని కాలేజీ అధికార్లకు వ్రాసి, సిఫార్సు జేసి యెటులైనను సీటు తెప్పించుటలో తోడ్పడమని చాల దీనముగా వ్రాయు ఉత్తరములు జూచి నాకు చింత కల్గుచుండును.

నేను ఏ కాలేజీలోనైనా, (యూనివర్శిటీలోనైనా) విశ్వవిద్యాలయములో నైనా ప్రిన్స్‌పాల్‌గా గాని, ఛాన్సలర్‌గా గాని పనిజేయుచున్న, ఎవ్వరితోనైనను జెప్పి, ఒప్పించి, తప్పక, తోడ్పడియే యుందును. గాని అన్నియు వదలిపెట్టిన సన్యాసినగుటచే, నామీద ఆధారపడి సహాయము కోరుచున్నవారికి, సరిగా తోడ్పడ జాలకుంటినని విచారించుచుందును. అయినను అందరి కోర్కెలు తీర్చవలెనని ఎవ్వరికి, నిరాశ గల్గించకుండ జీవించవలెనని, నాశక్తికొలది నన్ను నమ్మినవార్కి తోడ్పడవలయుననియే సదా కోరుచుందును గాన ఇట్టి సందిగ్ధావస్థలలో – నేను యెరింగిన వారికి, "ఫలానావారు ఫలానాసీటుకై నన్ను ఆశ్రయించిరిగాన, యీ సహాయమునకై నేను మిమ్ము పట్టుకొనుచుంటిని. ఏమాత్రం వీలుగానున్నను, నేను మీకు సీటును గురించి వ్రాయుచున్నందుకు అన్యథా తలచక తప్పక తోడ్పడగోరెదను" అని వ్రాయుచుందును.

నన్ను సహాయము కోరెడివారు, అన్నియు వదలిన యీ స్వామీజీకి బాహ్య సంబంధమైన, లౌకిక పనులు యేల కల్గించుకొనుచుండిరని, కొందరు తప్పుగా తలచెదరేమో అని కూడ ఆలోచన వచ్చినను, కర్మ యెట్టి వారికైనను తప్పదు గదా అని, నేను చేయవలసిన కర్మను స్వార్థరహితముగా ఫలాపేక్షను కోరకుండ వెంటనే జేయుచుందును.

ఈ పరిస్థితులలో నాకు, ఆదర్శనీయమైన భక్తులకు భక్తుడైన ప్రహ్లాదుడు నాకు జ్ఞప్తికి వచ్చుచుండును, తండ్రి హిరణ్యకశిపుడు "నాయనా, బడిలో చదువవలసిన చదువులన్నియు చదివితివా ! అని అడుగగా, ప్రహ్లాదుడు "తండ్రీ చదువులన్నిటికి ఆధారమైన చదువును, అన్ని చదువుల మర్మమును గ్రహించితిని, చదువవలసిన ముఖ్యమైన చదువునే చదివితి" నని సమాధానము జెప్పెను. అట్టి ఆత్మ చదువును, దైవమును జేర్చెడి చదవును మానవ జన్మయొక్క గమ్యస్థానము, జేర్చెడి ప్రాణతుల్యమైన చదువును చదివెడివారు, ప్రహ్లాదునివంటి విద్యార్థులు, ఈ కాలములో అరుదై యుండుట విషాద కరముగదా! దీని కంతకూ, ముఖ్యమైన మూలకారణము ఎచ్చట నున్నదని నాలో నేను ఆలోచించు చుందును.

తల్లిదండ్రులకు వచ్చిన చదువునే తమ బిడ్డలకు నేర్పుటకు, కోరుచుందురు, తమలో లేనిది, తమకు అక్కరలేనిది, తమ బిడ్డలకు కావలెనని కోరరుగదా ! తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి అని బోధించెడి తల్లితండ్రులు, ఎంతమంది యీ కలికాలములో ఉండిరో ప్రియమైన పాఠకులారా మీరే, నిమీలిత నేత్రులై ఆలోచించ గోరెదను ! ప్రప్రథమునే నేను ఈ బాహ్య చదువులు, అనవసరమని, చదువుకొనరాదని, వ్రాయుచుంటినని, మీరు ఎంత మాత్రము తప్పు అభిప్రాయము పడవలదని, ప్రార్థనపూర్వకముగా కోరుచుంటిని.

మీరు బాగా చదువుకొన వలసినదే ! మీ కుమార్తెలకు, తనయులకు, మనుమలకు, మనుమరాండ్రకు, బాగా చదువులు, గొప్ప గొప్ప చదువులు చెప్పించవలసినదే గాని అసలు చదువును, మరచి బాహ్య చదువుల వ్యామోహములోబడి, మీరు సంసార సముద్రములో మునింగి మీ బిడ్డలను కూడ, అంతు ఆది లేని అగాధములో నిర్దాక్షిణ్యముగా ముంచి వేయవలదు అని నేను కోరుచుంటిని. నేడే మనది, రేపు మనది కాదు, యముడు మన తలలు నెటిసే వరకు మనలను తాకడని – మనవద్దకు రాడని భ్రమ పడవలదు.

దైవ పిలుపు ఏ క్షణమున, ఏరోజున వచ్చినను రావచ్చును. దీపముండగా, గృహమును చక్కబెట్టుకొనుట మంచిది. ప్రాణము పోకముందే మనము మేల్కొని, మన బిడ్డలకు జ్ఞానోదయమును గలిగించి తోడ్పడుట చాల ముఖ్యావసరము. నిజమైన ప్రేమ తమ బిడ్డలయందు గల్గియున్న తల్లితండ్రులు, వారిని బాహ్య చదువుల పేరున, భక్తి, జ్ఞానము, దైవ ప్రేమ లేకుండ అధోగతి పాలు చేయరాదు.

బ్రతికియుండగా, మా అబ్బాయి బి.ఏ., చదువలేదు, ఎం.ఏ., చెప్పించలేకపోతిని, బి.ఎస్.సి., ఎం.ఎస్.సి., లో సీటు దొరకలేదని రాత్రింబగళ్ళు బాధపడుదుము. శరీరము హఠాత్తుగా పోయిన తర్వాత మన అబ్బాయికి, అమ్మాయికి, కాలేజీ యూనివర్శిటీ చదువులు, డిగ్రీలు సంపాదించ లేకపోతిమని అప్పుడు తలచము. అప్పుడు తలచెడిది అన్ని జన్మలలో దుర్లభమైన మానవ జన్మను కలిగి, నా గర్భమున జన్మించినందుకు శరీరము పోకముందే తరించుట ముక్తికి మోక్షమునకును, జన్మరాహిత్యము కల్గించే చదువును జెప్పించ లేకపోతిమి గదాయని, ప్రాణము పోయిన తర్వాతను విచారించెదము – దీపము ఆరిపోయిన తర్వాత చీకటిలో, ఎంత బాధపడి విచారించిన లాభమేమి ! వెలుతురుండగనే మేల్కొనుడు. మీరు తరించి మీ పిల్లల వృద్ధికి ముక్తికి తోడ్పడి, దైవచదువును, బ్రహ్మ విద్యనుగూడ, బాహ్య చదువులతో సమముగానైనను చెప్పించుడు? కాని మీకు లేని చదువు మీ పిల్లల కెటుల జెప్పించగలరు? బాహ్య చదువులు, బాహ్య పదవులు, వ్యామోహములు యెట్టి చదువరులకైనను, పండితులకైనను ప్రవృత్తిపరులకందరకును తమకు తెలియకుండగనే అధోగతిపాలు చేయుచుండును. ఈ సమస్యను విపులముగా బోధపర్చుకొనుటకు కొన్ని సామాన్యమైన చిన్న ఉదాహరణలను తీసికొందము. ఈ మధ్యనే తన కుమారునికి సీటు సంపాదించుటకై, తన తండ్రి హరిద్వారము నుండి రామేశ్వరమంత దూరము వచ్చి తన ఉద్యోగమునకు శెలవు పెట్టి

వ్యయ ప్రయాసలను లెక్కజేయక అవస్థలు పడుచుండును.

తన కుమారుని సీటుకై ఇచ్చట ఆశ్రమ భక్తులు ఒకరు తాను ప్రార్థనాలయము గురించి జేసిన వాగ్దానములు అన్నియు మరచి, చెప్పకుండ ఎచ్చటకో సీటుకై పరుగెత్తిపోయెను. ఇటులనే అనేకమైన తావులలో తమ బిడ్డలకు సీట్లు దొరుకుట లేదని, నిద్రాహారములు మాని తల్లిదండ్రులు బాధపడుచుండుట చాల విచారకరము. మరికొందఱు తండ్రులు, కాలేజీలు విశ్వవిద్యాలయముల గేటుల వద్ద తమ బిడ్డలను తీసికొనిపోయి, పడిగాపులు కాచి వేచియుందురు.

ఫైనాన్సు మినిష్టర్ ఆశ్రమ భక్తులుగాన వారిచే మాతమ్మునకు ఉద్యోగ మిప్పించుడు అని యొకరు, మరొకరు తన బావమరిదికి సహాయము జేయుమని, ఇటులనే అనేకమంది ఏదో ఒక సిఫార్సు చేయుమని కోరుచుందురు.

కొందఱు తల్లిదండ్రులు, నామ రూపములకు పేరు ప్రతిష్ఠలకు బాహ్యావేషములకు బానిసలై తమ బిడ్డలకు ఆధ్యాత్మిక, పునాది లేనందున చివరకు వారికే కష్టనష్టములు గలుగుచుండును.

దైవభక్తి, ఆధ్యాత్మిక పునాది లేనందున ప్రవృత్తిపరులైన బిడ్డలు దైవభక్తులను దైవ కార్యములను, జూచి హేళనజేయుచు, తమ తల్లిదండ్రుల అవసాన కాలమందు తమకు నిరుపయోగము అనగా ధనము సంపాదించి ఇవ్వలేనప్పుడు, వారిని సరిగా చూడక, స్వార్థముతోనిండి లోక కంటకులుగా కొందరు తయారగుచుందురు. మొన్ననే ఇచ్చట శాంతి కేంద్రము భక్తుడు, ఒక స్నేహితుని తీసుకొనివచ్చి "స్వామీజీ, ఇతనికి మెడికల్ కాలేజీలో సీటు మూడు సంవత్సరములనుండి దొరకుట లేదు. మొన్న మంత్రి శ్రీ వెంకటరామన్ గారిచ్చటకు వచ్చినారుగాన, మీరు ఇతనికి సీటు ఇప్పించుడు" అని ప్రార్థనాపూర్వకముగా కోరెను.

ఏమి జేయుటయో తెలియక, కొంతబాధపడితిని, దైవభక్తి, దైవ పరితాపముతో నిండుకొని జన్మయొక్క గమ్యస్థానమును చేరవలెనని ఆశ్రమములకు వచ్చెడివారుగూడ అరుదుగదా అని చింతింప సాగితిని. ఒంటె తన నాలుకకు ముండ్లు గ్రుచ్చుకొనుచున్నను, నోటినుండి రక్తము కారుచున్నను ఇంకను, ముండ్లున్న ఆకులనే తినుచుండును.

అటులనే దెబ్బమీద దెబ్బ తినుచున్నను, ఇంకను తెలివిగల చదువరులుగూడ, దైవానుభవము లేనందున, తమ పిల్లలను, బాహ్య చదువులకే ప్రాముఖ్యత నిచ్చును. ఆధ్యాత్మిక వాసన లేకుండజేసి అధోగతి పాలుజేయుట చాల విచారము.

విజయవాడలో ఒక జనని, తన తనయుని ఉగ్గుపాలు దగ్గర నుండియు, అపారమైన ప్రేమతో, వృద్ధి జేసెను. అతనినే సర్వముగా ఆధారముగా నమ్మినను, అతడు నూరుపాళ్లు ఆమెకు నిరాశగల్గించి ఆమెమీదనే తిరుగబడెను. దీనినుండియైనా, ఒక్క గుణపాఠము నేర్చుకొనక ఇప్పుడు తన కుమార్తెకు బాహ్యచదువులే చదివించుటకు డబ్బు లేక అందరినీ ప్రార్థించుచు, నానా అవస్థలు పడుచుండెను.

మరియొక్క విజ్ఞుడైన భక్తుడు, ఏలూరులో తన కుమారునే సర్వముగా జేసుకొని ధనవ్యయ ప్రయాసలతో అన్ని చదువులు చెప్పించెను. వయస్సురాగానే, నాలుగు డబ్బులు సంపాదించగానే అతడు తండ్రి మాటను నిరాకరించుట, తనతండ్రికి ఏమి తెలియదనియు తానే తన తండ్రికంటె తెలివైన వాడనని ప్రగల్భములు కొట్టుచుండెను. అట్టి కుమారుని హీనస్థితి నుండియైన పాఠము నేర్చుకొని ఆధ్యాత్మిక వృద్ధికి ప్రాముఖ్యత నిచ్చుచు, తన కుమార్తెనైనను సావిత్రిగనో, సీతాదేవి, శారదాదేవి, మీరాబాయిగానో దైవపరితాపనతో, వృద్ధిజేయక, అన్ని గొర్రెలవలె తాను గూడ గొర్రెలమందనే అనుసరించి,

కుమార్తెకు ఎన్ని అవస్థలైనను పడి, బాహ్య చదువులే జెప్పించుటకు అవస్థలు పడుచుండెను. నేనింతకూ నొక్కి జెప్పెడిది. పెద్దపెద్ద పండితులు, విజ్ఞులే బాహ్యచదువుల వ్యామోహములో పడుచుండిరి గదా అని వారినే గోతిలో, అగాధములో అంధకారములో నున్న వారినే మనము ఆదర్శముగా జేసుకొని, వారివలె సామాన్యులు గూడ అగాధములో పడరాదు.

బాహ్యచదువుల గమ్యస్థానము కొంత విమర్శించి, ఏది నిత్యమో, ఏది అనిత్యమో, అశాశ్వతమో గ్రహించి విజ్ఞులైన తల్లిదండ్రులు, తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి అను భాగవత ఉపదేశ వాక్యమును ఆచరణలో పెట్టుచు, తాము తరించి, తమ అనుంగుబిడ్డలకు గూడ జ్ఞానభిక్ష పెట్టుచు తరించే మార్గము జూపుచు తోడ్పడెదరు గాక !

పిల్లికి బిచ్చమైనా పెట్టని, దానధర్మములుచేయని మరికొందరు తల్లిదండ్రులు, వందలు, వేలు ధనమును తమ బిడ్డలకు సీటు సంపాదించుటకై, జలమువలె ఖర్చుపెట్టుచుందురు. కొన్ని కాలేజీలలో, సీటుకు ముందుగనే, రిజర్వేషనుకు వేలకొలది డిపాజిట్ కట్టవలసి యుండుట చాల విచారకరము. ఈ విద్యాలయములలో, కాలేజీలలో సీట్లుకొరకై వందలు వేలకొలది ధనమేగాక కొందరు తల్లిదండ్రులు, విద్యార్థులు, గుళ్ళు గోపురములలో దైవమునకు అభిషేకములు జేయించెదరు. కొబ్బరికాయలు కొట్టెదమని, ముడుపులు చెల్లించెదమని, కానుక లిచ్చెదమని వాగ్దానములు చేయుచున్నవారిని కూడ మనము జూచుచునే యుంటిమి.

నాకు ఆశ్రమ భక్తులైన తల్లిదండ్రులయందేగాక, అందరి తల్లిదండ్రులయందును, ప్రేమ గలదు. వారందరి బిడ్డలయందును ప్రేమ గలదు. అందరి తల్లిదండ్రుల అందరి బిడ్డల శ్రేయస్సులు కోరుచున్నందుననే ఇంతగా బాహ్య చదువుల పేరున అసలు చదువును, సత్యమైన, శాశ్వతమైన

ముక్తిని, శాంతినిచ్చెడి చదువును, మరువరాదని ఆ చదువును కూడ, బాహ్యా చదువులతో చదువుచు, వృద్ధియై తరించుమని యింతగా కోరుచుంటిని.

ఇంకను కొన్ని జీవితములయొక్క గమ్యస్థానమును విమర్శించిన, కొందరి దురదృష్టవంతులైన తల్లిదండ్రుల, చివరి అవస్థలు పరీక్షించిన, రక్తప్రాణములు ధారపోసి దానధర్మములైన లేకుండ తమ బిడ్డలకు సర్వము అర్పించి, ఇంకను ఇళ్ళు తమ గృహములు తనఖాపెట్టి, భూములు అమ్మి చదువులు చెప్పించిన, తమ బిడ్డలు కృతజ్ఞతతో నిండియుండజాలక, తమ తల్లిదండ్రులు పెద్దలైన తర్వాతను, ధర్మవ్యాధునివలె, పూజించుటకు బదులు, వారిని హీనముగా, హేయముగా జూచుచున్నవారిని గూడ మనము యెఱుంగుదుము.

కని, పెంచి, అహర్నిశములు, విద్యాబుద్ధులు గరుపుచు, తమ సౌఖ్యములను గూడ వదలి, తమ బిడ్డల వృద్ధియే తమ వృద్ధియని పాటుపడిన తల్లిదండ్రులను వృద్ధాప్యములో తమ వద్ద ఉంచుకొని, పూజించుటకు బదులు వేరేగా, వారికి దూరముగా కాపురములు పెట్టినవారిని కొందరు బిడ్డలు క్రూర హృదయములతో, వెళ్లగొట్టినవారిని గూడ మనము జూచుచునే యుంటిమి.

నేను వ్రాయు వ్రాతలు, కొన్ని ఉదాహరణలు కర్ణకఠోరముగానున్నను, కొందరు పాఠకులకు కష్టముగానున్నను, నే నేది వ్రాసినను నా అనుభవము నుండి, నేను జూచినది, విన్నది సత్యమును వ్రాయుట పరిపాటై యున్నది. బాహ్యా చదువులకు బానిసయైన తనయుడు, తన తల్లిని ఏదో ఆస్తిని తన పేరున వ్రాయని యెడల హత్య చేసెదనని, కత్తీ తీసుకొనివచ్చి బెదరించెనని వినుటకు విచారించితిని. ఇట్టి విషాదకరమైన సంఘటనలు, మనము కండ్లు తెరచి పరిశీలించిన ప్రతీవారికిగాన వచ్చును.

పరమపావనమైన, హిందూదేశములో తల్లిదండ్రులను, పూజించిన

ధర్మవ్యాధునివంటి, ఆదర్శనీయమైన పుత్రులు, సావిత్రి సత్యవంతుని వంటి, తల్లిదండ్రుల సేవజేసిన ధన్యులుగూడ లేకపోలేదు. గాని అట్టి స్వార్థరహితులైన సుపుత్రులు చాల అరుదు అని మనము యెరింగినదే. అట్టి పావనమైన జీవితములే ధన్యవంతములు. తమ బిడ్డల చదువు మాట అటు ఉంచి, విజ్ఞులైన, తెలివిగల తల్లిదండ్రులందరూ, తాము తరించి, తాము ప్రేమించెడి తమ బిడ్డల తరింపు, విముక్తి గురించి గూడ కొంత శ్రద్ధవహించి, ప్రాణము పోకముందే మేల్కొనవలెను. వయస్సు వచ్చిన కొలదీ, తలవెంద్రుకలు నెరసినప్పుడైనను, తమ బిడ్డలయందు, బంధువులయందు, సన్నిహితులయందు వ్యామోహముతో, అధోగతి పాలగుటకంటె తరించెడి మార్గమును, చివరిరోజులలోనైనను గ్రహించజాలని జన్మలు, మానవ జన్మలని చెప్పుటకే తగదు.

అట్టి ప్రవృత్తిపరులను గురించియే "మనుజుండైన పశువౌటకంటె పశు జన్మంబెచ్చు" అని ఒక కవీశ్వరుండు గీర్తించి యుండెను.

మనకు దైవపరితాపన, దైవానుభవము లేనందున మన పిల్లల ఆధ్యాత్మిక వృద్ధిని కూడ మనము కోరజాలకుంటిమి. ఉదయమే ప్రార్థనలు, భజన, దైవస్మరణ, భగవద్గీతాపఠన వేదపారాయణ జేయువారు, తమ బిడ్డలచే గూడ వాటినే జేయించెదరు.

దైవమును మరచి, ప్రవృత్తి అలవాటులకు కాఫీ, టీ వగైరాలకు బానిసలైనవారు, తమ బిడ్డలుగూడా కాఫీ, టీ పుచ్చుకొనకుండ, బడికి వెళ్లిన, తల్లిదండ్రులు బాధపడుచుందురు. ప్రార్థన, ధ్యానము చేయకుండగా అమూల్యమైన కాలమును, వ్యర్థము చేయుచుండిరని బాధపడెడి తల్లిదండ్రులు చాల అరుదైయుండుట విచారకరము. బాహ్యచదువుల వ్యామోహమేగాక, రక్తసంబంధమైన ప్రేమ, బంధకములు హెచ్చుగుచుండుననెడి సత్యమును తెలియపరచుటకు, చక్కనైన చిన్న కథను జెప్పి ఈ వ్యాసమును పూర్తిజేయుటకు కోరుచుంటిని.

ఒక తండ్రి, తన బిడ్డలకు విద్యాబుద్ధులు గరపి, అవసాన కాలములో వారి ఆస్తిపాస్థులను కాపాడుచు, ఇంటి గుమ్మమువద్దనే కర్ర చేత పట్టుకొని, చివరిరోజులు గడుపుచుండెను. తన అవస్థలో, ఓ శంకరా ! ఎచ్చట ఉన్నావురా, అని అనగానే శివుడువచ్చి, స్వర్గమునకు రమ్మనెనట. అప్పుడు ఆ తండ్రి తన పిల్లవానికి, ఏదో మార్గము జూపించి, ఒక యింటివానిగా జేసిన తర్వాత వచ్చెదనని జెప్పగా, శివుడు మరల వచ్చెదనని, నిరాశతో వెళ్లెను.

కొంతకాలమునకు తన అబ్బాయికి ఉద్యోగము దొరకెను. పెండ్లి అయ్యెను. కుమారుడు కూడ కలిగెను.

అప్పుడు శంకరుడు, తాను వాగ్దానము జేసినట్లు, మఱల వచ్చి యీ ముసలివానిని, స్వర్గమునకు రమ్మనెను. అప్పుడు తన మనుమడు, "తాత తాత" అని పిలుచుచు తన మీద ఆధారపడి యుండెను గాన మరి కొంతకాలమైన తర్వాత రమ్మని కోరెను.

ముసలివాడు, పెద్ద వయస్సునే చనిపోయెను. తన తనయుని యింట్లో గుఱ్ఱముగా జన్మించి పనిచేయసాగెను. జట్కాబండి లాగుచుండెను.

అప్పుడు శివుడు మఱలవచ్చి, రమ్మనగా తాను గాక మరొక గుఱ్ఱమే అయినట్లయిన బండి బోల్తా కొట్టించి మా అబ్బాయికి దెబ్బ తగిలించును. గాన ఇప్పుడు తన తనయుని కాపాడుకొనవలెనని చెప్పెనట. గుఱ్ఱము ముసలిదై చనిపోయి, కుక్కగా జన్మించెను. అప్పుడు శివుడు వచ్చి రమ్మనగా, ఆ కుక్క తన కుమారుని ఆస్తి తాను కాపాడుచుంటినని ఇప్పుడు వచ్చుటకు వీలులేదని జెప్పెను. కొంతకాలమునకు కుక్క చనిపోయి, పురుగుగా జన్మయెత్తెను. పురుగుగా జన్మించినను, తన తనయుని వద్దనే వుండవలెననెడి, దట్టమైన వ్యామోహముచేతను, బిడ్డ యొక్క యింటిలో మురికి కాలువలోనే పురుగుగా ఆనందముతో జీవించుచుండెను.

శివుడు యీ ముసలివానియొక్క వ్యామోహమును చూడజాలక మరలవచ్చి, నీవు ముసలివానిగా నున్నప్పుడు స్వర్గమునకు రాలేకపోతివి. ఇప్పుడు కీటకముగా మురికి కాలువలో, నీ కుమారుని కోడలను మనుషులను అంటిపెట్టుకొని జీవించెదవా? ఇప్పుడైనను స్వర్గమునకు రమ్మని కోరగా అప్పుడు పురుగుగా, మురుగు కాలువలోనున్న ఆ ముసలివాడు కోపముతో, ఈ భూలోకములో, నేను తప్ప, నీకు మరెవ్వరు స్వర్గమునకు తీసుకొని వెళ్లుటకు దొరకలేదా? నా నుండి వెళ్ళిపొమ్ము. నీ స్వర్గమునకు నన్ను రమ్మని ఇక ముందు బాధపెట్టకుము అని కసరెనట.

**ప్రియమైన పాఠకులారా !**

ఈ కథ చిత్రముగా తోచినను, మనచుట్టును, దగ్గరలోను, దూరములో నున్న ప్రవృత్తి జీవితములను విమర్శించి పరీక్షించిన, యెన్నియో విషాదకరమైన, యీ ముసలివాని జీవితము వంటి నా బిడ్డలు, నా బంధువులు, నా స్నేహితులని, అహంకార, మమకారములతో బావిలో కప్పలవలె, విశాలమైన విశ్వమును, దైవమును మఱచి అజ్ఞానముతో నిండి, విలువైన కాలమును వ్యర్థపుచ్చుచున్న జీవితములు యెన్నియో కానవచ్చుచున్నవి.

తమ తప్పును వ్యామోహమును, తాము గ్రహించినప్పుడే, అంధకారము నుండి వెలుతురునకు, బంధమునుండి విముక్తికి మేల్కొనవచ్చును. నరకములో నుండియు, స్వర్గములో నుంటినని, స్వార్థపరుడైయుండి, తానే స్వార్థరహితుడనని భ్రమపడుచున్నవార్కి బ్రహ్మదేవుడుగూడ తోడ్పడజాలడు.

**ప్రియమైన శాంతి పాఠకులారా !**

ఇతరుల తప్పులు పట్టుటలో, మన అమూల్యమైన కాలమును వ్యర్థపుచ్చక, మన దినచర్యను, మన వ్యామోహములను గ్రహించి, చీకటి నుండి వెలుతురునకు, నరకము నుండి స్వర్గమునకు, అశాంతి నుండి శాంతికి,

మేల్కొని, నేడే తరించుటకు ప్రయత్నించెదముగాక! తమ స్వంత బిడ్డలమీద వ్యామోహముతో నిండి యుండుట కంటె, దైవము మీద వ్యామోహముతో నిండియుండి, తాము తరించి, తమ బిడ్డలను తరింపజేయుటయే మానవ జన్మకు ఆధారము, గమ్యస్థానమైయున్నదని యీ వ్యాసము యొక్క సారాంశమై యున్నది. ఇదియే మీ యొక్క మీ బిడ్డల యొక్క శ్రేయస్సునుకోరెడి నా నిరంతర ప్రార్థనయై యున్నది.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతిః శాంతిః శాంతిః

# కర్తవ్యము

నేడు ఆదివారము, ఆరవ తారీఖు, లక్ష్మీ విహార్ శాంతి కేంద్రములో, ప్రార్థనను పూర్తిచేయుచుంటిమి. దైవకృపచే, పాత భక్తులు కొత్త భక్తులు దగ్గర యున్నవారు, దూరములో యున్నవారు, అందరూ తోడ్పడుచుండిరి. రాత్రి పన్ను నొప్పిచే అంతగా నిద్ర పట్టలేదు. అదియుగాక దైవము మేల్కొని యుండగా నే నెటుల నిద్రించగలను? చిన్న పన్ను నొప్పిని తాత్కాలికమైన, అల్పమైన బాధను దైవమునకు నాకును మధ్యను యెన్నడు రానీయను. ఉదయమే లేచి, స్నానముజేసి, సూర్యరశ్మి ననుభవించుచు బైటను కూర్చొనియుండ చిరంజీవి జ్ఞానేశ్వరి వచ్చి ఇప్పుడే స్నానము జేసి బైటకేల వచ్చితిరి? కొంత తడవు, లోపలనే విశ్రమించిన, మీ ఆరోగ్యమునకు మంచిదిగదా అనెను.

అప్పుడు నేను, జైలులోని ఖైదీలనుగూడ, ఉదయం 8 నుండి సాయంత్రము 4 గంటలవరకు, బైటకు సూర్యరశ్మిని పొందుటకు గవర్నమెంటు అనుమతించెదరు, నా మాటయందు నీకు అనుమానమున్న శ్రీ పూజ్య రామానంద తీర్థజీని, అడిగి తెలుసుకొనుము. ఏలనన, వారు 12 సంవత్సరములు జైలులో, అనగా శ్రీకృష్ణ జన్మస్థానములో యుండిరని చెప్పితిని.

చీకటి కొట్టులో ఉంచబడిన అపాయకరమైన ఖైదీలను, బైటకు రానీయరని జ్ఞప్తికి వచ్చెను. ఆ స్వామీజీ, అపాయకరమైన ఖైదీగా భావించబడి, కొంతకాలము చీకటికొట్టులో గూడ నిర్బంధింపబడి యుండుట విషాదకరము.

నేడేలనో ఏమియు చదువబుద్ధి వేయుటలేదు. వ్రాయబుద్ధిగూడ లేదు. ఏపనీ చేయవలెనని లేదు, గాని రోజు ఈ మధ్య ఉత్తరములైనను నిర్బంధింపబడి వ్రాయబడినట్టు ఉత్సాహము లేకుండగానే వ్రాయుట జరుగుచున్నది. అయిష్టతగా వ్రాయబడినను, శ్రమపడి, నేను వ్రాసిన ఉత్తరములు ఆశ్రమ

భక్తులకు ఉత్సాహమును, నూతనమైన శక్తిని, శాంతిని కల్గించుగాక! అని కోరుచు, కొంత తృప్తిని పొందుచుందును. నేడు ఏ పనియు జేయుటకు ఉత్సాహము లేనందున, అయిష్టతగా - నా కర్తవ్యమేమి? అని ఆలోచించసాగితిని. ఉదయము చాకలికి నా బనియను పంపితిని - గాన చాకలి కర్తవ్యమేమని తలచితిని. మొన్న శ్రీరామానందతీర్థులు వచ్చినప్పుడు ఒక మంగలి, వారికి గెడ్డము గీయుటకు వచ్చి, రెండు రూపాయలు తీసుకొనెనని విని చింతించితిని. అతడు ఆశ్రమ భక్తుడే. ఐనను, డబ్బువద్ద మాత్రము ఖచ్చితముగా, కొంచెము హెచ్చుగా తీసుకొనెను. అది మంగలి కర్తవ్యమా? తోటపల్లి ఆశ్రమంలో ఒక మంగలి ఉండేవాడు. గురుకుల బాలురు, అతనిచే క్షవరము చేయించుకొన్నప్పుడు రోదన చేయువారు. కారణ మరయగా, అతడు ప్రేమాశూన్యతగా, బాలుర శిరస్సులు చేతితో గట్టిగా పట్టుకొని, కొబ్బరికాయలు చెక్కినట్లు చెక్కుచు, తలను చుట్టూ తన ఇష్టము వచ్చినట్లు తిప్పుచు క్షవరము జేయుచుండ బాలురు బాధపడెడివారు.

ఇది మంగలి కర్తవ్యమా? తాను డబ్బు తీసుకొన్నను, ప్రేమతో తన పనిని బాలురను, ప్రేమించుచు చేయుట మంగలి కర్తవ్యము. అటులనే చాకలి కర్తవ్యము గూడా. మాసిన బట్టలను, మురికి నీళ్లలో ముంచి, డాగులైనా పోకుండా తెచ్చి, డబ్బు తీసుకొనుట చాకలి కర్తవ్యము గాదు. మంగలి ప్రేమతో క్షవరము చేయవలెను. చాకలి భక్తితో బట్టలు మురికిపోయేవరకు ఉతకవలెను. అటులనే, యీ లోకములో యున్న ప్రతివారికీ, వారి వారి వృత్తిని బట్టి వారి కర్తవ్యమున్నది.

ఒక వర్తకుని కర్తవ్య మేమి ?

ఒక వైద్యుని కర్తవ్య మేమి ?

ఒక ఆఫీసులో గుమాస్తా కర్తవ్య మేమి?

ఒక ఉద్యోగస్థుని కర్తవ్య మేమి ?

ఒక దేశభక్తుని కర్తవ్య మేమి ?

ఒక మంత్రి కర్తవ్య మేమి ?

ఒకరాజు కర్తవ్య మేమి ?

మంచి వర్తకుని కర్తవ్యము, అబద్ధము లాడి, తప్పు ధరలు జెప్పి, యెటులైనను నాలుగు డబ్బులు సంపాదించి, ధనార్జన జేయుటయే గాదు. న్యాయవాది కర్తవ్యము; తన్ను నమ్మిన తన "క్లైయింట్స్" కక్షదారుల కష్టసుఖములు తనవిగా ఎంచి, వారికి తోడ్పడుటయే, అటులనే వైద్యుని కర్తవ్యము:- ఎంత డబ్బు యీ రోగి నుండి తీసుకొనవలెను అని ఆలోచించుటకు బదులు రోగికి, స్వార్థరహితమైన సేవ జేయుచు, నారాయణుడే తన వద్దకు రోగి రూపముగా వచ్చెనని, సేవ చేసి తన విద్యుక్త ధర్మమును సక్రమముగా జేయుచు, తరించుటయే !

అటులనే, ఆఫీసులోయున్న పెద్ద గుమాస్తా, మాయ మోసములచే ఆఫీసులో లంచములు తీసుకొనుచు, మ్రింగివేయుటగాక, తన క్రిందవారికి తోడ్పడుచు తన జీవితమును ఇతరులకు ఆదర్శములుగా జేసుకొనవలెను. మంచి ఉద్యోగి తన క్రిందనున్న వారందరినీ తన స్వంతముగా జూచుకొనుచు ప్రేమించుచుండును.

వీరుడు, సిపాయి, లేక జవానుయొక్క కర్తవ్యము తన దేశ రక్షణయే. దేశ రక్షణకై తన ప్రాణమునైనను అర్పించుటయే. మాతృదేశమును కాపాడును. రాజు తన ప్రజలను, తన బిడ్డలవలె ప్రేమించును. అందరి వృద్ధికై జీవించును.

ఉపాధ్యాయుని కర్తవ్యము :- తన విద్యార్థులందరకూ, భక్తి ప్రేమలను బోధించి అందరినీ, ప్రహ్లాదునివలె జేయుటయే, తల్లిదండ్రుల కర్తవ్యము:- తమ బిడ్డలను దైవభక్తులుగా మార్చుటయే! ఏలనన "తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి" యని జెప్పబడి యున్నది. స్వార్థరహితమైన, నిరాడంబరమైన, ఆదర్శ జీవనమే గురుమూర్తి కర్తవ్యము. శిష్యుని విధి - కర్తవ్యము:- గురుని

యాజ్ఞను అనుసరించుచు గురుని పాదములలో నడచుచు, విధేయతతో, శుశ్రూషలు, స్వార్థరహితమైన సేవ అహర్నిశములు చేయుచుండుటయే.

ఇటులనే కర్తవ్యమును గురించి, నేడు అన్ని తరగతులవారిని, వారి పనులను విమర్శించుచు, మనస్సు పరిపరి విధముల ఆలోచించ సాగెను. చివరకు నా కర్తవ్యము గురించి ఆలోచించగా, ముఖ్యముగా యీ రోజున నాకు ఏ పని లేనట్లుగా తోచెను. చెయ్యవలసిన పనులన్నియు ఇదివరకే చేయబడెను. ఇంకేమి చేయవలెనో తెలియకున్నది. చేయుటకు ఏమియు గానవచ్చుటలేదు.

ప్రశ్న :- ఇక ఇప్పుడు ఏమి జేయుట ?

జవాబు :- అంతర్యమున, బాహ్యమున, కోటి సూర్యప్రకాశవంతమైన తేజస్సుతో వెలుంగుచున్న, ఆ దివ్య తేజస్సును గుర్తించుచు, అనుభవించుచు, తేజస్సుగా జీవించుటయే ముఖ్యమైన కర్తవ్యముగా తోచుచున్నది. భగవద్గీతగూడ, స్వధర్మము గురించి, చక్కనైన బోధను జేయుచుండెను. ఎవ్వరి వృత్తిని స్వధర్మమునుబట్టి, వారి వారి పనులను ఉత్సాహముగా స్వార్థరహితముగా, ఆనందముగా శాంతిగా జేయుచున్న, అట్టివారి జీవితములే లోకమునకు ఆదర్శనీయముగానుండును.

అట్టి జీవితములలో, వారి వృత్తి చాకలి, మంగలియైనను, వారు ప్రేమతో జేయుచున్న, వారి వృత్తియే వారికి శాంతిని, ఆనందమును, విముక్తిని గల్గించును. ప్రియమైన శాంతి పాఠకా! నా కర్తవ్యము నేను వ్రాస్తిని. నీ కర్తవ్యమేమి? ఇంకను ఆలోచించగా, నా కర్తవ్యము నిన్ను ప్రేమించుచు నీ వృద్ధికి తోడ్పడుటయే అని తట్టుచున్నది. ఇక నీ కర్తవ్యమేమిటో నీవుగూడ ఆలోచించుము.

పరోపకారార్థం ఇదం శరీరం, అని శాస్త్రములు మహాత్ములు జెప్పుచుండిరి, గాన నీ జీవితమును, పరీక్షించుకొని, ఇతరుల సేవ ఎంతగా

జేయుచున్నది. జూచుకొని దీపము ఆరిపోకముందే, కొంత స్వార్థరహితమైన సేవ జేసి తరించెదవుగాక! మాటలచే, చాకచక్యముచే దైవము నెవ్వరును మోసబుచ్చజాలరు.

మన కర్తవ్యమును స్వధర్మమును తెలుసుకుని, శక్తివంచన లేకుండగా మనము చేయవలసిన పనిని, ఇతరులకు సహాయముగా యుండెడిలాగున జేయుచు, దుర్లభమైన మానవజన్మ యొక్క గమ్యస్థానమును, జన్మరాహిత్యమును బడయుట ముఖ్యము. సర్వాంతర్యామియైన, కృపామయుండైన దైవము, సర్వహృదయబాసియై, మన అందరిలో, నిరంతరము ప్రకాశించుచుండెను. గాన, ఆయన సన్నిధి, శక్తియే మనందరకును ఎవ్వరు చేయవలసిన కర్తవ్యమును, విధిని వారు సక్రమముగా జేయుచు, హృదయ శాంతికి, దేశవృద్ధికి లోకకళ్యాణమునకు తోడ్పడుగాక !

ఓం శాంతి శాంతి శ్శాంతి ః

# అత్యంత సుఖదాయకమైన తరుణం

జీవితం సుఖ దుఃఖ భూయిష్టమైనది కనుక ప్రతి మానవ జీవితంలోను, అత్యంత సుఖదాయకమైన తరుణములూ ఉంటవి; అతి విచారకరమైన క్షణములు ఉంటవి. అది ఆగష్టు 25వ తేదీ, అరుణోదయ సమయం. ఆగష్టు మాసం కనుక నీలగిరిపై శీతలంగా ఉన్నది. నేను నా మామూలు ప్రకారం "కాస్మిక్ ఫ్లేషెస్", "అవర్స్ ఆఫ్ సైలెన్సు" అనే గ్రంథాలలో మూడధ్యాయాలు చదువుకొంటున్నాను. చిరంజీవి శాంతి వచ్చి నావద్ద ఎలక్ట్రిక్ హీటరుకి సమీపంగా కూర్చున్నది. ఏ క్షణాన్ని ఏమి జరుగనున్నదో చెప్పలేముకదా! హఠాత్తుగా ఆమె చీరకొంగు ఆ హీటరు మీదపడి అంటుకొంది. మంచం, పరుపు, బట్టలు దగ్గరగా ఉన్నాయి. మంట ఇంకా వ్యాపించి అన్నిటిని దగ్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నది. అపుడేమి చేయడానికి-నీళ్ళు తేవలెనో లేక ఏదైనా దుప్పటికప్పి అగ్నిని ఆర్పవలెనో, ఆలోచనకికూడా అవకాశం లేదు. అనుకోకుండానే, నాలో ఏ ఆలోచనా లేకుండా, నా హస్తం తనంతట తాను చాచుకొని ఆ అగ్నిలో ప్రవేశించింది. ఏ వస్త్రంచేతా కప్పబడని ఆ చేయి మోటుగా ఆ మంటని ఆర్పెయ్యడానికి ప్రయత్నిస్తోంది. మనముగా మనం ఏమి చేయగలం? అనేకసార్లు నేను చెపుతూంటాను. మనం ఒక గడ్డిపోసనుగూడా కదపలేమని, ఆ అద్భుతం జరిగిపోయింది; అగ్ని అంతర్ధానమయింది - నావల్ల కాదు: ఆయన మహిమ వల్ల, నా హృదయం సంతోషంతో ఉప్పొంగుతోంది, అగ్ని ప్రమాదం నుండి "శాంతి" రక్షింపబడింది. వీపు మీద కొద్దిగా కాలిందిగాని, అంతకు మినహా ఆ బిడ్డకు ఏ హాని జరుగలేదు. ఇంక నామాట ఏమిటంటే; భగ, భగమండే జ్వాలను ఆర్పేసి 'శాంతి'ని కాపాడగలిగినాననే సంతోషంతో అంతామరిచిపోయాను. సర్వసాక్షియైన భగవానునియెడ కృతజ్ఞత తప్ప. ఈ అల్పమైన అహమును మరచి, అతి ప్రమాదస్థితిలో ఉన్న ఒక జీవాన్ని రక్షింపగలిగే మహాభాగ్యం ఎంతటిదోకదా!

అనే ఆలోచనలో నిమగ్నుడనయ్యాను. ఆ క్షణంలో స్వయంరక్షణలేక నాకు అపాయం అనే భావమే నాలోలేదు. నా హస్తం దానంతట అది మంటలోకి వెళ్ళడం, నాకేమి తెలియకుండా సహాయపడడం సంభవించిన సుసమయం నా 70 సంవత్సరాల ధ్యానంలో అత్యంత ఆనందకరమైనది, అంతేకాదు, నా జీవితం ధన్యతపొందిన ముహూర్తం, భగవానుని కివే నా ధన్యవాదాలు ! కృపామయుడైన పరమేశ్వరునియందు విశ్వాసమున్న వారందరికి ఇదొక ప్రత్యక్షమైన అద్భుతం. ఆ హడావుడితగ్గి, మళ్ళీ అంతా మామూలుగా నెమ్మదై పోగానే నా వ్రేళ్ళకి నొప్పి ప్రారంభమైనది, వ్రేళ్ళకొనలు మండుతున్నాయి. భీభత్సంగా తుఫాను రేగుతుంటే దానిని మహాశక్తి కలిగిన ఏసుప్రభువు రెండు చిన్న మాటలతో ఆపివేసిన ఉదంతం జ్ఞప్తికి వచ్చింది. "బీ స్టిల్" "ఆగు - తగ్గిపో" అన్న రెండు మాటలివి. పరుపుమీద పరుండి బాధపడుతూ ప్రపంచం ఒక్కటి అనే సందేశాన్ని తలుచుకొన్నాను. సుఖ, దుఃఖాలలో ఒకేవిధంగా ఉండడం, ప్రపంచం ఒక్కటే అనుకోవడంలో ఉన్న భావం, ఇప్పటి సంఘటనలో ఆవిధంగా ఉండగలనా అనే పరీక్ష వచ్చింది. నా చెయ్యి మండుతూ బాధగా ఉన్నప్పుడు ధ్యానిస్తూ బాధను మరచి ద్వంద్వాతీతుడైన ఈశ్వర సాన్నిధ్యంలో ఉండడానికి ప్రయత్నించాను. నమ్మకం అందరికీ ఆసన్నమవుతుంది. సుఖ దుఃఖాలికి రెండింటికీ ఏదో లక్ష్యం ఉన్నది. అక్కడి పరిసరాలు ఎలక్ట్రిక్ హీటర్, లక్ష్మీ విహార్, కోటగిరి, చల్లని నీలగిరి - అన్నిటినీ మరచిపోయి ఈశ్వరునిలో లయమవడానికి సాధనచేసేటప్పుడు నేనొక సంతృప్తితో, సంతోషంతో తన్మయుడనయ్యాను. నిస్వార్థమైన సేవలో కించిత్తు అపేక్ష, నేనేదో సేవ చేస్తున్నాననే ధ్యాస సహితం లేకుండా ఉండడమే ఆ మహదానందము. నిష్కామంగా ఈ అపూర్వ భాగ్యం కలిగినందుకు పరమాత్మునకు పదేపదే నా ప్రణతులను సమర్పించాను. ఆవిధంగా పడుకొని ధ్యానిస్తుంటే మరొక్క ఆలోచన కలిగింది. 'శాంతి' కొరకు మాత్రమేనా, లేక అదేరీతిని ఎవరిని రక్షించడానికైనా, సరే, అగ్నిహోత్రంలో, నా హస్తాన్ని పెట్టగలనా

అనే ప్రశ్న ఉదయించింది. తక్షణం ఈశ్వరుని బిడ్డలలో ఎవరి విషయములోనైనాసరే, వారందరూ నా బిడ్డలేగనుక, అపాయ స్థితిలో ఉన్నప్పుడు ఆ రీతినే చేయగలననే జవాబు వచ్చింది. నన్ను అర్థం చేసుకోలేక నన్ను ప్రేమించని బిడ్డలకు కూడా తోడ్పడడానికి నా హృదయం తహతహలాడుచున్నది. నిజమైన ప్రేమకి మార్పు, విచక్షణ, వివక్షతలు ఉండవు. ప్రేమ అందరియెడల సమంగానే ఉంటుంది. స్వార్థరహితమైన సేవ చేయగలిగే తరుణములు అతి పవిత్రములయినవి. ధన్యమైనవి. అటువంటి సమయములు శాశ్వతమైనవిగా ఒనర్చుకొందుముగాక! దైవమే ప్రేమ, ప్రేమయే దైవం; ప్రేమ ఎక్కడుంటే అక్కడ దైవముంటాడు; ఆ దైవంలోనే మనం అనుక్షణం జీవిస్తూ, పనిచేస్తూ, సంచరిస్తూ, ఉచ్ఛ్వాస నిఃశ్వాసములలో సహితం ఆయననే అనవరతమూ పొందుతూ మనెదముగాక!

ఓం.

"సర్వే జనా స్సుఖినో భవంతు"

# శాంతి సందేశము

శ్రీ గొల్లప్రోలు సప్తమ వార్షిక తాత్త్విక సభలు కమిటీవారు, శాంతి సందేశమును, వారి వార్షికోత్సవ సంచికకు వ్రాసి పంపమని కోరగా, శాంతి సందేశము గురించి, ఆలోచించుట ప్రారంభించితిని. శాంతియొక్క సందేశమును తెలుసుకొనేముందు శాంతి యనగా నేమో గ్రహించుట ముఖ్యముగదా!

సముద్రముయొక్క సందేశమును తెలుసుకొనుటకు సముద్రమును చూడవలెను. సూర్యుని సందేశమును గ్రహించుటకు సూర్యుని తేజస్సును అనుభవింపవలెను. శాంతియొక్క సందేశమేమి? "శాంతోఽయం ఆత్మ" యని విజ్ఞులు నుడివియుండిరి. విజ్ఞులు, శాస్త్రములుగూడ శాంతియే ఆత్మయని, ఆత్మయే శాంతియని జెప్పిరి. ఆత్మ యన్నను, దైవ మన్నను ఒక్కటియేగదా! ఉన్నది ఒక్కటే !

"ఏకం సత్ విప్రా బహుధా వదన్తి" ఉన్నది ఒక్కటే! దానినే అనేకమంది మహనీయులు వివిధ నామములతో జెప్పుచున్నారు. వాసనాతీతులై దినదినాభివృద్ధిని గాంచును. అపరోక్షముగా దైవసన్నిధినిననుభవించు నప్పుడే, "అదియే నీవు, నీవే అది – తత్త్వమసి" యని గ్రహించగల్గుదురు. ఇప్పుడు "శాంతి సందేశమును గురించి ఆలోచించుచుండ శాంతి సందేశము గురించి వ్రాయుటకంటె, శాంతి ఆశ్రమ సందేశము గురించి వ్రాయుట సులభముగా నుండు ననెడి సంకల్పము గలిగెను.

శాంతి ఆశ్రమ సందేశమన్నను, శాంతి సందేశమన్నను ఒక్కటియే! ఏలనన శాంతి ఆశ్రమము మానవకోటి కంతకు జాతి, మత, వివక్షతలు లేకుండగ శాంతి సందేశమునే ఒసంగుచుండెను. "శాంతి సందేశమే మానవుని జన్మహక్కు!" అన్ని జన్మలలో మానవజన్మ మమోత్కృష్టమైనదని విజ్ఞులచే చెప్పబడెను. దుర్లభమైన మానవ జన్మను బడయుటలో అదృష్టవంతుడైన ప్రతీ మానవుడును, శాంతి సందేశమును గ్రహించుటయే గాక తన జన్మలో

ఈ శాంతిని అనుభవించుటకు అద్దానిని తనతోడి సోదరీ సోదర స్వరూపములతో పంచుకొనుటకు ప్రయత్నించవలెను.

"పరోపకార్థా మిదం శరీరమ్" అని నోటితో ఉచ్చరించుట సులభమే గాని, ఆ మహా సత్యమును ఆచరణయందు వ్యక్తపరచుట కష్టము. ఎవ్వరి జీవితములువారు పరీక్షించుకొనుటకు యిదియే పావనమైన క్షణము. ఒక్క క్షణము నిమీలిత నేత్రులమై మన పరోపకారము, సేవ ఈ శరీరమునకేనా? లేక మన గృహములోనున్నవారికి, మన బంధువులకేనా? లేక మనసేవ మనజాతివారు, మన సంఘము వారందరికిని మాత్రము చేయబడుచున్నదా? అని ఎవ్వరి జీవితములను వారే పరీక్షించుకొని చూచుకొనవలెను.

ఎవ్వరు, ఈ విశాల ప్రపంచమునంతను తమ గృహముగా భావించుచున్నారో, లోకములో నున్నవారందరినీ తమ స్వంత సోదరీ, సోదర స్వరూపములుగా భావించి, ప్రేమించి, జాతి, దేశ, మత, వివక్షతలకు అతీతులై నిష్కామమైన సేవ విశ్వప్రేమతో నిండి జేయుచున్నారో, వారి జీవితములె ధన్యములైనవి. నిన్నగాక మొన్న వచ్చి రేపోమాపో పోవనున్న యీ రక్తమాంస మిళితమైన పంజరములే, దేహములే తామని భావించుచు అహంకార మమకారములతో నిండి, పేరు, ప్రతిష్టలకు ప్రాకులాడుచు, క్రీనీడలను వెంబడించెడి స్వార్థపు జీవితములన్నియు భూభారమనియు, తల్లుల కడుపుచేటు అని చెప్పవలసియున్నది. వాసనాతీతులే అదృష్టవంతులని ఇదివరకే జెప్పబడెను.

దేహ వాసన, శాస్త్రవాసన, లోకవాసన అని వాసనలు త్రివిధములుగా నున్నవని మహనీయులు నుడివి యుండిరి. శరీరముండగా దేహవాసనను వీడుట దుర్లభము. గ్రంథపఠన నిత్యము జేయుచు, శాస్త్రవాసనకు అతీతులై యుండుట దుర్లభముగా తోచును. ఇక ప్రపంచములో అనేక రీతులుగా సంబంధము పెట్టుకొని లోకవాసన లేకుండా జీవించెడువారు తత్త్వవేత్తలే, జీవన్ముక్తులే ! దైవము గురించి ఉపన్యాసములు వినుట, వ్రాయుట,

బోధించుటయేగాదు, మనకు కావలసినది, ముక్తినొసంగెడి దైవానుభవమే, దైవము ననుభవించువారే, లోకవాసనకు అతీతులై యుందురు.

దైవము నెప్పుడోగాక యిప్పుడే, ఎచ్చటనోగాక యిచ్చటనే అనుభవించవలెను. ఇదియే దైవానుభవము, స్వానుభవము, ఇదియే శాంతి సందేశము. స్వానుభవమే శాంతి సందేశమని మరలమరల నొక్కి జెప్పుటకు నా మనస్సు కోరుచున్నది. గొల్లప్రోలులోను, గోదావరి జిల్లాలోను, ఆంధ్రప్రదేశములోను యున్న ఆవులను, గేదెలను లెక్కపెట్టుచు అమూల్యమైన మనకాలమును వ్యర్థబుచ్చరాదు. ఇతరుల గోవులను, అనుభవములను, లెక్కపెట్టుచు విలువైన మనకాలమును వ్యర్థబుచ్చిన మనకు తృప్తియెటుల గలుగును? మన కడుపు ఎటుల నిండును? మన ఆకలి ఎటుల తీరును? మన ఆకలి తీరుటకు, మనము స్వయముగా భుజించవలెను. గాన మనముగూడ యేకుంటి ఆవునో ఒక చిన్న ఆవునో సంపాదించుకొని దాని పాలను సోలెడైనను గ్రోలినప్పుడే స్వానుభవము యొక్క రుచిని పొంది, బ్రహ్మ సాక్షాత్కారమును బడయగలము.

ఇదియే శాంతి సందేశము. శాంతి సందేశమనగా, గాంభీర్యమైన ఉపన్యాసములుగాదు. వివిధములైన అముఖ్యమైన మాటలతో తర్కవివాదములు జేయుటగాదు. శాంతి సందేశమనగా మౌనమే! స్వానుభవమే! నిజమైన శాశ్వతమైన ఆనందము ఎచ్చటనైనను ఉన్న అది నిత్యమైన పరిపూర్ణమైన శాంతిలోనే యున్నది, అందుచేతనే శ్రీ త్యాగరాజులువారు "శాంతము లేక సౌఖ్యము లేదు" అని కీర్తించియుండిరి.

"విశ్వశాంతియే మన జన్మహక్కు" అశాంతిని మీ ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో గుర్తించుచు అనుభవించుడు, ఎప్పుడోగాక, యిప్పుడే, ఎచ్చటనోగాక ఇచ్చటనే మీ అనుభవమును వ్యక్తపరచుడు. ఆ విశ్వ శాంతిని మానవాళినంతను ఆలింగనము చేసుకొనెడి పూర్ణశాంతిని ప్రార్థన ధ్యానాదులు

జేయునప్పుడేగాక, సమావేశములలోను, సభలలోను ఉన్నప్పుడేగాక నిరంతరము, మన పని పాటలలోగూడ మనోవాక్కాయములలో వ్యక్తపరచెదము గాక, ఏలనన శాంతియే మన జన్మహక్కు, గమ్యస్థానము.

"స్వార్థమే నరకము"
స్వార్థ రహితమే స్వర్గము
దేహభావనయే విషతుల్యము
ఆత్మ భావనయే అమృత తుల్యము.

ఈ తత్త్వజ్ఞాన మహాసభల జ్ఞాపకార్థముగా సభ్యులందరును శాంతి ప్రార్థనను కంఠస్థముజేసి నిరంతరము ఈ చిన్న ప్రార్థనను స్మరించుచు, తమ శరీరములను, గృహములను శాంతితో, దివ్య తేజస్సుతో నింపుకొన గోరెదను. శాంతిని వ్యక్తులలో, సంఘములలో దేశమంతటను తమ ఆదర్శవంతమైన, స్వార్థరహితమైన జీవితములలో వ్యక్తపరచుచు లోకకళ్యాణమునకు తోడ్పడెదరుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతి :
ఓం సర్వేషాం శాంతి ర్భవతు
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం సర్వేషాం మంగళం భవతు
ఓం శాంతిః శ్శాంతిః శ్శాంతిః
హరిః ఓం తత్సత్

# కర్మ

కర్మ అనా పని, ఏదో యొక విధమైన పని చేయకుండ, నెవ్వరును ఉండజాలరు గదా! చక్రవర్తియైనను, సేవకుడైనను, పండితుడైనను, పామరుడైనను, ధనవంతుడైనను, నిరుపేదయైనను, చివరకు జ్ఞానియైనను, అజ్ఞానియైనను, నేదోయొక విధమైన కర్మను - పనిని - నిరంతరము వారి వారి స్వభావముల ననుసరించి జేయుచునే యుందురు.

శ్రీకృష్ణ భగవానుడు గీతలందు లోకములో జనులందరును ప్రకృతిచే బంధింపబడి నేదోయొక కర్మను జేయుచుండి క్షణమైనను ఊరుకొనలేరు అని క్రింది శ్లోకమున చెప్పిరి.

నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మకృత్ ।
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః ॥ (గీ. 3-5)

సాత్వికులు సాత్వికమైన పనులను జేయుచుందురు. రాజసులు రాజస సంబంధమైన పనులు జేయుచుందురు. తామసులు తామసముతో నిండియున్న పనులనే జేయుచుందురు.

కర్మ ఎవ్వరిని విడువదు గాన యీ కర్మ సిద్ధాంతములను మనము ఎంత త్వరితముగా బోధపర్చుకొన్న అంత త్వరగా శాంతి మనకు కలుగును. కర్మ నదీ ప్రవాహమువలె నిరంతరము ప్రవహించుచున్నది. కర్మేంద్రియముల ద్వారా పనిని చేయక యూరక యున్నప్పుడు కొందరు మనుజులు తామేపనులను జేయుట లేదని తలతురు; కాని తాము కర్మనే చేయుచున్నామను ఎరుకలేక మనస్సు ద్వారా కర్మలను వాటి సూక్ష్మరూపములో చేయుచునే యుందురు. మానవుడు మనోవాక్కాయములచే సదా యేదో ఒక కర్మను తన స్వభావము ననుసరించి జేయుచుండును. కర్మ మూడు విధములుగా విభజింపబడి యున్నది.

1. సంచిత కర్మలు 2. ప్రారబ్ధక కర్మలు 3 ఆగామి కర్మలు. సంచిత కర్మ వెనుకటి జన్మలలో జేసినది. ప్రారబ్ధకర్మ యిప్పుడు అనుభవించుచున్నది. ఆగామి ఇకముందనుభవమునకు రాబోయెడిది. సంచితమే ప్రారబ్ధముగా, ప్రారబ్ధము ఆగామిగా మారుచున్నదని చెప్పవచ్చును. నదీ ప్రవాహముయొక్క నీటిని ఎటుల నిన్నటి నీరు, నేటి నీరు, రేపటి నీరు అని విభజించుటకు వీలులేదో అటులనే యీ సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మముల నదీ జలమువలె సాధారణముగా మిశ్రమమై యుండుట జరుగుచుండును.

నదిలో వెనుకనుంచి ఇంతవరకు ప్రవహించిన జలమును మనము విభజించి జూడజాలము. ఇకముందు ప్రవహింపనున్న జలమును గూడ ప్రత్యేకముగ చూడజాలము. మనమిప్పుడు ప్రవహించుచున్న జలమును మాత్రమే చూడగలము.

అటులనే అనేకమైన జన్మలలో మనము చేసిన కర్మలు మనకు తెలియవు. ఇకముందు జేయబోయెడి కర్మలు గూడ అగ్రాహ్యములు. కాని ప్రస్తుతము మనము జేయుచున్న కర్మ - పని మనకు గానవచ్చుచునే యున్నది. అది మన కండ్లముందు కట్టబడినట్లు ప్రత్యక్షముగా మనలోనే యున్నది. కర్మచేతనే నేనీ వ్యాసమును ఒక అర్ధరాత్రి వ్రాసియుంటిని. కర్మచేతనే మీరీ వ్యాసమును చదువుచున్నారు.

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।
రాక్షసి మాసురీంచైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥ (గీ. 9-12)

వ్యర్థాశలు గలవాడు, వ్యర్థములగు కర్మలు చేయువాడు మరియు వ్యర్థజ్ఞానముగల మూఢుడు మోహమున బడవైచియుంచు రాక్షస లేదా అసుర ప్రకృతి నాశ్రయించుచున్నాడు.

ఏ విపత్తులను నాటినవారు ఆ విపత్తుల ఫలితమునే అనుభవించు

చుండిరన్నది కర్మ సిద్ధాంతమునకు వెన్నెముకగా ఆధారమై యున్నది. పల్లేరు విత్తనముల జల్లి వరిపంట కోరుట మూఢత్వము, హాస్యాస్పదముగదా! ఇటులనే చాలా మంది మానవులు తమకు అర్హతలేని పదవులను, ఇతరుల సిరిసంపదలను వృధాగా ఆశించుచు, దుఃఖ సముద్రమున మునిగి యుందురు. ఎవ్వరి కర్మ ననుసరించి వారికి సంప్రాప్తించిన దానితో తృప్తినొంది ఇప్పటి నుండినైనను ఇంతకంటే మంచి విత్తనములను నాటినచో మంచి ఫలసాయమును ముందు తప్పక అనుభవించగలమను రూఢియైన, సనాతనమైన ఈ ధర్మసూత్రమును మనమందరమును ఎంత త్వరలో గ్రహించిన అంత మంచిది.

ఈ ధర్మసూత్రములను బోధపర్చుకొనుటకు సామాన్యమైన చిన్న ఉదాహరణలను తీసుకొందము.

మీరు వరాహములు మలమును ఎంతో ఆనందముగా తినుట జూచి యుండిరి గదా! అవి అటుల ఏల చేయవలెను అని మనము ప్రశ్నించిన యెవ్వరేమి చెప్పగలరు? ఎండాకాలములో వరాహములకు బురదలో దొర్లుట ఆనందము. వాటి ఆనందమును మనము మార్చజాలము. అని వాని పూర్వ జన్మార్జిత కర్మ స్వభావమునుబట్టి వ్యవహరించు చున్నవని చెప్పవలెను. అటులనే కొందరు జనులు వరాహముల స్థితిలోనే యున్నందున నిరుపేదల రక్తమును పీల్చుచు అమాయకులను హింసించుచు, మలముతో సమానమగు దొంగసొత్తు తినుచు, అమూల్యమైన జీవితమంతను ఆత్మస్తుతి, పరనిందలయందు గడుపుచుందురు.

వారి స్వభావము ననుసరించి వారు తామసకృత్యములనే చేయు చుందురు. వారటుల యెందుకు జేయుచుందురని ప్రశ్నించుట గూడ, వరాహములు మలము నేల తినవలెనని ప్రశ్నించుటవలె నుండును. కుక్క తన స్వభావముచే అఱచిన మానవుడు తన స్వభావముచే ధీరత్వముగా నుండవలెను. దుష్టుడు తన స్వభావముచే హాని జేయుచున్నచో, సజ్జనుడు

తన స్వభావముచే దుష్టుని ప్రేమించి మన్నించవలెను. కుక్క మొఱిగెనని మనము గూడ మొఱుగుచున్న నూతనమైన కర్మను సంపాదించుకొనవలసి వచ్చును. దుష్టులు ఎన్ని సారులు యెంతగా హానిచేసినను, సజ్జనులు అంతగా ప్రేమతో నిండి, ఓర్పుతో నుండి శాంతిగా వారిని మంచి మార్గములో పెట్టుటకు సదా ప్రయత్నించుటయే వారి స్వభావమై యుండవలెను.

ఇది సాధ్యమా యని కొందరు ప్రశ్నించిన తామసికి తామసమైన పనులు జేయుట యెటుల సాధ్యమో, వరాహమునకు మలము తినుట యెటుల స్వభావమో అటులనే సజ్జనునికి ప్రేమతో అన్నియు భరించి శాంతిగా నుండుట గూడ సులభముగా నుండును.

దీనినే విపులముగా బోధపర్చుకొనుటకు చిన్న కథను ఉదాహరణగా ఒక ప్రత్యక్షమైన దుష్టాంతమును తీసుకొందము.

ఒక సాధువు గోదావరి ఒడ్డున జపము చేయుచు తన కాలమును గడుపుచుండెను. గోదావరినది వరదలలో, తన చెంతనుండియే ఒక తేలు కొట్టుకొని బోవుచుండగా దానిని రక్షించెను అది కుట్టెను. మరల వరదలు హెచ్చుచున్నందున అది ఒడ్డున నుండినను కొట్టుకొని పోవుచుండ మరల దానిని తీసి కాపాడెను. అది మరల కుట్టెను. అటులనే ఆ సాధువు దానిని ఏడెనిమిదిసార్లు కాపాడెను. ఆ తేలు తాకినపుడెల్లను వానిని కుట్టుచునే యుండెను. ఈ దృశ్యమును చూచినవారు ఆ సాధువుతో ఆ తేలు కుట్టుచుండ నీవు తెలివితక్కువ పని నేల జేయుదువు? అని ప్రశ్నించిరి. అప్పుడా సాధుపుంగవుడు తేలు యొక్క స్వభావము కుట్టుట, నా స్వభావము రక్షించుట - కాపాడుటయే అని చెప్పెను. ఈ చిన్న కథలో కర్మ సిద్ధాంతమంతయు సూక్ష్మముగా నిమడ్చబడి యున్నది.

కర్మను గురించి యెన్ని గ్రంథములైనను వ్రాయవచ్చును. ఎన్ని గంటలైనను ఉపన్యసించవచ్చును. హెచ్చుగా వ్రాయుచు, హెచ్చుగా

ప్రసంగించుచున్నను, యిది యొక నూతన కర్మగా, పరిగణింపబడును, గాన ఇతరులకు హాని కల్గించెడి క్రొత్త కర్మలను మనమెన్నడును చేయరాదు. ఇతరులు వారి కర్మచే మనలను హింసించుటతో ఆనందమును పొందుచున్న - మనవల్లనే వారికి యీ రీతిగానైనను అనగా మనలను నిందించియైనను ఆనందమును పొందుచున్నారుగదా యని, వారి ఆనందమునే మన ఆనందముగా భావించి సర్వములో అద్వితీయుండైన దైవమునే గుర్తించుచు నిరంతరము వృద్ధియగుటకు, కర్మ విపాకమును పొంది దైవమును చేరుటకు సజ్జనులందరును ప్రయత్నింపవలెను.

"ఓం ఈశా వాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్," ఈ విశ్వమంతయు బ్రహ్మ స్వరూపము, దైవముచే నింపబడి యున్నదని ఉపనిషత్తులు ఘోషించుచున్నవి.

ఆంతర్యమున దైవము, బాహ్యమున దైవము, మీలో దైవము, నాలో దైవము, అందరిలో దైవము, మీరందరు దైవస్వరూములే! వరాహములు గూడ చాలా హీనస్థితి యందున్నట్లున్నను, అవియు దైవాకారములే. ఏలనన దైవము లేని తావు సూదిమొన మోపుటకైనను గానరాదు.

ఇట్టి పరిపూర్ణమైన స్థితిని గ్రహించిన బ్రహ్మవిదులే - సంకల్ప మాత్ర సంభవో బంధః - ఏ మాత్రము సంకల్పించినను, ఆలోచించినను బంధము - నూతనమైన కర్మ చుట్టుకొనుచున్నదని నుడివియుండిరి.

సామాన్యమైన చిన్న సంకల్పమే బంధమును గల్గించుచున్నపుడు ఇంక అసురులు తామసవృత్తిలో జేయుచుండు క్రూరమైన పనులు, హానికరమైన మాటలు, మద మాత్సర్యములతో నిండియున్నవారి ఆలోచనలు ఎంత హెచ్చుగా నూతనమైన దుష్కర్మను చేయించి అధోగతిలోనికి తీసుకు వెళ్లుచుండునో అది మనమూహించుటకు గూడ అగ్రాహ్యముగా నుండును.

కర్మ సూత్రమును  పూర్తిగా అనుభవముచే గ్రహించినందుననే, జడ భరతుడు తనలో వ్యక్తిత్వమును పూర్తిగ నశింపజేసి ఎవరేమి చేసినను ఆనందముతో "తథాస్తు" అనుచు తన నిజస్థితి తెలుసుకున్న మహాజ్ఞాని గాన, హాయిగా గడుపుచు తరించెను. చేనులో కాపలా కాయుమన్న కాచెను సవారీ మోయుమన్న మోసెను. అమ్మవారికి బలివేయుదమన్న ఆనందముతో అంగీకరించెను. ఆయన తన పరమాత్మ స్వరూపమునందే మనస్సును లగ్నము చేసి జీవించెను. మహనీయులయొక్క ఔన్నత్య స్థితిని గూడ సామాన్యులు బోధపరచుకొనజాలరు. మనము కూడ అటులనే శత్రు మిత్రులందు, సుఖదుః ఖములందు ఉదాసీనులమై ఈశ్వరార్పితముగా సర్వ కర్మలనొనర్చిన, ఆగామి కర్మలు ఉండవు; అనుభవముచే ప్రారబ్ధమెటులైనను క్షయించును, జ్ఞానాగ్నిచే సంచితము నశించును.

ఓం శాంతి ః

# మధురవర్తనము

అనుకూల పరిస్థితులందు మధురముగా ప్రవర్తించుట చాలా తేలికయే. ఎక్కువ పనిపాటలులేని సమయములందు నితరులు స్తుతించు సమయములందు నందఱును మధుర ప్రవర్తకులుగా నుందురు. కానీ అనేక పనులలో నిమగ్నులైయున్న సమయమందును, పరుల నిందకు పాలగు పరిస్థితులందును సుముఖభావము కలిగియుండువారరుదు.

కొందఱు కొంచెము పనినెక్కువగా చేయవలసి వచ్చినయెడల నేదో ఘనకార్యమును సాధించు చుంటిమని దగ్గఱకు చేరినవారిమీద కోపము చూపుచు దూర్వాస మహర్షివలె సంచరింతురు. ఇట్టి దుర్వాస మహర్షివంటి వారి దగ్గఱ కెవరును పోనిచ్చగించరు. తాముచేసెడి పనియంతయు భగవదర్పితమే యనియు నెంత యధికముగ పనిచేసిన అంత విశిష్టముగ భగవతారాధన చేసినటులనియు తెలిసినవారిట్లు వర్తించరు. అన్ని క్లిష్టపరిస్థితులందును, నితరుల విమర్శకు లోనైన సమయములందును శాంతియుత మనస్కులయి అందఱి యెడలను మధురప్రవర్తన కలిగియుండు వారే స్థితప్రజ్ఞులు. హృదయమను పుష్పము వికసించినపుడు దాని పరిమళమును, సౌందర్యమును సన్నిహితులగు వారి కందఱకును విశదమగును. ముకుళిత హృదయము ముకుళిత పుష్పమువలె ఆకర్షణీయముగా నుండదు.

ఒక మహాకవి "నీవు నవ్విన లోకమంతయు నీతోనవ్వును, నీవేడ్చిన నీవొక్కడవే ఏడ్చెదవు" అని నుడివియుండెను. దీని సత్యము మనకందరకును విశదమే. కనుక అన్ని పరిస్థితులయందును ప్రసన్నముఖులయి యుండుటకు జనులందఱును యత్నింపవలెను. ఈ యత్నమునకు సాత్వికాహారమును భుజించుట, వీలయినంతకాలము ప్రార్థన ధ్యానాదులయందును, సద్గ్రంథ పఠనమునందును గడుపుట చాల అవసరము.

డాక్టరు జకిల్, మిష్టరు హైడు అను కథ నందఱు వినియేయుందురు. ఈ కథానాయకునివలె ననేక వ్యక్తులు ద్వంద్వగుణములు కలిగినవారై యుందురు. ఒక వ్యక్తి సత్వగుణ ప్రధానుడైయున్న సమయమునందు మానవసేవ చేయుచూ అవసరమయినచో తోడివారికి తమ ప్రాణమైననూ నర్పించును. ఆ వ్యక్తియే తామసగుణాధీనుడై యుండు సమయములందు నిరపరాధుల హింసించుచూ మానవ పీడాకరుడై వర్తించును సంతత ప్రార్థనాధికములచే తామసగుణమును రూపుమాపుకొని సత్వగుణముతో నిండి లోకమంతటకును నొకదివ్య తేజమువలె ప్రకాశించుట కందఱును యత్నింపవలెను.

శాంతియుతముగా జీవించుటకు మంచి ఆరోగ్య మత్యావశ్యకము. మాకు తెలిసిన భక్తుడొకడు మలబద్ధకముచే అనేక సంవత్సరముల నుండి బాధపడుచున్నాడు. వ్యాధి అధికముగానున్నప్పుడు అతడు తనను సమీపించిన వారియెడల నిప్పులు గురిపించుచు పరుషవాక్యములాడును. మందులను సేవించుటచే నొక్కొక్కపుడు మలబద్ధకము తగ్గియుండును. ఆవేళలయందు సమీపించిన వారిని అత్యాదరముతోచూచి ప్రేమతో మాట్లాడును. ఇట్టి యనారోగ్యులగువారు ఆరోగ్యము చెడియున్న సమయములయందు నితరులను చూడకుండ నేకాంతముగ నుండుట మంచిది.

ప్రియమైన పాఠకులారా! మీరందఱును నిరంతర మధురవర్తనము నలవర్చుకొని లోకులందఱిని మీ ప్రేమ సముద్రములో ముంచెత్తి కృతార్థుల గుదురుగాక!

లోకా స్సమస్తా సుఖినో భవంతు

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

# ఇద్దరు స్నేహితులు

ఇద్దరు స్నేహితులు అనుటకు బదులు, ఇద్దరు మనుష్యులు అనుట సమంజసము. ఏలనన, నేను వ్రాయబోయెడి మనుష్యులు ఇద్దరును స్నేహితులుగా కలసిమెలసి యుండజాలరు. ఇద్దరకును వెలుతురునకును, చీకటికిని ఉన్నంత తారతమ్యము కలదు. వారిరువురి నామధేయములతో ప్రారంభింతము, ఒకని పేరు నేడు, రెండవవానిపేరు రేపు. నేడు అనెడి పేరుగల మనిషికి ఏపని చెప్పినను, నేడే, ఇప్పుడే, ఆ పనిని చేయుటకు ప్రయత్నించును. ఇక రేపు అనెడి పేరుగల వ్యక్తి. ఎంత జరూరైన పనియైనను, రేపు చేయుదును, అని, ప్రతిక్షణమును, నేటిరోజును, వ్యర్థమైన మాటలతో, పనికిరాని ఆలోచనలతో వ్యర్థబుచ్చుచుండును. రేపురాగానే, బద్ధకము, సోమరితనముచే మరల రేపు ఆ పనిని చేయుదుననుకొనుచు ఆరోజున కూడ వ్యర్థబుచ్చును. దీనికంతకు కారణము అమూల్యమైన కాలముయొక్క విలువను తెలియకుండుటయే, **క్షణములను వ్యర్థము చేయువారు, జీవితమునంతను వ్యర్థము చేయుదురు'** అనెడి సత్యమును గ్రహించి ప్రతిక్షణమును ప్రార్థన, ధ్యానాదులయందును, మానవసేవలోను గడుపుచున్నవారి జీవితములు అదృష్టవంతములు. నేడు అను పేరుగల మనిషి ఈ క్షణమే నాది, వచ్చెడి క్షణము నాదికాదు. నేడు ఉన్నవారు, రేపు ఉండకపోవచ్చునని, తాను చేయవలసినపని, చిన్నదైనను, పెద్దదైనను, వెంటనే, యిప్పుడే, ఈ క్షణముననే చేయుచు, దినదినాభివృద్ధిగాంచుచు నిరంతరము ఆనందముతో నిండి యుండును.

ఇక రేపు అనెడి వ్యక్తి, కాలముయొక్క విలువను గ్రహించజాలనందున, విలువైన కాలమును, జీవితమును, మాటలతో వ్యర్థబుచ్చుచు, అనిత్యమైన భవిష్యత్తుపై ఆధారపడుచుండును. తానెప్పటికిని బ్రతికియుందునన్న వెట్టి

భ్రమతో, ఈ ప్రత్యక్ష క్షణమేగాక, రోజులు, వారములు, మాసములుకూడ వ్యర్థముగా గడుపుచుండును. నేడు తెల్లవారుఝాముననే, ఈ వ్యాసము వ్రాయుటకు సంకల్పమురాగా, లోపలనున్న శనిగ్రహము,

"ఇంకను చీకటిగా నున్నది. నీకు అనారోగ్యముగా నున్నది. తెల్లవారిన తరువాత నీ భావనలు వ్రాయవచ్చును; ఇప్పుడు తొందరలేదు పరుండుము." అని చెప్పసాగెను. ఇది మంచి సలహా అని మొదట తలచితినిగాని, వెంటనే అంతర్వాణి యిట్లు పలికెను;

నీవు రేపు అను పేరుగలవాడవా? లేక నేడు అను పేరుకలిగినవాడవా? లోకమంతయు రేపు అను పేరుగాండ్రతోనే నిండియున్నది. నీవు కూడ వారిజట్టులో చేరి, ప్రత్యక్ష క్షణములను వ్యర్థబుచ్చుచు నిద్దరపోయెదవా? లెమ్ము? మేల్కొనుము ! రేపు నీదికాదు, నీవు చేయవలసినది, నేడే, ఇప్పుడే వ్రాయుమని చెప్పుటచే, ఈ వ్యాసమును ప్రారంభించి దైవకృపచే పూర్తి చేయుచుంటిని.

నేడే మనది, అమూల్యమైన ఈ ప్రత్యక్ష క్షణమే మనది.

ప్రియమైన శాంతి పాఠకా! నీ పేరు ఏమి? నీవు రేపు అని పిలవబడ తలచితివా? లేక నీ పేరు నేడేనా? నీపేరు నేడే కాదు. యిప్పుడే, ఈ ప్రత్యక్ష క్షణమని పెట్టుకొనుటకు కోరుచుంటివా? నేడు అను నామధేయము కలవారందరును నా ఆప్తులు, నా స్నేహితులు, నా సన్నిహితులు అయియున్నారు. రేపు అనెడి నామధేయం కలవారందరు నాకు పరాయివారే, దూరస్థులే, నాకు తెలియనివారే! నా మనసు అట్టివారి నుండి వేలకొలది మైళ్ళు దూరముగా నుండుటకు కోరుచుండును. దైవకృపచే నాకు జ్వరము ఎప్పుడోకాని రాదు. కాని, రేపు అను పేరుకలిగిన బద్ధకస్థులను, సోమరిపోతులను చూచిన, శరీరము జ్వరము వచ్చినట్లు ఉష్ణముగా నుండును. ఓ దైవమా! రేపు గాండ్రకు నన్ను దూరముగా నుంచుము. నేడు అను పేరుగల వ్యక్తులను నాకు సన్నిహితులుగా

జేయుము, అను చిన్న ప్రార్థన తలవని తలంపుగా దాని అంతట అదియే వచ్చుచుండును.

ప్రియమైన పాఠకా! సర్వవ్యాపకత్వము, సర్వశక్తి, సర్వజ్ఞత ఈ ప్రత్యక్ష క్షణమునందే యిమిడియున్నది. కాన యిప్పుడే యిచ్చటనే, ఈ క్షణమునందే నీవు చేయవలసిన పనిని, అన్ని పనులలో ముఖ్యమైన నీ జీవిత లక్ష్యము, మానవ జన్మకు గమ్యస్థానమైన, బ్రహ్మసాక్షాత్కారమనెడి, గొప్పపనిని, కష్టపడి సాధించి, జన్మసార్థకత్వమును, జన్మరాహిత్యమును, చేసుకొనెదవుగాక! రేపు అనెడి నామధేయముగల వ్యక్తులనుండి కడు దూరముగా నుండుటకై కోరుచుంటిని. నేడు అనెడి మహనీయులను, సన్నిహితులను సదా ఆలింగనము చేసుకొన కోరుచుందును. అట్టి వారలందరకు ధన్యవాదములు !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

# కష్టసుఖములు

(ద్వంద్వములు)

కష్టసుఖముల యెడల సమచిత్తముగలవారు ధన్యులు, ప్రపంచము లోనున్న అన్ని మతములయొక్క సారమును – కష్టసుఖములకు అతీతముగా నుండి పరమపవిత్రమైన సమభావమును పొందుటయందే గలదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కష్టసుఖముల యెడల సమత్వము కలిగియుండవలెననియు ద్వంద్వాతీతులు కావలయునని మనకు బోధించును. బ్రాహ్మణునిలోను, ఛండాలుడనబడు వానిలోను "సమదర్శనము" కలిగియుండవలెనని ఉద్ఘాటించును, చీమలోను, దోమలోను సృష్టి అంతటిలోను భగవత్కళను దర్శించుటను మనకు బోధించును. అణువులో అణువునందును, మహత్తులలో మహత్తునందును, జగత్తంతయు, ఈశ్వరునిచే వ్యాపింపబడియున్నదని "ఈశో" పనిషత్తు చాటుచున్నది. ద్వంద్వములతో కూడిన ప్రాపంచికపు జీవితము భోగ్యమైన మధుర పదార్థమువంటిదికాదు. క్వయినా మందువలె అది కొన్ని సమయములయందు చేదుకూడనై యున్నది.

ఈ ద్వంద్వ జీవిత విధానము ఎల్లకాలమును ఒకే కష్టము, ఒకే సుఖముగా నుండక రాత్రింపగళ్ళవలె మిశ్రమముగా నుండును. కష్ట సుఖములు కావడికుండల వంటివను సామెత కలదు. ఎన్ని కష్టసుఖములయందైనను మనసును లోబడనీయక ఉదాసీనభావము కలిగి యుండవలెనని "భగవద్గీత" "నిర్ద్వన్ద్వో నిత్య సత్త్వస్థో" "ద్వంద్వాతీతో విమత్సరః" "శుభాశుభ పరిత్యాగీ" మొదలగు శ్లోకముల ద్వారా మనకు చెప్పుచున్నది.

కష్టసుఖములు, చీకటి వెలుగులు, మానావమానములు, శోక మోహములు, రాగద్వేషములు ఇత్యాది ద్వంద్వములతో ప్రపంచము నిండి యున్నది. ప్రతి జీవితములోను దైవ ప్రేరితములైన మధురక్షణములు కొన్నియు, మనస్సు కృంగిపోయెడి క్షణములు కొన్నియు తప్పనిసరిగా ఉండితీరును. వాటికి

లోనుగాక ఉదాసీనభావము కలిగియుండవలెను. అనగా కష్టమునకు దుఃఖించుటయును, సుఖమునకు ఆనందించుటయుగాక మానవుడు ఆ రెండింటియందును తామరాకును నీరు అంటనివిధముగా మనస్సును ఉదాసీనముగా నుంచవలెను. ఆచరణలో ఇది కష్టసాధ్యమైనప్పటికిని భక్తుడు తన క్రమశిక్షణ ద్వారా అవిరళ ఆధ్యాత్మిక సాధనల ద్వారా సాధించగలిగి అట్టి స్థితికి వచ్చినపుడు, అతడు భగవత్ప్రాంగణము చేరినాడన్నమాట. ఈ స్థితిని పొందినవారు ఎల్లవేళలా అన్నివైపులా ప్రకాశమునే గాంచగలరు. అటువంటప్పుడు స్వయంజ్యోతిలో అజ్ఞానముండునని మనమెట్లు భావింపగలము?

సూర్యులలోకెల్ల సూర్యుడై, నిత్యమై, ఆద్యంతరహితమై స్వయం ప్రకాశమానమై, మన హృదయములలో అంతర్వ్యాప్తి చెందియున్న, అంతరంగ సన్నిధిని కటాక్షించుచున్న – మన ఆత్మయొక్క గమ్యస్థానమైనట్టి పరంజ్యోతికి నా అనేక సహస్ర ప్రణామములు.

అన్నిటికి మనము నిమిత్త మాత్రులమగుటజేసి – మనలోనేమియు లేదనియు మనము దైవము చేతిలోని పనిముట్లవంటి వారమనియు, ఏ దైవము మనలను సుందరమైన నూతనోద్యాన వనములకు, పచ్చికబయళ్ళ దెసకు గొంపోయి సౌఖ్యమును చేకూర్చునో, అదే దైవము – మనలను ఎడారులలోనికి, భయంకర ఘోరారణ్యములలోనికి గొంపోయి అనేక బాధలు, ఆశాభంగములు కలుగజేయుననియు కొన్ని సమయములయందు మనము అనుభవపూర్వకముగా తెలిసికొందుము.

ఈ మధ్య ఆశ్రమములో ఆర్థిక లోపముగా యుండుటచే – అనేకమంది ఆశ్రమ భక్తులచే నిండియున్న రాజమండ్రి పట్టనమునకు కొంతమంది ఆశ్రమాభిమానుల ప్రోత్సాహమున వెళ్ళుట తటస్థించెను. అచటనున్న కొలదిరోజులున్ను రాత్రిం పగళ్ళు అనేకమంది భక్తుల సందర్శనముచే మేము

అలసి యుండగా – గోదావరి నదీతీరమునకు కొంతతడవు విశ్రాంతికి వెళ్ళుదమని ఆశ్రమ కమిటీ మెంబర్లలో నొకరైన శ్రీ ముత్తంగి అయ్యన్నగారు సలహా చెప్పిరి. అవి దసరా మహోత్సవ దినములగుటచే ధవళేశ్వరములోని ఆశ్రమ భక్తులను కలుసుకొందమని నేను సలహానిచ్చితిని. మిక్కిలి ప్రయాసపడి ఉత్సవముల ఏర్పాట్లలో నిమగ్నులైయున్న ధవళేశ్వరములోని ఆశ్రమ భక్తులందరకును – మా ఆకస్మికమైన ఆగమనము ఆనందమును, విస్మయమును కలుగజేసెను.

మేము కూడ వారి ప్రార్థనలలో పాల్గొని లోకశాంతి ప్రార్థనను స్మరింపచేయుచు వారి హృదయములనేగాక గోదావరి నదీ తీరమున నున్న వారి పవిత్ర గృహములను కూడ – పవిత్ర ప్రణవగానములతో నింపితిమి. ఆ మరుసటి దినమున పావన గోదావరీనదిపై విహారయాత్ర చేయుదమని శ్రీ అయ్యన్నగారు సూచించగా ఆశ్రమమునకు త్వరగా చేరవలయుననెడి అభిప్రాయముతో నేను మొదట ఇష్టపడకపోయినప్పటికిని వారి ప్రోత్సాహముచే తుదకా ఆహ్వానము నంగీకరించక తప్పలేదు. కాని ఆ ఆహ్వానమును అనుమతించిన పిమ్మట వినోదకరమైన ఆనందమును నా సేవకు ముందు ఉంచుచుంటినా అను భయముతో కలవరపడితిని.

ఎట్లయినను ఈ వినోద పర్యటనమును తీర్థయాత్రగాను, భక్తుల సేవ క్రిందను మార్చకపోదునా యని ఆశించి మనస్సును సమాధానపరచుకొంటిని. వరదలవలన గోదావరినది పొంగిపొరలుచుండగా ఒక స్టీము లాంచి వచ్చి నదిపై తేలియాడుచుండెను. లాంచీయొక్క పైభాగమున భక్తులందరు వరుస క్రమముగా కూర్చొనుటకు ఒక బల్ల ఏర్పాటు చేయబడెను. నా కొరకు ఎత్తైన ఉన్నత స్థానము ఏర్పరచి నా ఉపన్యాసము కొఱకు ప్రేక్షకులు ఎదురుచూచు చుండిరి. ప్రణవనాదముతో లాంచి బయలుదేరెను. భక్తులు తదేక దైవనామోచ్చారణతో నిమగ్నులై యుండి భజనలు సలుపు చుండిరి. మా

కాతిథ్యమిచ్చిన శ్రీ నాళం రాజారావు దంపతులు తదితర రాజమండ్రి భక్తులు ఆధ్యాత్మికపు విందునకు ఆ లాంచీ ప్రయాణములో పాల్గొనిరి.

మిస్. మోతీదేవి, ఆమె సోదరుడు శ్రీ మెర్వాన్జీ మేనక్జీ, కుమారి జ్ఞానేశ్వరి, శాంతి, కొందరు గురుకుల బాలబాలికలు కూడ ఆ యాత్రలో మాతో నుండిరి. భజనకు పిమ్మట శాంతియుత వాతావరణములో శ్రీ అయ్యన్నగారు ఆధ్యాత్మికపు మెఱుపులును - మిస్. మోతీదేవి హవర్స్ ఆఫ్ సైలెన్స్ నుండి రెండు అధ్యాయములును చదివిరి. అటుపిమ్మట శ్రీమతి శకుంతలాదేవి ఆ తొలిదినమున వారి స్కూలు పిల్లల ఆధ్యాత్మికాభివృద్ధిని కోరుచు నాచే చెప్పబడిన విజ్ఞానయుతమగు మూడుకథలను చదివి భక్తుల నానందపరచెను. పిమ్మట నా ఉపన్యాసము ప్రారంభించితిని.

నలుదిక్కుల గంగా ప్రవాహముతో నిండియుండిన్న గోదావరి నదీ మధ్యమున లాంచిలో తేలియాడుచు ప్రయాణించుట నిజముగా దైవవిలాసము గదా! అది పారవశ్యము పొందదగిన మంచితరుణమై యుండెను.

**నా ఉపన్యాస సారాంశ మిదియే.**

ప్రతివ్యక్తి జీవితములోను మనశ్శరీరములను, ప్రపంచమును మరచిపోయెడి క్షణములు కొన్ని గలవు. అట్టి క్షణములలో నీ క్షణము గూడ అరుదైన, మరపురాని ఉత్కృష్టమైన తరుణముగా నుండెను. మన జీవితములలో శాంతిని ప్రసాదించు ఆనందదాయకమైన ఈ పవిత్ర క్షణమును స్థిరమైన దానినిగా జేసికొందుముగాక! సగటున సామాన్య మానవుడు ఎల్లెడలను దుఃఖముతో విసిగిపోయి దౌర్భాగ్యస్థితిలో నున్నాడు. ఇందుకు తన అనారోగ్యము, దారిద్ర్యము, కోర్టు లావాదేవీలు ఇంకను ఇతర ప్రాపంచిక బాధలు కారణమై యుండును. కొన్ని అమితమైన దృష్టాంతములలో మానవుడు ఆత్మహత్య గూడ జేసికొన సాహసించుచు, తమ భౌతిక బాధల నుండి తప్పించుకొనుటకు కొందరు అల్పులు, బావులలోను, చెరువులలోను, నదులలోను పడి

చనిపోవుదురు. ఇదిగో! పావన గోదావరీమాత కష్టజీవులకు, దప్పినవారికి, రోగులకు తాపోపశమనమును కలుగచేయును. ఒకే ఒక మునకపెట్టి మరణించినంత మాత్రమున తాను విముక్తి చెందుదునని అజ్ఞాని భావించును. కాని, అయ్యో! పాపము ! అతడు అట్లెన్నటికిని విముక్తి పొందజాలడు. ఆత్మహత్య చేసుకొని బాధల నుండి విముక్తులమైతి మనుకొనుట వట్టి పిరికితనము, దౌర్భల్యము, అజ్ఞానము మాత్రమే ! నదిలో నీ దేహమును విడిచిపెట్టినను నీ కర్మ నిన్ను వెంటాడి మరియొక జన్మలో బాధలు కలుగజేయును. అనంతమైన, తనివితీరని నీ కోరికలు నిన్ను మరొక జన్మ ఎత్తించును. నీ కోరికల నుండి సంపూర్తిగా విముక్తుడవగు వరకు నీవు తిరిగి తిరిగి అనేక జన్మలెత్తుచుండవలసినదే! కనుక సంసార బాధలను, దుఃఖములను అధిగమించి స్వేచ్ఛను బడయుటకు ఒకే ఒక రాజబాట కలదు. అది దైవమును పట్టుకొని విడువకుండుటయే, అంతర్జ్యోతిలో ఐక్యమగుటయే, అజ్ఞానమునకు పైబడి, అంతరంగమున ప్రకాశించెడి, స్వయం జ్యోతియొక్క సహాయమున, వచ్చుచు పోవుచుండెడి మేఘముల వంటి కష్టములను మరచి ఆత్మస్వాతంత్ర్యమును బడయుటయే సూటియైన రాజబాట. కనుక ప్రతి యొకరును విజ్ఞానమార్గమున ప్రయాణించి దైవమును చేరుకొందురుగాక!"

ఉపన్యాస అనంతరము మిస్. మోతీ ఆంగ్లముననను, కుమారి జ్ఞానేశ్వరి తెలుగులోను లోకశాంతి ప్రార్థనను స్మరించిన తరువాత ప్రణవ నాదముతో ఆ చల్లని గోదావరినదీ వాతావరణమంతయు మారుమ్రోగుచుండగా అంతఃర్ముఖులమై కొద్ది తడవు శాంతి ననుభవించితిమి. ఆ శాంతి – ఆ నిశ్శబ్దత వర్ణించి చెప్పజాలనంతటి లోతైనది. అట్టి ఆనంద సమయమున ప్రత్యక్షముగా దైవసన్నిధి ననుభవించుచు దైవస్మృతిని తెచ్చుకొనెడి దివ్య క్షణములను ప్రసాదించిన ఘనత శోభ అంతయు దైవమునకే చెందునుగాక! అంతట శ్రీకృష్ణారావు దంపతులు పండ్లు, పాలు, ఫలహారములు భక్తులకు పంచిపెట్టగా భజనలతో ఆనందముగా సభ ముగిసెను.

ఆ రాత్రికే రాజమండ్రి నుండి 50 మైళ్ళ దూరములో నున్న శ్రీశాంతి ఆశ్రమము చేరుకొను తలంపుతో రాజమండ్రి నుండి బయలుదేరితిమి. కాని 5 మైళ్ళు ప్రయాణము చేయుసరికే కారుచక్రము యొక్క శీల విరిగిపోయెను. ఇదంతయు నేను వ్రాయుటకు కారణము మా పాఠకుల ఆనందోత్సాహములు గాదు, ప్రయాణముల ద్వారానేమి, యాత్రల ద్వారానేమి, ఏ విధముగానైనను మానవ జీవితములో గంట తదుపరి గంట రోజు, తదుపరి రోజు కష్టసుఖములు ఒకదాని వెంబడి మరియొకటి కర్మ ననుసరించి మారుచుండును. సహజముగా సామాన్యులు కష్టసుఖ సమయమందు వాటి యొక్క ఫలితము ననుభవించెదరేగాని ఒకదాని ననుభవించునపుడు మరియొకదానిని గుర్తించుకొనలేరు గదా! ఆ రెండు స్థితులకు అంటకుండా అతీతముగా నున్నవారే ధన్యులు.

ఇంతకును ముఖ్య విషయము, కారుశీల విరిగిపోయినందున అర్ధరాత్రి హోరుమను కురియు వర్షములో మధ్య త్రోవలో ఆగిపోవలసివచ్చెను. ఇటు మా కొరకు ఎదురుచూచెడు ఆశ్రమవాసులకు ఆశాభంగము "మాతో నున్న భక్తులు శ్రీ మెర్వాన్‌జీ మెనక్జీ గారు ప్రథమముగా ఆశ్రమమును సందర్శించ గోరుటలో ఆటంకము. అటు వెనుకకు రాజమండ్రి వెళ్ళుటకు మనస్సు సమ్మతించలేదు. అపుడు మా డ్రయివరుని జీపుకారు తీసుకురమ్మని రాజమండ్రి పంపితిమి. కాని ఎంతసేపు వేచియున్నను జీప్ రాలేదు. ఆ అర్ధరాత్రిలో మేముపడిన బాధలు ఊహించవచ్చును. సరిగా అదే సమయములో ఏదో సర్కసుకి సంబంధించిన పన్నెండు ఏనుగులు ఆగియున్న మా కారు ప్రక్కనుండియే వాటి తొండములు మావైపు విసరుచు వెళ్లుచుండ మా గురుకుల బాలకుడైన చంటి భయపడిపోయి వేన్‌లోనికి దుమికెను. ఏలనన చంటికి తన ప్రాణరక్షణ మొట్టమొదటిది, విందులారగించుట మాత్రము ప్రథస్థానము చంటిదే. ఎటులైనను మావటీవారితో హిందీభాషలో కొన్ని పరిచయ వాక్యములాడుట మాకానందముగానే యుండెను.

ఎట్టకేలకు జీప్ వచ్చెను. మా ఆశ్రమ సామానులు, మేము ఎక్కువగా నుంటిమి. జీప్ చాల చిన్నది. కాని ఎట్లో క్రిక్కిరిసి కూర్చుంటిమి. దానికి తలుపులు లేవు. పిల్లలు నిద్రలోపడిపోవుదురను భయముచే బిగ్గరగా దైవనామమును స్మరించుచు భజనలు చేయసాగితిమి. ఈ భజన భక్తి ప్రదమైనదిగాక కేవల ప్రాణరక్షణకేయగుగాక ! అర్థరాత్రి 1 గంటకు ఎటులనో ఆశ్రమం చేరుకొనగలిగితిమి. అంతయు దైవవిలాసముగదా! చలిచే క్షుద్బాధచే, అటమటలాడుచు ఆహారపానీయములు దొరకని అట్టి దుర్ఘట పరిస్థితులలో క్షోభపడక శాంతమనస్కులై యుండెడివారు ధన్యులు. అన్ని సదుపాయములు అందుబాటులో నున్నప్పుడు అందరును సౌఖ్యముగా నుండగలరు. తలవని తలంపుగా కష్టములు, పరిశోధనలు వచ్చి మనపైబడినపుడు చిరునవ్వు నవ్వగల్గినవారు ఋషి పుంగవులు.

"కష్టములు వచ్చినపుడు నీవెందుకు నవ్వవు?" అనునది ఆశ్రమములోని ఆదర్శనీయ వాక్యములలో నొకటియై యున్నది. ప్రతిక్షణమును మార్పుజెందెడి నామరూపములు గలిగిన ఈ ప్రపంచములో ఈ పరిశోధనలు కష్టములు, విపత్తులు అనుభవించుచునే మన గమ్యస్థానము చేరునట్లు మనకు శాసింపబడి యున్నది. అనివార్యమైన ఈ పరిశోధనలు, ఈ బాధలు మన శ్రేయస్సునకే యని గ్రహించి తొట్రుబాటు కలుగజేసెడి అడ్డంకులను అభివృద్ధి సాధనములుగా మార్చుకొని సంతోషపూర్వకముగా వాటిని ఆహ్వానించువారు పూజ్యులు.

ఇంతకూ ముఖ్యముగా చెప్పదలచిన మాట కష్టసుఖములు వచ్చుచు పోవుచుండెడి మేఘములవంటివి. మేఘములకు పైన తటస్థముగా సూర్యుడున్నట్లే, కష్టసుఖములనెడు మేఘములకుపైన సూర్యులలోకెల్ల మేటి సూర్యుడైన పరమేశ్వరుడు ఉన్నాడు. ప్రపంచములో కష్టసుఖములు, చీకటి వెలుతురు, శోకమోహములు గలవు. కాని స్వయం జ్యోతిలో తేజస్సు మాత్రమే కలదు.

తూర్పుపడమర దేశములలోని ఏ భక్తులు వారి సరళ జీవిత విధానమువలన, ఆదర్శప్రాయమైన శాంతియుత జీవితము ద్వారా కష్టసుఖములను సమదృష్టితో చూడగలుగుచు, ద్వంద్వాతీతులై యున్నారో, ఏ భక్తులు ఆ విధముగా స్థిత ప్రజ్ఞులైతిరో, ఏ భక్తులు తప్పుత్రోవను బట్టిన మానవులను గాఢాంధకారము నుండి వెలుతురుకు గొంపోవుచు, వారికి మార్గదర్శకులుగానున్నారో - మరణమునుండి, శాశ్వతత్త్వమునకు చేర్చుచున్నారో - అట్టి జీవన్ ముక్తులకు ఇవియే నా సేవలు - ఇవియే నా పూజలు - ఇవియే నా ప్రణామములు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

# సంకల్పములు !

ఆలోచనలే సంకల్పములుగా మారుచుండును. గాన సంకల్పములన్నను **(Musings)** ఆలోచనలు అన్నను ఒక్కటియే.

ఏదో ఒక సంకల్పము ప్రతీవారికిని వుండును. ఏ సంకల్పము ఏ ఆలోచనయు లేనివారు ఎచ్చటనోగాని గానరారు.

ప్రతీ మానవునకు, వ్యక్తియొక్క స్వభావము, కోరికలనుబట్టి సంకల్పములుగూడ అంతర్యమునుండి లేచుచుండును.

ప్రవృత్తిపరులు, ప్రాపంచకులు లోకవాసనతో నిండి సదావిషయముల వెంటనే తమ మనస్సులను పరుగెత్తించుచు, తుప్పుపట్టెడి, దొంగలపహరించెడి ధనమును సంపాదించుట గురించియే సదా ఆలోచించుచు విలువైన తమ జీవితములను వ్యర్థము జేయుదురు.

ఇక దైవభక్తులు, నివృత్తిపరులు అమూల్యమైన తమకాలమును, దొంగలపహరింజాలని, తుప్పుపట్టజాలని ఆత్మధనము గురించియే ఆలోచించుచు తరించుటకు ప్రయత్నించుదరు.

మనలో యున్నదే ఇతరులలో గాంచెదము, ఆలోచనలే వస్తువులు **(Thoughts are things)** సంకల్పములే పనులుగా మారును. ఆలోచనయే గతియని మరొక్కమాటగా పెద్దలు తలచెదరు. **(Thought is another word for fate)**

## మతేగతి

ఇప్పుడు మీస్థితి, వెనుక మీ ఆలోచనలు, పనుల సముదాయముగా నున్నది. ఇకముందు యెటుల యుందును? ఇప్పుడు ఏ ఆలోచనలు చేయుదుమో, ఏ మాటలు మాట్లాడెదమో, ఏ పనులు చేయుదుమో, వీటి

సముదాయము యొక్క ఫలితములను పొందెదము.

ఇందు రహస్యమేమియు లేదు అంతయు బట్టబయలుగా యున్నది. దైవము దైవమనుకొన్నవారు, దైవమును చేరుచుండిరి. మట్టి మట్టి అనుకొన్నవారు మట్టిలో లీనమగుచుండిరి. అమృతము మన జన్మహక్కై యుండ విషమును గ్రోలనేల? చిరకాలమునుండి యీ మనస్సులో ఒక సంకల్పము తరుచు వచ్చుచుండును.

ప్రశ్న :- ఆ సంకల్పమెద్ది?

**జవాబు :-** ఈ వ్రాతలను, వ్యాసములను ఉపన్యాసములను, ఇకముందు పేరు లేకుండగనే పత్రికలయందు ప్రచురింప జేయవలె ననెడి సంకల్పమే!

ఇంతవరకు, ఎప్పటికప్పటికే, యీ చిన్ని సంకల్పమును నెరవేర్చ జాలకపోతిని. అనేకరీతులుగా ఆంతర్యమున విమర్శించుకొని, చివరకు నాపేరు యెన్నడూ ఏ వ్యాసము యందును, ఏ పత్రికయందును ఉండరాదనెడి ఆలోచన నిశ్చయము, నాకు ఇప్పుడు కొంత తృప్తిని గల్గించుచున్నది. తాను వ్రాసిన వ్రాతలను, తానుజేయుపనులను, తన పేరునుగూడ లేకుండ జేసుకొని అనామధేయముగా జీవించుట వ్రాయునంత జెప్పునంత సులభముగాదు.

శల్యదానము సులభమనిపించెను. ఆశ్రమము లన్నియు కమిటీ పేరున వ్రాసి మానవకోటికి స్థిరస్థాయిగా తోడ్పడుటకు కోరుచు వాటి హక్కులను పూర్తిగా వదలుకొని, ఆస్తులన్నియు, అన్ని మతములలో యున్న భక్తులకు చెందెడిలాగున రిజిష్టరీ చేయించుటగూడ తేలికగానే తోచెను. గాని యీ పేరును ఎన్నటికీ లేకుండగా రూపుమాపుట కొంత కఠినతగానే తోచుటచే, ఇంతవరకు దానిని నిర్మూలింపజాలనైతిని. సులభమైనను కఠినమైనను మన నిత్యశాంతి, విముక్తి, అహంకార మమకారములను పూర్తిగా నశింపుజేయుటయందే గలదు.

దైవకృపచే ఒక శుభసమయమైన, ఇక ముందెన్నడును ఏ వ్యాసమును, ఈ పేరులో "పీసు" లో గాని, "శాంతి" లో గాని, అచ్చువేయరాదని ఒకదృఢమైన నిశ్చయమునకు రాగానే, ఆ నిర్ణయమే నా మనస్సున కెంతయో ఆనందమును, తృప్తిని గల్గించెను.

పసిబిడ్డలను పసితనపు ఆలోచనలతో నుందురు, కొందరు వారిపేరేగాక వారి ఫొటోగూడ వారి వ్యాసముల ముందు వేయించుకొని ఆనందించుచుందురు. దైవము వారినిగూడ చిరజీవితముతో వారి సంకల్పములను, నెరవేర్చుచు బ్రోచుగాక, వారి ఆట పూర్తికాగానే వారే మేల్కొందురు అప్పుడు వారికి యీ ఆటవస్తువులు, ఆనందము నియ్యజాలవు.

అప్పుడు వారే తమంతటతామే, పేరుప్రతిష్టలనెడి నామరూపములను, ఆటవస్తువులను పారవేయుదురు. వారి ఆట పూర్తికాగా నామరూపరహితమైన ఆత్మనే వారు కోరుచుందురు. గాన ఎవ్వరి ఆటను వారే పూర్తి జేసుకొనినిండు.

నా ఆట పూర్తి అయ్యేను. ఈ నేత్రములు మూసెడిముందు, ఇందున్న దీపము ఆరిపోవకుండగనే, పరిపూర్ణముగా అఖండమైన ఆత్మానందమును పొందుచు ఖండమైన యీ నామరూప పూజలను పూర్తిగా విరమించుటకు కోరుచుంటిని. ఇదియే నా దృఢసంకల్పము.

ఒక్క నామమును, రూపమును త్యజించుటచే, లోకములోనున్న నామరూపములన్నియు మనవిగానే యున్నవి.

మీరంతా నావారే

మీ అందరినీ ప్రేమించుచుంటిని.

ఏలనన, మిమ్ము ప్రేమించుటయే దైవమును ప్రేమించుట, ప్రేమయే దైవము, దైవమే ప్రేమ. ప్రేమ శూన్యమైన హృదయము, స్మశానము, ప్రేమ యున్నచోటనే దైవముండును, ప్రేమ దైవము రెండుగాదు, అద్వితీయము.

కొందరు ఆశ్రమ భక్తులు, మీపేరు, మీ వ్రాతలయొద్ద లేనియెడల ఆ వ్యాసము మీది అని యెటుల తెలుసుకొనగలము? అని గొణుగుచు, శంకతో విచారించుచుందురు.

నావారు నావద్దకు వచ్చెదరు. నా వ్రాతలు నావారికి తెలియును. ఈ పేరు నా వ్యాసమందున్నను లేకున్నను ప్రతి మాటలయందును, నన్ను ప్రేమించెడివారు నన్ను గుర్తింపగలరు.

పేరు గుర్తింప జాలకున్నను నష్టమేమి? మీకు కావలసినది వేదాంతసారముగదా? అనుభవమైన బోధలుగదా? అవి యెవ్వరి నుండి వచ్చిననేమి? ఈ స్వామి వ్రాసినను, ఆస్వామి వ్రాసినను, మరొక్క స్వామి వ్రాసినను అందరి స్వాములలో వ్రాసేవాడు ఒకే స్వామియే! అతడే స్వాములకు స్వామి, అద్వితీయుడు.

కాన నామరూపములనెడి పిశాచములవెంట పరుగెత్తక శాశ్వతమైన స్థిరమైన అమృతత్వమును, ఆంతర్యముననే గ్రోలుచు తృప్తిపొందుటకు ప్రయత్నించుడు. అదియుగాక చాలకాలము క్రిందనే స్వామి చనిపోయెను. ఓంకారమే మీ అందరియందును జీవించుచుండెను. **Swami is dead, OMKAR is alive in all of you,** అద్దానినే గుర్తించుచు ఆనందముగా యుండుడు.

చనిపోయిన స్వామికి ఈ వ్రాతలయొక్క గౌరవమును పూజ్యభావనను ఇయ్యనవసరములేదు. మనలో వ్రాయువాడు, జూచువాడు, ఆలోచించువాడు, కదిలేవాడు, మెదిలేవాడు, ప్రత్యగాత్మ స్వరూపుడైన పరమాత్మయేగాన, సర్వమును సర్వదా ఆయనకే అర్పించి మనజీవితములను దైవార్పణమస్తు ! అని అర్పించెదముగాక !

ఈ క్రింది ప్రార్థన యీ రోజులలో తలవని తలంపుగా నాచే తరుచు స్మరింపబడుచు, నాకెంతయో ఆనందమును, నూతన శక్తిని, బలమును గల్గించుచుండును.

ప్రియమైన ప్రభువా! ఓ దైవమా ! ఇతరులను గొప్పగా కీర్తివంతులుగా జేయుము. నన్ను మాత్రము యెవ్వరికి తెలియనీయకుండ, అనామధేయునిగా పరిపూర్ణమైన నిండు సున్నవలె **(Complete Zero)** ఉంచుము. నిన్ను మాత్రము నా నిశ్శబ్ద హృదయములో బంధించుకొని సర్వమును మరచి నేను, శాంతిగా జీవించెడిలాగున ఆశీర్వదించుము !

ఏ కోరిక లేకుండుట ఎంత అదృష్టము! అన్ని కోరికల నొసంగి బ్రోచెడి దైవమునకు ధన్యవాదములు.

ఏ కోరికయు, ఆలోచనయు, సంకల్పమును లేకుండ ఉండవలెననెడి యీ సంకల్పములను కృపామయుడైన దైవము ప్రసాదించుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి : శాంతి : శాంతిః

# అభ్యాసము

పూర్వము చీనాదేశమునందు ఒక భాగ్యశాలి కుమారుడు బాల్యమునందే అబద్ధము లాడుటయందును దొంగతనముచేయుటయందును, గిల్లికజ్జాలు తెచ్చుటయందును మంచి పేరు ప్రతిష్ఠలను సంపాదించుకొని తిన్నగా బడికి వెళ్ళక పాఠములను చదువక ఇరువది, యిరువదియైదు సంవత్సరముల యీడు వచ్చినను ఏ యుద్యోగమునకును పనికిరాకయు ఒళ్ళువంచి పనిచేయలేని సోమరియగుటచే కూలినాలియైనజేసి జీవించుట కొడంబడ తానేర్చిన దొంగతనముకన్న దొడ్డవిద్యలేదని భావించి క్రమముగా కన్నము, దొంగతనము, బందిపోటు, దారిదోపిడులను చేయనారంభించెను. దొంగతనమెన్నాళ్ళు సాగును? ఎన్నటికయినను దొంగ బ్రతుకు దొంగ బ్రతుకే! వాని దొంగతనము బయలుపడగానే వానికి తలవంపులాయెను. చివరకు వాడు పట్టుపడగా కేసుపెట్టి రెండు సంవత్సరములు ఖైదులో నుంచిరి. విడుదలకాగానే మరియొక వృత్తి ఎరుగని కారణమున తిరిగి దొంగతనముచేసి పట్టుబడి పాతనేరస్థుడగుటచే ఈమారు ఏడు సంవత్సరములు శిక్షింపబడెను. ఇదేవిధమున యెడ తెగక నేరముజేసి యించుమించు తన జీవితమునెల్లను చెరసాలయందే గడపుచుండెను. ఇట్లు చిరకాలమున్న పిదప చైనాకు క్రొత్తరాజురాగా అతనికి పట్టాభిషేకము జరిగెను. ఆ సంతోష సమయమున చిరకాలమునుండి చెరసాలయందున్న ఖైదీలను విడుదలజేయ రాజాజ్ఞయయ్యెను. మన కథా నాయకున కప్పటికి షష్టిపూర్తి యయ్యెను. వార్ధక్యము ప్రవేశించి పూర్వమువలె శరీరధారుఢ్యము లేకయుండెను. మెల్లగా అతనికి క్షయ దగ్గుకూడ నారంభించెను. మతిచెడెను. ఇట్టియవస్థలో రాజాజ్ఞ చొప్పున అతనిని యింటికి పొమ్మని హెచ్చరించుచు రక్షక భటులు వెడలదోలిరి. అందులకాతడు సంతోషించుటకుమారు వెక్కి వెక్కి యేడ్చుచు చెరసాలను విడువనని యీడిగిలబడెను. కారణమారయ నాతడిట్లనియె.

బాబూ! చిరకాలము నుండి జెయిలునందే నా జీవితమును గడపియుండుటచేత నేను చీకటికి అలవాటుపడినవాడనగుటచే ఇప్పుడు బయటికి పొమ్మనిన వెలుతురును చూడలేక నా కండ్లుపోవును. నేనెట్లు బ్రతుకగలను, జెయిలులో హాయిగా యింతకాలము గడపి యిప్పుడు మరల ఆ ప్రపంచ గొడవలోనికి పొమ్మనిన నేనెట్లు సహింతును. నన్ను కటాక్షించి యింతకాలము పోషించి యిప్పుడు పరిత్యజించుట న్యాయముకాదని ప్రభువువారితో మనవిచేసి బ్రతికినన్నాళ్ళు బ్రతుకనుగనుక నాముప్పుగడుపు మని వేడుకొనసాగెను. ఇది విన్నవారెల్లరును ఆశ్చర్యభరితులయిరి.

కాని నిజమునకు ఇందు ఎట్టి ఆశ్చర్యమును లేదు. నిత్యమును ఏదోయొక లోకాభిరామాయణముతో ప్రొద్దుపుచ్చుట కలవాటుపడిన జనసామాన్యమునకు పదినిముషములు దైవము పేరను మౌనముగా నుండుటయన్న బుర్రపిచ్చెత్తిపోవును. సూటిఎరుంగక పదిమందితో లొల్లాపొత్తుగ తిరుగ నేర్చినవారికి అయిదు నిమిషములు ఏకాంతవాసమన్న మతిపోవును. నిష్ప్రయోజనముగా కాలమునెల్లను గడపువారికి భగవత్కాలక్షేపము క్రింద అరగంట గడుపుటయనిన చావువలె దోచును. అదియెంత మాత్రమును ఇష్టముగా దోచదు. వటవట యెడతెగక వాగువారికి ఒకరోజు మౌనముగా నుండుట యనిన ప్రాణాంతకముగా దోచును. ఇంద్రియ లోలత్వమున కలవాటుపడినవారికి వైరాగ్యమనిన శుద్ధ వెర్రివలెదోచును. లోభివానికి దాతృత్వము పేరు విన్నమాత్రమున ఒడలెరుంగని కోపమువచ్చి దాతలను పడదిట్టును. జన్మాంతరవాసనలే బలీయమయి బాధింప ఈ జన్మవాసన లెటుపోవును. ఈ వాసనలు బండెడు కర్రలుపెట్టి కాల్చినను నశించవు. "తనువులు పైకెక్కిన జెడవు తపకర్మంబుల్" అనునట్లు స్థూలశరీరము నశించినను సూక్ష్మ శరీరముతో చేరియుండు వాసనలు నశించనేరవు. వానిని రూపుమాపుటకు ఒక్కటే మార్గముగలదు. అది యెద్దియన ఎవరికివారు

సర్వజ్ఞులమని భావించి చెడక "ఎందరో మహానుభావులు" అని త్యాగరాజుగారు సెలవిచ్చిన సూక్తిని మనంబున నిడుకొని పెద్దల సేవచేసి సత్సాంగత్య మహిమంబున పూవులతో గూడిన నారవలె మంచివాసనల నలవరచుకొని తద్వారా దుర్వాసనలను బాపుకొనవలెను.

ధనము దారాపుత్రాదులు, గృహక్షేత్రా రామాదులు మున్నగునవి యెన్నియేని సంపాదించవచ్చునుగాని "సాధు సమాగమ దుర్లభ భాయీ" అనగా సత్పురుషుల సహవాసము దొరకుట అరుదని కబీరుదాసువారు ఆనతిచ్చియున్నారు. సూర్యుడు పోగొట్టజాలని చీకటియును, సత్సహవాసము పోగొట్టజాలని దోషమును గలుగనేరవు. మన శాస్త్రములుకూడ "సాధుసంగంబు సకలార్థసాధకంబు" అని వక్కాణించుచున్నవి.

"సిరి అబ్బుట కష్టముగాని చీడ అబ్బుట సులభము" అని కూడ ఒక లోకోక్తిగలదు. వెయ్యివేల జన్మలు ప్రయత్నముగావించినను శాంతము పట్టుబడుట కష్టముగాని కోపము అంతలో ఏ ప్రయత్నమును అక్కరలేకయే వచ్చును.

మౌనముగానుండుట కష్టము. అద్దాని కెంతటి ప్రయత్నమయినను గావలయును. వాగుడుకు ఏ ప్రయత్నమును అవసరములేదు. ఒక ప్రభువు చేత ఎద్దియేని యిప్పించుటకు ఎంత ప్రయత్నమయినను గావలయును. పడగొట్టుటకు ఒక్కమాటయే చాలును. ఒకరాయిని కొండమీదికి ఎక్కించుట ఎంతో కష్టముకాని దానిని తిరుగదోయుట కెంతోకాలము పట్టదు.

అటులనే మంచి లక్షణములను అలవరచుకొనుట కష్టసాధ్యము. అవలక్షణములకే ప్రయత్నమును పనిలేదు. పెద్దల సహవాసము ఎందులకనగా ఎవరి వెర్రి వారికానందముగ దోచును గనుక, మంచి చెడ్డల నెరుంగునట్టి వివేకము కావలెనన్న తప్పక పెద్దలను సేవించవలెను. ఎవరు పెద్దలు అని

ప్రశ్న బయలుదేరును. తాను తనకు ఉత్తములని తోచిన యితరులెవరైనను సరే, అగరవత్తులు, అత్తరు, పన్నీరు మున్నగు పరిమళ ద్రవ్యములచే దుర్వాసనల నశింపజేసి క్రమముగా సువాసనల బెంచు భంగి సత్సహవాసముచే వాసనా క్షయముగావించుకొని మానవజన్మయొక్క పరమావధియగు ముక్తిని బడయుటయే యీ వ్యాసము యొక్క సారాంశము.

హరిః ఓం తత్సత్.

# మరణానంతరము

మరణానంతరము, అనెడి మాటలు వినగానే సామాన్య జనులు, శరీరము పోయిన తరువాత, యీ జీవి యేమగును? ఎచ్చటకు వెళ్ళును? అని ఆలోచించెదరు.

శరీరము ఉండగా, జీవి యెటులున్నదో అటులనే శరీరము పోయిన తరువాతగూడ, యెచ్చటకు వెళ్లినను, జీవాత్మ అటులనే యుండును.

దైవ పరితాపముతో నిండియున్న జీవి, దైవములో విలీనమగుటకు అవకాశముండును. విషయవాసనలతోనే నిండియున్న జీవి, మరల, మరల, జనన మరణములనెడి సంసార సముద్రములో మునిగి తేలుచుండును. ఇందు రహస్యమేమియును లేదు. ఎవ్వరు జల్లిన విత్తనముల ఫలితములను వారే అనుభవింపవలసియుండునుగదా !

దైవము దైవమని, దైవపరితాపముతో నిండియున్నవారు, దైవములో లీనమగుటకు, సదవకాశముండును. మట్టి మట్టియని, తుప్పుపట్టెడి, దొంగలపహరించెడి, ధనమునే, దైవముగా, మానవజీవిత పరమావధిగా, చేసికొని జీవించుచున్నవారు, అధోగతిపాలయ్యెదరు.

ఇప్పుడు నేను వ్రాయుచున్న వ్యాసము, యీ శరీరము పోయిన తరువాత, మీరు యెటుల వృద్ధి అయ్యెదరు? మీరందరు తరించుటకు తోడ్పడు నిమిత్తము స్థాపితమైన యీ శాంతి ఆశ్రమమును యెటుల వృద్ధి చేయుదురు! అనెడి ముఖ్యమైన సమస్యను, మా శాంతి పాఠకులందరు తెలుసుకొనుటకు నా భావనలను, మీ అందరి వృద్ధిని కోరుచు వ్రాయుచుంటిని.

శ్రీ శాంతి ఆశ్రమము, లోకశాంతి కొరకును, మీ అందరి ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుటకు, 52 సంవత్సరముల క్రితము తోటపల్లి

కొండలలో స్థాపించబడెను. అది మీ జ్ఞానగృహము, మీ శాంతి నిలయము.

ఇప్పటివరకు దానిని మీ ఆధ్యాత్మికోన్నతికి, ఏవిధముగా ఉపయోగించు కొనిరో, శాంతి ఆశ్రమము మీకు యేవిధముగా తోడ్పడినదో, మీ జీవితములను దినచర్యను పరీక్షించుకొని, తెలుసుకొని, నిదానముగా నాకు వ్రాసినచో, నేను ఆనందించెదను.

ఇంతియేగాదు, ముఖ్యముగా నేను మీ నుండి విని తెలుసుకొన గోరుచున్నది. మరణానంతరము అనగా యీ శరీరము పోయిన తరువాతను, ఆశ్రమవృద్ధికి, మీవృద్ధికి, మీరందరు ఏమిచేయగోరుచుంటిరో, మీ అంతర్యభావనలను, ఆలోచలను, విమర్శించుకొని, నాకు యీ శరీరము ఉండగనే వ్రాసినచో, మీ భక్తి ప్రేమను, శ్రద్ధను, మీ సానుభూతిని తెలుసుకొని ఆనందించ గోరుచున్నాను.

ఈ శరీరము ఉండగా, మీరేమి చేయుచుండిరో, ఏమి తలంచుచుండిరో, శరీరము పోయిన తరువాత, మరణానంతరము గూడ, ఆ పనినే స్వభావికముగా చేయుచుందురు.

నేను మీ అందరి వృద్ధియే, ఆశ్రమ వృద్ధిగా నా వృద్ధిగా భావించి యింతగా వ్రాయుచుంటిని.

నేడే మనది, రేపుమనదిగాదు, గాన మనము చేయవలసిన మంచి పనిని, నేడే చేయుచు, తరించుటకు ప్రయత్నించెదము గాక!

శరీరము ఉండగా భక్తిశ్రద్ధ ప్రేమలతో, ఒక్క పుష్పము నైనను యివ్వజాలక, చనిపోయిన తరువాత, మేట్లకొలది (గంపలకొలది) పువ్వులు, సమాధిమీద వేసిన యేమి లాభముండును?

దాహముచే అవస్థపడుచు, దాహమో రామచంద్రా! యని పరితపించుచు, ప్రాణము పోబోవుచుండ, ఒక్క కొబ్బరికాయ నీరు దాహము

తీర్చుటకై, యిచ్చుటకు నిరాకరించి, శరీరము పోయిన తరువాత, బండ్ల కొలది కొబ్బరికాయలు నర్పించదలచిన ఏమి లాభము ?

కనుక శరీరములో ప్రాణముండగనే, మనము చేయవలసిన సేవను, ఉపకారమును, దీనులకు, చేయుటకు సదా ప్రయత్నించవలెను.

ప్రియమైన శాంతిపాఠకులారా! ధర్మాభిలాషులైన భక్తులారా! శాంతి ఆశ్రమము 1917లో లోకములో శాంతి కాముకులందరి ఉపయోగమును, వృద్ధినికోరుచు స్థాపించబడెను. ఇన్ని సంవత్సరములనుండియు, మీరు యెన్ని పర్యాయములు, ఆశ్రమమును సందర్శించి ఆశ్రమములో వ్రాయబడిన అమూల్య సూక్తులను గమనించి, ప్రార్థన, ధ్యానాదులు చేయుచు, యెంత వృద్ధి అయితిరో, మీరే మీ జీవితములను, జాగ్రత్తగా విమర్శించుకొని గ్రహించుడు.

52 సంవత్సరముల నుండియు, శాంతి ఆశ్రమము దాని 'సింహద్వారములను' తెరచి, భక్తులందరకు, శాంతి పిపాసకులను అహర్నిశములు ఆహ్వానించుచున్నను, సమీప గ్రామములలో కూడ నివసించుచుండు, కొందరు భక్తులు ఆశ్రమమునే చూడనివారుగూడ ఉండిరని వ్రాసిన, మీరు చదువుటకు ఆశ్చర్యపడెదరు. వీరిని ప్రవృత్తిపరులని చెప్పెదమా? దైవపరితాపము లేకుండుటయే యీ అశ్రద్ధకు ముఖ్యకారణమని వ్రాయుటయా?

అమృతము చెంతనేయుండగా, దానిని గ్రోలక, విషతుల్యములగు, విషయ సుఖముల వెంటనే పరుగెత్తుచు, తెలియకుండగనే అధోగతిపాలగుచుండెడి వారి జీవితములను తలంచిన, చాల విషాదకరముగా నుండును.

నేను ముఖ్యముగా యీ 75 సంవత్సరముల నుండి గ్రహించినది. "కాలముయొక్క విలువ" క్షణములను వ్యర్థబుచ్చెడివారు, జీవితమంతయు వ్యర్థబుచ్చెదరు, ఈ రోజులలో, సందర్శకులు, భక్తులు, నన్ను చూచుటకు

రాగానే, వారేమనుకొన్నను, నన్ను తప్పుగా తలంచినను సరేయని యిట్లనుచుందును.

ఆత్మీయులారా! నా కాలము చాల విలువైనది. నా కాలమే గాదు, మీ కాలముగూడ విలువైనదేగాన మీ కాలమును, నా కాలమును వృథాచేసెడి, వ్యర్థమైన మాటలతో గడపకుండగ, దైవసన్నిధిని యిప్పుడు, యిచ్చటనే అనుభవించుచు, నాకు తోడ్పడుదురని వారిని కోరుచుందును.

ఇవివట్టి మాటలతో వ్యర్థబుచ్చెడి రోజులుగావు. అట్టికాల హరణమునకు కింకెన్నడు తావివ్వరాదు. ఇప్పుడు కావలసినది స్వార్థరహితమైన సేవ. నిస్వార్థమైన పనులు, మీ కాలమును సద్వినియోగము చేయుచు, దైవము ననుభవించుచు, మీ వృద్ధికి నావృద్ధికి, ఆశ్రమవృద్ధికి, దేశక్షేమమునకు, లోకశాంతికి తోడ్పడుడు.

ప్రియమైన శాంతి పాఠకులారా! ఈ శరీరము పోయిన తరువాతను, నేను మీకు తోడ్పడజాలనుగదా! శరీరములు నీటిబుడగల వంటివని జెప్పుచుందురు; గాన ఈ శరీరము పోకుండగనే, మీకు తోడ్పడెడిసావకాశమును నా కివ్వమని మిమ్ము ఇంతగా కోరుచుంటిని.

అటులనే మీ శరీరములు పోయిన తరువాతను, మీ వృద్ధికిగాని, ఆశ్రమవృద్ధికిగాని, ఇతరుల వృద్ధికిగాని, మీరుకూడ తోడ్పడజాలరుగదా!

ఒక్కొక్కరి జీవితములో, సామాన్యముగా పైకి కనుపడుచుండినను, ఆశ్రమములో వ్రాయబడిన ఒక్కొక్క సూక్తి, మహావాక్యముగా తోడ్పడుచుండును.

చిన్నతనములోనే, యా క్రింది ఆకర్షణీయమైన వాక్యమును, మహాసూక్తిగా చదివెడి అదృష్టము నాకు కలిగెను. అది యెప్పుడూ నా జీవితములో, నాకు ఆదర్శనీయముగా తోడ్పడుచునే యుండును.

**"You may not pass by this way again so sow the seeds of peace and love, now alone as you pass by"**

"నీవీదారిని మరల వచ్చెడి సావకాశము లేకపోవచ్చునుగాన, నీవిప్పుడే, నీవు జల్లదలచిన శాంతిబీజములను, ఇప్పుడు నడచుచుండగనే వెదజల్లుము"

మరణమునకు ముందు, మరణానంతరమునగూడ, పరోపకారార్థ మిదం శరీరం" ఈ శరీరము, ఇతరుల సేవకొరకే యివ్వబడెనుగాన మన జీవితములు, యెప్పుడో ఒకప్పుడుగాక నిరంతరము, పుట్టినది మొదలు గిట్టెడివరకు ప్రపంచము నంతను, తమ స్వంత గృహముగా, అందున్న జనులందరను, తమ సోదరీ, సోదర స్వరూపములుగా భావించి, అందరిని ప్రేమించుచు, వారిసేవ చేయుటయే తమనిజమైన మతముగా, శాంతియుతమైన ధర్మముగా భావించి, జీవించుచున్నవారి జీవితములే ధన్యవంతములు. అట్టివారే జీవన్ముక్తి సంపాదించుకొనుటకు అర్హులు. అట్టివారే మానవకోటికంతకు ఆదర్శప్రాయులుగా జీవించుచుండగలరు. కొదువ వారందరు అహంకార, మమకారములకు బానిసలైన ప్రవృత్తిపరులు, బ్రతికియుండియు చనిపోయిన వారితో సమానమే యగును.

ప్రియమైన శాంతిపాఠకా! ఇక వెయ్యిమాటలేల? నీవు జీవన్ మృతుడవా? లేక జీవన్ ముక్తుడవు కాగోరుచుంటివా? నీ గురించియే నీవు జీవించుచుంటివా? లేక నిన్ను నీవు మరచి, స్వార్థరహితుడవై, ఇతరుల శ్రేయస్సునకై జీవించుచుంటివా? జీవించియుండగా నీ వృద్ధికి, లోకశాంతికి యేమిసేవ చేయుచుంటివో, మరణానంతరమున, యేమి సేవ చేయదలచు చుంటివో నీ భావనలు నాకు స్పష్టముగ త్వరలో వ్రాసిన - చదివి ఆనందించెదను.

స్వార్థుడు భూమికి భారముగా యుండును.
స్వార్థరహితుడు పృథ్వికి భూషణముగా నుండును.
స్వార్థమే నరకమునకు త్రోవ చూపును.
నిస్వార్థమే స్వర్గమునకు దారితీయును.
స్వార్థమే బంధనము.
నిస్వార్థ సేవయే మోక్షము నిచ్చుటకు సహాయము చేయును.

"భక్తి ప్రేమ స్వరూపులైన ఆత్మీయులారా! ఆశ్రమాభిమానులారా! ప్రస్తుతము ఈ శరీరము ఉండగా, మీరు జేయుచున్న సేవ కృషిని ఈ శరీరము పోయిన తరువాతను, మరణానంతరమున మీ వృద్ధికి, లోక శాంతికి పాటుబడుచున్న శాంతి ఆశ్రమాభివృద్ధికి మీరు యేమి చేయదలచిరో మీ ఆశయము లేమిటో, నాకు - వివరముగా, మీ సానుభూతితో వ్రాసిన, యీ శరీరముండగనే - చదివి, - విని - 52 సంవత్సరముల నుండియు, మీ అందరి శ్రేయస్సును, శాంతిని కోరుచు అహర్నిశములు కృషి చేయుచున్న శాంతి ఆశ్రమము, మరణానంతరమున గూడ మానవకోటికి మీ అందరకూ యెట్లు తోడ్పడబోవుచున్నదో, ముందుగానే తెలుసుకొని ఆనందించెను.

ఓం సర్వేషాం స్వస్తి ర్భవతు
సర్వేషాం శాంతి ర్భవతు
సర్వేషాం పూర్ణం భవతుః

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి ః శాంతి ః శాంతిః

# రాజవిద్యా రాజగుహ్య యోగము

నదులన్నియు సముద్రమునే చేరుచున్నట్లు మతములన్నియు అద్వితీయమైన ఒకే దైవమును జేర్చుచున్నవి.

లోకములో నున్న వివిధ మతముల, సారము వేదములలో చెప్పబడెను. వేదసారమంతయు ఉపనిషత్తులలో ఇమడ్చబడెను. ఉపనిషత్తుల సారమంతయు, భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మచే క్లుప్తముగా చెప్పబడెను.

భగవద్గీతల సారమంతయు మన చిన్న శాంతి ప్రార్థనలో యిమడ్చబడినదని, నేను ఆనందించుచు యీ ప్రార్థనను హృదయము నుండి, హృదయమునకు, అన్ని పల్లెలలో, పట్టణములలో ప్రాక్పశ్చిమ దేశములలో గూడ వ్యాపింపజేయుటకు శ్రీశాంతి ఆశ్రమము ప్రయత్నించుచుండెను. కాన యీ పరమపావనమైన, రాజవిద్యా రాజగుహ్య యోగమును శాంతి ప్రార్థనతో ప్రారంభించుచు గీతావాణి పాఠకులందరితో, ఈ చిన్న ప్రార్థనను పంచుకొనుటకు, ఈ మనస్సు కోరుచుండెను.

ఈ చిన్న ప్రార్థన యొక్క మహత్వ మెట్టిదనగా ప్రార్థన జేయుచుండగనే, దైవసన్నిధిని అనుభవించుటకు, వ్యక్తపరచుటకు తోడ్పడును. శాంతి ప్రార్థన ఇంతవరకు హిందీ, ఇంగ్లీషు, మళయాళం, బెంగాలీ, ఒరియా, గుజరాతీ మొదలైన పన్నెండు భాషలలో తర్జుమా చేయబడి దేశమంతటను ప్రచారమగుచుండెను. ఫ్రెంచి, జర్మనీ మొదలైన భాషలలో గూడ తర్జుమా జేయబడి విదేశములలో, శాంతి ప్రార్థన శాంతిసేవను జేయుచున్నది. గీతావాణి పాఠకులకు గూడ, యీ శాంతి ప్రార్థనకు తోడ్పడుగాక!

శ్రీరామకృష్ణానంద స్వామీజీ చాల సంవత్సముల నుండి గీతాసేవ, గీతావాణి ద్వారా, భారతదేశమంతను జేయుచున్నట్లు, శ్రీశాంతి ఆశ్రమము శాంతి స్థాపనకై లోకములో, శాంతి ప్రార్థనను వ్యాపింపజేయుచు, అల్పమైన సేవజేయుట భగవానుని సర్వశక్తుల ఆశీర్వాద ఫలమే అని ఆనందించుచుంటిని.

# లోక శాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ ! మా లోపల ప్రత్యణువునందు ఇమిడియుండి మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము. ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైకమూర్తీ! నిన్ను తెలిసికొను భాగ్యమిప్పుడు, ఇచ్చటనే ప్రసాదింపుము.

ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల, ఉత్తరదక్షిణముల, ఈ విశ్వమందంతటను, అందరును నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక! ఓ సచ్చిదానందరూపా ! ప్రతి మానవ హృదయములనందును, నానాజాతి మధ్యమునను శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

రాజవిద్యా రాజగుహ్యాయోగము రహస్యములకు రహస్యముగా జెప్పబడినది. ఇందు భక్తి యోగము, జ్ఞాన విజ్ఞానములతో నింపబడియున్నది, రహస్యమైనను, బట్టబయలైన రహస్యముగా జెప్పబడెను.

దైవ పరితాపముతో నున్నవారికి వెయ్యి మాటలు అనవసరము. ఒక్క మాటయే చాలును. అంతయు భగవానుడే, భగవానుడుతప్ప, అన్యమైనది, యెప్పుడును ఎచ్చటను లేదు.

ఈశావాశ్య మిదం సర్వం

అంతా రామమయం ఈ జగమంతా రామమమయం.

మనకిప్పుడు ముఖ్యావసరమైనది గీతలు బోధించుచున్న ధర్మమును అంతా దైవమనెడిది మన దినచర్యలో అనుభవములో ఎప్పుడోగాక నేటి

నుండియు, ఆచరణలో పెట్టుటే. నేడేమనది, రేపు మనదిగాదు గాన ఈ క్షణము నుండియే గీతామృతమును గ్రోలెదముగాక !

దైవముసర్వములో నుండెను. సర్వము దైవములో నుండెను. ఈ సృష్టి అంతయు దైవము నుండియే వచ్చి, దైవమునందే యుండి మరల దైవములోనే లీనమగుచున్నది. దైవమే తల్లి, తండ్రి, గురువు, ఓంకారమును సర్వమును.

అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

ఇతర భావములు లేక, ఇతర దేవతలను ఆరాధించెడివారు గూడ నన్నే చేరుచున్నారని భగవానుడు జెప్పుటలో విశ్వమత సారాంశమును బోధించుచుండెను.

పత్రం పుష్పం ఫలం తోయం
యో మే భక్త్యా ప్రయచ్ఛతి
త దహం భక్త్యుపహృత
మశ్నామి ప్రయతాత్మ నః ॥

మన దినచర్యలో దైవమునకు ప్రేమపూర్వకముగా ఏ అల్పమైన వస్తువును చివరకు జలమునిచ్చినను ప్రేమతో అందుకొనును. చివరకు మనము అన్నపానాదులు స్వీకరించునపుడు గూడ సర్వము కృష్ణార్పణజేసి సూక్ష్మములో మోక్షమును పొందవచ్చును. క్రీస్తు ప్రభువు తాను పాపాత్ములను తరింపచేయుటకే జన్మించితినని జెప్పుచుండును. గీతలలో భగవానుడు దురాచారపరుడైనను పాపియైనను దృఢనిశ్చయముతో, భక్తిశ్రద్ధలతో పూజించిన నిత్యశాంతిని పొందుననియు, తన భక్తుడెన్నడును నశింపడనియు జెప్పియుండెను.

రాజవిద్యా రాజగుహ్య యోగసారమేగాక, గీతలు, ఉపనిషత్తులు, వేదములు, సర్వమత సారమంతయు మరల శ్రీ భగవానుడు ఈ క్రింది చిన్న శ్లోకములో ఇమిడ్చి లోకమంతయు తరించుటకు వీలుగా చక్కనైన రాజబాటను జూపియుండిరి.

శ్లో॥ మ న్మనా భవ మద్భక్తో మ ద్యాజీ మాం నమస్కురు ।
మా మే వైష్యసియుక్త్వైవ మాత్మానం మత్పరాయణః ॥

ప్రియమైన గీతావాణి పాఠకులారా, గీతాజయింతి జ్ఞాపకార్థముగా మనమందరమిప్పుడు నిమీలిత నేత్రులమై కొంతతడవు శ్రీకృష్ణ పరమాత్ముని దివ్యమంగళ విగ్రహమును ధ్యానించుచు ఆ విశ్వరూప సందర్శనమును బడసి అవ్యక్తమైన మహావిరాట్ స్వరూపములో లీనమై నిశ్శబ్దములో పూర్ణశాంతిని అపరోక్షముగా అనుభవించుచు తరించెదముగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతిః శాంతిః శాంతిః

# వాడేవీడు

తే॥గీ॥ వీడు వాడను అన నేల? వాడె నేను
నిదియు నే నను వ్యవహార మెల్ల మాని
సర్వమాత్మ యటంచు నిశ్చయము చేసి
యఖిల సంకల్పములు బాసి సుఖివి గమ్ము

తా॥ "శిష్యరత్నమా! 'వీడు, వాడు' అని చెప్పుట ఎందులకు? 'వాడే నేను, నేనే వాడు; ఇదియే నేను, నేనె యిది' యని చెప్పబడు యీ లోక వ్యవహారములన్నింటిని విడచి, సర్వము ఆత్మయేగాని, ఆత్మకు నన్యమేమియును లేదని మనోనిశ్చయమును బొందినవాడవై, సమస్త కోరికలను విడచి, ద్వంద్వ శూన్యుండవై కేవలాత్మానంద సుఖమును బొందు" మని భావము.

ఏకో వశీ సర్వభూతా స్తరాత్మా - అన్ని నామరూపములలో, అన్ని భూతములలో ఒక్కటే సర్వవస్తువు వెలుంగుచున్నదని వేదములు ఘోషించుచున్నవి. మనలోని ఈ సద్వస్తువును, దైవమును, అందరూ పూజించి, పొగడుచు, గౌరవించుచున్న, మనము అద్దానిని, వారి అందరియందును దర్శించుట చాలవఱకు సులభమని జెప్పవచ్చును. కాని మనవలన ఉపకారమును పొందియు మనకు హాని కల్గించ యత్నించెడి వారిలోను, అమాయకులను హింసించి తద్వారా ఆనందమును పొందనెంచెడి వారిలో కూడా ఆ ఏకైక అఖండాత్మ రూపమును ('ఏకోవశీ సర్వభూతా స్తరాత్మ' యను సూత్రము ప్రకారము) జూడగలిగినవారి జీవితములు ధన్యవంతములైనవి.

బంగారమును పుటములో పెట్టి ఎంత హెచ్చుగా కాల్చిన అంతవన్నె వచ్చును గదా! "మనలను పొగడుచున్న, పాలు పితికి వేయబడిన ఆవు వలె నుందుమనియు; మనము దూషింపబడుచున్న బలిష్టముగాయున్న ఆవు వలె నుందు" మనియు, ఒక మహనీయుడు చెప్పియుండెను. పాశ్చాత్య దేశపు మరియొక మహనీయ భక్తురాలు ఈవిధముగ దైవమును ప్రార్థించెడిదట:

ఓ దైవమా! నా శరీర ఆరోగ్యమునకై కొంత పని నిమ్ము. నా మనస్సు నిన్ను చింతించుటకై కొంత బాధ నిమ్ము. నా హృదయ పరిపక్వమునకై ఒక విరోధి నిమ్ము.

ఆహా! సాధకుల కందరకు ఉపకరించగల ఎంత చక్కని ప్రార్థన ఇది. భోగులైనను, యోగులైనను, గృహస్థులైనను, సన్యాసులైనను ఆరోగ్యముగ జీవించవలె ననిన ప్రతివారికి కొంత శరీర వ్యాయాయము అత్యవసరము. మనస్సును నామరూపాత్మకమగు ప్రాపంచిక విషయముల వెంట పరుగెత్తనీయక దానిని నివృత్తిగా ఉంచు సాధనలలో మన మనః పరిపాకమును పరీక్షించు కొనుటకు బాధ కొంత సహకారిగా నుండును. ఆధ్యాత్మిక జీవితములో వృద్ధిచెంద గోరు మనము మన హృదయములు విశ్వప్రేమతో నిండి యున్నదీ లేనిదీ పరీక్షించుకొనుటకు ఒకరిద్దరు విరోధులనుగూడ – వారి ఉనికిని మన అభివృద్ధి కనుకూలముగ ఉపయోగించుకొనునెడల – తప్పక మనకు సహాయ పడుచున్నవారిగనే లెక్కించుకొనవలెను.

అన్నియు చక్కగా జరుగుచున్నప్పుడు, అందరు కొనియాడుచు పూజించు చున్నప్పుడు అందఱు భక్తులుగా నుండుట తేలికయే. కాని నిందలతో, ఖండనలతో తమ పేరు ప్రతిష్ఠలను, గౌరవమును మట్టిపాలు చేయ ప్రయత్నించు చున్నను, మనలను సిలువ వేయుచున్నను – అనగా శరీరమును ఒక మ్రానుకు కట్టి, మేకులు దిగగొట్టుచున్నను, తమ్ము హింసించెడి వారిలో కూడ దైవమును దర్శించగలిగి, దైవ జ్ఞప్తిని వీడనివారె నిజమైన మహాభక్తులని చెప్పవలసి యున్నది.

పూర్వము "సిపాయి పితూరి" జరిగినప్పుడు ఒక మహనీయుని కఠిన హృదయులైన కొందరు దుర్మార్గులు హింసించగా, వారి శిష్యులు ఆ దుర్మార్గులను పట్టుకొని ఆ మహాత్ముని దగ్గరకు తీసికొనివచ్చి, "ఈ దుర్మార్గులకు ఏమి శిక్ష వేయమనెదరు?" అని అడిగిరి. అప్పుడు ఆ మహనీయుడు తన శిష్యులకు

"తక్షణము విడువుడు. వారు ప్రత్యక్ష నారాయణులు. వారిని ఎంత మాత్రము దండించకూడదు. వారికి నా నమస్కారములు. వారిని సగౌరవముగా పంపుడు" అని ఆనతినిచ్చెను. ఇటులనే శ్రీ జయదేవులు తన కాళ్ళను, చేతులను ఖండించిన వారిని గూడ సత్కరించి గొప్ప గొప్ప పారితోషికముల నర్పించి, గౌరవించి పంపి యుండెను. 'ఇదే విధముగ తనను హత్యచేసిన వానిని సాక్షాత్తు శ్రీరాముని ప్రతిరూపునిగనే శ్రీ గాంధీ మహాత్ముడు కూడ జూచియుండెను. మరియొక జ్ఞాని వీధిలో కుక్కలతో కలసి తాను ఒక ముద్ద అన్నమును తినుచు, కుక్కకు ఒక ముద్ద అన్నమును తినుపించుచుండ కొందఱు జనులు చూచి నవ్విరి. వారికి ఆ మహనీయుడు ఇటుల చెప్పెను;

ఓ నారాయణులారా ! నారాయణుడు నారాయణునికి అన్నము తినుపించుచుండ, మీరు నారాయణులై యుండియు నవ్వెద రేల?" అని ప్రశ్నించెనట.

ఆత్మానుభవము గలిగినవారు ఎన్ని కఠిన పరీక్షలలో నైనను దైవ జ్ఞప్తితోనే యుందురు. కాన వారికి సర్వము దైవముగానే గోచరించును. "వాడే వీడు" అనియు ఆనందములో నుడువగలరు.

'శాంతి' యనినను, 'దైవ' మనినను, 'ఆత్మ' యనినను ఒక్కటే గదా! అందుచేతనే ఉపనిషత్తులు "శాంతోఽయ మాత్మా" యని ఘోషించుచున్నవి. శాంతి ఆశ్రమము యొక్క ఆశయములు ఉన్నతమైనవి. అతి గంభీరమైనవి. శాంతి అందరి జన్మహక్కు. కాని ప్రతి వ్యక్తియు తన ఉచ్ఛ్వాస నిశ్వాసములలో శాంతినే పూరించుచు దినదినాభివృద్ధిని గాంచుచు శ్రుతివచనమునకు ధ్యేయమగు పరమ శాంతినే సదా అనుభవించుచుండవలెనని ఈ పవిత్ర ఆశ్రమము స్థాపించబడిన 1917వ సంవత్సరము నుండి నిరంతరము అనేక విధముల కృషి చేయుచున్నది. శాంతి కాములగు మానవులందరు తమ శాంతికై కృషిచేసెడి శాంతి ఆశ్రమమును చక్కగ నుపయోగించుకొందురుగాక!

శ్రీ శాంతి ఆశ్రమము మానవకోటి శాంతిని కోరుచు సుమారు నలుబది సంవత్సరముల నుండియు కొలది సేవను చేయగలిగినది. వివిధ దేశములనుండి వివిధ మతములకు చెందిన భక్తులు ఆశ్రమమునకు ఆకర్షింపబడి శాంతి సుధను గ్రోలి వెడలుచున్నారు. కాని ఇంతవరకు చేసిన సేవకంటెను చేయవలసిన సేవయే హెచ్చుగా నున్నది.

ఆశ్రమము వినమ్రియై యెవరికి తెలియబడకుండ తాను చేయగలిగిన సేవను మాత్రము చేయుట దానికి పరిపాటి. అందుచే ఆశ్రమమును గురించి అందఱకు తెలియకపోవుట సహజము. ఈ లోటును తీర్చుటకు కాబోలు ఒక విచిత్ర విధానమున దైవము మనకు తోడ్పడుచున్నాడు, ఆశ్రమము పేరు, దాని సేవయు బాగుగ తెలియని మారుమూలలలోని జనులకు గూడ "శాంతి ఆశ్రమ" మనునది యొకటి యున్నదని తెలియ జేయుటకో యనునటుల ఆశ్రమ భక్తులుగా, మిత్రులుగా కనిపించుకొందఱు చాల ద్రవ్యమును ఖర్చుపెట్టి, శాంతి ఆశ్రమము గురించి ప్రచారమును చేయుచున్నారు. వారికి తోచిన వ్రాతలతో, అభూత కల్పనలతో కరపత్రములును అచ్చువేయించి గ్రామ గ్రామములకు పంపుచున్నారు. నిద్రాహారములుకూడ మాని అహర్నిశములు ఆశ్రమ పతనము ఎటుల జరుగునాయని కలవరించుచు, శ్రమ పడుచున్నారు. శాంతి ఆశ్రమమును పునాదులతో పెకలించి దానిని భూమిమీదనే ఉండనీయరాదనునంత ఈర్ష్య క్రోధము, పట్టుదలతో రాత్రింబగళ్ళు బాహ్యమునకు విరోధులనుకొనెడి మన మిత్రులు చేసిన సేవచే వారాశించి నటుల గాక తద్భిన్నముగా శాంతి ఆశ్రమము ఎన్నియో రీతులుగా వృద్ధి యగుచుండుటకు గల కారణము కేవలము నిర్హేతుకమైన దైవకృపయేగదా! ఆహా! ఎంత ఆశ్చర్యము! వారు తమకు తెలియకుండగనే మన ఆశ్రమ వృద్ధికి తోడ్పడుచుండిరి. శ్రీ పరమేశ్వరానుగ్రహమున నిట్టిదిగాక మరెటులుండగలదు?

ఆశ్రమము స్థాపితమైనప్పటి నుండియు తోడ్పడుచున్న పాత భక్తులు ఇంకను హెచ్చుగా తోడ్పడసాగిరి. క్రొత్త భక్తులు వారి సానుభూతిని అనేక రీతులుగా జూపసాగిరి. మన మిత్రుల ప్రచారముచే నెల చందాలు వృద్ధి అయినవి. వార్షిక విరాళములు కొన్ని ఏర్పడెను. మంచిలోగూడ చెడునే చూచుచున్న పిచ్చివారలకు లేశమైన సావకాశము దొరకకుండగ ఆశ్రమములన్నియు, వాటి ఆస్తులతోనహా, భక్తకోటి కంతటికి ఉపయోగపడులాగున రిజిష్టరు చేయబడి, గౌరవనీయులు, స్వార్థరహితులు నగు వారికి అప్పగించబడినవి. 'శాంతి', 'పీసు' పత్రికలు జయప్రదముగా అచ్చువేయబడుచు ఆంధ్రదేశమునకేగాక ప్రాక్పశ్చిమ దేశములకుకూడ మంచి సేవ చేయుచున్నవి. బూందీ-రాజస్థాన్‌లో శాంతి ఆశ్రమ శాఖ ఒకటి ఇటీవల స్థాపింపబడి అచటనుండి హిందీలో 'శాంతి' అను మాసపత్రిక ప్రకటితమగు చున్నది. జర్మనీ దేశమందును శాంతి ఆశ్రమ శాఖనొక దానిని, అచట ఆశ్రమ భక్తులు ఈ మధ్యను స్థాపించుటయేగాక జర్మనీ భాషలో 'ఫ్రైడ్' (Friede) అను శాంతి మాసపత్రికను ఆశ్రమ పక్షమున ప్రచురించుచున్నారు. ఆహా! దైవమెంత కృపామయుడు! వివిధ నామరూపములతో ప్రకాశించుచున్న ఓ పరబ్రహ్మస్వరూపా! నీకు ధన్యవాదములు.

భక్తితో భగవంతుని నిరంతరము స్మరించినను లేక వైరముచే ద్వేషించుచూ నిరంతరము భగవంతుని గూర్చి తలపోసినను ఆయనను చేరుట ముమ్మాటికి నిశ్చయము. భక్తిచేత కాకపోయినను పిచ్చివైరము చేతనైనను నిరంతరము 'శాంతి, శాంతి' యని స్మరించుట, వారికి మనకు కూడ మంచిదే. వైరులవలె కనబడు మన ఈ యథార్థమిత్రులు చేయుచున్న అఖండమైన సేవను గుర్తించజాలక, కొంతమంది వీరిని మరల ఖండించమనియు, దావాలుజేసి శిక్షింప జేయుమనియు సలహాలు చెప్పుచుందురు. దైవమే మన అపరోక్షానుభూతిని ప్రత్యక్షముగా పరీక్షించుటకు మనముందు అనేక రూపనామములతో నిలచి యుండును. ఈ పరీక్షలలో నెగ్గుటకు మనకు

ఇదియే సదవకాశము. 'వాడే వీడు. వీడే వాడు' అను అనుభవజన్యజ్ఞానము ఈ పరీక్షలలో ఋజువు కావలెను. ఈ క్షణము మనకు యెంతయో కఠినముగాను, విషతుల్యముగాను ఉండవచ్చును. ప్రతివారిలోను, ప్రతి దానిలోను వ్యవహరించుచున్న ఆ ఏకైక పరబ్రహ్మమును దర్శించ గల్గిననాడే మన ఈ అమూల్య మానవ జీవితములు ఉత్తమమైనవి అగును.

అవతార పురుషుడైన ఏసుక్రీస్తు ప్రభువునే ఒక జూడాసు (Judas) రాహువువలె పట్టెనుగదా! ఇక జూడాసులు ఎవరికైనను ఉండవచ్చును. కాని ఏసుక్రీస్తువలె మనముకూడ మన జూడాసులను ప్రేమించగలమో లేదో ఆత్మ పరీక్ష చేసుకొనవలెను. దైవమాయలను మానవమాత్రులు తెలిసికొనజాలరు గదా! శాంతి స్థాపన చేయుటకు దైవము ఏఏ రీతిగా ఎవ్వరెవ్వరిచే ఏమేమి చేయించుచుండునో మనము ఊహింపజాలము.

ఈశావాస్య మిదం సర్వం- ఈ జగమంతయు ఈశ్వరునితో నిండియుండగా, చిన్మాత్రా న్నాస్తి కించన – దైవము తప్ప అన్యమేదియు ఎచటను లేక పిపీలికాది బ్రహ్మ పర్యంతము పరబ్రహ్మమై వెలుగుచుండగా మనము చూచున దంతయు దైవముగానే తప్ప మఱియొక వస్తువుగా ఎన్నడును మనకు కనిపించరాదు. 'అంతా రామ మయం బీ జగమంతా రామమయం' అని భక్తులు కీర్తించుచుందురు. భక్తప్రహ్లాదుడు ఇట్లు చెప్పి యుండెను;

క. ఇందుఁ గలఁడందులేఁడని
సందేహము వలదు చక్రి
సర్వోపగతుం డెందెందు వెదకిజూచిన
నందందే కలఁడు దానవాగ్రణి వింటే.

వారు, వీరు అనక అందరి హృదయముల యందును దైవమును వీక్షించగలిగిన జ్ఞాననేత్రమును ప్రసాదించిన ఆ సచ్చిదానంద స్వరూపమునకు ధన్యవాదములు. వాడేవీడు, ఏలనన వాడు లేని తావు సూదిమొన మోపుటకైనను

అండపిండ బ్రహ్మాండములలో కానరాదు.

ఓ సచ్చిదానందరూపా! నీవు మా ఆత్మానుభవములను, అగ్నిలో పుటములు వేసి పరీక్షించుచున్నను, మా నుండి నిరంతరము అఖండ శాంతి, విశ్వప్రేమలు మాత్రమే ప్రవహించులాగున చేయుము. నిన్నే వివిధనామ రూపములలో ఈ నేత్రములు దర్శించ గలుగునటుల అనుగ్రహింపుము. నిన్ను తప్ప అన్యమును జూచెడి నేత్రములు మాకు వలదు. ప్రతి వాక్కునందు నీ శబ్దమునే మా కర్ణములు విను నటుల కరుణింపుము. మా మనస్సులు నీయందే లీనమగునట్లు చేయుము. మా సర్వావయవములు నీ సేవ జేసియే తరించనిమ్ము, కిరణములు సూర్యభగవానుని యందు లీనమగుచున్నటుల మా జీవాత్మలు నీ అఖండ కోటి దివ్యసూర్య తేజస్సులో ఇప్పుడే, ఇచ్చటనే- లీనమగుగాక! మనోనాశనము కలుగుగాక! వాసనాక్షయమగుగాక! విజ్ఞానము పెంపొందుగాక! వ్యష్టిశాంతియే లోకశాంతికి పునాది కాన ప్రతి వ్యక్తియు, ముందు తన హృదయములో శాంతిని స్థిరము చేసుకొని లోకశాంతకి తోడ్పడుగాక!

సర్వేషాం మంగళం భవతు । సర్వేషాం స్వస్తి ర్భవతు ।
సర్వేషాం శాంతి ర్భవతు । సర్వేషాం ముక్తి ర్భవతు ।
సర్వేషాం పూర్ణం భవతు ।

ఓం శాంతిః శాంతిః శాంతిః

# పుష్కర స్నాన ఫలితము

ప్రతీ పనిలోను, అది ఏ పనియైనను, ఏ సమస్యయైనను రెండు గమనించవలసినవి గలవు. అవి ముఖ్యములు, అముఖ్యములు.

అముఖ్యముల వెంట పరుగెత్తెడివారు అముఖ్యములకు దాసులైనవారు, వేలానవేలు గలరు. అముఖ్యములకు బానిసలైనవారు, వేలేగాదు, లక్షలు, కోట్లు యుండిరని జెప్పవలసియున్నది. నేను జెప్పనేల? మానవ జీవితములను, వారి దినచర్యలను విమర్శించి, పరీక్షించినచో మీరే తెలుసుకొనగలరు సత్యాసత్యములను ఎవ్వరంతటవారే, స్వీయపరీక్షచే గ్రహించగలరు.

ఇక ముఖ్యముల వెంట పరుగెత్తెడివారు, దైవ పరితాపనతో నిండియున్నవారు ఏ లక్షకో, కోటికో యొకరుండుట చాల విచారకరము. దేశ వృద్ధి, లోకశాంతి, మానవాభ్యుదయము, యిట్టి ఆదర్శనీయమైన మహానుభావులవల్లనే గలుగవలసి యున్నది.

ఇప్పుడు నేను, పుష్కర మహాత్యము గురించిగాని, పుష్కరమును గురించిగాని చెప్పబడెడి వందలాది కథలు, గాథల గురించిగాని, చెప్పుటకు కోరుటలేదు. కేవలము పుష్కరస్నాన ఫలితము గురించియే నా మనస్సు ఏ కొద్ది మందికైనను నా ఆంతర్య భావనలు తోడ్పడునని, చాల ఆశ్రమ పని తొందర్లలో మునిగియున్నను, దీనిని వ్రాయుటకు కోరుచున్నందున, నేటి ఉదయము ప్రారంభించితిని. దైవ ఆజ్ఞ, దైవ సన్నిధి లేకుండగ గడ్డి పరకయైన కదలదు. కాన, యీ వ్యాసమును దైవమే వ్రాయుగాక, అన్నిటికంటెను, నా భావనలు, ఒకరిద్దరికైనను, తోడ్పడిన వ్యర్థముగా వ్రాయలేదని తృప్తిజెందెను. పుష్కరపు రోజులలో పరమపావనమైన యీ గోదావరి జలములో స్నానముజేసి, యీ జన్మలోను, పూర్వపు జన్మలలోను జేసిన పాపములన్నియు పోవునని మహనీయులు జెప్పుచుండిరి శాస్త్రములన్నియు కోటి పాపములైనను,

హరించిపోవునని జెప్పుచున్నవి. పాతజన్మపోయి కొత్తజన్మ వచ్చినట్లే, అజ్ఞానము, అంధకారము, భేదభావనలతో గూడియన్న గోదావరి పుష్కరస్నానముతో పాతజన్మ పోయి, నూతన జన్మ, విశ్వప్రేమతో నిండియున్నది. హృదయ పవిత్రతతో గూడియున్న పూర్ణశాంతితో నిండి, లోక కళ్యాణమును కోరెడి జన్మ ప్రాప్తించు చున్నది.

అటు చూడుడు – పావనమైన మాతను దర్శించుడు ! ఆ యాత్రికులను భక్తులను గాంచుడు. వేలుగాదు, లక్షల కొలది భక్తులు పవిత్రమైన గోదావరిలో పుష్కరస్నానము జేయుచున్నారు. వీరి భక్తి ప్రేమలకు వీరందరకు ధన్యవాదములు. గోదావరికి కొలది దూరములో యుండి, గోదావరి స్నానమునకు అందరి భక్తులవలె వెళ్ళజాలని నేను, గోదావరి స్నానముజేసి, నూతన జన్మలను ప్రారంభించి, శాంతి ఆశ్రమము చూచుటకు వచ్చుచున్న భక్తులను గాంచి, ధన్యోస్మి, ధన్యోస్మి, ధన్యోస్మి, ఈ పుష్కర స్నానముజేసి, నూతన జన్మల నెత్తిన భక్తుల దర్శన మిచ్చుటజేసి, నేను గూడ తరించినట్లే, కొంత పుణ్యమును సంపాదించినట్లే తృప్తిపడి ఆనందించుచుంటిని.

అదియుగాక, ఆశ్రమములో కొంతమంది ముసలివారు, అంత దూరము వెళ్ళజాలనివారు గూడ గలరు గాన, వారిని తృప్తిపరచుటకై కొంత గోదావరి జలము తెప్పించి, ఆశ్రమములో యున్న బావులన్నిటిలో కలుపుట జరుగుచున్నది. జీవితమంతయు నమ్మకము, శ్రద్ధలోనే యున్నదిగాన, శాంతి ఆశ్రమ బావులలో స్నానము జేసినను, పుష్కరజలము, యీ నూతులలో కలసెనుగాన, గోదావరి పుష్కరస్నాన ఫలితము కొంతయైననను, ఆశ్రమవాసులకు, కలుగుచున్నదని నా వెర్రి నమ్మకము. ఇదివరలో కొన్ని పుష్కరములలో, అలహాబాదు త్రివేణి సంఘములలో, భక్తులు స్నానములు చేయుతావులలో, జనసమృద్ధిచే వందలేగాక, వేలకొలది యాత్రికులు చనిపోయిరని, అకాల మృత్యువు వాతను బడిరని, చదువుటకు, వినుటకు

విచారమయ్యెను. పుష్కర స్నానముజేసి పుణ్యముజేసికొనుటకు వెళ్ళగా మృత్యువు ప్రాప్తించుట విషాదకరము. ఐనను కొందరు భక్తులు గాఢమైన విశ్వాసముతో చనిపోయిన, పుష్కరస్నాన ఫలితమేగాక, అట్టి పవిత్రమైన పుణ్యతీర్థములలో స్నానమాచరించి, చనిపోవుటచే, అట్టి అదృష్టవంతులు నేరుగా స్వర్గమును చేరుచుండిరని, వైకుంఠములో విష్ణు సన్నిధిలో కూర్చునియుందురని నమ్మకము. బ్రతికి యున్నను, చనిపోయినను, దైవసన్నిధి అనుభవించుచు, దైవసన్నిధిలో యుండుట మహా అదృష్టము. దైవ పరితాపన, దైవసన్నిధిని నిరంతరము అనుభవించుటయే దుర్లభమైన మానవ జన్మకు ముఖ్యావసరము.

పుష్కర స్నానములను వందలేగాక, వేలానువేలు జనులు హిందూ దేశమంతటి నుండియు బస్సుల మీద, ట్రెయినుల మీద, కాలినడకనేగాక, విమానముల మీద గూడ వచ్చుచుండిరని వినుటకు ఆనందము.

మైసూరు మహారాజుగారు వారి కుటుంబముతో గూడ పుష్కర స్నానమునకు వచ్చుచున్నారని పేపర్లలో అచ్చువేసిరి. మైసూరు మహారాజుగారేకాక, ఇంకా ఎందరో మహారాజులు, జమీందార్లు, కోటీశ్వర్లు, మొఖాసాదార్లు, న్యాయవాదులు, వైద్యులు, వర్తకులు, ముఖ్యముగా సన్యాసులు, సాధువులు, జగద్గురువులుగూడ పుష్కరస్నానములకు వచ్చుచుండిరి - వీరందరకూ ధన్యవాదములు.

ఇప్పుడు ముఖ్యముగా వీరును, వారును, నేనును విమర్శించి తెలుసుకోవలసినది యేదియనగా ఇంతవరకూ జేసిన పాపములు, దుర్బలత్వములు, తామసగుణములు, కామ క్రోధ లోభ మదమాత్సర్యములు, ఈ పుష్కర పవిత్ర గోదావరి స్నానములో హరించెనా లేదా? మనగుణములు, మారకుండా తగ్గకుండాయున్న కామక్రోధములకు బానిసలై యున్న ఎన్ని పుణ్యతీర్థములలో, నదీసంగమములలో పుష్కర స్నానములు జేసినను, అంతగా ఫలితముండదేమోయని, యీ మనస్సు తలచుచుండును. దైవమునందు,

పుష్కర స్నానఫలితమునందును, మనకు పూర్తియైన నమ్మకమున్నచో మన పాపములేగాక, మనకు ఉన్న రోగములు జబ్బులన్నియు గూడ, సూర్యునిముందు మేఘములు పటాపంచలై పారిపోవునట్లు జబ్బులు పాపములేగాక ఏవిధమైన దుర్భలత్వమైనను, హరించి పూర్తిగా పారిపోవలెను. జీవితమే పూర్తిగా మారవలెను. ఇట్టి పుష్కర పర్వదినములలోనే పార్వతీ పరమేశ్వరులు, గగనమున లోకసంరక్షణార్థము విహారము జేయుచు, పుష్కర స్నానములు జేయుచున్న లక్షలాది ప్రజలను జూచి, పార్వతీదేవి ఇటుల సంభాషించ దొడగెనట.

'నాథా! పురాణములలో శాస్త్రములలో పర్వదినములందు పుణ్యనదులలో స్నానముజేయువారు నేరుగా స్వర్గము జేరుదురని నమ్మకముగలదు. ఈ లక్షలాది ప్రజలందరూ స్వర్గమునకు వెళ్లిన అచ్చట చోటు ఉండునా? యని ప్రశ్నించెనట – అప్పుడా శివుడు 'ఓ దేవీ! శ్రద్ధ, నమ్మకము, భక్తి ప్రేమలచే యెట్టివారైనను స్వర్గమును చేరెదరు. గాని యీ రీతిగా స్నానము జేయుచున్న లక్షలాది ప్రజలలో నిజమైన భక్తి, శ్రద్ధ, నమ్మకము గల్గినవారు లక్షకొక్కరైనా ఉందురో, ఉండరో? అని శివుడు జెప్పగా, పార్వతి నమ్మజాలకుండుట జూచి శివుడు, ప్రత్యక్షముగా తాను జెప్పిన మాటలయొక్క యథార్థము అనుభవముతో జూపెదననిచెప్పి పార్వతినిగూడ వేషము మార్చుమనిజెప్పి, ఇద్దరునూ వృద్ధదంపతులుగా గోదావరి తీరమున నిజరూపములుమార్చి కూర్చునియుండిరి.

పరమశివుడు రోగపీడితుడై బాధలో యున్నట్లు మూల్గుచుండెను. వృద్ధ భార్య, గోదావరి స్నానముజేసి వెళ్ళువారలను ఒక్కొక్కరిని, 'మీలో యెవ్వరైనా యెన్నడూ పాపము జేయనివారున్న జబ్బుతో బాధపడుచున్న నా భర్తమీద గోదావరి జలమును జల్లిన ఆరోగ్యవంతుడవు' నని కోరగా, ఒక్కొక్కరు యేదోపాపము యెన్నడో ఒకప్పుడు జేసియుందుమని, అనుమానించుచు వెడలిపోయిరట. గంగాస్నానముగానీ, గోదావరి స్నానముగాని పుష్కరములలో జేసిన వారి పాపములన్నియు పోయెను అను నమ్మకము ఆ లక్షలాది ప్రజలలో

ఎవ్వరికైనను లేకుండుటజూచి, పార్వతి తన భర్త జెప్పిన మాటల సత్యమును గ్రహించసాగెను.

అంతలో పతితురాలైన ఒక వేశ్య స్త్రీ వృద్ధ దంపతులను సమీపించి కారణమరని ఇప్పుడే తాను పవిత్రమైన గోదావరి జలములో స్నానమాచరించుటచే తన పాపములన్నియుపోయి నూతన జన్మ పొందితినని గోదావరీ జలమును ఆ రోగిమీద జల్లగా, ఆరోగ్యమును శాంతిని బడసెనని వినియుంటిమి. కాన మనము చదివెడివి, వినెడివి ఆచరణలోపెట్టి శ్రద్ధతో నమ్మి యుండవలెను. ఎంతమాత్రము అనుమానము, సంశయము ఉండరాదు. "సంశయాత్మా వినశ్యతి" అని గీతలుగూడ జెప్పుచున్నవి.

శాంతి ఆశ్రమము స్థాపించకముందు హిమాలయ పర్వతములలో, ఋషీకేశముచెంత స్వర్గాశ్రమములో, నేను సాధనజేయు రోజులలో, హరిద్వారములో కుంభమేళా జరుగుట సంభవించెను. అప్పుడు అచ్చటకు గూడ, లక్షలకొలది యాత్రికులు గంగా పుష్కర స్నానమునకై వచ్చిరి. స్వర్గాశ్రమములో తపస్సులు జేసుకొనుచున్న కొందరు సాధు మహాత్ములు నన్నుగూడ, కుంభమేళా జూచుటకు గంగా స్నానమునకు తీసుకొని వెళ్ళిరి. ఆ కుంభమేళా జరిగి 55 సంవత్సరములు కావచ్చుచున్నను, ఆ దృశ్యము నేనీ వ్యాసము వ్రాయుచుండ, కంటికి కట్టినట్లు నాముందుగా ఇప్పుడు కానవచ్చుచున్నది.

ఎచ్చట జూచినను, సాధువులు, సన్యాసులు, బైరాగులు, మత గురువులు, మహంతులు, నానా సాధువులతో, హరిద్వారమేగాక ఆ పరిసర ప్రాంతములన్నియు నిండియున్నవి. వందలకొలదిగా ఆ సాధువులు, వికలాంగులై శరీరములను బూడిద భస్మము వ్రాసుకొని వీధులలో వూరేగుచున్నవారు నాకిప్పుడును గానవచ్చుచుండిరి. కొందరు మఠాధిపతులు, ఏనుగులు, గుఱ్ఱములు, లొట్టిపిట్టలతో వూరేగుచుండిరి. కొందరు సాధువులు

అగ్నిహోత్రమువద్ద వంటలు జేసుకొని ధ్యానము జేయుచుండిరి. ఇక భిక్ష గాండ్రకు అంతు, ఆది లేదు. పుష్కరము పేరున ఎవ్వరిపాలువారు, వారి వారి స్వభావములనుబట్టి చేయుచుందురు. దొంగలకు, పుష్కరస్నాన ఫలితము దైవము గురించి ఆలోచించుటకు బదులు ప్రమత్తతగా అజాగ్రత్తగా యున్నవారి సామానులను, వస్తువులను, ధనమును, యెటుల దొంగిలించెదమాయని వారు స్నానములుజేయు రేవులవద్ద జనసంఘములలో తిరుగుచుందురు.

ఇక స్వార్థకపు వర్తకములు; వారిది ఏ వర్తకమైనను పుష్కరము పేరున రెండు డబ్బులు పోగుచేయుట యెటులనని వారి మనస్కులు ఆలోచించుచు వారు ఎన్ని పాటలు, కృతులు పాడుచున్నను గీతా పారాయణలు దైవ ప్రార్థనలు జేయుచున్నను, కొందరి మనస్సులు దైవ పరితాపనతో నిండి దైవమును ఆరాధించుటకు బదులు, ధన పిశాచము గురించియే సదా ఆలోచించుచు వారి అమూల్యమైన కాలము వ్యర్థపుచ్చుచుండుట అతి విచారమైన సంగతి. పుష్కరము పేరుననైన మనజీవితములు మారుగాక! ప్రవృత్తి నుండి నివృత్తికి, అనిత్యము నుండి నిత్యమునకు, మృత్యువు నుండి అమృతత్వమునకు, మనస్సులు తిరుగుగాక! వ్యయ ప్రయాసలతో, పవిత్రమైన గోదావరి స్నానము పుష్కర రోజులలో జేసినందుకు ఫలితముండవలెనుగదా? జీవితములు మారవలెనుగదా? తామసగుణము సాత్విక గుణముగా మారవలెనుగదా? వృద్ధి, వృద్ధి, దినదినాభివృద్ధియే మానవ జీవితమునకు ముఖ్యావసరము. వృద్ధిలేని జీవితము భూభారము.

ఇక పితృదేవతల గురించి ఆలోచింతము. ఈ పుష్కరములో గోదావరి స్నానములు జేయుచు పితృదేవతలేగాక పూర్వఋషులు దేవతలు మొదలైన, మహనీయులందరూ వచ్చుచుండిరని ప్రతీతి గలదు. పితృ దేవతలకేగాక, దేవదానవులకు, ఋషీశ్వరులందరకు శాంతిఆశ్రమమునకు వచ్చుటకు వీరిని వారి స్పర్శదృష్టితోనైనను పావనము జేయుటకు సుస్వాగతము.

గోదావరినది, శాంతి ఆశ్రమమునకు నలుబది మైళ్ళలోనే సామీప్యములో నున్నదిగాన పితృ దేవతలు, మహనీయులందరు ఇచ్చటకు ఆకాశము నుండియైనను ఆశ్రమమును జూచి వారి పావనమైన దృష్టిని ప్రవహింపజేసి ఆశీర్వదించవలెనని హృదయపూర్వకముగా ప్రార్థించుచుంటిని.

స్వార్థరహితమైన ప్రార్థనలను దైవము ఫలింపజేయునుగాక! నా ఈ చిన్న ప్రార్థనను కృపామయులైన పితృ దేవతలు, ఋషిపుంగవులు గౌరవించెదరుగాక! ఇదివరలో ఆశ్రమవాసులతో, ఉత్తరదేశ యాత్ర శాంతి వ్యానుమీద జేసినప్పుడు, బుద్ధగయను దర్శించుట జరిగెను. బుద్ధదేవుడు నిర్యాణరుచిని జూచిన, బోధి వృక్షము క్రింద నేనుగూడ ఆసీనుడనై కొంత తడవు ధ్యానము జేసుకొను అదృష్టమును పొందతిని. అచ్చటయున్నబుద్ధ భగవానుని దేవాలయములో గూడ కొంత తడవు నిశ్శబ్దముగా ధ్యానము జేయుచు, బుద్ధుని నిర్యాణమును అనుభవించుటకు ప్రయత్నించితిని. ముఖ్యముగా గయలో ఆశ్రమవాసులు కొందరు వారి పితృదేవతలకు అచ్చట పండాల సహాయముతో పిండములను వేదమంత్రోచ్చారణతో, అర్పించుచుండ నేను దగ్గరలోనున్న నదిలో స్నానము చేయుచు లోకములో నున్న పితృ దేవతలందరకు మరల మరల తిలోదకమును, పుడిసిలితో అర్పించితిని. మేము గయ వెళ్లిన రోజులలో అదృష్టవాత్తు నీరు అంతగాలేదు. నది అంతయు పిల్ల కాలువలతో నిండియున్నది. ఒక పిల్లకాలవలో నేను పరుండి దైవసన్నిధిని అనుభవించుచు పితృదేవతలందరకూ, నేను తిలోదకము లర్పించుచున్న దృశ్యము నాకు ఇప్పటికి జ్ఞప్తికి వచ్చుచు ఆనందము నిచ్చుచున్నది. మానవకోటి అంతయు, వివిధ మతములకు, జాతులకు, దేశములకు జెందిన, సోదరీ సోదరులందరూ నా స్వంతముగనే యెటుల భావించెనో అటులనే పితృదేవతలందరూ, వారెవ్వరికి జెందియున్నను, ఏ దేశములకు మతములకు జెందియున్నను వారినిగూడ నాస్వంతమే అని భావించుచు, అందరకూ

పుడిసిలితో ఆ పావనమైన ఫల్గుణీ నది జలములను మరల మరల పితృ దేవతల శాంతినేగాక, మానవకళ్యాణమును, లోకశాంతిని కోరుచు అర్పించి తృప్తి జెందితిని.

బావిలో కప్పవలె ఒక్క కుటుంబమునకు, ఒక్క పితృ దేవతకు బంధింప బడకుండా, లోకములో కుటుంబములను, ఆకాశములో పితృదేవతలను, స్వర్గదేవతలందరనూ, మన స్వంతముగా భావించుచు జీవించుట ఎంత అదృష్టము.

లోకములోనున్న పితృ దేవతలందరూ నా స్వంతమే. ఆకాశములో నున్న దేవతలందరూ నావారే స్వర్గములోనున్న అవతారమూర్తులందరూ నా స్వంతమే. మనకున్న జన్మలు, మనశ్వాసకంటెను, సముద్రములోనున్న కెరటములకంటెను హెచ్చుగా పరిమితి లేనన్ని యున్నవని, శ్రీరామతీర్థులు నుడివి యుండిరి. అట్టి స్థితిలో మనకు పితృదేవతలు కానివారెవ్వరు? అందరి మహనీయులతో ఋషిపుంగవులతో మనకు విడదీయజాలని అవినాభావ సంబంధము గలదు.

కాన అన్ని లోకములలోనున్న మహనీయులకు జీవకోటికేగాక, జీవరాసులకు, మూక జంతువులకు గూడ సుస్వాగతము.

ఇప్పుడు నా వ్యాసమును ముగించుచు నా ఆంతర్య సందేశమును సలహాను సహాయమును, గోదావరి స్నానము జేసిన ప్రతివ్యక్తి, వృద్ధిని శాంతిని కోరుచు వ్రాయగోరుచుంటిని.

ప్రియమైన సోదరీ, సోదరా! ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జన సమ్మర్దతను, లెక్కచేయక యీ పుష్కరములో గోదావరి స్నానముజేయు సావకాశము దైవమిచ్చినందుకు, నీ జీవితము ధన్యవంతమైనది.

గోదావరి పుష్కర స్నానమువల్ల నీలో వృద్ధిని, మార్పును,

పాపనాశనములు, ముఖ్యముగా, భేదభావనలతో నిండియున్న పాత జన్మను పాము పొరను విడిచినట్లు నీవు అన్ని దుర్బలత్వములను, రోగములను, గోదావరిలో వదలి శక్తివంతమైన శాంతియుతమైన, ఆరోగ్యము, పవిత్రత నూతన దివ్యతేజస్సుతో నిండియుంటివో లేదో నీవే విమర్శించి, నీ ఆలోచనలను, కోరికలను, మనస్సును, పరీక్షించుకొని, దినదినాభివృద్ధిని గాంచుచు నీవు తరించి నీవు ప్రేమించిన వారందరి తరింపునకు తోడ్పడుచు లోకశాంతిని కోరుచు ఎప్పుడోగాక నేడే తరించుటకు, నీ చంచల మనస్సును దైవములో లీనము జేసి జన్మరాహిత్యము జేసుకొనెదవుగాక.

దుర్లభమైన మానవజన్మ యొక్క ఆశయమును గమ్యస్థానమును మరచి, పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడుచు పొడినేలమీద ఉంచబడిన మత్స్యములవలె గిల గిల కొట్టుకొనుచు పుష్కరపు రోజులలో వాలంటీరులుగా, సేవకులుగా పుష్కర బ్యాడ్జీలు (Badges) చిహ్నమును ధరించి తిరుగుచున్న స్వచ్ఛంద సేవకులను జూచి, వారు న్యాయవాదులైనను, యోగులైనను, వైద్యులైనను, వర్తకులైనను, మరెవ్వరైనను, అట్టి ప్రవృత్తిపరులను జూచిన, మనస్సు చింతగా నుండును. ఇక మానవ సేవయే దైవసేవయని, దైవమే ఆ నిరుపేద రూపముగా, రోగి రూపముగ, యాత్రికుని రూపముగా వచ్చుచుండెనని, అట్టివారికి సేవలందించుటయే మహా అదృష్టమని, అన్నపానములు వైద్యసహాయములు, స్వార్థరహితమైన తదితర సేవచేయుచున్న భక్తవరేణ్యులందరకూ, నా ధన్యవాదములు. అట్టివారే నిజమైన దైవబిడ్డలు, దైవసేవాపరులు. పుష్కరము పేరున అట్టివారి జన్మను తరింపజేసుకొనుచుండిరి.

తీర్థయాత్రలలో, గయకు వెళ్లిన భక్తులందరూ పితృదేవతలకు, పిండదానములేగాక ఒక పవిత్రమైన తావులో, దైవసన్నిధిలో, వారికి ప్రీతియైన, ఫలమునో కూరగాయలలో ఏదో ఒక్కదానిని, వారి జీవితములో వాడబోమని అచ్చట వాగ్దానము చేయుదురట. కొందరు స్వార్థపరులు, నామరూపములకు,

విషయవాసనలకు స్వార్థపరులైనవారు పేరునకు మాత్రమే తాముగూడ త్యాగము అర్పణ జేస్తిమని, అందరకు తెలియుటకా అన్నట్లు ఏ చేదు పుచ్చకాయనో, కాకరకాయనో, వదలిపెట్టుచుందురని, దైవార్పణ చేయుచుందురని వినుటకు విచారము గలుగుచుండును. ఆరోజున నేను గూడ ఆ పవిత్రమైన తావులో కూర్చుని నాకు ప్రియమైనదేది అని ఆలోచించగా, లోకములో వస్తువుల అన్నిటి కంటెను "అహం" నేను, నేను అనెడిదే మానవునకు ప్రియమైనదిగదా! అట్టి అహంకారమును, దైవార్పణజేసి, గయలో దైవసన్నిధి ముందున అర్పించిన జీవితము పరమ పావనమైనదిగానేగాక ఆదర్శనీయముగా యుండుగదా యని నాలోయున్న "అహం" నే, అచ్చట ధారపోసి విడిచి పెట్టితిని గాని మనోవాక్కాయములలో ఆచరణలో పెట్టుట ఎంత కఠినము, కఠినమైనను, సులభమైనను ఆచరణలో పెట్టెడివారి జీవితములే ధన్యవంతములు.

ఇదియే నిన్ను హృదయపూర్వకముగా ప్రేమించుచు, నీ వృద్ధి ఆరోగ్యమును శాంతిని తరింపును కోరుచున్న నీ సోదరుని నిరంతర ప్రార్థనయై యున్నది.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

# కాలమే ధనము

రాగి డబ్బులను, వెండి రూపాయలను, బంగారు కాసులను, ధనమను కొనెడివారు కలరు; కాగితపు నోటులను, దస్తావేజులను రిజిష్టరీ బాండులను, నిజ ధనమనుకొనెడివారు మరికొందరు గలరు. నివసించెడి గృహములను, తోటలను, పొలములను, ధనమునుకొనెడివారు చాలమంది కలరు. తమకున్న మణులు, మాన్యములు తదితరమైన భూవసతులును శాశ్వతమైన ధనమను కొనెడివారు కూడ కలరు. ఇతరులకు బదులిచ్చిన డబ్బును ఇండ్లు మొదలైన వాటిమీద తణకాబెట్టిన సొత్తును, బ్యాంకులలోనున్న డబ్బును, ధనమను కొనెడివారు కొందరు కలరు. భూమిలో దాచియుంచిన డబ్బును బంగారమును ధనమనుకొనెడివారు మరికొందరు కలరు. తమ శరీరముమీదనున్న వస్తువులు, తమ వాహనములే, నిజమైన ధనమనుకొనెడివారు పెక్కుమంది కలరు.

ఇంకను కొందరు జనులు వారి శరీరములే వారి ధనమనుకొందురు. కొందరు వారిబిడ్డలే వారి ధనమనుకొందురు, మరికొందరు వారి కీర్తియే ధనమనుకొందురు; మరికొందరు భక్తవరేణ్యులు తాము చేయుచున్న దానధర్మములే తమ మూలధన మనుకొందురు.

కాని కాలమే నా ధనమని జీవయాత్రను గడుపుచున్న మహనీయులు చాల అరుదు గదా! ప్రతిక్షణమును ధనముకంటె హెచ్చు విలువగలదిగా వాడుచు జీవించుచున్న 'మహనీయులను' మనము తరచు జూచుచుంటిమా? ఎట్టివారి జీవితములను పరీక్షించినను, వారికాలములో యేదో ఒకరీతిగ వ్యర్థబుచ్చుటే కానవచ్చును. "కాలమే నా ధనము" అని ప్రతిక్షణమును విలువ లేని ధనరాసిగా భావించుచు అంతర్వృద్ధిని గాంచుచున్న మహనీయులే లోకమునకు ఆదర్శప్రాయులు. అట్టివారే కాలచక్రమును చేపట్టి ప్రపంచ యాత్రను శాంతివంతులై, సౌఖ్యప్రదముగా జేయుచుండిరి.

త్రుప్పు (చిలుము) పట్టెడి రాగి డబ్బులను రూపాయిలను కాసులను గోల్పోయినను మరల సంపాదించవచ్చును. దొంగలు అపహరించగల్గిన వస్తువాహనములను గోల్పోయినను మరల జేయించుకొనవచ్చును. మణిమాన్యములు, తదితరమైన భూములను - ప్రయత్నముచే బడయవచ్చును. ఇండ్లను, మేడలను మరల కట్టించుకొనవచ్చును. క్షీణించెడి నోటులు, దస్తావేజులు మొదలైన వాటిని మరల సంపాదించవచ్చును. శరీరము పోయినను నూతన జన్మ పొందవచ్చును, బిడ్డలు చనిపోయిన మరల గలుగవచ్చున, చదువులను అశ్రద్ధచేసినను, మరల వానిని శ్రద్ధచే పొందవచ్చును. కీర్తిని గోల్పోయినను, మరల సరియైన నడతచే సంపాదించవచ్చును. దానధర్మమలు క్షీణించినను, మరల వానిని వృద్ధి చేసికొనవచ్చును.

ప్రయత్నము చేతను, పట్టుదలచేతను శ్రద్ధచేతను దేనినైన పొందవచ్చును గాని, ఒక్క వస్తువును మాత్రము గతించినవెనుక బడయజాలము. అదియెద్ది? అదియే మన విలువలేని కాలము. అదియే అమూల్యమైన మన క్షణములు. అదియే మన ప్రాణాధారమైన "టయిము" ప్రపంచములో ఎట్టి దానినైన పొందవచ్చునుగాని, గతించిన కాలమును మాత్రము మనము పొందజాలము. మనమేగాక ఎట్టివారైనను జరిగిపోయిన కాలమును ముందుకు తీసికొని రాజాలరు. ఎంత శక్తివంతులైనను యెంత చదువరులైనను లోకమునంత పరిపాలించుచున్న యేలికలైనను, ఈ కాలచక్రమునకు దోసిలొగ్గి బానిసవై యుండవలసినదే! గతించిన ఒక క్షణమునైనను ముందుకు తీయజాలరు.

ఆహా ! కాలమెంత విలువగలది? అమూల్యమైన యీ కాలమును సద్వినియోగము జేయజాలకున్నను, దాని విలువనైనా గ్రహించుట కొంత మేలేగదా? మనకున్న ధనమంతటితోను గతించిన కాలమును కొనగలమా? లోకములోనున్న ధనరాశులన్నియు అర్పించినను, జరిగిన కాలము మరల వచ్చునా? ధనరాసులే యననేల, చివరకు మన ప్రాణములర్పించినను జరిగిన

కాలము ముందుకు వచ్చునా? ఒక్క ప్రాణమే యననేల, లోకములో ప్రాణములన్నియు నర్పించినను, వ్యర్థబుచ్చిన కాలమును మరల ననుభవించగలమా?

ఆహా! ఇట్టి విలువలేని కాలమును జనులు ఎంత వ్యర్థముగా దుర్వినియోగము చేయుచుండిరి. ఒక చిన్న క్షణము, కనుమూసి, కను తెరచినంతలో, గడచిన కాలమే యెంతయో అమూల్యమైనదిగదా! అట్టి చిన్న క్షణములో, దైవమునుగూడ, కొనవచ్చునుగదా! దీనితో, నిత్యశాంతి బడయవచ్చునుగదా! కాని, ఈ చిన్న క్షణమునేగాక, నిముషములను, గంటలను, రోజులను, వారములను, నెలలను, సంవత్సరములను, జనులు ఎంత వ్యర్థముగా వాడుచుండిరి.

కాలమును వ్యర్థబుచ్చుచున్నది, లేనిది, యెవ్వరి జీవితములను వారే యొక్క తరి పరీక్షించిన, తెలియవచ్చును. మనకు వృద్ధి యున్నదా? దినదినమునకు వృద్ధిని బడయుచుంటిమా? గంటగంటకు వృద్ధిని పొందుచుంటిమా? నిమిషనిమిషమునకు వృద్ధిని గనుచుంటిమా? క్షణక్షణమునకు వృద్ధిని గాంచుచుంటిమా? వృద్ధి లేని జీవితము వ్యర్థము, శూన్యము, ఢంభము, విషయతుల్యము, హానికరము, వృద్ధియే జీవితమునకు ఆధారము. వృద్ధి లేకుండుటే క్షీణతకు మార్గము. ప్రాణము వృద్ధియందే యున్నది. చావు వృద్ధి లేకుండ కాలమును వ్యర్థబుచ్చుట యందే యున్నది. కనుకనే **(Progress is life and Stangnation is death)** వృద్ధియే జీవిత లక్ష్యమనియు, ప్రాణమనియు, వృద్ధి లేకుండ జీవించుటే, మృత్యువని జెప్పబడియున్నది.

క్రిందటి రోజున యెటులనుంటిమో, నేడుకూడ ఆ స్థితిలోనే వృద్ధి లేకుండ నున్నచో జీవితము యొక్క లాభమేమి? క్రిందటి నెలలోనున్న వృద్ధిలోనే ఈ నెలలోగూడనున్న యెడల, మనజన్మలు భూభారమే గదా? క్రిందటి

సంవత్సరములోయున్న స్థితిలోనే యీ సంవత్సరము కూడ నున్న నీవి మానవ జీవితములని చెప్పుటకు యెటుల వీలగును? మానవ జీవితములని జెప్పవచ్చునేమోగాని జీవించియున్న జీవితములని చెప్పరాదు. శవజీవితములని చెప్పిన బాగుండును. ఈ నామమే వృద్ధిలేని వ్యర్ధజీవితములకు సరిగా అన్వయించును.

వృద్ధి లేని జీవితములు నిప్పటికిని వృద్ధిలేకుండ యదాస్థితిలోనే యుండవు. వృద్ధిలేనప్పుడు క్రిందపడుటే జరుగును. అధోగతియే దిక్కగును. మీదికైనను వెళ్లవలెను, లేక క్రిందపడవలెనుగాని మద్యను నిలిచియుండుటకు కాలచక్రములో వీలుండదు. అహర్నిశములు కాలచక్రము తిరుగుచున్నది. కానముందుకు వెళ్ళెడివారు ముందునకు, వెనుకకు వెళ్ళెడివారు వెనుకకు వెళ్ళవలసియున్నది. ఆహా! పశుపక్ష్యాది క్రిమికీటములలోగూడ వృద్ధియే గానవచ్చుచున్నది. జీవకోటిలో నననేల చివరకు చెట్లు, చేమలు మొదలగు వృక్షరాజములు లతలు కూడ దినదినాభివృద్ధిని గాంచుచున్నది. ఎటుజూచినను ప్రకృతియంతయు జీవకళలోనే వృద్ధిజెందుచుండెను. అట్టి స్థితిలో దుర్లభమైన మానవజన్మ నెత్తియు, దైవముయొక్క బిడ్డయై, దైవస్వరూపుడై, తాను వృద్ధిజెందకుండ కాలమును దుర్వినియోగము జేయుట సిగ్గుచేటుగదా?

పసిబిడ్డడు ఆకలి కలిగిన నేడ్చును. బాలుడు లక్కపిడతలు ఆట వస్తువులకై యేడ్చును. విద్యార్థి పరీక్షపోయెనని యేడ్చును. యువకుడు పెండ్లికొరకో, ఉద్యోగముకొరకో యేడ్చును. భార్య భర్తకొరకు, భర్త భార్యకొరకు యేడ్చును. లోభి ధనముకొరకేడ్చును. నిరుపేద తినుటకేమియు లేక ఆకలిచే నేడ్చును. ధనికుడు తిన్నది జీర్ణముకాక అజీర్తిచే నేడ్చును. బ్రాహ్మణుడు ఆచారము కొరకేడ్చును. అంటరానివాడు తన జన్మహక్కును గోల్పోయి విలపించును. భక్తుడు దైవమునకై యేడ్చును. యోగి మనస్సును నిలుపలేక యేడ్చును. జ్ఞాని లక్ష్యము చెదిరిన యేడ్చును. ఆహా! ఇన్నిరకముల యేడ్పులు

ప్రపంచమంతయు నిండియుండ కాలము కొరకు యేడ్చెడివారు మాత్రమేల యుండరాదు? అయ్యో! విలువగల కాలము వృద్ధి లేకుండ వ్యర్థముగా బోవుచున్నదని యేడ్చెడివారుగూడ ఇప్పుడు కావలసియున్నారు. ఈ యేడ్పే నిజమైన యేడుపు. అట్టివారే పఠించెడి మార్గమున నడచెదరు.

కాలము చాల విలువైనది. ఇంతింత విలువైనదనిజెప్ప నెవ్వరికిని తరముగాదు. దేనికైనను విలువను నిర్ణయింపవచ్చును. గాని కాలమునకు మాత్రము విలువను నిర్ణయింపజాలము. గతించిన కాలమును గురించి చింతించుటగూడ వ్యర్థమే! గతించినదాని పూడ్చివేయుటే మంచిది! ఇకముందు రాబోవు కాలమో! దాని గురించి మాత్రము మనమేల యాలోచించవలెను? అది మాత్రము మనదని యెటుల చెప్పగలము? నేడున్నవారు రేపుండక పోవచ్చును. పగలు జూచినవారు రాత్రి జూడకపోవచ్చును. రాత్రి జూచినవారు దినమును జూడక పోవచ్చును. జీవము బుద్బుదప్రాయముగదా? కాన గతించిన కాలము మనదిగాదు. ఇక మనదైయున్న కాలమేద్ది? అదియే ఈ ప్రత్యక్షక్షణము; దివ్యమైనవరము నిచ్చెడి క్షణము, మోక్షమును గొనగల్గిన క్షణము, శాంతి సుధను గ్రోలనిచ్చెడి క్షణము, జీవభ్రాంతిని నశింపుజేసెడి క్షణము, జీవపరబ్రహ్మైక్య సంధానమును గల్గించెడి క్షణము, ఇదియే శాంతిరాజ్యమును స్థాపించెడి క్షణము, ఇదియే శాంతి రాజునకు నిర్వికల్పము నిచ్చెడి క్షణము.

ఆహో ! అమృత తుల్యమైన ఈ చిన్న క్షణములను కల్పములవలె జాగరూకతతో వాడెడివారే అదృష్టవంతులు. అట్టివారు వారి ప్రాణములనైనను అర్పించెదరుగాని వారి విలువైన కాలమును వ్యర్థబుచ్చరు. వారికున్న ధనధాన్యములను, దారాసుతులనైన గోల్పోయెదరు గాని అమూల్యమైన కాలమును వ్యర్థబుచ్చరు! వారే లోకకళ్యాణులు! నిత్య తృప్తులు, పరిపూర్ణులు, ధనవంతులు, శక్తివంతులు, దైవసములు, చరాచర ప్రపంచమంతయు వారిని పూజించుచుండును.

ఓ "శాంతిపాఠకా" నీవు కాలము నెటుల గడుపుచుంటివి? ఈ క్షణములు చిన్నవని, అల్పమైనవని, ఉపేక్ష చేయకుమా! ఈ చిన్న క్షణములే నిమిషములుగా మారుచున్నవి. ఈ నిమిషములు గంటలగుచున్నవి. ఈ గంటలు దినములగుచున్నవి. దినములు వారములు, వారములు నెలలగుచున్నవి. సంవత్సరములే జన్మలగుచున్నవి. జన్మ వ్యర్థబుచ్చిన తర్వాత యీ మానవ జీవితమెందుకు? సోదరా, సోదరీ :- లెమ్ము; గాఢమైన నిద్ర నుండి మేల్కొనుము! ప్రత్యక్షముగా నీ ముందు నిలిచియున్న ఈ విలువలేని క్షణములను పట్టుకొనుము. దీనితోనె నీవు అమూల్యమైన ధనరాసులను సంపాదించగలవు. నీ పనులన్నింటిని జయప్రదముగా జేసికొనగలవు. లోకమును పరిపాలించెడి ప్రభువుల కంటెను గొప్పవాడవు కాగలవు. ఈ క్షణములయొక్క మహోత్కృష్టతను గ్రహించుము. గ్రహించినవాడవై వానిని జాగరూకతతో వాడుము. క్షణక్షణమునకు వృద్ధిజెంద ప్రయత్నించుము. ప్రతిక్షణము నిన్ను ముందుకు తీసికొని వెళ్లుచున్నదో అధోగతి పాలు జేయుచున్నదో చూచుకొనుము.

ప్రియమైన పాఠకా! స్వపరీక్షయే నీకు గొప్ప సహాయము చేయును. గాన నీ జీవితమును పరీక్షించుకొనుము. ఉదయమున నీవు పక్క నుండి లేవకుండగనే, ప్రతిక్షణమును జాగ్రత్తగా వాడెదనని నిశ్చయించుకొనుము, ఎన్ని పనులున్నను, ఎన్ని కష్టములు, నష్టములు, విఘ్నములు వచ్చినను ఒక్క క్షణమైన వ్యర్థబుచ్చనని నిశ్చయించుకొనుము. అటుల జేయుచున్నది లేనిది నీ దినచర్యలో తీరికయున్నప్పుడెల్లను గంటకొక్కమారైన స్వీయపరీక్ష జేసికొనుచుండుము. మరల రాత్రి పరుండబోయెడి సమయమందు ఉదయమున నీవుజేసికొనియున్న నిశ్చయము ప్రకారము నీ క్షణములను సవ్యముగా వాడినది లేనిది మరల పరీక్ష చేసికొనుము. సవ్యముగా వాడిన ఆనందముతో నిరంతరము నీ హృదయవాసియై వెలుంగుచున్న దైవముతో

నైక్యముజెంది నిద్రించుము! నీ క్షణములను వ్యర్థబుచ్చిన యెడల పశ్చాత్తాపపడినవాడవై యిక ముందైన నీ నిశ్చయముల గూర్చి యదార్థముగా నుందునని నిశ్చయించుకొని కొంతతడవు నిశ్చయముతోనే ధ్యానము జేసి పరుండుము. ఇదియే తరించుటకు సూక్ష్మమైన దగ్గర మార్గము.

అయ్యో! జనులెంత వివేకశూన్యులు మరల సంపాదించుకొనగల్గిన తుచ్ఛమైన ధనమును మంచి కార్యములకైన దానము జేయుటకు వెనుదీయుటయేగాక, ధనమును ప్రాణమునకు విడదీయజాలని సంబంధ మున్నదాయన్నట్లు, లంకెపెట్టుకొని దాచుకొందురు. అటులనే గాకున్నను అందులో లక్షవవంతు శ్రద్ధతో కాలమును జాగ్రత్తగా వాడిన ఈసరికి పరికించి యుందురుగదా? కాని తుచ్ఛమైనదానిని దాచుకొనుచు అమూల్యమైనదానిని వృథాచేయుచుండుట విచారకరమైన సంగతిగదా? అనవసరముగా విలువ లేని క్షణములను గంటలకొలది వ్యర్థమైన మాటలలోనో, యితరులను నిందించుటలోను, నిరుపయోగమైన పనులలోను కాలము గడుపుచుండుట ప్రత్యక్ష విషయమేగదా? ఏపనియు లేనియెడల, ఏమియు తోచుటలేదని ఎచ్చటికోయొకచోటికి వెళ్ళి బంధువులతోనో స్నేహితులతోనో కాలమునంతను వ్యర్థబుచ్చుట మనము జూచుచుంటిమి. పైగా నిట్టివారే ప్రాణతుల్యమైన కాలమును వివిధరీతులుగా హత్యజేయుచు, జప తప ధ్యానములను జేయుటకు, దైవము జేరుటకు "టైము" లేదని, తీరికలేదని చెప్పుచుందురు. ఎంత హాస్యాస్పదమైన సంగతి! ఎంత నిరుపేదలైనను ఈ చిన్న క్షణములతో ప్రపంచమునేగాక దైవమునుగూడ కొనగల్గిన ధనవంతులు కాగలరుగదా?

ఓ ప్రియమైన పాఠకా! ఇకనుండి నీవు నీ క్షణములను సద్వినియోగము జేయుము. కాలమే నా ధనమని సదా స్మరించుము. ఇంతియేగాదు; కాలమే నా దైవమనికూడ యెలుగెత్తి స్మరించుటకు వెనుదీయకుము. అవసరమైన నీ ప్రాణమునైన అర్పించుటకు ప్రయత్నించుముగాని, అమూల్యమైన నీ క్షణములను

మాత్రము వ్యర్థముగా వాడకుము. నీబంధుమిత్రులతో కలసిమెలసి యున్నప్పుడు మధ్యమధ్య నీ క్షణములను యెటుల గడుపుచున్నదియు జూచుకొనుము. నీ పనిపాటలన్నియు నీ క్షణములు నీకు వృద్ధిని గల్గించుచున్నవో లేవో పరీక్షించుకొనుము. నీకు వృద్ధిని గల్గించెడి లాగుననే నీ క్షణములను వాడుము. అట్టి పనులలోనే నీవు ప్రవేశించుము. క్షీణతను, దుర్భలత్వము, అశాంతి కల్గించెడిలాగున నీ క్షణములనువాడకుము. నిజముగా కాలమే ధనము కాలమే నశించని ధనము. కాలమే శాశ్వతమైన ధనము. అదియే అమూల్యమైన ధనము. ఈ శాశ్వతమైన నిత్యధనమే మనలను శాంతి కైవల్యమును చేర్చును !

ప్రార్థన

భూతభవిష్యద్వర్తమాన కాలములయందు కాలము రూపముగా సర్వలోకములను ఆవరించియున్న ఓ దైవమా! వర్ణనాతీతమైన, నీ విలువను, ఆధిక్యతను, ఔన్నత్యమును, మాకు తెలియజేయుము. నీ చిన్న క్షణములలోయున్న అఖండశక్తిని మాకు తెలియజేయుము. ఈ క్షణమునే మా స్వంతముగా జేసికొని సదా నీతో నైక్యమును జెంది అద్వితీయ స్వరూపముగా జీవించనిమ్ము. ఈ క్షణములో నీతో నైక్యమైయున్నట్లే మా జీవితమంతయు నీ యైక్యసంధానములోనె గడపనిమ్ము. నిన్ను మరచి జీవించనీయకుము. ఈ యైక్యసంధానములోనే గడపనిమ్ము. నిన్ను మరచి జీవించనీయకుము. ఈ యైక్యసంధానమునే లోకమంతయు పొందునటులను గ్రహించుము. నీవే మా శాశ్వత ధనమని, మా ప్రాణమని మాదైవమని స్మరించుటకు మాకు శక్తినొసంగుము. ఈ ప్రత్యక్ష క్షణమునందె మానవకోటి కంతకు నిత్యశాంతిని, పూర్ణప్రేమను, పరమానందమును ప్రసాదించి నీలో జేర్చుకొనుము. ఓ తండ్రీ! ఈ ప్రత్యక్ష క్షణమున మేము నీలో లీనమౌచుంటిమి గాన మమ్ము దరిజేర్చుకొనుము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## నివేదనము

క్షణములను గడ్డిపరకల వలెను, నిమిషములను మసిబొగ్గులవలెను, గంటలను ఆటవస్తువులవలెను, రోజులను మట్టిముద్దలవలెను, వారములను రాగి డబ్బువలెను, నెలలను వెండి నాణెములవలెను, సంవత్సరములను బంగారు కాసులవలెను, వాడుచు జీవితములను జీవచ్ఛవములవలె వ్యర్థబుచ్చుచున్న నాస్వంతమైన సోదర సోదరీమణులందరి వృద్ధిని ఆత్మశాంతిని కోరుచు, ఈ క్షణమందే, (ఈ వ్యాసమును చదివెడి భాగ్యమబ్బిన క్షణమందే) దైవముతో నైక్యసంధానమను కోరుచు, కాలముయొక్క విలువను గ్రహించి తరించుటకై ప్రేమపూర్వకముగా ఈ చిన్న వ్యాసము అర్పించబడెను.

లోకా స్సమాస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# పరిమళము

ఆ దినమున 'లక్ష్మీవిల్లా' శాంతి కేంద్రము పలువురు భక్తులరాకచే మిక్కిలి సందడిగా యుండెను. వారందరు వెడలునప్పటికి చీకటి పడుచుండెను. విజ్ఞానవనమున 'సోఽహం' జలప్రవాహముచెంత చేయవలసిన పని కొరకు నియమించిన తోటమాలి తన పని ముగించినది, లేనిది చూచుటకు ఆతృత జెందితిని. అప్పటికే శీతలము, చీకట్లు క్రమ్ముకొన్నవి. అయినప్పటికి నేను ఒప్పగించిన పని పెద్ద వారయినా, పిన్నలయినా నెరవేర్చినది, లేనిది చూచుట నా స్వభావమైయున్నది. అచ్చటికి వెళ్ళుబాట ఎంతయో జారుగా యున్నను, చి॥ జయదేవుని సహాయముతో నేను బయలుదేరితిని. కొంతదూరమేగుసరికి చంపక పుష్పములు వెదజల్లుచుండిన మధుర పరిమళముతో నింపబడితిమి. మా యెదుట రెండు చంపక చెట్లు ఉండి, ఎవరున్ను అర్థించకుండగనే, తమ పుష్ప సువాసనలను నొసంగుచుండెను. అట్టి చెట్లు ఆ నీలగిరి ప్రాంతమున లేవు. ఈ చెట్లను ఆంధ్రప్రదేశమునుండి జమీందారులచే తీసుకురాబడినవై, నాటబడినవి. జడత్వములేని వృక్ష సంతతియైనను వాటి పుష్పపరిమళమును వెదజల్లుచూ, వాటియొక్క విద్యుక్త ధర్మములను నెరవేర్చుకొనుచున్నవి. జయదేవునితోసహా ఆ చెట్టు సంపింగ పుష్పముల సువాసనలలో నిశ్చేష్టుడనై ఆ చెట్ల యెదుట ఒక నిముషము నిలచి, అయాచితముగా ఆ చంపక వృక్షములు తమ పుష్ప పరిమళమును అవిరళముగా అందరకు అందజేయుచుండుటకు ఆనందముగ్ధుడనై వాటికి నా జోహారులర్పించితిని.

ఆస్తికులకైనను, నాస్తికులకైనను, పవిత్రులకైనను, అపవిత్రులకైననూ, జ్ఞానులకైనను, అజ్ఞానులకైనను, చంపక వృక్షములు భేదము లేకుండగ అందరి యెడల సమాన దృష్టి గలిగి, దైవ బిడ్డలందరకు ఒకే రీతిగా పరిమళము నిచ్చుచున్నవి గదా! కొందరు నేత్రములు కలిగి యున్ననూ చూడజాలరు. అనేకులు తమ స్వార్థమునందే మునిగి, వారియొక్క పరిమితిలేని కోర్కెలు,

వాంఛనలలో లీనమై ఆ చెట్ల ప్రక్కల నుండి సంచరించుచున్ననూ, అవి యొసంగు పరిమళమును అనుభవించలేకపోవుచున్నారు. ఆ పరిమళము యొక్క అనుభవము, మనకు ముఖ్యావసరము.

మన ప్రస్తుత విషయమేమన :- ఆ చంపక పుష్పముల మధుర పరిమళముల పొందిక, అనుభవముతో మనము పొందుచున్న దైవ ప్రేమను పోల్చుకొనుటయేగాక, మనము వెళ్ళెడి ప్రతిచోట దైవబిడ్డలందరకు ఆ దైవసాన్నిధ్యము, దైవప్రేమలను వెదజల్లి వారితో భాగస్థులమైయుండి అనుభవించుట పరమావధియై యున్నది. ధారాళముగా పరిమళమొసంగు చంపక పుష్పములవలె సామాన్య మానవుల నుండి ఎట్టి ప్రతిఫలము ఆపేక్షించకుండా జీవించుటెంత ఆనందకరము! ఆ మనోహరమైన పరిమళమే చంపక వృక్షము దైవము నుండి పొందిన అమూల్య కానుక !

అట్టి మానవుడు తన లోకకార్యరంగములో నడుగిడునప్పుడు ప్రపంచ దివ్యజ్యోతి అయిన సూర్యునివలె తనయొక్క కాంతిని ప్రసరింపజేయుచుండును. భాస్కరుడుదయించినంత మాత్రముననే అతని కాంతి కిరణములచే ఎంత గాఢతరమైన మేఘములనైన ఛేదింపబడి లోకము ప్రకాశముచే నింపబడుచున్నది గదా!

దైవము యొక్క సజీవబిడ్డవైన ఓ మానవుడా! ఒకరిద్దరికే గాక ఆ భగవంతుని బిడ్డలందరకు నీ యొక్క జ్ఞాన పవిత్ర పరిమళమును పంచుటకొరకై నీ ప్రకాశమును ప్రసరింపజేయుటకు మేల్కొనుము!

ప్రేమయే దైవము
దైవమే ప్రేమ.
ప్రేమ యున్నచోటనే దైవమున్నాడు.

నీ ప్రేమ నుండి ఎవ్వరునూ వేరుచేయక అందరిని దరిజేర్చుకొనుము.

భగవంతుని చంపకములవలె - అతడి జ్యోతి, ప్రేమ, జీవిత స్వరూపులమై - మనవెంట పరిమళమును తోడ్కొని వెళ్ళి మన మెచ్చటికేగిన అచ్చటి దైవబిడ్డలనందరను ఆరోగ్య, శక్తి, శాంతి తేజస్సులతో ఆశీర్వదించుదము. ప్రకాశమును దుర్గంధ అంధకార పేటికయందుంచి పూడ్చివేయకుము. దానిని వ్యక్తపరచుటగాని అంధకారమున యుంచుటగాని నీలోనే యున్నది.

పరిమళము, ప్రకాశము నీ జన్మహక్కు అయియుండ దానినేల మరుగుపరచి దాచియుంచెదవు? జ్యోతి స్వరూపుడైన దైవమువలె లోక కార్యములలో ప్రవేశించి దుర్బలులను, రోగులను, అనాధబాధితులను ఆనందపర్చుము. నీయొక్క తేజస్సును స్థిరముగాను నిర్విరామముగాను ప్రకాశింపజేయుచు, అనారోగ్యము, దుర్భలత్వమనెడి అంధకార మేఘములను ఛేదించెదవుగాక!

నీ ఆత్మ పరిమళమును, నీ ప్రకాశమును మరచుటయే మృత్యువు. పరిమళమైన సోహం భావనయే ఇప్పుడు ఇచ్చట పొందబడెడి స్వర్గమయ జీవితము. కోటి సూర్యప్రకాశవంతమైన పరిమళజీవితమునకు ధన్యవాదములు.

లోకా స్సమాస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# వెలుతురు నీవే

ఉన్నదొక్కటే గలదు. అది అద్వితీయముగాన అదియే నీవు, ఆ ఉన్నదానినే, అవ్యక్తమైన, అసత్ పదార్థమునే, వ్యక్తమైనప్పుడు దైవమని, అల్లా అని, రాముడని, కృష్ణుడని, నిర్వాణమని, శాంతియని, ప్రేమయని, తేజస్సని, వెలుతురని, అనేకమంది అనేకమైన పేర్లతో పిలుచుచుండిరి.

ఏ పేరుపెట్టి పిలిచినను, ఏ పేరు పెట్టకుండినను, సత్యమైన, నిత్య వస్తువు సదా స్థిరముగానే వెలుంగచున్నది. కుమ్మరి మట్టితో భాండములు, కుండలు, పిడతలు, మూకుళ్ళు వగైరా లెన్నియో చేయును. కాని యీ నామరూపము లన్నియు ఒకే మట్టితోనే చేయబడెనుగదా! అటులనే ఒకే పంచదారతో, ఏనుగులు, గుఱ్ఱములు, లొట్టిపిట్టలు, ఆవులు, చిలుకలు, పాములు, తేళ్ళు, జెర్రెలు యెన్నో ఆకారములు జేయవచ్చును. ఏయే ఆకారములు చేయబడినను, అన్నిటికి ఆధారము ఒక్క పంచదారయే గదా!

అటులనే ఒకే దైవము వివిధ అవతారరూపములుగానే గాక, రావణాసురుడు, దుర్యోధనుడు, శకుని, మారీచుడు, శూర్పణఖాది, రూపములలో మన జీవితములను పరీక్షజేసి, పవిత్రవంతులుగా జేయుటకు తోడ్పడుచుండును. ఈ కఠిన పరీక్షలలోనే నిత్యమైన, పరిపూర్ణమైన, అవ్యక్తమైన, ఒకే సద్వస్తువును, ఈ నామరూపములన్నింటిలో సాధకులు ప్రత్యక్షము చేసికొనుటకు ప్రయత్నించవలెను.

శ్రీ కృష్ణభగవానుడు, ఋషులలో ఋషియు, జూదగాండ్రలో జూదగాడును, సర్వములో తానేయనియు, తానుగాని దేదియులేదని, గీతలలో నుడివియుండెను. క్రీస్తు ప్రభువుగూడ తానే వెలుతురు, మార్గము, సత్యమునని వక్కాణించియుండెను. అంతయు దైవమ్మైయుండ, ఇక చింతలేల? భయములేల? 'అంతా రామ మయమని' కీర్తించుచు అన్యపదార్థమునుజూచి భయపడనేల? 'ఇందు గల డందు లేడని సందేహము వలదని' స్మరించుచు

అందును, ఇందున గూడ భూత, ప్రేత, పిశాచములను గాంచుచు దడియనేల?

వెలుతురు నీవేయైయుండ, నీ జన్మహక్కైన కోటిసూర్య ప్రకాశమానమైన దివ్య తేజస్సుతో, నిందలు ఆరోపణలు, చింతలు, బాధలు, తాపత్రయము ఎచ్చటనున్నవి? నీ స్వస్వరూపమును మఱచి క్రీనీడలవెంట పరుగెత్తుచు, యమదూతలను పొందుచు యింకనెన్నాళ్ళు క్రుళ్ళి క్రుళ్ళి, మనోబాధలచే, లేనిపోని భయములచేదైవమిచ్చిన యారోగ్యమునుగూడ పోగొట్టుకొని జీవచ్ఛవమువలె జీవించెదవు?

నీ జన్మహక్కైన దివ్య తేజస్సును స్వప్నమందైనను, లిప్తకాలమైన మరచితివా, నిన్ను పతనము చేయుటకు, భూమిపాలు జేయుటకై వేచియున్న రాక్షసులు నీ లోపల నుండియు, బాహ్యము నుండియు గూడ నీమీదబడి లేశమైనను దయాదాక్షిణ్యములు జూపక నీ జీవితమును చీల్చి అమాంతముగా మ్రింగివేయుదురు.

గాన, ప్రియమైన పాఠకా! మరుపు అనే మహాశత్రువును క్షణములో కోటవవంతు తడవైనను నీ దరిని చేరనీయకుము. మరుపే మృత్యువు. మరుపే మహాశత్రువు! మరుపే జీర్ణించిన మహారోగము.

విషము త్రాగింపబడుచున్నను, దైవమును మరువని, సిలువ నెక్కింపబడినను విరోధుల క్షేమమునకై ప్రార్థించెడి, తుపాకీ గుండ్లు హృదయములోనికి వెళ్లుచున్నను హా రామా, రామా ! అని స్మరించగలిగిన జీవితములు ధన్యములేగాక, లోకశాంతికి ఆదర్శప్రాయములు గదా!

నీ దివ్య తేజస్సును వ్యక్తపరచుట కిదియే సమయము, నీకు హాని జేయుచున్న వారిని ప్రేమించుటకిదియే అవకాశము. నిన్ను చెడ్డగా తలచెడివారిని ఆలింగనము జేసికొనుటకిదియే తరుణము. కాలము విలువైనది నీ తేజస్సు నెవ్వరును తాకజాలరు. దానిని కళంకముగాజేయజాలరు. సూర్యుని

కోటి మేఘములైనను తాకజాలవు. తాత్కాలికంగా దట్టమైన చీకటి, మేఘములచే సూర్యభగవానుడు కప్పబడినను. అదిగో చూడుము, నీవు చూచుచుండగనే కారు మేఘములన్నింటిని పటాపంచలుగా జేసికొని పైకివచ్చు చుండెను.

గీతలలో, శాస్త్రములన్నింటిలో మఱల, మఱల నొక్కి, నొక్కి సూక్ష్మముగా తేలికైన మాటలతో చెప్పబడినట్లు నీ ఆత్మను, శస్త్రములు ఖండింపజాలవు. అగ్ని కాల్పజాలదు. నీరు తడుపజాలదు, వాయువు ఆర్పజాలదు. నీ కింకేమి కావలెను? జ్ఞానికి ఒక్కమాట చాలదా? లెమ్ము, మేల్కొనుము. నిన్ను ప్రేమించెడివారిలోనేగాక, నిన్ను అనుమానించెడి వారిలోగూడ నిత్యమైన, సత్యమైన, పరిపూర్ణమైన నీ దివ్య తేజస్సును ప్రత్యక్షము జేసికొనుము. తరించుటకిదియే సూక్ష్మమమైన, బాహాటమైన, సులభమైన దగ్గర మార్గము.

వెలుతురు నీవే, తేజస్సు నీవే, నీవే ఆత్మవు, ఉన్న దొక్కటే !

'అదియే నీవు' తత్త్వమసి !

# ఆశ్రమ స్థాపనములు

ఆశ్రమములు నిర్మింపఁ దలచినవారినిఁ జూచిన కడుంగడు జాలి పొడముచున్నది. ఆశ్రమములు నిర్మించుటయను సులభముగాదు. ఓ ఆశ్రమ స్థాపనోద్దేశకులారా ! మీ కిదే నా సందేశము. ఆశ్రమముల స్థాపింపఁబూని నిశ్చలములగు చిత్తములను కలుషపంకములు గావించుకొని యధఃపతితులుఁ గాఁ బోకుఁడు. "ఓ ఆశాపిశాచమా ! నీవు దూరముగ తొలగిపొమ్ము" **(Get thee behind me Satan)** అను క్రీస్తు వచనమును జ్ఞప్తికి తెచ్చుకొని కోరికలను త్యజింపుడు.

**An idle man's brain is the workshop of the Devil"** సోమరి చిత్తము చెడుతలంపులకు నిలయమను సామెత నిజమగుచున్నది. పరమేశ్వరుఁ డనుగ్రహించిన శాంతిని దేవుడిచ్చిన సంపద్విలాసముల ననుభవింపక కొందరు కష్టాతికష్టములగు ఆశ్రమ స్థాపనములు, ప్రచారములు, సంఘ నిర్మాణములు చేయ ప్రయత్నించుచున్నారు.

మనోనైర్మల్యము గలిగి దేవతలచే కూడ పొగడ్తలొందుచుండెడి యొకానొక దైవభక్తుని విచారకరమగు కథ నియ్యెడ జ్ఞప్తికిఁదెచ్చుచున్నది. దానినిట పొందుపరచెదను, చూడుడు. పూర్వ మొకానొకప్పుడొక దైవ భక్తుడుండెడువాఁడు. అతని భక్తికిని పవిత్రతకును, దేవతలు కూడ మెచ్చుకొనుచుండిరి. ఇట్లుండ సత్సంకల్పములను విఘ్నము చేయుచుండెడి విఘ్నదేవతలు కూడ అతని సమీపముననే నివసించుచు, అదనుకొరకెదురు చూచుచుండిరి. చాల కాలమిట్లు గడచినదికాని వాటి సంకల్పము నెరవేరినది కాదు. తుదకవి వేసారి తమ ప్రభునిమరుగుజొచ్చి తమ అసమర్థతను, దైన్యమును వెల్లడిజేయుచు నిట్లనిరి. "ఓ ప్రభూ! ఆ భక్తుని తపస్సును విఘ్నము చేయజాలకున్నాము. మేమాతనిదరిని చేరుటకు కూడ తావు దొరుకుటలేదు. దీనికి ప్రతీకారమేమి?"

అప్పుడా పెద్ద, పెద్దతడవు విచారమును పొంది, యొకపరి ఆకసము వంక దృక్కునిగిడించి కడకు సంతోషకరమగు నొకవిషపు నవ్వు నవ్వి ఆననసీమ నలంకరింప, చిన్న అట్టహాసమున నిట్లనియెను. "మీరాతని నిశ్చలత్వమునకు వెరువ పనిలేదు. అతడిప్పుడు తన స్నేహ బృందముల కోరిక ననుసరించి యొక ఆశ్రమమును స్థాపింపదలచుచున్నాడు. అయ్యదియే అతని అధః పతనమునకు మార్గము". అని జవాబు చెప్పెను. కొంతకాలము జరిగిన పిదప తుదకన్నియునట్లనే జరుగుట సంభవించినది.

ఓ శాంతి పాఠకులారా! ఆశ్రమస్థాపన మెంత వేదనాకరమో మీకీ గాధ వ్యక్తీకరించుటలేదా? చూచుట కింపుగొలుపు ఆశ్రమముల చూచినంత మాత్రమున ఆశ్రమములను కట్టప్రయత్నించుటెంత వెఱ్ఱితనము? ప్రయత్నములేల? తనదీ విశ్వప్రపంచమున నొక్కటియులేదని తలపోయుచు, అతివ్యయ ప్రయాసములకును చిక్కులకును నోర్చి శ్రమపడి కట్టిన ఆశ్రమముల పవిత్రతయును లాభమును పొందరాదా !

ఆశ్రమమును స్థాపించుటయన సులభమనుకొనుచున్నారా? విలువ గలకాలమును, ప్రాణశక్తిని, గౌరవమును, వ్యర్థముఁజేసుకుని శరీర కష్టమునకును, మనోవ్యాకులమునకును లోనగుచు కష్టపరంపరలతో గూడినదేగాని, సులభమైనదిగాదు.

ఇక్కాలమున ఆశ్రమములేమి, మత ప్రచారములేమి, ప్రాక్పశ్చిమముల కుక్కగొడుగులవలె లెక్కకుమించి మిక్కుటముగా వ్యాపించి యుండుట చూచుచున్నాము కదా! ప్రాపంచిక విషయ వాసనలజోలికి పోవక నిర్మల మనస్కులగువారు, ఆత్మ పారిశుధ్యములేక తమకంటె చాల క్రింది భాగముల తిరుగులాడెడువారిని యాచనమునకుగాను క్షణభంగురమగు నీ ధనమును గోరి తమ గుప్తధనమును వెచ్చింపవలసి వచ్చుచుండుట చూచిన చాల విచారమగుచున్నది. ఎంగిలాకుల యొద్ద గుమికూడెడు కాకముల

చందమునను, ఎమ్మునుప వేష్టించెడి గ్రద్దలభాతిని, రాత్రించరములై పూడ్చఁబడిన మృతదేహముల కబళింపఁజూచు నక్కల విధమునను ఈ స్థాపకుల మనములు అత్యంతాందోళనా వీచికలనల్లల నాడ, దైన్యమగు చూపుల, ధనమదాంధుల దయకొరకు, త్యాగము కొరకు, వారిగుమ్మముల కడ యీ ఆశ్రమముల పోషకులు కాపరులై యుండవలయును గదా!

ఆహో ! ఆత్మగౌరవజ్ఞులు అందును సన్యసించినవారు, ఎంత దైవకార్యమని చెప్పబడుచున్నను యిట్టి కార్యములకు కడంగుట విచారకరమైన విషయము.

యాచనచేయక నిర్మాణ కార్యక్రమమునకు బూనక చిత్తములను విశుద్ధముగావించుకొని ప్రశాంతులై పరమేశ్వరానందపరవశులైన మహానుభావుల యశశ్చంద్రికలుదిగంతముల వ్యాపించునుగాక, అట్టి లోకోత్తర పురుషుల హృదయ పద్మముల ప్రకాశించు పరమాత్మునకివే నా ప్రణామములు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# తప్పు లేని స్నేహితుడు

తప్పులేని స్నేహితుని వెదకుటకు ప్రయత్నించిన ఒక్క స్నేహితుడైన లేకయే నీవీ ప్రపంచమును వీడవలసి యుండునను భావము గలిగిన యాదర్శ వాక్యమొకటి యాశ్రమములో వ్రాయబడి యున్నది. అనగా, ఏ తప్పును లేని మానవుడు ఉండజాలడని భావము. దైవము ఏ మనుజుని గూడ పూర్తిగ తప్పులతోగాని, అసలు తప్పులేకుండగాని, పుట్టించియుండ లేదు. ఒకనిని నూటికి నూరుపాళ్ళు తప్పులతోను, మరొకనిని నూటికి నూరుపాళ్లు ధర్మముతోను దైవము సృష్టించి యుండలేదు. చెడ్డయున్నచోట మంచికూడ నుండును. మంచియున్నచోట చెడ్డకూడ నుండును.

ఎన్ని చెడ్డగుణములు గల్గియున్న వానిలోనైనను విమర్శించి చూచిన నేదో యొక మంచిగుణము కూడ కానిపించును. అట్లే ఎన్ని గుణములున్న వానిలోనైనను, విమర్శించిన నేదోనొక అల్పగుణమునకు బానిసయై యాతడుండుట కానవచ్చును. మంచివారిలో నైనను, చెడ్డవారిలో నైనను, మనకు తోడ్పడెది మంచినే గ్రహించి కొదువ గుణములను విడచిపెట్టుట మనకర్తవ్యము. సత్య ధర్మముల యపరావతారమని ఎంచబడిన ధర్మరాజు వంటి మహానుభావునిలోకూడ జూదమునం దాసక్తియను దౌర్బల్యమున్నది కదా! అట్లే దుర్గుణ రాసులని ఎంచబడిన, దుర్యోధన, రావణాదులలోఁగూడ విమర్శించిన నేదోయొక మంచి గుణమును మనము గాంచగలము.

సామాన్యముగ లోకములో మానవులు తమతోడివారిలో మంచిని గాంచుటకు బదులు లోపములనే వెదకుచుందురు. ప్రతియొక్కనిలోను లోపములను కనుగొనుచు వారిని త్యజించుచు పోయిన యెడల తుదకు ఏ తప్పును లేని స్నేహితుడు, ఒక్కడును మనకు దొరకనేరడు. అందుచేతనే, ఏ తప్పునులేని స్నేహితుని వెదకుటకు ప్రయత్నించెడి మానవుడు చివరకు ఒక్క స్నేహితునైనను బడయకయే చనిపోవునని చెప్పబడియున్నది.

మరియొక సత్యమేమనగా, మనలో నున్నదానినే మనమితరులలో గాంతుము. మనలో వెలుతురున్నచో నందరిలోను వెలుతురే కానవచ్చును.

ఒక్కొక్కసారి లోకమంతయు మాధుర్యముగ, బ్రహ్మముగ గానవచ్చును. దానికి మనస్సే కారణము. మరికొన్ని సమయములయందు క్లిష్ట పరీక్షలలో, ఆ లోకమే క్రూరముగా, సైతాను గుణములతో నిండియున్నట్లు కానవచ్చును. దానికిని మనస్సే కారణము. ఆంతర్యమున ననుభవింపబడుచున్నదే, బాహ్యమున ప్రత్యక్షమగును. మన దినచర్య నుండి, సామాన్యమైన యుదాహరణలను కొన్నిటిని తీసికొని ఈ సమస్యను విశదముగ బోధపరచుకొనుటకు ప్రయత్నింతము.

ఒక వ్యక్తి సేవాసక్తుడై, అహర్నిశము స్వార్థరహితమైన సేవజేయుచుండును. కాని యతడు నస్యమునకో, తేనేటికో బానిసయై ఉండవచ్చును. మరొయొక వ్యక్తి మానవకోటికి ఆ అఖండమైన సేవను చేయుచుండవచ్చును. కాని యతడు అతివాచాలుడో, తిండిపోతో అయి ఉండవచ్చును. మూడవ వ్యక్తి మనమేది చెప్పినను అతి భక్తి, శ్రద్ధలతో, అతి నమ్రతతో చేయుచుండును. కాని చుట్టకో, నల్లమందుకో అలవాటుపడి యుండవచ్చును. మరియొక వ్యక్తి రాత్రింబవళ్లు అపారమైన సేవ చేయుచుండ వచ్చునుగాని తోటి మానవులను నిరసనభావముతో చూడవచ్చును. మరికొందరిలో మంచిగుణము లెన్నియున్నను బలమయిన యహంకారము అందరిమీదను అధికారము చేయుట కాసక్తి పడవచ్చును. కొందరు మానవసేవను తమ శక్తికొలది చేయుచున్నను, ప్రేమాశూన్యులై స్వార్థముతోనిండి, సదా తమ వృద్ధినే, తమ శ్రేయస్సునే, తమ విముక్తినే కోరుచుండవచ్చును. ఇటువంటివే అనేకమైన ఉదాహరణల నసంఖ్యాకములుగ మానవ జీవితములనుండి మనము గ్రహించి పరీక్షించవచ్చును.

కాని వ్యక్తులలో పైన పేర్కొనబడిన స్వల్పపు దురలవాట్లు,

దౌర్భల్యములున్నవని మనము వారిలోనున్న మంచి గుణములను గుర్తించక వారిని నిరసించి, వారెందుకును పనికిరానివారని యెన్నడును తలచరాదు. ఎవరు చేయగలిగినపనిని వారు చేయుదురు. ఒకరు చేయగలిగిన పనిని మరియొకరు చేయజాలకపోవచ్చును. నేను చేయుపని మీరు చేయజాలనిచో మీరెందుకు పనికిరాని వారని నేను తలచరాదు.

ఒక పర్వతమునకు, ఒక ఉడుతకు ఒకప్పుడు జరిగిన తగవును గురించి మీరు వినియుంటిరా? ఈ చమత్కారమైన సంభాషణమును వినుడు.

ఒకప్పుడొక పెద్ద పర్వతమునకు, ఒక చిన్న ఉడుతకు తగవు వచ్చెను. పర్వతము ఉడుతనుజూచి "ఓ యల్ప జంతువా" అని నిరసనతో సంబోధించెను. ఉడుత ఇట్లు బదులు పలికెను. "నిజము, నీ వెంతయో పెద్దదానవే. ఒక సంవత్సరము ఎంత దీర్ఘమో యూహింపుము. ఎన్ని క్షణములు, ఎన్ని దినములు, ఎన్ని మాసములు కలిసిన ఒక సంవత్సరమగును? కావున నో పర్వతరాజమా! నా స్థితికి నేను లజ్జింప నవసరము లేదు. నీవంటి పెద్దదానను నేను కాకపోయినను నాయంత చిన్నదానవు నీవు కావు. కాలేవు! నాయంత చురుకుదనము నీకు కలదా?"

శక్తి సామర్థ్యములు వేరు గావచ్చును. ఎవరి స్థానములో వారే గొప్పవారు. అట్టి యేర్పాటు నీశ్వరుడతి బుద్ధిబలముతో లోటు లేకుండ గావించి ఉన్నాడు. నా వీపుపై నేను నీవలె నడవుల మోయలేకున్న నీవు నారీతి గట్టికాయలను పటపట పండ్లతో కొరకగలవె?" అట్లే పెద్ద పర్వతము, చిన్న యుడుత కాయలను బ్రద్దలుజేసి తినునట్లు పర్వతము తినజాలదు. ఎవరు చేయగలిగిన పనిలో వారికే గొప్పదనము గలదు. అందరిలోనున్న మంచినే మనము గ్రహించుచు, ఆ మంచి గుణమును బట్టియే మానవులను స్నేహితులనుగా జేసికొనినచో, లోకములో నందరు మనకు స్నేహితులుగనే యుందురు. మననేత్రములు సదామంచినే అందరిలో గాంచుటకు తెరువబడి

యుండవలెను. మంచిని, సత్పదార్థమును అనగా నిత్యమైన, పరిపూర్ణమైన దైవమును గాంచెడివరకు, నేత్రములను తెరువక మూసియుంచుటే మంచిది.

సర్వం ఖల్విదం బ్రహ్మ! ఈ జగమంతా రామ మయం! సూదిమొన మోపునంత తావైనను దైవము లేనిచోటు లేనప్పుడు మనకు దైవము తప్ప అన్యమైనది యెచ్చటను, నెప్పుడును నెవ్వరి యందును కూడ గోచరించరాదు.

అందరిని దైవస్వరూపులుగ జూచుచు, సర్వము దైవముగ జేసికొని విశ్వప్రేమతోనిండి జీవించెడివారి జీవితములే ధన్యములు. అదియుగాక భేదభావము రక్తమును విషముగ మార్చి రోగమును గల్గించును. సమదృష్టి, ప్రేమభావము మనను నూతనమైన శక్తితోనింపి, ఆరోగ్యమును బలము నిచ్చును. ఈ చిన్న కథను మీరు వినియే యుందురు. ఒకప్పుడు ధర్మరాజును, దుర్యోధనుని లోకమంతయు తిరిగి, దుర్జనులెవరైన నుండిరేమో పరిశీలించి రమ్మని పంపిరి. ధర్మరాజు లోకమంతయు తిరిగి, అందరును మంచివారేగాని ఒక దుర్మార్గుడు గూడ తనకు కనిపించలేదని చెప్పెను. దుర్యోధనుడు తిరిగి తరిగి వచ్చి ప్రపంచమంతటను దుర్మార్గులేగాని మంచివా డొక్కడును తనకు కనిపించలేదని చెప్పెను. ఈ నిర్ణయములకు భిన్నమైన వారి మానసిక సంస్కారములే కారణము.

"తన్ను తానె కనుట" పరమ రహస్యమని శాస్త్రములు చెప్పుచున్నవి. నిజస్వరూపమును గ్రహించిన వాడు లోకమంతట, తన యాత్మనే గాంచుచు, ఆనందములో మునిగి తేలుచుండును, తన్నుతానే తెలియనివాడు, ఇతరులనెట్లు తెలిసికొనగలడు? అట్టివాడు అందరియందును దోషములనే జూచుచుండును. వాని కెవ్వరియందును నెట్టిగుణము గానరాదు. అట్టివాని కందరను విరోధులే. స్నేహితు లెచ్చటను లభించరు. అట్టి యల్పమయిన జీవితములు చాల విషాదకర మయినవి. మాతృదేవికే వారు భారముగ నుందురు. మానవ జన్మకు గమ్యస్థానమయిన స్వస్వరూపమును గ్రహించి ఇతరులయం దాత్మస్మృతిని

జాగరిత మొనర్పగల జీవితములే దేశమునకును, మానవకోటికిని ఆదర్శముగ నుండును.

అట్టి మహనీయులు తమలో దైవము ననుభవించుచు, అందరి యందును దైవమునే గుర్తించుచు, బ్రహ్మాండమునంతను సచ్చిదానంద రూపముగ జూచుచు మోక్షము నెప్పుడో గాక యిప్పుడే యిచ్చటనే పొందుదురు. వారే జీవన్ముక్తులు, వారే లోకమున నందరికిని స్నేహితులుగ బరగుచుందురు. ఇతరుల శ్రేయస్సు తమ శ్రేయస్సు. ఇతరుల యానందము తమ యానందము. ఇతరుల శాంతి తమ శాంతిగ నెంచుకొని, లోక శాంతిని కోరుచు జీవించెడివారి జీవితములు ధన్యములు, అట్టి విశ్వస్నేహితులకు, జీవన్ముక్తులకు ధన్యవాదములు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# సామాన్య మనుజుని ప్రార్థనలు

మానవుని స్వార్థమునకు, ఒక్కొక్క సందర్భములో అంతు దరియు కనిపించనట్లుండును.

ఒకడు రెండు మొక్కలు నాటును, వానికై వర్షము కురిపించుమని దైవమును ప్రార్థించును. వేఱొకఁడు రెండు కుండలు చేయును అవి తడిసిపోకుండ నుండుటకై వర్షమును ఆపుజేయుమని ప్రార్థించును.

ఒకడు కొన్ని విత్తనములు జల్లును, వానికై వర్షమును కురిపించుమని ప్రార్థించును. ఒకడు ఇంటికి ఆవమును కాల్చుటకు ఇటికి తీయును. అది తడవకుండ నుండుటకు దేవతలను దైవమును ప్రార్థించును.

కొన్ని సమయములలో మూర్ఖపు మానవుడు నోరులేని అమాయకములైన కోళ్ళను, గొఱ్ఱెలను మొదలయిన జంతువులనుగూడ తన కోర్కెలీడేరుటకు బలులుగా నిచ్చుచుండును. ఎంత క్రూరము? అజ్ఞానము? అమానుషత్వము?

ఇద్దరు అన్నదమ్ములుండెడివారు. ఇద్దరును భక్తులే, ఒకడు వ్యవసాయదారుడుగాన తరచు, వర్షమునకై పెక్కు మ్రొక్కుబడులు చెల్లించుచు దైవమును ప్రార్థించెడివాడు.

రెండవ సోదరుడు, ఇటికి ఆవములు తీయించుటతోను కుండల వ్యాపారముతోడను జీవితమును గడుపుచుండెడివాడు. ఇతనికి వర్షము కురిసిన ఇటుకలన్నియు మట్టిపాలగును. కుండలన్నియు నామరూపములు లేకుండ, వర్షముచే కరిగిపోవును. కాన వర్షము వలదని అతఁడు దైవమును ప్రార్థనలు చేయువాడు.

ఇద్దరును భక్తులే! ఇద్దరును దైవపు బిడ్డలే! ఇందులో దైవము ఎవ్వరి మాటను వినవలెనో దైవమునకే సందిగ్ధావస్థ వచ్చినట్లున్నది.

ఒక సోదరుని కోరిక చెల్లించి వర్షము కురిపించిన, రెండవ సోదరుని పచ్చి యిటుకలు, కుండలు, మట్టిపాలగును. పోనీ ఇతని కోరిక చెల్లించి వర్షము పడకుండజేసిన మొదటి సోదరుని వ్యవసాయమంతయు నీరులేక ఎండిపోవును. ఇట్టి కోర్కెలలో చిక్కుకొని వీనిన నెరవేర్చుటలో కృపామయుండైన దైవము ఎంత అవస్థ పడవలసి యున్నదోగదా!

మరొక వ్యవసాయదారుని, అవస్థ ప్రార్థనలను జూడుడు! వర్షము లేక యెండలచే తాను జల్లిన విత్తనములన్నియు ఎండిపోవుచుండ, రాత్రింబవళ్ళు వర్షమునకయి ప్రార్థించసాగెను. ఒకరోజున గొప్పుతవ్వుటకు చాలమంది కూలీలను పెట్టి పని చేయించుచుండెను. అంతలో ఇతడు ప్రార్థించుచున్న వర్షము గూడ రాదొడగెను. గాని తన కూలీల పని పాడగునని చాల డబ్బు వ్యయమగునని కూలీలపనియగువరకు తనకు ఏ నష్టము గలుగకుండ వర్షమును ఆపుజేయుమని ప్రార్థింపసాగెను.

అతఁడు తాను పెట్టిన కూలీలపని, గొప్పు అంతయు సవ్యముగా పూర్తియైన తర్వాతను మరల వర్షము పంపుమని ప్రార్థించునని తలంచెదను.

సంకుచితమైన మనస్సుతో చిన్న చిన్న స్వార్థపూరితమైన ప్రార్థనలు దైవమునకుజేయు సామాన్య మానవుల అల్పబుద్ధికి మనము విచారించ వలసియున్నది. మానవుని దుస్థితికి మనము విచారించుటయేగాక దైవము యొక్క సంపూర్ణమైన, స్థితిని గూడ మనము విమర్శించి తెలిసికొనుటకు ప్రయత్నింతము. నిరంతరము దివ్యతేజస్సుతో ప్రకాశించుచున్న సూర్యుని జీవితమును విమర్శింతము.

సూర్యునితో, నీవు ప్రాతఃకాలముననే రావలదు. నేడు నాకు నిద్రవచ్చుచున్నది. బద్ధకముగా సోమరితనముగా ఉన్నది. గాన నీవు ఆలస్యముగా రమ్మనియే వెఱ్ఱి మానవుడైనను సూర్యుని ప్రార్థించిన ఆలస్యముగా నతడు వచ్చునా !

మరొక్క మానవుడు నేడు నాకు చాలపనులు చేయవలసినవి యున్నవి గాన నీవు త్వరగా రమ్మని సూర్యుని ప్రార్థించిన త్వరితముగ నతడు వచ్చునా?

వేసవికాలములో వేడి హెచ్చుగా నున్నది. గాన నీ వేడిని తగ్గించుమనిన సూర్యుడు చల్లబడునా! శీతకాలములో నాకు చలివేయుచున్నది. నీ వేడిని సూర్యరశ్మిని హెచ్చుగా చేయమని, సూర్యుని ప్రార్థించిన, హెచ్చుగా చేయునా?

వెఱ్ఱి మానవుడు, సూర్యుని ఏ యేరీతిగా రమ్మని పొమ్మని, ప్రార్థించినను, విశ్వచట్టముల ననుసరించి ఏ రోజున, ఏ ఏ క్షణమునకు రావలసియున్నదో, ఆ క్షణమునకే సూర్యోదయమగుచుండును.

అటులనే మానవుడు, ప్రార్థించకున్నను, సూర్యాస్తమానము గూడ జరుగుచుండును. కాన మానవుని అల్పమైన స్వార్థపూరితమైన, చిన్న చిన్న ప్రార్థనలన్నియు హాస్యాస్పదములగుచున్నవిగదా!

మానవుని ప్రార్థనలు దైవము తప్పక నెరవేర్చునని చెప్పెదరు గాని, కోటానుకోట్ల జనులుండగ, వీరందరు ప్రార్థనలు, నిరంతరము చేయుచుండ ఎన్ని ప్రార్థనలని, దైవము వినగలడు? ఎన్ని ప్రార్థనలని దైవము నెరవేర్చగలడని సామాన్యులకు ఆశ్చర్యము గలిగించకపోదు.

ప్రపంచమంతయు కోటానుకోట్ల జనులతో నిండియున్నను, దైవము సర్వాంతర్యామియై, అందఱి హృదయములలోను సాక్షి స్వరూపుడు గాన ప్రతి చిన్న ప్రార్థనను, పెద్ద ప్రార్థనను వినగలడు. అమెరికాలో జేసిన ప్రార్థన భారత భూమిలో చేసిన ప్రార్థన తెల్లవారుజేసిన ప్రార్థన, నల్లవారు జేసిన ప్రార్థనలు గూడ దైవమునకు సమానమే.

పెద్దలులేక, పిల్లలు జేయు ప్రార్థనలుగూడ వినుననే నా నమ్మకము. ఇంతియేగాదు. నోరులేని జంతువులు, చీమలు, దోమల ప్రార్థనలను, గానములనుగూడ దైవము వినగలడు. ప్రతి పుష్పము గూడ దైవమునకు

ప్రార్థన జేయుచున్నదనే నా వెఱ్ఱి నమ్మకము.

పుష్పము దైవముకొఱకే వికసించుచున్నది.
పక్షి దైవము కొరకు పాడుచున్నది.
పసిపాప దైవము కొరకే నవ్వుచుండును.
మానవుడు దైవముకొరకే సేవ జేయుచుండెను.
మానవ సేవయే మాధవసేవ యనిరి.
మాధవ సేవయే మానవసేవ కూడనై యున్నది.

ఏ ఏ ప్రార్థన జేసిన ఫలితమును ఎవ్వరికి వారే అనుభవించవలెనుగదా? ఏ ఏ విత్తనములు జల్లిన వాటి ఫలితమును జల్లినవారే అనుభవించవలసిన యుండును గదా! వరి విత్తనములు వరిపంటనే యిచ్చును. ఆముదము విత్తనములు ఆముదముల పంటనే యిచ్చును.

అల్పులు, అల్పమైన ప్రార్థనలు జేయుదురు
ఘనులు ఘనమైన ప్రార్థనలు జేయుదురు

ఏ ప్రార్థనయు చేయని, అనగా ప్రార్థనలక అతీతులైన మహానుభావులు గూడ లక్షకో, కోటికో యొక్కరుండి యుండుట మానవ కళ్యాణమునకు, లోక శాంతికి కారణము.

భక్తురాలైన శ్రీ కుంతీదేవిని కావలసిన వరములన్నియు కోరుకొనుమని భగవానుడు, ప్రత్యక్షమై చెప్పగా, ఆమె తనకు సదా బాధలను అవస్థలనే యీయమని కోరెను. ఏలయన అవస్థలలో, బాధలలోనే దైవమును సదా జ్ఞప్తి యందుంచుకొనవచ్చునని ఆమె కోరికయై యున్నది.

ఇక ధృవ, ప్రహ్లాది భక్తవరేణ్యులు ఎంత కోరుమన్నను దైవమును దర్శించిన నేత్రములు, అన్యమును చూడజాలవని, ఏ కోరికయు లేకుండుటకే వరమునిమ్మని కోరియుండిరి. అట్టి మహనీయుల జీవితములే,

మహోత్కృష్టములయినవి. మానవకోటి కంతకును ఆదర్శప్రాయమైనవి, ఈ మధ్యను శ్రీ సుశీలాదేవిగారు అమెరికా నుండి పంపిన పుస్తకంలో అమానుషము కూడినైన ఈ క్రింది మానవుని కోర్కెలను చదివితిని. కోర్కెయన్నను ప్రార్థన యన్నను నొక్కటియే! మనము దేవిని కోరుచుందుమో దాని కొరకే మనకు తెలియకుండగనే ప్రార్థించుచుందుము. మన ఆలోచనలే ప్రార్థనలు, ప్రతి సంకల్పము ఒక్క ప్రార్థనయే యని, మహనీయులు నుడివి యుండిరి. ఎంత గాంభీర్యమైన భావన. ఇప్పుడు నేను శ్రీ సుశీలాదేవిగారు పంపిన పుస్తకములో చదివిన మానవుని సంకల్పమును, కోర్కెను ప్రార్థనను వివరించుచున్నాను. ఒకడు అమెరికావాసి ఒక దేవతయో, దయ్యమో వచ్చి నీకు యేమికావలయునో కోరుకొనుము. నీ ప్రార్థనలను నెరవేర్చెదను తెల్పుము అనగా !

నాకు ఒక పెద్దతోటలో పడక కుర్చీమీద పరుండి సిగరెట్టు కాల్చుచుచు పేపరు చదువుచు ఆ ప్రకృతి సౌందర్యమునంతను జూచుచు నా కాలము గడుపవలెనని యున్నది అని కోరెనట. అంతవరకు బాగుగానే యున్నది. ఇంకనేమైన కోర్కెలు, సంకల్పములు నీలో నున్నవేమో జెప్పుమనగా, అవును ఉన్నవి ఆగుము నేను పేపరు చదువుకొనుచు సిగరెట్టు కాల్చుచుండ నా యెదురుగా నున్న చెట్లకు నా విరోధులు ముగ్గురు నలుగురున్నారు. వారి పీకలు తాళ్ళ కురివేయబడి నా కన్నుల ముందు వ్రేలాడుచుండుట చూడవలెనని యున్నది. అని చెప్పెనట. ఎంత క్రూరము, అమానుషమునయిన సంకల్పము, ఇటులనే జీవితములను ఒక్కొక్కరు పరీక్షజేసికొన్న కొన్ని ప్రార్థనలు చాల విపరీతముగా, విచిత్రముగా అనవసరమైనవిగా గూడ వచ్చును.

మరియొక దైవభక్తుడు, ఓ తండ్రీ నన్ను నా భార్యను నా కుమారుని అతని భార్యను మాత్రము సదా కాపాడుము. రక్షింపుము. ఇతరులేమైపోయినను సరే అని ప్రార్థించెడివాడట. ఎంత స్వార్థయుతమైన ప్రార్థన! అందరికొరకు, ఇతరుల మేలుగోరుచు జేయు ప్రార్థనయే నిజమైన ప్రార్థన. తన ముక్తిని మోక్షమును గూడ మరచి జేయు ప్రార్థనలే దైవము వెంటనే వినెడి ప్రార్థనలు.

బైబిలులో, నేనొక చిన్న ప్రార్థనను చదివియుంటిని. ఒక దేశస్థులు పడరాని అవస్థలు, వర్షము లేక పంటలుపోయి, తిండిలేక, నీరయిన లేక చాల బాధలు పడగా దైవమునకు కృప కలిగి అమృత వర్షము కురిపింపసాగెనట. అమృత వర్షము కురియుచుండ ఇక లోటుయేమి? గాని చాల మందికి అసంతృప్తి గలిగి మాకు అమృత వర్షము వలదు ఉల్లిపాయల వర్షము కురిపింపుమని ప్రార్థన జేయ సాగిరట.

మనస్సు ఎంత చంచలమైనది ! ఎంత వెట్టిది. ఆ వెట్టి మనస్సే అమృతమును కోరుచుండును. మరల ఉల్లిపాయల కొఱకు ప్రార్థించును. అదియే మద్యమాంసాదులకయి ప్రార్థించును. స్వభావము ననుసరించి ప్రార్థన యుండునని ఇదివరకె నుడివి యుంటిని.

మీ స్వభావము మీ ప్రకృతి యెటులున్నదో ప్రప్రథమముననే మీ మనస్సును హృదయమును, హృదయంలో, కోర్కెలను సంకల్పములను, విమర్శించి పరిశీలించి తెలుసుకొనుడు. అన్ని జన్మలలోను, మానవజన్మ యుత్కృష్టమైనదని శాస్త్రములు, మహనీయులు చెప్పుచుండిరి. దుర్లభమైన మానవజన్మను బడసియు, అల్పమైన కోర్కెలతో తుచ్ఛమైన ప్రార్థనతో అమూల్యమైన కాలమును వ్యర్థము జేయుచు జీవించెడివారి జీవితములు చాల విషాదకరములు, కొందరకు, జలగవలె అమాయకుల రక్తమును, పీల్చుటయే ఆనందముగా నుండును. కొందరకు మధువునో గోక్షీరమునో గ్రోలుట ఆనందముగా నుండును. కొందరకు ఆత్మస్తుతి, పరనింద ఆనందము నిచ్చుచుండును. కొందరకు స్వార్థరహితమైన సేవ, మానవకోటి నంతను సొంతముగా ప్రేమించుటయే ఆనందము నిచ్చుచుండును.

అహంకార శూన్యులయిన, మమకార రహితమైన ప్రార్థనలే నిజమైన ప్రార్థనలు. అట్టివే మానవాభ్యుదయమునకు, దేశాభివృద్ధికి లోక శాంతికి తోడ్పడెడి ప్రార్థనలు.

మన శాంతి ప్రార్థనను విమర్శించుచుడు, ప్రార్థన స్మరించుచుండగనే దైవసన్నిధిచే శరీరమునంతను నింపుచున్నది. లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, చుట్టును అంతయు దైవమే ! ఇంతియే గాదు. ప్రతి అణువులో దైవసన్నిధియే ! సార్వంతర్యామియైన దైవము.

మన నేత్రమునకు నేత్రముగా, కర్ణమునకు కర్ణముగా, మనస్సునకు మనస్సుగా, హృదయమునకు హృదయముగా, శ్వాసకు శ్వాసగా వెలుంగుచుండెను. శాంతి ప్రార్థనలో మనము దైవమును ఆట వస్తువులకో, ధనధాన్యములకో చివరకు, ఆరోగ్యమునకు చిరజీవితమునకయినను మనము ప్రార్థించుటలేదు. కేవలము దైవసన్నిధిని, దివ్య తేజస్సును అనుభవించుటకే ప్రయత్నించుచుంటిమి. ఆ తేజస్సును అనుభవించుట యెప్పుడో, యెచ్చటనో గాక ఇప్పుడే యిచ్చటనే ప్రసాదించుమని కోరుచుంటిమి.

మన శాంతి కొఱకే గాక లోకములో నున్న మానవకోటి అందరి శాంతి కొఱకును ప్రార్థించుచుంటిమి.

ఓ తేజోమయమూర్తీ ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల నీ విశ్వమందంతటను, అందరును, నీ దివ్య తేజస్సును గ్రహింతురుగాక ! ఓ సచ్చిదానంద స్వరూపా ! ప్రతి మానవ హృదయమునందును నానాజాతి మధ్యస్థమునను శాంతి సామరస్యములను బ్రతిష్ఠింపజేయుము.

ఓ దేవా ! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

ప్రార్థన యన నిదియే నిజమైన ప్రార్థన. ఇట్టి ప్రార్థనలే దైవమునకు ప్రీతికరమైనవి. మనమందరమును శాంతి ప్రార్థనను నిరంతరమును స్మరించుచు లోక కళ్యాణమునకు తోడ్పడెదము గాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# నత్తగుల్ల జీవితము

ఋషికొండ సాగరతీరమున సముద్రముయొక్క నిరంతర ప్రణవనాదము సాధకులను, వేకువజామునే, మేల్కొల్పుచుండును. సూర్య భగవానుడు రాకముందే, చాల చీకటి యుండగనే, నిత్యము మేల్కొని, ప్రార్థన, ధ్యానాదులతో దినచర్యను ప్రారంభించు చుంటినిగదా యని గర్వించుచుంటిని.

ఒక దినమున నా కంటెను త్వరితముగాలేచి తన దినచర్యలో నిమగ్నత చెందియున్న ఒక జీవస్వరూపమును జూచి చాల ఆశ్చర్యము చెందితిని. ఆ జీవియెద్ది? అదియొక నత్తగుల్ల. దాని శరీరము చక్కని పొడవుగా ఉండెడి శంఖమును బోలియున్నది. ఆ శంఖములో నుండి తన తలను పైకి జాపుచు, కాళ్ళతో, వడివడిగా దైవమిచ్చిన శక్తి ననుసరించి నడచుచుండెను.

ఆనాడు నత్తగుల్ల చేయవలసిన విధులను నెరవేర్చుకొనుటకై తన గృహమును లేక రంధ్రమును వదలినప్పటినుండియు, నేను దానిని గాంచుచుంటిని. దాని ఆలోచనల నెవ్వరు తెలిసికొనగలరు? ఆహారము గురించియేగదా, అదిగూడ తన గృహమును విడచి, వేకువజామునే బయలుదేరినది. దాని గృహములో చిన్నచిన్న పసిబిడ్డలైన నత్తగుల్లలు తనమీద ఆహారమునకై ఆధారపడి యున్నవేమో? పొట్టకొరకేగదా, మనుజునకైనను నత్తగుల్లకైనను ఈ సంసార తాపత్రయము చూడుడు! నత్తగుల్ల ఎంత నెమ్మదిగా నడచుచున్నదో, నడచుచున్నదని ఏల చెప్పగలము మనవలె పరుగెత్తలేదు సరిగదా, అది పాపము ప్రాకుచున్నది. దేశమంతయు ప్రాకలేదుగదా, చాలా దూరమైన ప్రాకలేదుగదా, నత్తగుల్ల కొంచెము దూరము మాత్రమే పాకి, ఆహారమును వెదకికొని మరల తన బిలములో ప్రవేశించును. అచ్చట దాని సంసార సుఖదుఃఖములు తాపత్రయములు.

ఎక్కడ దైవము కలదో అక్కడ దివ్య తేజస్సు. కోటిసూర్య

ప్రభాభాసమానమగు దివ్యతేజస్సు, మనమా తేజస్సునందే యుంటిమి. కాదు–ఆ తేజస్సునందే లయించిపోతిమి. తేజస్సు, తేజస్సు, దివ్య తేజస్సు క్రింద, మీద, చుట్టును తేజస్సు ఆ దివ్యతేజస్సులో యీచిన్న అహం లయింపక తీరదు. స్వర్గద్వారములు తెరువబడక తీరదు.

ఓ దైవమా ! నిత్యసత్యమైన శాశ్వత జ్యోతివి నీవు నీ దివ్యసాన్నిధ్యమును మేము అనుభవించుచుంటిమి. మా హృదయ గుహయందు వసించినది నీవే, ఆశీర్వదింపుము. విశ్వమానవాళినే ఆశీర్వదింపుము. పరిపూర్ణత్వముతో నుండునట్లాశీర్వదింపుము. పరిపూర్ణత అమృతత్త్వమే మానవ జీవితగమ్యము, ధ్యేయము. అమృతస్వరూపులమే మనమని గుర్తింపుడు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# సంపద - ఆపద

## INHALE SAMPADA
## EXHALE AAPADA

మీ ఉచ్ఛ్వాసలో సంపదను పూరించుడు
నిశ్వాసలో ఆపదను వదలుడు

ప॥ వచ్చు నాపద లవి యాపదలు గావు
వచ్చు సంపద లవి సంపదలు గావు
పరమపురుషు మరచుటె యాపదలు సుమ్ము
పరమపురుషు దలచుటె సంపదలు సుమ్ము.

ప్రశ్న : సంపద అనగానేమి? ఆపద అనగా నేమి?

జవాబు: దైవమే సంపద - దైవసన్నిధిని అనుభవించుటయే నిజమైన సంపద.
దైవమును మరచుటయే గొప్ప ఆపద నిజమైన మృత్యువు.

ఎంత సంపద యున్నను మీ ఆత్మ జ్ఞప్తియను ధనమును పోగొట్టుకొన్న ఏమి లాభము? వ్రాతలు, చదువులు వక మూలనుంచి, వెంటనే దైవమును అనుభవించుచూ నేడే ఈ క్షణమునందే తరించుటకు ప్రయత్నింపుడు. నేడే మనది రేపు మనదిగాదు. అన్న సత్యమును గుర్తించుడు. దీపము ఆరిపోకుండగ, నేడే యీ దివ్యసత్యమును గ్రహించి తరించుడు.

ఈ రోజులలో నా మనస్సునకు సంపద అనెడి యీ మూడు అక్షరముల చిన్న మాటయు వక మహామంత్రముగ తోడ్పడుచున్నది. ఇదియే అకార, ఉకార, మకారములుగా నున్నది. ఇదియే నాకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా దృష్టికి గోచరమగుచుండెను. ఈ మూడు అక్షరములే భూత, భవిష్యత్తు వర్తమాన కాలరూపములుగా ఉండి తోడ్పడుచున్నవి. సంపద, సంపద, దైవసంపద అనెడి మహామంత్రమును స్మరించుచూ నూతనశక్తితోనిండి నేను

తరించుటయేగాక, మీ అందరి వృద్ధిని తరింపును కోరుచుంటిని.

ఓ దైవ బిడ్డలారా ! మీకు నిజముగా, హృదయపూర్వకముగా దైవము కావలెనా? నిజమైన దైవపరితాపన మీలోయున్నదా? లేదా! ఒక్కతరి, నివృత్తులై మీ మనస్సులను, మీ హృదయములను మీరే స్వీయపరీక్ష చేసుకొని జూచుకొనుడు. దైవపరితాపము లేని జన్మలు భూభారము దైవసంపదయను అమృతము చెంతనే యుండ, ప్రపంచ సంపదయను విషమును – ఆపదను వెంబడించెదరేల?

సంపద మీ జన్మహక్కు – ఆపద మీ జన్మ హక్కు గాదు.

ఇప్పుడైనను విషమును మరచి, అమృతమును గ్రోలుడు, మీరు తరించి, మీ మీద ఆధారపడియున్న మీ స్త్రీలను, అమాయకులైన మీ బాలబాలికలను వృద్ధి జేయుచు తరింపజేయుడు.

అసత్యము నుండి సత్యమునకు, చీకటి నుండి వెలుతురునకు, విషము నుండి అమృతమునకు, ఆపద నుండి సంపదవైపునకు మీ నేత్రములను త్రిప్పుడు. కాలము చాల విలువైనది. క్షణములు వ్యర్థము జేయువారు జీవితమంతను వ్యర్థము జేయుదురన్న సత్యమును నేడే, ఇప్పుడే, ఇచ్చటనే గ్రహించి, మీరు తరించి, మీ మీద ఆనుకొనియున్న మీ సన్నిహితుల, బంధుమిత్రుల అభివృద్ధికి తోడ్పడినప్పుడే మీ మానవజన్మ సార్థకమగును.

దైవ సంపద ప్రత్యక్షముగా, అనేక రూపములుగా మన నేత్రములకు గోచరించుచున్నది. సంపద, సంపద అని ప్రార్థించుచూ, ధ్యానించుచూ జీవించెడివారు దైవమనే – సంపదను ఇప్పుడే పొందుచున్నారు ఇందు రహస్యమేమియు లేదు. దైవము దైవమని పరితపించెడి వారు దైవములో లీనమగుచున్నారు. ఆపద, ఆపద – మృత్యువు. మృత్యువు అనుకొనుచు రక్తమాంస మిళితమైన యీ పంజరమునే ఈ దుమ్ముల గూటినే అంటిపెట్టుకొని,

శరీర జ్ఞప్తితో జీవించెడివారు మృత్యువు నోటితోనే కబళింపబడుచుండిరి.

ఈ క్రింది చక్కనైన, ఉత్తేజకరమైన సూక్తి శాంతి ఆశ్రమములో ఒక పెద్ద ఆదర్శనీయమైన సూక్తిగా పెద్దబోర్డుమీద పెద్ద అక్షరములలో వ్రాయబడియున్నది దానిని చదివి, తరించుటకైనా, ప్రియమైన శాంతి పాఠకులారా ! సత్యాన్వేషకులారా ! మీ శాంతి ఆశ్రమమునకు రండు, రండు. ఈ క్షణమే మనది. వచ్చెడి క్షణము మనదిగాదన్న సత్యమును మరువ వలదు.

జీవితాభివృద్ధికి ఆదర్శనీయమైన మీ అందరికి తోడ్పడెడి ఆ మహా సూక్తి నిచ్చట వ్రాయుచుంటిని.

కాలమనెడు సర్పము మృత్యువనెడి నోటిని తెరచి స్వార్థులను, తిండిపోతులను, విలువైన కాలమును వ్యర్థము చేయుచున్న వారిని అమాంతముగా మ్రింగుటకు ప్రయత్నించుచున్నది గాన మేల్కొనుడు ! దీపము వుండగా అనగా శరీరములో ప్రాణము పోకుండా మేల్కొనుడు! శరీర జ్ఞప్తికి స్వస్తి చెప్పుడు. అహం అనెడి క్రూర సర్పమును నేడే వెంటనే చంపుడు. సంపదను ఆహ్వానించి ఆలింగనము జేసుకొనుడు. దైవమను సంపద మీకు దూరముగా లేదు. మీ చెంతనే వున్నది. ఆ దివ్య సంపద మీ పాదముల కంటెను, హస్తముల కంటెను దగ్గరగా మీ హృదయములోనే దాగి యున్నది.

ఆగుడు – సంపద. మీ నేత్రముల కంటెను, శ్వాసకంటెను, అన్యముగా లేదు. కండ్లు తెరచినా సంపదయే! కండ్లు మూసినా సంపదయే, దైవసంపద, యను శక్తియే మీ ఉచ్ఛ్వాస నిశ్వాసములలో ఆడుచున్నది. సంపదయే మీ శ్వాసకు శ్వాసగ యున్నది. ఇందు రహస్యమేమియు లేదు. ఎంత సత్యముగా, సూక్ష్మముగా, ప్రత్యక్షముగా యున్నది? మీరు నేత్రములుండియు చూడరేల! దైవపరితాపనతో లేకుండుటచే, యీ ప్రవృత్తికి, మాయకు, అగాధమైన అంధకరమునకు ముఖ్యకారణము.

ప్రియమైన శాంతి పాఠకులారా ! దైవపరితాపము గల్గిన సోదరీ! సోదరులందరితో, నాకు తోడ్పడుచున్న అనుభవమైన చక్కని శ్లోకము వేదసూక్తిని పంచుకొని యీ వ్యాసమును ముగించుటకు కోరుచుంటిని. సూక్ష్మములో మోక్షమును పొందుటకు ఈ ఒక్క శ్లోకమే చాలును.

శ్లో॥ జ్ఞాతం జ్ఞాతవ్య మధునా
ద్రష్టం, ద్రష్టవ్య మద్భుతం
చిరం శాంతః విశ్రాంతోఽస్మి
చిన్మాత్రా నాస్థి కించనః ॥

తాత్పర్యము : తెలుసుకొనవలసినది తెలుసుకొంటిని. చూడవలసినది జూచితిని. ఏమి అద్భుతము ! శరీర జ్ఞప్తితో యింతవరకు చాల బాధపడితిని. ఇప్పుడు విశ్రమించుచుంటిని. ఏలనన, చిన్మాత్ర తప్ప అన్యమెప్పుడు, యెచ్చటను లేదు.

ఓం తత్ సత్ ఓం !

# జయము మనదే

జయము మనదే అనగా న్యాయపక్షమునకే జయము. జయము సత్యవంతులకు గాకపోయిన ఇంకెవరికి కల్గును? ప్రథమమున స్వార్థులకు, కుత్సితులకు, దుర్మార్గులకు జయము కల్గినట్లు కనిపించినను చిట్టచివరకు సత్యవంతులకు, ధర్మవంతులకు తప్పక జయము కల్గును. "ధర్మయేవ జయతే నానృతం" అను వేదవాక్యమెంత శక్తివంతమైనది ! మహాకావ్యమైన రామాయణములో ప్రథమమున అనేక కష్టములు, బాధలు పొందినను చివరకు శ్రీరాములవారికా, లేక రావణాసురునకా జయము? క్రూరరాక్షసుడైన, రావణాసురుడు సమూలముగా తన బంధుమిత్రులతో సహా నాశన మొందెను. సింహాళమనబడు అతని లంకా నగరము కూడా పూర్తిగా దగ్ధము గావింపబడెను. మహాభారతమును పరికించి చూచినను సత్యకుమారులైన పాండవులు అయిదుగురు, ప్రథమమున క్రూరులైన ధృతరాష్ట్ర పుత్రులగుశతకౌరవులతో అనేక బాధలను పొందిరి. చివరకు దుర్యోధనుడా లేక ధర్మరాజా జయమును పొందినది ? ధర్మరాజునకే జయము కల్గినది.

జయము ఎన్నడైనను దైవమును ప్రేమించుచు నిస్వార్థసేవాపరులగు అమాయక హృదయములదేనని గాఢముగా నమ్మియుండుడు.

ఈ సందర్భమున లింకను మహాశయుడు నుడివిన ఆత్మోద్ధారక వాక్యములను స్మరింతము.

అగాధము నుండి నవీనశక్తి.
గాఢాంధకారము నుండి నూతన తేజస్సు.
కష్టం పరంపరలలో సైతము మనము దారిలోనే యుంటిమి.

క్రిందటి దినమున వచ్చిన ఉత్తరములలో, మా చిన్న శాంతి ప్రార్థన యొక్క ఘనత గుర్తించుచు వచ్చిన యొక ఉత్తరమును ఈ క్రింద వ్రాయుచుంటిని.

"ప్రియమైన స్వామీ !

మీ శాంతి ప్రార్థన యనెడి శతఘ్ని తప్పక సరిహద్దునగల మన శత్రువుల హృదయములను చీల్చి, పారద్రోలి, మన దేశశాంతికి, లోక కళ్యాణమునకు అమిత సహాయకారిగ నుండునని నా దృఢతరమైన విశ్వాసము".

అన్ని మతములకు సారమైన ఈ చిన్న శాంతి ప్రార్థనను, మనమందరము అమాయక ప్రజానీకమును రక్షించి వారల హృదయ శాంతిని, దేశ శాంతిని కోరుతూ ఇదివరకటికన్న ఎక్కువగా స్మరింతము. మన పరిపూర్ణ మనో హృదయములతో జయము మనదేనని దృఢ విశ్వాసమును కల్గియుందుముగాక !

ఎంత గాఢ మేఘములు ఆవరించినను, అగాధమగు లోయలలో చిక్కుకున్నను, అధిక దుఃఖములతో నిండియున్నను మనమందరమును మన జీవితములకు దైవమునే ధృవతారగా జేసికొందముగాక !

రాజ్యకాంక్షయనెడి ఆకలితో నిండియున్న క్రూరతోడేలు దైవముయొక్క బిడ్డలైన అమాయక ప్రజానీకమును నాశనము చేయుచున్న విచారకర వార్తలను విని, నా హృదయము దుఃఖముతో పరితపించు సమయములందు, శ్రీయోగానంద స్వామి ఆధ్యాత్మిక గీతములలో ఈ క్రింది గేయము ఎంతో నూతన శక్తిని, నవ్యానందమును ప్రసాదించును.

అంధకార సాగరాన చిక్కుకునియున్ననూ,
దారిచూపు చుక్కలైన కానరాకున్ననూ,
నీదు ప్రేమ హృదయములో దారి కానవచ్చెనుగా,
ప్రభూ! నిన్నె నేను ధృవతారగ జీవితాన ఎంతునురా,
ప్రభూ! నీవే నాదు ధృవతారగ నిలచి దరిని జేర్పుమయా,

ఓమ్ ! ఓమ్ ! ఓమ్ !

ఆధ్యాత్మిక మెఋపులలోని 92వ అధ్యాయమున తెల్పబడిన "సముద్రునితో పక్షుల పోరాటము" ను ఎప్పుడైన చదివితిరా? దానికి "అమాయక పక్షులతో సముద్రుని రక్ష" అనిగాని, లేక దురాక్రమణ యనిగాని సూచిక యున్న ఎంతయో సమంజసముగా యుండును.

ప్రాక్పశ్చిమములందున్న ప్రియమైన శాంతి పాఠకులారా !

మీ అందరియొక్క సానుభూతిని కోరుచూ ఆత్మోద్ధారకమైన ఆ అధ్యాయమును ఈ క్రింద తెలియచేయనిందు !

సముద్రునితో పక్షుల పోరాటము.

పిట్టజంట ఇసుకన పెట్టెను గ్రుడ్లను
అబ్ధి పొంగి వాని నపహరించె
కోపగించి 'తమకు' గ్రుడ్లప్పగింపక
యున్న నబ్ధితోడ యుద్ధ మనియె.

సాగరుడు నవ్వి కలహంబు సాగనిచ్చె
పిట్టజంట ముక్కుపుటాల పీల్చి నీరు
వెలుపలకు తోడ మొదలిడె; సలిల జలము
పొంగి పొరలాడె పరిహాస ముఖతదాల్చి,

జాలిపడి యెల్ల పిట్టలు సాయపడగ
వచ్చె - గరుడుడు వచ్చె; నపాంపతివడ
కె. వెనువెంటఁ తెచ్చి యొసగె కేలుమోడ్చి
గ్రుడ్లనన్నింటి - ముదము పుల్గులకు హెచ్చ !

ఇదియొక యుపాఖ్యానము లక్ష్య మెద్దియైన
పొందవలె నన్న నిట్టి, యోర్పుండవలయు
విజయ మెపుడు కరస్థమై వెలయు

న్యాయమగు తితీక్ష గని యత్నంబు సలుప.

మనుజున కగోచరము. నత్తగుల్ల జీవితము అంతయు దాని రంధ్రమునకు అందులో తనచేత సృష్టింపబడిన బేబీ నత్తగుల్లల పోషణకు వాటి వృద్ధికి బంధింపబడి యున్నది. అది కొన్ని అడుగుల మాత్రమే ప్రాకగలదు. నత్తగుల్ల జీవితము ఆ కొద్ది తావులో బంధింపబడియున్నది. దాని జీవితమును పరీక్షించి జూచిన మనకు విచారము గల్గునుగదా.

దైవము నత్తగుల్లను, రంధ్రముల నత్తగుల్లగా, కించిజ్ఞత్వమైన గుణములతో జేసెనుగాన అది చిన్న బిరిచే చుట్టంబడి జీవించుచున్నది. నత్తగుల్ల జీవితము గురించియే మనము విచారించవలసి వచ్చిన, ఇక దుర్లభమైన మానవ జన్మయెత్తియు దైవము యొక్క స్వరూపములో సృష్టింపబడి తమ జన్మహక్కుయైన దైవత్వమును మరచి, నత్తగుల్ల జీవితముకంటె అధమముగా తమ చుట్టును చిన్న చిన్న గిరులను గీసికొని సంసార సాగర దుఃఖములలో సుడిగాలులచే చుట్టంబడినట్లు జీవచ్ఛవములుగా జీవించుచున్న మానవుల మాటయేమి?

నత్తగుల్ల తనపై రూపమును గుల్ల నుండి విడదీయుటకు వీలు లేకుండా బంధింపబడి యున్నట్లు మనుజులుగూడ తమ స్థూల దేహములకు శరీరములకు బంధింపబడి యున్నారు. నత్తగుల్ల రెండుగావు. ఒక్కటే. అటులనే మనుజుడు తాను - దేహము రెండుగాకుండా శరీరమునకు అంటి పెట్టుకొని జీవించుచుండెను. శరీరమే తాను, తానే శరీరమన్నట్లు వున్నది. నత్తను తన గుల్ల నుండి విడదీసిన చనిపోవును గదా? అటులనే అజ్ఞానముతో నిండియున్న మనుజునికి తన శరీరమునుండి వేరుగా నుండుటయన మృత్యువును గాంచును.

మనుజుడు నత్తగుల్లవలె తన చుట్టును ఒక చిన్న గిరిని గీసుకొని అందులో తాను, తన భార్య, పిల్లలతో కాపురము జేయుచుండెను. తన పిల్లల పోషణార్థమై ఏదో ఒక గొప్ప వర్తకమునో పెద్ద యుద్యోగమునో జేయుటకై గృహమునువీడి వెళ్ళుచుండును. తన పని పూర్తియైన వెంటనే మరల నత్తగుల్ల

తన రంధ్రమును ప్రవేశించునట్లు మనుజుడు గూడ తన గృహమును చేరుచున్నాడు.

మనుజునియొక్క భావనలు, ఆశయములు, ఎవ్వరు చెప్పగలరు? తనంతట తానే తన జీవితమును పరీక్షించుకొని జూచుకొనవలెను. మనుజుడు నత్తగుల్లవలె కించజ్ఞత్వముతో స్థూల దేహమునకు బంధింపబడి అంధకారములో జీవించుచున్నాడా? లేక తన జన్మ హక్కైన కోటి సూర్యప్రకాశమానమైన, తేజస్సును వ్యక్తపరచుచు దేహమునకే గాక ఏ నామరూపములకు లోకమునకుగూడ బంధింపబడకుండ తన చుట్టును ఏ గిరులు లేకుండ జీవించుచున్నాడో, తనంతటతానే తన జీవితమును స్వపరీక్ష జేసుకొనవలెను.

నత్తగుల్ల జీవితమును బోలిన మనుజుని ఆదర్శము ఆశయము ఈ క్రింది మాటలలో ఇమడ్చబడినట్లు జీవించుచున్నాడు.

“పెండ్లి జేసికొనుము, సృష్టించుము, అంధకారములో జీవించుము, బంధములతో నశించుము,” ఇదియేనా మనుజుని ఆశయము! ఇందుకొరకేనా దుర్లభమైన మానవజన్మను పొందెదరు?

మనుజునియొక్క శరీరము గట్టిగా, ధృఢముగా, శంఖమువలె చాల చక్కగా నుండవచ్చును. తాను ప్రపంచమునకంతకు గొప్ప ధనవంతుడై యుండవచ్చును. నత్తగుల్ల సంతతివలె తన సంతతిగూడ చాలగొప్పదై యుండవచ్చును. తన పిల్లలు, గొప్ప చదువరులు, లోకవీరులు, మేధానిధులై యుండవచ్చును, ఇంతయేల? దేశమును పరిపాలించెడి చక్రవర్తులై యుండవచ్చును. బాహ్యములో యెంతగొప్ప పేరు ప్రఖ్యాతులు గాంచినవారైనను దైవము మరచిన, జీవితములన్నియు, దేహమునకు బంధింపబడియున్న జీవితము లన్నియు నత్తగుల్ల జీవితములవంటివే. అహంకారముతో ఇంద్రియ లోలత్వము గల్గిన, బానిసజీవితములన్నియు నత్తగుల్ల జీవితములబోలి యుండును.

ఓ మనుజుడా రమ్ము! మేల్కొనుము. దైవస్వరూపమై యుండియు నత్తగుల్లవలె, శరీరమునకు అంటిపెట్టుకొని, జీవించెదవేల? ఇంతవరకు నత్తగుల్లను పరీక్షించితిని ఇప్పుడు సూర్యభగవానుని, పరీక్షించుము. నేత్రములను తెరువుము. అదిగో! భానుడు సముద్ర గర్భమున నుదయించుచున్నాడు. చూడుము అతనిలో చీకటి గలదా! అతడు చండశాసనుడు అంధకారముతో హోరా, హోరీగా పోట్లాడును. అతడున్నచోట చీకటి యుండుటకు తావులేదు. అతడు తలయెత్తి నంతమాత్రమున చీకటి పరుగెత్తి పారిపోవును అతని ప్రకాశములో నత్తగుల్ల జీవితములు అల్పమైనవి.

ఆత్మసోదరా! సూర్యుని వెంబడించుము. నీ దిశకు వెళ్ళినను అతనిలో చీకటి లేదు. నిరంతరము వెలుతురే, తేజస్సే, అతని జన్మహక్కు, సూర్యుడు లేనిచోటనే అంధకార ముండును. అతడున్నచోట తేజస్సుతప్ప అన్యము లేదు.

నీ జన్మహక్కైన కోటిసూర్య స్వరూపమును మరుగుపరచిన నత్తగుల్లవలె దేహమున బంధింపబడి గృహమనే రంధ్రములో జీవించెదవేల? బైటకు రమ్ము ఆశ్రమములను దర్శించుము. ప్రకృతి సౌందర్యములను గాంచుము, నీ జీవితమును ఆనందమయముగా జేయుము. జీవస్మృతునిగా జీవించవలదు. జీవన్ముక్తునిగా జీవించుము. నత్తగుల్లగా జీవించుటలో ఆనందమును పొందెదవేల?

పేడపురుగు, పేడలోనేబుట్టి, పేడలోనే బ్రతికి చివరకు పేడలోనే తన జీవయాత్రను పూర్తిచేయును. అజ్ఞానమును పారదోలుము. దేహమే దేవాలయము, శంఖమే నీ గుడి. శంఖమును పూరించుము. ప్రణవగానమును జేయుము. జీవుడే దైవము.

దేహభావనలను విడువుము, సంసార బంధమును తెగద్రోయుము.

"సోఽ హం" భావననే పూజింపుము, విశ్వప్రేమచే విశ్వ తేజస్సును ఆరాధించుము.

ఈ విశ్వభావన, విశ్వప్రేమ, విశ్వ తేజస్సు తప్ప, కొదువదంతయు నత్తగుల్ల జీవితమే, నత్తగుల్లలోను, మనుజుని హృదయములోను, నిండి నిబిడీకృతమైయున్న ఓ దివ్యస్వరూపా! నీకు ధన్యవాదములు ఈ నేత్రములు. నీ దివ్య తేజస్సును గాంచజాలవు నత్తగుల్ల సూర్యుని చూడగలదా? కృపామయా! నిన్ను వీక్షించుటకు మా ఆంతర్య నేత్రమును, దివ్యనేత్రమును తెరచి నిన్నే అంతర్యమున, బాహ్యమున, అందరిలో, అణువు మొదలు, బ్రహ్మాండమువరకు దర్శించుటకు శక్తినొసంగుము. కించిజ్ఞత్వముతో గూడియున్న నత్తగుల్ల జీవితములకు స్వస్తిజెప్పి, ఈ క్షణము నుండియు మా జీవితములను నీ దివ్య తేజస్సును, మనోవాక్కాయములలో వ్యక్తపరచుచు, వివిధ నామరూపములలో నీ సేవ జేయుచు అఖండమైన నీ దివ్య తేజస్సునందే విలీనమౌదుముగాక !

ది. 24-7-45

శాంతి ఆశ్రమము, వాల్తేరు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

# కునికిపాటు

(ఎవరు క్షణమాత్రమైన ఏమరక సదా అప్రమత్తులై యుందురో, వారు తమ్ము తాము జయించుటయేగాక, విశ్వమునే జయించిన వారగుదురు.)

చిన్న చిన్న ఏమరుపాటులు బద్ధకములు, సోమరితనములు కునికిపాట్లు మానవులకు ఎంతటి దురదృష్టకర జీవితమునకు మూలమగుచున్నవి.

ఈ క్రింది ఉత్తేజకరమగు పల్కులెంత చక్కని సందేశము నొసంగుచున్నవి?

వేచియుండె నొక్క మానవుండు వేయి వత్సరాలు
స్వర్గద్వారపు గవాక్షములకడ వేచియుండె
క్షణమాత్రపు కునుకు అతని ఆవరించె
అకటా ! ఇంతలోనె తలుపుల తెరచుట మూయుటయ్యె.

అతడెట్టి తెలివిమంతుడో మనమే ఊహించుకొనవచ్చును. ఒక గంట కాదు, రోజుకాదు, సంవత్సరము కాదు, వేయి సంవత్సరములు అతడు స్వర్గద్వారములకడ వేచియుండెనినన అతని ఉత్కంఠయేమని చెప్పగలము? కాని క్షణమాత్రపు కునుకే ఆతని మోసగించినది.

ఇంక మనసంగతియేమి? సంవత్సరములమాట అటుంచి ఒక్కరోజైన, ఒక్కగంటైన, కొద్దిక్షణములైన దైవముపై మనస్సు కేంద్రీకరించగలమా? వెయ్యిసార్లైన 'లేము' అనియే జవాబు వచ్చును. మన కోర్కెలనంతము, శరీరములు, మనస్సులు అతిచంచలము, కొద్దిక్షణములైన స్థిరముగా నుండనేరవు.

సామాన్య మానవుడు కొద్దిక్షణములైన స్వర్గద్వారములచెంత వేచి యుండజాలడుకాని సంవత్సరముల తరబడి వస్తువాహనములకై పరితపించ

గలదు. వాస్తవము చెప్పవలెనన్న ప్రాపంచికమానిసి ఎల్లపుడు భౌతిక సంపదలకై చింతించుచు, ఏక్షణమాత్రమో స్వర్గద్వారములకడ ఆతడు కునికినట్లు దైవమును చింతించునేమో అని చెప్పనగును.

వెయ్యి సంవత్సరములు వేచియుండియు క్షణమాత్రపు కునికిపాటుచే అతడు స్వర్గమున ప్రవేశింపలేకపోయిన, ఇక దినములు సంవత్సరములు కూడ ప్రాపంచికచింతతోడనే సదానిదురించు సామాన్యునకు స్వర్గ ప్రవేశము గగనకుసుమమువంటిది కాదా? జననమరణ పర్యంతము సిరిసంపదలగూర్చి చింతించువారికి ముక్తియనునది మృగతృష్ణలో నీటిచే దప్పిక తీరునటువంటిది కదా?

బండిని ఎద్దునకుముందు కట్టినట్లు, అసలువిడచి నీడల వెనుక పరుగిడునట్లు దైవమును విడిచి, దెయ్యములవెంట బడుచుందురు. స్వర్గద్వారములకడ వేచియుండుటకుబదులు నరక ద్వారములకడ వేచియుండుట మానవులకలవాటైనది. అమృతమునకుబదులు కాలకూట విషమును గ్రోలుచుండిరి. కాలమెట్లు మారినది? సత్యము అసత్యమువలెను, అసత్యము సత్యమువలెను భ్రమ పెట్టుచున్నది కదా ?

కనుక మనము మన యింటియందు, మన చుట్టూను, మన దేశమునందు కడకు ప్రపంచమునందు కాచునదేమి? అజ్ఞానము దట్టమైన స్వార్థపరత్త్వము, ఆత్మస్తుతి, ధనదాసోహము, ఎక్కడచూచిన కనవచ్చుచున్నవి. ఫలితమేమి? విచ్ఛిన్నత, మరణము లోకమున సహస్ర ముఖములలో కానవచ్చుచున్నది.

వ్యక్తిగతముగానేమి, సంఘపరముగానేమి అన్ని దేశములయందు, విశ్వమానవాళి అంతయు ధనరాసులుగాక దైవమును కొలుచుటకై వెనుదిరగవలెను. ప్రతివారును ఏది నిత్యము, ఏది అనిత్యము, శాశ్వతమేది? అశాశ్వతమేది అని ఆత్మ విమర్శ గావించుకొనవలెను. ప్రతివారును తమ

కేంద్రమును బాహ్యమునుండి అంతర్యమునకు, అనిత్యత్త్వము నుండి నిత్యత్త్వమునకు అంధకారము నుండి తేజస్సునకు, దెయ్యమును కొలుచుట నుండి దైవమును కొలుచుటకు మార్చుకొనవలెను. అప్పుడు మాత్రమే ప్రతి హృదయమున శాంతి నెలకొనును. పరస్పర అవగాహన మంచితనము సాధ్యమగును.

డాబాపై నిలచినవారిని చేతినుండి రబ్బరు బంతి ఒక్కసారి చేయిజారినను అది అట్టడుగునకే పోవునట్లు, మనస్సు క్షణమాత్రపు ఏమరుపాటుచే, దైవ విస్మృతిచేగూడ అధః పాతాళము నంటగలదు. సంవత్సరముల తరబడి ఆర్జించిన విజ్ఞానమంతయు, చిన్న ఏమరుపాటువలన ధ్వంసమైపోవును. చిన్న పొరపాట్లు చేయుటవలన ఎందరి జీవితములో నశించిపోయినవి. ఒక చిన్న తప్పుటడుగు వలన ఎందరి మహనీయుల జీవితములేమి సామాన్యుల జీవితములేమి నాశనమైపోయినట్లు మనము వినుచుంటిమి.

కావున చిన్న పొరపాట్లయందు, ఏమరపాట్లయందు, తప్పుటడుగులు వేయుటయందు జాగరూకులై యుండవలెను. ముఖ్యముగా ఆధ్యాత్మిక జీవితము గడుపువారు అతిజాగరూకులై యుండవలెను. క్షణములోకోట్యంశమైన దైవమును మరచుటయే మృత్యువని కావుననే పెద్దలు చెప్పుచుండిరి. ఈ చిన్నచిన్న కునికిపాట్లే, ఏమరిన ఈ క్షణములే ఇప్పటికో, ఎప్పటికో పతనమును, వినాశనమును కలిగించునవి.

ఎవరైన ఈ ప్రస్తుత క్షణముయొక్క విలువను, అమూల్యతను గుర్తించనిచో జీవితములో ఏమియు గుర్తించనివారే యగుదురు.

“క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునే వ్యర్థము చేయుదురు” అనెడు సామెత కలదు. ప్రతిక్షణము సద్వినియోగముచేయు నాతడు జీవితమునే అత్యంతోపయుక్తముగా చేయును. ఒకనానుడి కలదు. “పైసలకు నీవు

జాగ్రత్తగా నుంటివా? రూప్యములు తమకు తామే భద్రముగా నుండును".

నీ జీవితమొక అమృతభాండమని ఊహింపుము. దానికి అడుగున ఒక చిన్న రంధ్రము కలదనుకొనుము. ఏమి జరుగును? బిందువు, వెనుక బిందువు ఆ అమృతమంతయు బైటకుపోయి కడకు వట్టిభాండమే మిగులును. అదియే గుర్తింపుడు. అటులనే చిన్న చిన్న పొరబాట్లవలననే జీవితమంతయు నిరర్థకమై పోవును.

పవిత్రమైన క్షణముల విలువను చాలామంది గుర్తింపజాలరు. దైవసాన్నిధ్యమును పొందుటకు జీవితమునందలి ప్రతిక్షణము నందును దైవానుభూతిని లేక దైవజ్ఞప్తిని కలిగి యుండవలెను. అదియే ప్రతిక్షణము సద్వినియోగము చేయుటకు ముఖ్యమార్గము. జీవితమును సంపూర్ణముగను, తేజోవంతము చేయుటకును మూలము.

ప్రియ పాఠకులారా! మనము కూడ స్వర్గద్వారములకడ వేచియున్న మానిసివలె సహనముతో నిరంతరము పెదవులపై దైవ ప్రార్థనతో వేచియుండ వలెను. ఎప్పుడు ద్వారములు తెరవబడునో మూయబడునో ఎవరికెరుక? ప్రతిక్షణమునందు అప్రమత్తులమై యుండిననే ముక్తి లభించునది.

ఓ దేవా! మమ్ము చిన్న బలహీనతల నుండి కాపాడుము. అన్ని విధములగు సోమరితనమునుండి, బలహీనతలనుండి స్థిరముగా నిలువగల శక్తిని మాకు ప్రసాదింపుము. నీయందే విశ్వాసమున్నవారికి సమస్తము సాధ్యమై తీరును. దివ్యతేజస్సు ప్రకాశించుచోట సమస్తము తేజోమయమే, అంధకారమునకు తావేయుండదు. ఆ దివ్య తేజస్సున మమ్ము ఇప్పుడే ఇచ్చటనే లయింపనిమ్ము. అంతకుమించి మేము కోరునదేదియు లేదు.

ఓ బలహీనతలారా! మీ కందరకు మా వీడ్కోలు. ఆ బలహీనతలతో మా మనస్సులను చలింపచేయవలదు. దైవమే మా రక్షకుడు, సమస్త వాంఛలకు

మేము అతీతులము. సంపూర్ణతదెసకే ఆ దైవము మమ్ము నడపగలడు. మా కరము లాతని కరములందే యున్నవి. ఎట్టి బలహీనతలుగాని పతనములుగాని లేనియట్లు ఆ దైవమే మమ్ము నడుపును.

అతిబలయుతమైన సముద్రముతో ఒకజత చిన్నపక్షులు పోరాడిన ఒకచక్కని కథ యొకటి గలదు. ఆడుపక్షి సముద్రతీరమున ఇసుకతిన్నెలలో తన గ్రుడ్లను పెట్టుచుండెను. ఆ గ్రుడ్లు అలలచే సముద్రములో కొట్టుకొనిపోవుచుండెను. అందువలన ఆ చిన్న పక్షులు ఆగ్రహించి సముద్రముతో యుద్ధమునకు పూనుకొనెను. తమ గ్రుడ్లను వెంటనే ఈయని ఎడల సముద్రములోని నీటినంతను ఇంకిపోవునట్లు చేసెదమని చెప్పెను. "మీ యావచ్ఛక్తిని ఉపయోగించి అట్లే చేయుడని సముద్రము చిరునగవుతో పలికెను. ఆ చిన్న పక్షులు సముద్రములోని జలము తమ ముక్కులతో తీసికొని పోయి భూమిమీద చుక్కలుచుక్కలుగా విడుచుచుండెను. వీటియొక్క కార్యము ధర్మమైనదని, ఇతరపక్షులు, చివరకు గరుత్మంతుడుగూడ వాటితో కలిసెనని యాకథ చెప్పుచున్నది.

అప్పుడు సముద్రము భయపడి క్షమాపణలతో ఆ చిన్న గ్రుడ్లను ఇచ్చివేసెనట. జీవిత ఆశయమును పొందుటకు అట్టి ఓర్పు, పట్టుదలయే కావలసియుండును. సదా న్యాయము, ఓర్పు, ధర్మము గలవారికే కడపటికి జయము కల్గును.

చైనీయులనెడి దుర్మార్గ సముద్రము హిందూదేశీయులైన అమాయకపక్షుల శక్తితో ఇంకిపోగలదు. ఇందుకు ఇతర ప్రేమమయులును భక్తి శ్రద్ధలునుగల ప్రాక్పశ్చిమమునగల ఇతర దేశీయులనెడి పక్షులుగూడ సహాయపడగలవు. ఇందునూ కొలదిమంది దారితప్పిన పుత్రుల వంటివారును కొంటె గొఱ్ఱెలవంటివారును ఉండి తాత్కాలికముగ శత్రు పక్షమునచేరి సత్యము తెలియక పోరాడినను, చివరకు మృత్యుముఖముననున్న సమయమునైనను,

నూటికి 98 పాళ్ళుగాక, నూటికి నూరుపాళ్ళు జయము మనదే యనునది సత్యము. ఈలోపున మనము సర్వాంతర్యామియు, సర్వహృది నివాసుడును పరిపూర్ణ ప్రేమమూర్తియు నగు దైవమును మనోవాక్కాయములతో ప్రేమపూర్వకముగ ప్రార్థింతము. క్షుత్పిపాసలతో అలమటించుచున్నను, అనారోగ్యముతో బాధపడుచున్నను "జయము నాదే" అను గేయమును మనమందరమును పాడుదము. దుఃఖములు, బాధలు దైవము భువిపైన కురిపింపజేయు వర్షధారలేగదా!

జయము మనదే ?

అగాధములలో మునిగినను
మృత్యు ముఖమున కేగిననూ
సత్య ధర్మములు మనవే గాన
ఎల్లవేళల జయము మనదే.

ఈ ప్రస్తుత వ్యాసమును శ్రీస్వామి యోగానందులు వ్రాసిన "నీ నామమే పానము చేసెద" నను గేయముతో ముగింపనిండు.

ప్రభుని నామమే కీర్తించెదను.
ఆతని, నామామృతమే గ్రోలుదును.
ప్రభుని నామమే కీర్తించెదను.
ఆతని, నామామృతమే గ్రోలుదును
నామామృతమును త్రావి మత్తిల్లి
నిరతము అందే నిలచియుందునుగ.

ఈపై గేయమే మనశాంతి గేయముగా విలసిల్లి, అందరకు శాంతి సౌఖ్యములు గలుగుగాకయని ప్రార్థింతము. అందరిపైనను హింసింపబడు అమాయిక ప్రజలపైనను ఆ ప్రభుని పరిపూర్ణ ప్రేమపూర్వక ఆశీస్సులు కురియుగాక! ఈలోపున ఎంత గాఢ మేఘములైనను, ఎంత దట్టముగా

క్రమ్ముకొనియున్నను వాటివెనుకనే, ఆత్మరూప ప్రకాశము సర్వకాల సర్వావస్థలయందును తనతేజస్సుతో నిండియున్నదని గాఢ నమ్మకము గల్గియుందము.

ప్రాక్పశ్చిమములందున్న నా ప్రియ సోదరీ సోదరులారా! ప్రభుని కీర్తించుచు ఏగుచున్న నా పవిత్ర దండయాత్రలో మీరును కలిసిరండు.

ప్రభూ! నీ నామమే కీర్తించెద!
ప్రభూ! నీ నామమే త్రాపెద !
దేవ ! పరిపూర్ణముగ నేను నీ నామమే త్రావెద !

అంతర్యమున, బాహ్యమున, పైన, క్రింద, అంతట శాంతి వెలయుగాక! నానాజాతి మధ్యస్థమునను, సకల సంఘములందును శాంతి సామరస్యములు ప్రతిష్ఠింపబడుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# నిఃస్వార్థ సేవ

నిస్వార్థసేవ దైవమానవునకే సాధ్యమగునుగాని, స్వార్థపరునకు కాజాలదు. ఆధ్యాత్మిక జీవితము లేక దైవసాక్షాత్కారముయొక్క నిశ్చయ ఫలితమే నిస్వార్థసేవ, సెగలు చిమ్మెడు మంటనుండిగాని అగ్నిపర్వతము నుండిగాని పచ్చదనమును, చల్లదనమును ఆశింపజాలము; అట్లే అంతు లేకుండ నిరంతరమును కోరికలతో జ్వలించుచు, అశాశ్వతములు, మోహజనకములు క్షణభంగురములగు, మబ్బులవంటి పేరుప్రఖ్యాతులకై పరుగులు దీసెడు వానియందు నిస్వార్థ సేవను ఆశింపజాలము.

ఈ దైవము, దైవసాక్షాత్కారము, ఆధ్యాత్మిక జీవనములను అట్లుంచినను, ఎల్లరును పాటింపక తప్పని దైవశాసనమొకటి గలదు. అది ఎల్లరికిని ఎల్ల పరిస్థితులలోని వారికిని సమానముగ వర్తించును. అది ఋషి సత్తములకు, పాపులకు, మంత్రులకు, గవర్నర్లకు, భాగ్యవంతులకు, బీదలకు, పండితులకు, పామరులకు వారు వీరనక ఎల్లరకు సమానముగ వర్తించెడు తిరుగులేని దైవశాసనము "ఏ విత్తు నాటిన ఆ పంటయే పండును". అను పవిత్ర శాసనమే అది. నీవు నాటిన విత్తనములయొక్క ఫలమును నీవే అనుభవింతువు. నీవు భవిష్యత్తులో ఏమికానున్నదీ ఇప్పటి నీ మనోవాక్ కాయ కర్మలవలననే నిర్ణయమగును.

ఈ దైవశాసనము ప్రతివారికి, చక్రవర్తికి, భిక్షకునకూ, వివేకులకు, అజ్ఞానులకు, విశ్వాసులకు, అవిశ్వాసులకు సహితము నాస్తికులకు, ఆస్తికులకు వర్తించును. పరాక్రమశాలురగు చక్రవర్తులు రాజాధిరాజులు గూడ "ఏ విత్తనము నాటిన అరకము పంటయే" అను ఈ దైవశాసనమును అర్థము చేసుకొనుటకు బదలు కొందరు అవివేక వ్యక్తులు ఈ శాసనముతో కయ్యమునకు దిగి దానిని ఖండించుచు "నేను గరికను నాటితే గోధుమ ఎందుకు పండకపోవలయును" అన్నట్లుగా వాదనచేయుదురు. గోధుమలు నాటిన వివేకికి గోధుమ పంటయే

ప్రాప్తించును. అజ్ఞానియగు స్వార్థపరుడు గరికనే నాటిన అతనికి గరిక పంటయే పుష్కలముగా లభించును. ఈ విషయములో ఏవిధమైన మినహాయింపులుగాని దాపరికములుగాని, ప్రత్యేక అభిమానములుగాని ఉండవు. ఈ దైవశాసనము పసిబిడ్డలనుండి వృద్ధుల వరకు ఎల్లర జీవితములయందును, గణిత శాస్త్రమునందలి నిష్పత్తి సిద్ధాంతమువలె నిష్కర్షగ అమలు జరుగును.

నీకు, నాకు, ప్రపంచమందలి అందరకు రెండుకి రెండు కలిపితే ఏ సంఖ్య ఏర్పడును అని మనము విశ్వసించినను, విశ్వసింపకున్నను అది మాత్రము నాలుగుకాక తప్పదు.

కొందరు వ్యక్తులు "మాకు దేవుడు అక్కరలేదు. ప్రార్థనలు అక్కరలేదు! మాకు కావలసినది సేవ, సేవ ఉండగా మాకిక దేనితోను పని లేదు. అని సగర్వముగా పల్కెడు వ్యక్తులు కొందరు ఉందురు.

**అట్టివారికి నేను చెప్పెడిది ఏమనగా :-** "ఆధ్యాత్మిక జీవనములో మీరు కేవలము పసిపిల్లలు. మీరు పల్కుచున్నదేమో మీరు ఎఱుగజాలకున్నారు" భక్తిపూరితము ఆత్మార్పణ జనితము అగు ఆధ్యాత్మిక జీవితపు ఫలితము నిస్వార్థ సేవ, చెట్టులేకుండ పండు ఎట్లు లభించును! సద్వర్తనము అను క్రింది పునాదిపైన నిర్మితమగు కప్పు, సౌధము నిస్వార్థసేవ, ఆధ్యాత్మికత్వమునకు, నిస్వార్థ సేవకు, ఆధారమగు నిత్యప్రేమ యను పునాదిలేనిదే నిస్వార్థసేవ, ఆధ్యాత్మికత్త్వము అను గట్టి భవనము ఎట్లు లభించును?

అజ్ఞానియగు వ్యక్తి, తాను మంత్రియైనను, డైరెక్టరైనను సేవచేయుటకు ముందునుండికూడ ఏదో ప్రతిఫలము లభింపవలెననియే సదా ఆలోచించుచుండును. "ఈ సేవ నుండి నాకు ఏమి లభింపగలదు?" అనునదే సేవనుగూర్చి అతని మొదటితలంపు, చివరితలంపు, స్వార్థపరుడైన డాక్టరు రోగికి చికిత్స ఆరంభింపక ముందే డబ్బు (ఫీజు) కావలెననీ కోరును.

ఇటీవల ఒకనాడు ఒక పిల్లవానిని విష సర్పము కరచెనని వింటిని. కుర్రవాడు అంత్య ఘడియలలో ఉండెను. విష జంతువుల కాటును నయము చేయుటలో ప్రవీణుడని పేరు పొందిన ఒక తాంత్రికుని యొద్దకు అతనిని హడావిడిగ తీసుకొని పోయిరి. అతడు పిల్లవానిని పరీక్షించి, వైద్యము ఆరంభించుటకు ముందు, ఎనిమిది రూపాయలు కావలెనని కోరెను. ఎనిమిది రూపాయలు ఇచ్చుకొనలేని నిరుపేదలగుటచే అతనిని మరి[illegible] కొంపోయిరి. సరియగు బుద్ధితోగూడి సకాలమున చేయవలసిన స్వార్థరహితమగు సేవ లభింపక పోవుటచేత ఆ పల్లెకు చేరులోపలనే అతడు మరణింపవచ్చునుగద.

ఈ కుర్రవాడు బీదవాడు, దురదృష్టవంతుడు అగుటచే ఇట్లు జరిగినది, అట్లుకాక అతనికి వైద్యము చేయవలసిన తాంత్రికునకు అతడు ఏ కుమారుడో, బంధువో అయి ఉండినచో మరణ సన్నిహితుడుగానున్న ఆ పిల్లవానిని అప్పుడే డబ్బు యిమ్మని అతడు కోరియుండునా? చికిత్స చేయుటలో ఆలస్యము జరుపునా? తన ఔషధమును రోగికి యిచ్చుటకుముందు అజ్ఞాని, స్వార్థపరుడు అగు వైద్యుడు తనలోతాను "ఈ సేవ చేసినందువలన నాకు కల్గు లాభమేమి" అని తలంచును. అప్పటికే అతడు నిరాధారులు, బీదలు అగు వారినుండికూడ తాను పొంద నాశించుచున్న ప్రతిఫలమును రూపాయిలు, అణాలలో లెక్కించు కొనుచుండును.

నిస్స్వార్థ సేవాపరులకు ఏవిధమైన ప్రతిఫలాపేక్షయు ఉండదు. దైవ మానవుడగువాడు నిస్స్వార్థ సేవనే తనకు లభించిన గొప్ప ప్రతిఫలముగను, అమూల్య భాగ్యముగను భావించును. దేవుని బిడ్డలను సేవించుటకంటె గొప్పదగు ప్రతిఫలము ఇంకెద్దియులేదు. దేవుడు మన చెంతకు వ్యాధిగ్రస్తులు, బీదలు, కేవలము అపరిచిత వ్యక్తులు మొదలగు రూపములతో వచ్చును. అన్ని రూపములలోను ఉండెడు దైవమునకు ఏవిధమైన ప్రతిఫలాపేక్ష లేకుండ సేవ చేయుటయే మనకు కలుగగల పరమ పవిత్రమగు అవకాశము.

తగిన కిమ్మత్తును ఇవ్వకుండనే లాభములు పొంద నభిలషించు అనేక వ్యక్తులచే ఈ జగత్తు నింపబడి యుండుట విషాదకరము, వారు తమకు దైవము అవసరమేయని పెదవులతో మాత్రము చెప్పుదురు. కాని తమ యావత్కాలమును "విత్తు ఏదో పండేది అదియే" అను అనుల్లంఘనీయ శాసనమును ఇసుమంతయు లక్ష్యపెట్టక రాత్రులు, పగళ్ళు తమ హృదయాలలోను, తమ ఆత్మలలోను ధన దేవతారాధనే చేయుదురు.

ఏదో అదృష్టవశమున గొప్ప హోదాలో ఉండుట తటస్థించిన అజ్ఞాని ఉద్యోగములకై అభ్యర్థులను ఎన్నుట మొదలగు పనులను నిర్వర్తించుటలో తన కులపువారికో, దగ్గరి బంధువులకో ఉద్యోగాదులు కట్టబెట్టును. అట్లుగాక అట్టి బాధ్యతగల హోదాలో ఉన్న వ్యక్తి వివేకి దైవ మానవుడు అగునెడల అభ్యర్థుల సమర్థత యోగ్యతలను బట్టి ఉద్యోగములిచ్చును. అట్టివానికి యావత్ప్రపంచము తన సొంత గృహము. జగత్తునందలి ఎల్ల మానవులు అతని సోదరీ సోదరులు.

పునీత హృదయులగు ఇట్టివారి భక్తి ప్రేమయుతములగు జీవితములుగదా ధన్యవంతములు, నిస్స్వార్థ సేవ అట్టివారికే సాధ్యము. ఏలనన దైవ బిడ్డలలో అధమాధములకు గూడ సేవ చేయుటచే వారు దేవుని సేవించినవారే అగుచున్నారు. "దేవుని బిడ్డలలో నీచాతి నీచులకు కీడు చేసినను దేవునికి కీడుచేయుటయే అగును" అను సత్యమును మనము ఎంత త్వరితముగా గ్రహింపగల్గుదుమో, అంత ఎక్కువగా మనకును, మన తోడిమానవులకును సహాయము చేసుకొన్నవారమగుదుము, అనగా "ఉండేది ఒకటే-దైవము; అతడు మన చెంతకు అనేక నామములతోను అనేక రూపములతోను వచ్చును" అని మనము గ్రహింపవలెను.

"మానవుని ప్రేమించుట దైవమును ప్రేమించుటయే, మానవుని సేవించుట దైవమును సేవించుటయే. కంటికి కనపడుచున్న మానవునే

ప్రేమింపనేరని వ్యక్తి. కండ్లకు కానరాక అదృశ్యుడుగా నుండెడు దైవమునెట్లు ప్రేమింపగల్గును" అను సూక్తిలో ఎంతయో సత్యము, ఎంతయో, వివేకము కలదు.

స్వార్థపరుడగు వానికి నిస్స్వార్థసేవ సాధ్యపడదు; "చెట్లయందు, పక్షులయందు, జంతువులయందు, మానవులయందు దైవమును దర్శించుచు ప్రపంచము నంతటిని బ్రహ్మగా భావించెడు దైవమానవునికే అది సాధ్యము" అని పర్వత శిఖరములనుండి, సభాభవనములనుండి, వ్యాపార సంస్థలలో, ఊరూర, వీధి వీధిని, పండుగలలో, పర్వములలో, తీర్థయాత్రలలో, తిరునాళ్ళలో నాకు సాధ్యమగునంత బిగ్గరగా ఎలుగెత్తి దశదిశలకుచాటవలెనని నాకు కుతూహలము. అట్లు చాటుట నాకు ఆనందము. ఏలనన దృశ్యమాన ప్రపంచమునకు యావత్తు సృష్టికి అంతస్థితుడై యున్న పరంజ్యోతిగదా దైవము.

దేహజ్ఞప్తితో మనమేమియు చేయజాలము; దైవజ్ఞప్తి తోడను, విశ్వప్రేమతోడను, మనము ఏమైనను సాధింపగలము. ఎల్ల విషయములను సాధింపగలము. వెలుగు మఱుగుపడినచోట దేవుడు మఱుగుపడును; అజ్ఞానులకు స్వార్థపరులకు అంతా అంధకారమే.

మన గాంధి మహాత్మాజీయొక్క ఆత్మార్పణయుత, పవిత్ర జీవితమును పరికింపుడు; అను నిమిషము కార్యభారనిమగ్నుడై యుండియు తనకు తీరిక చిక్కిన ప్రతిక్షణమును ఆయన పవిత్ర రామనామమును ఉచ్ఛరించుచు దైవ ప్రార్థనకు వినియోగించుచుండెను. ఈ ప్రపంచమునుండి తరలిపోవు సమయమున తన ఆఖరి శ్వాసలో ఆయన దైవనామమును స్మరించి తరించెను. సాటి మానవుల సేవకొరకై తన జీవితమును సమర్పించిన నిస్స్వార్థపరుడగు మహాత్మాజీ జీవితమునుండి నేర్చుకొనదగినది ఎంతయో కలదు. భారతజాతియొక్కయు, ప్రపంచ క్షేమము కొఱకు ఇంకను నెరవేరవలసియున్న ఆయన కోరికలను, ఆశయములను సాధించుచు ఆయన పాదచ్ఛాయలలోనే

నడచుచున్నామనిన్నీ, ఆయన అనుచరులమనీ సంకీర్తకులమనియు తలంచెడు వారెల్లరు, ప్రత్యేకించి ఆయన జీవితమునుండి నేర్చుకొనదగిన దెంతయైనను కలదు.

గాంధీజీ నిస్స్వార్థ సేవయొక్క మూర్తీభవ రూపమై యున్నాడు, "ఉన్నాడు" అను క్రియను వాడుచుంటిని నేను. ఏలనన నాయంతటి నాకు మహాత్మాజీ యిప్పటికిని సజీవుడే. నిస్స్వార్థసేవా రూపమున నిరంతరమును నూతనోజ్జీవముతో వెలుగొందెడు ఆయన సత్య అహింసా సందేశ ప్రభావముచే ఆయన సర్వదా సజీవుడే. గాంధీజీ దైవమానవుడు; కావుననే పర్వతముల నుండి నదీజలములు ప్రవహించురీతిగ జ్యోతిర్మయుడగు సూర్యుని నుండి తేజస్సు ఎల్లదిశలు వ్యాపించెడులాగున, పుష్పముల నుండి సౌరభము విరజిమ్మునటుల, ఆయననుండి నిస్స్వార్థసేవ వెల్లువలై ప్రవహించెను.

"మంచిగా నుండుము" "మంచి చేయుము" అను నీ రెండు సూక్తులు సులభ గ్రాహ్యములును, పరస్పర సంబంధములుగలవియు నగు రెండు భావములు. మీరు మంచిగా "ఉండినప్పుడే" మంచిని "చేయగలరు".

మంచిగా ఉండుటే "ఉనికి" మంచిని చేయుటే "సేవ" శీతోష్ణములను ఆకలితప్పులను, ఆధివ్యాధులను లక్ష్యపెట్టక విశాల ప్రపంచమును తమ స్వంత ఇల్లుగ, నిస్స్వార్థసేవను తమ నిజమైన మానవజన్మ యొక్క ఏకైక గమ్యస్థానముగ భావించుచు, ఆ జగత్పతిని సేవించుటయందే నిర్విరామముగ నిమగ్నులై యుండెడు నిస్స్వార్థపరులు ఆత్మార్పకులునగు మహనీయులు కెల్లరల నా భక్తి పూర్వక నమోవాకములు.

సర్వేజనా స్సుఖినో భవంతు

ఓం తత్, సత్ ఓం.

# నిజమైన ధనవంతుడెవరు ?

హిందూ దేశములో వేసవికాలములందు, చల్లని ప్రదేశములలో, ఆరోగ్యముగ, శాంతిగ గడుపుటకు అనేకమైన పర్వత కేంద్రములు (**Hill Stations**) గలవు. నీలగిరి పర్వత శ్రేణి, అన్ని పర్వత రాజములకు రాణియని చెప్పబడుచున్నది. నీలగిరి పర్వతములలో కోటగిరి, ఒక పర్వతమును అలంకరించిన మణిపూసగా పరిగణింపబడుచున్నది. సౌందర్యములోనేగాక, ప్రపంచమంతటిలో ఆరోగ్యవంతమైన ప్రదేశముగ గూడ ఈ కోటగిరి ప్రసిద్ధి కెక్కినది. అట్టి దివ్యమైన తావున, సుమారు లక్ష రూపాయలు విలువగల శాంతి కేంద్రమును (లక్ష్మీ విహార్ - **Peace Centre**) ప్రపంచములోని భక్తులందరి ఉపయోగార్థమై, దైవమచ్చట అన్ని సౌకర్యములతో నేర్పరచెను.

ఈ కోటగిరి యెనిమిదివేల ఎకరముల విస్తీర్ణముగలిగి, 25,000 జనాభాతో, 5000 గృహములు గలిగి యున్నది. ఇది సముద్ర మట్టమునకు 6500 అడుగుల యెత్తుగా నున్నది.

మేము కోటగిరి రాగానే యిచ్చట నున్న వారందరిలో, ధనవంతులలో ధనవంతులైన, లక్షాధికారి ఒకరుండిరని చెప్పిరి. వారు ఇచ్చట శాంతి కేంద్రములో, విశ్వమత ప్రార్థన మందిరమునకు శంఖుస్థాపన చేసినపుడు వచ్చియుండిరి. తదుపరి గూడ మూడు పర్యాయములు వచ్చి వారి కష్ట సుఖములు చెప్పుచు, శాంతి ఆశ్రమ వృద్ధికి తోడ్పడెదనని తమంతట తాము చాల ప్రేమతో వాగ్దానము చేసి యుండిరి.

అన్నిటికంటెను, వారు కాంగ్రెసులో పనిచేయు కాలములో శాంతి ఆశ్రమాధ్యక్షులైన శ్రీ తెన్నేటి విశ్వనాథం **M.A., B.L., M.L.A.,** గారి సహచరులుగా రాజకీయముగ ఖైదులో నుంటినని చెప్పగా, మాకు చాలా ఆశ్చర్యము ఆనందము గూడ కలిగెను.

ఇప్పుడు ముఖ్యముగా వ్రాయునదియేమన, నేను ప్రార్థన హాలులో కూర్చుండియుండగా నీ లక్ష్మీవిహార్ కెదురుగా, ఈ ధనవంతుని బంగళా, ఇంకను ఆయన యొక్క పెద్ద పెద్ద భవనములే నిత్యము కనిపించుచుండును. రాత్రివేళల విద్యుచ్ఛక్తి దీపములు మెరయుచుండును. ఏదో విధముగ కండ్లయెదుట ఈ దృశ్యముండుటచే, తలవని తలంపుగా కోటగిరి అంతలో ధనవంతుడైన ఈ వ్యక్తిని గురించియే నా మనస్సు ఆలోచించుచుండును.

ఆయన భవనములను గురించి సిరి, సంపదలను గురించి ఆలోచించుటలేదు. ఆ ధనవంతుడు ఆశ్రమమునకు ప్రారంభములో అతి భక్తితో తనంతటతానే తోడ్పడెదనని చెప్పియు, అట్టి ఆలోచనయే తిరిగి లేనట్లుండుట, చాల ఆశ్చర్యకరము. ఆయన సహాయమును గురించి కూడ నేనిప్పుడు ఆలోచించుటలేదు. ఆహా! మాయ యెంత బలవత్తరముగా నుండును?

ప్రతిదినము ఆయన భవనములు చూచుచుండ, ఆయనే నిజముగ ధనవంతుడా, లేక యదార్థముగ నేను ధనవంతుడనా? యనెడు ఆలోచనయే, ప్రశ్నయే, నాకు ప్రాముఖ్యముగ గోచరించుచున్నది. అనేకమైన భవనములు, మోటార్లు, సిరి, సంపదలు, లక్షల కొలది ధనము కలిగియున్న వ్యక్తి ధనవంతుడా? లేక గోచీపాతరాయుడనైన నేనా? ఏ ధనము లేని సాధువునైన నేనెటుల ధనవంతుడనగుదునని చాలమంది తలంచవచ్చును?

"కౌపీన వంతః ఖలు భాగ్య వంతః"

అని మహనీయులు నుడివి యుండిరి. ఏ భవనములు, ధనధాన్యములు లేని, కౌపీనధారులే భాగ్యవంతులని, ధనవంతులలోకెల్ల ధనవంతులని, విజ్ఞులు నుడివియుండిరి. ఈ వ్యక్తి కోటగిరికంతయు ధనవంతుడేగాని, నేను హిందూదేశ మంతలోనేగాదు – ఈ లోకమంతటిలోనే ధనవంతుడనని తృప్తిపడి, సదా ఆనందించుచుందును. నాది యనునది నాకెద్దియు లేదు. లక్షలకొలది

విలువైన ఆస్తులు, ఆశ్రమములు, అన్నియు భక్తకోటివే! నా పేరున ఏమియు లేవు. ఈ సందర్భములో ఒక పూర్వగాధ జ్ఞాపకము వచ్చుచున్నది.

హతీమ్ అను ఫకీరు, బాగ్దాద్‌లోని కాలీఫావద్దకు వెళ్ళినపుడు చెప్పిన మాటలు చూడుడు.

హతీమ్: ఓ వైరాగ్యవంతుడా! సలాము!

కాలీఫా: (చాల ఆశ్చర్యముతో) నేను ఎట్లు వైరాగ్యవంతుడ నగుదును? ఈ రాజ్యమును పరిపాలించుచుంటినిగదా! ఓ ఫకీరా! వైరాగ్యవంతుడవు నిజముగ నీవే.

హతీమ్: 'కాదు నీవే విరాగివి' అని నవ్వెను.

కాలీఫా: అదియెట్లు?

హతీమ్: భగవంతుడిట్లు చెప్పెను. "ఈ ప్రపంచ ధనము నిష్ప్రయోజనము" నీవు ఆధ్యాత్మిక ధనమును త్యాగము చేసితివి. ప్రపంచ ధనమును ప్రోగుచేసికొనుచుంటివి. నీవు నిజమైన దైవ ధనమును త్యాగము చేసితివి గదా? నేను ఆ ప్రపంచ ధనమును, ప్రపంచ కోరికల నన్నింటిని విసర్జించి, నిజమైన ఆధ్యాత్మిక నిధిని, దైవధనము నపేక్షించితిని.

కాలీఫా తన లోపమును అప్పుడు గ్రహించి, సిగ్గుపడగలిగెను. నరసింహ శతకములోని యీ దిగువ పద్యమును సదా జ్ఞాపకముంచుకొనదగినది.

సీ॥ తల్లి గర్భము నుండి ధనము తే డెవ్వడు
వెడలి పొయ్యేవాడు వెంటగొనడు;
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్త మార్జనచేసి విఱ్ఱవీగుటె గాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు

పొందుగా మరుగైన భూమిలోపలబెట్టి
దాన ధర్మము లేక దాచి దాచి

తే॥ తుదకు దొంగల కిత్తురో । దొరలకౌనో?
తేనె జుంటిగ లియ్యవే తెరువరులకు
భూషణ వికాస । శ్రీ ధర్మపుర నివాస ।
దుష్ట సంహార । నరసింహ । దురితదూర !

ఈ ప్రపంచములో, ధనవంతులు పూర్వ పుణ్యముచేతను, ఈశ్వరానుగ్రహముచేతను, ధనవంతులుగా పుట్టుచు, ఇప్పుడు వారి కర్తవ్యమును, ధర్మమును మరచిపోవుచున్నారు.

ప్రశ్న : నిజమైన ధనవంతుడెవరు?

జవాబు: యదార్థమైన ధనమేదో తెలిసికొన గలిగినవారేగదా? అదియునుగాక, ఉన్నదానితో తృప్తిగలవాడే నిజమైన ధనవంతుడని ధర్మరాజు అరణ్యవాసములో, యక్షుని ప్రశ్నకు జవాబిచ్చెను.

ప్రశ్న : తృప్తి యెచ్చట నున్నది ?

జవాబు: తన నిజస్వరూపము తెలిసికొనుటలోనే, ఆనందము, శాంతి, తృప్తి యున్నవి. అప్పుడు సదా దైవజ్ఞప్తిలో నుండుట తటస్థించును. మానవ జీవిత గమ్యస్థానము చేరగలిగిన వాడగును.

అత్యాశ గల్గినవాడే నిజముగ దరిద్రుడు, దుఃఖి, ఆశయే బంధము, జన్మించినందుకు సాఫల్యము. ఆశారహితమై యుండుటే, కోరికలు లేకపోవుటయే మోక్షము. ఏ ఆశయము లేక, తృప్తిగా నుండి స్వస్వరూప సంధానుడై యుండువాడే నిజమైన ధనికుడు.

ఈ మధ్యను, ఒక బౌద్ధ భిక్షువు సన్యాసి కూనూరు నుండి శాంతి కేంద్రమునకు వచ్చి, చక్కనైన ఉపన్యాసమునిచ్చి వెడలెను. ఆయన 32

పర్యాయములు అమెరికా దేశము, 8 పర్యాయములు జపాన్, యూరపు వగైరా దేశములన్నియు పర్యటించెనట. ఎన్నో గ్రంథములు వ్రాసి, మన దేశ సేవ చేయుచుండెను. ఆయన ఇట్లు తన ఉపన్యాసములో చెప్పెను; కలకత్తాలో తన శిష్యుడుగా ఒక కోటీశ్వరుడుండెనట. అతడు రెండు దేవాలయములు కట్టించి, తన ఆరోగ్యము, తరింపుకొరకు ఇద్దరు పూజారులకు జీతభత్యములిచ్చి, జపము చేయించుచుండెను. తాను మాత్రము యధాప్రకారము త్రాగుడు, జూదము మొదలన దురభ్యాసములకు బానిసయై, సరియైన నిద్ర యనున దేమియో తెలియక, ఆరోగ్యమును పోగొట్టుకొని, అధోగతి పాలగుచుండెను. ఆ కోటీశ్వరునకు గురువగు బౌద్ధబిక్షువునకును, మధ్య యీ దిగువ సంభాషణ జరిగెను.

కోటీశ్వరుడు : ఓ స్వామీ ! నేను ఒక క్షణమైన నిద్రపోజాలకుంటిని. నా ఆరోగ్యము పూర్తిగ పాడయ్యెను. తిండి కూడ సరిగ తినజాలకుంటిని, అజీర్ణము, కోట్లకొలదిగానున్న నా ధనము, నాకు సరియైన నిద్రనైన నియ్యజాలకున్నది. నన్ను రక్షించుడు. మంచి మార్గములో బోధించుడు.

బౌద్ధభిక్షు : నేను ఒక మంత్రము చెప్పెదను. నీ ధనము బీదలకు ధర్మముచేసి, దానిని సదా జపింపుము. "**This too shall pass away.** ఇది కూడ గడచిపోవును".

గురువు చెప్పినట్లు బీదలకు చాల ధనమును ధర్మముచేసి, పై మాటలను జపింప ప్రారంభించెన. కొంతకాలమునకు సుఖముగ నిద్ర పట్టుచున్నదని యుత్తరము వ్రాసెను. కాన నిజమైన ధనవంతుడెవడో, పరమేశ్వరుడు మనకిచ్చిన ధనమును, ఎట్లు సద్వినియోగము చేసికొనవలెనో, ప్రతివారు జాగ్రత్తగా గ్రహించవలసిన ముఖ్య విషయము. ఈ సందర్భములో శ్రీ శంకరాచార్యులవారు చెప్పిన శ్లోకము చాల ముఖ్యముగ ప్రతివారు జ్ఞాపకముంచుకొనదగినది.

శ్లో॥ అర్థ మనర్థం భావయ నిత్యమ్
నాస్తి తత స్సుఖలేశ స్సత్యమ్ ॥
పుత్రా దపి ధనభాజాం భీతిః
స్సర్వత్రైషా విహితా రీతిః ॥

తా॥ : ఓయీ ఎప్పుడును ధనమును మంచిదానినిగా దలంచవలదు. అది అనర్థజనకమైనది. దానవలన కొంచెమైనను సుఖముండదు. ధనము గలవారికి కుమారుని జూచినను భయమే. ఇది లోకమందంతటను ఒకే మాదిరిగా నున్నది.

శ్రీ స్వామి రామతీర్థులవారి యుపన్యాసము, నిజమైన ధనికుడెవరో ఈ క్రింది విధముగా చెప్పుచున్నది.

ఒక సాధువు తన చేతిలో కొన్ని పైసలను తీసికొని, వానిని అందరిలో చాల నిరుపేద కిచ్చెదననెను. ఎంతటి బీదవారు వచ్చినను వారి కెవ్వరికి కియ్యకుండ, ఆ దారిని ఊరేగింపులో ఏనుగంభారీపై పోవుచున్న చక్రవర్తిని చూచి, ఆ పైసలను ఆయన మీదికి విసరెను. అప్పుడా చక్రవర్తి ఆశ్చర్యముతో నిట్లనెను.

చక్రవర్తి : నాకు అనేకమైన రాజ్యములుండ నేను నిరుపేద నెట్లయితిని ?

సాధువు : ఓ మహా చక్రవర్తి ! నీ ఆశలకు ఆదీ, అంతు లేదు. నీ కోర్కెలకు పరిమితి లేదు. గాన అందరిలో నీవే బీదవాడవని తలంచి నా పైసలు నీపైనే విసరితిని.

కాన మనము చూచే గొప్పవారిలో చాలమంది చాల హెచ్చుగా కోరికలు గలవారే. ఏ కోరికయు లేనివాడే, చక్రవర్తులకు చక్రవర్తి, నిజమైన ధనవంతుడుగా నుండుటకు ఒకటే రాజమార్గము. అది తృప్తియే. ఎవరి హృదయములలో నిజమైన తృప్తి, భక్తి, ప్రేమ యుండునో, వారే నిజమైన

ధనవంతులు. అదియునుగాక.

దైవ ధనమే నిజమైన ధనము
ఆత్మ ధనమే శాశ్వతమైన ధనము

మనకు సమస్త ఐశ్వర్యములను ప్రసాదించిన, ధర్మస్వరూపుడైన, భగవంతుని, ధర్మమును, మరచిన మనకెట్లు సిరిసంపదలు దక్కును?

ప్రియమైన పాఠకులారా! ఇక లక్షమాటలు, తోడిప్రాత లేల? ఉన్నదొక్కటే, అదియే నీవు 'త త్త్వ మసి' - గాన ధనవంతులకు నిజమైన ధనవంతుడవు నీవే!

'త త్త్వ మసి' యనుచు, నీ స్వస్వరూపమును గుర్తించి సదా తృప్తితో, బ్రహ్మానందమును అనుభవించుము. శాశ్వతమయిన, అఖండమయిన జ్ఞానధనము నీ జన్మహక్కై యున్నది. అద్దానిని, ఆ ఆత్మ ధనమును నిరంతరము నీవు అనుభవించుచు, నీ మనోవాక్కాయ కర్మలలో సత్య, ధర్మ, ప్రేమలను విడనాడక బ్రహ్మ జ్ఞానముతో శాశ్వతమైన, స్థిరమయిన, నిత్యమయిన ధనమునే వ్యక్తపరచుచు, మానవకోటికి జ్యోతి స్వరూపముగా ప్రకాశించెదవుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# "స్విచ్చి" ని వేయుము

లక్ష్మీవిల్లా భవనమంతయు (**Electric**) విద్యుచ్ఛక్తి దీపములతో నిండియున్నది. ఒక్క ప్రార్థన మందిరములోనే తేజోవంతమైన నాలుగు దీపముల గుత్తిగలదు.

మే మొచ్చిన తరువాత, ఫిరోజా సోదరి 21 విద్యుచ్ఛక్తి బల్బులతో సంస్కృత ప్రణవ చిహ్నమును యేర్పర్చెను. స్విచ్చిని వేసిన 21 చిన్న బల్బుల ప్రణవము వెలుంగుచు, మనస్సునకు ఎంతయో ఆనందము నిచ్చుచు హృదయ శాంతికి తోడ్పడుచుండును.

ప్రియమైన పాఠకులారా ! ఈ ప్రణవాక్షర దీపమును, దీనిని అనుభవించెడి ఆనందమును మీరు స్వయముగా చూచి ఆనందించవలెనుగాని, నేనీ చిన్న మాటలలో వర్ణింపజాలను. గాన లక్ష్మీవిల్లాను దర్శించి శాంతిని పొందుటకు మీకిదే ఆహ్వానము.

నేను నివసించెడి పెద్దగదిలో రెండు పెద్దదీపములు కలవు. అందులో ఒకటి టేబిల్ దీపము, ఎటుల త్రిప్పిన అది అటుల అతివిధేయతతో, భక్తి ప్రేమలతో తిరుగుచు, నాకెంతయో ఆనందము నిచ్చుచు తోడ్పడుచుండును.

ఈ టేబిల్ లైటు, అనగా బల్లమీద ఉంచుకొని వాడెడిదీపము, కీర్తి శేషులైన శ్రీ తమ్మి రాజకుమారుడు పంపినదే! శరీరములు పోయినను మనము చేయు దానధర్మములు చిరస్థాయిగా ఉండునుగదా!

భోజనములుచేయు గదిలో గూడ పెద్దబల్ల, దానిచుట్టు కుర్చీలు, అన్ని వైపులా భోజన సామగ్రి ఉంచుటకు బల్లలు, గోడ బీరువాలు, వాటితో మరియొక ఎలక్ట్రిక్ దీపముల అందమైన గుత్తి (**Ceiling**) సీలింగులో అమర్చబడి యున్నది.

ఎచ్చట, ఎప్పుడు స్విచ్చి వేసినా, అంధకారముపోయి, గది అంతయు తేజస్సుతో నిండియుండును. నా గదిలో నుండి చిన్న డ్రెస్సింగు గదిలోనికి

వెళ్ళుటకు ఒక స్విచ్చి యున్నది. అచ్చట నుండి (**Bath Room**) స్నానముల గదికి వెళ్ళుటకు మరొక 'స్విచ్చి' యున్నది. కొన్ని స్విచ్చులు వదులుగా యుండి చేయి వేసినంతనే, అంధకారము మాయమై గదిని తేజోమయముగా చేయుచుండును.

ఈ ప్రకాశవంతమైన స్విచ్చులకాంతిని రోజూ రాత్రులందు గాంచుచుండ, తలవనితలంపుగా యీ క్రింది భావనలు చిన్నపాటవలె జ్ఞప్తికి వచ్చుచు నాలో నేను పాడుకొనుచుందును.

కాల మనెడి పడవ వెళ్ళిపోవుచున్నదీ,
వెయ్యరా, రామనామ మనెడి స్విచ్చినీ,
నింపరా జీవితమంతనూ వెలుగుతో,
సోఽహం అనెడి స్విచ్చియే నీకు ముక్తి నిచ్చురా,

ఎంత అంధకారమైనను, స్విచ్చి నొక్కగనే మాయమౌనుగదా! అంధకారము నిన్నటినుండియున్నను, వేలకొలది సంవత్సరములనుండి యున్నను తేజస్సునకు ఒక్కటేగదా! దీపము రాగానే, యెట్టి చీకటియైనను పోవును, దీపము వెలిగించుట, దానిని ఆర్పివేయుటగూడ సులభమే! స్విచ్చివేసి దీపమును వెలిగించుచు దేశవృద్ధికి, లోకశాంతికి తోడ్పడెడివారి జీవితములు అదృష్టవంతములు.

ఇక దీపములను ఆర్పివేయువారి జీవితములో ! ఇవి దేశమునకు లోకమునకు కళంకమైనవి. స్వార్థపరుడు దీపములను ఆర్పివేయుటకే ప్రయత్నించి, జీవించుచుండును. స్వార్థరహితుడు దీపములను పాతవాటిని కొత్తవాటిని గూడ వెలిగించుటకే ప్రయత్నించుచు జీవించుచుండును.

ఏ గదిలో స్విచ్చి నొక్కినను, క్రీస్తు ప్రభువు (**Let there be light**) వెలుతురుండనిమ్ము, అని పలికిన శక్తివంతమైన మాటలు జ్ఞప్తికి వచ్చుచుండును.

నేను స్విచ్చి నొక్కినపుడు గదులలోను, భవనములలోనేగాక, మానవుల హృదయములలో గూడ వెలుతురుండుగాక యని కోరుచుందును.

జాతిమత దేశవివక్షతలు లేకుండగా లోకమంతయు తేజస్సుతో నిండియుండునుగాక! ద్వంద్వ గుణములతో గూడియున్న ప్రపంచములో, చీకటి యుండునుగాని, సూర్యునిలో చీకటి, అంధకారము ఎన్నడూ ఉండనేరదుగదా! సూర్యునిలోనే చీకటి ఉండనపుడు, ఇక సూర్యులకు, సూర్యునిలో కోటిసూర్య ప్రకాశవంతమైన పరమాత్మలో దుర్బలత్వము, అంధకారము ఎటుల ఉండును?

భగవంతుడు తన స్విచ్చితో ఆకాశమంతయు తేజోమయమైన నక్షత్రములతో నింపి ప్రకాశింప చేయుచుండెనని, రాత్రులందు నక్షత్రములను చూచినపుడు ఆనందించుచుందును, మానవుని శక్తి ఖండమైనదిగాన అతడు దీపములను గదులలోను, వీధులలోను మాత్రమే వెలిగించగలడు.

ఎంతశక్తి మంతుడైనను ఆకాశములో దీపములను వెలిగింపజాలడు గదా! అచ్చటి దీపములను వెలిగించగల్గినవాడు ఒక్క దైవమే.

స్విచ్చులు, బల్బులు వేరువేరుగా యున్నను వాటిలోనున్న విద్యుచ్ఛక్తి అంతయు ఒక్కటే, వోల్టులనుబట్టి మరొక్క బల్బు హెచ్చుగా ప్రకాశము నిచ్చుచుండును. అటులనే దైవము సర్వత్రా నిండియున్నను, ప్రతిహృదయ నివాసియైయున్నను వారి వారి భక్తిశ్రద్ధలనుబట్టి వైరాగ్యము, అభ్యాసముల ననుసరించి దైవము వారిలో ప్రకాశించుచుండును.

క్రీస్తు ప్రభువు తన తండ్రి భవనములో చాల గదులు గలవని నుడివి యుండెను, కూపస్థ మండూకములు, అనగా నూతిలోని కప్పలు, ఈ లోకములో, ఒక్క గదే యున్నదని, దానికంటే గొప్పగది లేదని, తమ మతమే గొప్పదని, కించజ్ఞత్వమైన బుద్ధితో, అమూల్యమైన కాలమును వితండవాదములతో

వ్యర్థబుచ్చుచున్న వారిని చూచి ఈ మనస్సు చింతించుచుండును.

కొందరు మా విశ్వమత చిహ్నమును చూచి భయపడుచుందురు. కొందరు అసూయతో బాధపడేవారుగూడ ఉండుట విచారమైన విషయము. ప్రపంచమునంతను తమ గృహముగా, అందుండు మానవకోటి నంతను తమ స్వంతముగా భావించి, జీవకోటినంతను, తమ ఆత్మగా ప్రేమించుచు, జీవించుచున్న మహనీయుల జీవితములు పరమపావనమై, లోకశాంతిని, లోక కళ్యాణమును చేకూర్చుచున్నవి.

నీలగిరి లక్ష్మీవిల్లాలో ఉన్న ఈ స్విచ్చులను నిరంతరము వాడుచున్నపుడు ఈ మధ్యను, నామనంబు ఒక్కొక్క స్విచ్చికి ఒక్కొక్క నామధేయ మిచ్చిన యెంత బాగుండునో గదా! అనెడి సంకల్పము రాదొడగెను.

క్రీస్తు స్విచ్చిని నొక్కిన, క్రీస్తు ప్రభువు ప్రేమను ఆ గదిలో అనుభవింపవచ్చును. కృష్ణ స్విచ్చిని నొక్కిన, ఆ కృష్ణభగవానుని విజ్ఞానమును అనుభవింపవచ్చును. బుద్ధుని స్విచ్చి నొక్కిన బుద్ధ భగవానుని నిర్వాణమును అనుభవింపవచ్చును. అటులనే ఏఏ మతముల, అవతారమూర్తుల స్విచ్చులను నొక్కిన ఆయా సాంప్రదాయముల తేజస్సును అనుభవించవచ్చును. రామనామమును కీర్తించుచు రామతేజస్సులోలీనమయ్యేదరు. "ఓం నమోనారాయణాయ" అనెడి అష్టాక్షరీ మంత్రముయొక్క స్విచ్చిని నొక్కి నారాయణునిలో విలీనమవుచుందుము. "ఓం నమశ్శివాయ" అనెడి స్విచ్చిని నొక్కి శివుని తేజస్సులో లీనమయ్యేదము. చివరకు "సోఽహం" అనెడి స్విచ్చిని నొక్కిన తన్మయత్వమేగాక జన్మరాహిత్యమును గలుగుచుండును.

ప్రియమైన పాఠకులారా ! ఇక వెయ్యి వ్రాతలు, వెయ్యి మాటలేల? కాలము అమూల్యమైనది, ఈ క్షణమేమనది, వచ్చెడి క్షణము మనది గాకపోవచ్చును. గాన యీ క్షణమునందే మీ మీ సాంప్రదాయముల ననుసరించి, మీమీ ఇష్టదైవములను పూజించుచు, మీకుపదేశింపబడిన

మంత్రము నుచ్ఛరించుచు మీ స్విచ్చిని వేయుడు.

తరించుట కిదియే సమయము, ఇదియే తావు. ఏదీ మీ స్విచ్చి? మీ మంత్రము? మీ స్విచ్చిని వేస్తిరా? గాంచుడు. ఎటు చూచినను ప్రకాశమే, అంతర్యమున తేజస్సు, బాహ్యమున తేజస్సు, మీదను తేజస్సు, క్రిందను తేజస్సు అన్నివైపులా చుట్టును తేజస్సే, ఇదియే మనజన్మహక్కు, అఖండ కోటిసూర్యుల దివ్యస్వరూపమైన యీ తేజస్సులో స్వప్రకాశములో ఇప్పుడే, ఇచ్చటనే నిమీలిత నేత్రులమై విలీనమయ్యెదముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

ఓమ్ ! ఓమ్ ! ఓమ్ !

# ఆశ్రమమును నీ బిడ్డవలె నేల చూచుకొనవు?

శ్రీ శాంత్యాశ్రమములో వేలకొలది సత్యాన్వేషకులకు, శాంతి కాములకు, ఆనందదాయక మయియున్నది. శ్రీ శాంత్యాశ్రమము, వైద్య సహాయమును, అనేక విధములగు నితర సహాయముల నొసగుచు ఆధివ్యాధి పీడితులకు మహా వరప్రసాదమై తనరారుచున్నది. శ్రీ శాంత్యాశ్రమము, మానవ నిర్మితములగు జాతిమత వర్ణ వివక్షతలు లేక సత్యపథగాములకు శాంతి నిలయమై యొప్పుచున్నది. అట్టి యాశ్రమమును నీబిడ్డగ, కనీసము నీకుగల పలువురు బిడ్డలలో నొక బిడ్డగ నేల యెంచుకొనవు?

ప్రియ మిత్రమా! నీకు పిల్లలెందరు? చాలమంది కలరా? దయయుంచి ఈ

యాశ్రమమును నీ కడగొట్టు బిడ్డవలెనయిన చూడుము. ఇది నీ యాధ్యాత్మిక సంతాన మనుకొనుము. ఈ యాధ్యాత్మిక బిడ్డద్వారా నీ యున్నతాశయములను సాధించి ప్రపంచమున కేదయిన మేలు చేయుటకు ప్రయత్నించుము. అమూల్యమగు నీ రూపములు-మానవ శరీరములు సేవకొరకే-ఏదో ఒక విధముగ మంచిని చేయుటకే మన కియ్యబడినవి.

మానవుని ప్రేమించుట దేవుని ప్రేమించుటయే.
మానవ సేవ మాధవ సేవయే

స్వార్థరహితమైన యానందమును పొందుటకు నీయీ యాధ్యాత్మిక బిడ్డను నీకు తోడ్పడనిమ్ము! శాంతి ఉద్యమమును నీ బిడ్డద్వారా పుడమి నాలుగు వైపులను శాంతిని వెదజల్లుము.

ప్రపంచము శాంతికొరకు పరితపించుచున్నది. శాంతి ప్రతివారి జన్మహక్కయి యున్నది. శ్రీ శాంతి ఆశ్రమ మిపుడు నీబిడ్డలలో నొకటియైనందున

యా యాధ్యాత్మిక బిడ్డను స్వీకరించినందుకు పవిత్ర స్మృతి చిహ్నముగ ఇపుడే, యిచటనే దయయుంచి నీ జన్మ హక్కును స్థిరపరచుకొనుము.

నీ యితర సుతులవలె నీ యాధ్యాత్మికమైన బిడ్డను, ఇరువది నాలుగు గంటలు నీ సంరక్షణను కోరుద. ఇది వ్యయముతో కూడిన కార్యకలాపములనేమియు కోరదు. ఇది కోరునదెల్లను, శాంతి, సేవల యుద్యమములో, కొలదిమాత్రపు సహాయము, భక్తియుతమగు ప్రేమ, మానవ కళ్యాణమునకు హృదయపూర్వకమైన సానుభూతిని మాత్రమే. నీ పాలన పోషణ కొరకు చూచుచున్న నీ యాధ్యాత్మికపు బిడ్డను విస్మరించి ఏమరకుము. ఆమెను నగ్నముగ చలిలో బాధపడనీయకుము; దారిద్ర్యములో నాకలిచే బాధపడనీయకుము. ఇపుడు సజీవముగ నుండుటకయినను, నీవామెకు సహాయము చేసినయెడల ఆమె స్వర్గరాజ్యమును భూమిమీదికి కొనివచ్చి, మానవుని దేవునితో నైక్యముచేసి, ప్రపంచమున శాంతిని కులములలోను, జాతులలోను సౌమనస్యమును నెలకొల్పు మహత్పూర్ణమైన కాలము వచ్చును గనుక యిపుడు నీవామెను స్వీకరించినందుకు గర్వపడెదవు.

నీ యాధ్యాత్మికపు బిడ్డ నీ ప్రస్తుత జీవితమున కానందదాయినియు, భవిష్యజ్జీవితమునకు కూడ సాంత్వనదాయినియు నగుగాక! సర్వశక్తి సంపన్నుడు, సర్వజ్ఞుడు నగు భగవానుడు ప్రాక్పశ్చిమ దేశములలోగల తన బిడ్డల నందరికి నుపకరించునట్లు దీర్ఘాయురారోగ్య, విజయ సంపదలతో నాశ్రమము నాశీర్వదించుగాక !

సర్వేషాం శాంతి ర్భవతు!

ఓం ఓం ఓం.

# మృత్యువునకు స్వాగతము !

ఈ మధ్యను నేనొక పుస్తకములో ఒక చిన్న మహావాక్యమును చదివియుంటిని. నాకు పనికివచ్చెడి ఈ మహావాక్యము బాణము. గురిపెట్టిన వస్తువును గ్రుచ్చుకొనునట్లు, నా హృదయమునకు గ్రుచ్చుకొనినది. ఈ దిగువ మహావాక్యమును నేడు మీ అందరి ఉపయోగార్థమై వ్రాయుచుంటిని.

**Write on it only that which seen can be read by a million people.**

కోటిజనులు చదువగలిగినది మాత్రమే వ్రాయుము.

అనగా, ఏదైనను వ్రాసినపుడు, కోటిమంది జనులకైనను ఉపయోగించవలెనట. జనులకు ఉపయోగించని మాటలను వ్రాయువారు అటుల చేయకుండుటే మేలు. మౌనముగా నుండుట ఇంకను మంచిది. ఉపయోగించని వ్రాతలవలన లాభముండదు. పనికిరాని వ్రాతలు వ్రాయువారికి, చదువువారికికూడ కాలయాపనయే గదా!

ఇది మనము మాట్లాడెడి మాటలకు గూడ వర్తించును. మనము కోటిమందికి పనికివచ్చెడి మాటలే మాట్లాడవలెను. లేకున్న మౌనముగా యుండుట చాల మంచిది. పనికిరాని మాటలు, పొల్లుమాటలు మాట్లాడుచు, మన అమూల్యమగు కాలమును, ఇతరుల కాలమునుకూడ వ్యర్థబుచ్చరాదు.

నేనిప్పుడు వ్రాయబోయెడిది కోటిమందికేగాక, మానవకోటి కంతకును ఉపయోగించుననే నా నమ్మకము. మానవకోటికంతకును గాకున్నను ఆశ్రమ భక్తులకును, ధర్మప్రియులై, నన్ను ప్రేమించుచు, నా ఆధ్యాత్మిక సందేశములను ప్రేమతో ఆదరించుచున్న వారికైనను ఉపయోగించిన నేను వ్యర్థముగా వ్రాయలేదని ఆనందించెను.

నేను వ్రాయబోయెడిది మీలోకొందరకు విపరీతముగ తోచవచ్చును.

పై శీర్షికయే అనగా దానిపేరు మాత్రమే కొందరకు భీతిని గలిగించవచ్చును. గాని అది మీకును, నాకును, అందరకును చాల ఉపయోగించెడి ముఖ్యమైన విషయము.

## మృత్యువునకు స్వాగతము

దీనినే నేడు, ఆశ్రమవాసులతోను, భక్తులతోను పంచుకొనుటకు కోరుచుంటిని. మృత్యువు యెవ్వరినీ విడువదుగదా! మృత్యువు నిరుపేదలకు, ధనవంతులకు, చక్రవర్తులకు, వైద్యులకు, అజ్ఞానులకు, జ్ఞానులకు, దుర్బలులకు, బలవంతులకు, చిన్నవారికి, పెద్దవారికి, నాస్తికులకు, ఆస్తికులకు, అందరకూ యెప్పుడో ఒకప్పుడు వచ్చియేతీరునుగాన, ఈ దిగువ పద్యములలో చెప్పిన చక్కని మహద్విషయములను సదా స్మరించుచు శ్రీ పరమేశ్వరుని పాదారవిందములపై ధ్యానమును విడువక, జీవయాత్ర గడుపవలెను.

శా. దంతంబు ల్పడనప్పుడే తనువునం దారూఢి యున్నప్పుడే
కాంతాసంఘము రోయనప్పుడె జరా క్రాంతంబు గానప్పుడే
వింత ల్మేనఁ జరింపనప్పుడె కురు ల్వెల్వెల్ల గానప్పుడే
చింతింపన్వలె నీ పదాంబుజములన్ శ్రీ కాళహస్తీశ్వరా !

ఉ. ముప్పునఁ గాలకింకరులు ముంగిట వచ్చినవేళ రోగముల్
గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండినవేళ బాంధవుల్
గప్పిన వేళ మీ స్మరణ కల్గునొ కల్గదొ నాఁటి కిప్పుడే
తప్పకచేతు మీ భజన దాశరథీ కరుణాపయోనిధీ !

కావున, దీపముండగనె అది ఆరిపోకముందే తమ గృహములను తమ జీవితములను, చక్కబెట్టుకొనువారే అదృష్టవంతులు. మృత్యువును మనలను హఠాత్తుగా తీసుకొనిపోనీయరాదు. అది మనమెంత తొందర పనిలో యున్నప్పుడొచ్చినను ఏ సమయములో వచ్చినను దానికై మనము సదా సిద్ధపడి

యుండవలెను. మృత్యువు మన మేయవస్థలో నున్నప్పుడు వచ్చినను, దానికి స్వాగతమిచ్చుటకు మనమిప్పటి నుండియు, స్వార్థరహితమైన నిర్మలమైన జీవితములతో, శ్రీ పరమేశ్వరానుగ్రహము సంపాదించుకొని, ధైర్యముగ సంసిద్ధులమై యుండవలెను.

గాని, వాచాగా ఆత్మకు మృత్యువు లేదనియు, శరీరము బట్టవంటి దనియు చనిపోయిన, మనము మన పాత బట్టలను మార్చినట్లు, శరీరములను మార్చుచుంటి మనియు, చావు అనగా ఒక గదిలో నుండి మరొక గదిలోనికి వెళ్ళుటమాదిరియే యనియు చాలామంది వేదాంతమును అనేక విధములుగ బోధించుచున్నను, స్వానుభవమునకు వచ్చునప్పుడు భయపడుచుందుము.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥

"పాంతబట్టల నెల్లను బాఱవైచి
క్రొత్తవానిని ధరియించు కొనెడునట్లు
దేహి జీర్ణించియున్నట్టి దేహములను
వీడి తాఁగ్రత్తలౌ వాని గూడుచుండు."

అనేకమైన అవస్థలలో చిక్కుపడి, ఆత్మహత్య జేసుకొన్న సుఖపడుదుమని తలచెడివారికిగూడ, కాలము సమీపించినప్పుడు మృత్యువు అనిన, కాళ్లు చేతులు వణకుచు, ముచ్చెమటలు పట్టుచు, చాల భయపడుచు ఎట్లు తప్పించుకొందుమా యని విశ్వప్రయత్నములు చేయుచుందురు. ఎవ్వరికిని చనిపోవుటకు, ఎప్పుడునూ యిష్టముండదుగదా !

శా॥ చావం గాలము చేరువౌ టెఱిఁగియుం బాలింపఁగాలేక త
న్నే వైద్యుండు చికిత్సఁ బ్రోవఁగలఁడో యే మందు రక్షించునో
యే వేల్పుల్ కృపఁ జూతురో యనుచు ని న్నింతైనఁ జింతింపఁ డా
జీవ చ్ఛ్రాద్ధముఁ జేసికొన్న యతియున్ శ్రీ కాళహస్తీశ్వరా !

అందరూ బ్రతుకుటకే, స్వాగత మిచ్చుచుందురు గాన మృత్యువునకు స్వాగత మిచ్చెడివారు. కోటికి ఒక్కరిద్దరు మహనీయులు మాత్రముండవచ్చును. మృత్యువునకు, స్వాగత మిచ్చుటకు, మనము సిద్ధముగా లేకున్ననను, అది మనల నెవ్వరినీ విడువదని మన మందరమూ ఎరింగియున్నదే.

శ్లో॥ జాతస్యహి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ
తస్మా దపరిహార్యార్థే నత్వం శోచితు మర్హ సి ॥

"జన్మమెత్తిన వాఁడెల్ల జచ్చితీఱు గిట్టువాఁడెల్ల మరలను బుట్టితీఱు నిట్టి తప్పని విషయందిట్లు నీవు పార్థ! వగచుచుండుట పాడిగాదు."

మృత్యువు యేరోజున, ఏ క్షణమందు, ఎచ్చట, ఏవిధముగ, మనలను నోటబెట్టుకొనునోగూడ మనకు తెలియదుగాన, ఏ క్షణమునకు ఆ క్షణమే, మన అమూల్యమగు మానవ జీవితములను, నిత్యమూ చక్కబెట్టుకొనుచు, సిద్ధముగా నుండి, మృత్యువునకు స్వాగత మివ్వగలిగినప్పుడే మన జీవితములు ధన్యవంతములై యుండును.

సదా మృత్యువునకు గురియగు మన శరీరమును గురించి మన పూర్వీకులు, అనుభవము కలిగిన ఆత్మవిదులు నుడివిన ప్రబోధవాక్యములను ఎల్లప్పుడు మనమందరము అనుసరించవలసియున్నది.

శ్లో॥ ఇదం శరీరం పరిణామ పేశలమ్
పత త్యవశ్యం శతసంధి జర్జరమ్
కి మౌషధైః క్లి శ్యసి మూఢ దుర్మతే?
నిరామయం కృష్ణరసాయనం పిబ !

ఉ॥ నాడులు స్మథులున్ నెడలి । నాటికి నాఁటికినిన్ గృశించి, యే
నాఁడొ నశించు నీ తనువు । నమ్మకు; మౌషధ సేవనమ్ముచేఁ
బాడపోయిపోకు దుర్మతి ! యపాయములేని యుపాయమిద్ది, యే
కీడును మూఁడనీయగాదల । కృష్ణ రసాయనమూను మూఢుఁడా.

ముఖ్యముగా మనమిప్పుడు తెలిసికొని సదా జ్ఞాపకముంచుకొనవలసిన విషయము, మృత్యువునకు స్వాగతమిచ్చుట యెటులయని?

శరీర జ్ఞప్తితో నిండియున్నవారు, మృత్యువు పేరుజెప్పిన, చాల భయపడుదురు. ఆత్మజ్ఞప్తితో నిండియున్నవారు, మృత్యువును జూచి నవ్వెదరు. స్థిరమైన అచంచలమైన జ్ఞానముతో కూడిన భక్తియనే పడవను యెక్కిన, మృత్యువులేని తావునకు అది తీసుకొనిపోవును. జ్ఞాన తేజముచే మృత్యువును, అనుభవముతోకూడిన బ్రహ్మవిదులు దూరము జేయుదురు.

వ్యాయామము చేయువారు, అందరినీ వస్తాదులనుగా, బలాఢ్యులనుగా, చేయుటకు కోరుదురు. యోగులు యోగక్రియలను నేర్పుచు అందరినీ యోగులుగ తయారుచేయుదురు. భక్తులైనవారు అందరిచే కృష్ణ రసాయనమును పావనము చేయించి అందరినీ భక్తులనుగా జేయుటకు ప్రయత్నింతురు. జ్ఞానులు అద్వైతామృతమును వెదజల్లుచు, అందరినీ జ్ఞానులనుగాజేయుటకు యత్నింతురు. అటులనే మృత్యువునకు సదా ఆహ్వాన మివ్వగలిగినవారిని, దానిని జూచి ధైర్యముగ నవ్వగలిగినవారిని, "మృత్యువునకు స్వాగతము!" అని పలుక గలిగిన ఏ కొలదిమంది ధీరులనైనను సిద్ధము చేయుటకు, నా మనస్సు ఆశించుచున్నది.

ఈ ప్రపంచములోని మానవులందరిని ఉద్దేశించి, వెనుక శ్రీకులశేఖర ఆళ్వారులు ఎట్లు చెప్పిరో వినుడు !

మ॥ వినుఁడో మానవులార ! జన్మమృతుల న్బెన్వ్యాధిఁ ద్రుంపం జికి
త్సను యోగజ్ఞులు యాజ్ఞవల్క్యముఖులే సాధించి బోధించినా
రనఘంబేక మమేయ మాంతరమహంబౌ కృష్ణనామామృత
మ్మును గ్రోలుండు మహౌషధమ్మది యిడుం బో భూరినిర్వాణమున్ ॥

మ॥ అమలంబౌ హిత మింత వల్కెద వినుం డజ్ఞానముం బాసి, దు
ర్గమ సంసారసముద్ర విప్లవ తరంగశ్రేణిఁ దప్పించు తం
త్రము, నోంకారముతోడఁగూడిన నమో నారాయణాయేతి మం
త్రముఁ జింతింపుఁడు మర్త్యులార! మది నంతశ్శ్లోకముల్వ్యాయగన్॥

ఎవ్వరి జీవితములనువారు ఎవ్వరి హృదయములనువారు అతి జాగ్రత్తగా పరీక్షించుకొని, మృత్యువు యీక్షణమందే వచ్చిన, తాను సిద్ధముగా యున్నది లేనిది విమర్శించుకొనవలెను. ఒక పాము కరచిన మృత్యువు రావచ్చును. ఆహార విహారములు మామూలుగా జేయుచున్నను, హృదయ చలనము హఠాత్తుగా ఆగిపోయికూడా మృత్యువు రావచ్చును. అది మనతో జెప్పిరాదుగదా! అది యెప్పుడైనను, ఏవిధముగనైనను రావచ్చును. మనకందరకు బాగుగ తెలిసిన నృశింహ శతకములో యీ విషయము ఎట్లు చక్కగ వ్రాయబడినదో చూడుడు;

సీ॥ పాంచభౌతికము దుర్భలమైన
కాయం బి దెప్పుడో విడుచుట యెఱుక లేదు
శతవర్షములదాక మితము జెప్పిరి గాని
నమ్మరా దా మాట నెమ్మనమున
బాల్యమందొ మంచి ప్రాయమందొ లేక
ముదిమియందో లేక ముసలియందొ
యూరనో యడవినో యుదకమధ్యముననో
యెప్పుడో విడుచుట యే క్షణంబొ
మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన
దేహ మున్నంతలో మిమ్ము దెలియవలయు
భూషణవికాస శ్రీధర్మ పురనివాస
దుష్ట సంహార నరసింహ దురితదూర.

నా జీవితము, ఈనలుబది సంవత్సరములనుండియు, ఈ ఆశ్రమములు, మానవకోటి శాంతిని కోరుచు, స్థాపింపబడి యున్నందున, ఈ ఆశ్రమములు, వాటి ఆస్తులు, స్థిరముగా నుండెడివరకు నేను మృత్యువునకు స్వాగతము నిస్సందేహముగా యివ్వజాలనేమోఅని తలంచుచుండెడివాడను. దైవకృపచే ఇటీవల ఆశ్రమాభిమానులైన కొందరు భక్తవరేణ్యులకు, ఆశ్రమములన్నియు వప్పజెప్పి వారిమీద బాధ్యత ఉంచినప్పటినుండియు నే నింక వెనుకటివలె చేయవలసిన ఆశ్రమపనిగూడ యెద్దియు లేదు. మృత్యువు ఏ క్షణమున వచ్చినను రావచ్చునని ఆనందముగా నుంటిని. మీ జీవితములను గూడ పరీక్షించుకొని చూచుకొనుటకై నా జీవితమునుండి, స్వానుభవముతో ఒక దృష్టాంతమును జెప్పియుంటిని. కొన్ని సమయములందు, స్వంత విషయములనుగురించి, మన జీవితములో స్వానుభవము నుండి ఉదాహరణలను జెప్పినప్పుడే, ఇతరులకు గూడ ఆచరణ యోగ్యముగా నుండి ఉపయోగించును.

నా చిన్నతనములోనే యీ క్రింది పద్యమును, అష్టావక్రగీత నుండి పఠించి దాని గూఢమైన భావమును అప్పటిలో అంతగా గ్రహించజాలకున్నను తరుచు చదువుచుండెడివాడను. సంవత్సరములు గడచినకొలదిని, యీ చిన్న పద్యమునందున్న గాంభీర్యమైన భావన, నాకెంతయో ఆనందము నిచ్చుచు నన్ను శరీర భావమునుండి వేరుజేయుచుండును.

గీ॥ కల్ప పర్యంత ముండుగాక! దేహ మిప్పుడే పోవుగాక! యిం దేమిహాని
వృద్ధి నాశనములులేక వెలుగుచుండెడి చిన్మాత్ర నేను !

పరమభాగవతోత్తములైన ప్రహ్లాదాది భక్తవరేణ్యులను, మృత్యువు యెన్ని పరీక్షలలో, యెన్ని అవస్థలలో సమీపించినను, అది ఏమియు చేయలేక పోయెనుగదా! బ్రహ్మజ్ఞానశక్తి ఎంత అశ్చర్యకరము! లోక ప్రఖ్యాతిగాంచిన, అస్ఖలిత బ్రహ్మచారి శ్రీ భీష్మాచార్యులవారు, మృత్యువును తన యిష్టము

వచ్చినపుడు ఆహ్వానించగల శక్తిగలిగి యుండుట, మీరందరు ఎరిగియున్న గొప్ప విషయమేగదా! శ్రీ మార్కండేయులు చిననాటనే చనిపోవలసియున్నను, అతడు మనస్సును సంపూర్తిగ శివునకు అర్పించి, శివలింగమును ఆలింగనము చేసుకొనుటచే, యమధర్మరాజు కూడ ఏమియు చేయలేకపోయెను గదా! మానవునకు, తగిన సాధనచేసిన, ఏది సాధ్యముకాదు?

అట్టి మహాజ్ఞానులు, మహాభక్తులు, మృత్యువును ధిక్కరించినట్లు, మనము చేయలేకపోయినను, మృత్యువు ఆసన్నమైనప్పుడు, నిర్మల హృదయముతో నిర్భయముగ, నిశ్చింతతో శ్రీపరమేశ్వర పాదారవిందముల యందే మనస్సును లగ్నముచేసి, ఆహ్వానించ గలిగిన శక్తినైన గలిగి యుండుట, మానవ జీవిత కర్తవ్యము.

మన శరీరములే శివలింగమును కలిగిన దేవాలయములు గాన వాటిని ఎంత జాగ్రత్తగా, ఎంత పవిత్రముగా, సదా కాపాడవలసి యుండును? ఈ దేహమందే సూత్రాత్మయనెడు శ్వాస, నిత్యమై, స్థిరమై, పరిపూర్ణమై "సోఽహం" అనుచు ప్రతిజీవిలో అహర్నిశము ఆడుచుండుట గమనించవలెను.

### సోఽహమస్మి

ఆ సూత్రాత్మ నొక్కదానిని మాత్రమే, ఏరోగము, ఏ అంధకారము, ఏ మార్పు, ఏ మృత్యువుగూడ అంటజాలదు. నిజముగ ఆ సూత్రాత్మయే మన మని తెలిసికొనుట మన జన్మహక్కు గాన, భక్తులైనవారు ప్రతిశ్వాసతో రామనామమును గాని లేక వారి ఇష్టదైవనామమునుగాని స్మరించుచు తరించవచ్చును. జ్ఞానులైనవారు "సోఽహమస్మి" అనెడి సోహంభావనతో నిండి మృత్యువునకు ఆనందముతో స్వాగతమీయ సంసిద్ధులై యుండెదరు గాక !

**Welcome to death which is only a change !** మార్పు మాత్రమగు మృత్యువునకు స్వాగతము ! పవిత్రమైన శ్రీ భగవద్గీతలోని ఈ దిగువ శ్లోకములను తరచు, వాటి అర్థముతో బాగుగ గ్రహించి, జీర్ణము చేసుకొన్న యీ ప్రపంచములో, నిర్విచారముగ నుండగలము.

శ్లో॥ నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
నచైనం క్లేదయం న్త్యాపో న శోషయతి మారుతః ॥
శస్త్ర మాత్మను ఖండింపఁ జాలకుండు
జ్వలనుఁ డాత్మను గాల్పంగఁ జాలకుండు
గాలి యాత్మను నెండింప జాలకుండు,
జలము లాత్మను దడుపంగఁ జాలకుండు.

శ్లో॥ అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయ మక్లేద్యో శోష్య ఏవచ
నిత్యః సర్వగతః స్థాణు రచలోఽయం సనాతనః ॥
"నాన దెండదు కాలదు నఱుకబడదు
సర్వమునఁ బర్వియుండు నాశనముగనదు
అచల మీ యాత్మ మఱియు ననాది సుమ్ము
ఒక్క విధమున నెప్పుడు నొప్పుచుండు.

శ్లో॥ అవ్యక్తోఽయ మచిన్త్యోఽయ మవికార్యోఽయముచ్యతే
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥
జ్ఞాన కర్మేంద్రియములకు గానరాక
మనసునకుఁగూడ జిక్కక తనరుచుండు
ననుచు శ్రుతులందుఁ జెప్ప నీ యాత్మ నెఱిగి
పార్థ! వగవక యుండుట పాడి సుమ్ము.

శా॥ "నేనే చేయుదు, నే భుజింతు ఫలమున్, నే దుష్టుడన్, మత్తుడన్
నే నజ్ఞుండను, నేను కట్టబడితిన్; నే ముక్తుడన్; లెస్సగా
నే నున్నానను నిట్టివెల్ల మతిలోనే పుట్టు దోషంబు లా
హా ! నిక్కంబుగ లే వొకండనగు బ్రహ్మంబైన నా కేవియున్!"

గీ॥ "పదులు నూర్లు వేలు ప్రకృతి వికారంబు లుండుగాక, యెన్నియున్న నెదియు
నంటకుందు తెల్వినై యుందు నా కేమి? మేఘ మంటగలదె మింటిఁ దొడరి."

ఉ॥ ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకుఁ జావు నిత్య మౌఁ
గాన హరిం దలంపు మిఁకఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్ ॥

ఆశ్రమవాసులకు, ఆశ్రమ భక్తులకు ప్రేమపూర్వకమైన అర్పణ.

ఓం సర్వేషాం స్వస్తి ర్భవతు
ఓం సర్వేషాం శాంతి ర్భవతు
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం సర్వేషాం మంగళం భవతు ॥

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# ఇటికలు

శ్రీ రాజాజీ "లక్ష్మీవిల్లా" లో పాడైన కాలువలు పని తాపీమేస్త్రిలచే జేయించుచుండిరి. ఇటికలు అయిపోవచ్చినవి. ఇంకను కొంత పని మిగిలియున్నది. వెంటనే, మరికొన్ని ఇటికలు కావలసి వచ్చెను. నేను జ్ఞాన తపోవనమునకు మెట్లు దిగి క్రిందకు సెలయేరువైపునకు వెళ్లుచుంటిని. ఈ మనస్సు సదా ఏదైనను శాశ్వతమైన పనిని, ఇతరులకు, శాంతిని, ఆనందమును, నూతనశక్తిని కూర్చు పనులను జేయవలెనని కోరుచుందును.

జ్ఞానతపోవనము యీ మధ్యనే తుప్పలు, రాళ్లు, మిట్టపల్లములుయున్న కొండలోయలో ప్రారంభించబడెను. దగ్గరనుండియు దూరమునుండియు వచ్చెడి ఆశ్రమ భక్తులకు ఏకాంతముగా, నిర్జన ప్రదేశములో ధ్యానము జేసుకొని వృద్ధిచెందుటకు జ్ఞానతపోవన మేర్పర్చబడెను. అచ్చటనే చిన్న సెలయేరు గలదు. దాని, నిరంతర ప్రవాహశబ్దమును వినుచు, మనధ్యానమును గూడ తెంపులేని ప్రవాహమువలె, తైలధారవలె ఏకాగ్రతగా జేసుకొనుటకు అచ్చట ఎంతయో సహకారిగా నుండును.

అచ్చట పక్షులు స్వేచ్ఛగా, ఆనందముగా గానము జేయుచుండును. ముఖ్యముగా ప్రాతఃకాలముననే వాటిగానమును వినుచుండ, అవి ఆనందముగా ఉదయపు ప్రార్థనలు దైవమునకు అర్పించుచున్నట్లుండును. అచ్చట రెండు పెద్ద సంపెంగవృక్షములున్నవి. అవి యీ ప్రాంతములలో నుండవు. వాటిని దానపల్లి రాణీగారు సింహాచలము నుండి తెచ్చి లక్ష్మీవిల్లాలో వేసియుండవచ్చునని తలంచితిని. మేము రాకముందు చెట్లకు సంరక్షణ లేకుండగా, ఆ పువ్వులన్నియు అందరును కోసివేయుచుండిరి. ఇరువది సంవత్సరముల నుండి పోషణలేని చెట్లుగూడ, మేము వచ్చినప్పటి నుండియు వాటిని మేము ప్రేమించుచు, సంరక్షణ జేయుచుండుటచే అవి కూడ నవనవలాడుచు, కృతజ్ఞతతో, మావైపు జూచుచున్నట్లుండును. ప్రవృత్తిపరులైన

మానవులకు మేమింకను అంత ఉపయోగముగా యుండజాలకున్నను, యీ చెట్లు చామలకైనను, లక్ష్మీవిల్లాలో మా నివాసము ఉపయోగముగా సహకారిగా నున్నందుకు, నా మనస్సెంతయు వాటిని జూచినపుడెల్లను ఆనందించుచుండును. ప్రతి పుష్పము దైవము కొరకే వికసించుచు, దైవమునకే పూజజేయుచున్నట్లుండును.

ఇప్పుడు మనము ఇటికల గురించి విమర్శించవలెను, జ్ఞానతపోవనములో ప్రవేశించుటకు రెండువైపులను చీడీలు యేర్పరచుచూ, మట్టిలో త్రవ్వుచు, చీడీలకు రెండువైపులను అచ్చటచ్చట పూల మొక్కలను వేయుటకు చిన్నచిన్న సర్కిల్సు రౌండుగాను ముక్కోణములుగాను ఆనవాలు పెట్టుచు తవ్వుచుంటిమి. ఒక్కచోట నాలుగు పేరీ పండ్ల చెట్లు ఉన్నందున అచ్చట నీడగా నుండుటచే వాటినీడలో ధ్యానము జేయుటకు బాగుండునని అచ్చట బాగుచేయించడమాయెను. దాని యెదురుగా గూడ ఆనందమునకు, ఏ మొక్కలైనను వేయవలెనని తవ్వించితిమి.

నిన్నటి ఉదయము ఆ దారిని వెళ్ళుచుండగ, ఆ త్రవ్విన దానిలో యేదో యెఱ్ఱగా కనిపించెను. దగ్గరకు వెళ్ళి నా చేతికఱ్ఱతో బయలుజేయగా ఇటికవలె గానవచ్చెను. ఒక్క ఇటికను, మొదటి ఇటికను నేనే తీస్తిని, తరువాతను చంటిని, బాలకృష్ణను పిలువగా రెండవ ఇటికను, మూడు, నాలుగు, ఐదవ ఇటికలను వారు తీయుట ప్రారంభించిరి. అప్పుడు తోటమాలి రామస్వామిని పిలువగా అతడు ఇంకను భూమిని నలువైపులా తవ్వి గారడీవాడు తన గారడి వస్తువులను ఒకటి తర్వాత మరొకటి తన సంచినుండి తీయునట్లు, మా రామస్వామి ఇటిక తర్వాత ఇటికను మేము ఆశ్చర్యము పడుచుండ, వందలాది ఇటికలను, గట్టి ఇటికలను, కొత్తవిగా మెరయుచున్న వాటిన తీయసాగెను. అప్పుడు పని ఆగిపోకుండగా తాపీమేస్త్రులు కొన్ని ఇటికలను తీసుకొని వెళ్ళి వారి కాలవల పనిని పూర్తి చేయసాగిరి.

ఈ విచిత్రమైన సంఘటన అంతయు సామాన్యమైనదిగా ఇతరులకు తోచినను, ఆరోజుననే ఇటికలు లేక పని ఆగిపోవ నున్నప్పుడే ఆ ఇటికలు కనిపిచనేల? ఆరోజుననే ఆ దారిని నేను వెళ్ళనేల? ఆ తావులోనే అప్పుడు అచ్చట ఎర్రగా మెరియుచు నా కేల గానవచ్చెను? అప్పుడేల దానిని పరిశీలించి త్రవ్వితిని ? అందు నుండి వందలాది ఇటికెలు రానేల ? ఇందు విచిత్రము, ఆశ్చర్యము గూడ ఏమియు లేకపోవచ్చును. పూర్వము యెప్పుడో మనము జన్మించినప్పుడు ఏ నీళ్ళకుండియో కట్టి యుండవచ్చును. అది కాలము గడచిన కొలదియు మట్టిచే కప్పబడి యుండవచ్చును. కుండీ ఆకారము గూడ బాహ్యమునకు గాన వచ్చుట లేదు.

ఇటులనే భూమిలో ఏ తావులో ఏది ఉండునో మానవమాత్రులకు అగ్రాహ్యముగదా! మా చంటి ఇటుకల క్రింద యేమైన ధనరాసి పాతి ఉండునేమో అని ఇంకను ఉత్సాహముతో ఇటికెలు బయలుచేయనారంభించెను. ఏపాతు ఏగని యెచ్చటెచ్చట యున్నవో మనకు తెలియదుగదా! నాకు అల్పముగా తోచుచున్న యీ చిన్న సంఘటనవల్ల గలిగిన అనుభవము, వర్ణనాతీతము, దైవకృపయొక్క మహత్యము, దైవమును నమ్మినవారికి అర్హత గలిగినవారికి అవసరములో మట్టి యిటికలేగాక, బంగారు ఇటికలు గూడ అప్రయత్నముగా అర్పించబడును. బంగారు యిటికలకన్న నాకు చిన్నతనములో చదువుకొన్న చిన్నకథ జ్ఞప్తికి వచ్చుచున్నది.

అట్లాంటా, అను నామె గ్రీసు దేశస్తురాలు, సౌందర్యవతి, ధనవంతురాలు, ఆమె చాల వేగముగా పరుగెత్తగలదట. ఆమెను పరుగెత్తుటలో గెల్చినవారినే పెండ్లియాడుదునని శపథము జేసెను. ఎంతోమంది వీరులామెతో పరుగెత్తజాలక ఓడిపోవుచుండిరి. ఒక వీరుడు తన దేవత నారాధించి ఆమె సలహాపై అట్లాంటాతో పందెము వేసెను. తాను పరుగెత్తనున్న దారి నచ్చటచ్చట బంగారు ఇటికలతో నింపెను. అనగా ఇటికలను దారిలో ఉంచెను. ఇద్దరును

పందెము ప్రారంభించినారు. అట్లాంటాకు బంగారు ఇటికలను చూడగానే ఆమె మనస్సు వాటిపై పడెను. బంగారమున్న తీపుండనివారుందురా? ఒక్కొక్క ఇటికనే యేరుకొనుచు, తన ఒడిలో వేయనారంభించెను. బంగారముతో ఒడి బరువెక్కుచున్నందున సరిగా పరుగెత్తజాలకుండెను. తనతో పందెము వేసిన వీరుడు ముందుగా పోవుచుండెను. చివరకు బంగారపు బరువుచే అట్లాంటా ఓడిపోయెను. ఆశ యెట్టివారినైననూ బంధించును గదా! "ఆశారహితులదే మోక్షము". ఆశ కలవారిని బంగారు ఇటికలైనను మట్టి యిటికలైనను బంధించును. ఆశ లేనివారికి బంగారమైనను, మట్టియైనను సమమే! స్వార్థరహితమైన సేవ జేయగలిగిన మహనీయుల జీవితములే ధన్యవంతమైనవి. మానవసేవయే దైవసేవయని భావించి, వ్యక్తిశాంతిని విశ్వశాంతిని గోరుచు లోకకళ్యాణమునకు పాటుబడుచుండ మట్టియిటుకలేగాక, వెండి యిటికలు, బంగారు యిటుకలుగూడ ఆశ్రమవృద్ధికై అవసరమగును. ఇప్పుడు లక్ష్మీవిల్లాలో నెలకు మూడువందల రూపాయలవరకు ఇచ్చట నుండెడి ఆశ్రమవాసులు, తోటమాలి రామస్వామి, పనికత్తె రాజమ్మ వగైరాల జీతములకు తదితర ఖర్చులకు ప్రతీనెలా కర్చు అగుచుండెను. ఇదివరకు ఇచ్చటనున్న భక్తులలో శ్రీ భోజను అనే ఆయన ప్రతీనెలా 5 రూపాయలు పంపుచు తోడ్పడుచుండెను, ఇప్పుడు విశ్వమతజ్యోతి ప్రార్థనాలయమునకు శ్రీమతి లలితాదేవి శంఖుస్థాపన చేసెను. అది పూర్తి అగుటకు ఇరువదియైదువేల రూ వ్యయములైనను కావలయును. ప్రార్థనాలయములో ప్రతిష్ఠించుటకు విశ్వమత చిహ్నము **(Neon Signs)** రంగురంగుల విద్యుచ్ఛక్తి **(Electric)** దీపములతో బెంగుళూరులో నొక భక్తుడు తయారుచేయుచున్నాడు. త్వరలో రాగలడు. దక్షిణదేశములో ప్రసిద్ధికెక్కిన పళని **(Palani)** అనెడి పుణ్యతీర్థములో 2 అడుగుల ఎత్తుగలిగిన ప్రణవాక్షరమును అరవములో **(Neon Signs)** లో యేర్పర్చినది శ్రీ గోవిందరావు అనే భక్తుడే, మన లక్ష్మీవిల్లా శాంతి కేంద్రమునకు యీ విశ్వమత చిహ్నమును, భక్తిశ్రద్ధలతో

తన శక్తి కొలది తోడ్పడుచు. ఆశ్రమమునకు అర్పించుచుండెను. సర్వాంతర్యామి, సర్వజ్ఞుండైన ఏదైవము లక్ష్మీవిల్లాలో చిన్న కాలువలపని ఆగిపోకుండగ మట్టి ఇటికల నిచ్చెనో ఏ దైవము విశ్వమతజ్యోతి ప్రార్థనాలయమునకు విశ్వమత చిహ్నము నిచ్చెనో, కరుణామయుండైన, సర్వశక్తుడు, సర్వవ్యాపియైన ఆ దైవమే బంగారు ఇటికలు కలిగిన తన బిడ్డలయొక్క హృదయములను స్పృశించి త్వరలో యీ నూతన ప్రార్థనాలయమును గూడ సునాయాసముగా అప్రయత్నముగా పూర్తిజేయునని నా దృఢమైన నమ్మకము. అయినను మనము జేయవలసిన ప్రయత్నము శక్తికొలది జేయవలసియున్నదిగదా! దైవము మీద అనుకొని, దైవసన్నిధి ననుభవించుచు, పురుష ప్రయత్నము చేయుట ముఖ్యావసరమే !

## DESERVE, NO NEED OF DESIRING

"అర్హత కలిగి యుండుము. కోరనవసరము లేదు."

అర్హత లేనప్పుడు ఎంతకోరినా, ఎంత ప్రార్థించినా లాభముండదు గదా! నిష్కాములదే, ఆశారహితులదే యీ లోకములో నున్న ధనమంతయు, ధనమేగాదు స్వర్గము, మోక్షము గూడ ఆశలేనివారిదే !

ప్రియమైన శాంతి పాఠకులారా ! "జ్ఞాన తపోవనమునకు," మీ కందరకూ ఆహ్వానము, జ్ఞానమును వృద్ధి జేయునది, జ్ఞానవృద్ధికి తోడ్పడునదే యీ తపోవనము. దీని పేరు తలచినంత మాత్రమున శరీరము, మనస్సు హృదయము, సర్వమును, దుర్లభమైన మానవజన్మకు గమ్యమైన విజ్ఞానముతో నిండియుండును. నీలగిరికి రాకముందు తోటపల్లిలో గూడ పర్వతశ్రేణుల సామీప్యమున, "సోऽహం తపోవనమును" యేర్పర్చుట నా కెంతయో ఆనందము గూర్చినది. ఆ తపోవనము, సోऽహం ధ్యానము జేయు సాధకులకు చాల సహకారిగా ఉండును. వ్యయప్రయాసలకు ఓర్చి చాల దూరమున నున్న నీలగిరి లక్ష్మీ కేంద్రమునకు రాజాలనివారు. తోటపల్లి శాంతి

ఆశ్రమమును దర్శించి అచ్చట “సోఽహం తపోవనము” లో ప్రార్థన, ధ్యానాదులు, తపస్సు చేసికొని తరించవచ్చును. దైవ పరితాపనతో నిండియున్న సాధకులకు తరించుటకు ఎన్నో ఆశ్రమములు, పుణ్యతీర్థములు, నిర్జన ప్రదేశములు గలవు. ఆశ్రమములకు, ఏకాంతమైన, ప్రశాంతమైన తావులకు ఎంత మాత్రము లోటు కొదువ లేదు. కాని లోటు అంతయు మనలోనే యున్నది. కొదువ అంతయు మనదే ! ఏలనన, యీ మనస్సు ఎన్ని అవస్థలు, పరీక్షలు వచ్చుచున్నను, నివృత్తిగా దైవపరితాపనతో నిండియుండుటకు బదులు, నిరంతరము ప్రవృత్తితో నామరూపముల వెంటనే, బాహ్యమున తిరుగుచు, పరుగెత్తుచుండును. ఆహా ! ఇదియేగదా మాయ ! మాయను జయించిన దురంధరులకు మహనీయులకు ధన్యవాదములు. జ్ఞానతపోవనములో ఇటికలు దొరికిన తావు చెంతనే ఒక ఫల వృక్షమునకు **Omnipotence is working let the mortal retire** సర్వశక్తి పనిజేయుచున్నది. జీవుని విశ్రమింపనిమ్ము అని ఒక మహావాక్యము **Motto** వ్రాయబడి వ్రేలాడు చున్నది.

ఆహా ! జీవుడు విశ్రమించినప్పుడే శాశ్వతమైన శాంతిని పొందుచుండును. ఎంత కాలము జీవభావన, అహంకారముండునో అంతవరకు తాపత్రయము, చింతలు, అవస్థలు ఎవ్వరికైనను తప్పవు. ఈ దైవచట్టమే గృహస్థులకు, సన్యాసులకు, భోగులకు, రోగులకు, ధనవంతులకు, నిరుపేదలకు అందరకూ గూడ సమముగా వర్తించుచున్నది గదా !

ఓ సచ్చిదానంద స్వరూపా ! కోటిసూర్య తేజస్వరూపమైన నీ అఖండ తేజస్సు ముందు ఈ అల్పమైన వ్రాతలు, భావనలు, పసిబిడ్డల యొక్క వచ్చీరాని పలుకుల వంటివి గదా ! ఈ చిన్న మాటలకు వ్రాతలకు భావనలకు గూడ నీవే ఆధారము గదా !

ఓ ప్రభూ ! నీవు పెద్దవారు, చిన్నవారు, పెద్దపని, చిన్నపని, అనెడి వివక్షత లేకుండ సర్వమునకు నీవే ఆధారమవుకదా ! పనికిమాలిన గడ్డిచే

గూడ సౌందర్యమైన చిన్న పూలు పూయించువాడవు. రాతిలో నున్న కప్పకు ఆహారము నిచ్చి పోషించువాడవు. అనాథ రక్షకుడవు దీన శరీరణ్యుడవు. దీన బాంధవుండవు. నీవేగదా !

మట్టి యిటికలకు, బంగారు యిటికలకు ఆధారమైన, కరుణాకరా ! ఓ సచ్చిదానందా నీ కివే ధన్యవాదములు, నీకు మరల, మరల ముందును, వెనుకను, మీదను, క్రిందను, చుట్టును అన్నివైపులను అంతర్యమునను, బాహ్యమునను, సర్వకాల సర్వావస్థలయందును ధన్యవాదములు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

హరి ఓం తత్ సత్ ఓం !

(లక్ష్మీవిల్లా శాంతి కేంద్రముయొక్క అభ్యున్నతి కొఱకై అంతర్యామియైన పరమాత్మ కిది భక్తిపూర్వకమైన కానుక.)

# నాగార్జునసాగర కాలువలు

ఎప్పటికేది జరుగవలసియుండునో అది జరుగుచుండును. అటులనే, ఏరోజుకు ఏది వ్రాయబడవలసియుండునో, అది వ్రాయబడుచుండును. ఏది వ్రాసినను, ఇతరుల కుపయోగించినచో అదియే నాకు ఆనందము. నేటి ఉదయము నాగార్జున కాలువలగురించి నా భావనలను, శాంతి పాఠకులతో, ఆశ్రమభక్తులతో పంచుకొనవలెననెడి సంకల్పముతో లేచితిని. చేయవలసిన పనులు వ్రాయవలసిన ఉత్తరములు మొదలైన వ్రాతలు చాలయున్నను, అనుభవింపవలసిన కర్మ అనగా, చేయవలసినపని తప్పదుగాన ప్రప్రథమముననే, ఈ వ్యాసము తెల్లవారుఝాముననే వ్రాయుటకు ప్రారంభించితిని.

నాగార్జున కాలువలు **(Chief Engineer)** పెద్ద ఇంజనీరు నరసింహారావుగారు, బాల్యమునందు వారితల్లి దండ్రులతో చాలరోజులు ఆశ్రమములో గడపుచుండెడివారు. వారి సోదరుడు హనుమంతరావు ఒక్కరూ రెండు సంవత్సరములు ఆశ్రమము గురుకులములో గడపెను. వారితల్లి దండ్రులు తునిలో ఆశ్రమ శాఖను గూడ స్థాపించి కొన్ని సంవత్సరములు భక్తసేవ హరిజనసేవ జేయుచుండెడివారు.

శ్రీనరసింహారావుగారు పెద్ద యింజనీయరై కృష్ణానది వంతెనను కట్టించుట గవర్నమెంటువారి మన్ననలను బడయుట, తరువాత దేశవృద్ధికి తోడ్పడెడి బ్రహ్మాండమైన **(North and South Canals)** ఉత్తరకాలవ, దక్షిణకాలువ అనెడి రెండు పెద్ద కాలువలను, నాగార్జున కాలువలకు కోట్లకొలది ధనమును వెచ్చించి నిర్మించుట చాలమందికి తెలిసియున్నదే. శ్రీ నరసింహారావుగారు వారి కుటుంబము, నా హృదయమునకు సన్నిహితులుగాన, వారి సోదరి చి॥ జయ నాగార్జునసాగరులో యుండుటచే ఆమె ఆహ్వానముపై నాగార్జున సాగరునకు క్రిందటి సంవత్సరము వెళ్ళుట అచ్చట రెండు ఉపన్యాసము లిచ్చుట భక్తులసేవజేయుట, ఇదివరకే శాంతి, పీసు పత్రికలలో

ప్రచురింపబడెను.

మేము నాగార్జునసాగరునకు వెళ్ళినపుడు 70, 80 వేలమంది కూలీలు, పనివాండ్రు పనిచేయుచున్నట్లు వింటిని. వీరందరకూ జ్ఞానభిక్షపెట్టుచు, వారితరింపునకు తోడ్పడుట యెంత అదృష్టమని తలచసాగితిని. కొందరు మిత్రులు ఇచ్చట ఒకశాంతి కేంద్రమును స్థాపించిరి. నాగార్జునవాసుల వృద్ధికి ఇచ్చటకువచ్చెడి సందర్శకుల శాంతికి తోడ్పడుననిరి.

రామకృష్ణుడను ఒక భక్తుడు ఆశ్రమమునకు కావలసిన కలపనంతయు అర్పించెదననెను.

చి॥ జయ భర్త శ్రీ రామారావుగారు కూడ అన్నివిధముల ఆశ్రమ వృద్ధికి తోడ్పడుటకే కోరుచుండిరి. దైవపనికి అందరి ఉపయోగార్థమైన పనికి ఎవ్వరైనను తోడ్పడెదరుగదా!

ఇదివరలో "శాంతి" లో వ్రాసినట్లు **(Lake View)** సరస్సు దృశ్యము ఇజనీరుగారుండుటకు **(River View)** నదీ దృశ్యము గవర్నర్లు, మినిష్టర్లు ఉండుటకు అన్ని సౌఖ్యములతో ఎంతో చక్కగా నిర్మింపబడెను.

నాగార్జనవాసుల వృద్ధికై **(God View)** దైవదృశ్యమును శాంతికేంద్రముగా స్థాపించిన మానవాభ్యుదయమునకు, దేశవృద్ధికి లోకశాంతికి యెంతయో సహకారముగా నుండునని తలచసాగితిని, నేను యెటులతలచినను దైవవిధియే నెరవేరుగాక!

ఈ బ్రహ్మాండమైన నాగార్జున **(North Canal, South Canal)** ఉత్తర, దక్షిణ కాలువల **Projects** జూచుటకు హిందూదేశములో వారేగాక, దేశదేశముల నుండి నిపుణులైన ఇంజనీర్లు వగైరాలు వచ్చి యీ గొప్పపనికి చాల శ్లాఘించుచుండిరి. ఇప్పుడు అమూల్యమైన నాకాలమును వ్యర్థబుచ్చుచు నాగార్జునసాగర్ కాలువలను వర్ణించుటకు ఈ వ్యాసము నేను ప్రారంభించలేదు.

తోటపల్లి ఆశ్రమములో నిర్వాణ మందిరమువద్ద నేను నిత్యము స్నానముచేయు నీరుతో నేను వేసిన నాగార్జున ఉత్తరదక్షిణ కాలువల గురించి మా పాఠకుల తెలియపర్చుటకు కోరుచుంటిని. అప్పుడప్పుడు శ్రీ నరసింహారావు గారు రెండు కాలువలు వేసెనుగాని, నేను మూడు కాలువలు వేసితినని గర్వించుచుందును. నేను మూడవ కాలువ మధ్య కాలువకూడ నీరు హెచ్చుగా నుండుటచే వేయగల్గితిని, నా కాలువలకు శ్రీ నరసింహారావుగారి కాలువలకు నక్కకు, దేవలోకమునకు ఉన్నంత వ్యత్యాసము గలదు. ఐనను నా చిన్న పనిలో నేను తృప్తిని పొందుదును.

నేను రోజూ స్నానము చేయునీరు మొదట ఒకనిమ్మ చెట్టుకు వెళ్ళును అచ్చట నుండి మొదటికాలువ ద్వారా సపోటా మొక్కకు, ఒక పువ్వుల మొక్కకు వెళ్లును. రెండవ కాలువగూడ నిమ్మ మొక్క ద్వారా ద్రాక్షతీగలకు, మరొక నిమ్మ మొక్కకు మరియొక కొబ్బరిమొక్కకు వెళ్లును. మూడవకాలువగూడ యీమధ్యనే వేయబడెను. అదిగూడ నిమ్మచెట్టు మీదుగా వెళ్ళి ఒక కొబ్బరి మొక్కను, పంపరపనాస మొక్కను రెండు పచ్చ గులాబీ మొక్కలు వగైరాలను తడుపుచుండును. రోజూ ఈ మొక్కలన్నింటికి జరుగు, ఈ సేవను జూచుచుండ నా మనస్సునకెంత తృప్తి, ఆనందము కలుగుచుండునో యీ చిన్న మాటలతో వర్ణింపజాలను. ఈ వ్యాసమునందు నేను, ముఖ్యముగా, నా పాఠకులకు జెప్పెడిది, కోరెడిది యేమనగా, మనము ఇంజనీరు నరసింహారావుగారు జేసిన బ్రహ్మాండమైన నాగార్జున కాలువలను జూచి, తలచి తృప్తి పొందరాదు.

మన కాలువలుగూడ ఎంత చిన్నవైనవైనను, కొన్ని మొక్కలకే ఉపయోగించనున్నను, ఎవ్వరంతవారు వారి నాగార్జునకాలువలు వేసుకొని కొన్ని మొక్కలనైనా, పాదులనైనా వృద్ధి జేయవలెను. ఇదియే **(Grow more Food)** హెచ్చు ఆహారమును పండించుడు అనెడి ఉద్యమమునకు తోడ్పడును. నా కాలువలు చాల, అల్పమైనవేయైనను, ఉడతాభక్తిని సేవను జ్ఞప్తికి తెచ్చుచుండును.

ఐనను ఒక్కొక్క పుష్పమునుజేర్చి గుచ్చినప్పుడే ఒక పెద్దమాలగా అగునుగదా! ఇతరులు గొప్పపనులు జేయుచున్నారని, మనము మన చిన్న పనులను, చేయకుండ సోమరితనముతో గడపరాదు. మనము చేయవలసినదిగూడ, ఎంత అల్పమైన దైనను శక్తి సామర్థ్యములతో చేయుటలోనే ఆనందమున్నది.

ప్రియమైన పాఠకులారా ! మీరు రోజూ స్నానము చేయు నీరును ఏమి చేయుచున్నారో మీరే ఆలోచించుడు. నిత్యము మీరువాడెడి నీటివల్ల యెన్ని మొక్కలు, పాదులు వృద్ధి అగుచున్నవి. నా జీవితము కొందరికి విచిత్రముగా తోచినను నేను చెయ్యియైనను బైటకడగవలసి నప్పుడు మొక్క మొదటనే కడుగుచుందును. ఆ మొక్కను దీవించుచు, దానిమీదనే ఆ నీళ్ళను జల్లుచుందును. మంచియో, చెడ్డయోగాని, నోటిని నీళ్ళతో పుక్కిలించినప్పుడు గూడ, ఆ నీరును ఏ మొక్క మొదటనో పడుటకు కోరుచుందును, వాల్తేరులోని కైలాసములో 6 సంవత్సరములు మౌనముగా యుండినప్పుడు, అచట నీరు లేనందున, కొంత క్రింద నుండి ప్రతీరోజూ ఒక్క కావిడి నీళ్ళు చిన్నయ్య అనెడి భక్తుడు, తోటమాలీ తెచ్చెడివాడు. అతడు అంత శ్రమపడి కొండయెక్కి తెచ్చెడినీరు నేను చాల జాగ్రత్తగా వాడి మొక్కలకు పోయువాడను, చివరకు కాళ్లు కడుగుకొన్నను బేసినులో కడుగుకొని ఆ నీళ్ళను సద్వినియోగము చేయువాడను. స్నానముగూడ తొట్టిలోనే జేసి ఆ నీళ్ళను అరటిమొక్కలకు, గులాబీమొక్కలకు వాడగా అవి కృతజ్ఞతతో గెలలువేసి పుష్పములు పూయగా ఆశ్రమ భక్తులు, కైలాసమునకు వచ్చెడి సందర్శకులు వాటినిజూచి అది ఒక మహాత్త్యమనుచు ఆశ్చర్యపడు చుండెడివారు.

పాశ్చాత్యదేశములో, మంచులో, ఒక భక్తురాలు గులాబీ పుష్పములను పుష్పింపజేసెనట. ఇచ్చట ఎటుల పుష్పింప జేయుచుంటివని జూచిన వారు అడుగగా ఆమె నేను ఆ గులాబీ మొక్కను ప్రేమించుచుంటిని. అది నాకై

పుష్పించుచున్నది అని జెప్పుచుండెడిదట. ప్రేమచే సాధించజాలనీ పని యీ లోకములో యెద్దియు లేదు గదా !

ఇంజనీరు శ్రీ నరసింహారావుగారు అమెరికా వెళ్ళినప్పుడు ఆశ్రమాభిమానురాలైన శ్రీసుశీలాదేవిగారి గృహములో కొన్ని రోజులు ఉండుట జరిగెను. అప్పుడు సుశీలాదేవిగారితో యీ నాగార్జునసాగరు గురించి మాట్లాడుచు ఈ కాల్వలవల్ల తోటపల్లిలో శ్రీశాంతి ఆశ్రమముగూడ వృద్ధి అగునని ఆయనజెప్పినట్లు, శ్రీసుశీలాదేవిగారు జెప్పగా ఆనందించితిని, నిర్వాణమంది రంవద్ద నా మూడు పిల్ల కాల్వలను జూచుచుండ తరుచు శ్రీసుశీలాదేవిగారు చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చుచుండును. వారు జెప్పిన కాల్వలు ఇవియేమోయని నాలో తలంచుచుందును. ఏదో కాలువవల్ల ఆశ్రమవృద్ధి అగుచు భక్తికోటికి శాంతి నొసంగుటయే ముఖ్యముగదా !

ప్రియమైన పాఠకులారా ! మనజీవితములుగూడ, భూమికి భారముగా యుండకుండ మొక్కలకు, చెట్లకేగాక, జంతుజాలమునకు మానవకోటికి గూడ యుపయోగముగా నుండుగాక !

పరోపకారార్థం మిదం శరీరం, అన్నందుకైనా, ఈ శరీరములు, జీవితములు భూమికి భారముగా నుండకుండ, దుర్లభమైన మానవజన్మను సద్వినియోగము జేసుకొందుముగాక !

ప్రియమైన పాఠకులారా ! నా ఉడతా సేవను, నిర్వాణ మందిరంవద్ద నా మూడు నాగార్జునకాలువలను జూచుటకురండు ! మీకిదే సుస్వాగతము. వాటినిజూచి మీ గ్రామములకు వెళ్ళి, ఇండ్లకు వెళ్ళి ఏమాత్రము సావకాశమున్నను మీరుగూడ, మీరు నిత్యము వాడెడి నీటిని ఏ మొక్కకో, పాదుకో, పూల చెట్లకో ఉపయోగపడేలాగున జేయుదురుగాక !

నేను ఎన్ని పనులలో నున్నను, నా కాలువలను నేనే మళ్ళించుచు అందున్న మొక్కలకు గొప్పు తవ్వుచు ఎంతయో ఆనందించుచుందును.

కృషితో నాస్తి దుర్భిక్షం, కాలము విలువైనది క్షణములను వ్యర్థము జేయువారు, జీవితమును వ్యర్థము చేయుదురని తరుచు జెప్పుచుందును, గాన మీ ప్రతీక్షణము మొక్కల సేవలోనో, జంతువుల సేవలోనో, మానవుల సేవలోనో సద్వినియోగము జేయుచు శాంతిని బొంది తరించెదరుగాక !

"ఈశావాస్య మిదం సర్వం" ఈ ప్రపంచ మంతయు ఈశ్వరునితోనే, దైవశక్తిచేతనే నింపబడియున్నదిగాన, యే సేవ యెవ్వరికి జేసినను యెవ్వరిని ప్రేమించినను దైవమునే ప్రేమించునట్లు దైవసేవ జేయుచుండవలె ననెడి ధర్మసూత్రము మన జీవితములకు సదా ఆధారమై యుండునుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

హరి ఓం తత్ సత్ ఓం !

# దుఃఖించవలసిన దెవరింగూర్చి ?

ఎవ్వరైన చనిపోయినప్పుడు వారిచుట్టును మనుజులుజేరి దుఃఖించుచుండుట జూచిన చాల విచారకరముగా నుండును. అట్టి యేడ్పు లెవ్వరికి సహాయముగా నుండునా యని నేను చాల వరకు ఆలోచించితిని. ఎంత ఆలోచించినను ఆ యేడ్పు చనిపోయినవారికి గాని, బ్రతికియున్నవారికి గాని లేశమైన లాభకరముగా నుండెడిలాగున తోచలేదు. లాభము మాటయటుండ దానివలన నష్టమే కల్గుచున్నది. నష్టము కలిగెడి పనిని మనమేల చేయవలెను? తెలియనప్పుడు దుఃఖించినను తెలిసికొనిన తర్వాతగూడ ఏలవిలపించవలెను? కాన యెవ్వరి తప్పునువారు తెలిసికొని యికముందైనను అన్ని దుఃఖములకును అతీతులై యుండుట మంచిది.

ఒక మనుజుడు చనిపోయినప్పుడు అతనికి మనమేడ్చుటచే నేమి లాభముగల్గునో యింకను వివరములతో విచారింతము. మనమేడ్పులచేత అతనిని బ్రతికించగలమా? అటులనైన హృదయమంతటితో మనస్సంతటితో శక్తినంతటి నుపయోగించి విలపించుడని నేనుగూడ జెప్పెదను. సహాయమున్నయెడల నేను గూడ విలపించుటలో తోడ్పడెదను. అనుభవముచేతనే మనమెంతగట్టిగా నేడ్చినను, ఎన్నిరోజులు విచారించినను, వారు బ్రతుకకుండుటేగాక ఏడ్చువారి శరీరములకుగూడ నష్టము గల్గుచున్న విషయము అందరు నెరింగియున్న విషయమే. దుఃఖముచే శరీరారోగ్యము జెడును. మనస్సు కృశించి దుర్బలత యేర్పడును. తమ హానిసంగతి అటులుండ చనిపోయినవారి ఆత్మలకుగూడ ఈ యేడ్పులు నష్టమును, అపకారమునే గల్గించుచున్నవని మహనీయులు నుడివియుండిరి. చనిపోయినవారికి బ్రతికియున్నవారికిగూడ హాని గల్గించెడి యీ యేడ్పును మనమింకను యెంతకాలము ఆదరించవలెనోగదా !

అసలు యేడ్చుట యెందుకు? జనులందరు నొకే యుద్దేశముతో

విలపించరు. ఎవ్వరెవ్వరి మనస్సులనుబట్టి వారివారి కోర్కెలకు ఆటంకము గలిగెనుగదా అని తరుచు యేడ్చుట జరుగుచుండును. ధనము తెచ్చి కుటుంబ పోషణను జేయువాడు చనిపోయెను గదా యని కొందరు ఏడ్చెదరు; ఇంకను తదితరమైన రీతులుగా సహాయము జేయువారు చనిపోయెనని మరికొందరు ఏడ్చెదరు. ఆహా ! మనుజులయొక్క హృదయములలో మన మొక్కతరి ప్రవేశించిజూచిన ఈ యేడ్పులుగూడ అనేకరీతులుగా నుండుట జూచి చాల ఆశ్చర్యపడుదుము. కొందరు ఏడ్పురాకున్నను ఇతరులేడ్చుచున్నారని యేడ్చెడివారు కొందరుందురు. మరికొందరు లోపల ప్రేమ లేకున్నను లోకులు చాల ప్రేమయున్నదని భావించుటకై వెక్కి వెక్కి యేడ్చెడివారుగూడ నుండును. దగ్గర సంబంధమున్నదిగదా యేడవకున్న లోకులు తప్పు పట్టెదరని యేడ్చెడివారుగూడ నుందురు. ఈ యేడ్పులన్నియు అజ్ఞాన సంబంధమైనవేగాని, లేశమైన జ్ఞాన సంబంధమైన యేడ్పులు కావుగదా! జ్ఞాన సంబంధమైన యేడ్పుగూడయుండునాయని కొందరనవచ్చును. దుర్లభమైన మానవజన్మను పొందియు, నరజన్మ యొక్క గమ్యస్థానమును బొందకుండ చనిపోయెనేయని యేడ్చెడిదే జ్ఞానపరితాపము, ఇటుల పరితపించెడివారు చాల అరుదుగదా? ఈ సందర్భములోనే ఒక మహనీయుని జ్ఞాన పరితాపము నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది.

ఒక నారీరత్నము తిరుగలియొద్ద కూర్చుండి చోళ్ళను విసరుచుండెనట. ఒక మహనీయుడు ఆమె విసరుటను చాలసేపుజూచి చివరకు వెక్కి వెక్కి యేడవ నారంభించెనట; భక్తులైనవారు ఈ అద్భుతచర్యను జూచి యేల తండ్రీ! నీవు దుఃఖించుచుంటివని యడుగగా ఈ క్రిందిరీతిని సమాధానము జెప్పెను. "ఈ తిరుగలివంటి ప్రపంచములో మనుజులు మాయచేత ఆవరింపబడినవారై, ఈ రెండు రాళ్ళ మధ్యను పడిన ఆ చోడిగింజలవలె నలిగిపోవుచున్నారని దుఃఖించుచుంటి" ననియు తిరుగలి తిరుగుచుండ అందుంచబడు చోళ్ళలో ఒకటి రెండు గింజలు మాత్రము గుండ్రముగా తిరుగుచున్న పై రాతిమీద

పడుటచే, తూలి క్రిందపడి పిప్పిడి యగుటలేదనియు ఆ గింజలు మాత్రమే ప్రపంచమునకు అతీతులై విలసిల్లుచున్న మహనీయులనియు జెప్పియుండెనట. కోట్లకొలది జీవులలో లెక్కించగల్గినన్ని జీవులు మాత్రవే మిగిలి, కొదువవారందరు నిర్దాక్షిణ్యముగా నాశనము చేయబడుట చాల విచారకరమైన సంగతికదా? ఏమాత్రము తెలివితేటలు వివేకము గల్గియున్న మనుజునికైనను మానవకోటి దుస్థితిజూచిన దుఃఖము రాకపోదు; ఇదియే నిజమైన జ్ఞానపరితాపము. ఇదియైనను చనిపోయినవారి కెటుల తోడ్పడును? చనిపోయినవారికంటె బ్రతికియున్నవారికే హెచ్చుగా తోడ్పడును. చనిపోయిన వారికి మనయేడ్పులు సహాయము జేయజాలవు. మన ఆనందము సహాయము జేయును. మన దుర్బలతలు సహాయము జేయవు. మనబలమే సహాయము జేయును. మన భేదభావన, ద్వంద్వబుద్ధి సహాయముజేయవు. మన అభేదభావన, ఏకత్వబుద్ధియే తోడ్పడును మన భ్రాంతి అజ్ఞానము తోడ్పడవు. మన జ్ఞానము అనుభవమే సహాయము జేయును.

జన్మ సార్థకమును మరచి పేడపురుగువలె జ్ఞానశూన్యులై ప్రేమరహితులై జీవించుచు తమస్థితికి సిగ్గుపడి విలపించుటకుబదులు, ఈదరిద్ర స్థితినుండి విముక్తులైనవారి గురించి విలపించనేల? తమవలె బురదలో పొర్లుచు మనుజులమన్న సంగతే మరచి విషయలోలత్వముతో నిండి తమకు తోడుగా నుండెడివారు గతించిరిగదా యని యేడవవలెనా? ఏమి అజ్ఞానము! ఏడ్చుటకు బదులు ఇట్టి మలిన జీవితమునుండి మనవారు విముక్తులైరిగదా అని యానందించవలెను గదా! ఏవిధముగా జూచినను ఈ యేడుపువలన అపకారమేగాని లేశమైన నుపకారము కానవచ్చుటలేదు. ఇతరులకై అనగా నశించినవారికై యేడ్చుటవలన లాభము లేదుగాని, తమ దుస్థితిని విషయలోలత్వమును, దుర్భలత్వములను ప్రవృత్తి తలచుకొని యేడ్చినచాల లాభముకల్గును. కాని ఆవిధముగా నేడ్చెడివారరుదు. అట్టివారే తరించగలరు.

మహనీయులైనవారందరు అటులనే పరితపించి తమ గమ్యస్థానమును బడసి, లోకమున కాదర్శప్రాయులై విలసిల్లుచుండిరి.

చనిపోయినవారిగురించియైనను "అయ్యో! నరజన్మను పొందియు దైవమును గ్రహించకుండ చనిపోయిరిగదా" యని విలపించుట కొంత లాభకరమే; ఏలన గతించిన వారిమాట యటులుండ తామైన కొంత జాగ్రత్తగానుండి, చావు రాకముందు దైవమును గ్రహించుట కొంత ప్రయత్నము చేయుటకై సావకాశమును బడయగలరు; ఎన్ని రీతులుగా నాలోచించినను చనిపోయినవారిని గురించి యేడ్చుట నిష్ప్రయోజనము. కండ్ల జలుబుతగ్గుటేగాని మరి వేరులాభము కనిపించదు. కాన నిప్పుడు బ్రతికి బ్రతికియున్నవారి విషయమై యేడ్చుట గురించి ఆలోచించెదము. జీవించియున్నవారి గురించి యేడ్చెడివారుగూడ లోకములో లెక్కించుటకు శక్యము గాకుండ కోట్లకొలది గలరు. వీరందరెందలకై దుఃఖించుచుండిరో యొక్కతరి విచారింతమా? పిల్లలున్న సరియైన సంబంధము దొరుకుట లేదుగదా యని విచారించుచున్నవారు కొందరు. సరియైన సంబంధము దొరికినవారికి పిల్లలు లేరని దుఃఖించెడువారు కొందరు. మరికొందరు దాంపత్య సౌఖ్యము లేదని, ధనములేదని విలపించెడివారుకొందరు, పిల్లలకుచదువులేదని దుఃఖించెడివారు కొందరు. చదువులున్న సరియైన యుద్యోగము దొరుకుటలేదని చింతించెడివారు కొందరు. తమ కుటుంబములోనో, బంధువులలోనో ఎవరో జబ్బుచేగాని కష్టనష్టములచేగాని బాధపడుచుండిరని దుఃఖించుచుండెడివారు కొందరు; ఇతరుల వృద్ధిని శ్రేయస్సును చూడజాలక బాధపడుచున్నవారు మరికొందరు. ఇటుల లోకము చాల భాగమేదో యొకవిషయమై దుఃఖించుటయే జరుగుచున్నది. ఎన్ని సరిగానున్నను ఎచ్చటనో యొకచోట ప్రతివానిని దుఃఖపెట్టుటకు ఏదోయొకటి కనిపించుచునే యున్నది. ఆహా ప్రపంచమెంత విచిత్రముగా నున్నది !

మనుజుడు తనకొరకో యితరులకొరకో దుఃఖించుట సదా జరుగుచునే యున్నది. ధనము లేదనియో, పిల్లలు లేరనియో, మరి వేరొక లౌకిక సంబంధమైనదానికో సదా పరితపించుట జూచుచునే యుంటిమి. తన జన్మ హైక్కై ఎన్నటికిని నశించని దివ్యధనమును మరచి నశించెడి నామరూపములను ప్రేమించుచు, బంధమును గల్గించెడి వస్తువులకై విలపించుట అజ్ఞానము గదా? తమకు అదిగావలె, ఇవిగావలెనని విలపించెడివారు మూర్ఖులే! ఇతరులకు గూడ ఆ వస్తువులనే కోరుచు చింతించెడివారు అజ్ఞానులే; కాననిప్పుడు కోరవలసిన వస్తువెట్టిది? దేనికొరకై పరితపించవలెను? ఎద్దానికై విలపించ వలెను? ఆ వస్తువు పరమాత్మయే; అదియే దైవము! అదియే ఆత్మ! అదియే తమ స్వస్వరూపము. హెచ్చు తగ్గులులేనిది. చావుపుట్టుకల నెరుంగనిది. శాంతికైవల్యము నొసంగెడిది. ఆత్మసామ్రాజ్యమును జేర్చెడిది. కాన ఇప్పుడు తమకైనను దైవమే కావలెనని పరితపించవలెను. ఇతరులకై నను దైవమే కావలెనని పరితపించవలెను. ఇంతవరకు తాముగాని తమబంధువులుగాని, స్నేహితులుగాని, బిడ్డలుగాని, జన్మకు ఆధారమైన దైవమును గ్రహించలేకపోతిమి గదా యనే దుఃఖించవలెను. దుఃఖించి యూరుకొనరాదు. పశ్చాత్తాపపడి యికముందైనను ప్రవృత్తిబాటను విడిచి నివృత్తిబాటలో నడచుటకు ప్రయత్నము చేయవలెను. ఇదియే మనకు నితరులకు లోకమునకు గూడ తోడ్పడును.

మహనీయులైన వారందరును, అవతారమూర్తులును గూడ మానవకోటి యొక్క దుఃస్థితిని, దుర్భలతను, అజ్ఞానమునుజూచి చాల దుఃఖించిరి. శ్రీకృష్ణుడు మానవకోటికి తన పరితాపమును జూపి యుండెను. బుద్ధభగవానుడు మానవకోటికే గాక జీవరాశియంతకు తనపరితాపమును వెలిబుచ్చియుండెను. ప్రభువైన క్రైస్తు ప్రపంచకుల మూర్ఖత్వమునకై పలుమారులు విలపించి యుండెను. ప్రేమమయులైన మహానుభావులందరు నేదోరీతిగా ప్రపంచము నుద్ధరించుచు మానవకోటికై పరితపించి సేవజేసియుండిరి. ఓ శాంతి పాఠకా

నీవు దేనికై విలపించుచుంటివో ఒక్కతరి నీ హృదయములో ప్రవేశించి చూచుకొనుము. దైవమునకై పరితపించుచుంటివా? అటులనైన నీ జన్మ ఫలించినది. నీకు ధన్యవాదములు. నీవే ఆదర్శప్రాయుడవు. చనిపోయినవారికై దుఃఖించకుము. జీవించియున్నవారికై వారు చనిపోవకముందే విలపించుము. కేవలము విలపించి యూరుకొనకుము. అనుభవరూపమున నీసానుభూతిని జూపుచు తోడ్పడుము. దైవమునకై పరితపించుటను వారికికూడ నేర్పుము. ఆచావునకయి యేడ్చుచున్నవారికి దైవమునకయి యేడ్చుటను బోధించుము. అలవాటుపడి, అందరితో కలిసి యేడ్చుచున్నవారిని నీతోకలిసి దైవముకొరకయి యేడ్చేలాగున జేయుము.

మనుష్యుడు చనిపోయి చాలకాలమైయున్నను బంధువులు చూడ వచ్చిరని లేని దుఃఖమును గల్పించుకొని యేడ్చెడివారుగూడ చాల మంది గలరు గదా? ఈ యేడ్పులో నూరవ వంతైన పశ్చాత్తాపముతో నిండి హృదయమంతటను దైవమునకయి విలపించిన స్వర్గమరచేతనే యుండును! కాన అనిత్య విషయమునకై విలపించవలదు. నిత్యపదవికయి విలపించుదము. అసత్యమునకయి విలపించవలదు! సత్యమునకయి విలపించుదము. అశాశ్వత వస్తువులకయి విలపించవలదు; శాశ్వత వస్తువుకయి విలపించుదము. నామరూపములకయి విలపించవలదు. నామరూప రహితమైన సద్వస్తువుకయి విలపించుదము! నశించినదానికయి విలపించవలదు. నశించని స్వరూపమునకయి విలపించుదము చనిపోయినవారికయి విలపించలదు; జీవించియున్న వారికొఱకే విలపించుదము. దయ్యమునకయి విలపించవలదు. దైవముకొఱకే విలపించుదము. ఆహా ! దైవముకొఱకు విలపించెడివారే అదృష్టవంతులుగదా! మానవకోటికయి పరితపించెడివారే మహనీయులుగదా! ఇతరుల వృద్ధికయి, నిత్యశాంతికయి పాటుపడెడివారే లోక పావనులుగదా!

చనిపోయినవారి సంబంధమైన యీ వ్యాసమున చావు గురించికూడ

కొంతయైన వ్రాయనియెడల నిది పూర్తియైన వ్యాసము గానేరదు. చావు పేరును తలచిన జ్వరము తెచ్చుకొనెడి జనులుగూడ కొందరుగలరు. కాని విచారణ బుద్ధితో విమర్శించిచూచిన చావుగురించి భయపడవలసిన దెద్దియు గానరాదు. చావు పుట్టుకల నెరుంగని ఆత్మకెన్నడు చావేగాక, వృద్ధినాశములు గూఢ నుండవుగదా? ఇక చావు దేనికి శరీరమునకా ? అది యెప్పుడును అశాశ్వతమైనదే! నూతనముగా వచ్చినదిగాన అది యెప్పటికయినను నశించెడిదే! ఎప్పటికయిన యననేల? ఎప్పుడును నశించుచున్నదే! ఏలయన, అది నిరంతరము మార్పులతోనే గూడియుండును. సదా మార్పులతోగూడి నశించెడి దేహమునకయి విచారించ నవసరములేదు. శ్రీకృష్ణ పరమాత్ముడు నశించిన దేహమును జీర్ణించిన వస్త్రమునకు పోల్చి ఈ దిగువ నుదాహరించిన చక్కని శ్లోకమును నుడివియున్నారు.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ, నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥

చినిగిపోయిన ప్రాతబట్టలను వదలి క్రొత్తబట్టలను స్వీకరించినప్పుడు మనమెట్లు మారమో అట్లు శిథిలమైన యొక శరీరమును వదలి క్రొత్తదగు మఱొక శరీరములో ప్రవేశించుచున్నను ఎంతమాత్రము ఆత్మ మార్పును బొందదు. ఎప్పటియట్లే స్వయం ప్రకాశుడై యుండును.

శరీరము శిథిలమైనను నిజస్వరూపమైన యాత్మ మార్పును పొందదు గనుక మనము లేశమైనను చనిపోయినవారి గురించి దుఃఖించనవసరము లేదు; కాని చనిపోయినవారికి మనము సహాయము జేయగలమా యనెడి విషయమును విచారింతము. ఆ! చేయగలము. దేనిచేత? ఏడ్పులచేతగాదు. మన ఆనందముచేత, మనశక్తిచేత, మన జ్ఞానముచేత, మన నివృత్తిచేత, మన అనుభవముచేత, మన పరిపూర్ణత్వముచేత, కాన మనము చనిపోయినవారికి, మనల నెరింగియున్నవారికి, నెరుంగనివారికి, వారికి వీరికి అననేల

లోకమంతకు సహాయము జేయుటకు, మనము శాంతముగా పరిపూర్ణముగా నిత్యానందులమై మానవకోటినంతను మన హృదయకుహర మందు ఇముడ్చుకొని నిరంతరము ప్రణవ ధ్యానమును జేయుచు జీవించెదము గాక!

ఏ చైతన్యము అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించియున్నదో, ఏ స్వరూపము చనిపోయినవారిని జీవించియున్న వారిని అనుసరించియున్నదో, ఏశక్తి సోహం భావనతో చరాచర ప్రపంచములను ఆడించుచున్నదో, ఏ పరిపూర్ణములో మనము కదలుచు, మెదలుచు, ప్రసంగించుచు, వినుచు, మన నిత్యకృత్యములను నెరవేర్చు కొనుచుంటిమో, ఏ స్వరూపము సత్తు చిత్తు ఆనందమయమై, అఖండమై, పరిపూర్ణమై, అవాఙ్మానసగోచరమై, కోటి సూర్యస్వరూపమై వెలుంగుచున్నదో, ఆ దివ్య స్వరూపమునందు మనమందరమైక్య సంధానమై "త త్త్వ మసి" భావంతో విలసిల్లెదముగాక !

హరి ఓం తత్ సత్ ఓం !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# డబ్బు లేకుండ ధనవంతుడగుటెట్లు ?

ప్రతివానికిని, తాను ధనవంతుడై యుండవలెనని యుండును. లోకములో నెవ్వరికిని నిరుపేదయై పేదరికము ననుభవించవలెనని యుండదు. ఏలయన పేదరికము మానవుల జన్మహక్కు గాదు. అందుచేతనే పేదరికము నందరు విషతుల్యముగా జూచెదరు. మనము జన్మించిన తావు పేదరికమునకు నిలయము కాదు. మనమెప్పుడుడెడిది కూడ పేదరికమునకు యిల్లుకాదు. మన గమ్యస్థానము కూడ పేదరికమునకు గృహము కాదు. భూత భవిష్యద్వర్తమాన కాలములలో ధనవంతులమై యుండుటే మన జన్మహక్కై యున్నది. అట్టి స్థితిలో పేదరికము నెవ్వరు కోరెదరు. ఎవ్వరికిని అక్కరలేదు. ముష్టిచే జీవించెడి దురదృష్టవంతుని మొదలు లోకమును పరిపాలించెడి చక్రవర్తివరకు నెవ్వరును పేదరికము నొల్లరు. బిడ్డలకైన అవసరము లేదు. యువకులకు అసలే అక్కరలేదు. వయస్సు మీరిన పెద్దలైనను పేదరికము పేరు చెప్పిన వణికెదరు. స్త్రీ, పురుష విచక్షత లేకుండ నందరు ధనవంతులుగ నుండుటకే కోరెదరు. ఎంత మూర్ఖుడైనను, పామరుడైనను, పేదరికము నాదరించడు. మానవకోటియంతయు పసిబిడ్డ మొదలు ముదుసలి వరకు, పామరుని నుండి పండితుని వరకు, పేదరికము నొల్లకుండుటకు సర్వజనులకు, ప్రబలమైన కారణ ముండితీరవలెను. ఆ కారణము ఏమన :- పేదరికము మనుష్యుని జన్మహక్కుగాదు. మనుష్యుని జన్మహక్కు ధనవత్వమే గాన, ప్రతి మనుజుడును తెలిసియున్నను, తెలియకున్నను, ధనవంతుడుగా నుండుటకే కోరుచుండును.

మన వ్యాసము యొక్క లోతునకు వెళ్ళకుండగనే, ముందుగనే, పేదరిక మనగ నెద్దియో, ధనవంతమునగ నెద్దియో తెలిసికొందము! లేనియెడల జనులు చాలభాగము గులకరాళ్ళవంటి డబ్బు లేకుండుటే పేదరికమని, తుప్పుపట్టెడి దొంగలపహరించెడి, కష్టనష్టములను, కామక్రోధ, మోహ బంధములకు

మూలకారణమైన, ధనరాశులను ప్రోగుచేయుటే ధనవత్త్వముగా నుండుటనియు తప్పుడు అభిప్రాయము బడయగలరు. డబ్బును కలిగియుండుటే ధనవంతులమై యుండుటయా? కోటీశ్వరులలో యెంతమంది నిరుపేదలు లేరు? చక్రవర్తులలో నెంతమంది బీదలు లేరు? నిజముగా లుబ్ధుడే నిరుపేదయైనవాడు; ఎంత ధనమున్నను, తాను తినక యితరులకు పెట్టనివాడే కడుపేదవాడు. దాతయే కడు ధనవంతుడు. మనయొద్ద దాచుకొన్న దానినిబట్టి మనము ధనవంతులము కామనియు, మనము ఇతరుల శ్రేయస్సునకై వినియోగించిన దానినిబట్టియే మనము ధనవంతులమగుచుంటిమని యొక మహనీయుడు జెప్పి యుండెను.

ధనము లేనివాడు ధనవంతు డెట్లగునని చాలమంది ప్రశ్నించెదరు. నశించెడి ధనమును గల్గియున్నవాడే ధనవంతుడా! నశించని ధనమును గల్గియున్నవారో, ప్రేమధనమును గల్గియున్నవారో, యోగధనమును గల్గియున్నవారో, జ్ఞానధనమును గల్గియున్నవారో, నిర్వాణ ధనమును గల్గియున్నవారో, సమాధి ధనమును గల్గియున్నవారో! జ్ఞానధనముతో లోకమునంతను తరింపజేయు అవతారమూర్తులను, నిరుపేదలందురా? నిర్వాణధనమును లోకమునకు బంచియిచ్చిన బుద్ధ భగవానుని నెవ్వరు నిరుపేదయనగలరు? ప్రేమధనములో మానవకోటి నంతను స్నానము చేయించిన క్రైస్తు ప్రభుని బీదవాడనుటకు నోరెటులవచ్చును? యోగ ధనముతో లోకమును పరిపాలించిన శ్రీకృష్ణ భగవానుని, నిరుపేదయని చెప్పుట కెవ్వరికి ధైర్యమున్నది ?

నశించెడి ధనమును తాకనివారిలో గూడ, కడు ధనవంతులు గలరు! క్షీణించెడి ధనము గుట్ట గుట్టలుగా నున్నను, నిరుపేదలుగా నున్నవారు కూడ గలరనుటకు లుబ్ధుడైన మైదాసు రాజుయొక్క కథయే యుదాహరణము. మైదాసుడు ఒక గొప్పరాజు; కాని ధనమందు గడులోభత్వము గలదు! అతనికి ధనమే దైవము. నిత్యము ధనమును జూచుకొనియే జీవించెడివాడు ! తనకు

వచ్చిన ధనమంతయు బంగారు కడ్డీలుగ జేయించి, భూమిలో మేడ కట్టించి అందు దాచుకొని రోజును ఆ ధనమంతను జూచుకొని మురియుచుండెడివాడు. తనకంటె ధనవంతుడు, ఈ లోకములో లేదని గర్వించెడివాడు. లోకములో నెవ్వరియొద్దను లేనంత ధనము తనయొద్దనున్నను, అతడే కడుబీదవాడు; దురదృష్టవంతుడని తెలియపర్చుటకై దైవమొక్కమారు ప్రత్యక్షమై "ఓ మైదాసుడా! నీకేమి వరము కావలెనో కోరుకొనుము; ఇచ్చెద" నని పలికెను. బంగారు పిచ్చిలో బడిన లుబ్ధుడేమికోరును ? ఓ దైవమా ! నేను తాకినదంతయు బంగారము కావలెను ! నా చెయ్యి దేనిమీద వేసిన నది యంతయు బంగారముగా ఆ క్షణమే మారిపోవలెను. ఇదియే నా కోరిక. ఈ వరము ప్రసాదించి నన్ను కృతజ్ఞునిగా జేయుము." అని కోరుకొనెనట ! దైవము అటులనే కానిమ్మని వెడలిపోయెను.

అప్పుడు మన మైదాసు ఆనందపరవశుడై తన యింటిలో నున్న యినుప ముక్కలను, గొల్లెములను, బాల్చీలను, ఇది అది యననేల, తన చేయి దేనిమీద బడిన దాని నంతను బంగారముగా జేసివేసెను. తిండి నిద్ర గూడ మానివేసి సర్వమును బంగారముగా జేయుచుండెను. పాపము ! అతనికి బంగారుబొమ్మవంటి చిన్న కొమారిత యుండెను. ఆమెను ఆనందముచే దగ్గర తీసికొనగా, ఆమె గూడ బంగారు ప్రతిమగానే మారిపోయెను. కొంత విచారించినవాడై తిండి తినబోయెను. సర్వమును బంగారుగా జేయు ఆనందములో తిండి చాలరోజులనుండి తినుటయే మరచెను. ఇప్పుడు ఆకలి దహించి వేయుచున్నది. భోజనము నొద్దకూర్చుండి, దేనిని తినబోయినను, అంతయు బంగారమగుచుండె ఆకలి వేయుచున్నది. బంగారమును తిని బ్రతుక గలడా? దాహముచే నోరెండిపోవుచుండ మంచినీళ్ళను తాకెను. అది గూడ బంగారుమయమై పోయెను. అప్పుడు మన మైదాసేమి చేయగలడు? ప్రపంచ రీతిగా మైదాసుని మించిన ధనవంతుడు లోకములో నెవ్వరును లేరు. లోకములో నున్న ధనమంతయు నితని యొద్దనే యున్నది. మరికొన్ని

రోజులూరుకొన్న, లోకమంతను బంగారుగా జేయు మహా లోభి అంతలో కలి అవస్థ వచ్చినది. పాపము ఏమిచేయగలడు? ఇక విలపించసాగెను. ఏదియు చేతగానప్పుడు విలపించుటయే గదా మిగిలియున్న పని. విలపించిన మాత్రమున కడుపు నిండునా ? ఆకలి తీరునా ? ఇక మహా ధనవంతుడైన మైదాసుయొక్క ప్రాణములు మరికొన్ని నిముషములలో పోయెడి స్థితి వచ్చినది. లేని బలమును తెచ్చుకొని యీ చివర ప్రార్థనను అర్పించసాగెను. "ఓ దైవమా, లోకములో నాకంటె నిరుపేద యెవ్వడును లేడు. ఈ బంగారు దూలములన్నయు, గుట్టలన్నియు నాకొక చిన్న రొట్టిముక్కనైన నిచ్చుటలేదు. గుక్కెడు గంజినీళ్ళనైన త్రాగి ప్రాణమును నిలువబెట్టుకొనుటకు తోడ్పడని యీ ధనమును తీసుకొని పోయి నన్ను బ్రతికించుము."

ప్రియమైన పాఠకులారా ? మైదాసుని ప్రార్థన యేమైనదో అతడు చివర అవస్థ నెటుల గడిపెనో మనకిచ్చట అవసరము లేదు. నాకు సరిగా జ్ఞాపకము కూడ లేదు. కాని మైదాసురాజు జీవితమువలన, డబ్బుగలవాడే ధనవంతుడుగాడని మాత్రము నేర్చుకొంటిమి. ఇప్పుడు మరియొక డబ్బులేని ధనవంతుని యొద్దకు మిమ్ము తీసుకొని వెళ్ళెదను - నాతో వచ్చెదరా ? రండు రండు, సింధునది యొద్దునకు వెళ్ళుదము. అచ్చటనొక మహనీయుడు, యోగపుంగవుడు, సన్యాసి, దిగంబరుడై యొక బండమీద బ్రహ్మానందా మృతమును పానము జేయుచుండెను. ఆ మహనీయుని యొద్దకు మరియొక మైదాసురాజు వంటి అలెగ్జాండరు చక్రవర్తి వచ్చి యుండును. చక్రవర్తి శిరస్సు మీద వజ్రవైఢూర్యములతో తాపడమైన కిరీటము గలదు. సన్యాసియొక్క వెంట్రుకలు లేని బోడి గుండు మీద వెయ్యిరేకుల (సాహస్రార) కమలము వికసించెను. చక్రవర్తి శరీరము మీద ప్రపంచమంతటిలో విలువైన దుస్తులు ధరించబడి యుండెను. మన యోగిపుంగవుని శరీరము మీద ప్రతి రోమము నిత్యతృప్తిచే తాండవమాడుచుండెను. చక్రవర్తి హృదయము స్మశానమువలె ప్రేమశూన్యమైన ఇంకను లోకములో నున్న ధనరాశులన్నిటిని సంపాదించవలెను;

రాజ్యములన్నియు జయించవలెననెడి తలంపు చెదపురుగు దూలమును దొలిచివేయునట్లు, మనస్సున, అశాంతిని, అసంతృప్తిని గల్గించుచుండెను. ఇక మన స్వామి హృదయము ! హృదయములో పవిత్రత యున్న వారిదే స్వర్గరాజ్య మన్నట్లు శాంతి కైవల్యమును చూరగొని శాశ్వతానందమును పరమ శాంతిని, నిత్య తృప్తిని బొంది, లోకమునంతటిని ఆనందాబ్ధిలో మునుంగుచున్నట్లు వెలుంగుచుండెను.

"ఓ శాంతి పాఠకా" నీ వొక్కతరి వారి మోములను జూచినంత మాత్రమున, ఇందెవ్వరు ధనవంతులో, యెవ్వరు నిరుపేదలో, ఒక్కక్షణములో నిశ్చయించి చెప్పగలవు.

చూడుము చూడుము ! చక్రవర్తి లోభత్వముచే, కోరికలచే, అసంతృప్తిచే కడు బీదవాడుగా గానవచ్చుచుండెను. మన సన్యాసి తృప్తిచేతను, ఆనందము చేతను, కోరికలన్నియు జయించుట చేతను, కడు ధనవంతుడుగా గోచరించు చుండెను. లోకములో నున్న ధనరాశులను పొందినను, రాజ్యములన్నింటిని జయించుటచేతను, కడు ధనవంతుడుగా గోచరించుచుండెను. లోకములో నున్న ధనరాశులను, పొందినను; రాజ్యము లన్నింటిని జయించినను తన మనస్సును జయించలేనివాడు కడు దరిద్రుడే ! అట్టి వానికెప్పటికిని శాంతిలేదు; ఆనందములేదు; తృప్తి లేదు. శాంతిమాట అటుండ సరిగ ఆహారమైన రుచించదు. నిద్రపట్టదు. లోభియొక్క దారిద్ర్యము నెవ్వరు వర్ణించగలరు? నిత్య తృప్తుని యొక్క యానందమును మాత్రమెవ్వరు వర్ణించగలరు?

తృప్తియే ధనము; అసంతృప్తియే దారిద్ర్యము ! ఆహా ! రెండు చిన్న మాటలలో యెంత భావన యున్నది ! ఈ లోకమంతటిలో గొప్ప వాడెవ్వడు? ఈ మానవకోటిలో ధనవంతుడెవ్వడు ? తృప్తి గల్గినవాడే ! ఏ కోర్కెలు, వాంఛలు, భ్రాంతులు లేనివాడే ! తృప్తి యెట్టి వానికుండును? నామరూపముల వెంట పరుగెత్తెడివా రొక్కనాటికి తృప్తులు కాజాలరు. విషయలోలురెప్పుడు

నసంతృప్తులే ! ఆశాపిశాచముచేతనే బాధింపబడుచుందురు. దైవముతో నైక్యసంధానమును జెందినవాడే నిత్య తృప్తుడు, అతడే దాత; అతడే సంపన్నుడు. అతడే ధనవంతులలో ధనవంతుడు ! ఇక కొదువ వారందరు, పిశాచపూజకాధములే ! ధనమును పూజించెడివారే ధనము మోక్షము నిచ్చెడి ధనము గాదు ! బంధమును గలిగించెడి ధనము శాంతినిచ్చెడి ధనము గాదు; తుప్పుపట్టెడి భ్రాంతి ధనము ! అట్టివారే లోకమంతిటిలో కడుబీదలు, కడునిరుపేదలు; దరిద్రులు. ఈ నిత్య దరిద్రులను, ధనవంతులుగా జేయుట యెటులు? వీరికి జ్ఞానముండెడి తావును జూపవలెను. తమ ధనముతో దైవమును కొనజాలమన్న సత్యమును వారు గ్రహింపవలెను. మన జన్మలచే నశించని, హెచ్చు తగ్గులు లేని, నిత్యశాంతి నొసంగెడి, ఎల్లరి హృదయములలో విలసిల్లుచున్న, లోకమంతకు సమముగా జన్మహక్కైన, జ్ఞానధనమే నిజమైన దివ్యమైన శాశ్వతమైన అమృతతుల్యమైన ధనమని వారు గ్రహించవలెను. అప్పుడే తాపత్రయముల నుండి ముక్తులై పూర్ణ శాంతిని పొందెదరు. పేదరికము నెరుంగని నిత్యతృప్తుని, ఆ సత్యపదవిని అలంకరించెదరు.

ఓ శాంతి సోదరా, శాంతి సోదరీమణీ, నీవు డబ్బులేకుండ ధనవంతుడవుగా, ధనవంతురాలుగా కావలెనని కోరిక యున్నదా ? అటులైన నాతో రమ్ము. నా అడుగులలో నీ అడుగులను వేయుము. నా మనస్సుతో నీ మనస్సును కలుపుము. నా హృదయముతో నీ హృదయమును కలుపుము. నా ఆలోచనలతో నీ ఆలోచనలను ఐక్యము చేయుము. నా శ్వాసతో నీ శ్వాసను మిళితము చేయుము, "సోఽహం" భావనతో అద్వితీయమైన దివ్యస్వరూపముగా వెలుంగుటకు ప్రయత్నించుము. నాలుగు రాగి డబ్బులు లేవు గదాయని నీవు నిరుపేదవను భ్రాంతిని పడకుము. లోకమునంతను కొనగలిగిన జ్ఞానధనము నీ హృదయమందు నిలిచియేయుండ నీవు నిరుపేద వెటులయ్యెదవు ? నీ ధనమే నిజ ధనము ! నీ ఆనందమే నిజమైన ఆనందము. నీ శక్తియే నిజమైన శక్తి. నీ సంపదయే లోకమునకు మేలొనరించెడి సంపద.

నీ శాంతియే లోకమును తరింపజేసెడి శాంతి, గాన నీ నిజధనమును బయటికి దీయుము. నీ జ్ఞాన ధనమును మరుగుబెట్టకుము. నీ లోపల దాని దాచకుము నీ శాశ్వత ధనమును అనుభవ నీయ రూపమున వ్యక్తపరచి, తోడి మానవులందరితోడ దానిని పంచుకొనుట కుద్యుక్తుడవై యుండుము.

ఓ శాంతి పాఠకా, నీవు ధనవంతులలో ధనవంతుడవైయుండి, నిరుపేద ననుకొని భ్రాంతి పడెదవేల? నీకంటె ధనికులెవ్వరున్నారు ? ఒక్కతరి నీ కండ్లను విప్పిచూడుము. నీదిగాని దెద్దియైన నున్నదా ? ఈ ప్రకృతి యంతయు నీదికాదా? ఈ ప్రపంచమంతయు నీదిగాదా ? ఈ సృష్టియంతయు నీది గాదా? చూడు, చూడు; పృథ్వివియే, నీకు శయ్యగా నున్నది. దిక్కులేనీకు వసనములుగా నున్నవి. అగ్నియే, నీ తేజస్సుగానున్నది. జలమే నీకు పానీయముగా నున్నది. వాయువే నీకు వీవనగా నున్నది. ఆకాశమే నీకు కాచ్ఛాదనముగా నున్నది. నిన్ను మించిన దెద్దియున్నది." నీలో లేని దెద్దియున్నది ? సర్వము నీలోనే యిమిడి యున్నది ! చరాచర ప్రపంచములన్నియు నీతోనే కదలుచున్నవి. జడా జడములన్నియు నిన్నే ఆధారముగా జేసుకొని యున్నవి. జీవరాశులన్నియు నిన్నే అనుసరించియున్నవి. మానవకోటి యంతయు నిన్నే ఆధారముగా జేసికొని జీవించుచున్నవి.

ప్రేమమయా, అటు చూడుము, సూర్యుడు నీకొరకు ప్రకాశించుచుండెను. చంద్రుడు నీకు చల్లదనము నొసంగుచుండెను. నక్షత్రములు నీకొరకై మెరయుచుండెను. గాలి నీకొరకై వీచుచుండెను. పంచభూతములు నీ సేవకై వినియోగింపబడుచున్నది ఆహా ! యేమి నీ అదృష్టమే అదృష్టము ! నీ భాగ్యమే భాగ్యము ! నీ ఆనందమే ఆనందము, చూడుము, చూడుము; పక్షులు నీకొరకై పాడుచున్నవి. పుష్పములు నీకొరకై వికసించుచున్నవి. సాగరమున కెరటములు నీకొరకై నాట్యమాడుచున్నవి. ప్రపంచమంతయు నీ లీలగా నున్నది. నీవు భగవంతుడవుగాకున్న మరెవ్వరు

ధనవంతులు? ఈ ప్రపంచమంతయు, నాదనెడి అనుభవానందమును నీకెటుల వర్ణించగలను? ఇది మనది గాకున్న మరెవ్వరిది ? ఈ పృథివి, జలము, వాయువు, అగ్ని, ఆకాశము మనవి కావా ? వీనిని మననుండి యెవ్వరైన వేరు చేయగలరా ? ఈ సూర్యరశ్మి మనది కాదా ? మనలను అనుభవించనీయకుండ ఈ సూర్యరశ్మిని యెంత ధనమదాంధులైన తీసికొనిపోగలరా ? ఈ చెట్లు మనకొరకు పెరుగుచున్నవి. ఈ నదులు మనకొరకు ప్రవహించుచున్నవి. ఈ పర్వతములు మనకొరకై స్థిరమై యున్నవి. ఆహా ! ఈ జడాజడము లన్నింటికిని ప్రభువుగా నుండెడి యానందమెంత గొప్ప ఆనందము?

ఒక మహనీయుడు లోకమంతయు తన గృహముగా భావించుచు, మానవకోటి నంతను సోదర సోదరీమణులుగ ప్రేమించుచు, సృష్టికే ప్రభువై; ఒక సిలమీద కూర్చుండి. ప్రకృతి సౌందర్యముల నానందించుచు, సూర్యరశ్మిలో స్నానము చేయుచుండ, నొక చక్రవర్తి వచ్చి "నీకేమి కావలెనో కోరుకొనుము. ఇచ్చెదను." అనెనట. అప్పుడాతడు "ఓ నిత్య దరిద్రుడా, నీవు నా నుండి వెడలిపోవుటే నా కోరిక. నేను అనుభవించుచున్న సూర్యరశ్మికి నీవు ఆటంకముగా నిలువకుండుటే నా కోరిక". అని చెప్పి తన ఆనందములో మునిగి తేలుచు ప్రపంచమంతటికి తన స్వశక్తి ధనమును ప్రత్యక్షము జేయుచుండెను. ఇట్టి మహాత్ములు గోచిపాతకు దక్షత లేకున్నను, కోటీశ్వరులను, చక్రవర్తులను సయితము, తమ ఆంతర్య ధనముచే తలలు వంచుకొని సిగ్గుపడెడి లాగున జేయుచుండిరిగదా ! నివృత్తి జీవితమును మరచిన జీవితమున్నదా అనుభవమైన జ్ఞాన ధనము ముందు ప్రపంచములో నున్న ధనరాశులన్నియు తులదూగజాలవు. ఈ బాహ్య ధనమంతయు గడ్డిపరక కంటెను మసిబొగ్గుల కంటెను అల్పమైనది.

ప్రతి మనుజుడును ధనవంతుడుగా విలసిల్లెడి శక్తి తనలోనున్నది.

మనస్సును దైవమున కర్పించినవాని నతడు ధనవంతులలో ధనవంతుడుగా జేయును. ఆ మనస్సునే అనిత్యమైన బాహ్య ప్రపంచమున కర్పించిన వానినతడు నిరుపేదలలో నిరుపేదయైన, ఆశాపాశ పీడితుడైన, దరిద్రునిగా జేయును. కాన మనమనస్సులను, నిత్యమైన, సత్యమైన ముక్తయైన, మన జన్మల్లకాధారమైన దైవమునకే అర్పించి, సదా ధనికులముగానే యుందుము. చూచితిరా ! మనస్సే ఒకనిని పేదవారిగాను ధనవంతునిగాను చేయుచున్నది ! అమెరికా దేశములో పదికోట్ల ధనము గల్గిన యొక కోటీశ్వరుడు, తనకున్న ధనమును లెక్కవేసికొని చూచుకొని ఈ పదికోట్లతో నా జీవయాత్రనెటుల గడపవలెనని ఆత్మహత్య జేసికొనెనని జెప్పబడి యున్నది. పదికోట్ల కలిమి ఆ కోటీశ్వరునకు పేదరికముగా గానవచ్చెను. పదిరూపాయలున్నవారు కూడ ధనవంతులుగా నుంటిమని తలచెడివారు లేరా ? పది రాగిడబ్బులు లేకున్నను ధనవంతులమని తలచెడివారు కూడ గలరుగదా ! కాన ధనమునకు మనస్సే కారణము.

"మతేగతి" మన మనస్సే గతులను స్థిరము జేయుచున్నది. కాన మన జన్మ హక్కైన ఈ శాశ్వత ధనమును పొంది, మనమేల ధన్యులము కారాదు; ప్రేమస్వరూపముగా జీవించెడి వారికి లోకమంతయు తమలోనె యుండియున్నది, వారినుండి యెట్టిది వేరుగాలేదు. సర్వము వారిలోనే యుండును. వారే సర్వమై యుండిరి. కాని ఓ ప్రియస్వరూపా ! మనము కూడ ప్రేమస్వరూపులుగ జీవించుచు, సర్వమును మన ఆధీనము చేసికొందమా? గోదావరి యొడ్డున గూర్చుండి, యీ గోదావరి నాదని భావించిన, నన్ను అడ్డెడి వారెవ్వరు ? సముద్రపు దరిజేరి యీసముద్రము నాది అని తలచిన నన్ను నిర్బంధించెడి వారెవ్వరు? శ్రీశాంతి ఆశ్రమమునుజేరి, ఆ యీ వృక్షజాలము లన్నియు, పుష్పలత లన్నియు, ప్రకృతి సౌందర్యమంతయు, ఈ శాంతిసుధ యంతయు నాదన్న నన్ను ఆటంకపరిచెడి వారెవ్వరు? ఈ సూర్య రశ్మియంతయు నా జన్మహక్కని ఆనందించుచున్న, నన్ను ఆటంక పరిచెడి వారెవ్వరు? ఆహా

! ఈ మేఘములన్నియు, ఈ ఆకాశమంతయు, ఈనక్షత్ర మండలము లన్నియు, ఈ సూర్యచంద్రాదులు, దిక్కులు, దిగంతములు నావే యను భావనాను భవమున ఆనందించెడి యీ ఆనందమును నేను మీకెటుల వర్ణించగలను? ఇదియే నాశాంతి రాజ్యము, నా జన్మహక్కు నాశాంతి రాజ్యములో నా మేలుకోరెడి వారేగాక నాకు హాని గల్గించెడివారు గూడ నావారే! నా శాంతి రాజ్యములో నన్ను జూచిన వారేగాక, నన్ను జూడని వారు గూడ నావారే! నా శాంతి రాజ్యములో జాతి, దేశ, మత వివక్షత లేకుండ అందరును నా స్వరూపులుగానే ప్రకాశించుచుందురు ! నా శాంతి రాజ్యములో పరిమితి లేనన్ని శాంతి సింహాసనములు, శాంతిసాధకులక వేచియున్నవి. అచ్చటనే కృష్ణుడు, బుద్ధుడు, రాముడు, క్రైస్తు, మహమ్మదు, జూరాష్ట్రరు, కనుఫూసియసు, నానకు, మహావీరుడు, శంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు, రామకృష్ణ, వివేకానంద, రామతీర్థ దయానంద, కబీరుదాసు వగైరాలందరు వారి–వారి దివ్య పీఠములను అలంకరించి, శాంతి వీరులను త్వరితముగ రమ్మని ఆహ్వాన మిచ్చుచుందురు.

ఓ ప్రేమమయా, నిరంతరము దైవమును నీ హృదయవాసిగాజేసి జీవించుచున్న నీవు. ధనవంతుడవుగాకున్న మరితరులు ధనవంతులా ! ప్రేమ మయమైయున్న నీ రెండు హస్తములను, మానవకోటి నంతను నీ ఆలింగనమున జేర్చుకొనుటకై చాచియుండ, నీకంటె వేరే ధనవంతులు లోకమునందెచ్చటి గలరు? నిన్ను నిందించుచు, దూషించుచు, నీకు హాని అపకారములు జేయుచున్న వారిని గూడ నీదరిజేర్చుకొని ప్రేమించెడి, నీ ప్రేమ ధనమును మించిన దెద్దియు నెచ్చటను లేదు. అహింసా వ్రతమును మనోవాక్కాయ కర్మలలో అనుష్టించుచు జీవరాశులన్నింటిని నీ ప్రాణముగా జూచుచు, ఒక్క జీవినైన విడువకుండ ప్రేమించు ప్రేమమూర్తివై, కరుణాసముద్రుడవై, దయామయుడవై విలసిల్లెడి, నీవుగాక మరి వేరు ధనవంతులు గలరా !

దైవధనమే నిజమైన ధనము. ఈ శాశ్వతమైన ధనము చేతనే నీవు తరించెదవు. ఈ నశించని ధనము చేతనే యితరులు తరించెదరు. ఈ క్షీణించని ధనముచేతనే లోకము తరించును. ఈ హెచ్చుతగ్గులు లేని ధనముచేతనే నీ బంధుమిత్రులు తరించెదరు. ఈ పరిపూర్ణమైన ప్రేమధనము చేతనే నీతో వైరము పూనిన వారుగూడ తరించెదరు ఈ అఖండమైన ధనము యొక్క జ్ఞప్తిచేతనే మానవకోటి యంతయు నీదరిని జేరుదురు, నిత్య తృప్తి నొసంగెడి యీ అమూల్యమైన ధనముచేతనే దేవతలు దైవములు కూడ నీసేవ జేయుటకు వేచియుందురు.

నీ స్వస్వరూపమును బొందియున్న నీవు త్రికాలముల యందును ధనవంతుడవుగానే విలసిల్లుచుంటివి. స్వస్వరూపమును అనగా దైవమును మరచి జీవించుచున్నయెడ నీకంటె దరిద్రుడు, నిరుపేద, వేరొకడుండబోడు, కాన నీవు సర్వకాల సర్వావస్థలయందును నీ జీవితమునకు జీవితముగా, ప్రాణమునకు ప్రాణముగా, నీ మనస్సునకు మనస్సుగా నీ శ్వాసకు శ్వాసగ అద్వితీయమైన అఖండమై పరిపూర్ణమై వెలుంగుచున్న దైవముతో నైక్యసంధానముజెంది ధనవంతులలో ధనవంతుడవుగా ప్రభువులకు ప్రభువుగా దైవములకు దైవముగా అఖండకోటి సూర్యప్రకాశముతో విలసిల్లుచుండుటే ఈ వ్యాసము యొక్క సారాంశము.

తమ జన్మహక్కైన జ్ఞానధనమును పొంది యితరులకు గూడ ఆ ధనమునే పొందుటకు తోడ్పడి; మానవకోటి యంతయు గమ్యస్థానమునుజేరి, నిత్య తృప్తులై విలసిల్లెదరుగాక ?

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# భేతాళుడు

(బూచి వస్తున్నాడు - అన్నము తినుడు)

పసిబిడ్డలు, అన్నము తినక అల్లరి చేయునప్పుడు తల్లులు బూచి వస్తున్నాడు "అన్నము తినుడు" అని పిల్లలను భయపెట్టి అన్నము తినిపించుదురు. అటులనే దైవపరితాపనలేని సాధకులను "భేతాళుడు వచ్చుచున్నాడు. మీరు దైవమును మరచిన అతడు మిమ్ము మ్రింగివేయును. గాన దైవస్మరణ సదాచేయుడు" అని హెచ్చరించుటకు నామనస్సు కోరుచున్నది. మరుపే చావు. అదియే నిజమైన మృత్యువుగాన, దైవపరితాపన గలిగి దీపము ఆరిపోకుండ, బేతాళుడు రాకుండగనే మేల్కొనుడు అని మా శాంతి పాఠకులను మరుపునుండి జాగ్రత్తకు, అప్రమత్తతనుండి ప్రమత్తతకు, చీకటినుండి, వెలుగునకు మృత్యువునుండి అమృతతుల్యమైన శాంతిధామమునకు తీసికొని వెళ్ళుటకు, కోరుచుంటిని.

ఒక గ్రామములో చాలా నిరుపేదయైన భక్తుడుండెడివాడు, ఆ గ్రామము గోదావరి తీరమందుండెను. పేదరికముచే బాధలు పడవజాలక కరుణామయుండైన ఒక గురుమూర్తినిజేరి తన పేదరికమును పోగొట్టి దైవములో లీనమగుటకు తరుణోపాయము జూపమని, తనకు ఉపదేశము ఇవ్వమని ప్రార్థించెను. అప్పుడు గురుమూర్తి, ఒక శుభదినమున మంత్రోపదేశముచేసి, ఆ మంత్రమును నెలరోజులు గోదావరిలో స్నానముజేయుచు రెండువేళలందును ప్రాతఃకాల, సంధ్యాసమయము లందు, నియమముగా జపించుమని నియమించెను.

అటులనే గురుని ఆజ్ఞ ప్రకారము శిష్యుడు తపస్సు చేయగా బేతాళుడు ప్రత్యక్షమయ్యెను. నీకు ఏమి వరము కావలెనో కోరుకొనుము. అనగా తన దారిద్ర్యమును పోగొట్టుమనెను. వెంటనే సిరిసంపదల నొసంగెను. మరేమి కావలెనో అడుగుము అనగా మేడలు, మిద్దెలు ఆసుపత్రులు గురుకులములు,

జనకాశ్రమము మైత్రేయిఆశ్రమము మొదలైనవి ఎన్నియో కోరెను. బేతాళుడు తలచినంత మాత్రముననే అన్నియు పూర్తిచేయుచుండెను. ఇంకేమి కావలెనో వెంటనో కోరుము నాకు పని చెప్పనియెడల నిన్ను మ్రింగివేసెదనని చెప్పెను.

అప్పుడు శిష్యుడు భయపడి తన గురుమూర్తి పరుగిడెను. బేతాళుడు తన్ను వెంబడించుచు, తన్ను కబళించుటకు ప్రయత్నించుచుండెను. పాహిమాం వేరు దిక్కులేదు, రక్షించుడు అని గురుపాదముల మీద పడగా, గురుదేవుడు శిష్యుని అవస్థకు కరుణించి, ఒక పెద్ద స్థంభమును నిర్మించమని బేతాలునితో చెప్పుమనెను.

ఆ సంకల్పమును జెప్పగానే బేతాళుడు దానిని పూర్తిజేసెను. అప్పుడు బేతాళుని, ఆస్థంబమును ఎక్కుచు దిగుచు ఉండమని రాత్రింబగళ్ళు ఆపనియందే నిమగ్నుడై యుండమని గురుమూర్తి సలహాతో శిష్యుడు బేతాళునకు ఆజ్ఞాపించెను. ఆపనికి అంతు ఆది యుండదుగదా ? బేతాళుడుకూడ అహర్నిశములు ఆస్థంభపూజ చేయుచు అలసిపోవుచుండెను. అదేవిధముగా గురువుయొక్క ఉపాయముచేత, శిష్యుడు బేతాళుని ప్రమాదము నుండి తప్పించుకొని అతడు ఒక స్తంభముయొక్క కట్టులో నుండిపోవునట్లు చేసిన విధముగా ప్రతిసాధకుడు ఆస్థంభమునే దైవముగాను దీనిని ఎక్కుట, దిగుటయే, ఉచ్ఛ్వాస నిశ్వాసములతో పూజించుటగాను, భావించుచు మనస్సును కట్టులో నిర్భంధించి మంత్రములకు మహామంత్రమైన సోఽహం భావన చేయవలెను. అంతయు ఈ స్థంభమును ఎక్కుట, దిగుట అను మీ శ్వాసలోనే ఇమిడి యున్నది. ఇదియే అజపగాయత్రీ మంత్రము. ప్రారంభస్థితిలో సాధకులు రామమంత్రముతోగూడ ఈస్థంభమును ఎక్కుచు, దిగుచు పూజను చేయవచ్చును. స్థంభమును ఎక్కుచున్నప్పుడు "రా" దిగుచున్నప్పుడు "మ" అని భావించుచు యీ పూజను తైలధారవలె చేయవలెను.

ఈ అఖండమైన పూజచే నరుడే నారాయణుడుగా మారును.

దేహబుద్ధి తగ్గి ఆత్మభావన వచ్చును. కాని నియమముగా నిరంతరము, భక్తిజ్ఞాన వైరాగ్యములతో నిండి ఈ శక్తివంతమైన మహాపూజను చేయుచుండ వలెను.

మరుపే మృత్యువుగా ఏమాత్రము ఈ పూజను మరచినను బేతాళుడు అమాంతరముగా మ్రింగివేయును. బేతాళునకు యమునికి దయాదాక్షిణ్యము లుండవు. గాన ప్రియమైన శాంతిపాఠకులారా లెండు. మీ నిద్ర నుండిమేల్కొని, బేతాళుడు మిమ్ము వెంబడించనీయకుడు.

కాలమనెడి సర్పము మృత్యువనెడి నోటిని తెరచి స్వార్థపరులను, సోమరులను మ్రింగుటకు వేచియున్నది. నిమీలిత నేత్రులమై ఇప్పుడు రామనామస్మరణ జేయుదము. అజపాగాయత్రి ననుసరించి ప్రణవ మంత్రమును "సోఽహం" మహామంత్రమును ప్రతిశ్వాసతో "సోఽహం" అని స్మరించుము, క్రూరమైన బేతాళుని మనదరికి చేరనీయవలదు. కన్నుమూసి, తెరచినంతకాలములో నైనను దైవస్వరూపమును మరచినా నిర్దాక్షిణ్యముగా బేతాళుడు మనలను మ్రింగివేయును. మేల్కొనుటకిదియే సమయము, తరించుటకిదియే సూక్ష్మమైన మార్గము.

ఇక వెయ్యి మాట లేల?

బాలుడు బూచి రాకముందే అన్నము తినునట్లు, మీ జన్మహక్కుయైన దైవత్వమును, జ్యోతి స్వరూపమును గుర్తించి, ఈ మహాపూజను నిరంతరము "సోఽహం" భావనతో చేయుచు, బేతాళుడు మనలను మ్రింగి వేయకుండ, మన గమ్యస్థానమైన బ్రహ్మసాక్షాత్కారమును బడయుదుముగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి ః

# శాంతి కేంద్రస్థాపన

ఎవరి హృదయమున వారు శాంతికేంద్రమును స్థాపించుకొనుట సులభము, ఉపయోగకారి, వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మూలము కావున ఎవరి పవిత్ర హృదయమున వారు శాంతి కేంద్రమును నెలకొల్పిన విశ్వశాంతికి మూలమగును. ఇతరుల సానుభూతి, సహకారములపై ఆధారపడి యుండును. కావున శాంతి కేంద్రమును బాహ్యమున స్థాపించుట కష్టము. అది విజయవంతము కావలెనన్న ఇతరుల తోడ్పాటు కావలసియుండును.

హృదయమునందలి శాంతి ప్రేమలే గృహమునకు, గృహమునుండి వారి కుటుంబమునకు, కుటుంబమునుండి వారి పట్టణమునకు, పట్టణము నుండి వారి దేశమునకు, దేశమునుండి విశాల ప్రపంచమునకు క్రమముగా వ్యాపించగలవు. శాంతి కేంద్రమును స్థాపించుటకు ముఖ్య విషయములేవి ? హృదయ పవిత్రత అన్నింటికంటె ముఖ్యము. తనువు నిచ్చిన తల్లిదండ్రులే తమ బిడ్డల హృదయమున శాంతి నెలకొల్పుటకు కారకులై స్థాపకులు, అధ్యక్షులు, కార్యదర్శి కావచ్చును. తమ బిడ్డలే అందు సభ్యులు కావచ్చును. క్రమముగా తమ ఇరుగుపొరుగువారు కూడ అందులో జేరవచ్చును. అన్ని మతముల, అన్ని వేదముల సారమగు శాంతి ప్రార్థనను కంఠస్థముచేసి ప్రథమమున వారు పఠించి, తమ చుట్టూనున్నవారిచే పఠింపజేయవలెను. అన్ని వేదములను, ప్రార్థనలను నీవు ప్రతిదినము చేయజాలకపోవచ్చును. కాని శాంతి ప్రార్థనను ప్రతి దినము సులభముగా చేయవచ్చును.

దైవముతో మాటాడవలెనన్న ప్రార్థన ఒక్కటియే సాధన అని మహనీయులు నుడివియుండిరి. కావున ఇప్పుడు ఇచ్చటనే మీరు మంచి కార్యము చేయుట కారంభించుడు. శాంతి కేంద్రమును మీ హృదయములో నెలకొల్పుడు. "పరోపకార్థం ఇదం శరీరమ్" ఈ శరీరము ఇతరుల సేవకై ఇవ్వబడినది. దానిని సద్వినియోగము జేయుడు. "తండ్రి హరి చేరుమనియెడి

తండ్రి తండ్రి" అని ప్రహ్లాదుడు నుడివి యుండెను. కావున మీ బిడ్డలను కూడ దైవోన్ముఖులుగా జేయుడు. అదియే జీవిత ధ్యేయము.

ఆదివారముగాని మరియొక రోజుగాని ఏదైన మీకు వీలుగలిగిన దినమున వారమున కొకసారి అయినను సంధ్యాసమయములయందు శాంతి కాముకు లందరు ఒకచోట సమావేశమై మొదట శాంతి ప్రార్థనను మీకు తెలిసిన భాషయందు స్మరింపుడు. అటుపైన ఆధ్యాత్మిక మెఱుపులనుండి, మౌనపు ఘడియలనుండి మూడేసి అధ్యాయములను చదువుడు. ప్రతి శాంతి కేంద్రమునకు శాంతిప్రార్థనలు, తదితర కరపత్రములు ఉచితముగా పంపబడును. "పని ఎవ్వరిని చంపదు. కాని వ్యాకులత కోటాను కోట్లను చంపగలదు". అనెడి సామెత గలదు. కావున మంచిపని ఇప్పుడే చేయుటకు ప్రారంభింపుడు. విశ్వశాంతికి మూలముకందు.

పశు, పక్షి, వృక్ష, లతాదులను మానవులను సమముగా ప్రేమించ గలవాడే ప్రార్థన సరిగా జరుపగలడు' కావున మన హృదయము నుండియే శాంతి ప్రేమ ప్రసరణములు మున్ముందు ప్రారంభించి విశ్వశాంతిని నెలకొల్పుదుముగాక ! ఈ దినమే మనది. రేపు వచ్చునో రాదో ఎవరి కెరుక? కావున ఇప్పుడే శాంతి కేంద్రమును నెలకొల్పుదుము గాక ! బద్ధకము, సోమరితనము ఆవలనుంచుడు. దుఃఖితులు, పీడితులు, రోగాల రూపమున మీ కడకువచ్చు దైవస్వరూపుల నారాధించుటలో మీ శాంతి కేంద్రమును పవిత్ర మొనర్చుడు. పవిత్రవంతములగు మీ హృదయములందు శాంతికేంద్రము నెలకొల్పుటకు మీ కింకను వివరములు కావలసివచ్చిన మా కార్యదర్శినికి వ్రాసి తెలిసికొనుడు. అనుక్షణము మా ప్రార్థనలు మీ వెంట నుండును. ఏ యేపను లొనర్చుచున్నను తైలధారవలె ప్రార్థన ధ్యానాదుల యందు మీ మనస్సును నిల్పుడు.

నా యనుబదినాలుగు సంవత్సరముల జీవితములో నా కిట్లనిపించు

చున్నది. నామరూపములు, పేరు ప్రఖ్యాతులు కలిగించునట్టి శాంతికేంద్రములను బాహ్యమున స్థాపించుట కాదు. దైవ పరితాపన, దైవభక్తి గల వారి హృదయములనే శాంతికేంద్రములుగా జేయవలయునని నా ఆశయము. ఓ ప్రియ పాఠకులారా ! భక్తి, ప్రేమ పూరితములగు శాంతి కేంద్రములను మీ హృదయమున నెలకొల్పుటకు నాకు తోడ్పడుడు. మీ పవిత్ర హృదయముల నుండి, శాంతి, ప్రేమలే ఏరులై, దీపములై, మానవాళిపైన ప్రవహించుగాక !

అర్పణ

ప్రాక్పశ్చిమమున గల శాంతి కాముకులందరకు, శాంతి కేంద్రమును వారి హృదయముననే స్థాపించదలచుకొను వారందరకు ప్రీతితో అర్పణ.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

# అద్భుతము

దైవనామము అద్భుతకరమైనది. నీవు ఆ భగవానుని బిడ్డడవగుటచే నీ నామముకూడ అద్భుతకరమైనదే! క్రిందటి సంవత్సరము నా హృదయ వ్యాధి సమయమున నన్ను దర్శించుటకు వచ్చిన భక్తులలో చాలమంది "మీ ఆరోగ్యమెట్లున్న" దని ప్రశ్నించెడివారు. వారికి నేను ఆనందముతో, ఉత్సాహముగా "ఆరోగ్యము అద్భుతమని" సమాధానమిచ్చెడివాడను. అప్పుడేగాక ఇప్పుడుగూడ అట్టి ఆనందకరమైన సమాధానములే ఇచ్చుచుందును.

నిజముగా నా హృదయమొక అద్భుతమై యున్నది. నా రక్తపు పోటు కూడ ఒక అద్భుతమైనది. నా నాడీగతి సహజముగాను అద్భుతముగను నడుచుచున్నది. సోऽహం స్వరూపమైన నా శ్వాస యొక అద్భుతమై నడచుచున్నది. లోపలనేగాక వెలుపలకూడ అంతయు అద్భుతవంతమై వెలయుచున్నది. నేను నిమీలితనేత్రుడనై యున్న సమయములందు నా కాలి గోరు మొదలు శిరస్సు వరకు ఆ దైవసాన్నిధ్యమును అనుభవించుచుందును. దైవము నా దేహములోని ప్రత్యణువునందును నిండి నిబిడీకృతమై యుండి తన అద్భుతత్త్వమును ప్రకటించుచున్నాడు. ప్రవృత్తి నివృత్తులతో గూడియున్న ఈ ద్వంద్వ ప్రపంచములో పిపీలికాది బ్రహ్మపర్యంతము ఆ భగవానుని అద్భుత చర్యయే యైయున్నది. కన్నులుమూసియుంచిననూ, తెరచియుంచిననూ, దైవముయొక్క అద్భుతచర్యలే కానవచ్చును. పుష్పములు తమ మధురవాసనలు వెదజల్లుచు, పక్షులు కిలకిలారావముల నొనర్చుచు, చంటిబిడ్డలు చాల చేష్టలు చేయుచు, మానవులు తమతమ విహిత కార్యకలాపములు నొనర్చుచు, వృద్ధులు విహిత కర్మలనుండి విశ్రాంతి పొందుచు ఆ దైవముయొక్క అద్భుతత్త్వమునే ప్రకటించుచున్నారు. మనమొనర్చు ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసములలోను, ప్రభాకరుని ప్రతి కిరణమునందును, మిణుకు మిణుకు మనుచు ఆకాశమున

వెలుంగు నక్షత్రములలోను మరియు మన చుట్టునున్న సర్వసృష్టి కూడ ఆ దైవాద్భుతముతో నింపబడియున్నది.

అంతయు అద్భుతమయంమై యున్న ఈ ప్రపంచమున, సకలచరాచరములు దైవముతో నిండియున్న ఈలోకమున జీవించుట ఎంతయో ఆనందకరము. నీవు నేను మాత్రమేగాక సకల సృష్టికూడ దైవముయొక్క సజీవ ప్రతిమలే గనుక అంతయు అద్భుతమయమై వెలయుచున్నది.

భగవానుడు అద్వితీయుడుగాన, ఆంతర్యమున, బాహ్యమున, అంతటా, శబ్ద, స్పర్శ, రూప, రస గంధములలో అతనిని గుర్తించి అనుభవించుట చాల సులభమై యున్నది. దైవమును గుర్తించుటకు సుదీర్ఘ వ్యర్థ ప్రార్థనల నొనర్చుటగాని, క్లేశరూపధారణ ధ్యానాదులు చేయుటగాని, ప్రయాసయే యగును. దైవమెచ్చటనుండియో ఆకాశమునుండి దిగివచ్చునని ఎదురుచూచుచుండుట యెంతయో హాస్యాస్పదకరమైన విషయము !

నీవు చేయవలసినదెల్ల ఆంతర్యమున, బాహ్యమున అంతటా నిండియున్న అద్భుతవంతుడగు ఆ పరమాత్మను గుర్తించి, మౌనము వహించుటయే !

నిశ్చలముగానుండి "నేనే దైవ మని" తెలిసికొమ్ము. "ఆ పర బ్రహ్మము నీవే!" "త త్త్వ మసి సర్వశక్తి పని చేయుచున్నది; జీవుని విశ్రమింపనిమ్ము!" ఇది ఎంత అద్భుతమైన మంత్రము ! ఎంత సహాయకారకమగు నిశ్చలమైన వాక్యము. జీవుని విశ్రమింపనిచ్చి, సర్వశక్తిని పనిచేయనిచ్చుట ఎంత సులభమైనది.

నిరంతరము చంచలమైనదగు మనస్సును నిశ్చల మొనర్చుట అనుకున్నంత సులభము కాదు. కాని సులభమైనను కష్టమైనను, తిరుగుబోతు అగు మనస్సును నిశ్చల మొనర్చి మనము దాని చెప్పుచేతలలో నుండక దానికి

దాసులముగాక మనకే అది లొంగి యుండులాగుననను, మన అధికారమునకు లోబడి యుండునట్లు చేయుటలోను మన లక్ష్యసిద్ధియగు మోక్షమునకు మార్గము చేకూరును.

"యోగఃశ్చిత్తవృత్తి నిరోధః"

చిత్తవృత్తులను నిరోధించుటే యోగమని యోగదర్శనములో శ్రీ పతంజలి మహర్షులవారు నుడివిరి. చంచలమైన మనస్సును నిశ్చలమొనర్చి తమ ఆధీనములో నుంచుకొన్నవారు అద్భుతమైన చైతన్యమూర్తిని, జ్యోతులకు జ్యోతియై దివ్య స్వరూపుని అద్యంతములందుకూడా దర్శింపగలరు.

ప్రియపాఠకా ! నీ నామము, నా నామము మాత్రమే కాదు; ఈ ప్రపంచములోనున్న సకల నామరూపములుకూడా అద్భుతమే !

అద్భుతములకెల్ల అద్భుతమైన ఆ దైవమునకు కృతజ్ఞతలు. ఈ సొంత దేహములోనున్న అనంత స్వరూపములో మన మందరము నిరంతరము లీనమగుదుముగాక ! మాటలకు చేతలకు అతీతమైన ఆ యుత్కృష్ఠ మౌనస్వరూపునిలో, హృదయములకు, జీవములకు లక్ష్యమైన ఆ అద్భుతమూర్తిలో మనమందరము నిరంతరము జీవింతముగాక !

– ఓం తత్సత్ ఓం –

# జ్ఞానము

నా దైవ స్వరూపములారా ! మిమ్ములనందరిని జూచుటకు నేను పొందెడి ఆనందము వర్ణనాతీతము. మరల మిమ్మందరిని నేడు కలుసుకొన గలిగినందులకు నే నెంతయో కృతజ్ఞుడనై యుంటిని. దైవము మీకందరికి శాంతి కలుగజేయు గాక !

ప్రేమ స్వరూపులారా ! ఇటు క్రిందటి ఉపన్యాసములో మనస్సు గురించి ప్రసంగించి యుంటిని. మనస్సును జయించుటకు వైరాగ్యము జ్ఞానము అవసరమని జెప్పియుంటిని. క్రిందటి ఉపన్యాసములో వైరాగ్యమును గురించి మాట్లాడియుంటిని, నేడు జ్ఞానమును గురించి మాట్లాడవలసి యున్నది. పరిపూర్ణమైన జ్ఞానమును గురించి మీతో ప్రసంగించుటకు నేడు సుదినముగదా? అట్టి ప్రసంగమును వినుటకు మన జన్మలు అదృష్టమైనవి గదా?

జ్ఞానము, జ్ఞానము అనుభవమైన అపరోక్షజ్ఞానము గురించి నేను యెటుల మాట్లాడగలను? అచ్చట మనస్సు ఉన్నదా? వాక్కు ఉన్నదా? చెప్పుటయు, వినుటయు నున్నదా? ఆ జ్ఞానమును గురించి తలచిన ఈ ఇంద్రియములు కదలవు గదా? ఈ మనస్సు మెదలదుగదా? ఈ బుద్ధి అందు లీనమవును గదా? అచ్చట నేను అనెడిది లేదుగదా?

అయినను ఈ చిన్న మనస్సు ఈ అణుమాత్రమైన బుద్ధి అజ్ఞానమును చవిజూచినంత మట్టుకు మీకు జెప్పుటకై ప్రయత్నించెదను. పరిపూర్ణమైన వైరాగ్యమును, అనుభవమైన జ్ఞానమును విడదీయుటకు వీలులేదు. పరిపూర్ణములో రెండును ఒక్కటియే యని జెప్పవచ్చును. పరిపూర్ణమైన వైరాగ్యము గలవారు జ్ఞానవంతులే గదా? లేక మనోజయమునకు వైరాగ్యము ఒక రెక్కగాను, జ్ఞానము రెండవ రెక్కగాను తీసుకొనవచ్చును. జీవుడనెడి పక్షి పరమాత్మలో ఐక్యమౌటకు వైరాగ్యము జ్ఞానము అనెడి రెండు రెక్కలు అవసరమై

యున్నవి, రెక్కలున్న మాత్రము చాలునా? తోకలేనప్పుడు రెక్కలు మాత్రము యేమిజేయును? యోగమే తోక, వైరాగ్యము జ్ఞానము అనెడి రెక్కలతో తోక అనెడి యోగముయున్న జీవ స్వరూపము అవలీలగా పరిపూర్ణములో లీనమవును. వైరాగ్యమును గురించి ఇదివరకే ప్రసంగించియున్నాముగాన, ఇప్పుడు జ్ఞానమును గురించి మాట్లాడవలసి యున్నది.

**"Know the truth and the truth shall make you free"**

"సత్యమును తెలుసుకొనుము, ఆ సత్యమే నీకు ముక్తినిచ్చు" నని మన బైబిలు చెప్పుచున్నది. మనకు ముక్తి నిచ్చెడి స్వతంత్రులుగా జేసెడి ఆ సత్యము యెద్ది? మనము మాట్లాడనున్న జ్ఞానమే !

**"What is that thing by knowing which every thing becomes known?"**

దేనిని తెలుసుకొన్న సర్వమును తెలుపుడగునని వేదములు ఘోషించుచున్నవో? అది యెద్ది? మన జ్ఞానమే .

ఆహా ! యే మతములో జూచినను ఈ జ్ఞానమే గదా అందరకూ అవసరమై యున్నది. జ్ఞానము, అక్కరలేదన్నవారు ఎవ్వరును ఉండరుగదా? రెండు తరగతుల వారికి జ్ఞానము అవసరము లేకపోవచ్చును. పరిపూర్ణులైన వారికి, శరీరము జన్మించిన సంగతే మరచి తన్మయత్వములో నున్నవారికి ఈ జ్ఞాన ఉపన్యాసములు అవసరము లేదుగదా? మరి ఇంకెవ్వరికి అవసరము లేదు? నరపశువులకు గూడ అవసరము లేదు. తాము మనుష్యులమన్న సంగతే మరచి పశువులవలె జీవించుచున్న వారికి ఈ ఉపన్యాసములు రుచించునా? రుచించినను రుచింపకున్నను, పూర్ణశాంతి జ్ఞానములోనే యున్నది.

అజ్ఞాన మెచటనున్నది? ఆకాశములో నున్నదా? స్వర్గములో నున్నదా?

గుళ్ళలో ఉన్నదా? గోపురములలో నున్నదా? మత గురువులలో నున్నదా? గ్రంథములలో నున్నదా? బాహ్యమున నున్నదా? లేదు లేదు. మనలోనే యున్నది. ఒక కవీశ్వరుడు దైవము కాళ్ళకంటెను చేతుల కంటెను దగ్గరగా నున్నాడని నుడివి యుండెను. దైవమన్నను, జ్ఞానమన్నను నొక్కటియేగదా? వేరుగాదుగదా?

దైవములేక జ్ఞానము సదా మనలోనే యుండ, వెఱ్ఱి కుక్కలవలె అచ్చటకు ఇచ్చటకు తిరిగిన లాభ మేమి? ఒక స్వాములవారు హిందూ దేశము నుండి వచ్చి ఉపన్యసించు చున్నారనగానే, అచ్చటకు పరుగెత్తుదుము. ఏమి యచ్చటకు వెళ్ళిన ఆయన జ్ఞానమును మన జేబులో పోయునా? మరియొక ఫాదరీ చక్కని ఉపన్యాసములు ఇచ్చుఉన్నారనగానే అచ్చటకు వెళ్ళుదము అచ్చట జ్ఞానమును మాత్రలుగా జేసి మనము మ్రింగుటకు ఆయన ఇచ్చునా? చంకనయున్న పిల్లను మఱచి వీధులన్నియు తిరుగుట యేమి విపరీతము? లోపలనున్న దైవమును వదలి బైట యెంత వెదికిన నేమి లాభముండును?

అయినను దైవములోపలనైనా యున్న యాథార్థము అనుభవనీయులైన వారియొద్ద మనము నేర్చుకొనవలసియున్నది. దైవమును గురించి దైవము పొందిన వారే జెప్పెదరుగాని తదితరులు జెప్పజాలరు. జోళ్ళు కుట్టెడి చమారివాని యొద్దకు వెళ్ళి నాకు ఒక సూటు తయారు జేయుమన్న అతడు యేమి జేయగలడు? సూటు కావలసి కుట్టుపని వారివద్దకు వెళ్ళవలెను, జోళ్ళుకావలసిన జోళ్ళు తయారుచేయు వాని వద్దకు వెళ్ళవలెను.

అటులనే మనకు జ్ఞానము కావలసిన జ్ఞానమందు అనుభవము గల వారిని వెదకి వారిని ఆశ్రయించి మనసర్వమును వారికి అర్పించి అనుభవమైన జ్ఞానమును వారివల్ల పొందవలెను. సర్వము సర్వము అర్పించమనుచుంటినని మీరు భయపడవలదు. అట్టి అనుభవనీయులైన మహాత్ములు మీనుండి ఒక్క రాగిదమ్మిడీ **(Cent)** యైనను పుచ్చుకొనరు. గాని మీరు వారినే సర్వముగా

భావించి మనఃపూర్వకముగా నమ్మవలెను. అంతియేగాని చీకటిలో కూర్చుని చీకటి అని అరిచినంత మాత్రము చీకటి యెటుల పోనేరదో అటులనే, జ్ఞానము జ్ఞానమని అరచినంత మాత్రముననే జ్ఞానులవజాలరు. వైద్యులు వైద్యము అని అరిచి వైద్యులు కాలేరు. రసాయనవేత్తలు రసాయనము రసాయనము అని అరచి రసాయనవేత్తలు కాలేరు. జ్యోతిష్కులు జ్యోతిషము జ్యోతిషము అని అరచి జ్యోతిష్కులు కాలేరు, ప్రతిదానికి శ్రమ పడవలెను. శ్రమపడకుండా ఫలితము దొరకదుగదా? ప్రపంచ వస్తువుల విషయమై యెటుల శ్రమపడు చున్నామో, జ్ఞానమును గురించి గూడ అటులనే శ్రమపడవలసి యున్నది. మాటలచేతనే పనులు జరుగనేరవు.

ప్రియ సోదర సోదరీ స్వరూపములారా! జ్ఞానమనగ ఆత్మ జ్ఞానముగాని ప్రపంచ జ్ఞానములని తప్పు అభిప్రాయము పడకుడు. ప్రపంచములో నున్న జ్ఞానములన్నియు, చదువులన్నియు నేర్చుకొన్నను, ఆత్మ జ్ఞానము లేనిదే జన్మ వ్యర్థమన్న సంగతి మరువకుడు. వైద్య జ్ఞానము నేర్చుకొన్న వైద్యము జేయవచ్చును, ప్లీడరు జ్ఞానము నేర్చుకొని వాదించి డబ్బు బాగా సంపాదింప వచ్చును. ఇటులనే బాహ్య జ్ఞానమునకు చదువులు యెన్నియో యున్నవి. కాని పూర్ణశాంతి కావలసినచో, ఆత్మ జ్ఞానము అవసరమై యున్నది. ఆత్మానుభవము గల్గినవారివద్దనే దానిని మనము పొందవలెను. అప్పుడైనను వారివద్దకు వెళ్ళినంత మాత్రమున మనకు పొట్లముకట్టి యివ్వరు.

జ్ఞానము గురించి చెప్పెదరు. నిజబోధ జేసెదరు. విన్న మాత్రమున మనకు ముక్తి దొరకదు. విన్నదానిని మనము మననము జేయవలెను. మరల మరల ఆ జ్ఞానమును మననముజేసి అనుభవము జేసుకొనవలెను. దీనినే శ్రవణ మనన నిదిధ్యాసనమందురు. మొదట వినుట, వినినదానిని ధ్యానించుట, ధ్యానించిన దానిని అనుభవించుట జరుగవలెను.

ఈ విషయమై కొంత త్యాగము జేయవలసియున్నదిగదా? త్యాగము

జేయకుండ ఫలితము పొందజాలము గదా? యేసుక్రీస్తు ప్రభువు దైవమును, దెయ్యమును ఒకే పర్యాయము గొల్వజాలమని జెప్పి యున్నారు.

మనమందర మాక్రైస్తు భక్తులమేయైనను, తరచు దెయ్యమును, దైవమును గూడ బొందుటకు వృధా ఆయాసము పొందుచుందుముగాని, మన తెలివితేటలు యెన్ని యుపయోగించియైనను దైవమును మోసపుచ్చ జాలముగదా? దైవము కండ్లలో ఇసుక జల్లుటకు ప్రయత్నించిన, మనమే గ్రుడ్డివారమయ్యెదము మన యొక్క తెలివితేటలు అమాయకులైన మన సోదరులను మోసబుచ్చుటకే పనికివచ్చును. దైవమువద్ద పనికిరావు. అందుచేతనే మనలో చాలమంది యెన్ని జపములు, యెన్ని ధ్యానములు జేసినా, యెంతమందివద్ద యెన్నిమార్లు ఉపదేశములు పుచ్చుకొన్నను, శాంతిని పొందజాలకున్నా దెయ్యముయొక్క పూజ వదలనంతవరకు శాంతి యెటుల గలుగును? పూర్తిగా దైవమును నమ్మి దైవములో లీనమయ్యేవరకు శాంతి గలుగదు.

**"Seek ye first the kingdom of Heaven and His righteousness and all things will be added unto you."**

మొదట స్వర్గరాజ్యమును జ్ఞానమును వెదుకుడు. అప్పుడే మీ కోర్కెలు ఫలించును. మీకు శాంతి గలుగునని శ్రీ క్రైస్తు ప్రభువు నుడివి యున్నారు. ఆ మహానుభావుడు అంత చక్కని తెలివైన చిన్న మాటలలో జెప్పియున్నను మనము దైవమును వెదుకుటకు బదులు అవసరమైన నిత్యమైన ఒక్క దైవమును వదలి, అనవసరమైన వాటినన్నింటిని వెదుకుచుంటిమేల? తెలిసియుండియు జేయుదానికి ప్రాయశ్చిత్తము లేదుగదా? యెరింగియుండియు చేయుదానికి యెవ్వరేమి జేయగలరు? కవీశ్వరుడైన భర్తృహరి మహానుభావుడు చక్కని చిన్న శ్లోకములోని అర్థమును చెప్పెను :-

మిడతలు దీపమును పండు అని భ్రమించి నశించుచున్నవి.

మత్స్యములు యెఱను ఆహారముగా భావించి ప్రాణములను గోలుపోవుచున్నవి. ఆహా ! మనుజుడు ఎంత కఠినహృదయుడు. విషయ వస్తువులు హాని గల్గించునని యెరింగియు విషయములపై సదా పరుగెత్తుచున్నాడని" నుడివియుండెను. దీపము కాలునని తెలిసి అందులో చెయ్యి పెట్టువారిని యెవ్వరేమి జెయ్యగలరు? కర్మ అనుభవించవలసినదే. అట్టివారు యెన్ని ఉపన్యాసములు, ఉపదేశములు విన్నను ఏమి లాభముండును? నే నెంత చెప్పిన లాభ మేమున్నది? దైవమే వచ్చి జెప్పినను లాభముండునా? ఉండదు. ముమ్మాటికి ఉండదు.

ఓ ప్రియ స్వరూపములారా! నేను మీకు క్రొత్తకొత్త సంగతులు జెప్పుచున్నానని తప్పు అభిప్రాయము పడవలదు. మీరు యెరింగియున్న సంగతులే మరల నేను తిరిగి చెప్పుచున్నాను. మీలో లేనిది నాకేలవచ్చును? నాలో యున్నదే మీలో నున్నది. మీలో లేనిది నేను జెప్పిన మాత్రమున మీకు వచ్చునా? కాన నేను మరల మరల ప్రార్థించెడిది యేమి అనగా, మీరు తెలుసుకొనిన దానినే అనుభవములో పెట్టుటకు ప్రయత్నించుడు. మీలోనున్న జ్ఞానమునే చవిజూచుటకు ప్రయత్నించుడు. మీరు చవిజూడనప్పుడు నే నెంత అఱచిన లాభ మేముండును? అవతారపురుషులందరు వచ్చినను లాభము ఉండదుగదా! పంచదార రుచిజూడని వారికి యెంత బోధించియైనను యెన్ని ఉపన్యాసము లిచ్చియైనను పంచదార రుచిని అనుభవింపజేయగలమా? బోధించగలమా? పంచదార తెల్లగా యుండునని రుచిగా ఉండునని వర్ణన మాత్రము చేయగలము. ఎన్ని వర్ణనలు జేసిన పంచదార రుచి ఎట్లు అనుభవములోనికి వచ్చును. పంచదార నోటిలో వేసుకొన్నప్పుడేగదా! పంచదార రుచి యనగా ఏమిటో తెలియవచ్చును. ఆ రుచి జూచినవారికి ఇక పంచదారమీద ఉపన్యాసములు, బోధలు వ్యర్థముగదా!

అటులనే మీలోనున్న జ్ఞానమును మీరు రుచి జూడకున్న బైట

బోధలన్నియు గలసి మీక శాంతి నివ్వజాలవు. జ్ఞానము ఎట్టిదో తెలుసుకొనజాలరు. కాన ఎవ్వరంతటవారే ఆ జ్ఞానరుచిని పొందుటకు స్వప్రయత్నము జేయవలెను. ప్రయత్నముచే పట్టుదలచే సాధించలేనిది యెద్దియు ఈ లోకములో ఉండదుగదా?

జ్ఞానము రెండు విధములుగా ఉంటున్నది. ఇంద్రియములవల్ల తెలుసుకొనెడి జ్ఞానము, ఇంద్రియాతీతమైన జ్ఞానము. వీటిని బాహ్య జ్ఞానమని ఆంతర్యజ్ఞానమని జెప్పవచ్చును. బాహ్యాజ్ఞానమునకు ఎంత నేర్చుకొన్నను అంతు ఆది కనిపించదు. ఎంత నేర్చుకొన్నను తృప్తి యుండదు. అన్ని విద్యలు అన్ని చదువులు, అన్ని శాస్త్రములు మొదటలోనికి హెచ్చుగా దట్టించుటచే ఆంతర్యమున చెదపట్టినట్లుండును.

ఇక ఆంతర్యజ్ఞానము బైటనుండి నేర్చుకొననవసరము లేదు. అంతయు ఆంతర్యముననే యున్నది. దానిని అనుభవంచుటే కర్తవ్యము. చవిజూచిన కొలదీ మనశ్శాంతి గలుగును. ఈ ఆంతర్య జ్ఞానము మనలో సదా పూర్ణముగానే యుండును. దనికి వృద్ధి క్షీణములులేవు. సదా ఒకే రీతిగా పూర్ణముగానే యుండును.

ఈ రెండు విధములైన జ్ఞానములను బోధపరుచుకొనుటకై ఒక చక్కని కథను రామతీర్థులు నుడివియున్నారు. ఒక రాజునొద్దకు ఇద్దరు చిత్రకారులు **(Magicians)** కోటలో గోడలమీద బొమ్మలు వేయుటకై వచ్చిరట. పనినంతయు ఆ యిద్దరిలో తెలివియైన పనివానికి ఇచ్చుటకై, ఇద్దరు పనివాండ్రను నమూనాకు చెరియొక గోడమీదను చిత్తరువులను గీయుమని ఆజ్ఞాపించెను. ఇద్దరును పనులు ప్రారంభించిరి. ఎదురుగానున్న గోడలమీద చెరివకరు తీసుకొని చిత్రింప నారంభించిరి. ఇద్దరి గోడలమీద తెరలు వేయబడెను. కొన్ని రోజులు జరిగిన తర్వాత రాజు మంత్రులు మొదలైన తన పరివారముతో సహా వచ్చి, వీరి చిత్తరువులు పరీక్షించుటకు వేచి యుండెను.

మొదటి పనివాడు తెరయెత్తగా అతని పనితనమునకు జనులందరు ఆశ్చర్యపడసాగిరి. రాజుతో ఇంతకంటె చక్కని చిత్తరువులు ఈ లోకములో ఎవ్వరును వేయజాలరు. గాన మన కోటలో పనులు అన్నియు ఇతనికిచ్చి వేయుడని జెప్పదొడగిరి. ఇంక రెండవ పనివానియొక్క చిత్తరువు జూచుటే వ్యర్థమనిరి. రాజుగూడ అటులనే ప్రథమమున తలచెను. అయినను చూచినంతనే నష్టముండదు గదాయని రెండవ పనివాని గోడయొక్క తెరగూడ యెత్తించిరి. ఇంక రాజు యొక్కయు, ఆయన పరివారము యొక్కయు ఆశ్చర్యము ఏమని చెప్పమనెదరు! అందరూ ముక్కుమీద వ్రేలుబెట్టుకొనిరి. ఆ పనివానియొక్క అద్భుతమైన శక్తి, తెలివితేటలకును అందరు ఆశ్చర్యపడసాగిరి. ఒక్కరును మాట్లాడజాలకపోయిరి. కొందరు దైవప్రకృతి యంతయు అచ్చటనే యున్నదని ప్రార్థన జేయదొడంగిరి.

ఈ కథవల్ల రెండు విధములైన జ్ఞానములు మనకు తెలియవచ్చు చున్నవి. మొదటి పని వానిది బాహ్యాజ్ఞానము, మనస్సు యొక్క తెలివితేటలతోను, శక్తితోను ఇంద్రియములయొక్క సహాయముతోను తన శక్తి చాతుర్యతనంతను జూపించెను. ఇంక రెండవవాని జ్ఞానము అనుభవమైనది, బాహ్యము నుండి వచ్చినదిగాను, అంతర్యమున నున్నదే అతడుజేసిన దేమనగా, బైటనున్న దాగులను, మలినమును పూర్తిగా సాపుజేయదొడంగెను. బాహ్యా మలినములు ఏమియు లేనప్పుడు అంతర్య జ్ఞానము కోటిసూర్య ప్రకాశముగా తేజస్సు నిచ్చునుగదా.

దీనినే మనము మరియొక చిన్న సామాన్యపు ఉదాహరణను తీసుకొన్న, ఇంకను తేలికగా బోధపర్చుకొనవచ్చును. ఒక అద్దము ఉన్నది. దానిమీద మనము మట్టి జల్లిన, మన ప్రతిబింబము స్వచ్ఛముగా కనుపించదు. సరిగా కనుపించెడు లాగున జేయుటకు మనము యేమి జేయవలెను? మరికొంత మట్టి జల్లిన కనిపించునా? మరీ అంధకారమగును, ఉన్న మట్టినే పూర్తిగా

తుడిచి వేయవలెను. అటులనే మన ఆత్మ అనెడిది సర్వకాల సర్వావస్థలయందు మనలో నొక్కటియై వెలుంగుచున్నది. అది మసిబొగ్గు వంటిదిగాదు, మసిబొగ్గులైన యెంత తుడిచినా, యెంత తోమినా నలుపేగాని తెలుపు రానేరాదు. కాబట్టి మన ఆత్మ స్వభావముచేతనే స్వప్రకాశమానమైనది. మనము పరిమితిలేని ఈ కోర్కెలు, వాంఛలు మొదలైన ఇసుకరేణువులతో ఆ స్వచ్ఛమైన అద్దమును కప్పివేయుచున్నాము. ఒక్కొక్క కోర్కెయే తగ్గించిన ఆత్మ స్వప్రకాశమానముగా వెలుంగును. సర్వము లోపలనే యున్నది. బైటనుండి యేమియు కొని తెచ్చుకొననవసరము లేదుగాని, ఈ కొత్తగా కల్పించుకొన్న అజ్ఞానములను భ్రాంతులను మాత్రము వదలవలెను. ఈ భ్రాంతులను వదలిన, దైవము దూరముగా ఉండదు. ఇదే అనుభవమైన ఆంతర్య జ్ఞానము. దీనిని బొందుటకు బాహ్యమున వెదుక నవసరము లేదు. రాళ్ళలోను, గుళ్ళలోను వెదుక నవసరము లేదు. ఆంతర్యముననున్న దానిని తెలుసుకొనుట మాత్రమే కావలెను.

వృద్ధి గల్గించుటకును, లయింప జేయుటకు సంగమే కారణము. జ్ఞానులతో సహవాసము జేసిన జ్ఞానమే అబ్బును. అజ్ఞానులతో కూడియున్న అజ్ఞానము తప్పక కలుగును. గాన ఆత్మజ్ఞానమును వృద్ధి జేసుకొనుటకును, తరించుటకును, అనుభవనీయులైన మహానుభావులను ఆశ్రయించిన, తప్పక మన కోర్కెలు నెరవేరును. అనుభవజ్ఞులైన, దైవజ్ఞులు మనకు ఆకాశములోను, స్వర్గములోను దైవమును గురించి బోధించరు. మన నుండి వేరుగా ఉన్న దైవస్వరూపము ఎంత మాత్రము మనకు శాంతిని గల్గించజాలదు. గాన మన ఆంతర్యముననున్న, సదా మనలో ఒక్కటియై యున్న దైవమే మనకు శాంతి నిచ్చును.

దైవమన్నను జ్ఞానమన్నను నొక్కటియే యని యిది వరకే జెప్పబడెనుగదా! ఉన్నది ఒక్కటియే దానినే యెన్ని రీతులుగా పిలిచినను

పిలువవచ్చును. ఆ దైవము ఇటుల ఉండునని చెప్పుటకు నామరూప రహితుడుగదా? వర్ణించి బోధించుటకైనను వర్ణణాతీతుడుగదా? ఇచ్చట యున్నాడు. అచ్చట లేడు అని చెప్పుటకు వీలులేదుగదా? సర్వాంతర్యామిగదా? ఒకటి రెండు చిన్న ఉదాహరణములను తీసుకొన్న ఆ దైవత్వమును తేలికగా మనము బోధపర్చుకొనవచ్చును. పాలను తీసుకొనుడు; పాలలో వెన్న యెచ్చట నున్నది? ఇచ్చట అచ్చట యున్నదని జెప్పుటకు వీలున్నదా? ప్రతి పాల బిందువులోను గూడ వెన్నయే యున్నది. వెన్నలేని పాలచుక్క ఒకటిని మనము వేరుజేసి జూపించజాలము. మనము జాగ్రత్తగా పాలనుకాచి పెరుగుగా మార్చి చేయవలసిన రీతిగాజేసి చిలికినప్పుడు వెన్న వచ్చును. అటులనే దైవము సర్వాంతర్యామిగా అంతటా అందరిలో నున్నను ప్రణవ మనెడి కవ్వముతో, ధ్యానధారణ అనెడి చేతులలో, మనస్సు అనే త్రాడు పట్టుకొని సమాధియనెడి పెరుగుకుండలో చిలికిన బ్రహ్మ మనెడు వెన్న వచ్చును. పాలను ముందు పెట్టుకొని వెన్న వెన్న అని అరచినంత మాత్రముననే వెన్న బైటపడదుగదా? వృథా ప్రయాసగాని లాభముండదుగా? అటులనే అంతయు దైవమని అరచినంత మాత్రమున లాభములేదు. సాధన చతుష్టయ సంపత్తులు గల్గినవారై, అనుభవనీయుల దరిజేరి నిద్రించుచున్న దైవత్వమును మేల్కొల్పవలెను. అప్పుడు గదా జ్ఞానమన్న అనుభవముగా గోచరించును. దైవము లోపలయున్నాడని అందరును జెప్పుదురు. లోపలనేయున్న ఈ శరీరములో యెచ్చట నున్నాడు? కాళ్ళలో నుండెనా? చేతులలో నుండెనా? ముక్కులో నుండెనా? చెవులలో నుండెనా? లేక మనస్సులో నుండెనా? బుద్ధిలో నుండెనా? కొందరు మూఢులు శరీరమే దైవమనుకొనెదరు. మరికొందరు చదువుకొన్నవారు మనస్సు దైవమనుకొనెదరు. దైవమును దైవముగా గ్రహించేవారు చాల అరుదుగదా? దైవము కర్మేంద్రియములనేగాక, జ్ఞానేంద్రియములకుగూడ అతీతుడుగదా? కర్మేంద్రియములకు, జ్ఞానేంద్రియములకు అతీతుడైనప్పుడు, దైవము కాళ్ళలో, చేతులలో, చెవులలో, కండ్లలో నుండెనని యెటుల చెప్పగలము? సర్వత్రానిండి

యున్న స్వరూపము నొక్కచోట యెటులయుండును? పోనీ, మనస్సులోను బుద్ధిలోను ఉండెనన్న, దైవము అవాఙ్మనసగోచరుడు గదా? దైవము వాక్కునకేగాక మనస్సునకు, బుద్ధికిగూడ అందడట, చిత్తము అహంకారము మొదలైనవి అఖండమైన దైవమును ఎటుల బంధించగలవు? యెటుల తెలుసుకొనగలవు?

దైవము ఒక్కచోగాక సర్వత్రా నిండియుండెను. గాన, ఈ మనస్సు; చిత్తము మొదలైనవి ఆ దైవములో లీనత్వమైన, దైవత్వమును పొందగలవు. జ్ఞానము అంతర్యముననే లోపలనే యున్నను, ఇచ్చట యున్నదని, అచ్చట నున్నదని చెప్పుటకు వీలులేదు. మనము ఒక ఉల్లిపాయ తీసుకొని అందులో గింజవెదుకుటకు ప్రయత్నించిన యెప్పటికినీ వెదుకజాలము. మనము ఒక్కొక్కపొర తీసినకొలది ఇంకను పొరలే వచ్చుచుండును. ఎన్ని వలచినను అటులనే యుండును. గాన దైవమును లేక జ్ఞానమును బాహ్యాశ్రమలు, బాహ్య పరిశీలనలవల్ల పొందజాలము. నిమిషనిమిషమునకు పరిమితిలేనన్ని తావులకు చలించుచున్న ఈ మనస్సును స్వాధీనము జేసుకొనిన యెవ్వరంతట వారే దైవమును దర్శింపగలరు. మనో సంచారమే దైవమును దూరముగా పెట్టుచున్నది. మనోజయమే దైవత్వమునుగోచరింపజేయును. సర్వము దైవమన్న సంగతిని తెలుసుకొని ఈ చంచలమైన మనస్సులను దైవములో లీనముజేయ ప్రయత్నించవలెను. ఉన్నదంతయు దైవమేయైయుండ, అంతర్యమున బాహ్యమున బాహ్యము తప్ప తదితర వస్తువులేనప్పుడు సర్వము దైవమయమై యున్నప్పుడు, మనస్సు మాత్రము ఎక్కడకు పరుగెత్తును? ద్వంద్వములోనే మనస్సు పరుగెత్తుటకు సావకాశమున్నది. నిర్గుణత్వములో నొకేస్వరూపములో మనస్సు యెటుల చలించును? వాస్తవముగా జూచిన అచ్చట మనస్సు ఉన్నదా?

ప్రియ స్వరూపులారా! నేను ముఖ్యముగా మీ అందరకు చెప్పబోయెడి సంగతియేమనగా దైవముతప్ప అన్యమైన వస్తువు ఎచ్చటను ఎప్పుడును

లేదుగాన పరిశీలించి జూచిన ఆ దైవస్వరూపమే మీరుగా ఉంటున్నారు. బాహ్యముగా మీరు వినుచున్న సత్యమును మీరు అనుభవములోనకు తెచ్చుకొన్నప్పుడే మీకు దాని యదార్థము తెలియగలదు. అప్పుడే మీ జన్మహక్కైయైన దైవత్వమును నిజశాంతిని బడయగలరు. మీ ఆనందమంతయు ఆ దైవత్వములోనే పరిపూర్ణములోనే యున్నదిగాన, దానిని అనుభవముగా పొందువరకు అచ్చటనే పట్టుదలతో ప్రయత్నించుడు. మీ మనస్సులను అందు లీనముజేసి శాంతిని బొంద ప్రయత్నించుడు. ఒక్కమాటలో మనస్సు నశించువరకు మోక్షము లేదు. మనస్సు నశించగనే మీరు మోక్షములోనే యుందురు. దైవముగానే యుందురు. ఈ మనస్సు యొక్క సంకల్పనలే ఈ అజ్ఞానములకు ఈ బంధములకు కారణమైయున్నవి. యేక్షణమందైతే మీరు సంకల్ప శూన్యులు అవుచున్నారో ఆ క్షణమందే మీరు పరిపూర్ణత్వమును జెందుచున్నారు.

ప్రియసోదర సోదరీ స్వరూపములారా! ఇవన్నియు నేను క్రొత్తగా నూతనమైన సంగతులు జెప్పుచున్నానని అభిప్రాయపడవలదు. ఇవన్నియు మీరు యెరింగియున్నవే. అందరకూ తెలిసియున్నవేగాని, అనుభవములో పెట్టవలసియున్నది. అనుభవములేని జ్ఞానమంతయు బరువేగాని ఫలితమునియ్యదు. ఒక యేనుగు వీపుమీద మనము చాల ఆకులు పండ్లు మొదలైనవి వేసిన, అవి ఏనుగునకు బరువుగానె యుండును. వాటినన్నింటిని ఏనుగు భక్షించిన ఆ ఏనుగునకు బరువు కనిపించుటకు బదులు ఎంతయో శక్తిగ ఉండును. ఏనుగు ఏమియు తినకుండ ఆ బరువునే సదా మోయుచున్న ఎంతయోకాలము బ్రతుకదుకదా? అటులనే మన జ్ఞానమునంతయు బైబులులోను, వేదములలోను, గుళ్ళలోను, చర్చిలలోను, మన జేబులలోను, దాచుకున్న మనకు బరువుచేటేగాని, జ్ఞానవాసన పొందజాలము. చివరకు యెన్ని నేర్చుకొన్నను పశుప్రాయులుగనే యుండుట జరుగును. అనుభవములేని చదువులు విద్యలు విధానములవల్ల మెదడు పాడగుటయే గాని, వేరులాభము

గలుగదు. ఇప్పటివరకు మనము నేర్చుకొన్నది అనుభవములో పెట్టుటకే చాలకాలము పట్టును. చాల ప్రయత్నములు చేయవలెను. ఉన్నదానిని నిరుపయోగము జేయుచు ఇంకను నేర్చుకొనుటకు అచ్చట ఇచ్చట తిరిగిన యేమి లాభము? మీరు ఎరిగియున్న ఇంతవరకు మీకు దైవముచే ఇవ్వబడ్డ అంశములనే అనుభవములో పెట్టిన మీరు ఈ క్షణము నుండియే నిజమైన శాంతిని వృద్ధిని పొందెదరు.

మనకు ఇవ్వబడ్డ వాటిని సరిగ్గా అనుభవములో పెట్టుచు మనము అర్హతగానున్న ఇంకను మన అవసరమైన కొదువ అంశములు గూడ కోరకుండగనే మనకు దొరకును. అర్హతలేనివారెంత కోరినను పొందజాలరు. అర్హత కోరకుండగనే సర్వమును బడయగలరు. మనయొద్ద ఒక లాంతరు ఉన్నదనుకొనుడు. ఈ లాంతరుయొక్క సహాయముతో మనము 100 మైళ్ళు వెళ్ళదలచిన ఇచ్చటనుండి 100 మైళ్ళు వరకు ఈ లాంతరు వెలుగు నిచ్చుటలేదని, దీనివల్ల లాభములేదని లాంతరును పారవేయ ప్రయత్నించకుడు. ఈ చిన్న లాంతరుయొక్క సహాయముచేతనే యెంతవరకు వెలుతురు కనుపించుచున్నదో (10 అడుగులే అనుకొనుడు) ఆ పది అడుగులు మీరు వెళ్ళిన మరి 10 అడుగులు వెలుతురు మీ ముందుగనే యుండును. అటులనే వెళ్ళిన, యెన్ని వందల మైళ్ళు అయినా వెళ్ళగలరు. అటులనే మీ ధ్యానములో ఒక్క నిమిషము ధ్యానించినమాత్రమున దైవము గోచరించుటలేదని ధ్యానమును మానకుడు. నేడు ధ్యానములో ఒక్క క్షణమైనను శాంతినిబొంద ప్రయత్నించుడు. ఒక్కక్షణమే మీ మనస్సు నిల్పుడు. రేపు తప్పక రెండు నిమిషములు మీ మనస్సు స్థిరముగానుండి శాంతినిచ్చును. అటుతర్వాత 2, 3 నిమిషములు శాంతిని బడయగలరు. అటులనే క్రమముగా పట్టుబిడువకుండ అభ్యసించిన మీ మనస్సులు ఎన్ని గంటలైనను స్థిరముగా నుండి మీకు శాంతినిచ్చును.

భక్తి స్వరూపములారా! నేను క్రొత్తగా మీకు రహస్యమైన సంగతులన్నియు జెప్పుచున్నానని తలంచవలదు. ఇవన్నియు మీరు ఎరింగి

యున్నవే గాని అనుభవములో పెట్టుట అవసరమై యున్నది. అనుభవములో పెట్టిన ఇవియే రహస్యములవ్వును. దైవమే సత్యమని, నిత్యమని అఖండ సచ్చిదానంద స్వరూపులమని తెలియనివారు ఎవ్వరూ ఉండరు. పొలము దున్నుకొనే రైతులనుండి గొప్ప తత్త్వవేత్తవరకు దైవసంగతులు తెలిసి యున్న వారేగాని అనుభవములో ఆచరించవలసి వచ్చినప్పుడు నిత్యమైన దైవమేమరుగవ్వును కొదువదంతయు సత్యముగా తోచును. యెట్టివారికైనను మాయను దాటుట దుర్లభముగదా? మాయనే ఆవరింపబడి యుండుటచేతనే యెంత తెలివియున్న వారైనను పొరబాటు బొందుచుందురు. ఎవ్వరి అవస్థను వారు తెలుసుకొని యుండుటగూడ చాల మంచిది. మనము ప్రస్తుతము యే అవస్థలో నున్నామో, మన దుర్బలత్వము లెవ్వియో తెలుసుకొన్న ఇకముందు అయినా జాగ్రత్తగా నుండవచ్చును. ఎవ్వరితప్పు వారు తెలుసుకొనజాలనివారు ఎప్పటికిని వృద్ధి జెందజాలరు.

మనము గుడిలోనకు వెళ్ళినప్పుడు ప్రార్థనలు జేయునప్పుడు సర్వమును దైవమునకే అర్పించి దైవములో లీనమైయుందుము. ఓ దైవమా! మా సర్వము నీవే ఈ శరీరములుగూడ నీవే. నీవు తప్ప అన్యమేమియు వలదని ప్రార్థన జేయుచుందుము. అచ్చటనుండి బైటకురాగానే ఒక్కొక్కటి మరల తీసుకొందుము. గుడిగుమ్మము దాటకుండగనే శరీరము మనది అగును. కోరికలు హెచ్చు అగుచుండును. అహంకారము మెండుగా నుండును. గుడిలో నున్నప్పుడు జేసిన ప్రార్థన గుడిబైటకు రాగానే కనుపించకున్నది. గుడిలోసర్వము దైవముగా కనుపించెను. బైటకురాగానే సర్వము నామరూపములుగా కనుపించును. దైవమెచ్చటా కనుపించడు. గుడిలో ప్రార్థన జేయుచుండ ఆంతర్యమున, బాహ్యమున సర్వము దైవముగా గోచరించెను. ఇప్పుడు దైవమెచ్చటా కనుపించడాయెను. ఇంత దట్టమైన అజ్ఞానమునకు కారణ మేమి? ఇది దైవము తప్పుయా? అన్నివిధంబులా మనమే మోసము జేయుచుండ పాపము దైవము యేమి జేయగలడు? దైవము (అక్రియుడు యే

కర్మలు జేయడు) కర్మరహితుడు అసంగుడు, పరిపూర్ణుడు అన్నియు మనమే జేయుదము. బురదలో కాళ్ళు వేసెడివారము మనమే. బురద మరల కడుగుకొనవలసిన వారము మనమే. మనము జేయుచున్న కర్మలకు మనమే జవాబు జెప్పవలసి యుండును. ఇంక యెన్నాళ్ళు దైవమును మోసబుచ్చ ప్రయత్నించెదరు? దైవమునందు నిజమైన భక్తి, పట్టుదల, ప్రేమ లేకుండుటే ఈ అవస్థలన్నిటికి కారణమైయున్నది. అనుభవమైన జ్ఞానమే గల్గియున్న గుడిలోను, గుడిబైట, ఇంట్లోను అడవిలోను ఒకేరీతిగా ఉండుట జరుగును. ఎచ్చటకు వెళ్ళినను ఎచ్చటజూచినను దైవమే గోచరించును, నిజమైన భక్తి స్వచ్ఛమైన అంతఃకరణ అనుభవమైన జ్ఞానము లేనందుననే మనకు ప్రపంచములో అనేక అవస్థలు, తాపత్రయములు, బాధలు తప్పకున్నవి. సుఖదుః ఖములు మొదలైన అవస్థలన్నిటికి అతీతులై యుండవలెనన్న దైవమును త్రికరణశుద్ధిగా నమ్మి అనిత్యమైన సత్యములో లీనమౌటయే ముఖ్యమైన ఒకే మార్గముగా ఉన్నది.

బాహ్యజ్ఞానము ఎప్పటికిని మనకు శాంతి నివ్వజాలదు. అనుభవమైన అపరోక్షజ్ఞానమువల్లనే మన మనస్సులు శాంతించి సర్వము నిత్యముగా గోచరించును. అన్ని స్వరూపములలోను నిత్యమైన దైవ స్వరూపమునే జూడనియెడల మన బ్రతుకులుగూడ తన ప్రతిబింబమునే జూచుకొని నశించిన కుక్కవలె నుండును. ఆ కథ ఇచ్చటజెప్పిన అందరకూ ఉపయోగముగా ఉండవచ్చును. గాన మీకు జెప్పుటకు కుతూహల పడుచుంటిని.

హిందూదేశములో ధనికుల ఇండ్లలో అద్దముల గదులు ఉండును. కొన్ని గదులలో యేవైపుజూచినా అద్దములే అమర్చెదరు. తన కర్మచేత అటువంటి అద్దముల గదిలోనికి ఒకకుక్క వెళ్ళుట తటస్థించెను. స్వభావముచేతనే కుక్క మరియొక కుక్కను జూచిన మొరుగునుగదా? అసూయత హెచ్చుగదా? అకుక్క తన ప్రతిబింబమునే ఒక అద్దములోజూచి అసూయచేత మొరగ నారంభించెను. ఇది మొరుగుచుండ రెండవది గూడ

నోరు తెరచి కరవబోవుచున్నట్లు కనుపించెను. ఇది మరీ హెచ్చుగా నారంభించెను. ఆ ధ్వనిచే కంగారుపడి, రెండవవైపు జూచినా అచ్చటగూడ కుక్కలే కనుపించెను. మరియొక ప్రక్కకు తిరిగినా అచటగూడ కుక్కలే తనను తినివేయుటకు వచ్చుచున్నట్లు గోచరించెను. ఇంకను భయపడి ఇంక దిక్కు కనిపించుట లేదని ఆకాశమువైపు మీదకు జూడ నారంభించెను. **(Ceiling)** పైగూడ అద్దములే అమర్చబడి యుండుటచే కుక్కలన్నియు మీద పడబోవుచున్నట్లు కనుపించెను. ఇక క్రిందజూచినా యేవైపు తిరిగినా, ఎచ్చటజూచినా, అచ్చటే కుక్కలు వందలకొలది తనచుట్టూ ఉండెను. ఇంకను హెచ్చుగా బెదరి గంతులువేసి అరవసాగెను. ఆ కుక్కలన్నియు ఎగురుచున్నట్లు, మొరుగుచున్నట్లు తనమీద పడుచున్నట్లుగాంచి బెదరిపోయి వెంటనే అచ్చటనే తన ప్రతిబింబములను జూచియే భ్రాంతిచేత గిలగిల కొట్టుకొని చనిపోయెను.

అటులనే మనముగూడ ప్రతిబింబములనే ఇతరులలో జూచి ఆనందించుటకు బదులు అనేకమైన భయభ్రాంతులతోను, అసూయతతోను నిండి జీవించుచున్నాము. అదిగో ఈ మనిషి మనలను తిట్టుచున్నాడు. ఆ మనిషి కొట్టబోవుచున్నాడు. మరియొకడు మ్రింగబోవుచున్నాడు. ఇంక నొకడు కరవబోవుచున్నాడు. అని యేదో వక్రరీతిగా, ఇతరులను జూచి భయపడుచునే యుందుము. ఇటులనే భయపడుచు మనజీవితములను గడిపిన చివరకు ఆ కుక్క చేరిన గమ్యస్థానమునే చేరెదము. కుక్కవలె జీవించుచున్నవారు భ్రాంతులలో మునిగియున్నవారు కుక్కయొక్క గమ్యస్థానమును చేరుటయందు ఆశ్చర్యమేమి యున్నది?

ఇప్పుడు జెప్పిన చిన్నకథనే మరియొక రీతిగా బోధపర్చుకొందుము. మనము మాట్లాడుచున్న పై అద్దములగది లోనకే, ఆయింటియొక్క యజమానుడు వచ్చుట తటస్థించెను. అతడు గూడ తనబింబములనే జూచి కుక్కవలె జడుచుకొనునా? ప్రతీ అద్దములోను తన సౌందర్యమును జూచి ఆనందించసాగెను. మరియొకవైపునకువెళ్ళి అచ్చటగూడ తన చక్కదనమునే

జూచుకొనెను. ప్రతీ అద్దములోను తన రూపమునే జూచుకొని యెంతయో ఆనందించెను. అటులనే మనముగూడ సదా ఆనందములో మునిగియుండవలెనన్న ప్రతీస్వరూపములను, సోదరసోదరీ స్వరూపములన్నింటి లోను, జాతి, మత, దేశ, వివక్షత లేకుండా నిత్యమైన మనస్వరూపమునే జూడవలసియున్నది, మనము జూచెడి ప్రతీవస్తువులోను, దైవమునే జూచుచున్న యెంత ఆనందముగా నుండును. కనుపించే వారందరినీ దైవముగానే భావించిన యెంత శాంతి యుండును. మనము యెవ్వరితో మాట్లాడినా దైవముతోనే మాట్లాడుచున్నట్లు భావించిన యెంత శక్తి యుండును, సర్వము దైవమైయుండ దైవముతప్ప అన్యమెద్దియు ఎచ్చటను, యెప్పుడును లేనప్పుడు మనము అన్నిటిలో అనిత్య స్వరూపమునే చూడవలదా! సర్వములో మన నిత్య స్వరూపము జూడగలిగినప్పుడు మనకు నిత్యశాంతి కలుగును. అప్పుడే మన మతము నిజమగును. దైవము సత్యమగును. మన జ్ఞానము యథార్థమగును. అప్పుడే పూర్ణశాంతియనగ యేమో అనుభవముగా బోధపడును.

అభేదదర్శనం మోక్షమ్ సంసారో, బేధదర్శనమ్ ।
సర్వవేదాన్త సిద్ధాన్తః ఇతివేదాంత డిండిమః ॥

అని హిందూ శాస్త్రములు ఘోషించుచున్నవి. గాన బేధబుద్ధియే సర్వసంసారమునకు అన్ని భ్రాంతులకు కారణమైయున్నది. అబేధ దర్శనమువలనే, సర్వములో తన స్వరూపమును జూచుటచేతనే మోక్షము గలుగుచున్నది. మోక్షము ఎంత దగ్గరగా నున్నది. కావలసినవారికి దగ్గరగానే గాకుండ వారిలోపలనే యున్నది. అక్కరలేనివారికి లోపలనూ కనుపించదు, బైటను కనుపించదు. ఎచ్చటనూ కనుపించదు. గాన సర్వకాల సర్వావస్థలయందును జ్ఞానలక్ష్యమును విడవకుండా నిత్యస్వరూప జ్ఞప్తితోనే జీవించుచున్న అట్టివారికి స్వర్గము తమ స్వస్వరూపముగానే అబేధముగానే కనుపించును. ఇంక శరీర జ్ఞప్తితోనే సదానిండియున్నవారికి ఎంత

తెలిసియున్నను, ఎంత గొప్ప పండితోత్తములైనను కండ్లు మూసినను తెరచినను సర్వము భేదముగానే కానవచ్చును. అట్టివారు ఒక్కక్షణమైనను మనస్సును శాంతిపర్చజాలరు, మనస్సు శాంతిగానున్న సర్వము శాంతిగా నుండును గదా? కోర్కెలనే అజ్ఞానవలలో జిక్కి గాఢమైన అంధకారములో మునిగియుండ అచ్చట వెలుతురు ఎటుల కనుపించును? మనస్సు ఎటుల నిలుచును? బైబిలులో గూడ, **"Be still and the word speaks in Silence"** నీవు శాంతిగా సంకల్పశూన్యుండవై యుండుము. ప్రభువు శాంతితోనే మాట్లాడునని జెప్పబడి యున్నది. గాని మనము శాంతిగా ఉంటున్నామా? దైవము మనతో మాట్లాడుటకు లేశమైనా సావకాశ మిచ్చుటలేదు గదా? ఇకముందైనను మీరు ఇంతవరకు నేర్చుకొనియున్న జ్ఞానసంగతులనే అనుభవముతో వుంచుకొనుచు మీ మనస్సును దైవములో లీనముజేసి శాంతిని పొందుడు. మీ అవస్థను మీరు తెలుసుకొని వృద్ధిజెందుటకు నిశ్చయించిన మీరు తప్పక వృద్ధి అయ్యెదరు. దైవమును మోసపుచ్చుట మాత్రము వదలవలెను. అటుల జేసిన మనమే మోసబోయెదము.

ఎవ్వరును భయపడ నవసరములేదు. అందరును దైవమును చేరెదరు. యేలనన జ్ఞానమే మన జన్మహక్కు. మనము మరచినను అది తగ్గెడిదిగాదు. మనలను వదలెడిదిగాదు. గాన, ఆ జ్ఞానమునే అనుభవించుచు మీరందరు శాంతిని పొంది, జన్మరాహిత్యులగుటనే నేను కోరుచు ఈ చిన్న ఉపన్యాసమును పూర్తిజేయుచున్నాను.

# తా నొకటి తలచిన దైవ మొకటి తలచును

డాక్టరు నారాయణస్వామిగారు పరమభక్తులు, సేవాపరులు, వారు ఆయుర్వేద వైద్యులేగాక, హోమోపతియందు గూడ చాల అనుభవము గలిగి యుండిరి. గుంటూరు జిల్లాలో నున్న చందవరం అనే గ్రామమునందును, ఆ చుట్టుపట్ల నున్న ఇరువది గ్రామములలో నున్న నిరుపేదలైన రోగులందరకు ఉచితముగా సేవ జేయుచు వారి అమూల్యమైన కాలమును సద్వినియోగము జేయుచుండిరి. అప్పుడప్పుడు తోటపల్లి ఆశ్రమమునకు గూడ మందులు పెద్దపెద్ద పేకేజీ పెట్టెలతో పంపుచు, వాటిని రోగులకు వాడెడి విధానమును గూడ దెల్పుచు ఉత్తరములు వ్రాయుచుండెడి వారు.

నన్నుగాని, శాంత్యాశ్రమమునుగాని యెన్నడూ చూడజాలకుండుట దైవవిధి, ఆశ్చర్యము, విచారకరము, వారెంత నిరాడంబరముగా, అమాయకముగా భక్తి, ప్రేమలతో నిండియుండెడివారనగా, వారిని డాక్టరు అని పిలుచుటకు బదులు సాధునారాయణస్వామిగారు అని సంబోధించిన, సమంజసముగా నుండునని తోచుచున్నవి. ఆయన ఉండెడి తావు చిన్న గుడిశ. ఆ చిన్న కుటీరములోనే రోగులసేవ చేయజాలనప్పుడు, ప్రార్థన, ధ్యానాదులతో వారి కాలమును గడుపుచుండెడివారు. శాంతి ప్రార్థనయందు వారికి మిక్కిలి ప్రీతి, దానిని వారు స్మరించుటయే గాక వారి బంధుమిత్రులు, శిష్యకోటి, చివరకు రోగులచే గూడ స్మరింప జేయించెడివారు.

హఠాత్తుగా సాధునారాయణస్వామిగారు, వారీ లోకములో చేయవలసిన సేవ పూర్తి అయ్యెననియు, వారికి దైవము నుండి పిలుపు వచ్చుచున్నదని అంతర్వాణి చెప్పదొడగెను. గాన ఒక్క ఉత్తరము, నన్నుజూచుటకు కోరుచుంటినని, తన జీవితములో మిగిలియున్న ఒకే కోరిక, "మిమ్ము దర్శించి మీ పాదపూజజేసి, ఈ నేత్రములు మూయుటకు కోరుచుంటిని" అని, ఆ ఉత్తరమునే టెలిగ్రాముగా భావించి దర్శనమిప్పించమని వ్రాసెను. కర్మవశాత్తు

ఆ ఉత్తరము ఆరు రోజులకు నాకు అందెను. దానిని ఆయన స్వయముగా వ్రాయుటచే అంత జబ్బుగా ఉండకపోవచ్చునని, నేను తొందరపడి వెంటనే బయలుదేర లేదు. ఆ ఉత్తరములో శ్రీ సాధునారాయణస్వామిగారు 516 రూపాయలు ఆశ్రమ సేవకై వినియోగించకోరుచుంటినని గూడ వ్రాసెను. మమ్ము వెంటనే రమ్మని మరల టెలిగ్రాము ఇచ్చెను. మేము గూడ వచ్చుచుంటిమి, ధైర్యముగా ఉండుడని తిరుగ టెలిగ్రాము ఇచ్చి, వెంటనే బయలుదేరితిమి. దురదృష్టముచే, మేము ఎంత త్వరితముగా ప్రయాణము సాగించినను చందవరము చేరుసరికి, శ్రీ సాధు నారాయణస్వామివారు, "ఇంకను స్వామీజీ రాలేదా, రాలేదా" అనుచు ఆ క్రిందటి దినమే వారి భౌతిక దేహమును విడిచిరన్న విషాదవార్తను వినుటకు మా హృదయములు బరువెక్కెను. వారు ప్రార్థన, ధ్యానము జేసుకొనెడి చిన్న కుటీరములోనకు వెళ్ళితిమి. అచ్చట కుర్చీలు, బెంచీలు ఐనను లేవు. అందులో ఉన్నది ఒక్కటియే! అది నలభై సంవత్సరముల క్రింద తీయబడిన, ధ్యానములో నేను కౌపీనధారినైయున్న నా చిన్న ఫొటో! మరే ఫొటోలు, దైవపటములు గూడ ఆ కుటీరమందు లేవు. ఆ ఫొటో ఆయన యెప్పుడు, ఎటుల సంపాదించెనో ఆశ్చర్యముగా ఉండెను. శ్రీ సాధు నారాయణుని అల్పమైన చిన్న కోర్కెనైనను తీర్చజాలకపోతిని గదా, ఆయన జీవించి యుండగా, ఆయన దగ్గరకురాజాలక పోతిని గదాయని, నన్ను నేను చాలా నిందించుకొనుచు, పశ్చాత్తాపము పడితిని, వలికిపోయిన పాల గురించి ఎంత దుఃఖించిన ఏమి లాభముండును?

శ్రీ నారాయణస్వాములు నా పాదపూజకై పండ్లు, పుష్పములు, అగరవత్తులు మొదలైనవన్నియు పరిసర పెద్ద గ్రామముల నుండి తెప్పించి యుంచిరి. హారతి కర్పూరము, సాంబ్రాణి మొదలైన దీపధూప నైవేద్యములన్నియు సిద్ధముగా నా కొరకై వేచియుండెను. అన్నియు సిద్ధముగా ఉండెను. గాని ఒక్కరు మాత్రమే లేరు. అది భక్తి, ప్రేమపూరితమైన నారాయణుని శరీరము. ఎంత విషాదకరము! శ్రీ నారాయణస్వాములకు, ఆయన యీ లోకమును

వీడెడి రోజు, గంట గూడ తెలుసును. ఆ రోజున ఆ గంటలో "శ్రీ స్వామీజీని చూడజాలకుండ వెళ్ళుచుంటిని". అని ఆయన శిష్యకోటికి జెప్పుచూ సమాధి పొందిరట. ఎంత విచారకరము!

ఈ లోకములో మనము జేసిన కొన్ని తప్పులను సరిజేసుకొన వచ్చును. గానీ ఈ తప్పు విషాదకరమైన ఈ అశ్రద్ధ ఆలస్యము సరి జేయజాలనిది. దైవము ఈ నా పొరపాటునకు ఆలస్యముగా చందవరము వెళ్ళినందుకు మన్నించుగాక! శ్రీ నారాయణస్వాముల వారి ఆత్మను నిత్య శాంతితో నిరంతరము బ్రోచు గాక! ఆశ్రమవాసులు కొందరు చంద్రవరము ఆలశ్యముగా వెళ్ళితివి గాన శ్రీ నారాయణస్వాములవారు దేహమును విడిచితిరి. కాన వారు ఇచ్చెదనన్న 516 రూపాయలు గూడ వారితోనే పోయెనేమో, యని తలచసాగిరి. గాని సాధు నారాయణస్వామిగారు – వారి కండ్లు మూయకముందే శ్రీ స్వామీజీ రాగానే, వారి ప్రేమార్పణను పూజ పురస్కారములతో అర్పించమని శిష్యులను కోరుచూ, అన్ని యేర్పాట్లు జేసియే వారు కండ్లు మూసిరి. గురుభక్తిలో గురువును మించిన శిష్యులన్నట్లు, శ్రీ నారాయణస్వామిగారు యేర్పర్చిన 516 రూపాయలకు మరొక్క 50 రూ॥లు కలిపి ఆశ్రమ సేవలో వాడుటకు అర్పించితిరి. వారి శిష్యులలో ముఖ్యులైన శ్రీ విష్ణుమూర్తిగారు అనెడి భక్తులు తాము స్వయముగా 100 రూ॥లు ఆశ్రమవృద్ధిని కోరుచు అర్పించుట చాల ఆశ్చర్యము. ఆనందమును గల్గించెను. గురువెట్లో శిష్యులు గూడ అట్టి సేవాపరులై ప్రేమమూర్తులై యుందురుగదా! శ్రీ గురుదేవులు లేని కొరతను శ్రీవిష్ణుమూర్తిగారు ముందు ముందుకు శ్రీశాంత్యాశ్రమ సేవను జేయుచు తోడ్పడుచుందునని వాగ్దానము జేసిరి.

ఆ సాయంత్రము ఒక గొప్ప సమావేశము శ్రీ సాధునారాయణ స్వామిగారి జ్ఞాపకార్థముగా ఏర్పాటు చేయబడెను. పరిసర ప్రాంతముల నుండి అనేకమైన గ్రామములనుండి భక్తు లందరును విచ్చేసిరి. శ్రీ డాక్టరుగారు

అహోరాత్రములయందు ఎటుల బీదనారాయణుల సేవచేసి యున్నది. వారి గుణములను పెక్కుమంది ఉపన్యసించిరి. మేము సకాలమునకు రాజాలక, ఆలస్యముగా వచ్చినందుకు, శ్రీ నారాయణస్వాములు వారి ఆత్మనేగాక, వారి శిష్యకోటి అందరి క్షమార్పణలనుకోరుచు, శ్రీ డాక్టరుగారి అఖండమైన సేవ జ్ఞాపకార్థముగా వారి పేరు స్థిరస్థాయిగా ఉండేలాగున వారికి బీదసాదలయందు, రోగులయందు, ప్రేమ గావున వారి పేరున నారాయణ ఆసుపత్రి నొకదానిని వెంటనే నిర్మించి, రోగులసేవ జేయుచుండమని కోరితిని. వారి శిష్యులు అచ్చటచేరిన భక్తులందరునూ, అటులనే త్వరలో నారాయణ ఆసుపత్రిని కట్టించుటకు వాగ్ధానము జేసిరి. వారు బ్రతికియుండగ రాజాలకున్నను, శ్రీ నారాయణ ఆసుపత్రిని తెరచి దాని ప్రారంభోత్సవము జేయించుటకు, మరల వచ్చెదనని వాగ్ధానము జేసితిని. భక్తులందరూ చాల ఆనందించితిరి. భజనలు, ప్రార్థనలు, ప్రణవగానము జేయుచుండ శ్రీ నారాయణ స్వాములు గతించినట్లు ఉండుటకు బదులు, వారి సన్నిధిని, మేమందరము అచ్చటనే అనుభవించసాగితిమి.

శరీరములు మారవచ్చునుగాని, ఆత్మ యెప్పుడునూ స్థిరముగానే ఇచ్చటనే సదా వెలుగుచున్నదని నేను మరల మరల నొక్కి జెప్పుచూ, శ్రీ నారాయణస్వాములయందు ప్రేమ, భక్తి, గౌరవమున్న వారందరూ వారి రోగులసేవ నిరంతరము, స్వార్థరహితముగా జేసినట్లే. మనమందరమును గూడ, ఇప్పుడు, ఇక ముందును జేయుదుము గాక యని దైవమునకు వాగ్దానము జేయుచు ముమ్మారు ప్రణవగానము చేయబడెను.

ఇప్పటికిని, శ్రీ నారాయణుని ఆంతర్యమైన, అంత్యకోర్కెనైనా నేను తీర్చజాలకపోతినని జ్ఞప్తికి వచ్చినప్పుడెల్లను, హృదయము బరువెక్కుచుండును. గాని శాంతి ప్రార్థనను స్మరించగనే నారాయణుని సన్నిధిని ఆంతర్యమున, బాహ్యమున క్రిందను, మీదను, చుట్టును అనుభవించుచూ తృప్తినిచెందు

చుందును. నారాయణుడే నా హృదయమునకు హృదయముగా, శ్వాసకు శ్వాసగా, ఆత్మకు ఆత్మగా నిరంతరము ఉన్నట్లు తృప్తిని పొందుచుందును, ఈ అవినాభావ ప్రేమ అనుసంధానమే నాకిప్పుడు మిగిలియున్న ఆనందము, తృప్తి.

మానవుడు ఎంత చదువరియైనను, మేధావంతుడైనను, దైవము ముందు, ఎంత అల్పమైన కించిజ్ఞత్వముకలవాడు! తాను కట్టుచున్న గాలిలో మేడలన్నియు ఒక్కక్షణములో కూలబడునుగదా! తాను దైవాజ్ఞ లేనిదే గడ్డి పరకైనను కదల్పజాలడుగదా! స్వర్గములోను, భూమి మీదను దైవాజ్ఞయే దైవవిధియే జరుగుగాక!

ఓ ప్రభువా! నా సంకల్పముగాదు. అన్ని స్థితిగతులయందును నిరంతరము, సర్వము నీ ఆజ్ఞ ప్రకారమే జరుగుగాక! మేము నిమిత్త మాతృలముగా యుండి నీ దివ్య సన్నిధిని సదా అనుభవించుచూ, నీ అడుగు జాడలలో నడచుచూ, నీ విధినే నెరవేర్చుటకు శక్తిని ప్రసాదించుము.

శ్రీ సాధు నారాయణస్వాముల ఆత్మకు నిరంతర శాంతి గలుగుగాక! చందవరము వాసులందరనూ ముఖ్యముగ శ్రీ సాధు నారాయణస్వామివారి శిష్యబృందమును, దైవము ఆయురారోగ్యములతో బ్రోచుచు, వారికి నూతనశక్తి నొసంగి త్వరలోనే నారాయణ ఆసుపత్రిని పూర్తిజేయించి, నిరుపేదలైన రోగులకు స్వార్థరహితమైన చికిత్సను, నిరంతరము శ్రీ డాక్టరు నారాయణస్వాముల పేరున జరిగించుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

# విశ్వమతము

శ్లో॥ బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వ మస్యాది లక్ష్యమ్
ఏకం నిత్యం విమల మచలం సర్వధీసాక్షిభూతమ్
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తంనమామి ॥

శ్రీ శాంతిఆశ్రమ కార్యనిర్వాహకులు, శాంతిపత్రిక సంపాదకులు అక్టోబరూ మాసమునందు, ఆంధ్రరాష్ట్ర సంస్థాపనా శుభముహూర్త సందర్భమున శాంతిపత్రిక యొక్క ప్రత్యేక, సచిత్ర బృహత్సంచికను మహానుభావులైన స్వాములు, యోగులు, పండితోత్తముల వ్యాసరాజములతో వెలువరించుటకు నిశ్చయించి, అనేకమంది భక్తవరేణ్యులకు వ్రాయగా, చాలామంది ఆశ్రమాభిమానులు నిర్హేతుకమైన ప్రేమనుజూపుచు మహోత్కృష్టమైన వివిధ వ్యాసములను వారి వారి అనుభవములతో పంపినవన్నియు జూచి నేనెంతయో ఆనందించుచుంటిని.

అట్టి స్థితిలో ఆనందములో నేను మునిగియుండ, నాకు గూడ ఆశ్రమ నిర్వాహకులు, "మహోదయా! నమస్కృతులు, మీరుగూడ విశ్వమతము అనెడి వ్యాసమును వ్రాసిపంపుడు," అని కోరగా, నే నాశ్చర్యమును చెందితిని. ఒక్కొక్క మారు మనస్సు వివిధ సంకల్పములతో నిండియుండును, కొన్ని సమయముల యందు ఏసంకల్పమును లేకుండ యుండును, నన్ను విశ్వమతము గురించి వ్రాయుమని లేఖ వచ్చినపుడు అది ఒక పవిత్రమైన సంకల్పరహితస్థితిలో నుండియున్నందున విశ్వమతము గురించి వ్రాయుట కేమి యున్నదనెడి భావనలో కొంత నిరుత్సాహమును చెందితిని.

అప్పుడు విశ్వమతము అనెడి మాటనే ఒక మంత్రముగా జేసుకొని రెండు రోజులు స్మరించసాగితిని. ఈ సందర్భములో శ్రీ రామతీర్థులు జెప్పిన

"**Saturation**" నిబిడీకృతమైన పూర్ణస్థితి యనెడిమాట జ్ఞప్తికి వచ్చెను. "**Saturation**" ను బోధపర్చుకొనుటకు రామతీర్థులు జెప్పిన ఉదాహరణనే తీసుకొందము. ఒక గ్లాసు మంచినీరులో కొంచెము పంచదార కలిపిన కరగిపోవును. .మరికొంతకలిపిన అదియు కరిగిపోవచ్చును. అటులనే కలుపగా, కలుపగా ఒక చిన్న అణువంత పంచదార వేసినను కలవకుండా గ్లాసులోనే నిలవయుండెడి స్థితివచ్చును. దానినే "**Saturation**" అనిరి. ఇదియే పూర్తిగా నిబిడీకృతమై నిండియున్న స్థితి, దేనిని వ్రాయుటకైనను, ఏ పనిలో జయమును పొందుటకైనను యీ పూర్ణత్వము చాల ముఖ్యావసరము.

అటులనే, "విశ్వమతము, విశ్వమతము" అని స్మరించగా, మరియే యితరమైన ఆలోచనయు లేకుండా, విశ్వమత భావనలోనే పరిపూర్ణమైన స్థితికి వచ్చి యున్నట్లుగా తోచెను. ఈ అఖండమైన విశ్వమత భావనలను ఖండమైన, యీ చిన్న మాటలలో వర్ణించుట యెట్లులనని మాత్రమిప్పుడు తోచుచున్నది. పంచదారరుచి పంచదార రుచిజూచినవారికే తెలియునట్లు, విశ్వమత భావనలుగూడ, విశ్వప్రేమతో నిండియున్న విశాల హృదయులకే అనుభవ నీయములు.

మనిషికొక మతము, సంఘమునకొక మతము, చివరకు దేశమునకు ఒక మతమైనా యుండితీరవలెను; కాని లోకమంతకు ఒకే మతము యెన్నటికి ఉండజాలదని కొందరు శంకించెదరు. మరికొందరు బావిలోని మండూకములవలె, తమ చిన్న చిన్న స్వకల్పితములైన బావులలోనే నివసించుచు, తమ మతమే విశ్వమతమునకు తగిన మతమని తర్జన భర్జనలతో, వితండ వాదనలను జేయుచుందురు.

ప్రశ్న : విశ్వమతము సాధ్యమా?

**జవాబు :** ముమ్మాటికి సాధ్యము, నూరుపాళ్ళు సాధ్యము.

ప్రశ్న : ఎందుచేత?

జవాబు : విశ్వమతమే మానవజన్మ హక్కు గాన.

పిడుగునకు బియ్యమునకు ఒకే మంత్రమా? లోకమంతయు వివిధ జాతులు, సంఘములు, దేశములు భేదభావనలతో పెక్కు ఆచారములతో నిండియున్నది. మానవకోటికంతకు ఒకే మతము ఎటుల సరిపడునని సామాన్యముగ జనులు తలచుచుందురు.

హిందూదేశ మెక్కడ, జపాను ఎక్కడ, అమెరికా ఎక్కడ, యూరోపు, ఆఫ్రికా, ఐసులేండు ఉత్తర దక్షిణ ధృవప్రాంతములు ఎక్కడ? దూరమున, సమీపమున, యీ వివిధ దేశములలో, లోకమంతటిల్లో యున్న జనులందరకును యొకే మత మెటుల సరిపడును తలచుట సామాన్యులకు సహజమే!

నిజమే ! నామరూపములతో గూడియున్న వ్యక్తుల మతములు ఎంత గొప్పవై యున్నను యీ బాహ్యమతములు, లోకములోనున్న జనులందరిని తృప్తిపరుపజాలవు. ఏ యొక్క మతమున్నగాని, దాని విచారాచారము గాని ఎంత విశాలమై యున్నను, విశ్వమతముగా జరగజాలవు.

కాని, నామ రూప రహితమైనట్టి, లోకములో నున్న మతము లన్నిటికి సారమైన ధర్మసూత్రములను విశ్వమత సారాంశముగా తీసుకొనిన యెడల ఆ ధర్మసూత్రములు అన్ని మతస్థులకును, వివిధ దేశస్థులకును, నాగరికులగు పాశ్చాత్యులనుండి అనాగరికులగు ఎస్కిమో జాతులవారికి, తదితరమైన అడవి జాతివారికి గూడ సమముగా వర్తించును.

ఈ భావనను, బోధపర్చుకొనుటకు చిన్న ఉదాహరణను దీసుకొందము.

గంగానదినిగాని, గోదావరినదినిగాని, మరి ఏగొప్ప నదినిగాని తీసుకొందము. వాటి గమ్యస్థానము మహాసముద్రమే. ఈ నదులుయవి ప్రవహించెడి తావులందుగల భూములను సారవంతముగా జేయుచున్నవి. ఏ యొక్క నదియు తానే సముద్రమును చేరుచుంటిననిగాని, తానే విశ్వమునంతను

సారవంతముగా జేయుచుంటిననిగాని జెప్పుట అసందర్భముగదా!

గాని, అన్ని నదులలో ప్రవహించెడి జలమును సమిష్టిగా మనము తీసుకొనిన, జలము పృథ్వినంతను సారవంతముగా జేయుచున్నదని మనము యొప్పుకొని తీరవలెను.

అటులనే మతములనెడి బురఖాలను, నామరూపములను ప్రక్కకునెట్టి వాటినొక మూలనుంచి, మతములన్నిటికిని ఆధారమైన ధర్మసూత్రములను మనము తీసుకొనిన యవితప్పక విశ్వమంతటకును విశ్వమతముగా వర్తించును. నా భావనను విపులముగా తెలియజేయుటకు ఈ క్రింది ఉదాహరణ నిచ్చుచున్నాను.

విశ్వమత దేవాలయము నిర్మించుటకు ప్రయత్నింతము. విశ్వమే విశ్వమతమునకు దేవాలయము. యీ దేవాలయమునకు పునాదులు ధర్మసూత్రములు; ధర్మముతో గూడియున్న జీవితములు. ఈ పునాదులపై కట్టబడెడి నాలుగుగోడలును, ధర్మము, సత్యము, అహింస, ప్రేమయైయున్నవి. ఈ గోడలమీదనుండి శిఖరమును–గోపురమును విజ్ఞానముతో ఏర్పరచవలెను. ఈ ఆలయమందు అఖండ సచ్చిదానందమే కోటిసూర్య ప్రభతో నిరంతరము ప్రకాశించుచున్నది.

ఈ సచ్చిదానంద స్వరూపమే ప్రతిమానవునియొక్క జన్మహక్కై యున్నదికదా! దీనిని జేరుటకు ధర్మ జీవితమును ప్రారంభింపవలెను. ధర్మజీవితము సత్య, అహింస, ప్రేమ, శాంతితో నిండియుండును.

ప్రాక్పశ్చిమ దేశీయులైనను, తెల్లవారైనను, నల్లవారైనను మాకు ధర్మము వలదని యెవ్వరును జెప్పజాలరుగదా! నాగరికత గలిగినవారైనను, నాగరికతలేని వారైనను మాకు ధర్మము, సత్యము, అహింస, ప్రేమ శాంతివలదని యెవ్వరును, ఏదేశస్థులును అనజాలరుగదా! ఈ ధర్మసూత్రములు జాతి, మత, దేశ వివక్షత లేకుండ ప్రతీ మానవునకు ముఖ్యావసరములై యున్నవి.

గాన, యీ విశ్వమత సిద్ధాంతములను అనుసరించిన, విశ్వమతము ముమ్మాటికి లోకములో సాధ్యమగును. కాని నామరూపములతో గూడియున్న ఏ ప్రత్యేక మతమునుగూడ ఎంతగొప్పదైనను లోకమంతను తానే పాలించలేదు. ఎవ్వరును తమదే విశ్వమతమని జెప్పజాలరు. విశ్వమతము యొక్క పునాదులు ధర్మసూత్రములపై ఆధారపడియున్నవి. ధర్మసూత్రములు ప్రతీ మానవుని జీవితమునకును ముఖ్యావసరములే! గాక, మానవ జీవితమునకు ఆధారమైయున్నది.

ధర్మశూన్యమైన జీవితము మానవజీవితము కానేరదు. సత్యములేని జీవితము మానవ జీవితము కానేరదు. హింసతో గూడియున్న జీవితము పశుజీవితము. ప్రేమరహితమైన జీవితము శ్మశానపు దిబ్బవంటిది. ఇక శాంతి లేని జీవితము భూభారమే. ధర్మానుష్ఠాన జీవితమే నిజమైన జీవితము. విశ్వమతమే స్థిరమైన శాశ్వత శాంతిని గలిగించెడి మతము, మానవులెంతెంత దూరములో ఉత్తర, దక్షిణ ప్రాక్పశ్చిమములలో జీవించుచున్నను అందరకును ఆధారమైన దివ్యరశ్మినొసంగు సూర్యుడొక్కడే అయినట్లు ధర్మసూత్రములతో గూడియున్న విశ్వమతము, మానవకోటికంతకూ ఆధారమై, బ్రహ్మ సాక్షాత్కారమును గలిగించును.

మ॥ ఒక సూర్యుండు సమస్త జీవులకు దా
నొక్కక్కండై తోఁచు పో
లిక నేదేవుడు సర్వకాలము మహా
లీలన్ నిజోత్పన్న జ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్
నానావిధా నూన రూ
పకుడై యొప్పుచునుండునట్టి హరినే
బ్రార్థింతు శుద్ధుండనై.

ఈ విశ్వమతములో సూర్య, చంద్రాదులు, నక్షత్రములు మీకును, నాకును, లోకములో అందరకును, ఏ మారుమూలలలో యున్నవారికైనను సమముగా వాటి తేజస్సును నిరంతరము నొసంగుచున్నవి. ఎంత బలాఢ్యుండైనను, శక్తి వంతుడైనను, ఆటంబాంబులు, హైడ్రోజను బాంబులు వేయగల విపరీతమైన శక్తులుగలిగి యున్నను, సూర్య, చంద్ర, నక్షత్ర గోళములు "నావేగాని, నీవిగావు" అని పోరాడ జాలడుగదా! విశ్వమతమునకు విశ్వమంతయు దేవాలయముగా యున్నది. సత్యాన్వేషకులకు యీ విశ్వదేవాలయములో-సృష్టిలోయున్న పుష్పములన్నియు వాటి సువాసన నొసంగు చున్నవి. ఈ విశ్వదేవాలయములో పక్షులన్నియు చక్రవర్తి, నిరుపేద, చిన్న, పెద్ద, జ్ఞాని, అజ్ఞాని, ఆరోగ్యవంతుడు, రోగి అనెడి వివక్షత ఏ మాత్రము లేకుండగా అందరకు వాటి గానమును సమముగా వినిపించు చున్నవి.

సముద్రములో కెరటములు ప్రణవ గానమును అహర్నిశములు జేయుచున్నవి. చెవులున్నవారు వినవచ్చును, కండ్లున్నవారు చూడవచ్చును. ఈ విశ్వమతమునకు మూలాధారమైన ప్రథమ సోపానము;

"ఈ ప్రపంచ మంతయు నా గృహము. ప్రపంచములోని వారందరును నా సోదరీ సోదరులు. వీరిని ప్రేమించుచు, వీరిసేవ జేయుటయే నా మతము" అనెడి ధర్మము మాత్రమే!

వివిధ నామములన్నియు ఒకే సచ్చిదానంద స్వరూపముయొక్క ఆకారములు, సర్వవ్యాపియగు అవ్యక్తాత్మయొక్క వ్యక్తరూపములు, గాన నిచ్చటనే విశ్వమత సాంప్రదాయకులు ఎవ్వరిని ప్రేమించినను దైవమునే ప్రేమించుచుంటి మన్నట్టియు, ఎవ్వరిని భేదముగా జూచినను దైవమునే భేదముగా జూచుచుంటి మన్నట్టియు, సత్యమును గ్రహించి అందరినీ తమ ఆత్మస్వరూపముగా జూచుచు, సమత్వముతో ప్రేమించుచుందురు. "ఉన్నదొక్కటే అదియే వివిధ నామరూపములతో పిలువబడు చుండును".

ఈ సత్యమే అన్ని మతముల సారాంశమై ఒప్పారుచు, విశ్వమతమునకు మూలకందమై యున్నది.

విశ్వమత స్థాపనయే ధర్మయుగ స్థాపన, యెన్నటికైనను విశ్వమత స్థాపనయే లోకశాంతికి తోడ్పడును. వ్యక్తుల శాంతియే లోకశాంతికి దారి జూపును.

కాన ప్రియమైన ఓ శాంతి పాఠకులారా! ఆంధ్ర రాష్ట్ర సంస్థాపనా శుభముహూర్త సందర్భజ్ఞాపకార్థముగా ఈ పావనమైన సుదినమున, మీ పవిత్ర హృదయములందు విశ్వమత స్థాపనను జేసి, వ్యక్తుల శాంతికి, గృహములలో సౌఖ్యమునకు, రాష్ట్రములలో సామరస్యమునకు, దేశములలో పరస్పర మిత్రత్వమునకు, లోకమంతలో ఐకమత్యమునకు మీ ఆదర్శప్రాయమైన ధర్మ, సత్య, అహింస; ప్రేమ, శాంతి జీవితములతో తోడ్పడెదరుగాక!

ఓం సర్వేషాం స్వస్తి ర్భవతు ।
ఓం సర్వేషాం శాంతి ర్భవతు ।
ఓం సర్వేషాం పూర్ణం భవతు !
ఓం సర్వేషాం మంగళం భవతు ॥

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

# దైవ చట్టములు

నీ వద్దనుండి నావద్దకు ఎంతదూరమో, నావద్దనుండి నీవద్దకును అంతియే దూరముండును. అను ధర్మసూత్రమును గుర్తించలేక వెఱ్ఱి మానవులు దైవచట్టములను అవగామన చేసుకొని తమ స్వధర్మములను నిర్వహించుటకు బదులు, తమ అర్హతానర్హతలను తెలియని మూఢులై, ఖరీదు చెల్లించకయే పెద్దపెద్ద కోర్కెలను కోరుచు, చివరకు నిరాశను దుఃఖమును, బాధను పొందుచుందురు.

ఏ విత్తనములను జల్లినవారు, వాటిఫలితమును నేడో రేపో అనుభవించవలెను గదా! ఈ దైవ చట్టమును ఎంత శక్తివంతుడైనను, ధనవంతుడైనను, మేధావంతుడైనను మార్చగలడా! ఆముదపు విత్తనములను జల్లి వరిపంటను కోరుట మతిలేనితనముగదా! ఐనను ప్రపంచములో చాలభాగము దైవమును నూరుపాళ్ళు మనస్సుతో ప్రేమించకుండ, దైవమే తన సర్వస్వముగా భావించి తను ధన మనములను దైవార్పణ చేయకుండగనే పెదవులతో మాత్రము దైవమును కోరుచు దైవసాక్షాత్కారమును కోరెడి మానవులతో నిండియుండుట విచారకరము.

"దైవము దైవ మని" ధ్యానించెడివారు దైవములో లీనమగుచుండిరి. "మట్టి మట్టి" యని ధ్యానించెడివారు మట్టిలోనే కలియుచుండిరి. ఇది మఱియొక కాదనుకొనుటకు వీలులేని కఠినమైన దైవ శాసనము. మొన్న బొబ్బిలిలో ఒక భక్తుడు స్వామీ, "నాకు మీ హృదయములో సదా తావు నొసంగి నన్ను తరింపజేయవలెను" అని కోరగా నేను "నాయనా! ముందు నీ హృదయములో నాకు తావునిమ్ము. నీ హృదయమును శాంతితో నింపి నిరంతరము శాంతి ప్రార్థనను స్మరించుచు లోకశాంతికి నీ జీవితమును అర్పించి విశ్వప్రేమతో నిండియున్న, నీవు నా హృదయములోనే అప్పు-డిప్పుడనక సదా నివసించుచుందువు. లేక దైవమును మరచి, స్వార్థముతో నిండి, స్వార్థపు ఆలోచనలనే

సదా జేయుచున్న నీకును నాకును చాల దూరమగును".

నీ నుండి నా కెంత దూరమున్నదో, నా నుండి నీ కును అంతియే దూరముండునన్న సత్యమును, ధర్మశాసనమును, మనమెంత త్వరలో గ్రహించిన అత మంచిదిగాన, నిన్నగాక మొన్నవచ్చిన, రేపోమాపో పోనున్న ఈ మట్టి శరీరమును మరచి నీ జన్మహక్కైన జ్యోతిస్వరూపమును, అంతర్జ్యోతిని సదా ధ్యానించుచు విశ్వప్రేమతో నిండియున్న నీవు నాలోనేగాక, హృదయమునకు, హృదయముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా, నా ప్రాణమునకు ప్రాణముగా, ఆత్మకు ఆత్మగా, యుందువు" అని చెప్పగా ఆ భక్తుడెంతయో ఆనందించెను.

మరికొందరు భక్తులు "స్వామీజీ కొందరిని హెచ్చుగా ప్రేమించు చుండిరి. మరికొందరిని తక్కువగా ప్రేమించు చుండి" రని తలచు చున్నప్పుడు చాలకాలముక్రింద తోటపల్లి ధారకు బాల బాలిక లందరితో వెళ్ళుచున్నప్పుడు గలిగిన ఒక అనుభవము దృష్టాంతరూపముగా జ్ఞప్తికివచ్చి నాకెంతయో ఆనందము గలిగించుచుండును.

అది ఉదయ సమయము ఎనిమిది గంటలై యుండవచ్చును. సూర్య భగవానుడు మృదువుగా అంతతీక్షణము గాకుండ ప్రకాశించు చుండెను. నేను ఆశ్రమవాసులను జూచి "నేను ఏమి ఆలోచించుచున్నదీ తెలియునా! మీరు చెప్పగలరా"! అని ప్రశ్నించితిని. అప్పుడు వారిలో అచ్చట రోడ్డు బాగుగా లేనందున, రాళ్ళతోనిండి యున్నందున, పశువులకు, మనుష్యులకు ఉపయోగార్థమై మంచిరోడ్లను వేయించుటకు ఆలోచించు చుంటిరని బాలురు జవాబు చెప్పిరి. అప్పుడు నేను, "తనలోపలయున్న ఆలోచనలనే సూక్ష్మబుద్ధిలేని వారు గ్రహింపజాలనప్పుడు ఇతరుల ఆలోచనలనెట్లు కనిపెట్టగలరు," అని చెప్పుచు ఈ క్రింది రీతిగా నా భావములను చెప్పితిని.

"సూర్య భగవానుడు ఒక ప్రక్కనున్న పేడ కుప్పమీదను, అచ్చటనే

మఱియొక ప్రక్కనున్న జలము మీదనుగూడ ఒకేరీతిగా ప్రకాశించుచున్నాడు గదా! జలముననుండి ప్రకాశించుకాంతి పేడకుప్పనుండి ఏల ప్రకాశింపదు? అందులకు మరి పేడకుప్ప "ఓ సూర్యుడా నీవు జలముమీద ప్రతిఫలించినట్లు, నామీద ఏల ప్రకాశింపవు" అని ఫిర్యాదుచేసిన పాపము సూర్యుడు ఏమి చేయగలడు? ఆతప్పు అంతయు పేడకుప్పదేయని తెలియుచున్నది గదా!

అచ్చటనే ఒక కొండమనిషి తన యిత్తడిబిందెను ఎంతయో శుభ్రముగా తోమియుండెను. అచ్చట చింతచెట్లుగూడ యున్నవి గాన ఆనాడే గాక ప్రతిరోజును ఆ బిందెను చింతపండుతో తోముచుండవచ్చును గాన ఆ బిందె తళతళ మెఱయుచు సూర్యునికాంతితో ప్రకాశించుచుండెను.

అప్పుడు నేను, "ఆ బిందెను ప్రతిదినము ఆ స్త్రీ తోముచున్నట్లు మనముగూడ వైరాగ్యముతో, సాధన చతుష్టయ సంపత్తితో నిరంతరము అభ్యాసము చేయుచు ముఖ్యముగా అహంకార మమకారములను నిర్మూలించి నామరూపములైనా లేకుండగ కాల్చివేసి విశ్వప్రేమతో నిండియున్న దైవము మనలో ఎప్పుడోగాక, యిప్పుడే అఖండమైన తేజస్సుతో ప్రకాశింపగలదు".

"మనలో యున్నదానినే" యితరులలో గాంచెదము అనెడిది, మరియొక తిరుగులేని దైవచట్టము. కొందరు భక్తులు నేను ఏమిచేసినను, ఏమి చెప్పినను, ఏమి ఆలోచించినను, అంతయు దైవము నుండియే వచ్చుచున్నదని, ఆశ్రమవృద్ధిని అందరివృద్ధిని, కోరుచు చేయుచుండుననెడి దృఢమైన నమ్మకముతో యుందురు. మరికొందరు కించజ్ఞత్వమైన మనస్సులతో నేను ఏమిచేసినను, ఏమి చేయకున్నను పొరపాటులనే చూచుచు అనుమానించు చుందురు.

అనుమానమే పెనుబూతము అని పెద్దలు చెప్పిరి. తనలోపలనున్న దానినే యితరులలో గాంచెదరు. సాధారణమైన ఉదాహరణలేగాక, పురాణగాధలనుండిగూడ ఈ ధర్మ చట్టములను బోధపర్చుకొన వచ్చును.

ధర్మరాజును, దుర్యోధనుని లోకమంతయు తిరిగి మంచివారిని, చెడ్డవారిని లెక్కించమనగా, ధర్మరాజునకు అందరూ మంచివారుగానే కనుపించిరిగాని ఒక్కడూ చెడ్డవాడు గానరాలేదు. ఇక దుర్యోధనుడు లోకమంతయు తిరిగి అందరూ చెడ్డవారే గాని మంచివాడు ఒక్కడూ మచ్చునకైనా గానరాలేదని చెప్పెను. మనలోయున్న మంచి చెడ్డలనే బాహ్యమున గాంచెదము. చెడ్డయున్న, అనగా స్వార్థపు జీవితమునకు బానిసలై యున్న అందరూ స్వార్థపరులుగానే గానవచ్చుదురు.

ఈ ప్రపంచమంతా ఒక అద్దముల గదివంటిది అని విజ్ఞులు నుడివిరి. ఒక కుక్క అద్దముల గదిలోనికి వెళ్ళినది. అందు క్రిందను, మీదను, చుట్టును, ఎటుజూచినా అద్దములలో తన ప్రతిబింబమును గాంచి భయపడి మొఱిగి మొఱిగి నశించెను. ఆగదిలోనికే గృహయజమాని వచ్చి తన రూపమును అన్నివైపులనున్న అద్దములలో జూచుకొనుచు ఆనందముగా, శాంతితోనిండి దీర్ఘాయుష్మంతుడుగా జీవించెను.

ఇంతకును అంతా రామమయంబీ జగమంతా రామమయం బని నోటితో కీర్తించుటేగాక అందరిలో అంతటా ఆరాముని గాంచవలదా! కన్ను మూసినా, తెరచినా కృష్ణమయము అని పాడుచుండ కృష్ణుని లోపలను, వెలుపలను దర్శించవలదా? "ఈశావ్యాసమిదం సర్వం" అని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. ఈ విశ్వమంతయు ఈశ్వరునితోనె నిండి నిబిడీకృతమై యున్నదట. మనము ఉన్నదైవము లేదని భ్రమించుచు, దైవము యొక్క కండ్లలో యిసుక జల్లినచో మనకండ్లే పోవును. మానవుని మోసపుచ్చ వచ్చునుగాని దైవము నెవ్వరు మోసపుచ్చజాలరు.

దైవచట్టముల నెవ్వరు అతిక్రమింపజాలరు. ఈ దైవ చట్టములను ఎవరు ఎంత త్వరలో ఆచరణలో పెట్టిన, వారు అంత త్వరలో వ్యక్తుల శాంతికేగాక, సంఘములలో, దేశములలో సామరస్యమునకు, లోక

కళ్యాణమునకు అంత త్వరలో తోడ్పడినవారగుదురు.

ప్రియమైన ఆత్మ సోదరీ సోదరా! లెమ్ము శరీర జ్ఞప్తినుండి, ఆత్మ జ్ఞప్తికి రమ్ము. శరీర జ్ఞప్తితో జూచిన ప్రపంచము ఒకనీడగా గానవచ్చును. ఆత్మజ్ఞప్తి నుండి జూచిన స్వర్గమువలె గానవచ్చును. నీవు అసూయ, డంభము, అహంకారము, అనుమానము, బేదబుద్ధి అను రంగురంగుల కళ్ళజోళ్ళు ధరించి యితరులను జూచు (విమర్శించు) టకు ప్రారంభించితివా, నీవు ఏ రంగు అద్దములు వేసుకొన్న ఆరంగులతోనే నీవు జూచెడిదంతయు గానవచ్చును. స్వచ్ఛమైన, సహనము, శాంతి, ప్రేమ అను అద్దములను ధరించి ప్రపంచమును చూచిన అంతయు దైవముగానే అంతా రామ మయముగానే గోచరించును.

నిశా సమయమున ఒంటరిగా నున్నప్పుడు నాలో నేను ఈ క్రింది రీతిగా అప్పుడప్పుడు ప్రశ్నించుకొనుట నా కాశ్చర్యమును, ఆనందమును కలిగించుచుండును.

ప్రశ్న : నీకును దైవమునకును ఎంత దూరమున్నది?

**జవాబు :** దైవము నీ హృదయమునకు హృదయమై, మనస్సునకు మనస్సైయుండ, ఆయన నీ శ్వాసకు శ్వాసయై అంతియేకాదు నీ ఆత్మకు ఆత్మయైయుండ, ఆయనకును నీకును దూరమనున దెటుల యుండగలదు?

ప్రశ్న : దైవమెక్కడ? నీవెక్కడ!

**జవాబు :** ఆయనయే నీవు. నీవే ఆయన ఉన్నదొక్కటేయైయుండ ఆయన నేను అను ద్వైతభావనకు తావెక్కడిది? అట్టి ప్రశ్నలేల?

త త్త్వ మసి, అదియే నీవు

ప్రజ్ఞానం బ్రహ్మ; నీలోయున్న ప్రజ్ఞయే బ్రహ్మము. మరికొన్ని పవిత్ర సమయములలో దైవము ముఖాముఖిగా యున్నప్పుడు, దైవ సన్నిధి ననుభవించు నిశ్శబ్దఘడియలలో

ఓ ప్రభువా! మాట్లాడుము.

నీ సేవకుడు వినుచున్నాడు. అనెడి పరమపావనమైన మాటలను పలుకగనే తన్మయత్వము గలుగుచుండును. నాకు తన్మయత్వమును గలిగించెడి మరొక్క వాక్యము గలదు.

నిశ్శబ్దముగాయుండి, నిశ్శబ్దములో నీవె అదియని గ్రహించుము.

నిశ్శబ్దో బ్రహ్మ

నిశ్శబ్దమే బ్రహ్మము

శాంతోఽయం ఆత్మా

శాంతియే ఆత్మ

అదియే నీవై యుండ దానికి నీకు దూరమెంతయని ప్రశ్నవేయుటకు సావకాశమే లేదుగదా!

అంతయు తన్మయత్వము, ఏ అలలు ఆలోచనలు లేని అఖండ సచ్చిదానంద సాగరస్వరూపము.

ఓ వెర్రిమానవుడా! నీవు దైవమునకు ఎంతదూరములో యున్న, దైముగూడ నీకు అంతదూరములోనే ఉండును. మనలో యున్నదానినే బాహ్యమున గాంచెదము. ఇది సత్య ధర్మచట్టమని నేడే స్థిరముచేసి ఆంతర్యమున దైవమును గాంచుచు! బాహ్యమునగూడ అందరిలో అదే అద్వితీయమైన ఒకే సచ్చిదానంద అఖండ దివ్యతేజస్సును గుర్తించుచు, తరించుటకు ప్రయత్నించెదముగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

# శ్రీశైలయాత్ర

(శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే)

దక్షిణ దేశములో శ్రీశైలము పుణ్యతీర్థములలో చాల ముఖ్యమైన, పుణ్యస్థలముగా, ప్రసిద్ధికెక్కియున్నది. కాన శ్రీశైలయాత్ర చేయని భక్తులు ఎచ్చటనోగాని యుండరు. ఐనను ఈ 67 సంవత్సరములు శ్రీశైలము దర్శించకుండగనే, గడచుట చాల ఆశ్చర్యము.

దైవకృపచే అన్నితీర్థములు అవతారమూర్తులు, మహాత్ములందరూ, అంతర్యముననే గలరనెడి దృఢమైన నమ్మకము గలిగి యున్నందున, ఈ మనస్సు ఎన్నడును, బాహ్యయాత్రలవైపు అంతగా, పరుగెత్తదు. శ్రీశైలము వెళ్ళినగాని మోక్షమే లేదని కొందరు భక్తులందురు. ముఖ్యముగా శ్రీశైలము వెళ్ళినవారికి అచ్చట జ్యోతి దర్శనము జేసిన, పునర్జన్మయే లేదనీ, జెప్పుచుందురు. దుర్లభమైన మానవజన్మ జన్మరాహిత్యమును జేసుకొనుటకే, ఇవ్వబడెను. అన్ని జన్మలలో ఉత్తమమైన జన్మను పొందగల్గియు, జన్మరాహిత్యమునకై ప్రయత్నించక, సంసార మహాసముద్రములోబడి, మాయతో నిండి, ఊబిలో పడిపోయెడివారి, జీవితములు చాల విషాదకరములుగదా! క్రిందపడుట, జారుట, మెట్లు దిగుట, చాల సులభము. మీదకు వెళ్ళుట, మెట్లు యెక్కుట, గమ్యస్థానము చేరుట చాల కష్టము. ఐనను సూక్ష్మములో మోక్షము దొరకుచుండ, శ్రీశైలము వెళ్ళినంతమాత్రముననే, జన్మరాహిత్యము గలుగుచుండ, ఇంకను తడవేలనని, వేలాదిభక్తులు, నిరంతరము శ్రీశైలమునకు వెళ్ళుచునేయుందురు.

చిరంజీవి మా శాంతిగూడ మూడు సంవత్సరములనుండియు చాల ఆతురతతో శ్రీశైలయాత్ర చేయవలెనని, ఇక జన్మలేకుండా జేసుకొన వలెనని తొందరపడుచుండెను. గాని ఎప్పటికి ఏది ప్రాప్తమో, ఏరోజుకు ఏ దర్శనము పొందవలెనో అంతయు దైవ నిర్ణయమై నట్లుండును. మా సుశీల శాంతి శకటము గూడ శ్రీశైల దైవమును, దర్శించుటకే సిద్ధముగా నున్నట్లుండెను.

ఇదివరలో శ్రీశైల యాత్ర చేయుట చాల కఠినముగా నుండెడిది. ఏలనన, శ్రీశైల దైవముగూడ, తిరుపతి వెంకటేశ్వర్లువలె, ఎత్తుయైన కొండమీద విలసిల్లుచుండెను. దట్టమైన అడవులగుండా, చాల పర్వతములుదాటి, ముప్పదిమైళ్ళు వెళ్ళవలసియున్నది. డోర్నకల్‌వరకే, రహదారులు, రోడ్లు గలవు. అచ్చటనుండి యాత్రికులు, అడవులలో, కొండలెక్కుచు, దిగుచు, చాల అవస్థలు పడుచు, కొన్ని రోజులకు కాలువలు, వాగులు, దాటుచు దారిలో వంటలు జేసుకొనుచు అతికష్టముమీదను శ్రీశైలము చేరెడివారట!

ఇప్పుడు ఆంధ్రా ప్రభుత్వమువారు, మినిష్టరు శ్రీ సంజీవయ్యగారి యాజమాన్యమున, చక్కనైనరోడ్డు ముప్పదిమైళ్ళను యెన్నో లక్షల ధనమును, వెచ్చించి యాత్రికుల సహాయార్థమై వేసిరి. గాన, ఇప్పుడు యెన్నో కార్లు, బస్సులు రోజూ యాత్రికులను తీసికొని వెళ్ళుచుండెను.

గూటీ (గుత్తి) నుండి శ్రీశైలము 150 మైళ్ళు ఉండెను. ఆ రాత్రికి, శ్రీశైలపర్వతము చేరుటకే గూటినుండి త్వరితముగా వదులుటకు ప్రయత్నించితిమి. గూటీనుండి శ్రీశైలము, నందియాలద్వారాగాని, కర్నూలు మీదుగా గాని రావచ్చును. గాని, కర్నూలులో ప్రసిద్ధికెక్కిన నూతనముగా కట్టబడిన, శ్రీ సాయి మందిరము ఉన్నందున, శ్రీ సాయి భక్తురాలైన మా శాంతికి ఆనందము గల్గించుటకు, కర్నూలు మీదుగనే వచ్చి, తుంగభద్రా నది ఒడ్డున చక్కగా కట్టబడిన ఆ సాయి దేవాలయమును, శ్రీ సాయిని దర్శించితిమి. చి॥ శాంతి, శ్రీ జగదీసు గురుకుల బాలబాలికలు వగైరాలు శ్రీసాయినాధునకు, కొబ్బరికాయలు కొట్టుచుండ, చి॥ జ్ఞానేశ్వరి, నేను వరదలతో జలమయమైయున్న తుంగభద్రానదిన దర్శించుచు, ఆ చక్కనైన ప్రకృతి సౌందర్యములో దైవమును గాంచుచు తృప్తి పొందసాగితిమి.

కర్నూలునుండి, శ్రీశైలమింకను 90 మైళ్ళువరకు ఉన్నందున, మేము తొందరగా, శ్రీ సాయిదర్శనము ముగించుకొని, మా యాత్రను చేయసాగితిమి.

వర్షాకాలమగుటచే, అంతగా వర్షము ఆరోజున లేకున్నను, ఒక్క చెరువుగట్టు తెగినందున, కొన్ని రోడ్లు జలమయమై యుండెను. చీకటి పడుచుండెను. చాలచోట్ల కాలువలు చీకటిలో దాటవలసియుండెను.

శ్రీ సాయినాథుని దర్శనముచేతనే శ్రీశైలముచేరుట ఆలస్యమయ్యెను. గాన, ఆయనే మమ్ము సురక్షితముగా శ్రీశైలము జేర్చుననెడి ధృఢమైన నమ్మకముతో ప్రయాణము సాగించుచు చిన్న చిన్న కాలువలు, చీకటిలో దాటుటలో చాల అవస్థలు పడుచు, చిట్టచివరకు శ్రీశైలముయొక్క **(Foot OF The HILL)** కొండ మొదటిభాగమును చేరితిమి.

అంతయు చీకటిగా, అయోమయముగా నుండుటచేతను, చీకటిలో ఇంకను ముప్పదిమైళ్ళు కొండలు ఎక్కవలెను. గాన కొండ దిగువ భాగమున, ఏదైన రహదారీబంగళాయున్న ఆ రాత్రి అచ్చట గడిపి ఉదయమే శ్రీశైలయాత్ర జేయుటమంచిదని నిర్ణయించి, పురాతనమైన ఒక్క రహదారీబంగళా చేరితిమి. కొంత అవస్థ గలిగినను శ్రీశైల దైవము పేరున ఎటులనో ఆ రాత్రి గడిపి ఉదయమే శ్రీశైలయాత్ర ఉత్సాహంతో ప్రారంభించితిమి. రహదారీ బంగళాలు కొన్ని అన్ని సౌఖ్యములతో రాజభవనములవలె యుండును. మరికొన్ని *నాసరయ్యగారి మఠములవలె శిధిలావస్థలో నుండుట విచారకరము. మా సుశీల శాంతి శకటము చాల బరువుతో నిండియున్నను, మా గురుకుల బాలబాలికలు చి॥ జ్ఞానేశ్వరి, శాంతి హర హర, శంభో శంభో, శివ శివ, శంభో నారాయణా నిన్నె నమ్మితిరా మొదలైన నామావళులను స్మరించుచు కీర్తించుచున్నందున ఏ శ్రమయు లేకుండగానే గమ్యస్థానమును జేర్చెను.

అచ్చట శ్రీశైలములో మేనేజరుగారు, ఇదివరలో అన్నవరంలో ఉన్నప్పుడు ఆశ్రమదర్శనము జేసినవారైనందున, భక్తి, ప్రేమలతో, మాకు చక్కనైన వసతులు

---

* శ్రీ నాసరయ్య గారి మఠంగురించి రాబొయడి సంచికలో "త్రిపురాంతక యాత్ర అనెడి శ్రీ స్వామీజీ వ్యాసములో, తెలియనగును.

భోజన సదుపాయములు గూడ ప్రేమతో జేయించిరి. దురదృష్టముచే, ఆనాడు పైపులనుండి నీరు రానందున విపరీతమైన దోమలుండుటచేతను కొంత అశాంతిగా, నిద్ర లేకుండగా శ్రీశైలములో గడపవలసియుండుట కొంత విచారమయ్యెను. గాని, మా శాంతికి మాత్రము శ్రీశైలం చేరకుండగనే శ్రీశైల దేవాలయ శిఖరమున, జ్యోతి దర్శనమైనట్లుగ గూడ గాన వచ్చినట్లు జెప్పగా మేమంతా ఆ దృశ్యమును ఆమె గాంచినందుకు మేము చాల ఆనందించితిమి. అంతయు శ్రద్ధ నమ్మకములోనే యున్నది గదా! మన ఆంతర్యమున నున్నదానినే. బాహ్యమున గాంచుచుందుము. ఈ శ్రీశైల దేవాలయ శిఖరమున జ్యోతిని దర్శించినవారికే, ఇంక జన్మ లేకుండునని ప్రతీతి గలదు. నిత్యము దేవాలయ శిఖరమును, వేలానవేలు జనులు దర్శించుచుందురు. వీరందరూ జన్మరాహితులుగా అగుచున్నారా! ఇంతమంది రోజూ స్వర్గమునకు వెళ్ళిన, అచ్చట గూడ, కొన్ని పుణ్యతీర్థములు, దేవాలయములలోవలె, చాల ఇరుకుగా, అవస్థలుగా నుండునన్న సమస్యకు - సమాధానముగా ఒక చక్కనైన చిన్న ఇతిహాసము, పురాణకథ జెప్పబడియున్నది.

పార్వతీదేవి శ్రీశైలయాత్ర జేయుచున్న యీ వేలానవేలేగాక, లక్షలాదిగా, యాత్రలు జేయుచున్న యీ యాత్రికుల నందరిజూచుచు, శివునితో, వీరందరూ, స్వర్గమునకే వెళ్లుచున్నారా, ముక్తినిబడయుచున్నారా అని ప్రశ్నించగా, పరమేశ్వరుడు ఆమెకు బోధపర్చుటకు, ఆమె అనుమానము తీర్చుటకు, తాను ఒక్క ముసలివానిగా మారి, పార్వతిని తనచెంతనే ఒక్క ముసలి ఆమెగా జేసుకొని తాను ఊబిలో దిగి యుండెనట. అప్పుడు వేలానవేలుగా వెళ్ళుచున్న భక్తులందరితో ఈ ముసలి ఆమె తన భర్తయొక్క అవస్థను జూపుచు -

"ఓ తల్లులార, తండ్రులారా నా భర్త ఊబిలో, బురదలోపడి చనిపోవుచుండెను. మీలో ఒక్క పుణ్యాత్ములెవ్వరైనా నా భర్తను బైటకు తీసి బ్రతికించరా"

అని ప్రార్థింపసాగెను. అప్పుడు చాలమంది తోడ్పడుటకు ఆ ముసలి వానిని బురద నుండి బైటకు తీయబోవగా అప్పుడు (పార్వతీదేవి) ఆ ముసలి ఆమె.

"ఓ భక్తులారా, ఆగుడు మీలో ఏ పాపము ఎన్నడూ చెయ్యనివారే, నా భర్తను లాగవలెను, పాపము జేసినవారు తాకవలదు".

అని జెప్పగా అందరు విస్మయము జెంది ఎప్పుడో ఒకప్పుడు తమ జీవితములో ఏదో ఒక పాపము తెలిసియో తెలియకయో, జేసియే యుందుమని నిరాశతో ఎవ్వరిదారినివారే పోవుచుండ, ఒక పతితురాలు యా ముసలి ఆమె దీన అవస్థను, రోదనను జూచి,

"అమ్మా శ్రీశైల శిఖరమును దర్శించిన మాత్రమున అన్ని పాపములు పోయి, జన్మరహితులయ్యెదరని పెద్దలు, శాస్త్రములు జెప్పుచున్నవి గాన ఇదిగో ఆ శిఖరము నేనిప్పుడు ఇచ్చట నుండియే దర్శించుచుంటిని గాన, నా వెనుకటి పాపములన్నియు పోయెను. నీ భర్తను ఊబి నుండి తీయుటలో తోడ్పడెదను".

అని ఆమె హస్తములను అందించి, పరమేశ్వరుని బురదనుండి, బయటకు తీసెనని, ఆ పురాణగాధలో జెప్పబడియుండెను.

అటులనే వేలానవేల ప్రజలలో, ఏ ఒక్కరో నిజమైన భక్తి నమ్మకము గలవారుందురు. వారే తరించెదరు. గమ్యస్థానమును చేరెదరు. జన్మరహితులయ్యెదరు. కొదువ వారందరు లాంఛనంగా, బాహ్య నామ రూపములను పూజించుచు, పేరు, ప్రతిష్టలకై ప్రాకులాడుచు మరల మరల పుట్టుచు, గిట్టుచు సంసార మహాసముద్రములోపడి దరిగానలేక కొట్టుకొనిపోవు చుందురు. ఆ రాత్రి ఎటులనో పవిత్రమైన శ్రీశైలములో నున్నను దోమల సాంగత్యముతో బాధపడుచు నిద్రలేకుండగా, ఎంతలో తెల్లవారునాఅని, ఆతురతగా సూర్యభగవానుని దర్శనముకై వేచియుంటిమి.

శ్రీశైలములో, అనేకమైనవి శ్రీభ్రమరాంబ దేవాలయము శివాజి మహాలు, భీమునికొలను వగైరాలు ఉన్నను ముఖ్యముగా వీటితో దర్శించవలసినదిగా పాతాళగంగ గలదు. ఈ తావే సప్తనదులు కలియుచున్న పవిత్రమైన స్థానముగా, పరిగణింపబడుచున్నది గాని ఆలోతైన ప్రదేశమునకు వెళ్ళుట పాతాళమునకు వెళ్ళినట్లేయుండును.

రాత్రి నిద్రలేకున్నను, బడలికగానున్నను, ఇట్టి సావకాశము మరల రాదుగదాయని, ఆశ్రమవాసులు, బాలబాలికలు ఉత్సాహంతో పాతాళ గంగ దర్శనముచేసి అచ్చట స్నానముచేసి పుణ్యము సంపాదించుకొనుటకే నిశ్చయించితిమి.

"అందరికంటె ముందుగ నేను దారితీయుచుందును. మీరంతా నా వెనుకనేరండు అని జెప్పుచు, పాతాళగంగవైపునకు నడవనారంభించితిని. వక్క మైలువరకు, రోడ్డు వున్నదిగాని అది రాళ్ళతో నిండియున్నందున మా శాంతి శకటమునకు శ్రమయిచ్చుట ఇష్టములేక కాలినడకనే ఆ మైలుదూరముగూడ నడవనారంభించితిమి. మరియొక యాత్రికుడు ఒక సాధుపుంగవుని, పాతాలగంగకు వెళ్ళుటకు దారియెటులని తాను ఒక్కడనే వెళ్ళగలనా, అని అడుగుచుండ ఆసాధువు;

"పాతాళగంగ 7, 8 మైళ్ళుండును. కీకారణ్యములోపడి, పెద్దపులులు వగైరాలుగూడ ఉండును. గాన తన్ను కొంత డబ్బు ఇచ్చి తీసుకొని వెళ్ళుము".

అని జెప్పుచు ఆ అమాయకమైన యాత్రికుని బెదరించుచుండ, నేను అప్పుడు అతని అవస్థకు విచారించి "నేను తీసికొని వెళ్ళెదను నాతో రమ్ము నేను గూడ పాతాళగంగ దగ్గరకే వెళ్ళుచుంటిని" అని జెప్పగా, అతడు ఆనందముతో నాతో కలిసి రాసాగెను. ఆ సాధువునకు డబ్బు దొరకకుండగా నేను ఆటంకము వచ్చితినిగదా అని అతడు తీక్షణముగా నావైపు చూడసాగెను. నన్ను వెంబడించుచున్న యాత్రికునితో "నాయనా! నాతో నీవు వచ్చెడియెడల

అడుగుఅడుగునకు శివనామమును గాని, రామనామమును గాని స్మరించుచు మెట్లుదిగవలెను అని జెప్పగా, అతడెంతయో సంతసించి అటులనే దైవనామస్మరణను, ప్రతీ అడుగునకు చేయసాగెను. ఒకవంద, రెండువందల మెట్లుగాక వెయ్యిమెట్లు దిగవలెను. దైవకృపచే అంత ఎండగాలేక మబ్బుగాగూడ ఉండెను. దిగుటచాల సులభమేగాన, ఉత్సాహముగా దిగుచుంటిమి. అంతలో చి॥ శాంతి, జ్ఞానేశ్వరి, జగదీసు, నాగమణి, తాయారు, చంటి, బాలకృష్ణగూడ, శంభో శంభో, శంకర హర హర, శంభో అని గీర్తించుచు, నన్ను కలిసికొనిరి. ఒక భక్తురాలైన సోదరిగూడ ఏకాకిగా ప్రయాణముచేయుచు మమ్ము చేరెను. ఈమెయే పరమేశ్వరుని బురదలోనుండి తీసియుండునా అన్నట్లు ఆమెవైపు జూచుచు, ఆమె నామధేయమును యడుగగా రామమ్మ అని జెప్పెను. అప్పుడు ఆమెనుగూడ, అడుగడుగునకు రామనామస్మరణ జేయమనికోరగా, ఎంతయో ఆనందించి మాతో ఉత్సాహముగా నడచుచుండెను. పుణ్యనదిలో స్నానము జేయుటకు వెళ్ళుచు మావారందరూ చెంబు అయిన తెచ్చుకొనకుండా వట్టిచేతులతో వచ్చుచుండిరి. నదిలో స్నానము చేయుటకు చెంబు అయినా లేదని విచారించుచుండ, మాతోనున్న రామమ్మ "బాబూ! నావద్ద చిన్న చెంబు ఉన్నది. గాని దానిని మీరు వాడవచ్చునో, వాడరాదో అని అనుమానించుచు జెప్పెను. దానిని మే మేల వాడరాదని" అడుగగా మీరు గొప్పవారు, నేను చాకలి మనిషిని అనిజెప్పగా, నేను విచారించి

"మన మందరము దైవబిడ్డలమే, దైవమునకు జాతిమత భేదములు లేవు. నీవు మా సొంత సోదరీ స్వరూపమే".

అని జెప్పుచుండ ఆమె ఆశ్చర్యము ఆనందముతో, ఆమె చెంబును మాకు అర్పించెను.

అతికష్టముమీద పాతాళగంగను చేరుటకు వెయ్యిమెట్లు ఓపికగా దిగగల్గితిమి. శ్రమతో మెట్లుదిగుచుండ మరల ఈమెట్లు అన్నియు యెక్కుట

యెటులనని ఆశ్రమవాసులు ప్రశ్నించగా నేనీ క్రిందిరీతిగా సమాధానము జెప్పితిని.

మా స్నానములైన తర్వాత, అచ్చటనే రాళ్ళమీద ఆసీనులమై కొంత తడవు ప్రార్థన, ధ్యానాదులు భజన చేయడమాయెను. ప్రతివ్యక్తిని ఏకాంతముగా గూడ కొంతతడవు ధ్యానము చేయుమని కోరితిని, ధ్యానమైన తర్వాతను భక్తురాలైన రావమ్మకు ఆ పరమపావనమైన క్షణమునందే ఉపదేశ మివ్వబడెను. ఆమె భక్తి ప్రేమలకు ఆనందించి ఒక రుద్రాక్షమాలను అర్పించి, రోజూ ఉదయము, సాయంత్రమును, పవిత్రమైన రామనామమును ఆ జపమాలమీద నియమముగా స్మరించుచు, తరించమని కోరితిని. ఈమె భక్తి భక్తురాలైన శబరి, భక్తి ప్రేమలను జ్ఞప్తికి తెచ్చెను. సోదరి రావమ్మ ఆనందమును యెటుల వర్ణించుట! త్వరలో శాంతి ఆశ్రమం చేరెదనని, కృతజ్ఞతా నమస్కారము అర్పించసాగెను. మేము వచ్చినపని స్నానము, ధ్యానము, సేవగూడ పూర్తి అయ్యెను. అప్పుడు శ్రీశైల పర్వతమును వెయ్యి మెట్లను యెక్కుటగురించి ఆలోచించవలసి యున్నది. అప్పుడే సూర్యభగవానుడుగూడ తీక్షణముగా రాదొడంగెను. కొంతవైపు జూచిన మెట్లు యెక్కుటగురించి తలంచిన హృదయము బరువెక్కుచుండెను. ఐనను, ఏదైవము నదిఒడ్డునకు క్రిందకు తీసుకొనివచ్చెనో ఆ దైవమే మరల కొండ నెక్కించునుగదా అనెడి తృప్తితో అయిష్టతగా ఆ పవిత్రమైన నిర్జనమైన ఏకాంతస్థానమునుండి బయలుదేరితిమి.

చి॥ శాంతి కృష్ణానది సంగమములో ఫలపుష్పాదులతో పూజగూడ చేసెను. అచ్చట నివసించుచున్న సాధువులకు దక్షణివ్వగా వారు ఆనందించితిరి. ఆ వారములోనే నదిలోపడి మునిగిపోయిన దురదృష్టవంతుడైన యాత్రికుని స్థితి జ్ఞప్తికి వచ్చుచు, నాకు చింతను మరల మరల గల్గించసాగెను. అతని ఆత్మ శాంతినిగూడ కోరుచు, ప్రార్థనలు చేసితిమి.

అచ్చటచ్చట దారిలో కూర్చొనుచు చాల బడలికగా ఉన్నప్పుడు, ఆ

మెట్లమీద పరుండుచు నెమ్మదిగా వెయ్యిమెట్లను దైవకృపచే మరల ఎక్కుచు గమ్యస్థానమును శ్రీశైల దేవాలయమును చేరగల్గితిమి.

కాళ్ళు తడబడుచుండ, ఆ యెండలో మా బసనుచేరి భోజనములు, ఫలహారములు జేసి, అందరు తృప్తిగా కొంతతడవు విశ్రమించితిమి. శ్రీశైలములో పురుషోత్తమ నామధేయుడు పదహారు సంవత్సరముల బాలుడు, బొమ్మల వ్యాపారము జేయుచున్నవాడు మమ్ము ఎంతో భక్తి, ప్రేమలతో ఆదరించుచు ఆశ్రమభక్తుడాయెను. మా మేనేజరు జగదీసుగూడ చాల అలసిపోయి ఉండుటచే ఆరాత్రిగూడ అచ్చటనే గడుపుటకు కోరెను.

గాని గడచిన రాత్రి దోమలచే గల్గిన అవస్థ, పూర్తిగా నిద్రలేని ఆ రాత్రి తలచినంత మాత్రముననే భీతిగానుండి శ్రీశైల కొండ దిగియైనా క్రింద విశ్రమించవచ్చునని జెప్పుచు, వెంటనే ప్రయాణమైతిమి. మా సుశీల శాంతి శకటముగూడ క్రిందకు వెళ్ళుటకు సిద్ధముగా ఉండెను. దానివైపు చూచినప్పుడు ఆ శకటమునకు ఏదోబాధ యుండదుగదా, అని తలచసాగితిని. శ్రీశైల దేవాలయ మేనేజరుగారు అన్ని యేర్పాట్లు జేసినను దోమలకు భయపడి శ్రీశైలమును వదలుట విచారకరమని కొంత సిగ్గుపడితిమి.

గాని అంతా ఆత్మమయము గాన అన్ని జీవులలో, దైవమేగాన దైవము లేని తావు సూదిమొన మోపుటకైనా లేనప్పుడు, దోమలో, చీమలో, యీగలో, దైవమునే గుర్తించి ఆనందించుటకు బదులు నా అపరిపక్వపు స్థితికి కొంత చింతించసాగితిని. దోమలో కుట్టుచున్నది, కుట్టబడుచున్నది అంతయు ఒకే దైవమనెడి అనుభవమే, మతమునకు గమ్యస్థానము, వేదముల సారము కూడ ఇదేగదా! కుట్టేది కుట్టబడేవాడు ఒక్కటేగదా, అట్టి అద్వితీయమైన స్థితిని నోటితో చిలుకపలుకులవలె మహావాక్యములను స్మరించుటకంటె కఠిన పరీక్షలలో వ్యక్తపరచుటయే జీవన్ముక్తుల ఆశయము ఆదర్శముగదా!

మానవులకు అంతసేవ జేయజాలకున్నను, దోమలు చీమలకైనా యీ స్థూలశరీరములు, కొంతసేవ జేయుచున్నవని ఆనందించ వలసియున్నది. జన్మరాహిత్యము గల్గించెడి శ్రీశైల శిఖరమును బాహ్యముననేగాక ఆంతర్యమునగూడ ముఖ్యముగా, పాతాళగంగయొద్దున ధ్యాన సమయములో, పొందగల్గితిమన్న ఆనందముతో, శ్రీశైలమునువిడచి ఆశ్రమ బాలబాలికలు, శంభో శంభో శంకర శ్రీశైలవాసా అని కీర్తించుచుండ ఆ ముప్పది మైళ్ళ కొండలు, దైవనామస్మరణతో మా శాంతి శకట సహాయముతో శ్రీశైలనాధునకు కృతజ్ఞతా వందనములు అర్పించుచు క్షేమముగా దిగగల్గితిమి. సుఖదుః ఖములలో, విషమ పరీక్షలలోనైనను, కంటికి రెప్పగా తన బిడ్డలను, కాపాడుచున్న కుంటివారిని కొండలెక్కింపగల్గిన, మూగవారిని మాట్లాడించ కల్గిన ఆ కృపామయమునకు శ్రీశైలనాధునకు మరలమరల కృతజ్ఞతాభివందనములు.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

# సంసార మహాసముద్రము

(సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత్త ! జాగ్రత్త !)

ప్రవృత్తిపరులకు, సామాన్యులకు, సంసార సముద్రము బాహ్యముననే యున్నదనెడి నమ్మకము. కాని నివృత్తిపరులకు, విజ్ఞానులకు ఈ సంసార మహాసముద్రము ఆంతర్యమున తమలోనేయున్నదనెడి సత్యమును గ్రహించిన వారు చాల అరుదు. నిరంతరము ఎడతెరపి లేని ఆలోచనలు, ఆశలు నూతన సంకల్పములు మనస్సును వేధించు చుండునను రహస్యమును ఎందరు తెలుసుకొన గల్గుచుండిరి.

నాకు సముద్రమును చూచినపుడెల్లను "సముద్రము ప్రార్థించుచున్నది. ఓ మానవుడా! నీవేల ప్రార్థించవు? అనుభావన కల్గుచుండును. సముద్రములోని ప్రతికెరటము అల దైవమునకు ప్రార్థనయే నీ ఆలోచనలు సంకల్పములు గూడ సర్వవ్యాపకుడైన దైవమును ప్రార్థనలుగా చేసి ఏల అర్పించవు? ఇదియే సూక్ష్మములో మోక్షముగా తరించుటకు దగ్గర మార్గము.

నీవు సన్యసించి హిమాలయములకు, అరణ్యములకు, ఆశ్రమములకు వెళ్ళనవసరములేదు. ఏ గురువులు, సాధువులు, యోగులవెంట పరుగెత్త నవసరము లేదు. బాహ్య దృష్టిని వదలి, అంతర్దృష్టిని అలవరచుకొనుము. ప్రవృత్తిని వదలి, నివృత్తుడవై తరించుము. నీలోనున్న సంసార మహాసముద్రమును ఒక్కతరి నిమీలిత నేత్రుడవై గుర్తించుము. నీ ఆలోచనలను, సంకల్పములను కోరికలన్నింటిని ప్రార్థనలుగా చేసుకొని, సర్వజ్ఞుండైన, దైవమును నీ హృదయనివాసిగా గుర్తించి, ఆ జ్యోతి స్వరూపమునకు అర్పించుము. సూక్ష్మమైన ఆధ్యాత్మిక సాధనను నీ వున్న తావుననే; ఈ క్షణముననే ఆచరణలో పెట్టుము. ఈ క్షణమే మనది, మరుక్షణము మనదిగాదు కాన ఈ ప్రస్తుత క్షణమునందే సముద్రమువలె దానితో కలసి నిరంతరము ప్రార్థన చేయుదుముగాక!

**Births of Breath are as many as waves on the Sleepless Sea** మనలో నిరంతరము ప్రవహించు శ్వాసవంటి యీ జన్మలు, నిద్రలేనటువంటి ఆ సముద్రము మీద ఎన్ని అలలున్నవో, అన్ని జన్మలు గలవని ఒక మహనీయుడు నుడివి యుండెను. నిద్రలేని సముద్రము అనగా రాత్రింబగళ్ళు విశ్రాంతి లేక తన అలలతో - అహర్నిశము ప్రార్థించుచున్న సముద్రము, ఎంత ధన్యమైనది?

ఇక మానవులగతి చూడుడు! ఎడతెరపిలేని సముద్ర కెరటములనైనను లెక్కించవచ్చునుగాని, నిరంతరము మనస్సునకు విశ్రాంతి లేక మనలోని సంసార సముద్రములో, నిరంతరము లేచు ఆలోచనలు, సంకల్పములను ఎవరూ లెక్కింపజాలరు. ధనమదాంధులైన స్వార్థులు ఆశాపాశములచే కట్టబడి సంసార సముద్రములోని తిమింగలము అనే నావను పట్టుకొని యీదుటకు ప్రయత్నించుట ఆశ్చర్యము. అహంకార పూరితులు తమలోని కామ, క్రోధ, మోహ, లోభ, మదమాత్సర్యములనెడి అపాయకరమైన తమకూ, ఇతరులకూ కూడ హాని, కష్టనష్టములు కల్గించెడి వాసనలను విడువకయే, తమలోని సంసార సముద్రమును అవలీలగా దాటి, అవతలి ఒడ్డునకు చేరి మోక్షమును సులువుగా బడయుటకు ప్రయత్నించ కుండుట చాల విషాదకరము.

విశ్వసాక్షి, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు హృదయ నివాసియైన దైవమును, ఎవరును, ఎంత తెలివి తేటలు, చాకచక్యమున్నను మోసపుచ్చజాలరుగదా! తాము లోతుగా త్రవ్వుకొనెడి స్వార్థపు గోతులనెడి అజ్ఞాన అంధకార సముద్రములో పడి, దరిగానక కొట్టుకొని పోవుచుందురు. దైవమే అట్టి తన తెలివి లేని బిడ్డలకు **Discrimination** నిత్యానిత్య విచక్షణా జ్ఞానమునిచ్చి, ఏది శాశ్వతమో, అశాశ్వతమో గుర్తించి తనను చేరు పదవిని ప్రసాదించుగాక!

ప్రతివారు తమలోని కామక్రోధాది తామస గుణములను విడనాడి - వాటి స్థానమున సత్యము, దయ, ప్రేమ, కరుణ, శాంతము, సేవలనెడి సాత్విక

గుణముల నలవరచుకొని, వాటి సహాయముతో అవలీలగా తమలోనున్న మహా సంసార సముద్రమును దాటెదరుగాక ! దైవపరితాపనము గల్గిన మానవులందరు భక్తులైన స్త్రీ పురుషులందరూ, నిరంతరం "సోऽహం" అనెడి పడవనెక్కి "సోऽహం భావేన పూజయేత్" అనెడి తెడ్డు సహాయముతో అప్రమత్తులై, ఏకాగ్రతతో, భక్తి ప్రపత్తులతో పవిత్రతతో నిండి – ఆవలిఒడ్డునకు, దీపము ఆరిపోకుండగానే, దుర్లభమైన మానవజన్మ యొక్క గమ్యస్థానమును చేరెదరుగాక! ఆశాపాశములనెడి మొసళ్ళకు దూరముగా నుందురుగాక! దైవపరితాపనా పరులగు భక్తులు తరించుటకు యిదియే సూక్ష్మమైన సాధనమార్గము. అట్టి సాధనకు ఈ తావు. ఈ క్షణమే ముఖ్యము. మనము ఆనందముగా నుండుటకు సులభ మార్గము ఇతరుల నానందింప చేయుటయే! గాన మన సద్గుణముల సాధన, ఇతరులకు గూడ తోడ్పడుగాక ! దైవము అందరిని శాంతితో బ్రోచుగాక!

సర్వేషాం స్వస్థి ర్భవతు !

సర్వేషాం శాంతి ర్భవతు !!

సర్వేషాం పూర్ణం భవతు !!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

# ఆత్మబోధ వాక్యములు

కాలములో, ఒక్క క్షణమే చాలా అల్పమైనది. ఇక క్షణములో కోటవ వంతు ఎంత చిన్నదో ఊహించుటే చాల కష్టము.

ఒక్క క్షణములో కోటవ వంతైనను, "దైవమును మరచి జీవింపజాలను" అనెడి మహా వాక్యము, స్మరించినంత మాత్రముననే, సాధకునకు ఎంతయో నూతన శక్తిని ఉత్సాహమును ఆనందమును గల్గించుచున్నది.

సాధకుడు ఎంతవైరాగ్య శీలుడైనను, వివేకవంతుడైనను, ప్రమత్తత చేతనో, నిద్రలోనో, ఆ దివ్యమైన పరిపూర్ణమైన కోటిసూర్య ప్రకాశమును మరువ వచ్చును. గాని, సర్వాంతర్యామిగా, సర్వాధారమైయున్న అణువు మొదలు బ్రహ్మాండము వరకు నిండియున్న, ఆ కోటిసూర్య ప్రకాశమానమైన దివ్య స్వరూపము, సాధకులనేగాక, ఎవ్వరినీ మరువజాలదు గదా!

ఈ గుప్తమైన సత్యమును గ్రహించిన, బ్రహ్మాండమైన ఆనందమును, సంతృప్తియు సాధకులందరకు గలుగును.

ఈ గంభీరమైన విషయమును, అనుభవముగా, బోధపరచుకొనుటకై ఒక చిన్న యుదాహరణము తీసికొందము.

నీటిబుడగ, తన కించిజ్ఞత్వముచే, తనకు ఆధారమైన సముద్రమును మరచి దుఃఖింపవచ్చును. గాని సముద్రమెటుల, తన గర్భములో, ఉన్న నీటిబుడగలను మరువగలదు?

అహర్నిశములు, జాగ్రత్స్వప్నము, సుషుప్తి అను అవస్థలలో సైతము దైవము మన నేత్రమునకు రెప్పగా, హృదయమునకు హృదయముగా, శ్వాసకు శ్వాసగా, అనాదినుండియు మనలో వెలుంగుచు ప్రకాశించు చుండెనన్న వార్త ఎంత మహోత్కృష్టమైనది.

ఈ ఒక్క భావనను, స్థిరము జేసుకొనిన యెడల మానవుడు, మోక్షము నిప్పుడే పొందగలడు.

నామరూపములతో గూడియున్న ప్రపంచములో ఉపాధితో జీవించుచుండ, నిరంతరము, అవ్యక్తమైన సమాధ్యవస్థలో, చలనము కదలిక లేకుండ జీవించుట, అతికష్టముగాన, దైవమును, అవ్యక్తములోనేగాక వ్యక్తములోగూడ, నిరంతరము అనుభవించుటకు ప్రయత్నించవలెను.

అనగా, ధ్యానముజేయు సమయమందు, దైవము అవ్యక్తముగా ఉండెను. ఇక, కాలకృత్యములు దీర్చుకొను సమయములయందునుగాని, నిత్య దినచర్యలో, తాను జరుపవలసిన పనులలో, నిమగ్నుడై యున్నపుడు గాని, ఆ దైవమే ఆ బ్రహ్మ స్వరూపమే, శక్తిగా, వ్యక్తమై పనులు చేయుచుండెను.

సంకల్పములేని స్థితి, అలలులేని సముద్రము, పరబ్రహ్మ స్వరూపము. పనిపాట్లు చేయుచున్న స్థితి. అలలతో గూడియున్న శక్తిస్వరూపము. చిన్న పనికైనను, పెద్దపనికైనను, ఆ బ్రహ్మమే ఆధారము. గాన ప్రతి పనియు, ప్రతి క్షణమునందు, మనకు ఆధారమైన బ్రహ్మను, దైవమును, మరువకుండగ, మనము చేయవలసిన పనులు శాంతితో ఆనందముతో నెరవేర్చు కొనెదముగాక!

# సమాధిలో పలుకబడిన ఉపదేశ వాక్యములు

తాను ప్రపంచమును మరచిపోయెడి గంటలు కొన్ని గలవు. పరిపూర్ణత్వము యొక్క సన్నిధిని తన్మయత్వముచే, నాత్మానందములో మునిగియుండు స్థానముయొక్క సామీప్యమునకు జేరెడిగంటలుగూడ కొన్ని తనకుండును. అప్పుడు కోరికల చంచలత్వమంతయు నణగియుండును. ఇంద్రియముల ధ్వనియంతయు నణగద్రొక్కబడియుండును. అచ్చట దైవము మాత్రమే మిగిలియుండును.

పవిత్రముగా జేయబడిన మనస్సుకంటె, దైవమున కర్పించబడిన మనస్సుకంటె, పుణ్యతీర్థ మేదియు నెచ్చటను లేదు. మనస్సు తన్మయత్వముతో, దృష్టిలో భగవంతునియందు నిమగ్నము చేయబడిన శాంతి ప్రదేశమునకంటె వేరుగా బైట నెచ్చటను పవిత్రమైన స్థలము లేదు. సదా దైవమునకే యర్పించబడు నాలోచన కంటె బైట నెచ్చోటను దివ్యమైన ధూపదీప నైవేద్యములు లేవు.

పవిత్రత, ఆనందము, సమత్వము, శాంతి, ఇవియే సమాధ్యవస్థ యొక్క లక్షణములై యున్నవి. ఈ పవిత్రమైనట్టి ఈ యేకాంతమైన గంటలలో దైవదృష్టి వికసించును. అప్పుడే యాత్మ గమ్యస్థానమునకు దగ్గరగా నుండును. ఇట్టి యేకాంతమైన గంటలలో సెలయేరువంటి తన జీవస్వరూపము పెద్దదై త్వరితముతో సదా ప్రవహించెడు గొప్ప నదివలె వృద్ధియయి, పరమాత్మయొక్క యంతు ఆది లేని సముద్రమువంటి నిత్య స్వరూపముతో నైక్యమగుచున్నది. ఇదంతయు నొక్కటిగానే యుండును, నొక్కటే.

సదా నిర్భయముగా నుండుట, నిత్యస్వరూపమువలె సదా వెలుగు చుండుట, చావు నెరుంగకుండుట యనెడి, తన స్వభావమైన తనకు నిజమైన, గుణములను సమాధిగంటలలో గమ్యస్థానమునుండి యాత్మ పొందుచున్నది.

ఓ ఆత్మస్వరూపమా! నీ స్వస్వరూపములో నుండుము. నీ లోపలనే దృష్టి నిలుపుము. ఐక్యసంధానముకొరకై, సమాధి గంటలకొరకు ప్రయత్నించుము. నీవుగూడ యనిత్యస్వరూపముతో, నాయాత్మ స్వరూపముతో నిండియున్న స్వరూపమవేయని తెలిసికొనుము. నిజముగా నీ హృదయములో దైవమే సదా నివసించుచుండును. నీ యాత్మ స్వరూపమే యంతటను నిండియున్నది.

## II

భయపడవలదు, అనిత్యమైన ప్రపంచ వస్తువులన్నియు క్రీనీడల వంటివి. అన్ని నామరూపములకు, ననిత్యత్వము, మార్పు, చావు స్వభావ సిద్ధమైయున్నవి. నీవు మార్పులులేని, హెచ్చుతగ్గులు లేని, నిత్య స్వరూపమవు. కదలికలేని, చలనములేని నిత్యస్వరూపుండ వని తెలుసుకొనుము. ప్రపంచమును దాని ఇష్టప్రకారము నీతో ఆడుకొననిమ్ము నీ రూపమే మాయగా, కలగా యున్నది. దీనిని తెలుసుకొని నీవు తృప్తిని బొందుము. నీ యొక్క ఆత్మరూపమెరుంగని తత్వస్వరూపంబులో నిమిడియున్నది. నీ మనస్సును అనిత్యమైన కనిపించియు కనిపించని దీపము వెనుక వెళ్ళనిమ్ము. కోరికలను ఆడనిమ్ము. బంధముల నుండనిమ్ము. నీవు మనస్సువు గావు. కోరికలు నిన్ను అంటజాలవు. సర్వశక్తితోను, సచ్చిదానందములో నీవు వెలుగుచున్నావు. ఈ బ్రతుకంతయు ఒక ఆటయని జ్ఞాపకము తెచ్చుకొనుము. నీ ఆటను నీవు ఆడుము. నీవు ఆడితీరవలెను. కర్మ అనగా నిట్టిదే అయినను దీనంతటితోను నీవు ఆట ఆడేవాడవుగావు. ఆటయు నీవుగాదు. కర్మగూడ నీవుకాదు, నిన్ను బ్రతుకుగూడ బంధములో నుంచజాలదు. ప్రాణముగూడ నిన్ను ఖండముగా చేయజాలదు. అఖండమైన అంతు ఆది లేని నిత్యస్వరూపమవు నీవే గదా! ఈ బ్రతుకు భ్రాంతులతోను, స్వప్నములతోను జేయబడినదిగా యున్నది. నీవు స్వప్నములు లేనివాడవు. అనిత్య సంబంధములేని స్వప్నాతీతుడవు నీవే. దీనిని

తెలుసుకొనుము. నీవే ఆత్మవని తెలుసుకొనిన వాడవై స్వతంత్రముగా నుండుము. ఆనందముగా నుండుము. బంధములు లేనివాడవై యుండుము.

శాంతి, శాంతి, నెమ్మది, బైటకు వినిపించ నటువంటి శాంతి దైవము యొక్క వాక్కులో శాంతిని గమనించుడు. శాంతి, విశ్రాంతి, అప్పుడే, దైవముయొక్క వాక్కులో శబ్దము వినిపించును. వినిపించనటువంటి శాంతిని ఏకాంతములో విందువు.

నేను, ఎప్పుడును ఎప్పటికిని నీతోనే యుండియున్నాను. వెనుక నెన్నడును నన్ను విడచి నీవు వేరుగా నుండలేదు. ఇక ముందుమాత్రము నన్ను వదలియుందువా? నీ ఆత్మను నేనే నిజముగా నీ ఆత్మయే నేనుగా నున్నాను. ఈ ప్రపంచమునకు అతీతముగా అన్ని స్వరూపంబులకు అతీతముగా, ఆత్మతృప్తితో, పరిపూర్ణత్వములో విశ్రాంతిగా నున్నాను. నీవు గూడ నావలె నున్నావు. నిజమే నీవుగూడ నావలెనున్నావు. ఎందుచేతననగా, నీవే నేను, నేనే నీవుగానున్నాను. ఇకనైన నీ యన్ని భ్రాంతులను అన్ని స్వప్నములను వదలుము. రా, రమ్ము నా దగ్గరకు రమ్ము. నా లోనకురమ్ము, నిన్ను ఈ మాయా సంసారమునుండి, ఈ అజ్ఞానము నుండి, జ్ఞానము లోనకు నిత్యమైన నీస్వరూపానందమునకు నేను తీసుకొని వెళ్ళెదను. ఎందుచేత ననగా నేను జ్ఞానముగాను, ఆత్మగాను, నిత్యానందముగాను నున్నాను. నీవుగూడ నటులనే యున్నావు. ఇకనైనా నీ భ్రాంతులన్నింటిని వదలుము. రా, రమ్ము ఇకనైనా వెళ్ళి శాంతిలో బ్రతుకుము. శాంతితో ఆనందించుము, నీవు వెళ్ళి నీ నిజమైన బ్రతుకులో శాంతిలో జీవించుము. మరల శాంతి గంట వచ్చినప్పుడు, ఏకాంతములోను, విశ్రాంతిలోను నా వాక్కును మరల విందువు. దైవముయొక్క శబ్దములే, దైవవాక్కులనే నీవు విందువు.

## III

మరల శాంతిగంట సమీపించినది. రోజు సంధ్యవేళతో యొక్క

మగుచున్నది. బైటనుగూడ ప్రతిచోటను నెమ్మదిగానె యున్నది. ప్రకృతి గూడ శాంతముతో నిండియున్నది. బైట ప్రకృతి శాంతిగా నున్నప్పుడు ఆత్మ ఇంకను ఆనందముగా హృదయముయొక్క లోపలిభాగము లోనకు వెళ్ళి విశ్రాంతి చెందును. అంత త్వరితముగా లయమగును. అప్పుడు ఇంద్రియంబులను, దాని చంచలత్వములను అణచిపెట్టుము. మన బ్రతుకు చాల స్వల్పము. కోరికలా హెచ్చు, దైవము కొఱకు కొద్దికాలమైనను వినియోగించుము. అతడు నిన్ను చాలకొద్దిగా కోరుచున్నాడు. నీ ఆత్మను మాత్రమే తెలుసుకొమ్మని కోరుచున్నాడు. ఇంతమాత్రమే గదా నిజముగా నీ ఆత్మను నీవు తెలుసు కొన్నప్పుడు దైవమునుగూడ నీవు తెలుసుకొందువు. ఎందచేతననగా దైవమును, ఆత్మయు నొక్కటియే.

ఓ మనుజుడా! నీవు మన్నువని సదాజ్ఞప్తిలోనుంచు కొమ్మని కొందరు చెప్పుదురు. ఇది శరీరముతో పోల్చిన నిజమే. మనస్సుతో పోల్చినను నిజముగానెయున్నది. గాని అతీతమైనటువంటి ఫలమైనటువంటి, సత్యమైనట్టి, పవిత్రమైనటువంటి, మహావాక్యము ఏమని పలుక బడుచున్నదనగా, ఓ మనుజుడా! నీవు ఆత్మయే అన్న సంగతి సదా జ్ఞాపకముంచుకొనుము. ఓ ఆత్మా! నీవు ఒక్కడవే విభజింపబడని, చావులేని స్వరూపంబుగా నున్నావు. దైవము ఇటులనే పలుకుచున్నాడు. మిగిలినదంతయు వాడిపోవును. నశించును. రూప మెంత పెద్దదిగా నున్నను నశించుట తప్పదు. చావు నశింపు యనెడిది రూపములకు లక్షణములుగా నున్నది. ఆలోచన అనెడిది ఆ మార్పు క్రిందదే. ఆలోచన రూపము కలసినప్పుడే జీవస్వరూపముగా నుండును. కాబట్టి ఓ ఆత్మ స్వరూపమా! నీవు ఒకవైపున నిలువబడుము. నీ స్థానములో నీ వుండుము. ఆలోచనకు రూపమునకు అతీతమైన ఆత్మస్వరూపుండవని సదాజ్ఞప్తిలో నుంచుకొనుము. నీవు దైవముతో ఒక్కటిగానె ఐక్యమైయున్నావు, అనెడి దృష్టిలోనే జ్ఞానమంతయు నిమిడియున్నది. అప్పుడే నీవు చావులేకుండ నుందువు. అప్పుడే స్వతంత్రతగాను, పూర్ణత్వముతోను

నిండియుందువు.

దైవముగా నగుటకు ప్రయత్నించకుము. నీవు సదా యజముగానె, దైవముగానె యున్నావు. నీకు అప్పుడు దైవమనెడిది లేదు. నీ విదివరకే ఆత్మగా నున్నావు. అగుటయనెడి దారి యెంతసరిగా నున్నట్లు తీచినను ముందు, ముందు వృద్ధియనెడిది కాలములోనె యున్నదనియు, పరిపూర్ణత్వము సదా అనాదినుండియు అంత్యము వరకు నిండియుండియేయున్నదని నీకే తెలియ వచ్చును. నీవు కాలముతో సంబంధించిన వాడవు కావు. నీవు అనాదినుండియు హెచ్చుతగ్గులులేని స్వరూపముగానున్నావు. తన్మయత్వ మనెడిది. జ్ఞానమనెడిది యున్నదా? అటులైన అదే "త త్వ మసి" అనగా అదే నీవు కానున్నావు. నీవు సదా దైవముగానె యున్నావు. నీలో అతీతమైన దానినే బోధపర్చుకొనుము. అతీతమైన దానినే పూజించుము. ఆ యతీతమైనది నేను ఒక్కటే అని తెలుసుకొనుటే పూజలన్నిటిలోను గొప్ప పూజగానున్నది. ఆ యతీతమైనది యేది, ఓ ఆత్మా! నీవు దేనిని దైవమనుచున్నానో అదే యతీతమైనది అదే నీవు గానున్నావు.

ఇకనైనా అజ్ఞానము నంతను నీ స్వప్నముల నన్నింటినీ పాతాళములో పూడ్చివేయుము. నీలో నున్నట్టి ఆత్మను గురించి విన్నవాడవై ఆ యాత్మయే నేను గదాయని బోధపర్చుకొనుము. బోధపర్చుకొనిన వాడవై నీ ఆత్మను గనుము. దానిని జూచిన వాడవై దృఢ నిశ్చయముతో తెలుసుకొనిన వాడవై అనుభవించుము. బ్రహ్మానందమును అనుభవించినవాడవై ఇక నేమున్నది. "త త్వ మసి" అదే నీవుగా నున్నావు. అంతయు నీవుగానే యున్నావు. ఆత్మయే నీవు "త త్వ మసి"

అనిత్యమైన ప్రపంచమునుండి వెనుకకు మరలుము, అది స్వప్నములతో అల్లబడియున్నది. ప్రపంచమును నీ శరీరమును వాస్తవముగా స్వప్నములయొక్క గుడిసెలుగా నున్నవి. నీవు ఇంకను భ్రాంతులను, స్వప్నములను పొందెడు

వానిగానె యుందువా? స్వప్నములయొక్క సంకెళ్ళలో అంత్యము వరకును నీవు బంధించబడియే యుందువా? ఓ ఆత్మస్వరూపమా! లెమ్ము, నీ స్వప్నములనుండి మేల్కొనుము. నీ గమ్యస్థానమును జేరువరకును ఆగకుము. ఏకాంతములోను, శాంతితోను దైవము ఇటులనే పలుకుచున్నాడు. లోతైన, ఎక్కువైన, పరిపూర్ణమైన, శాంతిలో గూడ దైవము మాట మాత్రమే, నెమ్మదిగా వినిపించెడి శాంతిలో గూడ "హరి, ఓం, తత్ సత్" సదా నీవు శాంతిలో నుండుము అనియే పలుకుచున్నాడు. అన్నింటికిని అతీతముగానే గాకుండ అన్ని నామరూపములయొక్క ఆంతర్యములో గూడ ఆత్మస్వరూపమే సదా నిండియున్నది. దానియొక్క స్వభావము శాంతి, శాంతి అని చెప్పబడనటువంటి నోటితో పలుకబడనటువంటి శాంతియే ఆత్మయొక్క లక్షణముగా నున్నది.

## IV

మరల శాంతిగంటలో దైవముయొక్క వాక్య మేమని పలుకుచున్నదనగా "హృదయములో పవిత్రతముగానున్న వారె దైవమును జూచెదరని మరచి పోకుము." దీనిని సదా జ్ఞప్తిలో నుంచుకొనుము. మొదట కావలసినది పవిత్రతయే! విషయానందులు కోరికల యందెంత యపేక్షగా, పట్టుదలగా నుందురో నీవుగూడ అటులనే పవిత్రతకై అంత యెక్కువైన కోరికను, పట్టుదలను గలిగియుండుము. పవిత్రత కొరకు చాలలోతుగాను, చాల పట్టుదలగాను, ఏకాగ్రతతోను వెదుకుము. అదే నీకుపయోగించును. భక్తుడైన ప్రహ్లాదుని యొక్క ఆగొప్ప ప్రార్థనను సదా నీ మనస్సునకు తెచ్చుకొనుము. ఓ దైవమా, ప్రపంచకులు క్షణభంగురములైన అనిత్యవిషయ కోర్కెలకై యెంత ప్రేమ, శ్రద్ధలతో నుందురో అట్టి ప్రేమ, శ్రద్ధ, పట్టుదలనే నీయందు నాకు గల్గనిమ్ము. పవిత్రత అనెడిది దైవము యొక్క సన్నిధిలో అంతఃపురపు గదిగా నున్నది. నీవు దైవమును గురించి ఆలోచించుటకు ముందు మొదట పవిత్రతను గురించి ఆలోచించుము. పరమాత్మయొక్క సన్నిధికి చేర్చు సమాధియొక్క తలుపులు, పవిత్రత అనే తాళముచేతనే తెరవబడును.

నీవు సముద్రము వంటి నా బలములో కలసిపొమ్ము. నీవు శ్రమతో ప్రయత్నించ నవసరములేదు. నీవు వెదకవలదు. నేను అంతటను అన్నింటిలోను నిండియున్న ఆత్మ స్వరూపంబునని నీవు తెలుసుకొనుము. ఈ జ్ఞానముతో సదా నీవు పూర్తిగా నన్నే నమ్మినయెడల, తప్పక రక్షింపబడుదువు. నీవు యేభయములు నుంచుకొన నవసరము లేదు. నీవు నాలోనె గదా యున్నావు. మనుజులు చాల గొప్పదనుకొనెడిదంతయు నశించునని తెలుసుకొనుము. జీవముయొక్క రూపంబుల నన్నింటిని మ్రింగివేయుటకు చావు అంతటను నిండియున్నది. చావును, మార్పును, ఆత్మను తప్ప అన్ని వస్తువులను బంధించి నశింపజేయు చున్నవి. దీనిని తెలుసుకొనుము. ఈ జ్ఞానమునకు పవిత్రతయే దారిగానున్నది. అదియే పునాది, భూమి పవిత్రత వలననే, నిర్భయముగా నుండుట, స్వతంత్రతయు నేను నిత్యమైన ఆత్మ స్వరూపముననను సంగతియు నీకు అనుభవమగును.

సుడిగాలిని వీచనిమ్ము, గాని కోరికలు మండుచున్నప్పుడు మనస్సు చంచలముగా నున్నప్పుడు అప్పుడే నన్ను పిలువుము నేను వినెదను. యెందుచేతననగా నాభక్తులొకరు జెప్పినట్లుగా చీమయొక్క కాలిచప్పుడు గూడ నేను వినగలను, అప్పుడు వెంటనే నీయొద్దకు పరుగెత్తుకొని వచ్చెదను. భక్తి శ్రద్ధలతో మనః పూర్తిగా నన్నే నమ్మియున్నవారిని, నేనెన్నడు వదలిపెట్టను. భక్తి శ్రద్ధలతో మనః పూర్తిగానే గాకుండా సదా పట్టుదలతోను, నిశ్చలత్వముతో గూడ నన్నే పిలువుము.

నేనీ ప్రపంచమునుగాను, దీనికి అతీతముగానున్న ఆత్మస్వరూపంబును, నాకీ ప్రపంచమొక శవమువలె తోచుచున్నది. నాకు ఆత్మతోనె సంబంధమున్నది. వస్తువులయొక్క ఆకారములను జూచి మోసపోకుము. జ్ఞానము, తన్మయత్వము రూపములో లేదు. ఆలోచనలో అంతకంటె లేదు. పవిత్రముగా చేయబడిన, స్వతంత్రమైన, జ్ఞానముతో గూడియున్న సదానంద మయమైయున్న రూపము

నెరుంగని, ఆలోచనలను మీఱి లేశమైన మలినము, పాపము, బంధము అడ్డులేకుండనుండునదే ఆత్మస్వరూపంబుగా నున్నది. ఓ ఆత్మస్వరూపమా! నీవు లోపలకు లోపలగానున్నావు. దీనిని గురించి అనుభవమైన జ్ఞానము నీకు తప్పకవచ్చును. రాక తప్పదు. యెందుచేతననగా యెప్పటికైనా జన్మలయొక్క గమ్యస్థానము అదిగానే యున్నది. నే నెల్లప్పుడు నీతోనే యున్నానని మరచిపోకుము. జ్ఞప్తిలోనుంచుకొనుము. నేను నీతోనే యున్నాను. సర్వాంతర్యామినైన నేను, ప్రభువునైన నేను సదా నీతోనే యున్నాను. నీ దుర్బలత్వమునకంతయు బలముగా నున్నాను. నీ పాపంబులనన్నింటికిని ఓర్పుగా, క్షమాపణగా నున్నాను, నా కొరకై నీవు ప్రయత్నించెడి భక్తి, శ్రద్ధల కంతయు, నేను ప్రేమగా నున్నాను. నేను నీ ఆత్మను, నీ ఆత్మను నేను. ఆత్మను గురించి ఇతర ఆలోచనల నన్నింటిని వెనుకకుపెట్టుము. నీ ఆత్మ స్వరూపము నానుండి లేశమైన వేరుగానున్నదను ఆలోచనయే, నీ దుర్బలత్వమునకు, నీ అజ్ఞానమునకు కారణముగా నున్నది. సదా ప్రకాశించుచున్న ఓ ఆత్మ స్వరూపమా! లెమ్ము నేనే నీ ఆత్మనని తెలుసుకొమ్ము. నేను నీ ఆత్మనే.

నా సన్నిధికి వచ్చుటకు పవిత్రతయే దారిగా నున్నది. నీ ముక్తి యంతయు దీనిలోనే ఉన్నది. పవిత్రతతో నుండుము.

## V

దైవమైనటువంటి గురుమూర్తియొక్క వాక్యము మరల వినవచ్చుచున్నది.

ఆహా ! నేనెల్లప్పుడు నీతోనే ఉన్నాను. నీవెచ్చటకు వెళ్ళినను ఫర్వాలేదు. అచ్చట నే నిదివరకే యుండియున్నాను. నేను నీకొరకే బ్రతుకుచున్నాను. నా సమాధియొక్క ఫలమును నీకు ధారపోయుచున్నాను. నా హృదయముయొక్క ధనరాశివి నీవే. నా నేత్రములకు పండువుగా నున్నావు. మనము దైవములో ఒక్కటిగానే యున్నాము. మనము జన్మించినపని ముక్తికొరకే, సమాధి అవస్థను

పొందుటకే నీతోడి నాయేకత్వమును నేను ననుభవించుచున్నానుగాన, అరణ్యము వంటి ఈ ప్రపంచములోనికి సందేహములతో గూడియున్న ఈ అడవిలోనికి నిన్ను పంపుటకు నేను భయపడను. నీ యొక్క బలమును, నీ శక్తులను పూర్తిగా నాకు తెలియునుగాన నిన్ను సంసార సముద్రములో వదలితిని. ఒక్కొక్క అనుభవములోనికి నిన్ను పంపెదనుగాని, నానేత్రము నిన్ను సదా యన్ని యవస్థలలోను వెంబడించి యుండును. నీవు పాపము జేసెదవా. నాసముఖమునందే నీవు పాపము జేయుదువు. నీవు మంచిపనులుజేసినా అవియు నాసన్నిధిలోనే నా కండ్లముందే జేయుచున్నావు. నేను అన్నింటిని సదా జూచుచున్నాను. నీ స్వభావములన్నింటిని నేనెరుంగుదును. అనేక విధంబులైన అనుభవములచేతను, ఆలోచనలచేతను, మనకున్న బంధుత్వమును వృద్ధిజేయుదును. నీవు తరించిన గాని నాకు ముక్తి వలదు. నీవు తరించకున్న నా మోక్షమునకు విలువేలేదు. ఇతర రూపములలో నీవు గూడ నాఆత్మగానే యున్నావు. నా జ్ఞానదృష్టిని, నీ వెంతయెక్కువగా తీసుకొన్న, అంతయెక్కువగా మనమిద్దరము ఆత్మలో బలపడుచున్నాము. ఐక్యసంధానమును బొందు చున్నాము. జీవులయొక్క వేరుగానున్న తెరలు రాలిపోవగనే, నీవే నా ఆత్మగా నుందువు. నేనే నీఆత్మగానుందును. మన బంధుత్వమును, మృత్యువును విడిచియుండుటయు గూడ తాకజాలవు. నీవు చాలా దూరములో జన్మించి నప్పటికి నాస్థూల దేహంబును నీవెన్నడు జూడకున్నను, యెంత మాత్రము తగ్గించబడకుండ పూర్ణముగా నీవు నాస్వంతమయ్యే యున్నావు. నా యాకారమును జూచుట శిష్యలక్షణము గాదు. నా నిజస్వరూపమును బోధపర్చుకొనుటే నిజమైన శిష్యత్వము. నేను వేసియుంచిన వలనుండి నీవెన్నడును తప్పించుకొని వెళ్ళజాలవు.

నా దృష్టిని తీసుకొనుము. నా యజమానుడు నీకిచ్చిన జ్ఞానమునే నేను నీకు గూడ ఇచ్చితిని. ఆ దారిలోనే నడచుకొనుము. నేను దర్శించెడి స్వరూపమునే నీవు గూడ జూడుము. అప్పుడు నీవు నా స్వంతమైన శరీరముల

దగ్గరనున్నప్పటికంటె నాదగ్గరగాను, నాతో నొక్కటిగాను నుందువు. శిష్య భావము, నాయొక్క మనస్సునకు, దృష్టికి, భక్తి శ్రద్ధలతో నిండియుండుటచే మనమధ్య కొలుచుటకు వీలులేనంత ప్రేమయున్నది. శాంతితో వెళ్ళుము. గురుమూర్తికి – శిష్యరత్నమునకు వజ్రముకంటె గట్టిదైన బంధుత్వము గలదు. ఆ బంధుత్వము చావునుగూడ లక్ష్యముచేయనంత బలముతో నున్నది. ఎందుచేతననగా, మన బంధములు అంతులేని పరిపూర్ణమైన ప్రేమచేతను, జ్ఞానముచేతను, అంతటా నిండియున్న సర్వశక్తునియొక్క దృష్టిచేతను కట్టబడియున్నవి.

శిష్యరత్నము భక్తితోను, కృతజ్ఞతతోను, పలుకుచున్నాడు. అయ్యో నా ప్రభువా, నా దైవమా! నా అంతటను, అంతలోను నిండియున్న నా స్వంత స్వరూపమా! నే నిటులనే నేర్చుకొంటిని. గురుస్వామియే దైవమని నేర్చుకొంటిని. అతడు సదా నిత్యమైన జ్ఞానస్వరూపములో నైక్యసంధానమగుటకే ప్రయత్నించుచుండును. అతడు జూచెడిదంతయు దైవమే, అతనిదంతయు దైవదృష్టియే, నన్ను తరింపజేయుటకు అతడెంతో చెప్పుటకు వీలులేనంత శ్రద్ధతో సదా శ్రమపడుచుండును. నా గురుస్వరూపముయొక్క జ్ఞాననేత్రముల ద్వారా నేనుగూడ పరమాత్మను దర్శించుచున్నాను. నిజమైన ప్రేమ చావు కంటె బలమైనది. పుట్టుటయు, చచ్చుటయు నా గురువునుండి నన్ను వేరుగా జేయవచ్చును. నే నేమి జెప్పుచున్నాను, అబద్ధము. గురువే దైవము. దైవము నుండి నే నెన్నడైనా వేరుగా జేయబడుదునా? సముద్రమువంటి యీ యంధకారమునుండి, జ్ఞానముతోను, ప్రకాశముతోను నిండియున్న రెండవ తీరమునకు నా గురుస్వామియొక్క పేరుతోనే దాటగలను. అంధకారముతోను, మాయతోను నిండియున్న ఈ కీకారణ్యమును నేను నిర్భయముగా దాటుచున్నాను. ఎందుచేతననగా, నాదైవము నేను చేయబోయెడి పనులన్నింటిని సదా జూచుచునే యుండును. నేను పడిపోయిన అతడు నన్ను లేవదీయును. నా దారిలో ముండ్లున్నవాటిని అతడు తుడిచివేయును.

విషయేంద్రియంబులును, క్రూరమైన అడవి మృగములవంటి సందేహములును నాకు అడ్డువచ్చునా? వాటినిగూడ నాదైవమే చంపివేయును. లేక వాటి దారిలోనకు దైవము నన్ను పడనిచ్చును. నాయొక్క శక్తి నాకే బోధపడుటకు ఆ విషయేంద్రియములతోను, సందేహములతోను నన్ను పోరాడించును. కఠినముగా తాను పరీక్షింపబడువరకును మనుజునకు తనకున్న మనోబలము, శక్తి యెటుల బోధపడును!

పుట్టుట, చచ్చుట నాకు లెక్కలేవు. అన్ని ఖండములను నేను చించి వేసెదను. అన్ని బంధములకు అతీతముగా నేను వెళ్ళెదను. అతనిలో నేను జ్ఞానమునే జూచెదను. ఓ నా గురుమూర్తి అంతటను, అన్నింటిలోను నున్న ఆ నిత్య స్వరూపమే నాలోను, నీలోనుగూడ యున్నది. నీవు సూర్యుడవు. నేను కిరణముగా నున్నాను. నేను నీవలె యున్నాను. నేనే సూర్యుండను. నీవే నా కిరణముగా నున్నావు. స్వప్రకాశముతో నిండియున్న ఉపనిషత్తుల యొక్క మహావాక్యము "త త్వ మసి" అదే నీవు అని చెప్పబడినది. నీకు నాకు గూడ జెందుచున్నది. చెప్పుటకు వీలులేని, నోటికి అతీతమైన ఆ ఏకత్వమును, ఏ ఇంద్రియము వర్ణించగలదు ?

గురుమూర్తికి గురువుగా నమస్కారము.
గురుమూర్తికి దైవముగా నమస్కారము.

## VI

మరల సమాధి గంటలలో, ఆత్మ తనకు తానే మాట్లాడుకొనుచు నిటుల పలుకుచున్నది.

ఏకాంతములోను, నెమ్మదిలోనె, శాంతి నివసించుచున్నది. శాంతిని బొందుటకు నీవు చాల బలముగా నుండవలెను. బలమైన వైరాగ్యము కోరికలుడుగుట చేతనే గల్గును. అప్పుడు నీకు శాంతి గల్గును. అటువంటి ఈ

యడవిలో నీ వొక బాటసారివి. నీవు దారిలోనె నశించగలవు గాన ఆలస్యము జేయవలదు, ఆగవలదు, నీ మనస్సునంతను మంచి ఆలోచనలతో నింపుము. జ్ఞానామృతంబుచే నిండియుండుము. యెండమావుల గురించి జాగ్రత్తగా నుండుము. నీ గమ్యస్థానము అచటలేదు, పైవాటి యొక్క ఆకారములను జూచి నీవు భ్రమపడకుము. అన్నిటిని త్యజించినవాడవై జ్ఞాన దృష్టిలోనికి, ఏకాంతమునకు జేర్చెడి దారులంబడి వెళ్ళుము. అనేక నామరూపముల భేదత్వముల యొక్క వలలో చిక్కియున్న అందరును నడచెడి దారిలోనె నీవు గూడ వెళ్లకుము. మహాత్ములొక్కొక్కరే విడివిడిగా నడచినటువంటి ఏకత్వమే గమ్యస్థానముగానున్న దారులలోనే నీవు గూడ నడువుము. ధైర్యముగా నుండుట నేర్చుకొనుము. ప్రథమములో ప్రయత్నముజేసి జయించుటలోనే నీ బలమంతయు కనిపించవలెను. అను అనుమానించవలదు. వెనుకకు దీయవలదు. పవిత్రతలో మునుంగుము. దైవముయొక్క సముద్రములో బలమైన ఒక్క గంతుతో నీవు మునుంగుము. జ్ఞానమును, తన్మయత్వమే అన్నిటికిని గమ్యస్థానములుగా నున్నవి. అంత తన స్వప్రకాశముతో నిండియున్న ఆత్మయొక్క ప్రకాశించెడు కిరణమా! ప్రకృతినుండి జూచినను, నీ కంటె నితర మెవ్వరును లేరు.

త్వరపడుము లేనియెడల, నీవు విచారించవలసి వచ్చును. శ్రద్ధ, బలమైన నమ్మకముననెడి దైవ గుఱ్ఱములను, కొరడాలతో ఆదటించుము. అవసరమైన నీ శరీరమును త్రొక్కిపెట్టుము. నీ జ్ఞాన మార్గములోనికి దేనిని అడ్డురానియ్యకుము. ముక్తి దొరుకునో, దొరకదో అని యనుమానించెడు బ్రతుకు నీదిగాదు. నమ్మకముతోను, ఆత్మబలముతోను నడువుము. ఎందుచేతననగా శాంతి, ముక్తియే నీకు గమ్యస్థానముగా నుండి యున్నది. నిజముగా నీ యంత నీవే నిత్యముగా నున్నావు. నీవు స్వతంత్రముగా నుండుము. నీవన్ని బంధములను వదలి యుండుము. ఆత్మ జ్ఞానము యొక్క భాషయంతటిలోను "బలము" అనెడు మాటకంటె విలువైనదింకొకటిలేదు.

మొదటను, చివరను, నెల్లప్పుడును బలముగా నుండుము. స్వర్గములకు, నరకములకు, దైవములకు, దెయ్యములకు యెవ్వరికిని జడియకుండ నీ జ్ఞాన మార్గమున నడుపుము. నిన్నేదియు జయించలేదు. దైవము కూడ నీ సేవజేయవలసివచ్చును. ఏలననగా నతడు అతని స్వరూపమువలె, నీలోనున్న దానిచే ఆకర్షింపబడును. గనుక జ్ఞానదృష్టిలో జూచిన ఏకాంతమే అన్నిటికిని సారాంశముగా నున్నది. నీలో నున్నది ఏకత్వమే. నీవే దైవస్వరూపుడవు. నిజముగా నీవే దైవస్వరూపుడవుగా నున్నావు.

నీవు నమ్ముచున్నావా? నీ యాత్మయందు దృఢమైన నమ్మకము నుంచుము. నీ యాత్మయందే నీకు నమ్మకము లేనప్పుడు ఇక దైవము నెటుల నమ్మగలవు? నీవు నీకే ముక్తి నొసంగవలెను. నీవే స్వయముగా తరించవలెను. తమకు తాము స్వప్రయత్నముచే సహాయము జేసుకొనుచు పాటుపడుచున్న వారికి దైవము సహాయము జేయును. నీ నిజాత్మ యొక్క స్వభావమును, ఏకత్వమును బోధపర్చుకొనుము. జ్ఞానమునుండి నీ యాత్మ యొక్క విలువ కనిపెట్టుము, నీవు శరీరము గాదన్న సంగతి బోధపర్చు కొనుము. ఆలోచనగూడ నీవు గావు. చూడడము యొక్క దారియే ఆలోచన అని చెప్పబడుచున్నది. దానికి చూపే యంత్యముగా నున్నది. కాబట్టి తుది సత్యమేమనగా మోక్షమే, తుది దైవాజ్ఞ యేమని జెప్పుచున్నదనగా ఓ మనుజుడా! నీ యాత్మను తెలుసుకొనుము. మనుజుడా! నీ స్వరూపమును బొందుము. నమ్మకము, భక్తితో పూర్ణముగా నమ్మియుండుము. ప్రతిదిగూడ మన నమ్మకము మీదనే నిలిచియుండును. నమ్మకమనగా పట్టుదల లేకుండా తల యూపుటగాదు. జ్ఞానదృష్టితో నైక్యమయ్యెడిదే నిజమైన నమ్మకము సందేహముకంటె వేరుగా గొప్పపాపమెచ్చటను లేదు. విషమునెటుల నసహ్యముతో జూచెదవో అటులనే సందేహమునుగూడ జూచుట నేర్చుకొనుము. ఆత్మను సందేహించుటే గొప్ప దుర్బలత్వముగా నున్నది. తన నిత్యస్వరూపమును నమ్మకుండుటే నిజముగా మహాపాపముగా నున్నది. నీవు దేనిని గురించియు భయపడకుము, ఆగుము.

దైవము గురించి గూడ భయపడవద్దు. ఏలనన దైవమును ప్రేమించవలెను. భయపడరాదు. నీ యాత్మయందే నీకు భయమెటులగల్గును దైవమే నీయాత్మగా నుండెను. దైవము తప్ప నితరమేమియు లేదు. నీవేయానిత్య స్వరూపముగా నున్నావు. కాబట్టి నిద్రనుండి మేల్కొనుము. లెమ్ము నీ గమ్యస్థానమును జేరువరకు ఆగవలదు. ఇదియే ఆనందస్వరూపునియొక్క యుపదేశ వాక్యములుగా నున్నవి.

మరల సమాధి అవస్థలలో ఆత్మ ఇంకను తనకు తానే మాట్లాడుకొను చున్నది.

వాస్తవముగా నిన్ను పరీక్షించెడి గంట వచ్చును. మనుజుని దుర్బలత్వము చాల హెచ్చుగా నుండును. గాని పాపమనగ నీరసత్వమే నను జ్ఞానము కొంతకాలమునకు నీ దుర్బలత్వమును బోగొట్టును. ఎందుచేతననగా నీవొక్కసారి విషమని తెలుసుకొనిన దాని నసహ్యముతో జూచెదవు. నీయొక్క తప్పును తెలుసుకొనినప్పుడు అది తప్పుగానె మిగిలి యుండును. నీ హృదయములో నుండెడిది కష్టములను బైట పెట్టితివి. నీ యాంతర్య స్వరూపము ఆ తప్పులయొక్క ప్రవాహముల నన్నింటిని మార్చును. కొంతకాలమునకు నీ హృదయము భక్తి, శ్రద్ధలతో నిండిన నీవే జయించెదవు. సదా ఏకాగ్రతతో ప్రార్థింపుము. ఎందుచేతననగా జ్ఞానవృద్ధికి సదా ఆత్మజ్ఞప్తితో మెళకువగా నుండి చూచుచుండుటే చాల అవసరమై యున్నది. అప్పుడప్పుడు నీస్వరూపము నీ ప్రబోధపడులాగున కొన్ని క్షణములు నీకు వచ్చును. అప్పుడు నీరసత్వముగా తెలుసుకొందువు. ఆ సమయములో దైవమును పిలువుము. అతడు నీ ప్రార్థన విన్నవాడై నీకు శాంతిని ఆనందమును నిచ్చును.

నోటితో మాటలు చెప్పుట ఒక సంగతియు, దానిని అనుభవములో పెట్టుట వేరేసంగతియు చెప్పుట తేలికగాని, చేయుట చాల కష్టము నీవెన్నెన్ని సంగతులు బుద్ధిచేత తెలిసికొనియున్నను మనుష్యుడు వృద్ధిజెందుటే,

పరిపూర్ణత్వమును బొందుటే గమ్యస్థానముగా నున్నది. అన్నిటిలోను అందరకు మోక్షమే ప్రధానము. నీలోనున్న క్రూరమృగము చాల బలమైనదిగా నున్నది. గాన భక్తితో నిండియున్న ప్రార్థనచేత దానిని సాధుపర్చవచ్చును. ప్రార్థనయే అవసరమైనదిగా నున్నది. ప్రార్థన మాత్రమే కామమును జయించును. దైవనామముకంటె హెచ్చైనదేదియు లేదు. సదా ప్రార్థన జేయుటయు, సదా మెళకువగా నుండుటయు ననువానిని ముఖ్యోద్దేశముగా నుండనిమ్ము. అనాధలను బ్రోచెడి పరమాత్మ యొక్క దేవతలు వచ్చి నిన్ను స్వతంత్రునిగా జేసెదరు. నిజముగా జ్ఞానమార్గము చాల దూరముగా నున్నది. గాని గమ్యస్థానము తప్పక పొందెదవు. ప్రార్థన చాల లోతుగా వెళ్ళును. అది కోరికలయొక్క సారమునంతయు తినివేయును. ప్రార్థన చేయుము. ప్రార్థనతో కాలముగడుపుము. సదా ప్రార్థన జేయుచుండుము. ఎల్లప్పుడును ప్రార్థననే జేయుము. నీ తప్పుల గురించి నీవు విచారించవలదు. నీవు పడిపోయినప్పుడు విచారించవలదు. దైవము సదా నీ దగ్గరనేయున్నాడు. అతడు నీ విచారమును, నీ భక్తిని యెరుంగును. గాన నతనినెన్నడును పిలుచుట మరువవలదు. నీ పాపంబులోగూడ బలముగా నుండును. ప్రార్థనలోనుండియె అన్ని వస్తువులు గలుగును. దైవమును ప్రేమించుట జ్ఞానదృష్టి జ్ఞానానందము అన్నియు ప్రార్థన వలననే గల్గుచున్నవి. సర్వశక్తుడైన దైవము గొఱ్ఱెలకాపరివంటి వాడనియు నతడు గొఱ్ఱెలు దారి తప్పినప్పుడే అతి జాగ్రత్తతో కాపాడుచుండుననెడి దృష్టిమీద నీవు నిలువబడుము. ముందుగనే దైవమును న్యాయమిచ్చెడు ప్రభువుగా తెలుసుకొనుము. అతడు ప్రేమాసముద్రమే. నీవు భక్తితో అడగడమే తరువాయి. నీవు యేదికోరిన దానినే నీకిచ్చును. నీవు వెదికిన నతడు కానవచ్చును. నీవు తట్టిన నీ కొరకు తలుపు తెరచును. నీవు కొంచెమైనను దైవము కొరకు ప్రయత్నించిన అదియే వృద్ధియై నీకు స్వర్గరాజ్యము నిచ్చును.

అయ్యో నీవు చేసెడి ప్రతీ ప్రార్థనయు, తరుచు దైవమునకు పంపెడి నీ హృదయమంతయు నీకే బలమునిచ్చి నిన్ను వృద్ధి జేయుచుండును. నీ

ప్రార్థనే నిన్ను పరిపూర్ణునిగా జేయును. నీవు ప్రార్థనమీదనే ఆనుకొని యుండుము. అదియే నీకు దారి, నీ హృదయమెంత దట్టమైన చీకటితో నిండియున్నను ప్రార్థన నీకు వెలుతురు నిచ్చును. యేలనన ప్రార్థనయే ధ్యానము, ప్రార్థనయే జ్ఞానదృష్టి, ప్రార్థనయే సర్వంతర్యామితో నైక్య సంధానమును గలిగించును. అంతటను నిండియున్న స్వరూపంబుతోను, అతీతమైన ప్రేమతోను ప్రార్థనయే కలుపుచున్నది. అది నీ యాత్మకు రెక్కల నిచ్చుచున్నది. నీవు బురదలో నున్నప్పటికిని నీవు లేవగలవు. నీ పాపంబులు పర్వతంబులంత బరువుగా నున్నప్పటికి, నీ జ్ఞానమంతయు బురదలో కప్పబడియున్నను, ప్రార్థన నిన్ను లేవనెత్తును. ఎంత దూరము నుండియైనను దైవము నీ ప్రార్థనలను విని ఆయన ప్రేమను, శక్తిని నీకు కనపర్చును. దైవముయొక్క కృపాకటాక్షముచే నీవు లేవనెత్తబడుదువు. అప్పుడు నిన్ను బ్రోచిన దైవమును పొగడుచు నొక పాట పాడెదవు. దైవము చాల ప్రేమగలవాడనియు, కరుణామయుండనియు నీ హృదయమే నీకు జెప్పును. అప్పుడు నిన్ను తెలిసియున్న వారందరు నీవు మహాత్ముండవయ్యెదవని జెప్పెదరు. నిజముగా ఆయన యొక్క న్యాయమే. ఆయన క్షమాపణ యున్నది. ఆయన క్షమాపణ నిత్యమై ప్రపంచమంత్యమగు వరకు నుండును గనుక, ప్రార్థనను వదలిపెట్టకుము. విషయ కోర్కెలు, విరోధులవలె నీ మీదకు ఎంత తీవ్రముగా వచ్చినను! నీకు ఫర్వాలేదు. నీవు ప్రార్థనచేతనే నీ గుణంబుల చుట్టును, ఒక బలమైన కోటను గట్టెదవు. దానిని చొరబడుట నెవ్వరికిని దేనికిని శక్యముగాకుండును. ఆ నరకముయొక్క ద్వారములు గూడ దానిని మించజాలవు. ఎందుచేతననగా నీ ప్రార్థన వలన నతడు ప్రేమ, భక్తి, జ్ఞానములనెడి బలమైన త్రాళ్ళచే నిన్ను బంధించి తన దగ్గరకు జేర్చుకొనుము.

## VIII

హృదయమునకు లోపల చాల శాంతిగా నున్నప్పుడు గురుమూర్తి

యొక్క శబ్దము మరల వినవచ్చుచున్నది.

నా కొమరుడా! శరీరము సదా ఆత్మతో పోరాడుచుండును కాబట్టి నీ వెల్లప్పుడును జాగరూకుండవై యుండుము. ఈ బ్రతుకెంత వట్టిదిగా నున్నదిగా నున్నది ఇంద్రియములను నమ్మకుము. సుఖదుఃఖములచేత నీ యింద్రియములు, ఆడుచు పరుగెత్తు చున్నవి. నీవు ముందుకు వెళ్ళుము. నీవు ఆత్మస్వరూపుండవే. ఏ క్షణమందైనను నీ శరీరము నశింపవచ్చును. నిజముగా ఆ గంట యెవ్వరికెఱుక? కాబట్టి నీ దృష్టినంతయు మార్చకుండ ఏకాగ్రతగా సదా దైవమునందే యుంచుము. నీ మనస్సు దైవాలోచనలతో నిండి కరంగనిమ్ము నీవు బ్రతికియున్న గంటలలోనే, నీ మనస్సును పవిత్రతగాను, ఆనందముగాను నుంచుము. చచ్చిన తర్వాత యేమి జేయగలవు గాన శరీరముండగనే బుద్ధిగాను, ఏకాగ్రతగాను నుండుము. అటుపైన నొకవేళ మృత్యువు నీ శరీరమును మ్రింగినను నీవు చావుకు సిద్ధముగానె యుందువు. ఈ క్షణమునందే చచ్చిపోయెదనేమో అన్నట్లు నీవు జాగరూకతతో నీ బ్రతుకును గడుపుము. అప్పుడే నీవు నిజమైన బ్రతుకును ఆనందించెదవు. కాలము వృధాగా పరుగెత్తుకొని పోవుచున్నది. నీవు నిత్యమైన చావు నెరుంగని, దైవాలోచనలతో నిండియున్నగాని, కాలమును నీవు సత్యముగా జేయగలవు.

నీ శరీరము నశించినప్పుడు తప్పకుండా నీవు విచారించెదవు. యెందుచేత? నీవు దైవమును మరచి పశువువలె వృధాగా జీవించితివి గనుక, అయ్యో కాలమును అశ్రద్ధచే వృధాపుచ్చితిని బద్ధకించితిననెడి ఆ దిక్కు లేని ఆ పాపపు మాటను అప్పుడననేల? అయ్యో శరీరము పోకుండగనే, నేను కొద్దిగానయినను భక్తిగానున్న నిప్పుడు దైవమునకు నేను దగ్గరగానె యుండియుందునుగదా అని వేనవేలు జీవులు అప్పుడు విచారించెదరు. కాబట్టి యికనైన, ఈ క్షణము నుండియైనా నీ హృదయమునంతయు దైవాధీనముజేసి "ఓ దైవమా నీ దివ్యదర్శనమును నా కిమ్ము. నన్ను భక్తిగా నుండులాగున

జేయుము. నీ కొరకే నన్ను యేద్వనిమ్ము. నీ యందు నాకు కోరికనైన నిమ్ము" అని రాత్రింబగళ్ళు దైవపాదంబులకొరకు పశ్చాత్తాపముతో నీ కండ్ల నుండి నీరు కారెడులాగున నేడ్వుము. భక్తులందరి యొక్క ఆ గొప్ప ప్రార్థనను నీవు నిత్యము దైవపాదంబులకు అర్పించుము. ఓ దైవమా నిన్నే ప్రేమించనిమ్ము. ఓ ప్రభువా! నీ కొరకే నన్ను బ్రతుకనిమ్ము. ఓ నా దైవమా! నిత్యమైన నీ పాదcబులు, నీ జ్ఞప్తి తప్ప నా కితరమేమియు వలదు.

మనుజుని యొక్క శక్తి అంతు ఆది లేనంత హెచ్చుగా నున్నది. అంత హెచ్చయిన శక్తి నీ వెప్పుడు పిలచిన నప్పుడు వచ్చుటకు నీలోనె యున్న దైవము యొక్క ఆత్మను నేనేయని తెలుసుకొని ఆనందించుము. నీలో నూపిరిగా నున్నది ఆయనే, ఆయన నీలోనే బ్రతుకుచున్నాడు, నీలో అతడే కదలుచున్నాడు. నీ స్వరూపమంతయు నాయనలోనె యున్నది. దీనిని నీవు అనుభవములో పెట్టుకొనినప్పుడు భయమంతయు నీ నుండి వెడలును, నిర్భయముగా నుండెడు దశను నీవు పొందుదువు.

గురుమూర్తియొక్క వాక్యములను ఆత్మయేమని సమాధానము జెప్పుచున్నదనగా, ఓ ప్రభువా! అన్నింటిని సృజించిన ధర్మకర్తా! అంతు ఆది లేనటువంటి ప్రేమయే నీ యొక్క స్వభావముగా నున్నది. నీవు అంతటను, అన్నింటిలోను, సర్వాంతర్యామిగా నున్నావు. ఓ దైవమా! నా ప్రభువా! నీవు అంతటను నిండి సర్వాంతర్యామిగా నున్నావను జ్ఞప్తి నాకు సదా హెచ్చుగా నుండులాగున కరుణించుము. అన్ని ప్రపంచములలో నీ పాదములు తప్ప మాకు వేరు దిక్కేమియు నెచ్చటను లేదు. భయమును, చావు యొక్క రూపంబులును, అంతటను కానవచ్చుచున్నది. బాధయు, మాయయు, అన్నివైపులను కనబడుచున్నవి. అనిత్యమైన మానుష జన్మయొక్క గతియంతయు నిటులనే యున్నది. కాబట్టి ఈ మాయ తెరను నీవు నా నుండి తొలగించుము. సదా చావే గనుబడినను బ్రతుకులన్నియు, బాధలతోను, కష్టములతోనె

నిండియున్నను అన్నింటిలోను నేను నీ స్వస్వరూపమునే జూచెదను. ఓ నా దైవమా! భయంకరమైన దానిలో గూడ నన్ను నీ స్వరూపమునే జూడనిమ్ము. మాయను నశింపజేసెడు నా ప్రభువా! నా ప్రార్థనను వినుము.

అప్పుడే గురుమూర్తి యొక్క వాక్యము జవాబుగా వినవచ్చుచున్నది. నా తనయుడా! దైవమును పిలువుము. ఎల్లప్పుడు గూడ దైవమునే పిలువుము. ఆయనను గురించియే నీవాలోచించుము. ఆయనకు తప్ప ఇతరులకు నీ మనస్సు నీయకుము. సర్వత్రానిండియున్న ప్రేమమయి, శక్తియు నీ చుట్టునుండును. అప్పుడు నీతో ఆయన సమాధి, వాక్యములను మాట్లాడును. వాస్తవముగా నీవు దైవమునే నమ్మియున్న నీ కష్టములన్నియు విడదీయును. మనుజుడు పరిపూర్ణమును బొందుటకై తాను దైవమును పూర్తిగా నమ్మి తన శరీరమును మరచియుండవలెను. తెంపు లేకుండా ఏకాగ్రతగా తాను సమాధి నిష్ఠలో నున్నప్పుడే పరిపూర్ణత్వమును రుచిచూడగలడు. ఈ బ్రతుకంతయు మాయ, దగా అని తెలుసుకొన్నప్పుడు చావు సిద్ధముగా నున్నప్పుడు హృదయమంతయు బాధలచే పీడించ బడుచున్నప్పుడు మనుజునియొక్క బాధలు, కష్టములు చివరిదశలోనున్నప్పుడైనను, ఇవన్నియు శరీర సంగతులే అనియు అనిత్యములే అనియు ఆత్మవైన నీతో సంబంధము లేని వనియు మరచిపోకుము. నీవు ఆత్మవనిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొనుటకైనను ప్రయత్నించుము. ప్రతిరోజు నీ ఆఖరు రోజే అని జ్ఞప్తి తెచ్చుకొనుము. ఈ రోజుతో జన్మసరియేమో ఇక రేపు రాకముందే ఈ శరీరము నశించునేమో అని నిత్యమును తలంచుము. నీ జన్మలో ప్రతిక్షణమును గూడ ఇటుల తలంచుచూ దీనినే జపము చేయుచుండుము. రోజుగూడ నీబ్రతుకునంతను దైవమునకే అర్పించుము. ఆయన దృష్టిలో నున్న జ్ఞానమునంతను జూడుము అటులసదా దైవదృష్టిలో నున్న నీవు పెద్దపులి యొక్క నోటిలో నున్నను, చావుయొక్క సన్నిధిలో నున్నను, నరకము యొక్క గుమ్మము మీదనున్నను నీకు దైవమే కానవచ్చును.

ఈ జన్మలో నీవు సదా దైవజ్ఞప్తితో నుండుటకే శ్రమపడిన గొప్ప ఆనందమును చాల విశ్రాంతియు నీకొఱకు వేచియుండును. ఇప్పుడు అసహ్యముగా నున్నవి, నీకు ముందు ఆనందముగా నుండును. ఇప్పుడు భయంకరముగా నున్నది, ముందు నీకు ప్రీతికరముగా నుండును. అంతయు నానందముగానే యున్న సదా శాంతిలోనే యుందువు. పాముచేత కరవబడిన మహాత్మునితో కలసి నీవుగూడ ఆనందముతో "చూడుడి" నా ప్రియుడైన దైవము యొద్దనుండి వార్త దెచ్చెడివాడు వచ్చెను. దైవమునుండి వచ్చిన వార్త యేమి ఆనందకరము? లేక పెద్దపులి నోటిలోయున్న మహాత్మునివలె నీవుగూడ శివోఽహం, శివోఽహం అని ఆనందముగా పలుకుదువు. ఇదంతయు నీ ఆత్మ జ్ఞప్తి చేతను నీ మనోబలము చేతనే కల్గును. ఇదంతయు నిజముగా దైవముయొక్క చిన్మయత్వమే, ఇదే నిజమైన దైవజ్ఞప్తిగాను దైవదృష్టిగాను నున్నది.

యుద్ధము జేసెడి వీరుడు తన మాతృదేశమును సంరక్షించుటకై పిరంగియొక్క నోటియొద్దకు గూడ నిర్భయముగా పరువెత్తును. తల్లి తన కొమార్తుని రక్షించుటకై అగ్నిలోనికి వెళ్ళును. జలములో దుముకును, పెద్దపులి నోటిలోనికి గూడ తన తనయుని కొరకై నిర్భయముగా వెళ్ళును. నిజ స్నేహితుడు తన స్నేహితుని కొరకై తన ప్రాణములను గూడ నొసంగి అవసరమైన తన శరీరమును విడుచును. దైవముకొరకెన్ని కష్టములైనను సన్యాసి ఓర్పుతో భరించును. దైవముయొక్క పేరుమీద నీవు గూడ నీ కష్టముల నన్నింటిని నీయపాయముల నన్నింటిని నిర్భయముగా, ఆనందముతో ఓర్పుతో భరించినవాడవై నీ భక్తిని నిల్పుకొమ్ము నీవె నా తనయుడవు. చావులోను, బ్రతుకులోను, మంచిలోను, చెడ్డలోను నీవెక్కడెక్కడకు వెళ్ళినను, నీవెక్కడున్నను, నేను సదా నీతోనే యుందును. నేను సదా నిన్ను కాపాడుచున్నాను. నేను నిన్ను ప్రేమించుచున్నాను. ఎందుచేతననగా నేను, నీ ప్రేమచేతను బంధించబడి యున్నాను దైవమునకున్న నా భక్తి ప్రేమలు నీతో నన్ను ఒక్కటిగా జేయుచున్నవి. నేను నిన్ను సదా కాపాడుచున్నాను. నేను నిన్ను సదా

ప్రేమించుచున్నాను. నీ ఆత్మగానె నేనున్నాను. నా బిడ్డా! నీ హృదయమే నా గృహముగా, నాస్వంతమైన ఇల్లుగా నున్నది.

## IX

జ్ఞానముతో ప్రజ్వలించుచున్న శబ్దము మరల వినవచ్చుచున్నది. ఆహా ఒక విధమైన ప్రేమయున్నది. అదిదేనికిని భయపడదు. ఆ ప్రేమ బ్రతుకు కంటెను, చావుకంటెను, పెద్దదిగాను, అతీతముగాను నున్నది. ఆ ప్రేమయే నేనుగా నున్నాను. ఏ ప్రేమ దేనిచేతను ఖండముగా జేయబడదో అంతటను అన్నింటిలోను నిండియున్నదో చావు సన్నిధిలో గూడ నున్నదో, భయంకరములలో గూడ అతి ప్రేమాస్వరూపముగా నున్నదో ఆ ప్రేమయే నేనుగా నున్నాను. నోటితో చెప్పుటకు వీలులేనంత తియ్యగా ఎట్టిబాధనైనను యెట్టి భయంబునైనను ఆనందముగా ఓర్పుతో భరించెడి ప్రేమ నీవుగానె యున్నావు. అన్ని విచారంబులను పారదోలెడిది నీవెక్కడ వెదకిన నచ్చటనే గాన వచ్చెడిది ఈ ప్రేమగానె యున్నది. ఆ ప్రేమయే నేనుగానున్నాను. ఆ ప్రేమ కంతకు సారాంశముగా నేనున్నాను. ఓనా ఆత్మ స్వరూపమా! ఆ ప్రేమనైన నేను నీయాత్మ స్వరూపంబుగా నున్నాను. నాయొక్క స్వభావమే ప్రేమగా నున్నది. ప్రేమ యనునది నేనుగా నున్నాను.

అంతటను నిండి సర్వము తెలిసియున్న దానిలో అందముగలదు. అది అసహ్యతనుగాని తప్పులనుగాని యెరుంగదు. అది పూర్ణముగా నుండును. అది జ్ఞానముగా నున్నది. ఓం, ఈ ఆనందమునకు, తుది, మొదలులేదు, అది ఆకాశము సర్వత్రా వ్యాపించినట్టుగాని, సముద్రములయొక్క రూపంబులవలెగాని యుండును. దానిని మనము శాంతి గల సూర్యాస్తమయమునందు, మండుచున్న సూర్యోదయమునందు జూడవచ్చును. అది సింహముయొక్క గర్జనలోను, పక్షియొక్క పాటలోను గూడ వినవచ్చును. తుఫానుగా నుండెడిదియు, శాంతిగా నుండెడిదియు నదియే. ఆ ప్రేమ ఆయానందము

యీయన్నింటికి అతీతముగా గూడ నున్నది. ఇవికొన్ని దానియొక్క రూపంబులుగా నున్నవి. ఆ యందమంతయు నేనుగానే యున్నాను. ఆయందము, ఆనందముకంటె లోతులో నున్నది. బాధకంటె చాల లోతుగానున్నది. ఇదియే ఆత్మయొక్క అందము ఆహానేనే ఆయందముగా నున్నాను. ఆకర్షించెడి వస్తువులన్నింటికి అవియే స్వభావములతో నున్నను, వాటికి నేనే, మధ్యస్థానముగా, ఆధారముగా నున్నాను. నేనేసూదంటు ఱాయినిగా, మిగిలిన వస్తువులన్నియు నినుప నలుసులుగా నున్నవి. కొన్ని ఒక ప్రక్కకు మిగిలినవి ఇంకొక ప్రక్కను సూదంటు ఱాయిచే నొక్కటైనను వదలి వేయబడకుండ ఆకర్షింపబడుచున్నది. వాటికి నన్ను అంటుటకు కోరికలేకున్నను బలముచేతను, నాశక్తిచేతను అన్నియు నాదగ్గరకే ఈడ్వబడుచున్నవి. నేనే ఆ యాకర్షించెడు సూదంటురాయిగా నున్నాను, ఆయందమంతయు నేనుగానున్నాను. ఆ యాకర్షణశక్తి అంతయు నేనే, ఆనందమయుండవై యుండుటే నాస్వభావముగా నున్నది.

ఆనందమయమై యున్నది ప్రేమలో నిండియున్నదే నిజమైన బ్రతుకు, ఆ బ్రతుకే నేనై యున్నాను. ఆ బ్రతుకునెద్దియు తగ్గించనేరదు, ఏదియు ఖండముగా విభజింప జాలదు. ఈ బ్రతుకే పరమాత్మ యొక్క జీవముగా నున్నది. అదే సర్వత్రా నిండియున్న బ్రతుకు అదేనేనుగా నున్నాను, దానియొక్క స్వభావము శాంతియే నేనే శాంతిగా నున్నాను. అన్నింటిని తనలో నిముడ్చుకొనిన ఆస్వరూపంబులో దెబ్బలాడుట గాని గొడవగాని, బ్రతుకుటకై జేసెడి యనవసర ప్రయత్నములుగాని, అజ్ఞానపు కోర్కెలుగాని, అనిత్యమైన ఇతరమైన వేవిగాని లేవు. అది మాత్రమే యున్నది. ఆ బ్రతుకే, ఆ ప్రేమయే నేనుగానున్నాను. సూర్యుడుగాని, నక్షత్రములుగాని ఆ బ్రతుకును తమలో నిముడ్చుకొనజాలవు. ఆ వెలుతురునే వెలుతురును మీరజాలదు. అది అన్ని ప్రకాశంబులకంటె హెచ్చుగా నుండును. అది ప్రకాశంబులకెల్ల ప్రకాశమే. ఈ ప్రేమ యొక్క తుది మొదలు లోతులను కనిపెట్టజాలము. దానియొక్క

యెత్తులైనను మనము కొలువజాలము. ఆ బ్రతుకే నేనుగానున్నాను. నీవు నాలోనె యున్నావు. మరియు నేను నీలోనే యున్నాను.

నన్నేదియు భరించలేకున్నను నేనే అన్నింటిని భరించుచున్నాను. ఉన్న నామరూపంబులన్నింటికి ఆధారముగా ఆత్మగా నున్నాను. బ్రతుకు యొక్క శబ్దములో నేనే శాంతిగా నున్నాను. అంత్యము వరకు కాలము యొక్క గూడుకు దారముగా అల్లబడియున్నాను. ఆలోచన రూపంబుల రెండింటికి ఆత్మగా నున్నవాడను నేనే. మనస్సు లేకున్నను సర్వము తెలిసియున్నవాడుగా నున్నాను. రూపము లేకున్నను అంతటను నిండి యున్నాను నాకేమియు లేకున్నను, నేనన్నింటిలోను నిండియున్నాను. శక్తి స్వరూపంబును నేనే, శాంతి స్వరూపంబును నేనే సర్వత్రా నిండియున్న స్వరూపమును నేనే, అంత్యము వరకు నుండు నిత్యస్వరూపంబును నేనే, అన్ని ద్వంద్వములలో ఏకముగా నున్న స్వరూపంబును నేనే, జీవముతో నున్న అన్నింటికిని మొత్తముగాను, సారాంశముగానున్న వాడను నేనే. అన్ని భాగములకు పూర్ణత్వమును నేనే. చావు బ్రతుకులకు అతీతముగా నున్నవాడనై నేను చావు లేకుండను బంధములు లేకుండను జీవించుచున్నాడను, ఎవ్వరునన్ను తెలుసుకొనుచున్నారో అతడే స్వతంత్రుడుగా నున్నాడు అతడే స్వతంత్రుడు.

అన్ని మాయ స్వరూపంబులలోను, నేను నిత్యమునే జూచుచున్నాను నిత్యమే అంతను జూచుచున్నది. తల్లి స్వరూపంబైన ఈ మాయను, ఈ శక్తిని, ఈ గారడీ విద్యను ఆడించెడివాడను నేనే, అనాదిలో కాలముయొక్క గర్భము నుండి నేను జన్మించినవాడనై అన్ని రూపంబులలోను నిండియున్నాను. కాలమంతకు నేనే గర్భముగా నున్నాను. గాన నంతయు నేనైయే యున్నాను. మరియు నీవు గూడ అదే. నీవు" 'త త్వ మసి.' ఓ ఆత్మా నాలోనున్నది ఆత్మ స్వరూపంబే, కాబట్టి నిద్ర నుండి మేల్కొనుము. లెమ్ము, అన్ని బంధములను ముక్కముక్కలుగా చించివేయుము. నీ స్వప్నములన్నింటిని తుడిచివేయుము.

నీవే యాత్మ స్వరూపంబువు. నీ స్వస్వరూపమును తెలుసుకొనుటకు ప్రయత్నించిన నీ కేదియు ఈ ప్రపంచమంతలోను నడ్డురానేరదు. ఇకనైనను లెమ్ము నీ స్వరూపము నీ కొరకే వేచియున్నది. నిద్రబోకుము లెమ్ము, లెమ్ము నీ గమ్యస్థానమును జేరు వరకు మరల నీ దారిలో నిద్రబోకుము. ఆగవలదు. ఆత్మయైన, జీవమైన ప్రేమా సముద్రమైన, నిత్యానంద స్వరూపంబైన నీ యొక్క గమ్యస్థానమును జేరువరకు ఆగవలదు. ఆత్మజ్ఞానమే నిన్ను స్వతంత్రముగా జీవన్ముక్తునిగా జేయును.

ఓం ఓం ఓం

# నేను మౌనము నేల దాల్చితిని ?

1) మౌనమే ఈశ్వరుడు; గాన నేను మౌనమును దాల్చితిని.

2) మతము పేరిట నైన నేమి, ఈశ్వరుని పేరిటనైన నేమి, వాగాడంబరమునకు నేను విసువుజెందితిని. కావున నేను మౌనము వహించితిని.

3) బాహ్య ప్రపంచమున మనుజులాడు వ్యర్థ ప్రసంగములు, వారు వేయు మూర్ఖపు ప్రశ్నలు, వారుచేయు అర్థరహితమైన వాదనలు తప్పిపోవుటకై, కాలము వృథాగా పోకుండుటకై నేను మౌనమునే ఆశ్రయించితిని.

4) దృఢముగ, వాకొనగలుగునది మౌనమే యని యెరింగి ఆ సాధనమునే నేను స్వీకరించితిని.

5) పరిమిత శక్తిమంతములగు మాటలకంటె, జ్ఞానయుతమైన మౌనము చేతనే నేను మానవుల సమీపించి, వారికి సేవ జేయగలను; సహాయ పడగలను. కావున నాకు మౌనమే శరణ్యము.

6) మాటలు-మనతో ప్రత్యక్ష పరిచయముగల కొలది మందికి మాత్రమే ఉపకారములగును. మౌనమో, దగ్గరవారికి, దూరమువారికి, పరిచితులకు, అపరిచితులకు - అందరికిని మేలొనగూర్చును. కావున మాటలకంటె మౌనమే ఘనతర మైనదని నాకు పొడకట్టును.

7) తన యొక్కయు, తన వారియొక్కయు బాగునే జూచుకొనుచు, తన పొరుగువారిని గాని, బాధితులను గాని చూడక వారి క్షేమము నరయక స్వార్థపరత్వమున మసలు జనబాహుళ్యముపై నాకు గల విశ్వాస మంతరించుచున్నది. కావున నాకు మౌనమే ఉపాసనీయమైనది.

8) బాహ్యామునుండి వచ్చు దుష్ట విమర్శనా ఖడ్గములుగాని, తీవ్ర క్షోభానలముగాని దేనిని చేరజాలవో అట్టి పవిత్ర స్థానమొకటి మనలో

అంతర్హితమై ప్రకాశించుచున్నది. ఆ సత్యము నెరింగి నేను మౌనమునూన నిశ్చయించుకొంటిని.

9) మాటలు ఓటమి జెందిన జెందుగాక; మహత్తరమైన మనము ఎల్లప్పుడు దిగ్విజయమునే గాంచును. సదా జయభేరినే మ్రోయించును. కావున మౌనమే నాకాటపట్టు.

10)మౌనము సర్వ జనాలింగన మొనర్చును. అది యెవ్వరిని అన్యులనుగా భావింపదు. మిమ్ములనందరిని ప్రాక్పశ్చిమ దేశవాసులగు ఈశ్వరుని బిడ్డల నందరిని ప్రేమించుటకు, సేవించుటకు, పూజించుటకు నేనెరింగిన దొడ్డ సాధనము మౌనమే. కావున నాకదియే పరమాశ్రయము.

11)పూర్ణ మౌనము ద్వారానే నేను మిమ్ము గురుతరముగను, గురుతమముగను సేవింపగలను. వేయేల మౌనవ్రత విధానముననే సర్వ ప్రపంచమును నేను ఉత్తమరీతిని సేవింపగలను. కావున మౌనమే నాకు వ్రతమయ్యెను.

12)మౌనమే జీవశక్తిని, చైతన్య శక్తిని ప్రసాదింపగలదు. వ్యక్తుల యొక్క జాతులయొక్క ప్రగతిని నిర్ణయించు మూలశక్తి మౌనమే యగును. కావున మౌనమే నాకు స్వీకారార్హము.

13)ఊరక సిద్ధాంతముల బోధించుటకంటె ఆచరణ శ్రేష్ఠము. మౌనముచే మీకు సహాయ మొనర్చి మౌన మహాత్మ్యమును మీకు ప్రత్యక్షముగ జూపనెంతును. కావున మౌన సాధనమునే నేను చేకొంటిని.

14)మౌనము ఆత్మలను తీర్చిదిద్దును. **(Silence creates souls)** మూలచైతన్యమునందు లయమంది పునః ఆజీవులు జ్ఞానోదయమై ప్రకాశించును. కావున మౌనమే నాకు ఆరాధనీయము.

15)సహస్ర ముఖంబుల, సహస్ర కంఠంబుల, సర్వదిశల వినంబడు ఈశ్వరుని వాక్కుల నేను వినగోరుదును, నిశ్చయముగా మౌనమునందే మాధవుని

మధుర స్వరంబు విననగును. కావున మౌనమునందే నేను ఆసీనుడనైతిని.

16) విలువలో మట్టి బంగారముల కెంత వాసియో అంత వాసి మాటలకును మౌనమునకును గలదు. కావున మౌనమునే నేను ప్రధానముగ నెన్ను కొంటిని.

17) మౌనమే పరిపూర్ణము. ఊహాతీతమైన మహాశాంతియే మౌనము. అహమును మూలమట్టుగ సమయించి 'నిర్వాణము' లేక 'సమాధి' అను అత్యున్నత స్థితిని - పరమేశ్వర ప్రత్యక్షానుభూతిని - పొందించునదే మౌనము. కావున నాకు మౌనమే పరమ సేవ్యము.

18) ఏను 'ఏకమే వాద్వితీయం' అను వాచ్యార్థుడగు ఆత్మను అగుటచే నేను మాట్లాడుట ఎవరితో? దేనినిగూర్చి? కావున మౌనమే నా సహజ నిలయము.

19) అమూల్యమగు మానవజన్మకు గమ్యమును జీవనమును మౌనమేయగుట, నాకదియే అలంబనీయము.

20) పరమేశ్వరుని పిలుపు అనగా మృత్యువార్తరాగానే మౌనమునందే నేను తప్పనిసరిగా ప్రవేశింప వలయును గదా! నిశ్చయమగు ఆ గమ్యమును చేరకముందే అందు కలుగనున్న సుఖానుభూతిని నేను ముందే పొందగోరి మౌనమున ఇప్పుడే ప్రవేశించితిని.

21) జీవస్వరూపుడగు స్వామి గతించెను. ఓంకారుడు సహజ తేజస్సులో నుజ్జీవితుడై వెలియుచుండె. నిశ్చయముగ మానవుడు బాహ్య ప్రపంచ విస్మృతిని బడసి, మౌనమునందు భద్రుడై యుండనేర్చి నంతనే, భగవత్ సాక్షాత్కారము సిద్ధించును. కావున నేను మౌనము నందు సుస్థితుడనైతిని.

ప్రియమైన పాఠకా, నీ వెచ్చట నున్నను, ఎంత తొందర పనిలోనున్నను పావనమైన సూర్యోదయం, సూర్యాస్తమయం సమయములయందు కొన్ని

నిముషములైనను, నా మౌనముతో నీవు గూడ ఏకీభవించి, నిశ్శబ్దమైన దైవవాక్కును, అంతర్వాణిని, నీ జీవితములో గూడ అనుభవించుటకు నాకు తోడ్పడవా!

శాంతి పుత్రా! ప్రియ మిత్రమా ! సర్వనమోవాకములను మౌనమునకు జెందుగాక ! శాంతి నీయెడ ప్రసన్నమగు గాక!

నేను పై నుదహరించబడిన - 21 మహదాశయములతో - ధృడ సంకల్పములతో, ఈ భౌతికోపాదికి జననదివసమైనది 21వ జనవరి 1951 సంవత్సరమున మౌనవ్రతము నారంభించితిని. జననదివసపు తారీకు సంఖ్యతో ఈ మౌన ధర్మసూత్రముల సంఖ్య సరిసమానముగా స్ఫురించుట వింతయైన ఆనందకరమైన సంఘటనము, పరిమితుడైన మానవుడు నిరహంకృతుడై, వినమ్రుడుకాగ, ఆతని యందంతర్హితుడైయున్న అనంతుడైన పరమేశ్వరుడు సుప్రకాశితుడై విజృంభించు నను ఈ సందేశపు సారాంశము.

ప్రవచితవాక్కు లన్నిటికి, ప్రకటిత ప్రపంచములన్నిటికి గుప్తసాక్షియు, సర్వశక్తి సంపన్నుడగు ఆ పరమాత్మ సర్వజన సంస్తుతి పాత్రుడు అగుగాక!

సర్వే జనా స్సుఖినో భవన్తు !

ఓం తత్ సత్ ఓం !